C

## అడివి బాపిరాజు రచనలు - 5



# కోనంగి

సాంఘిక నవల

Blank Page

# అడివి బాపిరాజు రచనలు

## 5

# కోనంగి

• సాంఘిక నవల •

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
4-1-435, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ - 500 001.

*ADIVI BAPI RAJU RACHANALU vol - 5* ♦ **KONANGI** ***(Social Novel)***

ప్రచురణ నెం. : 2350/250

ప్రతులు : 1000

ప్రథమ ముద్రణ : మార్చి, 2010

© కె. బాపిరాజు

**వెల : రూ. 150**

ప్రతులకు : **విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,**
విజ్ఞాన భవన్, అబిడ్స్, హైదరాబాదు - 500 001.
ఫోన్ : 24744580/24735905
**E-mail : visalaandhraph@yahoo.com,**
www.visalandra.vcomnet.co.in

**విశాలాంధ్ర బుక్ హౌస్,**
అబిడ్స్ & సుల్తాన్ బజార్ - హైదరాబాదు, విజయవాడ,
అనంతపురం, విశాఖపట్నం, హన్మకొండ, గుంటూరు,
తిరుపతి, కాకినాడ, కరీంనగర్, ఒంగోలు, శ్రీకాకుళం.

**హెచ్చరిక:** ఈ పుస్తకంలో ఏ భాగాన్ని కూడా పూర్తిగా గానీ, కొంతగానీ కాపీరైట్ హోల్డరు & ప్రచురణకర్తల నుండి ముందుగా రాతమూలకంగా అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా, కాపీరైట్ చట్టరీత్యా నేరం. - **ప్రచురణకర్తలు**

ముద్రణ : **శ్రీ కళాంజలి గ్రాఫిక్స్,** హైదరాబాద్

# అంకితము

## శ్రీ ఆమంచర్ల శేషాచలపతిరావుకు

అమృత మూర్తివి నీవు
ఆంధ్ర నాయక మణివి
హస్త సంస్పర్శనే
ఆరాటములు బాపు
ఘన వైద్యుడవు నాకు
అనుగు మిత్రుడ వీవు

Blank Page

# అడివి బాపిరాజు జీవిత సువర్ణ రేఖలు

అక్టోబరు 8, 1895 : జననం (భీమవరం, ప.గో. జిల్లా)
1903 : ప్రాథమిక విద్య, కొవ్వూరు
జూన్ 5, 1915 : వివాహం, కూర్మిగారి శిష్యత్వం ప్రారంభం
1917 : ఇంటర్
1920 : బి.ఎ., జాతీయ కాంగ్రెస్‌లో సభ్యత్వం
1921 : (సహాయ నిరాకరణోద్యమంలో) అరెస్టు, పుత్ర వియోగం.
1922 : సత్యాగ్రహం, అరెస్టు
1923 : చిత్రకళా విద్యార్థిగా ఆంధ్ర జాతీయ కళాశాలలో ప్రమోదకుమార ఛటోపాధ్యాయ శిష్యత్వం
1924 : "గయా కాంగ్రెస్"లో పాల్గొన్నారు
1931 : బి.ఎల్
1934 : ఆంధ్ర విశ్వకళాపరిషత్ నిర్వహించిన నవలా పోటీలో 'నారాయణరావు' నవలకు శ్రీ విశ్వనాథవారి "వేయి పడగలు"తో పాటు ప్రథమ బహుమతి
1935 : బందరు జాతీయ కళాశాల ప్రిన్సిపాల్ పదవి
1936 : భార్య సుభద్రమ్మ గారికి అనారోగ్యం ప్రథమ పుత్రిక రాధా వసంత గారికి పోలియో
1949 : కుమార్తెలు రాధా వసంత, ప్రేమకుమారి గార్ల వివాహం.
1950 : కనకాభిషేకం; మద్రాసు తెలుగు భాషా సమితి ఆధ్వర్యాన తయారైన తెలుగు విజ్ఞాన సర్వస్వానికి, సాహిత్యం, భాష, కళలు, విద్య మొదలైన విషయాలకు సంబంధించిన సంపుటం తయారు చేసే ఉపసంఘంలో సభ్యత్వం.
1951 : సింహళంలోని సిగిరియా గుహల్లో గల కుడ్య చిత్రాల ప్రతిరూపాల చిత్రణకై పరిశీలన యాత్ర.
సెప్టెంబరు 22, 1952 : మరణం.

**జననం : 8-10-1895 :: మరణం : 22-9-1952**

# అడివి బాపిరాజు సృజనా వైజయంతిక

## నవలలు :

**సాంఘిక :** నారాయణరావు (1934), తుఫాను (1945), కోనంగి (1946), నరుడు (1946), జాజిమల్లి (1951).

**చారిత్రక :** హిమబిందు (1944), గోన గన్నారెడ్డి (1945), అడవి శాంతిశ్రీ (1946), అంశుమతి (1951).

**అముద్రితాలు :** మధురవాణి (పూరణ : దిట్టకవి శ్యామలాదేవి), శిలారథం (అసంపూర్ణం), కైలాసేశ్వరుడు (అసంపూర్ణం).

## కథా సంపుటాలు :

**(వాటిలో కథల సంఖ్య)** అంజలి (6), తరంగిణి (7), తూలికా నృత్యం (3), భోగీర లోయ (6), రాగమాలిక (9), వింధ్యాచలం (4).

**మొత్తం కథలు 41 :** (ఆరు సంపుటాల్లో - 35, లభ్యం అయీ అముద్రితం - 1, అసంపుటీకృతం - 1, అసంపూర్ణం - 1, రేడియో కోసం రాసింది - 1, నారాయణరావు నవలలో పాలేరు చెప్పిన కథ - 1, అలభ్యం (పంజరం అనేది) - 1).

## కవితా సంపుటాలు :

**ప్రచురణ అయినవి :** తొలకరి (1922), గోధూళి (1938), శశికళ (1954)

**ప్రచురణ కానివి :** అంజలి (19), చిగురుటాకులు (21), జ్యోతి (32), బాపు (43), ఆంధ్ర (51), దీపమాల (44), శిల్ప బాల (23), సుషమా చంద్రికలు (63), బాపిరాజు వచనాలు (13), గడ్డిపూల పల్లెము (32), ఇతర గేయాలు (42) జానపద గేయాలు (27), జంగం కథలు (6).

## నాటికలు :

**రేడియో నాటికలు :** భోగీర లోయ, నారాయణరావు, శైలబాల, ఉషాసుందరి, పారిజాతం, నవోదయం, దుక్కిటెద్దులు, ఏరువాక.

**ఏకాంకికలు :** ఆంధ్ర సామ్రాజ్ఞి (1944), కృతి సమర్పణం (1944), బొమ్మలు (1946), గుడ్డిపిల్ల (1954 – మరణానంతర ప్రచురణ).

## వ్యాసాలు :

ముద్రితాలు – తెలుగు (57), ఇంగ్లీషు (3)
అముద్రితాలు – తెలుగు (8), ఇంగ్లీషు (2).

**రేడియో ప్రసంగాలు :** 7
**పత్రికలు, సంపాదకత్వం :** తెలుగు : అభినవాంధ్ర సాహిత్యం (1915 - రాజమండ్రి), మీజాన్ (1944-1947), హైదరాబాదు;
ఇంగ్లీషు : త్రివేణి (మచిలీపట్నం - సబ్ ఎడిటర్)
**అనువాద గ్రంథం :** "నా పడమటి ప్రయాణం"
**సాహిత్య లేఖలు :** సుమారు 50

## చిత్రకళాకేళి :

**చలనచిత్ర "కళాదర్శకత్వం" :** సతీ అనసూయ - ధ్రువ విజయం (1935), మీరాబాయి (1940), పల్నాటి యుద్ధం (1944).

**జలవర్ణ చిత్రాలు** (47), **తైలవర్ణ చిత్రాలు** (2), **రేఖా చిత్రాలు :** విశ్వనాథ సత్యనారాయణ- కిన్నెరసాని పాటలు - **ముఖచిత్రం :** లోపలి చిత్రాలు (4), శృంగార వీథి (1), నండూరి సుబ్బారావు - ఎంకి పాటలు (2), **పత్రికలలో కథలకు :** నాగరాజు (భారతి - జనవరి 1927), అతిథి దేవుడు (భారతి - మే 1927), హిమాలయరశ్మి (భారతి - జనవరి - 1937), నాగలి (భారతి), భోగీర లోయ (భారతి), తూలికానృత్యం (భారతి), **పెన్సిల్ స్కెచ్‌లు :** కడలూరు జైలులో ఉన్నప్పుడు వేసినవి, ఫిదేలు నాయుడుగారి కచ్చేరి, రామప్ప గుడిలోని "నాగినీ నృత్యం" చూసి, సాలార్‌జంగ్ మ్యూజియంలోని "నవాబుల హుక్కా" చూసి (ఇంకా చాలా ఉన్నాయని రాధా వసంత గారు తెలియజేస్తున్నారు).

### బాపిరాజు రచనలు విషయంగా పిహెచ్.డి., ఎమ్.ఫిల్. వ్యాసాలు

డా॥ ధనిరెడ్డి విజయలక్ష్మీదేవి (శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం) 1980, డా॥ వి. తిరుపతయ్య (ఉస్మానియా విశ్వవిద్యాలయం) 1982, డా॥ మన్నవ సత్యనారాయణ (నాగార్జున విశ్వవిద్యాలయం) 1984, డా॥ వి. సిమ్మన్న (ఆంధ్ర యూనివర్సిటీ) 1985, శ్రీ శెట్టి వెంకట నారాయణ (కాకతీయ విశ్వవిద్యాలయం) 1987, శ్రీమతి వి. వనజ (కాకతీయ విశ్వవిద్యాలయం) 1984, శ్రీమతి రమారాణి (కాకతీయ విశ్వవిద్యాలయం) 1986.

### బాపిరాజు సంస్మరణ సంచికలు

1. కులపతి (1954) : సంపాదకత్వం - శ్రీ రావులపర్తి భద్రిరాజు, 2. చుక్కాని (1962) : సంపాదకత్వం - శ్రీ కంచి వాసుదేవరావు, 3. నాదబిందు శశికళ (1985) సంపాదకత్వం - డా॥ దిట్టకవి శ్యామలాదేవి, 4. అడివి బాపిరాజు - శతవార్షిక కళా- సాహిత్య ప్రత్యేక సంచిక (1995), సంపాదకత్వం - భ.రా.గో.

* * *

## మీరు చదివారా!

# అడివి బాపిరాజు గారి రచనలు 7 సంపుటాల్లో...

| | | | |
|---|---|---|---|
| 1. మొదటి సంపుటం | : | నారాయణరావు (సాంఘిక నవల) | రూ. 160 |
| 2. రెండవ సంపుటం | : | హిమబిందు (చారిత్రాత్మక నవల) | |
| 3. మూడవ సంపుటం | : | తుఫాను (సాంఘిక నవల) | |
| 4. నాల్గవ సంపుటం | : | గోన గన్నారెడ్డి (చారిత్రాత్మక నవల) | రూ. 125 |
| 5. అయిదవ సంపుటం | : | కోనంగి (సాంఘిక నవల) | రూ. 150 |
| 6. ఆరవ సంపుటం | : | అడవి శాంతిశ్రీ, అంశుమతి (చారిత్రాత్మక నవలలు) | |
| 7. ఏడవ సంపుటం | : | నరుడు, జాజిమల్లి (సాంఘిక నవలలు) | |

మనవి : అడివి బాపిరాజు గారి – కథా సంపుటాలు : తరంగిణి, తూలికా నృత్యం, భోగీర లోయ, వింధ్యాచలం, **కవితా సంపుటాలు** : అంజలి, చిగురుటాకులు, జ్యోతి, బాపు, ఆంధ్ర, దీపమాల, శిల్పబాల, సుషమా చంద్రికలు, గడ్డిపూల పళ్ళెం, గోధూళి, తొలకరి, శశికళ, జంగం కథలు, జానపద గేయాలు – ఇతర గేయాలు మాకు లభించలేదు. కావున వారి మిత్రులు, అభిమానుల వద్ద వుంటే పంపి సహకరించప్రార్థన.

– ప్రకాశకులు

# కోనంగి

● సాంఘిక నవల ●

## ప్రథమ పథం

# ఉద్యోగ ప్రయత్నం

సర్రున కారువచ్చి ఆగింది. కారులోంచి కోనంగి దిగాడు. దిగీదిగడంతోటే కారు డ్రైవరుకు కుడివైపున ఉన్న అద్దంలో ఎందుకైనా మంచిదని తన్నుచూచుకొంటూ కోటుమడతలు సరిచేసుకొన్నాడు. టై సర్దుకున్నాడు. చేతికర్ర వయ్యారంగా పట్టుకొని ఒకమాటు తల ఇటూ, ఓమాటు తల అటూ తిప్పుకొని, 'దిగ్విజయీభవ!' అని మనస్సులో అనుకొని ఈ విజయదశమికి తనకు విజయం తప్పదనుకొంటూ, జాగ్రత్తగా కుడికాలు జాపి దూరముగా ఉన్న మొదటిమెట్టుపై వేలువైచి పడబోయినంతపని అయి కర్రతో ఆపుకొని, పదిసెకండులు మెట్టుమీదే ఆగి, రెండవదిమెట్టు, మూడవ మెట్టు, నాల్గవ అయిదవ మెట్టులు కుడిపాదం వేస్తూనే ఎక్కి ఆ భవనం ముందర వరండాలో ఆగాడు. ఆగినాడంటే మామూలుగా ఆగినాడా?

ఒక మహారాజు కొమరుడు వేరొక మహారాజు ఇంటికి వచ్చినట్లే! ఆ వచ్చినకారు తనదే అయినట్లు! ఏమో, ఈ సంబంధమే కుదిరితే ఈ కారు తనది ఎందుకు కాకూడదూ?

అదృష్టం పెళ్ళివల్ల పట్టాలి! బంగారపు పాదాలతో పెళ్ళికూతురు పెళ్ళి కొమరుని దగ్గరకు నడచివచ్చిందనుకోండి; అప్పుడు లక్ష్మి నీ దగ్గరకు వచ్చినట్లే కాదటయ్యా! నీ మామగారు వట్టి పాలసముద్రుడా? ఇంగ్లీషు ఆయిపైరు ఆవుపాల సముద్రుడుగాని!

కుదిరితే ధనంవున్న పెళ్ళికూతురే కుదరాలి; అయితే ఐ. సి. ఎస్. ఉద్యోగమే ఆవ్వాలి, అని కోనంగి దృఢనమ్మకం.

ఇంతలో కోనంగిరావుగారి దగ్గరకు ఒక చప్రాసీ పరుగెత్తుకొనివచ్చి, వంగి నమస్కారాలు చేసి లోనికి దయచేయండని అక్కడవున్న ఒక సోఫాపై అధివసింప సంస్కృత భాషలో కోరినంతపని చేశాడు. 'ఆ సోఫాత్తిల్లె అదిగసిప్పుడు సామీ' అని.

ఆ చప్రాసీ ఉత్తర మలబారుజిల్లా మనిషి, యజమాని హెబ్బారు అయ్యంగారు, వచ్చిన కోనంగి తెలుగువాడు. కారుడ్రైవరు తిరునల్వేలి జిల్లా వాడు.

"ఇదర్ వా అప్పా. ఈ సామానుదా తీయ్, క్విక్?" అని డ్రైవరు చప్రాసిని కేక వేసినాడు.

యజమానిగాని, కాబోయే పెళ్ళికూతురుగాని, ఆమె చెలికత్తెలుగాని, ఆయన ప్రాణ స్నేహితులుగాని, మరి ఏ యితర పెద్దమనుష్యులుగాని, కోనంగికి ఆ హాలులో, ఆ గుమ్మాలలో, ఆ గోడలమీద, ఆ మేడ పై కప్పుపై దృశ్యం కాలేదు. ఆఖరికి ప్రత్యక్షమన్నా కాలేదు. కోనంగి భాషలో ఈ రెంటికి తేడా ఉండదని కాలేజీలోనే వాదించేవారు. వెళ్ళగానే

కనబడడం దృశ్యం. వెళ్ళి కనిపెట్టుకొని ఉండగా, ఉండగా కనబడడం ప్రత్యక్షం. "త్యక్షం' అంటే వెళ్ళిన అయిదు నిముషాలకే కనబడడం. 'క్షం ' అంటే చూడడానికి వెడదామని అనుకొంటేనే తన ఇంటికి ఆ పెద్దమనిషి రావడం.

'దరిసెనం' అనే మాటకు చూడటానికి వెళ్ళిన పెద్దమనిషి వీపు మాత్రం కనబడటం!

కోనంగి తాను సలుపవలసిన మర్యాదలు నిర్వర్తిస్తున్నాడు. ఒకటి, హాలు డాబా సరంబీవంక చూచాడు. రెండు, హాలంతా కలియచూచాడు. మూడు, గుమ్మాలవంక చూచాడు. నాలుగు, ఒకసారిలేచి హాలు యావత్తూ కలియతిరిగాడు.

ఇంతట్లో లోననుండి ఒక లావుపాటి సూటు వేసుకొని తలపాగాచుట్టుకొన్న మనిషీ, సన్నగా పొడుగ్గా పోకచెట్టులా ఉండి పంచె, కోటు, తలపాగా, మడతల జరీ సేలంకండువా వేసుకొన్న మనిషీ లోనకు వచ్చారు.

ఇద్దరు పెద్దలు రాగానే కోనంగిరావు నిలుచున్నాడు. వారికి నమస్కారం చేశాడు. తానే వారిద్దరినీ అయా పీఠాలపై కూర్చోండని మర్యాదగా రెండు చేతులూ జోడించి చూపినాడు.

కోనంగి చూపులో, వారిద్దరూ కోనంగి ఇంటికి దయచేసిన ఎవరో ఇద్దరు పెద్దల్ని చూచిన చూపులు.

**లావుపాటి ఆయన:** ఓహెూ మీరు దయచేసినారా! (ఇంగ్లీషులోనే ప్రశ్న తరువాత ఇంగ్లీషే!) ఇవాళ మెయిలు ఆలస్యము కాబోలు! కనిపెట్టుకొని ఉండి భోజనం చేశాను. క్షమించండి. ఆఫీసు టైము.

**సన్నపాటి ఆయన:** వీరేనా భవిష్యత్తు వరుడు? (ఈయనా ఇంగ్లీషు భాషలోనే!) అయితే తమ పేరు?

**కోనంగి:** (ఇంగ్లీషులోనే ) నా పేరు కోనంగేశ్వరరావు. స్నేహితులు కోనంగి అని పిలుస్తారు. కొందరు కోనంగిరావు అంటారు.

**లావు:** వీరు బి.ఏ. మొదటి తరగతిలో ప్యాస్ అయినారు. మంచి ఆస్తిపరులు.

**కోనంగి:** అబ్బెబ్బే, ఆస్థి ఏమీలేదండి.

**సన్న:** మీ మర్యాదమాటల కేమిలెండి! మీ గ్రామం?

**కోనంగి:** మాది బందరు.

**లావు:** అమ్మాయి కాలేజీకి వెళ్ళబోతూ ఉన్నది. ఇప్పుడే వస్తుంది. (ఈయన మాట్లాడినప్పుడల్లా స్నేహితునివైపు, నేను చెప్పేది నిజమేకదూ అన్నట్లుగా చూస్తూ ఉంటాడు. అలా చూసినప్పుడల్లా ఆయన అవునుకదా మరి! అన్నట్లుగా తల ఊపుతాడు.)

ఇంతట్లో ఆ ఇంట్లోనుంచి, నూటయాభై రూపాయల ఖరీదుగల బెనారసు జరీపూవుల నూరోనెంబరు ఆరుగజాల నూలు చీర ధరించి, చిన్నఐరావతం వంటిదిన్నీ, తెల్లని పళ్ళెత్తుగలిగినదిన్నీ బాలిక ఒకతె రెండు జడలతో, ఎత్తుమడమల జోళ్ళతో చక్కా వచ్చింది. ఆమె ఇంగ్లీషు భాషలోనే, "డ్యాడీ, వరుడు వచ్చాడనుకొంటా, ఈయనేనా?" అని ప్రశ్నించింది. ఆ అమ్మాయి పై పళ్ళు నాలుగు బాగా ఎత్తుగా ముప్పదిడిగ్రీలు ముందుకువచ్చి క్రింది పెదవిని కప్పుతూ పై పెదవిని ముక్కుకంటిస్తూ ఉన్నాయి.

**లావు:** అవును సీతా! అవును. ఆయనే భవిష్యత్తు వరుడు. ఈయన ఇక్కడే ఉంటాడు. నువ్వు త్వరగా కాలేజి నుంచి వచ్చి ఈయనతో మాట్లాడుతూ ఉండు. నేనూ మీ మామా ఇద్దరం కలిసివస్తాము.

**అమ్మాయి:** చాలా బాగుంది, డ్యాడీ! నేను కాలేజీకి వెడుతున్నాను. అసలు వెళ్ళకపోదును కాని, క్లాసుకు మొదటిదాన్ని అవడంచేతా, అందరికీ తల్లో నాలికవంటిదాన్ని అవడంచేతా, నేను లేకపోతే తరగతి అంతా చిన్నబోతుంది. డ్యాడీ! ఈ భవిష్యత్తువరుడు బాగానే ఉన్నాడు. నాకు నచ్చితే ఇంగ్లండు తీసుకుపోతానుకూడా! హల్లో! అందరికి వందనాలు. వెడుతున్నా. ఓ నూత్నవరుడుగారూ! మీరు మాఇల్లే మీఇల్లనుకోండి. అన్ని సౌకర్యాలు పనికత్తె రామ్ చూస్తుంది. సెలవు.

ఆ అమ్మాయి గబగబా కారుదగ్గిరకు వెళ్ళిపోయింది. లావుపాటి భవిష్యత్తు వధువు తండ్రీ, సన్నపాటి పెద్దమనిషీ ఇద్దరూ లేచి వంటవాడు, పనిమనిషి, బోయీ మీకు సమస్త సదుపాయాలూ చేస్తారు. త్వరలోనే వస్తాము" అని చెప్పి పోర్చిలో సిద్ధంగావున్న వేరొక కారెక్కి చక్కా పోయారు.

కోనంగి అలా దిగ్భ్రమపడి ఆ చక్కని ఒకటన్ను గులాబిపూవుల ప్రోవులాంటి పెళ్ళికూతురును తలచుకొంటూ, "ఓహెూ! ఏమి అందం!" అని అనుకొన్నాడు. తాను 'హిందూ'లో చూచిన ఎడ్వర్టయిజ్‌మెంటు ప్రకారం "ఈ బాలిక బంగారపు పిచ్చిక! విధవ అయితేనేమి? ధనం మూలుగుతూంది. ఆ అమ్మాయి నడిచిన భూమే బంగారపుముద్ద అవుతుంది. ఆ అమ్మాయి పాదాల్లో, చేతులో, చూపుల్లో పరసువేది ఉంది తప్పకుండా! కాని అందం మాటా? అది దృక్పథాన్నిబట్టి ఉంటుంది" అనుకున్నాడు.

ఆ విషయంలో తన దృక్పథం కొంచెం వ్యతిరేకంగా ఉంటున్న దేమిటో మరి. మనస్సు కొంచెం ముడుచుకుపోయింది. తన ధైర్యం వేసం కాలంలో నీళ్ళులేక ఎండిన వాగులా అయిపోయింది. ఎండగట్టిన కృష్ణ కాలవలా తయారై ఊరుకుంది.

గిరీశం లాభనష్టాలు బేరీజు వేసుకొన్నాడు. అలాటి తెలివితక్కువ పని తాను చేయదలచుకోలేదు. చలంలా ఇన్ని మ్యూజింగులు చేయదలచు కోలేదు. తాను ఒక కానో ఓ రూపాయో ఎగరవేసి చూడ్డం మంచిది. లేదా చీటీలు ఏలాగా ఎగురవేయవచ్చును. లేకపోతే పెళ్ళికూతుర్నే "అవునూ, కాదూ" వేళ్ళు పట్టుకోమంటే?

ఈ ఆలోచనకు నైజాంబోయీ అడ్డంవచ్చి "దొరా! లే స్నానానికి రండ్రీ" అన్నాడు. ఆ బోయే కోనంగిని ఒక గదిలోకి తీసుకువెళ్ళాడు.

## (2)

**ఆ** అమ్మాయి సీతాదేవి సాయంకాలం వచ్చింది. రాగానే "హల్లో! మీ పేరు కోనంగిరావు కాదూ! అయితే కోనంగిరావుజీ, ఇదిగో దుస్తులు మార్చుకొని వస్తున్నాను. మనం ఇద్దరం టీ పుచ్చుకుందాము. నీకు కాఫీ యిష్టమా, టీ ఆ? కొంపదీసి కోకో కాదు గదా? టీ అవగానే న్యూగ్లోబు సినిమా చూడ్డం మన కార్యక్రమం ఆ తర్వాత బీచీ, పది గంటలకు ఇంటికి, పదిన్నరకు భోజనం" అని గబగబ కోకిలలా, చిలకలా, గ్రామఫోనులా, రేడియోలా, సినీమాస్టారులా పలికి, లోనికి పరుగెత్తింది. ఆ వరాలమూట, ఆ వజ్రాలపోగు, ఆ రసగుల్లాల పళ్ళెం "నువ్వూ దుస్తులు మార్చుకో" అంటూ పరుగున పెద్ద మలయమైన గాలివానలా తేలిపోయింది.

అయిదు గంటలకే వచ్చింది. అరగంటసేపు అలంకరించుకొంది. అలంకారం అంతా అయి టీ గదిలో కూర్చుని కోనంగికి కబురు పంపింది.

కోనంగి తాను దుస్తులు మార్చుకుందామనుకున్నాడు. అతనికి ఉన్నదే ఒక కోటు. అదయినా అతని స్నేహితుడు ఎరువు ఇచ్చిన కోటు. షర్టు రెడీమేడ్ షాపులో కొన్నది. లాగు అతనికున్న రెండులాగులలో ఒకటి. ఇంకా ఎల్లా మారుస్తాడు? బ్రిటిషు గవర్నమెంటు ఉద్దేశంఅన్నా మార వచ్చును కాని అతడు దుస్తులు ఎలా మార్చుకోగలడు? చర్చిల్ భారతీయులకు చెప్పినట్లు కోనంగి, కోనంగికి "ఓయి శ్రీయుత కోనంగిరావుగారూ! మిమ్ము అయితే కాబోయే పెళ్ళికూతురుగారు దుస్తులు మార్చుకోవయ్యా అంది. మీరు దుస్తులు మారుస్తారు. మార్చే ప్రయత్నంలోనే ఉన్నారు. మీ దారిద్ర్యానికీ, మీ ఆశయాలకూ, మీ మైనారిటీ అయిన ధనానికి సామరస్యం కుదిరిన మర్నాడు మీకు దుస్తుల బిల్లు మా పార్లమెంటులో తీర్మానించడానికి ఏమీ అభ్యంతరంలేదు" అని సమాధానము చెప్పేసి ఊరుకున్నాడు. ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు ఏమీ ప్రచురించడానికి వీల్లేదనిన్నీ నిర్ధారణ చేశాడు.

మొగం కడుక్కుని, తువాలాతో తుడుచుకొని, కోనంగిరావు కోటు తొడుక్కొని ముస్తాబై, గదిలోకి వెళ్ళాడు. అక్కడ సీతాదేవి అందాలన్నీ బస్తాలతో ఏరి కుర్చీమీద పెట్టినట్లు కూచుని ఉంది.

తన పెద్ద కళ్ళెత్తి "నే నందంగా లేనా?" అని ప్రశ్న వేసింది.

"నువ్వు అందానికే అచ్చుతప్పులు దిద్దేటంత అందంగా ఉన్నావు."

"నువ్వు కోటు మార్చుకోలేదేమి?"

"మార్చుకొన్నా! అంటే తిరిగి మార్చాను. అంటే మార్చినంతపని చేశాను. ఉన్నది ఒక్కకోటే అవడంచేత, ఒకమాటు విప్పి తొడగడం చేతనే, మార్చినట్లు! సబ్ కలెక్టరును మార్చమని ప్రజలు ప్రభుతానికి అర్జీ పెట్టితే, అతన్ని ఆ జిల్లాకే కలెక్టరుగావేస్తే ఎంతో బాగా మార్చినట్లే గదా!"

"నువ్వు చెప్పింది నిజమే కోనంగిరావ్!"

ఇద్దరూ టీ తాగారు. బయలుదేరి వెళ్ళి కారెక్కి సినిమాకు వెళ్ళారు.

అంతకుముందే సీతాదేవి మూడు రూపాయల టిక్కెట్లు రెండు తెప్పించి ఉంచింది. "నువ్వు నా అతిథివి కోనంగిరావూ!" అని ఆమె అంది.

"కాకపోయినా మనపర్సు కాళీగా, సీతాదేవీ!"

"అన్నీ గమ్మత్తుమాటలే నీవి!"

"నిజం చెబుతున్నాను."

"నేను నమ్మను."

"నువ్వు దగ్గిరుంటే నాకూ నమ్మకంలేదు."

"నువ్వు చాలా ధనవంతుడవని మా డ్యాడీ చెప్పాడు"

"మీ తండ్రిగారు నన్ను చూచి అనుకున్నారు. అయితే ఒక విధంగా నేను లక్షాధికారినే. నా అందం ఖరీదు ఒక లక్షాయిరువది అయిదువేల మూడువందల రెండు రూపాయిలుంటుంది. నా చదువు డెబ్బది ఎనిమిదివేల తొమ్మిది వందల పది రూపాయలు ఖరీదు ఉంటుంది. నా తెలివితేటల ఖరీదు రెండు లక్షలకు తక్కువకాదు. అయితే నా ఆదృష్టం తీసివేతే కాబట్టి ప్రస్తుతం నిల్వ ఏమీలేని బీదవాళ్ళమే!"

"ధనం కలవాళ్ళుమాత్రం కానీ, పెద్ద ఉద్యోగులు మాత్రం కానీ మాకు దరఖాస్తులు పెట్టవలసిందని మా తండ్రిగారు హిందూలో ప్రచురించారుగా?"

"సీతాదేవీ! ఈ సినిమా చూచి మనం సముద్రం ఒడ్డుకు వెడతామే, అక్కడ మాట్లాడుకుందాం. నా కథ ఈ సినిమాకథతో కలిస్తే, మీకు సినిమా నాయకుడు కోనంగిగానూ, కోనంగి సినిమా నాయకుడుగానూ కనబడవచ్చును. ఏవంటావు?"

"అద్భుతం అంటాను! దీపాలు ఆరగానే నిన్ను ముద్దుపెట్టుకుంటాను. వెంటనే నువ్వు నన్ను ముద్దు పెట్టుకో! ఈ ముద్దులు పెట్టుకోవడం ప్రేమచేతకాదు, లేదూ, ఇంకో దురుద్దేశం చేతనూ కాదు. నువ్వు ఏ రకం రుచిగా ఉంటావో చూడడం, నా పరీక్షలలో ఒకటి!"

"ఆ పరీక్ష లెన్ని ఏమిటి?"

"మనుష్యుని రూపురేఖా విలాసము ఒకటి. దానిని పరీక్ష చేసేవారు మా మామయ్య. రెండవ వరీక్ష: ధనమూ, ఉద్యోగమూ: అది మాతండ్రి గారు. మూడవ పరీక్ష తెలివితేటలు: ఆ పరీక్షచేసేది మా గుమాస్తా."

"మీ గుమాస్తే! ఎప్పుడా పరీక్ష? పరీక్షకు అచ్చుపత్రం యిస్తారా? లేక పలకా బలపమా?"

"మా గుమాస్తా ఎప్పుడు పరీక్ష చేస్తాడో నేను చెప్పకూడదు. ఎల్లా చేస్తాడో ఏమో నాకే తెలియదు?"

సీతాదేవి ధరించిన చీరా, జంపరూ, అయిదారువందల రూపాయల ఖరీదు ఉండి ఉండవచ్చును. ఆమె సువాసన ద్రవ్యాలతో ఘుమఘుమలాడి పోతోంది. "ఆమె ముందర నేను వట్టి బంట్రోతులా కనబడి ఊరు కొన్నాను" అని కోనంగి తలపోశాడు.

సినిమా ప్రారంభమయి దీపాలన్నీ ఆరిపోయి చీకటి కమ్మింది. ఆ ఘూర్ఘాకుక్రీల లాంటి పళ్ళ సీతాదేవి ముద్దు పెట్టుకుంటుంది కాబోలు భగవంతుడా! ఇక తన పెదవులు ఏ జనరలు ఆస్పత్రిలోనో చేరి బాగు చేయించుకోవాలి కాబోలు అని అనుకుంటూ, గుండె దడదడమంటూ గుప్పిళ్ళు బిగపెట్టి కూర్చున్న కోనంగిని మెడ ఒకచేత్తో కౌగలించుకొని, రెండువ చేతితో అతని తల వంచి ఘట్టిగా సినిమా షాట్‌లా ముద్దుపెట్టుకుంది సీతాదేవి.

ఆమె కోర్కె ప్రకారం కోనంగి ఆమె పెదవులు రెండూ విడివిడిగా వెతుక్కుని కష్టపడి ముద్దు పెట్టుకున్నాడు. వెంటనే ఆ బాలిక నూరురూపాయలు ఖరీదుచేసే చేతిసంచి తెరచి అందులోంచి చేతిరుమాలు తీసి, తన పెదవులద్దుకొంది.

పెదవులు తడుముకొని గాయాలు లేకపోవడం గ్రహించి తిరుపతి వెంకటేశ్వరునికి మొక్కుకున్నాడు కోనంగి.

ఇద్దరూ సినిమా అవగానే బీచికి వెళ్ళినారు. కోనంగి ఏవో మాట్లాడాడు. పాటలు పాడినాడు.

రేపటి పరీక్ష ఏ విధంగా ఉంటుందో అని ఆలోచిస్తూ ఆమెతోపాటు వారింటికి చేరినాడు కోనంగిరావు.

## (3)

వారి గుమాస్తా పగలు మూడు గంటలకు వచ్చాడు.

"మీరుదానే కోనంగిరావా?"

"ఆమ!"

."మీరుదా ఏ మాత్రం తెలివైనవారు దా?"

"మీరు దా గుమాస్తాలుదానే?"

"ఆమ!"

"మీకుదా ఎన్ని సేర్లు మెదడుదా ఉందిదా?"

"సామీ! వేళాకోళంకాదు, మీరు మీ దేశం తెలుగులోనే మాట్లాడ వచ్చుదా."

"మరిగంటే ఏయండి, ఏటి తెగుళ్ళు నీకు వచ్చిపోతాది బాబు?"

"సామీ! అదేమి తెలుగుదేశం?"

"గట్లా సెప్పు! శమా? ఆండ్ల మతలబు ఏంది!"

"సామీ! మీకు పట్టిన తెలుగులోనే మాట్లాడుండా!"

"ఇదేమయ్యా, తెలుగుదేశం తెలుగులు రెండు మాట్లాడుతేనే అర్థం కాక తన్నుకున్నావే?"

"నాను ఇక్కడివాణ్ణిదా, ఆ తెలుగులు ఎట్లు తెలుస్తవి సామీ?"

"మీరు బ్రాహ్మణవాండ్లుదానే?"

"అవును దా!"

"నేనుదా, అడిగేదిదా, మీరుదా, నన్నుదా, ఎట్లాదా. పరీక్షదా చేస్తురుదా? అదిదా!"

"అన్నిటికీ దా ఉండదు సామీ?"

"మా దేశంలో చూస్తివా? పిల్లకాయలు, దా బాష మాట్టాడుదురు. నీదా కూదా, ఎదాన్నిదా, ఏందాడ్లుదా? అంటే నీకు ఎన్ని ఏండ్లు? అన్న మాట. తెలుసునా?"

గుమాస్తా వెళ్ళిపోయాడు హడలి బేజారై.

ఇదివరకే బీచిదగ్గర కోనంగి తన చరిత్ర అంతా సీతాదేవికి చెప్పాడు. తాను ఒక బ్రాహ్మణ వితంతువు కొమరుడు. లా ప్రకారం తనకు తండ్రి లేడు. తనతల్లి దిక్కులేనిదయినది, ఆమె భర్తపోగానే.

"అవిడ తిండికోసం, దిక్కుకోసం ఒక బ్రాహ్మణ ఉద్యోగి దగ్గిర వంటలక్కగా చేరింది. సీతాదేవీ! ఆ ఉద్యోగి కొంచెం అందంగా యవ్వనంలోవున్న మా తల్లి పైన కన్ను వేశాడు."

"రామా రామా! అలాంటి జంతువులు వుంటారు?"

"ఆయన్ని ఏమీ అనకు సీతాదేవీ, ఆయన లా ప్రకారం భార్య అందంలో కొంచెం శూర్పణఖకు దగ్గిర చుట్టం అనుకుంటాను. కాని వట్టి తెలివి తక్కువ సన్యాసి! లేకపోతే పరమాద్భుతమైన అందం భర్తను నాగస్వరం పాముని ఆపినట్టూ, మీఠాయిపొట్లం కుక్కని ఆపినట్లూ ఆపుతుందనే అవిడ ఉద్దేశం!"

"అయితే ఆ ఉద్యోగి పామువంటి రాస్కెల్ అన్నమాటేగా?"

"ఎంతైనా వాస్తవికతా దృష్టిప్రకారం మాత్రం మా తండ్రేగా? అతి వాస్తవికతా దృష్టిప్రకారం, మా అమ్మగారి యవ్వనమే కారణం."

అతి వాస్తవికత అంటే సర్ రియలిజం, అనేనా?"

"సర్ రియలిజమో, దివాన్ బహదూర్ రియలిజమో, నా బ్రతుకుకు విభావాను భావాలు అయ్యారు, వారిద్దరూ."

"విభావానుభావాలా?"

"అదంతా కావ్యవిమర్శ."

"ఏ కావ్యం?"

"నా బతుకు కావ్యం! సరే, మా తల్లి నిజముగా వితంతువుకాదు. విధవ మాత్రమే! అందుచేత మా రియలిస్టికు తండ్రి, మాసర్ రియలిస్టిక్ తల్లిని మంచి చీరలూ, రెండు మూడు నగలూ అవీ ఇచ్చి కరిగించి వేశాడు"

"కరిగించటం ఏమిటి?"

"అది భావ కవిత్వంలే! హృదయం కరిగించాడనుకో. ఇంతకూ మన జన్మ ప్రారంభం అయింది. మా అమ్మ భయపడి అప్పుడు సిగ్గుచేత చచ్చిపోయిందట. మా తండ్రి ఆమెను మద్రాసు చేర్పించాడు. ఈ మదరాసులో నేను ఉద్భవించాను సీతాదేవీ!"

"అట్లాగా! ఈ మద్రాసేనా నీ జన్మస్థలం!"

"మా అమ్మ మాస్వగ్రామమైన కాకినాడ వదలి నన్ను పెంచుతూ బందరులో మకాం పెట్టింది. మా తండ్రి బ్రతికి ఉన్నన్నాళ్ళూ మాజీవితం ధనవంతుల జీవితం. నేను అల్లారుముద్దుగా పెరిగాను. మాతండ్రి నెలకు నూరు రూపాయలు పంపేవాడు. మా అమ్మ అందులో ఇరవై రూపాయలు దాచేది."

"అదీ మంచిదే!"

"మా తండ్రి బందరులో మాకో చిన్నయిల్లు కొని ఇచ్చాడు. నా విషయంలోనే మాఅమ్మకు జరిగిన అనుభవంవల్ల నేను పుట్టిన కొన్నాళ్ళకు జుట్టు తీయించుకుంది. మా అమ్మ అసలు కొంచెం ధర్మపరాయణురాలు. కర్మ చాలా చెడ్డదనుకుంటాను. కర్మ ఎవరినన్నా ఆవహించిందా డొక్క చీలుస్తుంది. అందులో పూర్వకర్మ అయితే, అది 124 ఎ. నిబంధనే!"

"మీ అమ్మ జుట్టు తీయించకుండా వుండవలసింది."

"జుట్టు తీయించుకోక?"

"మీ తండ్రినే పెళ్ళిచేసుకోవలసింది."

"అక్కడే ఆ కర్మ అనే పదార్థం దెయ్యమై మా అమ్మను పట్టుకుంది. దెయ్యమేమిటి, లంచగొండి పోలీసు ఇనస్పెక్టరులా పట్టుకుంది. తన కర్మవల్ల తాను నరకకూపంలో పడిపోయిందట. ఆ తప్పు, వెధవ పెళ్ళి అనే మహా భయంకరమైన తప్పుచేసి దిద్దదలుచు కోలేదట. అంచేత మా తండ్రి తన్ను రహస్యంగాగాని, బహిరంగంగాగాని పెళ్ళి చేసుకుంటానని ఎన్ని కోరినా, తన అస్థికి కాబోయే బిడ్డ అధికారి అవుతాడని చెప్పినా మా అమ్మ ససేమిరా అంది. మరి నన్ను పెంచడమే తనకు శిక్షట."

"ఎంత తెలివితక్కువ పని?"

"మా తండ్రి వీలయినప్పుడల్లా బందరువచ్చి నన్ను చూచి వెళ్ళేవాడు. ఎవరో చుట్టం అనుకునేవాణ్ణి. ఓ రోజున మాకిద్దరకూ ఏమీ చెప్పకుండా మా తండ్రి గుండె జబ్బువల్ల స్వర్గం వెళ్ళి ఊరుకున్నాడు. ప్రవరాఖ్యుడికి కాలి పసరు దొరికినట్లు మా తండ్రి కేమన్నా దొరికిందేమో? స్వర్గం వెళ్ళాడు. అక్కడ అతనికి ఏ అగ్నిదేవుడూ సహాయం చేయలేదు. ఇక్కడ మాత్రం అతని దేహానికి అగ్ని సహాయం చేశాడు."

"ప్రవరాఖ్యు డెవరు?"

"అసలుయిన ఆంధ్రుడు! కోటి రూపాయల మూట ఎదురుగండా వస్తే తన్నేసిన మూర్ఖుడు."

"ఆంధ్రులను అట్టే అనకు. నా కోసం పెళ్ళి దరఖాస్తులు పెట్టిన వారిలో నూటికి ఎనభైపాళ్ళు వాళ్ళే!"

"అయితే వాళ్ళు ప్రవరాఖ్యులు కారు. వట్టి చలం లు అయి ఉండాలి."

"ఎవడా చలం?"

"జాగ్రత్త. అతనికి దూరంగా ఉండు. నీమీద ఇన్ని మ్యూజింగులు రాసి పారేస్తాడు. ఇంతకూ నా తండ్రి పోగానే నా చదువు తక్షణం ఆగలేదు. మా అమ్మ దాచుకొన్న డబ్బూ, అవిడకు మా తండ్రి ఇచ్చిన నగలూ చాలా కాలం వచ్చాయి. ఇంటరువరకూ నాకు ఇబ్బందిలేకపోయింది, బి.ఏ. చదువు యమయాతనే అయింది."

"పాపం!"

"ఏం లాభం? కులంలేక, దిక్కులేక, చుట్టాలులేక, చందాలు, విద్యార్థి వేతనాలతో ఎలా ఆ రెండేళ్ళు పూర్తి చేశానో సీతాదేవీ! ఆ తర్వాత ఇప్పటికీ బి.ఏ. పట్టా పొందిన ఏడాది నుంచి ఉద్యోగానికి తిరుగుతున్నా! అంతలో మీ తండ్రీగారు 'కావాలి వరుడు, బ్రాహ్మణుడు చాలు. ఎవరైనా బి.ఏ. పై చదువువాడు, పెద్ద ఉద్యోగి, ఇరవై అయిదేళ్ళు మించనివాడు. ధనం కలవాడు చాలు. వధువు పంతొమ్మిదేళ్ళ అందమయిన బాలిక. బి.ఏ. ఆనర్సు మొదటి తరగతి. ఏభైవేల రూపాయల ఆస్తికలది" అన్నది చూచి, వెంటనే ఫొటోతో దరఖాస్తు పెట్టాను. ఇది నా చరిత్ర. నాకో చిన్నయిల్లు తప్ప ఏమీ ఆస్తిలేదు, సీతాదేవీ."

"లాభంలేదు కోనంగిరావూ! ఎంచేతనంటే నన్ను ఎవరైనా ప్రేమించి నే నాతన్ని ప్రేమించి ఉంటే, నా తలిదండ్రుల ఇష్టంతో నాకు అవసరంలేదు. నేను నన్ను, నేను నిన్నూ పరీక్షగా ఇందాకటి ముద్దులలో ప్రేమిస్తున్నానా లేదా అని చూచాను. నాకు ఎక్కడా మన్మథ బాణాలు తగల లేదు. నిన్ను చూస్తే జాలిపుట్తోంది. అయినా లాభంలేదు."

అతని హృదయం తేలికైపోయింది. ఆమె చేసుకుంటాననంటే, తాను మర్యాదకు, ధర్మానికి, గౌరవానికి, ధనానికి ఒప్పుకు తీరవలసి రావచ్చును! అమ్మయ్య! ఆమెతో ఇల్లు చేరాడు. ఇప్పుడే గుమాస్తా పరీక్ష ఎందుకు? సీతాదేవి తన నిశ్చయం ఇంకా ప్రెస్ కాన్ఫరెన్సులో ప్రచురించలేదు కాబోలు.

## ④

**సీ**తాదేవి స్వయంగా కారు నడుపుకుంటూ తన్ను రైలుదగ్గిర దిగబెట్టింది. రెండవ తరగతి టిక్కెట్టు కొని ఇచ్చి రైలులో కూర్చోబెట్టి సెలవు పుచ్చుకొని మైలాపురంలో ఉన్న తనింటికి నడిచింది నడిచిందంటే నడిచివెళ్ళిందనికాదు, కారు నడుపుకుంటూ వెళ్ళిందని.

ఆమె వెళ్ళింది. వెంటనే కోనంగి బండిలోంచి దిగాడు. సామాను పట్టుకున్నాడు- సామానంటే తోలుపెట్టె, హోల్డాలున్నూ. చరచరా టిక్కట్లమ్మే స్థలందగ్గిరకు వచ్చి తనకు రైల్లో ఉండగా అర్జెంటుపని ఒకటి జ్ఞాపకం వచ్చిందని చెప్తూతూ అణాడబ్బులూ చెల్లించి, తక్కిన టిక్కెట్టు డబ్బు తీసుకున్నాడు.

ఇక్కడ నుంచి, హస్తసాముద్రికం చూచి ఒక స్నేహితుడు చెప్పిన తన భవిష్యత్తు, నిజం అవడం ప్రారంభించింది. "ఒరే కోనంగీ, నీ శనిరేఖ శుక్ర స్థానంలోంచి బయలు దేరడంచేతనూ, నీ బుధస్థానంలో స్త్రీ రేఖపొడుగ్గా ప్రవహించి శనిస్థానంవరకూ వెళ్ళడముచేతనూ నీహృదయరేఖలో ధనతారలు మూడు ఉండడముచేతనూ, నీకు స్త్రీ

ధనలాభం ఎక్కువ. ఉద్యోగం స్త్రీ వల్లనే కలుగుతుంది. స్త్రీయే నీకు ఉద్యోగం" అని చెప్పడంవల్లనే కదా తాను వరుడు కావాలి, అన్న ప్రచురణలు చూస్తో ఉండేవాడు.

ఇంతకూ, కోనంగి మొదటి సంపాదన స్త్రీవల్లనే వచ్చింది. నువ్వు పెళ్ళికొడుకుగా, నాకు పనికిరావు అని నిర్మోహమాటంగా తియ్యగా చెప్పి సీతాదేవి, కాస్త కోనంగి అంటే కరుణ జనించి తనే అతనికి బందరుకు ఇరవైరెండు రూపాయలపై చిల్లరపెట్టి రెండవ తరగతి టిక్కెట్టుకొని ఇచ్చింది.

తోలుపెట్టి ఒక స్నేహితునిది, హోల్డాలు ఇంకో స్నేహితునిది, దుప్పటి ఇంకోరిది. కోటు ఒక ప్రాణస్నేహితునిది. మదరాసు ప్రయాణానికి మరో ముఖ్య ప్రాణస్నేహితుని దగ్గర పదంటే పదిరూపాయలే బదులు పుచ్చుకు బయలుదేరాడు. బందరుబండిలో టిక్కట్టుకొనే వ్యవధి చాలాలేదు. రైలు కదులుతూ ఉండగా ఎదురుగుండాఉన్న రెండవతరగతిలో ఎక్కి బెజవాడ చేరుకున్నాడు.

బెడవాడలో మెయిలుకు పద్దెనిమిది రూకలుపెట్టి రెండవ తరగతి కొనాలి. యుద్ధంరోజులు: రెండవతరగతి టిక్కెట్టు కొనేందుకు తన దగ్గిర డబ్బులేదు.

అసలు రెండవ తరగతి విషయం ఏలా వచ్చిందీ అంటే "కావాలి వరుడు" అని 'హిందూ' లో ప్రచురించిన వధువు తండ్రి బాక్సు నెంబరు 134 'హిందూ' గారికీ తనకూ జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలలో వధువు తండ్రి "మీరు రెండవతరగతిలో వస్తున్నారు కనుక అక్కడకు మాడ్రైవరు వచ్చి మిమ్మును గూర్చి వాకబు చేస్తాడు. మా కారు నెంబరు ఎం. సి. ఏ. 3004, కారు చెవ్రలెట్, డ్రైవరు పేరు మురుగేశం" అని వ్రాశాడు.

టిక్కెట్టు లేకుండా సెకండుక్లాసులో ప్రయాణం చేయడం వట్టి దురన్యాయం తాను అబద్ధం ఆడదలచుకోలేదు, అయితే "ఆశ్వద్ధామా హతఃకుంజరః" అని ధర్మరాజుగారన్న చిన్న తెల్ల అబద్ధం "వారిజాక్షులందు, వైవాహికములందు" ఆడవచ్చునని శుక్రుడు అన్నాడు.

థర్డుక్లాసు కొన్నాడు. మెయిలు వచ్చింది. గబగబ సామాను సెకండు క్లాసులో ఎక్కించాడు. తాను మాత్రం మూడవ తరగతిలోనే, యమయాతనపడి ప్రయాణం సాగించాడు. బేసిన్‌బ్రిడ్జి దగ్గిర టిక్కెట్లు వసూలు చేశారు. బయలుదేరబోయే ముందు మాత్రం సెకండుక్లాసులో ఎక్కికూర్చున్నాడు. మదరాసులో సెకండు క్లాసులోనే ఉన్నాడు. మురుగేశం వచ్చి కోణంగిరావుగారూ అని పిలిచే సరికి ఎవరన్నా అడిగితే సెకండు క్లాసులోనే వచ్చాను అని పైకి అని బేసిన్ బ్రిడ్జినుంచి మదరాసుకు అని లోపల అనవచ్చును.

ఇక ఇప్పుడు అతని దగ్గిర ఉన్న ఆస్తి ధనం ఇరవై ఆయిదు రూపాయల పై చిల్లర.

తానే సామాను పట్టుకు ఈవలికి వచ్చాడు. ట్రిప్లికేన్‌బస్సు ఎక్కాడు. బస్సుపై క్రాఫ్టులో దిగినాడు. ఒక రిక్షాకు అణాడబ్బులిచ్చి నల్లతంబిలో ఉన్న నెల్లూరు ఆంధ్రలాడ్జికి చేరినాడు. అక్కడ గదులు కాళీలు లేవు. ఉన్న గదులే మూడు. కోనంగి దిగాలు పడిన మోము చూచి హోటలు యజమాని కేశవప్ప మెత్తపడి "మా సామాను గదిలో మీ సామాను పెట్టించండి. మీరు వరండాలో పండుకొనండి. ఎల్లుండి ఒకగది కాళీ అవుతుంది, స్వామీ!" అన్నాడు.

"ఓ అంతకన్నానా!" అన్నాడు ఉప్పొంగిపోతూ కోనంగి.

ఆ రాత్రి అతను సీతాదేవి ఇంటిలో భోజనంచేసే, రైలుకు బయలుదేరాడు.

గూడపంచెకట్టి, బనీనుతో కోనంగి వరండాలో పడుకుని చంటిపిల్లవాడిలా నిద్రపోయాడు. మరునాడు స్నానాదికాలు కానిచ్చి, భోజనంచేసి ముస్తాబై రౌండుతానా దగ్గిర దిగాడు. (అది ఇప్పుడు లేదు. పేరు మాత్రం మిగిలింది.)

అక్కడ నుంచి ఉద్యోగానికి ప్రయత్నం ప్రారంభించాడు కోనంగి. స్త్రీవల్ల ధనలాభం ఏమిటి? తనకు ఉద్యోగం ఎలా వస్తుంది? అని అనుకున్నాడు. ఏదో వెఱ్ఱివాడు తన స్నేహితుడు 'చెయిరో' బెర్గసన్' వగైరా పుస్తకాలు చదివి, చేతికి ఇంత తారుపూసి, ఓ కాయితం పాడుచేసి, మూడు గంటలు తబ్బిబ్బై నాలుగుముక్కలు చెప్తాడు. అయినా ఎన్ని సరి అవుతున్నాయి? ఏ శాస్త్రంలో ఏముందో! దేవతలు నడవడానికి భయపడే ప్రదేశాలలో తానా నాట్యం ఆడడం!

"ఏం ఉద్యోగం?... యుద్ధంలో చేరరాదూ?" అని ప్రతి కంపెనీ మేనేజరూ అనడమే. చీకటి బజారులలో లక్షలు లాభాలుకొట్టూ తనొక్కడికి ఉద్యోగం ఇవ్వలేరు కాబోలు?

ఒకచోట మాత్రం అతనితో ఒకాయన కొంచెం శాంతంగా మాట్లాడాడు.

"మీ దేవూరండి?"

"బందరండి!"

"ఎంతవరకు చదివారు."

"బి.ఏ. మొదటి తరగతిలో నెగ్గాను"

"సంగీతం పాడగలరా?"

"సైగలంత బాగా పాడలేనండి. మాష్టర్ క్రిష్టకు ఒక్క శ్రుతి తక్కువగా ఉంటాను. పంకజమల్లికూ నేనూ బావమరదులులా ఉంటాం సంగీతములో!"

"కాస్త పాడండి?"

"ఎందుకండి?"

"మాకో సినిమా కంపెనీ ఉంది. హరిశ్చంద్ర తీయదలచుకున్నాం. అందులో లోహితాస్యుడు కావాలి."

"నేనా లోహితాస్యుణ్ణి!"

"ఎందుకు కాకూడదు? నాగయ్యగారు ఇరవైఏళ్ళ బాలా కుమారుడు కావటంలేదా? అయనకు ముప్పదిఅయిదుపైన వుంటాయి. పదిహేను ఏళ్ళ తేడాఉన్నా భయం లేదన్నమాటేగా?"

"అవునండి. దేవికారాణికి ముప్పదిఏళ్ళు. పన్నెండేళ్ళ బిడ్డగా దుర్గలో వేషం వేసింది. పద్దెనిమిదేళ్ళ తేడా ఉంది. నేను అయిదేళ్ళ బిడ్డగాకాని రెండేళ్ళ శిశువుగా గాని వేషం వెయ్యవచ్చును!"

"అయితే పాడండి."

"ఏం పాట?"

"పియా మిలనకో జానా."

"మీ బొమ్మ ఎందులో తీస్తారు?"

"అరవంలో."

"నేను తెలుగువాణ్ణే?"

"కన్నాంబ, నాగయ్య తెలుగువాళ్ళు కారూ? జయమ్మ కన్నడిగమ్మ కాదూ?"

"హిందీపాట ఎందుకు?"

"అన్ని భాషలూ కలిసిపోతున్నాయి కాదటయ్యా!"

పాడాను, పియా మిలనకోజానా. సంగీతంలో నేనేమి త్యాగరాజ భాగవతారుకు తీసిపోతానా? ఆయన "అద్భుతం" అన్నాడు.

తక్షణమే తాను నాకు ఇంత కాఫీ వగైరాదులు ఇప్పించి, వెంటబెట్టుకొని త్యాగరాజనగరు తీసుకుపోయాడు.

అక్కడ నన్ను కొలిచారు. కోటు, చొక్కా విప్పించి చూచారు. ఫొటోతీశారు. పాడించారు. ఆడించారు.

చివరకు రోజుకు రూపాయి చొప్పున 'ఎక్‌స్ట్రా' ఉద్యోగం ఇస్తామన్నారు.

## 5

సినిమా కంపెనీ నుంచి నడిచి నడిచి, ఆళ్వారుపేట టర్నింగ్ దగ్గరకు వచ్చేసరికి కోనంగికి కొంచెం మానసికమైన అలసట పట్టుకుంది. తనకేమిటి మానసికమైన అలసటేమిటి? అక్కడ పదినిముషాలు నిలుచుండి, ఎందుకు తనకు కొంచెం ఏదోగా అయినట్లు కనబడాలి? అని విచారణ ప్రారంభించాడు.

సీతాదేవికి ఎలాంటి భర్త వస్తాడో! వట్టి వెఱ్ఱిబాగులపిల్ల. ఆబాలికను ఏ అసాధ్యుడో టోపీవేసి, ఆమె ఆస్తికాస్తా తనపేర రాయించుకొని, ఆమెకు ఉద్వాసన చెప్పిగాని: ఆమెను మాయచేసి కళ్ళకు గంతలుకట్టో లేక బ్లాకు అవుటు చేసో ఇంకో వన్నెల విసనకర్రనో, తళుకులతారనో, కులుకు మిఠారినో, హృదయంలో రహస్యంగా దాచుకునిగాని, అన్యాయం చేస్తే పాపం!

ఇంతకూ ఆమెగొడవ తన కెందుకు? తాను ఆమెను అన్యాయం చేయదలచుకోలేదు. లేకపోతే, భగవంతుడు మగపురుగులకందరికీ ప్రసాదించిన శృంగార సంబంధపు విప్రవినోది సంచిలోనుంచి తాను రెండు మాయ మంత్రాలు ప్రయోగిస్తే? ఏభైవేల ఆస్తీ, రివెన్యూబోర్డు మెంబరు మామా, తెల్ల బెజవాడ జామపండులాంటి పెళ్ళికూతురూ దక్కిపోవునే! పళ్ళెత్తయితే కొంపలు మునగవుకదా! నవీనమైన ఎత్తుమేడలు నాలుగు ఎకాఎకిని వచ్చివుండును.

ఇలా నిర్ధారణ చేసికొని, కోనంగి ఆళ్వారుపేట మలుపు ముందునుంచి ఆగే స్థలాలనుంచే

*"ఒక కాలు ఎత్తీ*
*ఒక కాలు మోసీ*
*ఎత్తుతు దింపుతు*
*సత్తువ తెలుపుతు*
*నడుస్తు నడుస్తు*
*అడుగులు వేస్తూ*
*ఉద్యోగానికి వెదకేనోయ్*
*గద్యం కాదిది పాటేనోయ్!"*

అని పాడుకుంటూ నడిచాడు, నడిచాడు. రెండు బస్సుస్టాండు లయ్యాయి: ఎక్కడా బస్సు దొరకలేదు. ప్రతిబస్సు ఆగేస్థలం దగ్గిరా పదిహేను నిముషాలకు తక్కువ కాకుండా నిలిచాడు, కోనంగి. బస్సు రాకపోవడం, అతడు నడుద్దాము, రెండు అణాల డబ్బులు మిగుల్తాయి అని బయలుదేరడం, దారిలో ఈతన్ని ఓ బస్సు దాటిపోవడం జరుగుతూ వచ్చింది. చివరకు ఈ మూడవస్థలం దగ్గిర, అంటే లజ్‌లో, మొదటిదాని దగ్గర ఆగిపోయినాడు.

ఇక్కడైనా తాను బస్సుతో దెబ్బలాడి విజయం పొందాలి. ఈలా ఈ యుద్ధం రోజుల్లో ఈ 1939 సంవత్సరంలో ఒక నవయువకుణ్ణి – బస్సులు అన్యాయం చేయడం తగనిపని అనుకుంటూ అక్కడ ఉన్న ఒక పెద్ద బంగాళా ముందు ఉన్న గేటుకుముందు అలంకారానికి కట్టిన ఏనుగుపైన అధివసించి, నేను ఇంద్రుణ్ణి కావచ్చు, పట్టపుటేనుగ ఎక్కి ఊరేగే మహారాజును కావచ్చు, టార్జాన్‌ను కావచ్చు, లేదా వట్టి మావటివాణ్ణి కావచ్చును, అనుకుంటూ ఉండగా కారులైట్లు తనమీద పడ్డాయి.

బస్సు కాదని నిర్ధారణ చేసుకొని కాస్త వయ్యారంగా ఆవరణగోడకు అనుకొని, కాలు ఒకటి వేసివున్న గేటు తలుపునకు, ఒకటి ఏనుగు తొండానికి ఆనించి ఏవరిదో ఈ అందాలమేడ అని ప్రశ్నించుకొన్నాడు. ఇది ఒక హైకోర్టు జడ్జీది కావచ్చు. మదరాసు జిల్లా కలెక్టరుగారిది కావచ్చు. ఆడ్వొకేటుది కావచ్చు. ఒక వర్తకునిది కావచ్చు. ఒక సినిమాస్టారుది కావచ్చు. గేటుదగ్గిర చప్రాసీలేదు, జడ్జీదికాదు, కలెక్టరుది కాదు. పార్టీలు నడయాడుటలేదు, అడ్వొకేటుది కాదు. ఘూర్కావాడు కాపలాలేదు, సినీమాతారదికాదు. అయితే వర్తకునిదో లేక ఖాళీగా ఉందో, ఖాళీగా వుంటే లోపల జనం అలికిడి ఉంది, అన్న ఆలోచనలలో కళ్ళుమూసుకొని కలలు కంటున్న అతని కంటి మీద నుంచి కాంతి గలిగిన వెలుగు పడడం, బుర్రుమని గుండెలదిరేటంత చప్పుడవ్వడం ఒక్కమాటుగా జరిగింది.

ఉలిక్కిపడి, అదిరిపడి ఒక్కగంతున ఉరికి లేచాడు కోనంగేశ్వరరావు.

"ఎవరయ్యా! దారికడ్డంలే, నాటుపురం మనిషిలా ఉంటివే!" అన్న కిన్నెరస్వనము.

"నేను నాటుపురంవాణ్ణే! నాటుపురమేకాదు కన్నాటుపురం కూడా నాది!"

"కన్నాటు అంటే!"

"కళ్ళుమూసుకు కలలు కంటున్న నాటుపురంవాణ్ణి. అందుకని కన్నాటు పురంవాణ్ణి."

కిలకిల, వీణపంచమతీగెను పంచమం మీటితే వచ్చిన కాకలీనిస్వనపు నవ్వు కారులోంచి వినపడింది.

ఈ మాటలకు ముందే గేటు తెరవడం, బస్సురావడం బర్రుమని వెళ్ళిపోవడమూ జరిగినవి.

"అయ్యో! మీ కారువల్ల నా బస్సు తప్పిందండీ!" అంటూ కారు ముందు నుంచి కోనంగిరావు కారు డ్రైవరు వైపుకు వచ్చాడు. కారుడ్రైవరు ఒక బాలిక. వీధి దీపాల వెలుతురు మాత్రం ఆధారం. అందులో వెలుగు లోంచి వచ్చాడు. డ్రైవరు ఘుమఘుమ మంటే, కళ్ళు చిట్లించుకొంటూ కోనంగి డ్రైవరువైపు పారకించి చూస్తే, ఆ డ్రైవరుగారు అస్పష్టంగా కనబడే ఒక చక్కని బాలికలా కనబడింది!

"మీరు మాతో ఏమన్నా పనిఉండి వచ్చినారా ఏం?"
"ఏమన్నా కాదండి, ఉన్నపనే మీతో!"
"ఏమిటా పని?"
"ఉద్యోగంకోసం దరఖాస్తు పట్టుకువచ్చా."
"మా దగ్గిర ఉద్యోగాలు ఏమీలేవే?"
"మీరు కూడా యుద్ధ ఉద్యోగంలో చేరమని చెప్పలేదే?"

ఒక బాలిక డ్రైవరు పక్క సీటులోంచి కిటికీలో తలఉంచి తనతోమాట్లాడుతున్నది. ఆమె మాటలు ఎంతో లోతుగా ఉన్నాయి. ఎంతో నీలంగా ఉన్నాయి. ఎంత మధురంగా ఉన్నాయి! మాట్లాడుతోంటే పున్నాగవరాళిరాగం వస్తోంది అని కోనంగి అనుకున్నాడు.

ఆ బాలిక ముక్కున వజ్రాల బేసరీ, చెవుల వజ్రాలదుద్దులు, అందుండి వేళ్ళాడే వజ్రాలజూకీలు తళుక్కుమన్నాయి. ఆమె కళ్ళు వజ్రాలకన్న, ఆకాశంలో తారలకన్న తళుక్కుమన్నాయి.

కోనంగి చూపులూ ఆమె చూపులూ ఎదురుబొద్దురై తారసిల్లి వైఖరీ ధ్వనిలో ఫెళ్ళుమని, కలిసి పై కెగసి, తుంపర్లతో లోకం నింపి క్రిందికి దిగి సుళ్ళుపడి, కలసి కరిగిపోయి ఏకప్రవాహం అయ్యాయి.

వీధిగేటు, కారు, మదరాసు, భరతదేశం రెండవ ప్రపంచయుద్ధ ప్రారంభం, సర్వప్రపంచము, అఖిలవిశ్వమూ మాయమైపోయాయి.

ఆ శూన్యంలో కోనంగి, ఆ యువతి.

పక్కనున్న ఆమె "అమ్మిణీ! కారు పోనియ్యవే" అంది. ఇంతవరకూ కారు గురుగురు లాడుతూనే ఉంది. ఆ అమ్మిణీ న్యూట్రల్‌లోంచి మొదటిగేరులో కారు ముందుకు ఉరికించింది. రెండవ గేరులో కారు లోపలికి వెళ్ళిపోయింది.

కోనంగి ఎవరీ బాలిక? కొంచెం పచ్చగా. కొంచెం శలాకలా, కొంచెం బొద్దుగా, కొంచెం పొట్టిగా, కొంచెం పొడుగ్గా ఉన్నట్టుగా కనబడి అతి మనోహరంగా వెలిగిపోయే మొహంతో ఎవరు ఈ ముద్దులగుమ్మ అనుకున్నాడు.

తన బ్రతుకు సినిమాకాదుగాని, లేకపోతే మూడుపాటలు పాడును. అప్పుడు ఎవరైనా బాక్‌గ్రౌండు మ్యూజిక్ వాయిద్దురు. భారతీయ సినీచిత్రాలలో అడివిలో వెళ్ళేవాడికి. నదిలో కొట్టుకుపోయేవాడికి పాటలు పాడబుద్ధి కలిగినప్పుడు వాడికి బాక్‌గ్రౌండు మ్యూజిక్ వస్తుంది - తాను ఈలాంటి బాలిక కనబడినప్పుడు రెండు పాటలు విసరకూడదా? నాటకాలలో ఏ సి.ఎస్.ఆరో. అయితే యాభై అయిదు పద్యాలుపాడి ఉండును.

అలాగే అతడు నిలుచుండిపోయినాడు. అతని హృదయం ఉందోలేదో ఎడంవైపున తడుముకొని, అద్దుకొని చూచుకొన్నాడు. కొందరు కుడిచేతితో కుడివైపున చూచుకోవడం చూచి ఉన్నాడు కాబట్టి, డాక్టరు కానట్టి తనకు ఎందుకైనా మంచిదని కుడివైపునకూడా తడిమి చూచుకొన్నాడు

హృదయంలేదు వట్టి గుండె కొట్టుకొంటోంది. ఓయి కోనంగీ! ఇది నా వాటర్లూ యుద్ధమో, లేక నీ ఆర్కాటుముట్టడో అనుకున్నాడు.

లోపలినుంచి ఒక సేవకుడెవరో తనవైపు పరకాయించ చూస్తూనెమ్మదిగా గేటు మూసివేసినాడు.

## ద్వితీయ పథం

# అనంతలక్ష్మి

కారు నడుపుకుంటూ అనంతలక్ష్మి లోపలికి పోయింది. కాని ఆ అబ్బాయి విగ్రహం చూపులనుంచి పోదే? ఎవరా యువకుడు? అతని మోములో విచిత్రమయిన శక్తి ఏమిటి? అతని కళ్ళల్లో ముక్తాయించిన శబ్దాలేమిటి? ఎంత చక్కగా మాట్లాడాడు! పాలఘాట్ మణి మృదంగంకన్న తీయగా ఉందామాట. తనకు ఇంకా నవ్వాగలేదు. నాటుపురం కాదట, కన్నాటుపుర మట!

అసలు స్త్రీ పురుష జీవితాలలో ప్రేమ అనేది కుదరదు. ప్రేమ అనేది ఒక కావ్యరస స్వరూపం. కాని జీవితం కావ్యశ్రుతికి రెక్కలు చాపినప్పుడు ఆ దివ్యానుభవ ప్రేమ మనుష్యులకు కూడా ప్రత్యక్షమవుతుంది కాబోలు.

అనంతలక్ష్మి ఆ కావ్యస్థితిలో ఉండే బాలిక. ఆమె రక్తంలో తంజావూరి రఘునాథరాయల ప్రేమ విధానము, మధురవాణి రసికత ప్రవహిస్తున్నవి. ఆ వంశపు అమ్మాయే ఆమె. ఆమె ముత్తవ ముత్తవ ముత్తవ ముత్తవ ముత్తవ మధురవాణి కొమరిత అని అనంతలక్ష్మి తల్లి వంశ వృక్షము చూపిస్తుంది.

అనంతలక్ష్మి ఆడవాళ్ళ కళాశాల అయిన క్వీన్ మేరీ కాలేజీలో చదువుకుంటున్నది, ఈ ఏడే ఇంటరుకు వెళ్ళాలి. అనంతలక్ష్మి తల్లి జయలక్ష్మి కొమరితకు ముగ్గురు ఉపాధ్యాయులను పెట్టి చదివిస్తోంది. తానయితే సంస్కృత కావ్యాలు, తెలుగు కావ్యాలు, అరవ కావ్యాలు చదువుకుంది. సంగీతంలో నిధి. నాట్యంలో దాక్షిణాత్య వివాహ రంగస్థలాలు అలంకరించి పండిత పామరుల హృదయములు, ఆదరములు చూఱగొన్న తలమానికమైన నర్తకి.

పొగాకు తాంబూలం వేసినా, జయలక్ష్మి కంచిలో ఉన్న ఒక ధనికుడైన అయ్యంగారి కుదృవించిన దిట్టమయిన పుట్టుక కలది కాబట్టి, ఎఱ్ఱగాబుఱ్ఱగా రవ్వల నగలతో, రవ్వల వడ్డాణంతో పదివేల రూపాయల నగలు తల్లి దగ్గర నుండి సంక్రమించుకొన్న నవోఢ అయి, ఒక పెద్ద జమీందారుని కన్యరికపు భర్తగా పొందగలిగింది.

అ జమీందారు జయలక్ష్మిని వదులుతేనా? ఆ యువతి నాటుకోటి చెట్టియారుల పెళ్ళిళ్ళలో, లక్షాధికార మొదలియారుల శుభకార్యములలో, తెలుగు శ్రేష్ఠులు, రెడ్లు, నాయకులు, రాజులు, దాయంగులు, అయ్యరు అయ్యంగార్లు, పిళ్ళేల ఇళ్ళల్లో వివాహాది శుభకార్యాలలో జయలక్ష్మి పట్టులాగు ధరించి, పెద్ద జరీ పూవుల బనారసుచీర ధరించి కుచ్చెళ్ళు పెట్టి అయిదువేల ఖరీదు కలిగిన రవ్వల అడ్డబాసపెట్టి, పద్దెనిమిదివేల రవ్వల వడ్డాణము తన తేనెటీగ నడుంలాంటి నడుముకు బిగించి, విప్పిన అల్లిక విసనకర్రలా కుచ్చెళ్ళు జరీ అంచుతో ముందు జిలుగులాడ, గజ్జెలుకట్టి, గురునకు పాదాభివందనము, మృదంగమునకు వంగి నమస్కారముచేసి, పెద్దలకు దణ్ణాలుపెట్టి అలరింపుతో నాట్యం ప్రారంభం చేసిందా, ఆ జమీందారుడు హాజరు.

జయలక్ష్మికి జమీందారుడంటే ప్రేమలేదు. తన కులపు స్త్రీలకు ప్రేమలు పనికిరావని తల్లి బోధించిన నీతి ఆమెకు తెలిసితీరును. "నీవు శృంగార నాయికవు. అభినయ శిరోరత్నానివి. శృంగారం ఆభినయించు. అష్టవిధ నాయికల్ని నాట్యంచేయి" అని తల్లి చెప్పిన వాక్యాలు ఎప్పుడూ మరవలేదు జయలక్ష్మి.

కాబట్టి జమీందారుడు విచారిస్తూ విచారిస్తూ జయలక్ష్మిని వదలలేక దుఃఖిస్తూ బహుశః ఇంద్రలోకమే చేరిఉంటాడు.

జయలక్ష్మి గౌరవానికి మూడు నెలలు దుఃఖించింది. కచ్చేరీలు మానింది.

అలాంటి కచ్చేరీలలో ఒక అయ్యగారింట జరిగిన నాట్యసభలో వర్తకంచేసే ఒక లక్షాధికారి అయ్యంగారు ముప్పదిఏళ్ళ ఈడువాడు భార్యపోయి దుఃఖిస్తున్నవాడు ఆ జయలక్ష్మిని చూచాడు. ఆ శుభముహూర్తంలోనే ఆత్మదగ్గిరనుండి వేలిగోరువరకూ ఒక ప్రేమ ఝుంఝూమారుతంలో ఆవిడకు సర్వార్పణమైపోయాడు. కాని ఆ రోజుల్లో ఆవిడ చూపులుతప్ప ఈతనికి ఏమీ అర్పించుకోలేకపోయింది. హృదయంలో పదమటిభాగం ఆ చూపులో వంపించుకుంది.

కాని ఆ జమీందారుగారు ఏదో లోకం చేరారు అని తెలుసుకున్నాడు. రాకెట్ విమానాలు లేవు. కనక తిరిగి వస్తాడన్న ఆశకు తావులేదు. ఆ మరుసటి క్షణంలో తన మైలాపురం ఇంటినుండి గంటకు నలభైమైళ్ళ సగటువేగంతో శ్రీమాన్ శ్రీరంగత్తిరుమల రంగయ్యంగారు కారుకు కూడా ఒకేసారి పెద్ద భోజనంపెట్టి తంజావూరు ప్రాంతంలో ఉన్న మన్నారుగుడికి ఉల్కాపాతంలా వెళ్ళిపోయాడు. మన్నారుగుడిలో జయలక్ష్మి రంగులమేడ ఉంది.

శ్రీమాన్ శ్రీరంగత్తిరుమలరంగయ్యంగారు వెళ్ళి దుఃఖిస్తున్న సంతతకన్య అయిన జయలక్ష్మిని ఊరడించ ప్రారంభించారు. ఆమె దుఃఖిస్తున్న మూడు నెలలూ ఆమెను రహస్యంగా ఊరడిస్తూ ఉన్నాడు.

ఆమె ఊరడిల్లి ఇంతకాలంవరకూ తన ఇనపపెట్టెలో దాచుకున్న ఆత్మనుతీసి తన బ్రతుకులో ధరించి చూచుకుంది. ఆ ఆత్మ శ్రీమత్తిరుమలరంగయ్యం గారిని వదలనంటుంది.

ఆనాటినుంచి ఆయనకు ఆమె భార్య. రంగయ్యంగారు ఆమె ప్రేమలో సర్వశృంగార మాధుర్యాలు రుచి చూచారు. పుస్తెకట్టి వివాహం చేసుకోలేదు కాని, ఈనాడు లా ప్రకారం భార్యాభర్తలయిన జంటలలో వారిరువురకు ఒకరిమీద ఒకరికున్న ప్రేమ ప్రణయము, కాంక్ష, ఆపేక్ష, గౌరవము, అభిమానము ఏ ఒక్క జంటకన్నా ఉంటుందా?

వారిరువురి దాంపత్యఫలమూ అనంతలక్ష్మి. అనంతలక్ష్మి రసావిర్భావ. అనంతలక్ష్మి ప్రేమపూజావరము. అనంతలక్ష్మి ఆనంద తప స్సంజనితసిద్ధి! జపాన్ చక్రవర్తి కూతురు అలా పెరగలేదు. రాక్‌ఫెల్లరు మనుమరాలు ఆ మురిపాలు పొందలేదు.

ఏడాదికోసారి నగలన్నీ మారేవి. నెలకోసారి దుస్తులు మారేవి. రోజుకోసారి ముద్దుల విధానం మారేది.

చిన్నతనంలో పూర్ణారుణం రంగరించి బంగారు, బాలికాతనంలో కొంచెం గులాబిరంగు కలిపివేసిన మేలిమి. యవ్వనప్రాదుర్భావంలో మేలిమీ గులాబీ సమపాళ్ళు. నవయవ్వనంలో వేయితులాల మేలిమిలో 200 గులాబీల రంగు 100 కమలాల వర్ణము కలబోసి, అయిదుశేర్ల ఆవువెన్న. రెండు రాకా పూర్ణిమల వెన్నెల

కలిపి, సన్నెకల్లులో నూరి వడబోసి స్ఫటికశిల చెక్కిన బాలికారూపంగల సీసాలో పోసి ఉంచిన దివ్యవర్ణం.

ఆ బాలిక గొంతుకలో ఏ నాదం వేద్దామా అని సృష్టికర్త చాలా సేపు ఆలోచించాడు. తోచక సరస్వతిని సలహా అడిగాడు. "పోనీలెద్దురూ, కోటిగొంతులు సెకండుకు చేయగల మీరు ఈ గొంతుకకోసం ఎందుకంత తంటా అంట?" అని ఆమె చిరునవ్వుతో పెదవులు ముడుచు కుంటూ పొడిగిస్తూ అంది.

ఆ ఆదికాలపు ముసలాయనకు హృదయం జల్లుమంది కాబోలు! ఆమె పెదవులు రెండూ ముద్దెట్టుకోడం మొదలుపెట్టేసరికి ఆ ముద్దులలో నుంచి ఒక స్వనం. ఆమె కరిగి వివశయైంది కాబోలు. అప్పుడామె కంఠంలోనుంచి ఒక కూజితం. ఆమె చేయి ఆ వివశత్వంలో తన వీణను మీటుతూ వుంటే ఒక కలరుతం ఉద్భవిల్లి, ఆ మూడూ కలిసిపోయి వారిద్దరికీ మరింత పరవశత్వం కలిగించి ప్రవహించివచ్చి అనంతలక్ష్మి కంఠంలో చేరాయి.

## 2

ఇదేమిటి? ఆ బాలకుడు తన హృదయంలోంచి పోడేమిటి? పోనీ పగలు చూచి ఉండలేదే అతని రూపం, తన హృదయంలో ఛాయా చిత్రమై అచ్చుపడిపోవడానికీ! తనకు ఏర్పాటయిన పాఠ్యగ్రంథ నవలలో, తాను ప్రీతితో చదువుకునే నవలలో, చిన్న కథలలో నాటకాలలో ఎంతగానో వర్ణింపబడిన ప్రేమ అనే జబ్బుతనకూ ప్రవేశించింది. ఎవరు తనకు వైద్యం చేసేవాళ్ళు?

ఎక్కడైనా ఉంటుందా ప్రేమ? ఎవరో? ఏమిటో? ఎందుకో? ఎలాగో? ఎక్కడనుంచి? ఎక్కడికి? అనే ప్రశ్నలకు సదుత్తరాలు లేకుండా 1939-వ సంవత్సరంలో చదువుకొనే అతినవీన బాలిక ప్రేమించడం సంభవమా? కాని సంభవమై ఊరుకుందే! దీనివల్ల వచ్చే సంఘటనలు ఆ మన్మథునికి తెలుసునా?

రాత్రల్లా అనంతలక్ష్మికి నిద్దర సరిగా పట్టలేదు. పైగా కలలు. ఆ యువకుడు మోటారులోకి తన్ను తోసేసి వచ్చి కూచున్నాడట. తానే నడపడం ప్రారంభించాడుట. తా నాతనిదగ్గిర కూర్చున్నదట. తాను అతన్ని ఆనుకుని. అతనిలోనుంచి తనలోనికి ప్రవహించే ఏదో విచిత్ర శక్తికి పరవశత్వం పొందుతూ అ కారువేగం అనుభవిస్తోంది. తల్లి తన్ను వెనక సీటులోనికి లాగేద్దామని ప్రయత్నమట. ఇంతట్లో తమ మోటారు విమానమై ఎగరడం ప్రారంభించిందట. తామిద్దరూ విమానంలో వెనకాల కూర్చుని ఒకరి కౌగిలిలో ఒకరు ఒరిగిపోయి, అర్థంలేని నవయవ్వనపు పిచ్చి మాటలు మాట్లాడు కుంటున్నారట. తనతల్లే వైమానికుడై విమానం నడుపుతున్నదట.

ఉదయం అనంతలక్ష్మి పరధ్యానంగా ఉంది. జయలక్ష్మి వచ్చికూతుర్ని చూచి, "ఏమే అమ్మణ్ణీ, పరధ్యానంగా ఉన్నావు?" అని ప్రశ్నించింది.

**అనం:** నేను పరధ్యానంగా ఉన్నానా?

**జయ:** అంత బడలికగా ఉన్నావేమిటే?

**అనం:** నేను బడలికగా ఉన్నట్టు కనబడుతున్నానా?

**జయ:** అవునే అమ్మణ్ణీ! వంట్లో బాగుందా?

**అనం:** ఏమీ జబ్బులేదు అమ్మా! రాత్రి సరిగ్గా నిద్రలేక అల్లా ఉంది.

**జయ:** నిద్రలేకపోవడమేమిటి? అందుకనే నేను కంగారుపడుతున్నాను. డాక్టరుగారికి కబురుపంపనా?

**అనం:** నా కేమీ జబ్బులేదు. నిన్నరాత్రి గేటు దగ్గిర కనబడ్డ ఆ అబ్బాయి ఎవరై ఉంటాడు అమ్మా?

**జయ:** ఎవరైతే మనకెందుకే! ఎవడో ఒక రౌడీ! లేకపోతే అల్లామాట్టాడుతాడా! ఉద్యోగానికి దురఖాస్తు పట్టుకువచ్చాట్ట! ఆడవాళ్ళ ఇల్లు, మనకు ఏమీ సంరక్షణ లేదనుకున్నాడు. మన మన్నారుగుడి వస్తాదులు మన ఆవరణలో వాళ్ళ కుటుంబాలతో కాపురంవున్నారనీ, అ గేటుకాపలా మనిషి ఆందులో ఒకడని ఆ పై త్తకారికి తెలిస్తేనా?

**అనం:** అమ్మా! ఏమిటా మాటలు? ఆ అబ్బాయి రౌడీ ఆ! నువ్వు అతని మొహం అన్నా చూడలేదు. కాని ఆ అబ్బాయి మొహంలో నిర్వచింపలేని ఉత్తమలక్షణాలు ఎన్నో ఉన్నాయి.

**జయ:** చాలులే! మన కామధ్య నిన్ను గురించి వచ్చిన ఉత్తరాలు నాకు మధ్యవర్తుల ద్వారా వచ్చిన రాయబారాలు, బెదిరింపులు అన్నీ మరచి పోయావా?

**అనం:** వాటికీ, ఈ అబ్బాయికీ సంబంధం ఏమిటి అమ్మా? మన వినాయగం పిళ్ళే గేటుదగ్గిర ఉన్నాట్ట, ఆ అబ్బాయి బస్సు ఆగేచోట నిలుచుండి నిలుచుండి నిలువలేక బద్దకించి మన ఇంటి గేటు దగ్గిరకు వచ్చి గేటు ఏనుగుతలమీద కూర్చున్నాట్ట. ఎవరో పెద్దమనిషిలా ఉన్నాడని వినాయగంచూచి ఊరుకున్నాట్ట. ఇంతట్లో మనం సినిమానుంచి వచ్చాము.

**జయ:** నీకెలా తెలిశాయి యివన్నీ?

**అనం:** పొద్దున్నే తోటలోకి పువ్వులకు వెళ్ళి, వినాయగాన్ని అడిగి తెలుసుకున్నా.

**జయ:** పెద్దమనిషి అయితే కావచ్చును మనకెందు కా గొడవ?

**అనం:** ఆ ఆబ్బాయి కలలోకి కూడా వచ్చాడు.

**జయ:** కలలోకీ వస్తాడు, తలలోకీ వస్తాడు బుద్ధి లేకపోతే సరి. త్వరగా నీళ్ళు పోసుకొని, తలదువ్వుకో, భోజనం చెయ్యాలి.

అనంతలక్ష్మి "సరేలే అమ్మా!" అంటూ లోపలికి పరుగెత్తిపోయింది.

స్నానంచేస్తూ, తలదువ్వుకొంటూ, బట్టలు ధరిస్తూ, భోజనం చేస్తూ ఆ కన్నాటుపురం బాలునే తలుచుకొంటూ తనలో తానే చిరునవ్వు నవ్వుకుంటూ, కాలేజీకి కారుమీద బయలుదేరింది.

క్వీన్ మేరీ కళాశాల సముద్రతీరంలో ఉంది. బాలికలు తరగతిలో కూచోడం ఒక యజ్ఞం. ఆచార్యాణి తరగతిలోకి రావటంతోటే ఘుమఘుమలాడుతూ, జలజల లాడుతూ, కలకలలాడుతూ, బిలబిలమంటూ, పలపలమంటూ బాలికలంతా లేస్తారు.

ఒక బాలిక ఎందుకో "హిహి" అంటుంది. అక్కడినుంచి తక్కిన బాలికలంతా "హీహీ అనీ, హినీ! హినీ హినీ, హిహీహి! హీహినీ" అని నవ్వుతారు. ఆచార్యాణి తలెత్తి తరగతిని పరికించి చూస్తుంది. అంతా నిశ్శబ్దం.

పురుషుల కళాశాలలో చదివే బాలికలు, వంచినతల ఎత్తకుండా వస్తారు. చూస్తూ ఉన్నా చూడరు. పలుకరించినా చెవిటివారు. నవ్వితే ఎవ్వ డీ ఇకిలింపుల పెగూపోనీ అని అనుకుంటారు.

మా అనంతలక్ష్మి ఆ దినాన నోట్సు తీసుకోదు. ఇరుప్రక్కలనే వసించిన స్నేహితురాండ్రిద్దరూ ఏమిచెప్తున్నా వినిపించుకోలేదు.

**మొదటి స్నేహితురాలు:** లక్ష్మి! ఎక్కడే ఉంటా నీ మనస్సూ?

**రెండవ స్నేహితురాలు:** దారిలో నాగయ్యను, అశోకకుమార్‌ని, పృథ్వీరాజుని....

**మొదటి:** సురేంద్రుని, మోతీలాలుని....

**రెండవ:** నజ్మల్‌ని....

**మొదటి:** జాన్‌స్టూఆర్టుని....

**రెండవ:** ఫ్రెడ్ మాక్ ముర్రేని....

**మూడవ:** క్లార్క్ గేబిల్....

**అనంత:** (తల యిరువురివైపూ చెరి ఒకమాటు తిప్పుతూ) నీ తలకాయని, నీ బుఱ్ఱకాయనీ, నీ కళ్ళనీ, నీ పళ్ళనీ, నీ చెవినీ, నీ ముక్కునీ, నీ మెడనూ, నీ నుదురినీ, నీ తెలివినీ, నీ తేటనీ చూచి...

**మొదటి:** మోహించావు....

**రెండవ:** మూర్ఛపోయావు....

**ఆచార్యాణి:** ... ష్! ష్! నిశ్శబ్దము! అనంతలక్ష్మిదేవి! ఏమిటా గుసగుసలు?

**అనంత:** మూ, మూ, మూర్ఛపోయింది.

**ఆచార్యాణి:** (గడబిడగా కుర్చీనుండి లేచి) ఎవరు? ఎవరు?

**అనంత:** ఎవరూ మూర్ఛపోలేదండి. ఎవరో మూర్ఛపోయారని మా స్నేహితురాలు అన్నది.

**ఆచా:** అసలా మాటలెందుకు రావాలి?

**అనంత:** దిగాలుగా ఉంటే ఏమిటని క్లాసులోకి వస్తూ అడిగాను. దానికి అప్పుడే జవాబు చెప్పింది. అంచేత ధైర్యంగా ఉండు అని చెప్పినోట్సు తీసుకొంటున్నాను.

**ఆచా:** సరే, కూర్చో.

## ③

అనంతలక్ష్మి ఆటలు ఆడుటకు వెళ్ళింది సాయంకాలం. బాట్‌మింటనూ, బంతిఆటా, టెన్నిసూ, వాలీబాల్, రింగుటెన్నిసూ అన్నీ ఆడుతుంది. కాలేజీ విద్యార్థినుల నాటకాలలో ముఖ్యపాత్ర వహిస్తుంది. అటు తమిళ సారస్వత సంఘంలో ముఖ్యురాలు. ఇటు ఆంధ్ర సారస్వతసంఘంలోనూ ముఖ్యపాత్ర. ఇంటరులో 'బి' గ్రూపులో తెలుగు పుచ్చుకుంది. 'సి' గ్రూపులో తమిళం పుచ్చుకుంది.

అనంతలక్ష్మిలో తమిళాంధ్ర సంస్కారాలు ప్రయోగమయ్యాయి. ఈ ప్రయాగ దేవీప్రయాగ.

అనంతలక్ష్మి తళుక్కుమంటూ తన కారుమీద ఇంటికి చక్కా వచ్చింది. ఆమె అలావస్తూ ఉంటే గేటుదగ్గిర నిన్నటి అబ్బాయే తన ద్వారరక్షకుడు వినాయగంపిళ్ళేతో మాట్లాడుతున్నాడు.

అనంతలక్ష్మి కారు ఆపుచేసింది. ఆమె హృదయం టెన్నిస్ బాటు అయి ఉన్నట్టయితే ఒక్కపాయంటు తీయలేకపోయి ఉండును.

కారే గనక ఆపు చేయకపోతే, అనంతలక్ష్మి వెళ్ళి కారు బోల్తా కొట్టించి ఉండును.

**అనం:** ఏమిటి పిళ్ళా?
**పిళ్ళ:** ఈ అయ్యరుకు మీకు పాఠాలు చెప్పేవారు కావాలని ఎవరో చెప్పారుట. అందుకని దరఖాస్తు పెట్టడానికి వచ్చారట.
**అనంత:** లోపలికి తీసుకురా, మా అమ్మగారితో మాట్లాడవచ్చును.
**పిళ్ళ:** మీ అమ్మగారితో మాట్లాడటమయిందండి.
**అనంత:** ఏమన్నారు?
**పిళ్ళ:** ఖాళీలేమీ లేవన్నారు. ఇంక ముందుకూడా ఖాళీలు రావన్నా రటండి.
**అనంత:** నీ కెల్లా తెలుసు?
**పిళ్ళ:** అయనే చెప్పాడమ్మా.
**అనంత:** అల్లాగా?
**పిళ్ళ:** నేనడిగితే చెప్పారు.
**అనంత:** నువ్వెందుకు అడిగావు?
**పిళ్ళ:** మళ్ళీ వస్తే రానివ్వడమో, రానివ్వకపోవడమే తెలియవద్దా అమ్మా?
**అనంత:** అల్లాగా?
**పిళ్ళ:** నేను మిమ్ములను కూడా కనుక్కోడం మంచిదని చెప్పు తున్నానండి.
**అనంత:** వారి అడ్రసు తీసుకో. ఏఏ పరీక్షలు ప్యాసయినది వగైరా తబ్సీళ్ళు తీసుకో. కార్డు వ్రాస్తాను అవసరమైతే.

అనంతలక్ష్మి బర్రున కారు నడిపించుకు వెళ్ళిపోయింది.

కోనంగి నిట్టూర్పు విడిచి తలవాల్చాడు.

ఇంతవరకూ అరవంలో సంభాషణ జరిగింది అనంతలక్ష్మికి వినాయగానికీ. ఇప్పుడు వినాయగం కోనంగిని చూచి, తెలుగులో మాట్లాడుతూ 'స్వామీ' మీ నివాసం అడ్రసు ఇవ్వండి. ఏమి' అని అన్నాడు.

సరేనని ఒక చిన్న కాగితంమీద తన అడ్రసు కోనంగేశ్వరరావు నెల్లూరు ఆంధ్రాహోటల్, నల్లతంబి, ట్రిప్లికేను అని వారికి వ్రాసియిచ్చి తాను చక్కాపోయినాడు.

తాను వచ్చిన పని విజయవంతంగానే జరిగినది. ఎందుకంటారా, తానా బాలికను పగలు చూడాలని బుద్ధిపుట్టికదా తానీ వంకను వచ్చింది. దిట్టమయిన రౌడీలా ఉన్న ఆ గేటుకీపరు తన్నెంతో మర్యాదచేసి అన్ని విషయాలు మాట్లాడాడు. తనంటే ఆ పిట్టపిడుక్కి అంత మంచి భావం కలగడానికి కారణం ఏమిటి?

తన్ను లోపలికి తీసుకుపోయి వరండాలో కుర్చీలో కూర్చోబెట్టి లోపలికివెళ్ళి మాట్లాడి వచ్చాడు. తానా బాలికా, తల్లి ఏ సినిమాస్టారులో అని కదా ఈ రోజున తబ్సీళ్ళు కనుక్కుందామని వచ్చింది?

వాళ్ళకూ సినిమాకూ సంబంధమేమీలేదు. తన ఉద్దేశంలో ఏమీ చెడు భావాలులేవు. అందుకు ట్రిప్లికేను ప్రార్థసారథి సాక్షి. మైలాపూరు కపిలేశ్వరుడు సాక్షి. మింటువీధి కందస్వామి సాక్షి.

వాళ్ళు అయ్యంగారు లంటారు. అయ్యంగారులంత వాళ్ళంటాడు, వినాయగం పిళ్ళె! జమీందారులంతటివాళ్ళట! ఇక చాలు తన ఈ చిన్నసాహసకార్యం.

యుద్ధం ప్రారంభమైంది. ఇంగ్లీషువారూ ఫ్రెంచివారూ ఏదో వేళా కోళంగా యుద్ధం చేస్తున్నారు జర్మనీవారితో.

కాని, పోలండువారికీ ప్రాణంపోకడ అయిపోయింది. ఒకరోజు రెండు రోజులలో పోలండు నాలుగోవంతు అయింది. వేలటాంకులు జగన్నాథ రథాలకన్నా మహావేగంతో అడ్డంలేని బరువుతో భయంకర శబ్దాలతో పోలండు బాలబాలిక, స్త్రీపురుష వృద్ధులనూ ఎదిరించే మగటిమిగలవారినీ, నాశనంచేస్తూ వెళ్ళిపోయాయి. అకాశంలో రాబందులు గద్దలులా వేలకొలది విమానాలు గుండెలవియజేస్తూ, దేశం నేలమట్టంచేసే ప్రళయవర్షం కురిపిస్తూ ముందుకు సాగిపోయినాయి.

ఇంతట్లో అటునుంచి రష్యావాళ్ళు వచ్చి సగం పోలండు అక్రమించారు. పోలండు లేదు. పలకమీద చిన్న బాలుడు పటంవేసి చెరిపేసినట్టు మాయమైపోయింది.

అనంత ధ్వనిలో ఒకదేశ ప్రజల హాహాకారాలు, అనంత రక్తిమలో మనుష్యరక్తమూ కలిసిపోయింది.

అంతులేని కాంక్ష, రాక్షసత్వమూ, రక్తం చూచిన పెద్దపులుల రక్తభోజన తృష్ణా, భుగభుగమండే విజయగర్వమూ హిట్లరును భయంకర మూర్తిత్వంలో కలిసి యూరపు ఆవరించుకోవడం సాగించింది.

కాని కోనంగికేమి ఉద్యోగం ఉంది. యుద్ధం ఏలాంటి పరిణామం పొందుతుందో తెలియని కోనంగి కెలా ఉద్యోగం ఇస్తారు.

అటు తెలుగుదేశమూ ఇటు తమిళదేశమూ ప్రవాహాలై వచ్చి ఫెళ్ళున చెన్న పట్టణములో తారసిల్లాయి. తెలుగు ప్రవాహం ఉత్తరం బరంపురం నుండి ప్రవహించాలి. అది వచ్చివచ్చి చెన్నపట్నంచేరే కాలానికి వంద ఏళ్ళకుముందే అరవయ్యర్లూ అయ్యంగార్లూ తండాలుగావచ్చి ఉద్యోగం కోటలు పట్టుకు కూర్చున్నారు.

వాళ్ళవి ఇంజనీరింగు, పోలీసు, హైకోర్టు, ఎం. ఎస్.ఎం. రైల్వే, వైద్య విద్యా వగైరా. తీరా 1939లో కోనంగి మదరాసువస్తే ఈయనకోసం ఉద్యోగాలు సిద్ధంగా ఉంటాయా!

కాంగ్రెసు ప్రభుత్వం వచ్చింది: బాగానే పనిచేస్తూ వుండెను. అయినా ప్రధానామాత్యుడు అయ్యంగారే ఆయెను. ఉన్న కొద్దిరోజుల్లో తమజాతిని బాగుచెయ్యడం తెలుగు మంత్రులకు చేత అయితేనా?

తీరా రాజీనామా ఇచ్చి వెళ్ళిపోయే రోజుల్లో కోనంగి మదరాసు వచ్చాడు.

కొంచెం కంటిరెప్పలు రెపరెపలాడించేవేళకు కాంగ్రెసు మంత్రి వర్గాలన్నీ రాజీనామాలు ఇచ్చి కూర్చున్నాయి.

## 4

**కో**నంగి తిరగ్గా తిరగ్గా వైట్‌వే లెయిడ్‌లా కంపెనీ "అమ్మకం మనిషి" ఉద్యోగం ఇచ్చారు. ఆ కంపెనీకి ఆంగ్ల మేనేజరు. రోజుకు రెండు రూపాయల జీతం. జీతం వారం కాగానే ఇవ్వటం. సరుకు విడుదలచేయడం ప్రధానం.

వైట్‌వే లెయిడ్‌లా మద్రాసు శాఖ మూసివేయడానికి నిశ్చయించింది కంపెనీ, అందుకని సరుకులకు ఖరీదులు తగ్గించారు.

మేనేజరు అమ్మే స్త్రీ పురుషులతో "ఒక వస్తువు కొనడానికి వచ్చినవానిచేత పదివస్తువులు కొనిపించాలి. ఊరికే చూడడానికి వస్తే ఏభై వస్తువులు కొనిపించాలి" అని బోధించాడు.

ఇంక మా కోనంగి తమాషా చూడండి! ఎవరో ఒక పెద్దమనిషి జేబులో పది రూపాయలున్నవాడు వచ్చాడు. టై ఒక్కటి మాత్రం కొనుక్కుందామని ఆయన ఉద్దేశం. అక్కడే ఉన్నాడు కోనంగి.

**కోనంగి:** దయచేయండి. తమకు...?

**పెద్దమనిషి:** టైలు కావాలండి.

**కోనం:** ఇవి పట్టువి: ఈ నారవి చూచారూ! నూలువి తమకు కావాలా? పట్టువి మడతన్నా పడనివి. ఏవీ రంగుపోవు కాని, ఆ రంగు అందంగా కనబడాలంటే సిల్కుమీదే వెయ్యాలండి.

**పెద్దమనిషి:** సరేలేవయ్యా, నా కామాత్రం తెలుసులే.

**కోనం:** చిత్తం! ఎరుపురంగు టై శ్యామలవర్ణానికి బాగుంటుంది. నల్లవానికి నారింజరంగు, మీబోటి పసిమిపచ్చని వారికి తెల్లరంగు, ఎత్తయినవానికి నీలంరంగు, మొదలైన ఏ రంగు అయినా అందంగా ఉంటాయి.

**పెద్ద:** నాకు ఏ రంగు బాగా ఉంటుందో అలాంటి టై ఒకటి ఇవ్వండి.

**కోనం:** చిత్తం పైగా కోటునుబట్టి కూడా రంగుతేడాలు, పూవుల తేడాలు ఉండాలండి. తమకు ఏఏ రంగుల కోటులున్నాయి?

**పెద్ద:** ఎనిమిది ఉన్నాయి. రెండు తెల్లవి. రెండు నల్లవి. తక్కిన వానిలో చాక్‌లెట్ ఒకటి, కాఫీరంగు ఒకటి, నీలం ఒకటి, ఎరుపు బూడిద రంగు.

**కోనం:** కోటుకొకరకం టై ఉండాలండి. ఆ రకంలోనే రెండు మూడు వివిధమైన పూవులు మొదలయినవానితో నిండివుండడం మరీ బాగా వుంటుంది. మీ యీ కోటుకు ఈ రెండు టైలూ చాలా అందంగా ఉంటాయి.

**పెద్ద:** టై ఖరీదు?

**కోనం:** మూడు రూపాయలకు మించవు, ముప్పావులాకు తక్కువ లేవు.

**పెద్ద:** నేను జెప్పిన కోట్లకీ, నాకూ సరిపోయే టైలు పదిరూపాయలవి ఏరి ఇవ్వండి.

ఆ పెద్దమనిషి పదిరూపాయలు బల్లమీద పెట్టాడు. కోనంగి ఎనిమిది టైలు పొట్లంకట్టి బిల్లుతో యిచ్చాడు.

నవ్వుకొనే హృదయం గలవారిని కోనంగి ఇంకా నవ్విస్తాడు. పొగడ్తల కుబ్బే మనిషిని, తియ్యగా పొగిడి కొనిపిస్తాడు.

"మీకు వానకోట్లు కావాలన్నారు. వానకోటు మనకు ఉపయోగంగానూ ఉండాలి, అందంగానూ ఉండాలి. ఏమంటారు? ఉపయోగంలో సౌందర్యం రంగరిస్తే, వచ్చే ఆనందం వర్ణనాతీతం."

"అయ్యా! కాలిజోళ్ళా? చిత్తం. ఈలా దయచేయండి. ఆ కుర్చీపైన... నల్లరంగు బ్రౌన్‌రంగులలో, మీకు ఈబ్రౌన్ అందం: మీ చక్కని పొదుక్కు ఈ కాలేజీ వైఖరి అందం ఇంతా అంతా కాదండి: ఎంతచక్కగా సరిపోయిందో! ఈ జోడుకు సరిపోయిన చక్కని మేజోళ్ళున్నాయి: ఇవి మళ్ళీ రావండి, యుద్ధం. ఈ అందం మనదేశంలో నేతకువస్తుందా? వచ్చినా ఉన్న మేజోళ్ళ పరిశ్రమాగారాలన్నీ ప్రభుత్వం గుత్తకు తీసుకుంటుంది. రెండుజతలా? మీ తాహతకు నాలుగుజత లుండవద్దూ! చెప్పండి."

మాయా మంత్రాలు చేశాడు. కమ్మని మాటలు చెప్పాడు. ఆ వారం అతని రోజూ అమ్మకం సగటున రెండువందలయాభై తేలింది.

మేనేజరు తన గదిలోకి కోనంగిని పిలిచి ఇంత విచిత్రంగా, మంచి అనుభవం

కలిగిన పాతవారెవ్వరూ సరుకును విడుదల చేయలేదనీ అంత చక్కగా పని చేసినందుకు పదిరూపాయ లావారానికి బహుమతి ఇస్తున్నానని ఇరవై నాలుగురూపాయలూ అతనిచేతిలో పెట్టాడు.

కోనంగి నవ్వుకుంటూ వెళ్ళినాడు. నల్లతంబిలో గదిలో చక్కగా అలంకరించు కొన్నాడు. తన కంపెనీలో మూడు షర్టులు రెండు టైలు ఒక కోటు కొనుక్కున్నాడు.

రెండోవారం కోనంగి విజృంభించాడు. అతడు ముఖ్య అమ్మకందారు అయినాడు. ఆడవారూ అతని మాటలకు మురుస్తూ అతని మూలాన ఇంకో పదివస్తువులు కొనుక్కు పోసాగారు. టైలు నాలుగు వందల అయిదు అమ్మివేశాడు. జేబురుమాళ్లు పెట్టెలు పెట్టెలే!

"జేబురుమాలాలేని జేబు చిలుకలేని పంజరము వంటిది. ఇల్లాలులేని గృహం వంటిది. కిల్లీ దుకాణంలేని వీధివంటిది."

"పాదాలు, ఎనిమిదిరకాలు. పెద్దమడమలు, వెడల్పు పంజాలు, పొడుగువేళ్ళు, ఎత్తుమడాలు, వంకరపాదాలు, లావువేళ్ళు, పెద్దపాదాలు, చిన్నపాదాలు. ఒక్కొక్క పాదానికి ఒక్కొక్కరకంజోడు అందం. ఈడూజోడూ అనే మాటకు అసలయిన అర్థం ఈడుకు తగిన కాలిజోడు ఉండాలని! ప్రేమని కాపాడగలవి, కాలిజోళ్ళండి. ప్రియురాలు పక్కను నడుస్తుంటే, సరియైన కాలిజోడు లేకపోతే, ప్రియునిజోళ్ళు ప్రియురాలి పాదాలను నలక్కొడతాయి."

ఈలాంటి సంభాషణలు వేయిపేజీల గ్రంథం అవుతుంది.

మేనేజరు కోనంగిని వారాని కోకొత్తశాఖకు అమ్మే మనుష్యునిగా ఏర్పాటు చేసేవాడు. ఇదివరదాకా, మందకొడిగాసాగే అమ్మకం ఇప్పుడు తుపానులా సాగింది. మూడువారాలు కోనంగి విజృంభణముందు హిట్లరు విజృంభణ చీమగంగాయాత్ర అయింది. వారానికి ముప్పై అయిదు చేశాడు.

"వచ్చేది వర్షాకాలం, దాచుకోవయ్యా కాస్తధనం" అన్న మూలసూత్రం కోనంగి మరచిపోయాడు.

కొత్తతోలుపెట్టె కొనుక్కున్నాడు. నాలుగు తువాళ్ళు, అరడజను బనీనులు, అన్నీ తన కంపెనీలో కొనుక్కున్నాడు.

ఒక శనివారం ఏవేవో కొనుక్కుందామని అనంతలక్ష్మి కంపెనీ లోనికి వచ్చింది. ఎదురుగుండా కోనంగి అమ్ముతున్నాడు. అనంతలక్ష్మి ఒక్కనిమిషం నమ్మలేకపోయింది. కోనంగి అనంతలక్ష్మిని చూచాడు. అతని మోము జేవురించింది. గుండెకాయ మూడు 'లబ్' లు నాలుగు 'డబ్' లు కొట్టడం తప్పి చక్కాపోయింది.

ఇంత గాలిపీల్చి, ఛాతీ కొంచెం ముందుకు పోనిచ్చి తీయగా మాట్లాడుతూ తన అమ్మకం సాగించాడు కోనంగి.

అనంతలక్ష్మికి గుండె ఒకసారి ఆగిపోయింది ఒకసారి విమానంలా అల్లరిచేసింది.

ఎల్లాగో కోనంగి దగ్గరకు నడిచివెళ్ళి అనంతలక్ష్మి "ఏమండీ, కోనంగిరావుగారూ!" అంది.

"అనంతలక్ష్మిగారూ! ఏంకావాలి మీకు? మంచి స్నోలు, ముఖంపవుడర్లు, చక్కని జేబురుమాళ్ళు, పిన్నులు, కాలిమేజోళ్ళు, ఆడవారి కాలిజోళ్ళు అన్నీ వున్నాయి. రండి! అలా తెల్లబోతారేమి? నేనిక్కడ అమ్మకందార్లలో ఒకణ్ణి!"

"మీకు కార్డు ఒకటి రాశాను అందలేదా?"

"లేదే!"

"రేపు అందుతుందో, మీరు ఇంటికి వెళ్ళగానే అందుతుందో!"

"కృతజ్ఞుణ్ణి"

"ఈ ఉద్యోగం మీకు ఇష్టమేనా?"

"నాకా, ఈ ఉద్యోగమా? ఏ ఉద్యోగమైనా నాకు ఇష్టమే!"

"ప్రయివేటు చెప్పుతామన్నారు? నాకు తెలుగు చెప్పాలండి."

"తెలుగా? ఓ! తెలుగులో నేను రాయప్రోలు సుబ్బారావుగారి అంతవాణ్ణి."

"అందుకనే మిమ్ముల్ని కోరుతూ వుంటా! నెలకు ఏభై రూపాయలిస్తాము. ఆ సంగతే కార్డులో రాశాను."

"సాయంకాలం రావచ్చునా?"

"సాయంకాలంకన్న రాత్రి మంచిది."

"రాత్రిళ్ళు నాకు బస్సు అందదు. అదీ భయం."

"నా కారు వుందిగా?"

"సరేలెండి."

"కృతజ్ఞురాలిని."

## 5

అనంతలక్ష్మి ఇంటికి ఆ మరునాడు ఉదయం తొమ్మిది గంటలకు ఒక పెద్దకారు వచ్చింది. ఆ కారు రూపంలోనూ పెద్ద, గుణంలోనూ పెద్ద! దాని పేరు "రోల్సురాయిస్" ఇంగ్లీషులో ఆ కారుమీద పచ్చయప్ప కళాశాల, ఆంధ్ర విద్యార్థి ఒకడు అందమైన పాట చేశాడు.

*"విత్ దౌ నాయిస్*
*ఇట్ రోల్స్*
*ఎమాంగ్ హెూల్స్*
*అండ్ షోల్స్*
*ది రోల్స్‌రాయిస్"*

ఈ పాట ముఖ్యంగా ఉపయోగింపబడింది ఈ రోల్సురాయిస్‌ని గూర్చే. ఈ రోల్సురాయిస్ కారు శివసంబంధ సుబరిమన్న గణేశమీనాచ్చి చెట్టియారుగారిది. బాగా అర్థం చేసుకునేందుకు ఎస్. ఎస్.ఎస్.జి. మీనాచ్చి చెట్టియార్ అంటారు.

ఆ చెట్టియార్‌కు సినిమా కంపెనీలంటే మహాఇష్టం: సినిమా చిత్రాలంటే అంత ఇష్టంలేదు. అసలు సినిమా చిత్రం చూచి ఆనంద కందళిత స్పందిత మందహాస, అరవింద, తుందిల, బృందారక సుందోపసుందుడవుదా మనికాదు.

అసలు సెట్టియారుగారు ఆశయవాది. స్వప్నానందవాది: ఎస్కేపిస్టుకాదు. అసలయిన సిసలయిన నిఖారసయిన, ప్రత్యక్షవాది, వాస్తవికవాది. "చూచి తెలుసుకో రుచి చూచి తెలుసుకో" అంతేగాని, ఏదో మాయలు, మర్మాలు, ఛాయలు అతనికి పనికిరావు. అతడు సినిమాకు వెళ్ళితే ఏదో అర్థం మాత్రం లేకుండా వెళ్ళడు. వట్టి భావకవిత్వ హృదయం కాదాయనిది: అహంభావవాస్తవికతా హృదయం.

ఎవరినన్నా బాలికను తీసుకువెళ్ళడానికి ఎవరో అందాలు తమ వంటినిండా కుదించుకొన్న మనోహరాంగులు రావచ్చును గనుక వారిని చూడడానికి మాత్రమే అతడు వెడతాడు. దీపాలు ఆరిపోతే బొమ్మని చూడడు. ప్రక్కను కూర్చున్న తనతో వచ్చిన బాలిక మెత్తని చేతులు తన చేతులలోకి తీసుకొని చెక్కుతూ స్పర్శ అనుభవించడం భుజాన్ని భుజం రాయడం, కాలుని కాలుతో తొక్కడం మొదలయిన శృంగార నాయకుని హావ భావ విలాస కేసులన్నీ అక్కడ ప్రయోగించి, వానివల్ల వచ్చిన అనుభవం పరీక్షించి వాటిని హృదయంగమం చేసుకోవడం ఆయన పరమాదర్శము.

సముద్రపు ఒడ్డు సౌందర్యయువతీ విరాజిత శృంగారభూమి. సభలు వివిధ విలాసయుత సుందరీ సందోహిత మందారవనాలు, నాటకాలు విచిత్రమన్మథనర్తిత రంగస్థలాలు. కాబట్టి ఈ ధనపిపాసి వానికి హాజరు. హాజరంటే ఊరికే వట్టిహాజరా? మెళ్ళో సన్నని బంగారు పొడుగాటి గొలుసు. ఆ గొలుసు చివర ఒక పచ్చ ఇరవై వేలుంటుంది. చేతులకు వున్న ఎనిమిది వుంగరాల మదింపు ముప్పదివేల రూకలు. ఆయన బట్టలు పాముకుబుసాలు. ఆయన చేతికర్ర బంగారు తలకట్టు, జాగిలాయి తల. ఆ కుక్కకు కళ్ళు కెంపురాళ్ళు. మూతికడ నీలం, పళ్ళు వజ్రాలు. కర్ర ఆసలైన సిసలైన నిఖారసైన దంతం.

చెట్టియారుగారికి ముప్పది మూడుఏళ్ళ మూడు నెలలు. నిరుడూ అంతే. ముందటేడూ అంతే. అంతకుముందు ముప్పది ఏళ్ళు, వరుసగా అయిదేళ్ళపాటు. అసలైన సిసలైన నిఖారసైన ఆయన ఈడు ఆయన జ్యోతిషం వ్రాద్దామనుకున్న రామస్వామి దీక్షితారుకే తెలుసును.

ఆ చెట్టియారుగారి రోల్స్‌రాయిస్‌కారు వారి ఆవరణలో నిలిచింది. అందులోనుండి దిగకుండా "చిన అమ్మాయిగా రున్నారా?" అని గేటుకీపరును చెట్టియార్‌గారి చ్యాపియర్ అడిగినాడు.

"ఉన్నారు" అని వినాయగంపిళ్ళ జవాబిచ్చాడు. వినాయగంపిళ్ళకు ఈ చెట్టియారును గురించి నిండా పూర్తిగా తెలియును. అసలు వినాయగం పిళ్ళ ఉన్నదే అందుకు వినాయగంపిళ్ళ, కందస్వామి, అరుణాచలం ఈ ముగ్గురూ ఆ ఆవరణలో భార్యలతో బిడ్డలతో కాపురమున్నారు గనుకనే, చెట్టియారుగారు నెమ్మదిగా కారు దిగుతూ నవ్వుతారు, లోపలికి అడుగు పెట్టుతూ నవ్వుతారు, లోని హాలులో సోఫా కుర్చీలో చతికిలబడుతూ నవ్వుతారు.

వినాయగంపిళ్ళ, కందస్వామి మొదలియారు, అరుణాచలం నాయకరు ఒకనాడు సకల దక్షిణాపథ భీములనూ రాజ్యం ఏలారు. ఒకడు కుస్తీలో ఒక్క గామాకుమాత్రం లొస్కు. రెండవ పెద్దమనిషి ముష్టియుద్ధంలో జోలూయికి బొక్కు. మూడవవీరుడు బలప్రదర్శనంలో కోడిరామమూర్తికి మాత్రం కాస్త తగ్గు.

వీరు ముగ్గురూ మన్నారుగుడిలో ఉండే సమయంలో ముగ్గురకూ నెలకు అరవై చొప్పున జీతం యిచ్చి జయలక్ష్మి తనకు రక్షక వీరులుగా కుదుర్చుకొంది. ముగ్గురూ మంచివారు. తమ మల్ల ముష్టి ప్రదర్శనాలు చూపడం పోటీలకు పోవడం బహుమతులు పొందడం. అంతే వారికి తమ యవ్వనపు రోజులలో పని. ఆ దినాల్లో జయలక్ష్మికి ప్రియుడు జమీందారుడు. ఈ ముగ్గురినీ చేరదీసి అనేక విధాల సహాయంచేస్తూ వారి అభివృద్ధికి కారకుడయ్యాడు. అప్పుడే జయలక్ష్మి అంటే వారి ముగ్గురికి ఎంతో గౌరవం

కలిగింది. ఆ జమీందారుడు పోగానే జయలక్ష్మిని అయ్యంగారు పెళ్ళాడినంత పనిచేసి మన్నారుగుడి నుండి మదరాసు తీసుకొని వచ్చినప్పుడు ఆమె కోర్కెపైన ఈ ముగ్గురు వస్తాదులను నెలకు ఎనభై చొప్పున ఒక్కొక్కనికిస్తూ తనతో ఉండండని కోరినది. ఆమె ఆ మూడు కుటుంబాలకూ చేసిన సహాయం అంతా ఇంతా కాదు.

వారి పేరు చెపితే దక్షిణాదిన భయపడని గూండా ఒక్కరైనా లేడు. దొంగలు, రౌడీలు వారి ముప్పురి పేరులలో ఒక్కరిపేరు విన్నా 106 డిగ్రీల మలేరియా జ్వరం పట్టుకుంటుంది. ఇక ముప్పురిపేర్లూ కలిపివింటే టైఫాయిడూ, న్యూమోనియా, మలేరియా, ప్లేగు, కలరా, డిసెంట్రీ, పారాప్లెగియా, మెనింజైటిస్, డిఫ్తీరియా, ఇంసోమ్నియా, గాభరేరియా అన్నీ ఒక్కసారిగా పట్టుకుంటాయి.

చెట్టిగారు వచ్చాడు అని అనంతలక్ష్మి పరిచారిక ఒకర్తె చెప్పింది. ఆ మాట వింది. ఆ బాలిక మండిపోయింది. ఆ కోపాన్న ఆ పరిచారికను అక్కడే ఆపింది. “ఒసే ఎవరు వీడు? ఈ పశువు, ఈ కుక్క, ఈ నక్క, ఈ పంది, ఈ పంది కొక్కు? ఎందుకు? ఎందుకు వస్తాడు మా ఇంటికి? వీడు ఈ గాడిద, ఈ కంచరగాడిద, ఈ కోతి, ఈ ఒరంగ్, ఈ ఒటాంగ్, ఈ ఎలక, ఈ చీమ, ఈ దోమ, ఈ నల్లి, ఈ పిల్లి. నాకు తీరుబడి లేదని చెప్పు పో! వెంటనే వెళ్ళి చెప్పు! వాడు నా ఇంటిలో అడుగుబెడితే నాకు జ్వరం వస్తుంది.”

“అప్పుడే అమ్మగారు మాట్లాడుతున్నారు.”

“మా అమ్మను మామియర్ (అత్తా) అంటాడు. మా అమ్మ వాణ్ణి మరుమగన్ (అల్లుడా) అంటూ పిలుస్తుంది.”

“ఏమి చేయమంటారమ్మా?”

“కారు సిద్ధంచేసి పోర్చి ఆవలగా ఉంచమను. ఈలోగా నువ్వుపోయి. ఆ ఎలుగు బంటితో నేను వస్తున్నానని చెప్పు.”

పదినిమిషాలలో అన్నీ సిద్ధం చేసుకుంది. గబగబ వెళ్ళి కారులో కూర్చుని కారును తిన్నగా ట్రిప్లికేను పోనియ్యమంది.

వీధి గేటు దగ్గరకు ఆ కారు వెళ్ళేసరికి మన చెట్టియారుగారికీ ఆ కారు కళ్ళబడింది. “అమ్మాయి ఎక్కడికో వెడుతోందే?” అని చెట్టియారుగారు జయలక్ష్మితో అన్నాడు.

“అయితే వస్తాను. ఏదో ఇవాళ ఆదివారంకదా, కాస్త అమ్మణితో మాట్లాడవచ్చునని వచ్చాను.” అని చెట్టియారు లేచి గబగబ వచ్చి తన “రోల్సు” కారు ఎక్కినాడు. కారుడ్రైవరుతో “ఆ కారు ఎక్కడికి వెడితే అక్కడికి పో” అని అన్నాడు.

రోల్సు ఉరికింది ముందుకు, గేటుదాటి కుడివైపుకు తిరిగింది. సిద్ధహస్తుడైన డ్రైవరు చేతిలో ఆ కారు జర్రున వేగంగా సాగింది. లజ్ నుంచి రాయపేట హైరోడ్డు కలియికకడకు వచ్చేసరికి ముందు అనంతలక్ష్మి బెంట్లీ కనబడింది. ముందు బెంట్లీ వెనకరోల్సు. ఆ కారును చూచి, ఆ ముందు వెళ్ళేబెంట్లీలోని అమ్మాయిని చూచి, పడిందిరా అంబోతు పడ్డవెనకా లనుకున్నారు. డ్రైవరుకు వెనకాల రోల్సు తరుముకు వస్తున్నవిషయం బీచిలో తెలిసింది. ఆ విషయం అనంతలక్ష్మికి చెప్పాడు. అలాగా! సరే ఈ పైత్యకారిని ఏడిపిద్దాము అని అనుకుని డ్రైవరుతో తిన్నగా ఎడ్వర్డు ఎలియట్సు రోడ్డుకు తిప్పి అక్కడ నుంచి తిన్నగా పోనిచ్చి గోపాలపురంలో ఉన్న తన స్నేహితురాలు ఆలమే అలుంబాన్ తండ్రి హైకోర్టు జడ్జీ పార్థసారధి మొదలియార్‌గారి భవనంలోకి తిన్నగా పొమ్మంది.

ఆ డ్రైవరు వేగంగా బెంట్లీని పోనిచ్చి తిన్నగా హైకోర్టు జడ్జీగారి భవనంలోకి వెళ్ళినాడు.

మన చెట్టిగారు చూచారు, "వేసిందిరా దిట్టమైన ఎత్తు. అయినా మనంవట్టి వాజమ్మలమా, సూద్దుము!" అని తన కారు తిన్నగా లోనికి పోనిచ్చినాడు.

పోర్చిలో ముందు ఆపివున్న బెంట్లీవెనకనే ఈ కారు అపి తను దిగి అక్కడేఉండే చౌకీదారుచే తన విలాసమున్న కార్డు పంపాడు.

## ⑥

జడ్జీగారు లోనికి రావలసిందని కబురు పంపారు చెట్టియారు గారికి.

చెట్టియారుగారు లోనికివెళ్ళి, తాను ఒక గొప్ప నాట్య ప్రదర్శనము ఏర్పాటు చేస్తున్నాననీ, అందువల్ల వచ్చేసొమ్ము యుద్ధనిధికి యివ్వదలచుకొన్నాననీ, ఆ ప్రదర్శనానికి గౌరవనీయులైన జడ్జీగారు అధ్యక్షత వహించాలని కోరాడు.

జడ్జీగారికి ఆనందము కలిగి చెట్టియారుగారి కృషికి మెచ్చుకున్నారు.

తాము తప్పక అధ్యక్షత వహిస్తామని ఒప్పుకున్నారు. ఆ సందర్భంలో అనంతలక్ష్మి సంగీతకచ్చేరి కూడా ఉంటుందన్నారు, చెట్టిగారు. అందుకు తాను ప్రయత్నం చేస్తున్నాడట.

**జడ్జీగారు:** అనంతలక్ష్మి నా మాటంటే ఏదీ తీసివేయదండీ, నేను చెప్పి చూస్తాను.

**చెట్టి:** చిత్తం, ఆ అమ్మాయి సంగీత కచ్చేరి, భోజనంలో మిఠాయి వంటిదండి.

**జడ్జీ:** అవునవును. నేను విన్నాను. నాకు చాలా యిష్టం ఆమె పాటంటే.

**చెట్టి:** ఆ అమ్మాయి కష్టపడి, భరతనాట్య గురువులలో నాయకమణి అయిన గోవిందకృష్ణపిళ్ళ దగ్గిర నాట్యం నేర్చుకుందండి. ఆమె నాట్యం ముందు మన దక్షిణాదిన ఎవరు నిలవగలరండి?

**జడ్జీ:** అలాగా, ఆమె నాట్యం చూడనేలేదు. నాట్యం చేస్తుందనే నాకు తెలియదు!

**చెట్టి:** అయ్యయో! అద్భుతంగా చేస్తుందండి. నేను ఎన్నిసారులో చూచాను. ఎందుకంటే నేను ఆ అమ్మాయిని వివాహం చేసుకోదలచుకున్నానండి. ఆ అమ్మాయి అమ్మగారు అంగీకరించారు.

**జడ్జీ:** అద్భుతం! అనందం! మీ చేయి (కరస్పర్శచేయును) ఈలాంటి వివాహాలు జరిగితేగాని దేశం బాగుపడదండి. ఇక సెలవు.

చెట్టిగారు తన హృదయంమీద అనంతలక్ష్మి వాలినంత అనందంచెంది, నమస్కరించి సెలవుపొంది కారు ఎక్కి, కదలి, వీధిలోకి వెళ్ళి ఆ వీధిచివర ఎవరికోసమో చూస్తున్నట్టు ఆపినాడు. అతనికారు ఉన్న స్థలానికి జడ్జీగారి వీధిగేటు కనబడుతుంది.

అంతలో అనంతలక్ష్మి బెంట్లీకారు అతివేగంగా గేటుదాటి అవలివైపుకు పోసాగింది. వెంటనే చెట్టియారుగారి కారు తరిమింది. ముందు బెంట్లీ, వెనుక రోల్సురాయిస్.

ముందు పావురం వెనుక డేగ, ముందు జింక వెనుక పెద్దపులి, ముందు చిన్నచేప వెనుక సముద్రపు మొసలి.

బెంట్లీ డ్రైవరు ఎన్ని సందులు గొందులు తిప్పాడో ఎన్ని చుట్టుమార్గాలను తీసుకు వెళ్ళాడో చివరకు పన్నెండు గంటలకు బెంట్లీ అనంతలక్ష్మి ఇల్లు చేరింది. అమ్మయ్యా! ఓపికగలవారికే విజయం, పట్టుదల అంటే తనదే పట్టుదల. ఎంత ఎగిరినా పిట్టగూడు

చేరకుండా ఏవాడ పడుతుంది అని అనుకుంటూ చెట్టియార్‌గారు తన కారులో అంత మొగం చేసుకొని, రెండు చెవులవరకు నోరు సాగనవ్వుతూ కారు ఆపి, లోనికివచ్చి "మామియర్! (అత్తా) మామియర్!" అని పిలిచాడు.

జయలక్ష్మి పరుగెత్తుకొని వచ్చింది. "ఓ మరుమగనువా!" (అల్లుడవా) అని అంటూ "మళ్ళీ వచ్చారేమి?" అని ప్రశ్నించింది.

**చెట్టి:** మామియర్, నాకు చాలా పెద్దపని! ఆ పని మనకు, మీకూ నిండా మంచిది. అదిదా నెగ్గుతానో, నెగ్గనో అని భయందా పడితిని మామియర్! మీ అదురుట్టం నా అదురుట్టం పండిందిదా! అది అయింది. ఆ విషయం మీతోదా సెప్పాలి అని వచ్చాను.

**జయ:** సంతోషం! చెప్పు.

**చెట్టి:** ఇప్పుడు ఇంటికిపోను: మీ దగ్గిరదా భోజనం.

**జయ:** అంతకన్న సంతోషం ఎన్న?

జయలక్ష్మి త్వరత్వరగా లోనికిపోయి భోజనం ఏర్పాటులన్నీ చేస్తూంది. చెట్టియారు పిల్లిఅడుగులువేస్తూ అనంతలక్ష్మి గదులలోనికిపోయి చూచాడు. ఆమె అక్కడలేదు. సరే! తల్లిగదులలో ఉండవచ్చును అనుకున్నాడు.

జయలక్ష్మి వంటవారిచేత అన్ని ఏర్పాట్లు చేసి వచ్చి చెట్టియారుగారి దగ్గిర కూచుంది.

**చెట్టి:** మామియర్, యుద్ధంసాగుతోంది. ప్రభుత్వానికి మనం సహాయము చేయాలి.

**జయ:** ప్రభుత్వానికి మనం ఎందుకు? ప్రభుత్వంకన్న భాగ్యవంతు లయినవారు ఎవరు?

**చెట్టి:** ప్రభుత్వం అంటే మనమేగా?

**జయ:** ఏమి మరుమగన్?, అట్లదా మాట్లాడుదువు? మనం ప్రభుత్వం ఎట్లు అవుదుము?

**చెట్టి:** మన మంత్రులుకదా రాజ్యం చేస్తున్నది?

**జయ:** అయితే రాజ్యం చేయించేది తెల్లవాండ్లు కాదా?

**చెట్టి:** అబ్బెబ్బె! ఏమిమాటదా సెపుతావు? అది ఇరవైఏండ్లమాట. మన జస్టిసుపార్టీవారు వచ్చిందే, అప్పుడుదా పెజలే రాజ్యం.

**జయ:** మరుమగన్! మీరు అన్నీ గమ్మత్తుదా అందురు. ఎందరు మంత్రులు వచ్చినా రాజ్యం తెల్లవాండ్లదిదా! జస్టిస్ పార్టీవారు, ఉద్యోగాల పార్టీవారు. బ్రాహ్మణ ద్వేషం మీదదా బతికారు. ఇంతలో కాంగ్రెసు వచ్చింది. ఏమయిపోయినారు జస్టిస్! వీరేం హైకోర్టు జస్టిస్సా!

**చెట్టి:** కాదు మామియర్! బామ్మలు తమ రాజ్యందా స్థాపించిరి. మనందరం వాండ్లకు బుద్ధి చెప్పినాము.

**జయ:** నేను బ్రాహ్మణ స్త్రీని, అయ్యంగారి అమ్మాయిని, అయ్యంగారి భార్యను.

**చెట్టి:** ఆమ! ఆమ! ఆయినా లా ప్రకారం మీరుదా నాన్ బామ్మలు!

**జయ:** లావో, గీవో? అయితే కాంగ్రెసువాండ్లు ఎవరు?

**చెట్టి:** వాండ్లు బామ్మలు!

**జయ:** పటేల్, రాజేంద్రబాబు, సుభాష్, ఆజాద్, గఫూర్ ఖాన్, అసలు కాంగ్రెసుకు మహా నాయకుడు గాంధీజీ బ్రాహ్మణులుకాదే?

**చెట్టి:** వాండ్లంతా బామ్మల బానిసలు.

**జయ:** అయితే కాంగ్రెసు ఎందుకు నెగ్గింది? జస్టిస్‌పార్టీ నామరూపాలు లేకుండా పోయిందిదా?

యింతలో వడ్డనవాడు వచ్చి భోజనానికి రావచ్చునని చెప్పాడు.

జయలక్ష్మి చిన్ననాటినుంచీ మాంసాహారం ఎరగదు. అన్నం ప్రారంభించినప్పటి నుంచీ తండ్రి అయిన అయ్యంగారు శాకాహారమే అలవాటు చేశాడు. తర్వాత జమీందారుని చెట్టబట్టి నప్పుడూ జయలక్ష్మి మాంసాహారం ఎరగదు. ఇంక రంగయ్యంగారికి భార్యఅయిన వెనక అచ్చంగా అయ్యంగారి స్త్రీలా తయారయి ఊరుకుంది. అనంతలక్ష్మి తల్లివలెనే శుద్ధ అయ్యంగారి బాలిక, కాని ఎవరి ఇంట్లోనన్నా భోజనం చేస్తుంది.

చెట్టియారుగారు స్నానాల గదిలోనికి పోయి చేయి కడుక్కొని, సబ్బుతో మొగం కడుక్కొని తువాలుపెట్టి తుడుచుకొని, భోజనాల హాలులోనికి పోయాడు.

అక్కడ పీటా, దానిముందు వెండికంచమూ పెట్టివున్నది.

ఒక్కకంచమూ దాని చుట్టూ నాలుగు వెండి ఆకులూ మూడు వెండిగిన్నెలూ ఉన్నాయి. అన్నింటిలోనూ కూరగాయలు, గిన్నెలలో సాంబారు, మోరుకుళంబు, రసం వున్నాయి.

"ఒక్కకంచమే ఉన్నదే రెండవ కంచమేది?" అని చెట్టియారుగారడిగారు.

"ఎవరికి రెండవ కంచం?"

"మీ అమ్మాయి, అనంతలక్ష్మికి?"

"అనంతలక్ష్మి భోజనం ఇక్కడకాదు."

"ఎక్కడ?"

"జడ్జీగారింట్లో,"

"కారుమీద తిరిగి ఇంటికి వచ్చిందే!"

"అబ్బే, తానక్కడ భోజనం చేస్తున్నాననీ, కారు తిరిగి పంప నక్కరలేదనీ, వాళ్ళ కారుమీదనే వస్తాననీ కబురు పంపుతూ వట్టికారు తిరిగి పంపేసింది."

"ఏమిటీ!" తల తిరిగినంతపని అయింది చెట్టియారుగారికి.

## తృతీయ పథం

# సందుగొందులు

చెన్నపట్నం సందులు వేనకువేలు. పాత చెన్నపట్నమైన జార్జిటౌనుకు పూర్వం పేరు బ్లాక్‌టౌను. ఈ జార్జిటౌనులో ఒక వీధి పొరపాటు నన్నా వెడల్పు ఉండదలచుకోలేదు.

ఆ వీధులలోకల్లా మహా వెడల్పయిన వీధీ 'బ్రాడ్‌వే' బ్రాడ్‌వే అంటే వెడల్పుదారి అని అర్థం. ఇక దాని వెడల్పంటారా పదిగజాలు. అలాంటి వీధిలో మేడమీద మేడ, ఇంటిమీద ఇల్లు, బజారుమీద బజారు, షాపుమీద షాపు, హొటలుమీద హొటలు, వెత్తలపాకు కొట్టుమీద కొట్టు, ఎప్పుడూ ఒక కుంభమేళాలా ఉంటుంది.

వీధులపేర్లన్నీ లక్ష్మీదేవి నాట్యంచేసే పేర్లు. ఒకటి టంకశాలవీధి, ఒకటి ముత్యాలవర్తక వీధి, ఒకటి పగడాల బేరగానివీధి, లింగసెట్టి, తంబుసెట్టి, ఎఱ్ఱు బాలసెట్టి వగైరా సెట్టుల వీధులు. గిడ్డంగివీధి, చీనాబజారు, ఆవల ఒకటే ధనపూర్ణాలైనవి.

కాని ఇంతవరకు మదరాసు వర్తకాన్ని రాజ్యంచేసిన ఆంధ్రశేష్ఠులు నానాటికి తీసికట్టు నాగంభొట్లు అయిపోయారు. మారువాడీలు, గుజరాతీ శ్రేష్టులు, బొంబాయి భోజాలు మదరాసు వర్తకం అంతా గుంజు కొన్నారు. ఆంధ్ర చెట్టియార్లు, బంగారు గొలుసు, వజ్రాల తమ్మంట్లు వేసికొని చిన్నచిన్న కాగితాలకొట్లు, గుడ్డలకొట్లు పెట్టుకుంటున్నారు.

కాఫీ హెూటళ్ళలో కూడా అరవయ్యర్ల ప్రభావం తగ్గిపోయింది. ఉడిపివారి సామ్రాజ్యాలు స్థాపితమైపోయాయి. తమలపాకుల దుకాణాలలోంచి పిళ్ళలు, మొదలియార్లు మాయమై, మలబారు నాయర్లు నిండిపోయారు. పండులా ఉంటారు, మెండుగా స్నానం చేస్తారు, దండిగా విభూతిపెట్టారు, నిండా అందంగా ఉంటారు వారూ వారి ఆడవారూ.

ఇవన్నీ మా కోనంగి చూస్తూ మదరాసు ఎస్ప్లనేడు తిరుగుతున్నాడు. అతని ఆనందం పోదు, ఆశ వదలదు, హాసం మాయమవదు. ఇన్ని చదరపు మైళ్ళ మదరాసులో తనకు ఉద్యోగమే దొరకదా? పోతే వైటువే కంపెనీ ఉద్యోగం పోయిందిగాక. ఆ పోవడమూ ఊరికేపోయిందా? కోనంగిగారి అతి ఉత్సాహమే అతని ఉద్యోగానికి షష్టాష్టకమైంది. తీన్‌తేరా అయింది, ఆర్ అఠారా అయింది.

వై ట్‌వే కంపెనీలో ఉద్యోగంచేసే అందరితోనూ కోనంగిరావు అయిదు రోజులలో స్నేహంచేశాడు. కొందర్ని "హల్లో జార్జి" అంటాడు; "ఏమిటి బ్రదర్" అంటాడు. కొందర్ని "ఎన్నా సమచారం స్నేహిదన్" అని అంటాడు: మరికొందర్ని "వెల్ మైడియర్! ఎలా వుంది వ్యాపారము?" అని ఇంగ్లీషులో పలుకరిస్తాడు ఆంగ్లో ఇండియన్ బాలికల్ని. అందులో 'సారా' అనే ద్రాక్షసారాయవంటి అందమయిన బాలిక ఉంది.

కోనంగిరావు ఆ బాలికతో మంచి సహవాసం చేశాడు. ఈ జాతి ఆశయం ఏమిటి? ఈ బాలికల ఆలోచన లేమిటి? వీరికి స్త్రీ పురుష పరమ ధర్మమైన ఆలోచనలుతప్ప ఇంక ఏమీ ఉండవంటారు. నిజమా? అని తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. స్నేహం విషయంలో కోనంగికి అందరూ ఒకటే. అందరూ ప్రాణస్నేహితులే. మనస్సులో ఏమన్నా దురుద్దేశాలుంటేనా?

సారా చాలా అందంగా ఉంటుంది. కొంచెం పొడుగరే! ఎత్తుమడమల జోడుతో ఒక అంగుళం తగ్గుగా కోనంగితో సమానంగా ఉంటుంది. కోనంగే సమోన్నతం కలవాడు. అంటే అయిదడుగుల ఏడంగుళాలవాడు. పెద్ద బలమైనవాడు కాదు. కండపుష్టి సామాన్యం. కనుముక్కుతీరు సామాన్యం. కాని అతని ఆనందం అతనికి ఏదో అందం నమకూరుస్తుంది.

ఒక పుట్టెడు వ్యక్తిత్వంకల మనిషి. కొత్తలేదు, నదురు బెదురు లేదు, తొణుకు బెణుకు లేదు.

సారాకు మొదటనుంచి కోనంగి అంటే ఎంతో గౌరవం కలిగింది. అపేక్ష పుట్టింది, గాఢస్నేహం చెయ్యాలనీ వాంఛ ఉద్భవించింది. రోజూ ఇద్దరూ మాట్లాడుకుంటూ పోయేవారు. రెండు మూడుసార్లు సారా కోనంగిని తనింటికి పిలిచింది. కోనంగి మాటలకు పకపక నవ్వేది. కోనంగిని భుజాలు పట్టి కదిపివేస్తూ నవ్వేది.

ఎవ్వరితోనూ ఎప్పుడూ మాట్టాడదు. తనమీద తనకు గౌరవమూ, ఒక విధమైన బిడియమూ సారాను ప్రత్యేక భౌతికను ఒనరించాయి. అలాంటి ఆ బాలిక కోనంగి అంటే ఒక్కసారిగా పుష్పంలా విరిసిపోయింది, అతనితో కంపెనీ పరిసరాలలో ముభావంగా ఉన్నా, అది దాటిన వెంటనే, చెల్లెలుకన్న ఎక్కువగా చనువు చూపించసాగింది. కోనంగి

ప్రపంచంలో ఉన్న అన్ని విషయాలమీద ఉపన్యాసాలు, అంగన్యాస, కరన్యాస, నాశికన్యాస, లోచనన్యాస పూర్వకంగా కుంభవృష్టి కురిపించేవాడు. వారి సంభాషణాలు ఎక్కువగా సినీమాలమీద విరుచుకుపడేవి. విరుచుకుపడడం అంటే పెళ్ళున విరుచు పడడమే.

**కోనంగి:** అబ్బ! ఏమిటమ్మా ఆ పిగ్మలియాను, ఏమిచిత్రమండి!

**సారా:** ఏమిటయ్యా అందులో ఉండే అందం!

**కోనంగి:** ఓ వెఱ్ఱి అమ్మాయి! ఏమి నంగనాచిలా మాట్లాడుతున్నావే!

**సారా:** ఏమిటి నా నంగనాచితనం? ఆ అమ్మాయి వేషం వేసినతార, ఇదివరకే అతి తెలివిగల తార! అందుకని ఆ బొమ్మలో నిజమైన భావంలేదు.

**కోనంగి:** లేకపోతే నిజమైన చేపలబజారు .మనిషిని తీసుకవచ్చి, మహారాణిలా తయారు చేయమన్నావా సినీమా కంపెనీవాణ్ణి? దివాలాతీసి ఊరుకుంటాడు.

**సారా:** ఆ అమ్మాయిని, ఆ ప్రసిద్ధ విద్యావేత్త ఆరునెలలలో నాగరిక బాలిక క్రింద తయారుచేస్తానన్నాడా లేదా?

**కోనంగి:** అవును. నేనయితే ఆరురోజులలో తయారుచేస్తానందును!

**సారా:** తయారు చేయగలిగి ఉందువా?

**కోనంగి:** ఓ! నిన్ను మాంచి తెలుగు అమ్మాయిగా తయారుచేసి ఉందును.

**సారా:** ఎన్నేళ్ళకు?

**కోనంగి:** పదిహేనేళ్ళకు.

**సారా:** ఆరురోజు లన్నావే!

**కోనంగి:** పదిహేనేళ్ళ బంగారు బొమ్మని అని నా ఉద్దేశం.

**సారా:** పదిహేనేళ్ళ బంగారు బొమ్మని, వెండిబొమ్మగానా, వజ్రపు బొమ్మగానా?

**కోనంగి:** ప్లాటినంబొమ్మగా!

**సారా:** ఆ పిల్ల నిన్ను మోహించి ఊరుకుంటుంది.

**కోనంగి:** నేను ఒప్పుకొని ఊరుకుంటాను.

**సారా:** అయితే నన్ను తయారుచేయి!

**కోనంగి:** మా భాషలో సారా అంటే మత్తురసం. నిన్ను సారా నల్లా ద్రాక్షసారాగా చేయగలను

**సారా:** ఏదీ, చేయి పందెం వేద్దాము!

**కోనంగి:** ఆమ్మో! సారా తాగేవాళ్ళకి మత్తువచ్చినట్టు, నిన్ను తయారుచేస్తుంటే నేను మత్తువచ్చి పడిపోతే!

**సారా:** బెర్నార్డుషా ఓడినట్లే!

కోనంగి సారా ఇంట్లో టీ త్రాగి తన నెల్లూరి హెూటలుకు చేరాడు.

ఓ లక్ష్మివారం కాసినోలో మంచి ఆంగ్ల నాట్యచిత్రం వచ్చింది. డాన్ ఆమెచీ, కార్మెన్ మిరాండాలు నటిస్తున్నారు. బుధవారంరోజు సాయంకాలం కోనంగిని తనతో ఆ చిత్రం చూడడనికి రమ్మని సారాకన్య కోరింది. రాత్రి 9-30 గంటల ప్రదర్శనానికి వెడదామంది. జార్జిటౌనులో ఉన్న తనింటికి తొమ్మిదింటికి వస్తే ఇద్దరూ కలిసి కాసినోకు రావడం అని నిర్ణయించు కున్నారు.

## 2

కాసినోకు అయిదురూపాయలు ఖర్చుపెట్టి టాక్సీమీద తీసుకు వచ్చాడు సారాను కోనంగేశ్వరరావు. సారా ఘుమఘుమలాడుతూ వచ్చికూచుంది కారు వెనక సీటులో. తాను సారాకై తలుపు తెరచి ఉంచి నందున తానున్నూ లోపలికి పోయి తలుపు వేసుకొని కారు పొమ్మన్నాడు.

ఈ పాశ్చాత్య ఆచారాలన్నీ కోనంగి సినీమాలు చూచి నేర్చుకున్నాడు. ఆ రోజున తెల్లకోటు వేసికొని సాయంకాలపు టోపీ పెట్టుకొని కోనంగి కొంచెం పెద్దరికపు యూరోపియను యువకునిలా తయారై ఉన్నాడు. తాను సాయంకాలమే అయిదురూపాయల టిక్కట్లు రెండు కొని ఉంచాడు. అందుచేత ఒక ఇంగ్లీషు లార్డు ఒక ఇంగ్లీషు డచ్చెసును తీసుకువెళ్ళినట్లు సారా తనచేతిపై చేయివేసి యుండగా నెమ్మదిగా తమ నియమిత స్థలానికి తీసుకువెళ్ళినాడు. అక్కడ దారి చూపించేవాడు వినయముతో దారి చూపించాడు.

బాక్సు, డ్రెస్ సర్కిలు మొదటి తరగతి మేడమీద ఉంటాయి. అక్కడ ఆ సమయంలో ఇంగ్లీషు వర్తకులు, ఇద్దరు ముగ్గురు ప్రభుత్వ కార్యదర్శులు, సేనానాయకవర్గంవారు, ఇంగ్లీషు వర్తకుల భార్యలు, బిడ్డలు ప్రభుత్వకార్యదర్శుల భార్యలు, బిడ్డలు తళతళలాడుతూ నిండి ఉన్నారు. అందులోకల్లా కోనంగీ, సారా ఇద్దరూ రాజకుమారుడు రాజకుమారికలా ఉన్నారు. సారా ఉప్పొంగిపోయింది.

ఎవరో ఒక ఇంగ్లీషు పెద్దమనిషి కోనంగిని చూచి ఇతడొక జమీందారుని కొమరుడు అని ప్రక్కన ఇంగ్లీషు మనిషితో అన్నాడు.

"ఏవూరు జమీందారుని రాజకుమారుడు?"

"ఏదో జ్ఞాపకంలేదు."

"ఓహో అలాగా?"

"అవును."

"అతని పక్క బాలిక ఎవరు?"

"ఆవిడ ఆతని భార్య. ఒక ఫ్రెంచిబాలిక. నేను మన మెయిల్ పత్రికలో వెనక చూచినట్లు జ్ఞాపకం."

ఈ ముక్కలు కోనంగి విన్నాడు. తాను రాకుమారుడే. బందరు గొడుగు పేటకు తాను రాజకుమార్ కాడా! అవును. ఇంతట్లో చాకలేట్లూ ఆవి పట్టుకొని ఒక "బోయి" వచ్చివంగి వినయంతో చాకలేట్లు, సిగరెట్లు వగైరా పళ్ళెం వీరిరువురూ కూర్చున్న ఆ చక్కని సోఫాముందు పట్టుకొన్నాడు.

కోనంగి చిరునవ్వుతో సారావైపు చూచి "ప్రియతమా! నువ్వు అంబరెల్లాపేట్ రాజకుమారివయ్యు నాలుగు మంచి చాకలేట్లు పుచ్చుకోవే?" అని ప్రశ్నించాడు.

సారా నవ్వుతూ మంచి చాకలేట్లు రెండు పుచ్చుకొంది. ఆందుకు ఆయన అయిదురూపాయలూ ఇస్తూ ఒక పావలా వాడికి బహుమానం ఇచ్చాడు. వాడు పదిసలాములు పెట్టి వెళ్ళిపోయినాడు.

వాడు "అంబరెల్లాపేట రాజకుమారికవు కావా?" అని కోనంగి సారాతో అన్నముక్కలు విన్నాడు. కనక నెమ్మదిగా అక్కడ ఉన్న పరిచారకులతో చెప్పాడు. అది వెన్నెల పాకినట్లు అక్కడ వున్న జనం అందరిలో పాకింది.

ఈ వార్త రెండురూపాయలన్నర మొదటి తరగతిలో కూర్చున్న వైట్‌వే కంపెనీ మేనేజరుగారికి తెలిసింది.

ఆ మేనేజరు స్టూఅర్టుగారు తన దగ్గిర తాబేదారుడైన కోనంగిని సారాను అప్పుడే ఆనవాలుపట్టి పళ్ళు బిగించి ఉన్నాడు. కోనంగి అంబరెల్లా పేట రాజకుమార్ అని తనకు తెలిసిందికాదే! అని అనుకున్నాడు ఆశ్చర్యపడుతూ. దీపాలు ఆరిపోయి చిత్రదర్శనం అయినప్పుడల్లా సారా కోనంగి దగ్గిరగా ఒదిగిపోయేది. అతని చెంప ఒత్తుకునేది. అతని చేయి తన నడుము చుట్టూ తిప్పుకునేది. అతనిచేయి తనగుండెలకు అదుముకునేది.

కోనంగి రక్తం పరవళ్ళెత్తింది. అతనిగుండె పంజాబ్ మెయిల్ వేగం తాల్చింది. నెమ్మదిగా సారాను దగ్గిరకు తీసుకొని కోనంగి ఆమె పెదవులను అస్పష్టంగా స్పృశించాడు. బొమ్మలో ప్రేమదృశ్యమూ, కౌగిలింతలూ చుంబనాలూ వచ్చినప్పుడు వీరిద్దరూ జల్ జల్ మనేవారు.

చిత్రం ఎలా పూర్తిఅయిందో అయింది. సారాయున్నూ కోనంగిన్నీ టాక్సీ ఒకటి పిలిచి అందులో ఎక్కబోయే సమయంలో స్టూఅర్టుగారు వీరికి కనిపించాడు. సారా అస్పష్ట వాక్యాలతో "కొంపలు మునిగినాయి కోన్!" అని అన్నది.

ఇద్దరూ కారులోకి దూకారు. కారు సాగింది. కొంతదూరం పోగానే సారా కోనంగిని గట్టిగా కౌగలించుకొని అతని మోమంతా ముద్దులు కురిపించింది.

కోనంగి అతిపురుషుడై సారాను నలిపివేశాడు. అతడు ఇంతవరకు యాదాలాపంగా స్త్రీలను స్పృశించడమే కాని, ఈ రీతిగా కాంక్షతో, గాఢతమితో తన కౌగిలిలో అదిమివేయడం ఎరగడు.

మాంచి ఘాటుఎక్కిన చాంపేను ద్రాక్షసారాయి త్రాగినవారులా వారిద్దరూ సారా ఇల్లు చేరారు, సారా తనలో ఉప్పెనలా విరుచుకు పడుతూ ఉన్న కామకాంక్షతో కోనంగిని తీగలా అల్లుకుపోయి, "ఈ రాత్రి ఇక్కడ ఉండిపో కోనంగీ.!" అంది.

కోనంగి ఘట్టిగా సారాను తన హృదయానికి అదుముకొని ముద్దులు కురిపించి ఆమెను వదిలి, అక్కడ వున్న కుర్చీపై కూర్చుండబెట్టి దగ్గుత్తికలు మ్రింగి, తలవూపి ఇటూ అటూ తిరిగి అక్కడ వున్న గ్లాసుతో కూజాలోని మంచినీళ్ళు త్రాగి, సారా ఎదుటకు వచ్చి నిలుచుండినాడు.

"సారా! నాకు ఒళ్ళు వేడెక్కి ఉన్నమాట నిశ్చయం! కాని, నేను... పెళ్ళి... లేకుండా... స్త్రీలతో... స్త్రీపురుష సంబంధం... పెట్టుకోలేను."

"అలాగా, కోన్!"

కోనంగి సారా తలపట్టి నుదురు చుంబించి, ఆమె మేడమెట్లు దిగి జర జర నడుచుకుంటూ వెళ్ళిపోయినాడు. అతని వెనక నెమ్మదిగా ఒక కారు కొంతదూరం సాగి వెనక్కు తిరిగి సారా యింటికడకు పోయి ఆగింది.

కోనంగి నడిచి, నడిచి, అనంతమైన ఆలోచనలు మెదడులో సుడిగుండాలు, సుడిగాలులు తిరిగిపోతూ ఉండగా నడిచిపోయాడు.

తానూ అచ్చంగా ఆంధ్రుడే. ఒక వరూధిని వచ్చి "ఓ సుందరకోనంగీ కుమారా! నాతో మన్మథసామ్రాజ్యవు చక్రవర్తివై ఏలుదువు రమ్ము. నా హృదయమున వ్రాలుము! ఈ అతనుడు కోయని ఆర్చి పుంఖాను పుంఖములుగ తన నిశిత కుసుమసాయకముల పరచి నా హృదయమును తూటుపడ వేయుచున్నాడు. హా రక్షింపుము!" అని విరహతాపాన

కుంగుతూ ప్రార్థిస్తే, "నా ఇంటికి దారిచూపో!" అని ఏడుస్తూ కూర్చున్నాడు ఆంధ్రప్రవరాఖ్యుడు.

అలాగే తానూ! సారా అందాల వయ్యారాల కులుకుమిటారి. అలాంటి బాలిక "రారా నా సామీ!" అని కోరింది. తాను వట్టి వాజమ్మ కాబట్టి చేతులు రెండూ అడ్డంబెట్టి పారిపోయి వచ్చేశాడు.

స్త్రీ సంపర్కం ఏదో ఆనందంగా ఉంటుందని ఊహ. ఆ ఊహమాత్రాన దేహం అంతా వేడెక్కి ఝల్లుమనిపోవడం కళ్ళు మత్తు లెక్కడం!

ఏమిటి యీ పశుత్వం. స్త్రీపురుష సంబంధంతప్ప ప్రపంచంలో ఇతర సమస్యలు లేవా? తిండి సమస్యా, స్త్రీ సమస్యా?

కుటుంబప్రేమ, జాతిప్రేమ, మానవప్రేమ ఒహో ఎంత మధురంగా ఉంటాయి! బీదవాళ్ళే లోకం అంతా! బీదవాళ్ళు ఎక్కడ చూచినా!

జీర్ణమై కుళ్ళిపోయిన గుడ్డలు, చివికిన హృదయాలూ, ఆశలూ, ఆశయాలూ.

కుష్ఠురోగంతో సింహమొగమై, పెదవులు వాచి, కళ్ళు మోరడించి, ఒళ్ళు నూనెక్కి పళ్ళు ఊడి, పుళ్ళ దుర్గంధంతో, వీధిలో పారవేసిన ఆకులో మిగిలినదే అమృతమని తింటూ బస్సుల దగ్గిర, బజార్లలో, రైళ్ళలో, తిరునాళ్ళలో ఉత్సవాలలో కాకులలా, ఈగలలా ముసిరే తిండిలేని, ఎండి పోయిన మండిపోయిన జీవితాలుగల, బీద దరిద్ర శుష్కజీవిత జనం ఎన్ని లక్షలూ, కోట్లూ!

తానా కోట్లూ, సూట్లూ, అయిదు రూపాయల టిక్కట్లు, టాక్సీలు, ఇంక తనకోసం కొన్న బట్టలూ వగైరాలు, జేబులో ఉన్న అయిదు రూపాయలు చిల్లర ఇవీ.

తనదేశం కుళ్ళుదేశం. తనతోటి మనుష్యులు దుర్వాసన బ్రతుకుల వాళ్ళు. లోకంలో ఇతరులపై జాలి పొందేవాళ్ళు దేవతలు. ఆ సీతాదేవి జాలి చూపించింది. హెూటలు యజమాని సుబ్బరామయ్య, తమలపాకుకిళ్ళీ దుకాణదారు రామన్ నాయరు, సారా, అనంతలక్ష్మి అందరూ దేవతలు.

ఇంతలో ఆ పన్నెండున్నర గంటల వేళలో మౌంట్ రోడ్డు ప్రవేశించిన తన్నుద్దేశించి కూయం వంతెనమీద నడిచి వెళ్లే ఒక కుంటి ముసలిది "అయ్యా! సామీ! ఒక పైస!" అని అడిగింది. కోనంగి తన జేబులోఉన్న అయిదు రూపాయల చిల్లర ఆమె చేతిలో పోశాడు. వెనక్కు చూడకుండా హెూటలు గదికి ఒంటిగంటన్నరకు చేరి పండుకొన్నాడు. చిరునవ్వుతో నిదురపోయాడు.

తెల్లవారి లేచి స్నాన భోజనాదికాలు ముగించి, హెూటలు యజమాని దగ్గర నాల్గణాలు బదులు పుచ్చుకొని, వైటువే కంపెనీకి పోయాడు.

వెళ్ళగానే మేనేజరు తన ఆఫీసు గదిలోనికి పిలిచి "కోనంగిరావుగారూ, మీరు మా కంపెనీకి చేసిన సేవ ఎప్పుడూ మరచిపోము. కాని ఇవాళ నుంచి మీ ఉద్యోగం మాకు అక్కరలేదని కంపెనీవారు నిర్ణయించారు. ఈవారం అఖరువరకూ మీకు ముప్పైరూపాయలూ మా కృతజ్ఞతకు ఈఇరవైయిన్నీ మంజూరుచేశారు. మీకు కంపెనీవారిచ్చిన ఉత్తమ చరిత్రాపత్రం ఇదిగో" అని చెప్పినాడు. కోనంగిరావు అన్నీ పుచ్చుకొని అమ్మయ్యా అని బయటపడినాడు.

## 3

చిరునవ్వుతో కోనంగి అందరి స్నేహితుల దగ్గిరా సెలవు పుచ్చుకొంటూ సారా దగ్గరకు వచ్చి "నిన్న రాత్రి నేను నీ హృదయానికి కలుగజేసిన బాధకు క్షమించు సారా! నేను వట్టి పిరికివాణ్ణి! చెప్పానుగా అదృష్టాన్ని కూడా కాలదన్ను కొనే కళ్ళు మూతగాణ్ణి. నీ ఉత్తమ హృదయం.... అని చెప్పబోతుంటే సారా అడ్డంవచ్చి "కోనంగీ, నువ్వు రేపు శనివారం సాయంకాలం నాలుగు గంటలకు మా యింటికి రా. నీతో మాట్లాడవలసిన విషయాలు చాలా ఉన్నాయి ఇక వెళ్ళు..." అని సెలవు తీసుకొని తన పనిలో తాను మునిగింది.

కోనంగి నవ్వుతో వెళ్ళిపోయాడు. గదికి వెళ్ళడమెందుకని ఆ మిట్టమధ్యాహ్నం ఏమి బుద్ధి పుట్టిందో తిన్నగా గుజరాత్ హోటలుకుపోయి, దానికి మేనేజరయిన కిషన్‌చంద్ బాలక్‌రాంగారిని కలుసుకొన్నాడు. హోటల్ గుజరాత్ బ్రాడ్వేలో ఉంది. అతిథులకు సమస్త సదుపాయాలూ చేయడంలో ఆ హోటలు మదరాసులోకెల్లా మంచిదని పేరు పొందింది.

హోటల్ గుజరాత్ మేనేజరు కొంచెం గాంధీతత్వవాది. కాంగ్రెసు అంటే విపరీతమైన మంచి అభిప్రాయం. మహాత్ముడు శ్రీకృష్ణావతారమని అతని నమ్మకం.

కోనంగి ఆయన్ను కలుసుకొని "అయ్యా నేను బి.ఏ. మొదటి తరగతిలో నెగ్గాను. ఇప్పుడే యుద్ధ సంబంధమైన పరిశ్రమలెన్నో ప్రారంభమయ్యాయి. కాని ఎందుచేతనో నా మనస్సు ఉద్యోగాలమీదకు పోవటం లేదు. అవి తప్పనీ, ఒప్పనీ వాదించేటంత సాహసమూలేదు. నాకు ఇష్టమూ లేదు. నాకు మాత్రం ఆ ఉద్యోగాలమీదకు ససేమిరా బుద్ధిపోవటంలేదు. ప్రస్తుతం జర్మనీవాడు వస్తేమాత్రం వాణ్ణి ఆ ముందు క్రాఫింగు పిలకపట్టి జాడించి వదులుతాను. అవన్నీ అల్లా ఉంచి నాకు మాత్రం మీహోటల్లో ఏదైనా ఒక ఉద్యోగం ఇప్పించాలి" అని మనవి చేశాడు.

"నా దగ్గర బి.ఏ. లకు ఏమీ ఉద్యోగాలు లేవయ్యా!"

"నన్ను బి.ఏ.గా గణించకుండా ఉద్యోగం ఇప్పించండి. బి.ఏ. డిగ్రీ నాకు ఏదైనా ఉద్యోగం ఇప్పించేందుకే!"

"నాకు దక్షిణాది బాలకులు బల్లల దగ్గిర తినుబండారాలు అందించేందుకు ఉన్నారు. ఉడిపివారు ఆర్గురూ, ముగ్గురు గుజరాతీ బ్రాహ్మణులూ ఉన్నారు. లెక్కలకు మా సేట్ బాలకులు ఇద్దరున్నారు."

"నేను బల్ల దగ్గిర అందించకూడదా?"

"సరే ఉండు. మొదట ఆరు రూపాయలకన్నా ఎక్కువ జీతం ఇవ్వలేను. తిండి రెండుపూటలా, ఉదయం ఒక కారమూ, కాఫీ. సాయం కాలం ఒక తీపీ, ఒక కారమూ, కాఫీయున్నూ ఇస్తాము."

"అంతకన్న భాగ్యం ఏముంది?"

"తక్కిన బాలకులకు ఇరవై, ఇరవై అయిదూ, ముప్ఫైరూపాయలు ఇస్తున్నాను."

"కావచ్చు. మీ సంస్థలో వాళ్ళు ఉపయోగించినట్లు నేను ఉపయోగించలేను అయినా నాకు అయిదారు రకాల తెలుగుకూరలు, ఎనిమిదిరకాల తెలుగు పచ్చళ్ళు, మూడురకాల తెలుగు పులుసులు చేతనవును. ఎప్పుడైనా చాలా ఆవసరమయితే నన్ను మీరు ఉపయోగించ వచ్చును.

ఆ మర్నాడునుంచి కోనంగి వచ్చి పనిలో చేరడం నిశ్చయమైంది. వెంటనే తన నెల్లూరు హోటలు యజమాని దగ్గరకుపోయి, తనకు పది పదిహేను రోజులు ఇంటి దగ్గర అర్జెంటుపని ఉంది వెళ్ళివస్తానని చెప్పి, ఒక తోలుపెట్టె, రెండుకోట్లు, నాలుగు షర్టులు, రెండు లాగులు, రెండు పంచెలు, రెండు తువ్వాళ్ళు వగైరాలూ, పరుపూ పక్కసర్దుకొని, రాత్రి సామాను పుచ్చుకొని హోటల్ గుజరాత్‌కు చేరుకున్నాడు.

ఆ మర్నాడు ఆ హోటలు వడ్డనవారల దుస్తులు ధరించి, పెద్ద వడ్డనదారు తనకు బోధించిన విధానాలు మనస్సుకు హత్తించుకొని తన పనిలో చేరాడు.

మొదటే హోటలు మేనేజరుతో తన కా శనివారం మూడు గంటల నుండి సెలవు కావాలనీ, తన స్వంతపని ఉందనీ చెప్పినాడు. మేనేజరు సరే అని ఒప్పుకున్నాడు.

మూడు గంటలన్నరకు సారా ఇంటికి కోనంగి వెళ్ళినాడు. సారా అతన్ని సగౌరవంగా తీసుకువెళ్ళి తన స్వంత గదిలో కూర్చోబెట్టింది. వాళ్ళ అమ్మా, నాన్నా, చెల్లెళ్ళు, తమ్ముళ్ళూ అందరూ సినీమాకు పోయారు.

అతనికి మంచి కాఫీ తయారుచేసి కేక్, కాఫీలు ఇచ్చింది. కోనంగీ సారా ఇద్దరూ ఉపహారం అయిన తర్వాత సిగరెట్లు తాగుతూ ఇద్దరూ కబుర్లు చెప్పుకోటం ప్రారంభించారు.

**సారా:** కోన్, నిన్ను చూస్తే ఎందుకో నాకు అపరిమితమైన ప్రేమ కలిగింది. ప్రేమ అంటే, కవులు వర్ణించిన ప్రేమో కాదో నాకు తెలియదు.

**కోనంగి:** (గుండెల్లో బేజారయ్యాడు.) తప్పకుండా ఏ కవినైనా అడిగి తీరవలసిందే ఆ విషయం. లేకపోతే అయిదారు రకాల కవులను అడగాలి. ఒకరు శ్రీపాద కృష్ణమూర్తిగారు, పూర్వకవుల ఆఖరుకాపు. తర్వాత రాయప్రోలు సుబ్బారావుగారు. నవ్య కవుల ప్రథమ సంతానం. ఆ తర్వాత శ్రీశ్రీ నవ్యకవిత్వంలో వంకరకొమ్మ. ఆ తర్వాత గోపీ చందు, ఎక్కడా విత్తుకు పుట్టని ఆర్చిడ్ కవిత్వం. ఆ తర్వాత విద్వాన్ విశ్వం, అభ్యుదయ పరంపరాభివృద్ధిరస్తే కవి. ఇంకా అదోరకం వాళ్ళలో చిన్ని చిన్ని చిన్నారి వాళ్ళందరినీ జమకడదాం!

**సారా:** ఏమిటి పిచ్చి సంభాషణ? ఇది విను. నాకూ మన కంపెనీ మేనేజరుకూ అసలైన స్త్రీ పురుష సంబంధం ఉన్నది.

**కోనంగి:** (తెల్లబోతూ) అదా రహస్యం? మొన్న రాత్రి సినిమా దగ్గర మనిద్దర్నీ చూచాడు.

**సారా:** అందుకనే మీ ఉద్యోగం పోయింది. కోన్, నువ్వు కంపెనీలో చేరినప్పటినుంచే నువ్వంటే ఏదో ఆపేక్ష కలిగింది. నీ స్నేహం తప్ప వేరే దురుద్దేశం నాకు అప్పటికీ ఇప్పటికీ లేదు.

**కోనంగి:** ఆంగ్లో ఇండియన్‌లు భారతీయులంటే ఎక్కువ చనువు తీసుకోరు. అందుకని నువ్వు నాతో స్నేహంగా ఉండడం నాకూ ఆశ్చర్యము కలుగజేసింది, ఎంతో అనందమూ అయింది.

**సారా:** ఔను కోన్. మా ఆంగ్లో ఇండియన్‌లు రెంటికీ చెడిన రేవడివంటివారు. భారతీయులమై భారతీయులం కాము అనుకుంటాము. ఇంగ్లీషు వాళ్ళము అవుతామని ఆశించి ఏనాటికీ వాళ్ళం కాలేము.

**కోనంగి:** మరి నీకు నేనంటే స్నేహం చెయ్యాలని బుద్ధిఎలా కలిగింది? మొదటి నుంచీ మీవాళ్ళు మన జాతీయోద్యమాల్లో ఏమీ పాలు పుచ్చుకోవడంలేదే?

**సారా:** మొదటి నుంచీ ఏమీ పాలుపోక పాలు పుచ్చుకోలేదు.

**కోనంగి:** మీకు వివాహం చేసుకోవాలని బుద్ధి పుట్టలేదా? మీకు మన మేనేజరంట గాఢమైన ప్రేమా?

**సారా:** ప్రేమో గీమో నాకు ఏమీ తెలియదని చెప్పానుగా? మావర్గంలో స్త్రీ పురుష సంబంధాలలో కొంచెం కట్టుబాట్ల మరలు వొదులుగానే ఉంటాయి.

**కోనంగి:** ఒక్కొక్కప్పుడు ఊడిపోతూనే ఉంటాయి ఆ మరలు.

**సారా:** మా జాతికి వెనకటి చరిత్రా అంత గర్వించతగిందికాదు. ముందు చరిత్రనన్నా బాగుచేసుకుందామన్న వేడీ కలగడంలేదు.

**కోనంగి:** జాతికి వేడి మాటేమోగాని మీ జాతి ఆడవాళ్ళు దగ్గర కొచ్చిన మొగవానికి మాత్రం నూట ముప్ఫై మూడు డిగ్రీల వేడి పుట్టిస్తారు.

**సారా:** నీ మాటకేంగాని మొన్నరాత్రి నువ్వు వెళ్ళీ వెళ్ళడంతోనే మేనేజరు స్టూవర్టు తుపానులా వచ్చిపడ్డాడు. నేను మండిపోయాను. ఇద్దరం అతి ఖారమైన మాటలనుకున్నాం.

**కోనంగి:** ఆ ఖారం ఇంతపారేస్తే మా ఆవకాయన్నా పెట్టుకుందును.

**సారా:** మీ తెలుగువాళ్ళ ఆవకాయను గురించి వినడమేకాని ఎప్పుడూ రుచి చూడలేదు.

**కోనంగి:** ఇంతకీ నీకూ మీ మేనేజరుగారికీ విడాకులై నట్లా కానట్లా?

**సారా:** నేనే విడాకులిచ్చాను. చెప్పాను అతనితో జరిగినదంతానూ.

**కోనంగి:** నేను మేనేజరుగారికి ప్రతినాయకుణ్ణి అయ్యానన్న మాట!

**సారా:** నా మాటలన్నీ విని మాటాడకుండా వెళ్ళిపోయాడు. నిన్న కోనంగిరావుని మళ్ళీ కంపెనీలోకి తీసికోకపోతే నేనున్నూ మానివేస్తాననీ, నాకూ అతనికీ అంతటితో చెల్లనీ, అనుమానరహితమైన మాటలతో చెప్పేశాను. స్టూవర్టు చాలా కించపడి నన్ను అతిదీనంగా క్షమాపణ వేడుకున్నాడు. రేపు నిన్ను అతడు క్షమార్పణడిగి తన కంపెనీలో ఉండమని కోరుతానని చెప్పాడు.

## (4)

**అ**నంతలక్ష్మి ఉత్తరం రాసింది కోనంగికి. ఆ ఉత్తరం కోనంగికి 'హొటల్ గుజరాత్'కి పూర్తిగా బయలుదేరి వెళ్ళేముందు సాయంకాలం టపాలో అందింది.

'గాంధర్వ కూటం',
235 లజ్ చర్చి రోడ్డు, మైలాపురం,
25, నవంబరు 1939.

"కోనంగిరావుగారూ,

మళ్ళీ మీరు కనబడలేదు. మా ఇంటికి ఒక్కసారి వచ్చారుకారు. మీరు నాకు తెలుగు చెప్పండని కోరి ఉంటిని. మీరు తప్పక వస్తారనీ, నాకు తెలుగు పాఠాలు బోధిస్తారనీ ఉప్పొంగిపోతూ, నా తెలుగుపాఠం పుస్తకాలు ముట్టుకోనన్నాలేదు. నాకు అర్ధ సంవత్సరపు పరీక్షలు వస్తున్నాయి. తెలుగులో మా కాలేజీలోకెల్లా మొదటగా కృతార్థురాల నవ్వాలని ఆశ. మా అమ్మగారు మీకు నెలకు యాభై రూపాయలు ఇస్తామన్నారు.

ఆదీ కాకుండా, మీరు నా పాట ఎప్పుడూ వినలేదు. నేనూ రెండు మూడు పెద్ద కచ్చేరీలు చేశాను. కచ్చేరీకి అయిదువందల చొప్పున పుచ్చుకొని, ఆ డబ్బు బాలికల కళాశాలలకు ఇచ్చాను.

ఎప్పుడు వస్తారు మీరు? నాకు తెలుగు రావాలంటే వెంటనే నాకు చదువు ప్రారంభించండి.

సెలవు,

ఇట్లు,

కాబోయే మీ శిష్యురాలు,

అనంతలక్ష్మి, మన్నారుగుడి."

ఈ ఉత్తరం చదువుకున్నాడు. ఎవరీ అనంతలక్ష్మి? ఎందుకీ తెలుగు పాఠం? అయినా తాను ఒకసారి ఆ అమ్మాయిని వెళ్ళి చూడ్డం మంచిది అని ఆమెకు తిరిగి జవాబు వ్రాశాడు.

హొటలు గుజరాత్

ఉయ్యేటి కోనంగేశ్వరావు, బి.ఏ.

బ్రాడ్వే, మదారాసు,

26, నవంబరు 1939

"శ్రీమతి అనంతలక్ష్మిగారూ,

దయార్ద్రమైన మీ ఉత్తరం అందింది. నేను తప్పక మీ ఇంటికి పై ఆదివారం 4, డిశంబరున వస్తాను. పగలు పన్నెండు గంటలకు వస్తాను. ఒంటిగంట వరకూ ఉంటాను. ఆ తర్వాత వేరే అర్జంటు పనిమీద వెళ్ళాలి. నేను వచ్చినప్పుడే మీకు తెలుగు చెప్పడం విషయం ఆలోచిద్దాము. అప్పుడే నాకు ఒకటి రెండు పాటలు వినిపించెదరుగాక!

ఇట్లు,

కోనంగిరావు."

కోనంగిరావు మరు ఆదివారంనాడు ప్రైవేటు కంపెనీ మేనేజరును సారా ఇంటిదగ్గర పదకొండు గంటలకు కలుసుకొన్నాడు. ఆయన కోనంగిని గూర్చి తప్పు అభిప్రాయం పడినందుకు క్షమాపణ అడిగి మళ్ళీ పనిలో ప్రవేశింప వలసిందని కోరినాడు.

**కోనంగి:** మీ దయకు ఎంతో కృతజ్ఞుణ్ణి. కాని, నేను ప్రవేశింప లేను.

**మేనే:** కారణం?

**కోనంగి:** మొదట ప్రవేశించడమే ఎంతో తెలివితక్కువ పని. నాకు మా దేశం అంటే నానాటికి భక్తి ఎక్కువౌతూ ఉంది. మీ రమ్మేవన్నీ ఇంగ్లీషు వస్తువులు. అవన్నీ నేను అమ్మిపెట్టడం దేశద్రోహం వంటిది. అలాంటిది తిండికోసం మీ పంచకు చేరి....

**సారా:** ఒకసారి చేరితే ఒకటి, రెండోసారి చేరితే వేరునా?

**కోనంగి:** ఆదికాదు సారా! మొదట ఆలోచన చేయకుండా చేరాను. మేనేజరుగారు నన్ను పంపివేయడం ఎంతో మంచిదయింది.

**సారా:** పంపించకపోతే?

**కోనంగి:** ఇప్పటి ఆలోచన పుట్టునో పుట్టకపోవునో! మొన్న కాంగ్రెసువారు మంత్రిత్వాలు వదులు కోవడంతోటే, నాకు కళ్ళు విడివడ్డాయి, ఎంతో జాగ్రత్తగా ఆలోచించుకొన్నాను.

**మేనే:** కోనంగిరావుగారూ! నేను కన్నుగానని పశువునై మీ వంటి ఉత్తముణ్ణి పంపించి వేశాను. మీరు ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు? ఏమి చేస్తున్నారు?

**కోనంగి:** హొటల్ గుజరాత్‌లో వడ్డనకుఱ్ఱవాణ్ణిగా ఉన్నాను. ఆరు రూపాయలు జీతం....

**మేనే:** ఏమిటీ! వడ్డన కుర్రవాడుగానా! ఆరు రూపాయలు

**సారా:** జీతమా!

**కోనంగి:** అవును. ఏపని అయినా ఆత్మని చంపని ఉద్యోగం మహోత్తమం కాదా?
**మేనే:** మా కంపెనీలో తిరిగి చేరడం ఆత్మను చంపడం అవుతుందా కోనంగిరావు గారూ!
**కోనంగి:** అందులో నా భావం పూర్తిగా అర్థంచేసుకోండని ప్రార్థిస్తున్నాను. భారతీయులు, సంపూర్ణ స్వరాజ్యం కోరుతున్నారు. సంపూర్ణ స్వరాజ్యం రావడానికి మహాత్మా గాంధీగారి మార్గం ఉత్తమం.
**మేనే:** అందుకని ఆంగ్లేయుల వస్తువులు కొనగూడదా?
**కోనంగి:** ఆంగ్లేయులవే కాదు, సర్వవిదేశీవస్తువులు కొనగూడదు.
ఆర్థిక స్వాతంత్ర్యమూ, రాజకీయ స్వాతంత్ర్యమూ రెండూ చేయిచేయి పట్టుకొని నడవాలి.
**మేనే:** ఇక సెలవు. మీరు ఎప్పుడు వచ్చినా మా కంపెనీలోకి తీసుకుంటాను. మా కంపెనీ మదరాసు శాఖను కొద్ది రోజులలో మూసివేస్తాము. ఈలోగా మీకు మా ఆహ్వానం ఎదురు చూస్తూ ఉంటుంది.

కోనంగి అక్కడ నుంచి మైలాపురం బస్సు ఎక్కి అనంతలక్ష్మి ఇంటికి వెళ్ళాడు. అక్కడ ఎస్.ఎస్. వగైరా చెట్టియారుగారి 'రోల్సు' కారు సిద్ధంగా ఉంది.

కోనంగి రాగానే గేటు కాపలాదారు మర్యాదగా కోనంగిని వేరు మార్గాన అనంతలక్ష్మి చదువులగదికి తీసుకుపోయాడు.

అతడు రాగానే అనంతలక్ష్మి సోఫామీద నుంచి గంతువేసి లేచింది. ఆమె మోము వేయి పద్మాల దీప్తితో వికసించింది. పదినిమిషాలు మాటలాడలేక సిగ్గుపడింది. ఆయిదు నిమిషాలు పుస్తకాలు సర్దింది.

కోనంగి అనంతలక్ష్మిని రేడియం చూపులలో చూశాడు. ఏమిటి ఈ బాలిక అందం? అసలయిన అలమండ మామిడితాండ్ర! వేయి సిసలైన పచ్చకర్పూరపు డబ్బాలు గుమ్మరించిన ప్రోగు! అయిదువందల ఎకరాలలో పండిన కాశ్మీరపు కుంకుమపూవుల రాశి! వికసించిన పూవులతో నిండి ఉన్న కోటి గులాబిపూవుల చెట్టున్న దివ్యక్షేత్రం! క్షేత్రయ్య పాటలన్నీ వీణమీద వాయిస్తూ పాడిన తీయని కంఠంలోంచి వచ్చిన నూరురాగాల మాలిక! మదరాసు మాలికాకారులు కట్టిన జరీ దారాలతో తళతళలాడే పెద్ద చామంతుల దండలు వరసగా వేసిన కంఠంగల ప్రపంచ సుందరుల ఎన్నికలో మొదటగా నెగ్గిన విశ్వసుందరి!

ఇంకేముంది! తన హృదయం ఆగిపోయింది. ఆగిపోయింది. ఆగిపోవడమేమిటి? ఉండవలసిన స్థలంలో లేదు. అదుగో ఆమె పాదాల క్రింద కోటికోటికోటి పరమాణువులై పోయినది.

ఇదే కాబోలు పూర్వం నుంచి ఈనాటివరకూ సమస్త దేశాల కవులూ పాడిన ప్రేమ అనే దివ్యస్థితి. ఈ దివ్యస్థితివల్ల తనకు, కళ్ళు మూతలుపడని అనిమిషత్వం సర్వకాలాలా ముప్పదిఏళ్ళఈడు. అమృతం త్రాగుడూ అన్నీ వస్తాయి కాబోలు!

అనంతలక్ష్మి అయిదడుగుల రెండంగుళాల అమ్మాయి. కోనంగి ఆమె మోము పరిశీలించి చూశాడు. శ్రీమతి సుబ్బలక్ష్మి మోములోని పరమ పరిపూర్ణ రేఖలూ, కాంతియున్నూ, శ్రీనళిని జయవంత్ ముఖంలోని అంగాంగ శ్రుతియున్నూ, వీనికి విభిన్నమైన ఒక పరమాద్భుత సౌందర్య విలాసమూ ఉందని తీర్మానించుకొన్నాడు.

ఆ మోముకు తగిన శరీరపు బంగారుకాంతీ, స్ఫుటమధురాంగ సమ్యక్ స్థితి ఈ బాలికను, బాలికలందరిలోనూ "ఫస్టుమానిటరెస్"ను చేశాయని అతడనుకున్నాడు.

తన్ను ఎక్స్‌రే కళ్ళలో కోనంగిరావు చూస్తున్నాడని అనంతలక్ష్మి అర్థం చేసుకుంది. అది తెలిసే ఏమీ ఎరగని అమ్మాయిలా ఏమిటో సర్దుతోంది.

ఆ అమ్మాయి తన్ను "ఇన్ఫ్రారెడ్, అల్ట్రావయిలెట్" కాంతుల చూపులలో చూస్తున్నదని కోనంగికి తెలుసు. అది తెలిసే అతడు మూడేళ్ళ ముద్దుల బాలునిలా ఆ అమ్మాయిని చూడనట్లు నటిస్తున్నాడు.

రెండుసార్లే వీరిద్దరూ ఒకరి నొకరు చూచుకొన్నారు. ఆ రెండుసార్లలో చీకటిలాంటి వెలుగులో ఒక పర్యాయం. అయినా ఈసారి ఏ విధమైనటువంటి అనుమానం లేకుండా ఇద్దరూ శకుంతలా దుష్యంతుల అవస్థ అనే పూవుల, కుసుమాల, సుమాల, ప్రోవుమీద మైళ్ళు ఎత్తుననుండి పడ్డారు.

అరగంటసేపు వారికి ఆ పడడం "షాక్" వల్ల మాటా మంతీ లేదు.

అప్పటికి కోనంగి "బావ" గుక్క తిప్పుకున్నాడు. "అనంతలక్ష్మిగారూ! వచ్చాను" అన్నాడు.

"ఉఁ! ఊఁ!" అన్నది అనంతలక్ష్మి

"నేను వచ్చాను!"

"ఊఁ!"

"మీరు తెలుగు నేర్చుకుంటారా?"

అవున్నట్లు గుక్కమింగుతూ అనంతలక్ష్మి.

"తె-తెలు-తెలుగు నేను చెప్పగలనా?"

అది మీకే తెలియాలన్నట్లు తలవంచి చిరునవ్వుతో, ఏదో భయంతో అనంతలక్ష్మి కళ్ళు మూడుసారులెత్తి అతన్ని నిమేషంలో రెండువంతులలో వంతుకాలం మాత్రం చూచి ఆ నిడుపాటి నల్ల కనురెప్ప వెంట్రుకలు గల రెప్పలను నిమీలితం చేసింది.

## 5

ఇంత లోకం మార్పు అనంతలక్ష్మి చదువుల గదిలో సంభవించిందని చెట్టియారు గారికి తెలియనే తెలియదు. ఎవరో ప్రయివేటు మాష్టరు వచ్చి అమ్మణికి పాఠం చెపుతాడని అతనితో చెప్పింది జయలక్ష్మి.

చెట్టిగారికి అనంతలక్ష్మి ప్రయివేటు మాష్టర్ల దగ్గిర పాఠాలు నేర్చుకోడం బొత్తిగా ఇష్టంలేదు. ఎదిగివున్న పిల్లలు పోతరించి ఉన్న మగవాళ్ళ దగ్గిర వేరే ఎవ్వరూ లేకుండా కూర్చుండి పాఠాలేమిటి?

అప్పటికీ ఒక ప్రయివేటు మాష్టరు స్త్రీ ఎం.ఏ. గారు రెండవ ప్రయివేటు మాష్టరు ఒక ముసలాయన, తమిళం పండితుడు. ఆయనే సంస్కృతమూ చెప్తాడు. ఇంక తెలుగు చెప్పేవారు లేకపోయారు. ఇంగ్లీషు చెప్పే ఆయన అనంతలక్ష్మి పెత్తండ్రి కొడుకయిన అయ్యంగారు యువకుడు. అతడు లయోలాలో ఇంగ్లీషు ఆచార్యులుగా ఉన్నాడు. ఇంక నాలుగో ఆచార్యు లెవరో చూద్దామని చెట్టియారుగారికి బుద్ధి పుట్టింది.

అందుచేత చెట్టియారుగారు చటుక్కున ఒకమాటు వచ్చి చూచేసరికి, అనంతలక్ష్మికి ఆ లాజిక్కు చెప్పే స్త్రీ ఎం.ఏ. గారు పాఠం చెప్పడం చూచి జర్రున వెనక్కు చక్కాపోయాడు.

చెట్టియారుగారికి తెలుసును, అట్టే వత్తిడి చేస్తే అనంతలక్ష్మికి తనంటే భయంకరమైన ద్వేషం ఉద్భవించి కథ అడ్డంగా తిరుగుతుందని. చెట్టిగారు సినిమా కంపెనీ పెట్టారు.

ఇతర సినిమా కంపెనీలలో వాటాదారుడుగా ఉన్నాడు. "మదరాసు అఖిల కళామండలి" అనే సభ ఒకటి ఏర్పాటుచేసి, దానికి చక్కని భవనం ఒకటి మౌంటురోడ్డులో అద్దెకు పుచ్చుకున్నాడు. అక్కడే ఒక చిన్న రంగస్థలం అమరించాడు. ఒక చిన్న సినిమా ప్రదర్శక యంత్రంపెట్టి, ఆ ప్రదర్శనాలు ఏర్పాట్లు చేశాడు.

సినిమా కంపెనీలో తారల మధ్య తాను చంద్రుడు, కళామండలిలో కళాపూర్ణుడు.

అనేక రకాల స్త్రీలు అనేక రకాల పిండి వంటలు. ఒకరి పెదవి మాధుర్యం మామిడిపండులా ఉంటే, ఇంకో అప్సరస పెదవి ద్రాక్ష. మరో మధురాధరి అధరం రసగుల్లా, ఒక కలువకంటి వాతెర చాంపేను సారా అయితే ఇంకో విలాసిని వదనము బాదామికీర్.

అందుకని మన చెట్టి వ్యాపారంలో ఎంత ఘట్టిగా ధనం సంపాదిస్తాడో అంత వదులుగా మదగజయానలకై వెచ్చంచేసి, పద్దులో ప్రయివేటు ఖర్చు అని రాసుకుంటాడు.

అలాంటి చంచల విటకావతంసునికి అతని 'వాటర్లూ' యుద్ధం అనంతలక్ష్మి ఆవరణలోనూ ఇంటిలోనూ రోజూ జరుగుతోంది.

అనంతలక్ష్మి ఒకనాడు కాలేజీకి వెడుతోంటే, బర్మా మలయాది దేశ విజ్ఞానరహిత వివిధ మానవుల కష్టార్జితమైన విత్తం గుంజుకొనే ఈ చెట్టియారుగారు అవర్‌గళ్ చూచాడు. హంసతూలికాతల్ప సహస్రాలకన్న మెత్తగా ఉన్న తన రోల్సురాయిస్ కారు వెనకసీటులో ఒక వెయ్యోవంతు సెకండు నిశ్చేష్టుడై పడిపోయాడు. ఆ కోడెకాడయిన అనంగుడు అలరు టంబులు వేసి చెట్టిగారి హృదయాన్ని ఛిన్నాభిన్నంచేసి వదిలాడు.

అప్పుడు చెట్టిగారికి తెలియకుండానే, ఆయన మనస్సు "ఓ కుందరదనా! ముమ్మొన వాలుచూపులదానా! నా చెట్టియారు హతాశుడు." అని వాపోయింది.

ఆ బాలిక కారు వెనకే తన కారు పోనిచ్చి, ఆమె క్వీన్ మేరీ కళాశాలకు వెళ్ళడం చూచి, సాయంకాలం మాటేసి, ఆమె ఇల్లు కనిపెట్టి, సమాచారం సమస్తమూ తెలిసికొని జయలక్ష్మి హృదయదుర్గం ఓడిస్తేనే కాని, ఆమె కొమరిత తనకు వశ్యంకాదని ప్రయత్న పరంపర ప్రారంభించాడు.

కాని జయలక్ష్మి హృదయ దుర్గంలోకి ఇతరులు రావడానికి వీలు లేదు. తర్వాత ఏమయినా, ముందర వారి ఇంటిలో అడుగుపెడితే అంతే చాలునని తాను అనంతలక్ష్మి స్వయంవరానికి ఒక దరఖాస్తుదారునిగా మనవి చేసుకున్నాడు.

కోటీశ్వరుడు, ముప్పదిఏళ్ళ బాలాకుమారుడు. ఇంతకన్న పద్దెనిమిదేళ్ళ తన బాలికకు మంచి సంబంధం వేరొకటి ఉండదనుకొని, తన కొమరిత హృదయం కైవసం చేసుకోవడానికి జయలక్ష్మి ఆజ్ఞ జారీచేసింది. ఆ పూట చెట్టియారుగారు వెంటనే ఇంటికిపోయి శైవుడవడంచేత కపాలేశ్వరస్వామికి నారికేళజలాభిషేకం, కందస్వామికి అన్నాభిషేకం, పిళ్ళయారుకి కుడుముల అభిషేకమూ చేయించాడు.

భగవంతుడు తనకు అనుకూలించి, విజయం చేకూర్చితీరుతాడనీ, తక్కిన పని తన అంతులేని ఐశ్వర్యమే సమకూరుస్తుందని చెట్టియారుగారు దృఢనమ్మకంతో అనంతలక్ష్మి హృదయ దుర్గానికి ముట్టడి ప్రారంభించాడు.

తన విలాస పురుషత్వశక్తి అంటే చెట్టియారుగారికి నిరవధికమైన గౌరవం తన ధనానికి ఆశించి తన కౌగిలింతలలో కరిగినారు. వివిధ విలాసవతులు, అన్న భావము

అతడు దూరంగా నెట్టివేస్తాడు. అలాంటి పిచ్చి నమ్మకాలు అంటే అతని కేమాత్రం నమ్మకంలేదు. ధనానికి ఆశపడితే తనలా ధనవంతులైనవారి కందరికి ఈ సుందర నారీబృందము వశులవుతూ ఉంటారని ఆయన ఏలా అనుకోగలడు! ఒక్కొక్క ప్రసిద్ధ భూలోకాప్సరస మనోహరాంగనను గద్దలా ఎగతన్నుకు పోవడానికి లక్షరూపాయలనే గోళ్లు ఉద్భవింప చేసుకోవలసి వచ్చింది చెట్టియారు జీవిత విటవిహంగానికి.

అలా తాను చేస్తున్నా, తన ధనమనే అయస్కాంతం విలాసవతుల ఇనుప హృదయాల రంగున లాగుతున్న విషయం అతనికి తెలిసి ఉన్నా, చెట్టియారుగారు తన్ను తానే నమ్మదలచుకోలేదు.

ఈలాంటి అద్భుతమైన కారణాలవల్ల చెట్టియారుగారికి తన విజయం అనే ఓడ గిరగిర సుడిగాలిలో తిరుగుతోందని తోచింది. కాని, ముందుకు ఒక అడుగు నడవటంలేదు. అయినా నాటుకోటు చెట్టియారులకు నూటికి వేయి రూపాయలు వడ్డీకట్టి, ధనం కుప్పతిప్పలు ఇంట్లో పోసుకొనే నేర్పుకు శిఖరశిల ఆయినట్టి, తనశక్తి అనంతలక్ష్మిని మూడురోజులు తప్పితే, మూడు నెలలలో, తప్పితే మూడు ఏళ్ళలోనన్నా తనకు తానే చెట్టిగారి పురుషత్వానికి సిద్ధిఅయి తీరుతుంది అని దృఢంగా నమ్మినాడు.

ఇంతట్లో మళ్ళీ ఒక్కసారి చూద్దామని, చెట్టియారుగారు అనంతలక్ష్మి చదువుల గదిలోనికి వచ్చేసరికి, ఒక చక్కని యువకుడు తెలుగుపాఠం చెబుతున్నాడు.

"రసములు తొమ్మిది, వాని అన్నింటిలో రాణి శృంగారం. శృంగారానికి స్థాయీభావము రతిగాని విప్రలంబముగాని కావచ్చును. ఇప్పటి నవలలలో కథలలో పాటలలో కూడా శృంగారమునకే ప్రాధాన్యం ఈయబడుతున్నది."

"శృంగారము అంటే అలంకరించుకొనుట అనే అర్థం ఉందిగదా అండి."

"అవును. దానినిబట్టి మీరు ఊహించుకొనవచ్చునుగదా! రసము అనేది సాహిత్యపరమైనది మాత్రము అని."

"చాలా గొడవగా ఉంది. గ్రంథంలో 'ఇది శృంగార రసభరితమగు కావ్యము' అని ఆ గ్రంథకర్త రాసినారు. నాకు రసమంటే ఏమిటో మాతెలుగు ఆచార్యాణిగారు తరగతిలో చెప్పారుగాని నా మనస్సుకు ఎక్కలేదు."

"మనుష్యుడు ఎలాంటివాడో అలాంటిది కావ్యం అనుకుందాం."

"మంచిదండి."

"ఆ మనుష్యునకు ఆత్మ ఎలాంటిదో, కావ్యానికి రసం అటువంటిది అనుకుందాం."

"సరేనండి."

"శృంగారాది రసాలు, పురుషుని వ్యక్తిత్వమువంటివి."

ఈలా పాఠం సాగుతోంది. వారిద్దరు కూచోడంలో, వారిద్దరిమధ్యనా బల్లమీద నృత్యంచేసే పాత్రత్వంలో, చిరునవ్వులలో, ఆ చూపులలో ఏదో తనంలో, చెట్టియారుగారికి కాళ్ళలో ఎముకలు మాయమయ్యేటంత భయంకర స్థితి సంభవింపచేసే ఏదో విపరీత సంఘటన అస్పష్టంగా తోచింది.

"యార్ ఇవన్! (ఎవరు వీడు) యార్ ఇంద సైతాను!" (ఎవడీ సైతాన్) అని అనుకున్నాడు. అతని గుండెలో నల్లబండరాయి గుబేలుమని పడింది. మోమున చెమటలు గుమ్మాయి.

చెట్టి "తెలుగుదానే నేరుస్తుందవు లక్ష్మీ!" అని లోపలికి వచ్చి, ఆ పక్క కుర్చీపై చతికిలపడ్డాడు. ప్రపంచంలో ఎన్నిచోట్లయినా జయించుకు రాగలిగిన కోనంగి, అనంతలక్ష్మి ఎదుట గజగజలాడుతున్నాడు. అతనికి తెలుసును. తెలిసిపోయింది, కావ్యాల్లో నాయకులకు తప్ప ఇతరులకు పట్టని మహత్తరావస్థ ఒకటి తనకు పట్టిందనీ, అనంతలక్ష్మి అనే ఒక అద్భుత దివ్యసుందరాంగి తన ప్రేమ నిధానము అయి చక్కాబోయిందనీ.

ఆమెను చూచిన క్షణాతిక్షణంలో ఆ నిజం ఒక్కసారి వెలిగిన వేయి విద్యుద్దీపాలులా అతనికి తెలిసిపోయింది.

అలాంటి ఒక పరమ మధుర "మత్తు" లోపడి పాఠం చెబుతున్నాడు. మూడుసారులు నత్తి కూడా వచ్చింది. అట్టి సందర్భంలో దేవుడులా వచ్చాడీ మహానుభావుడు. ఎవరీ పెద్దమనిషి, వాడి పుణ్యమా అని.

## 6

"**ఈ**వాళ కింతే చాలు. నాకు చాలా పని ఉంది వెళ్ళాలి" అని కోనంగి అన్నాడు.

"కొంచెం కాఫీ తీసుకుని వెళ్ళండి గురువుగారూ!" అని అనంతలక్ష్మి కోనంగిని ప్రార్థించింది.

"నాకు వ్యవధిలేదు. క్షమించండి" అని కోనంగి మనవిచేసి తలతిప్పి అనంతలక్ష్మికి, చెట్టియారుగారికి నమస్కారంచేసి లేచినాడు.

"మా కారు మిమ్ముదిగబెడుతుం"దని అనంతలక్ష్మి పరిచారికను పిలవడానికి లోనికి పరుగిడింది.

**చెట్టియారు:** ఎంగళది ఎందూరు?

**కోనంగి:** అరవపేశం నాకు రాదు స్వామీ!

**చెట్టియారు:** మీరుదా ఎందా ఊరా?

**కోనంగి:** బందరు.

**చెట్టి:** ఇక్కడదా, ఏమి చేస్తురు?

**కోనంగి:** ఉద్యోగం చేస్తునుదా!

**చెట్టి:** ఎక్కడదా ఉద్యోగం?

**కోనంగి:** ఒక మరాట్ట సంస్థలోదా!

**చెట్టి:** సమస్తా? అది ఎన్న?

**కోనంగి:** అది పొన్ను!

**చెట్టి:** బంగారం బేపారందానే?

**కోనంగి:** బంగారంవంటి అశన బేపారందా!

**చెట్టి:** అశన అంటే ఏమిటిద?

**కోనంగి:** కుక్షింబరత్వందా!

**చెట్టి:** అది ఎన్న?

**కోనంగి:** అది వెన్న....

ఇంతలో అనంతలక్ష్మి వచ్చి "గురువుగారూ! రండి" అని పిలుచుకు చక్కాపోయింది చెట్టియారుగారు మండిపోయారు. ఈ చదువు చెప్పడం వ్యాపారం త్వరలో ముగింపించాలి అని అయిన పళ్ళు బిగించాడు.

కోనంగిని అనంతలక్ష్మి తన వేరే గదిలోనికి కొనిపోయి, అక్కడ సిద్ధపరచివున్న కాఫీ బల్లఎదుట కూర్చుండబెట్టి తాను కోనంగికి ఎదురుగుండా కూర్చుండి, అతనితో ఉపాహార మారగించసాగింది.

"గురువుగారూ, ఆయన ఒక నాటుకోటి సెట్టిగారు."

"ఏయన?"

"మీరు పాఠం చెపుతోంటే వచ్చినాయన. వట్టి రౌడీ! లక్షాధికారి! పరమ దుర్మార్గుడు. వాణ్ణి చూస్తేనే నా ఒళ్ళు మండిపోతుంది."

"అయితే చూడకండి!"

"వాడు మా అమ్మగారిని బాగా ఎరుగును. మా కుటుంబ క్షేమంకోరే మనిషి. అందుకని తప్పనిసరిగా వాణ్ణి భరించవలసివస్తోన్నది."

"అయితే వచ్చిన నష్టం ఏముంది? మామూలుగా వెళ్ళేటట్లుగానే వెళ్ళనియ్యండి!"

"నన్ను అండి అని మర్యాదచేయవద్దని ప్రార్థన."

"కొన్నాళ్ళు సాగనివ్వండి."

"మీకు మా ఇంట్లో భోజనంచేయడానికి అభ్యంతరం ఉందా? వంటమనిషి ఒక అయ్యరు. మేము మాంసాదులు తినం."

"అయితే నా కేమీ మీ ఇంట్లో తినడం అభ్యంతరంలేదు."

వారు కాఫీ త్రాగుతున్నారు. చెట్టియారుగారు అనంతలక్ష్మి చదువులగదిలో కూర్చుండి ఎంతకూ రాలేదేమని అనుకుంటూ ఉండగా కారు బర్రుమన్న చప్పుడు విన్నాడు.

అమ్మయ్యా! ఆ శనిగాడు వదిలాడు. వీడెక్కడ నుంచి దాపురించాడు? వీణ్ణీ వదలించాలి. తాను ఎంతమంది పడుచుఉపాధ్యాయుల్ని అనంతలక్ష్మి ఇంటికి రాకుండా చేయలేదు! ఎలాచేయగలిగాడో ఎవ్వరికీ తెలియదు. వాళ్ళెందుకు రావడం మానినారో అనంతలక్ష్మికీ తెలియదు, జయలక్ష్మికి అంతకన్నా తెలియదు.

ఇంకా రాదే అనంతలక్ష్మి! అని చెట్టియారుగారు గబగబ లేచారు. ముందు వరండాలోకి వచ్చారు. అక్కడ వున్న ఒక వస్తాదును "అనంతలక్ష్మి ఎక్కడ?" అని ప్రశ్నించాడు.

"అనంతలక్ష్మా?"

"ఆమ!"

"నా కేమి తెలుసు?"

"కారుమీద ఆ అయ్యవారు వెళ్ళినారా?"

"ఆ అయ్యవారా? ఇందాక వచ్చిన అయ్యవారా?"

"ఆమ!"

"నా కేమి తెలియును?"

కోపంతో చెట్టియారుగారు లోపలికి వెళ్ళి పరిచారిక నడిగారు. ఆమె "చిన్నమ్మగారు కారుమీద వెళ్ళారు" అని అన్నది.

"ఎప్పుడు?"

"ఇప్పుడే."

"ఇప్పుడే."

"ఇప్పుడే."

"ఏ కారుమీద?"

"తన కారుమీదే.?

"అది కొత్త అయ్యవారిని పంపించడానికి వెళ్ళిందికాదా?"

"అవును."

"అందుమీద ఎల్లా వెళ్ళింది?"

"అందుమీదే వెళ్ళింది."

## 7

**చె**ట్టియారుగారు ఏడ్చినంత పని చేశారు. అనంతలక్ష్మి తన్ను తప్పించుకోనేందుకు వేసిన ఎత్తు ఇది అని ఆయనకు తెలుసు. అతనికి మరి కొంచెం పట్టుదల ఎక్కువ అయింది. కళ్ళు తుడుచుకొని పళ్ళు బిగించాడు. వెంటనే జయలక్ష్మితోనన్నా మాట్లాడకుండా కారెక్కి వెళ్ళిపోయాడు. వెళ్ళేటప్పుడు పనిమనిషి చూచింది. వెళ్ళనిచ్చి జయలక్ష్మితో చెప్పింది. అయ్యో! కాబోయే అల్లుడికి కోపం వచ్చింది కాబోలు ననుకొని, జయలక్ష్మి పరిచారికను అన్ని విషయాలూ అడిగింది.

ఆ రోజున గేటు దగ్గిర నిలుచున్నవాడే, తన్ను "ప్రయివేటు ఉపాధ్యాయకత్వం ఏమన్నా ఉందా" అని అడిగి లేదనిపించుకున్నవాడేనా ఈరోజున వచ్చాడు? వాడికీ అమ్మణ్ణికీ స్నేహం ఎక్కడ కుదిరింది చెప్మా? సాధారణంగా ఎవ్వరితోనూ సహవాసం చేయదు. తన తోటి విద్యార్థినులతో కూడా ఏ పదిమందితోనో మాత్రం చనువుగా స్నేహంగా ఉంటుంది తన అమ్మణ్ణి. అలాంటిది ఈ కొత్త అబ్బాయి ఎక్కడ దాపురించాడు.?

ఒంటిగా అనంతలక్ష్మి ఏ మగవాళ్ళతోనూ వెళ్ళదే! ఆందులో ఒక కొత్తవానితో ఎలా వెళ్ళగలిగింది చెప్మా! అని జయలక్ష్మి ఆశ్చర్యం పొందింది.

జయలక్ష్మి తబ్బిబ్బయింది. ఆవేదన పడింది. కుర్చీమీద చతికిలపడింది. తిన్నగా తనభర్త అయ్యంగారి తైలవర్ణచిత్రమున్న గదికిపోయింది. అది పూజాగృహంలా ఉంటుంది. అక్కడ సాష్టాంగపడి లేచి, చెంపలు వాయించుకొని... "అనంతలక్ష్మిని గూర్చి ఏమాలోచించారు స్వామీ" అని దీనంగా ప్రార్థించింది.

ఎంత సేపూ అయ్యంగారి బొమ్మ నవ్వినట్లే కనబడుతుంది. ఏదో ఊరట చెంది జయలక్ష్మి తాను రంగుదారాలతో కుట్టే కుట్టు పనికి పోయింది.

అనంతలక్ష్మి కోనంగిని కారులో ఎక్కమని తాను కూడ, చటుక్కున అతని పక్కకూర్చుండి కారును పొమ్మంది. మొదట ధైర్యంచేసి ఎక్కిందన్న మాటేగాని, తర్వాత సిగ్గుతో, భయంతో ముడుచుకుపోయింది. ఎవరేమను కుంటారో? తల్లి ఏమనుకుంటుంది? తానెప్పుడూ ఒంటరిగా మగవానితో ప్రయాణంచేసి ఎరుగదు. కారు డ్రైవరు తన పెద అమ్మమ్మ మనుమడు. తనకు అన్నగారి వరస. అంచేత కొంత నయం. అయినా ఈలా సరిసమానంగా ఒంటిగా ఒక పురుష పుంగవునితో ప్రయాణం చేయలేదే తాను!

అనంతలక్ష్మికి చెమటలు పట్టాయి. కోనంగి అనంతలక్ష్మి అవస్థ చూడకుండానే గ్రహించాడు. అనంతలక్ష్మి చటుక్కున తనతోపాటు కారు ఎక్కడం, అందులో తనపక్కనే కూర్చోడం, అతనికి శృంగారావస్థలో మూర్ఛ వచ్చినంతపని అయింది. గుండెలు మహావేగంతో కొట్టుకొంటున్నాయి. ఏదో మత్తు అలుముకుపోయింది. నుదురు, చెంపలు, భుజాలు, వీపు వేడెక్కాయి. ఇదే మన్మథావస్థ! అమ్మయ్యో! ప్రేమ మహారోగం వచ్చి

తన్ను పట్టుకుంది. ఈ రోగం రానేరాదు; వచ్చిందా వదలనే వదలదు. ఇంక తనకు స్వాతంత్ర్యంలేదు. ఇంక మనస్సు ఫ్రీలాన్స్ జర్నలిస్టు (పత్రికా స్వేచ్ఛా విలేఖరి) లా తిరగడానికి వీలులేదే! అలా అని ఇదివరకు తాను మహా ఆడపిల్లలకోసం దేవుళ్ళాడినట్టు? ప్చు, ప్చు. ఆడపిల్లలంటే హడలి బేజారయ్యే తాను దివాస్వప్నాలలో అందమయిన బాలికను ప్రేమిస్తున్నట్లు ఊహించుకునేవాడు.

తన్ను రాయిస్టులు, "ఎస్కేపిస్టు వయ్యావు నువ్వు! ఎందుకంటే నువ్వు కలలు కనకూడ"దని వాళ్ళ 'విహారి' పత్రికలో రాయవచ్చుగాక! తనకు పగటికలలు రాకపోతే ఏలా బ్రతుకగలడు తాను?

ఇప్పుడిక ఆ పగటికలలు కనడానికి వీలులేదు. ఎందుకంటే ఈ ప్రేమ నిధానమయిన ఈ ఆందాల మనోహరాల బాలిక- అనంతలక్ష్మి - తన జీవితంలోనికి ఒక పెద్ద గాలివానలా వచ్చి ప్రవేశించింది.

అతడు ముడుచుకొని కూర్చున్నాడు, అనంతలక్ష్మి ముడుచుకు కూర్చున్నది.

కారు మహావేగంతో ముందుకు సాగిపోతోంది. ఆ కారు డ్రైవరుకు ఎక్కడకు వెళ్ళాలో తెలియక, బీచి వెంటా బజారుల వెంటా తిరుగుతున్నాడు.

కొంతసేపటికి అనంతలక్ష్మి, కోనంగీ కూడా మోటారుకారు మనిషి తన ఇష్టం వచ్చినట్లు కారు పోనిస్తున్నాడని గ్రహించారు.

ఆ కారుడ్రైవరు మొదట బీచిరోడ్డు వెంట వెళ్ళాడు. అక్కడ నుండి ఎస్ప్లనేడు, అక్కడ నుంచి సెంట్రల్, తర్వాత పూనమల్లి హైరోడ్డు, తర్వాత చెటపట్, త్యాగరాజనగరు, అళ్వారుపేట, అటునుంచి మౌబ్రేస్, తర్వాత రాయపేట అక్కడ నుంచి తిన్నగా మైలాపూర్, ఆ వెనక అడయారు వెళ్ళాడు.

అడయారులో ఎక్కడా ఆగకుండా తిన్నగాపోయి, బీచి దగ్గర ఆగినాడు.

కారుడ్రైవరు అనందంనాయుడికి తన చెల్లెలయిన అనంతలక్ష్మి అంటే కన్నకూతురుకన్న ఎక్కువ ఆపేక్ష. ఆమెమీద ఈగను వాలనీయడు. ఆనందంనాయుడికి కోనంగి అంటే ఎందుకో మంచి అభిప్రాయం కుదిరింది.

ఆ మూడుగంటలవేళ వాళ్ళిద్దరూ కారులోంచి దిగారు. దిగడానికి కారణం ఆనందంనాయుడు కారుదిగడానికని తలుపు తీయడమే!

ఇద్దరూ దిగారు. సముద్రం ఒడ్డున చిన్నతోట, తోట అవతల చిన్న ఇసుకబయలు ఉన్నది. ఆ తర్వాత ఒడ్డు, ఆ తర్వాత సముద్రము ఉన్నాయి.

ఇద్దరూ కలిసే నడిచారు. ఇద్దరూ ఒక చక్కని ఇసుక ప్రదేశంలో తోటలో మామిడిచెట్టు నీడను చతికిలపడ్డారు. ఆలోచించుకొన్నట్లు కారు ఎక్కినది మొదలు ఇంతవరకు ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు.

"నేను పురుషుణ్ణి. ఈలా మాటాడకుండా ఉండడము వట్టి పిరికితనము, చిన్న మనిషితనము, దద్దమ్మతనము? వెర్రితనము" అని అనుకున్నాడు కోనంగి.

"ఇదేమిటి? నేను చదువుకునే విద్యార్థినిని. నేటికాలపుదాన్ని, ఈలా మాటాడకుండా ఉండడము వట్టి పిరికితనము, దద్దమ్మతనము, అవమానకరము" అని అనంతలక్ష్మి అనుకొన్నది.

కోనంగి గొంతుక సవరించుకొని "పాఠం అంతా మనస్సునకు హత్తింది కాదా అండి?" అని అన్నాడు కొంచెం బొంగురుపోయిన గొంతుకతో.

"అర్థమయింది. చాలా బాగాఉంది. అయినా పరీక్షకోసం కాకపోయినా నాకు వేసవికాలంలో కావ్యవిమర్శ అంతా మీరు చెప్పాలి"

"నేనే కావ్యవిమర్శ చెప్పడం! నాకేం తెలుసునండీ?"

"నన్ను అండీ అనకండి."

"క్షమించండి....కాదు క్షమించు అనంతలక్ష్మి!"

"మా గురువుగారిని మేము క్షమించడమే! అమ్మో!"

అనంతలక్ష్మి తలవంచే మాట్లాడుతూంది. ఆ మాటలలో కొంచెం సిగ్గు కొంచెం విచారమూ కూడా మిళితమై ఉన్నాయి.

"అనంతలక్ష్మిదేవి!"

"ఎందుకండి?"

"నన్ను అండి అనవచ్చునా? నేను అండిగినా!"

"గురువులను అండి అనడం మన పూర్వాచారం."

"గురువులు చదువులకు అండిగలంటివారన్నమాట!"

అనంతలక్ష్మి నవ్వుకుంది.

"అనంతలక్ష్మిదేవి! నేను నా ఉద్యోగానికి ఇవాళ నీళ్ళు వదలుకున్నట్లే"

"మీరు ఉద్యోగం మానివేసినట్లయితే తక్షణం మా ఇంటికి వచ్చేయండి."

## 8

అనంతలక్ష్మి ఆశతో ఆ మాట అంది. ఆమెను చూచి కోనంగి విచార వదనంతో "అనంతలక్ష్మిదేవి, నేను కటికదరిద్రుణ్ణి. నాకు మా అమ్మ తప్ప ఇంకెవ్వరూ లేరు. బి.ఏ. పరీక్షలో మాత్రం మొదటి తరగతిలో నెగ్గాను. ఉద్యోగాలకు ప్రయత్నం చేస్తున్నాను. అందుకని మదరాసు వచ్చాను. వైటువే కంపెనీలో చేరాను. ఆ ఉద్యోగం అయిపోయింది" అని అన్నాడు.

"ఏ ఉద్యోగం చేయాలని మీ ఆశయం?"

"ఏ ఉద్యోగంలోనూ చేరలేను, చేరకుండా వుండలేను."

"ఇదేమి చిత్రం!"

"అదే నా జీవిత రహస్యం. ఏదో అసంతృప్తి. ఒక్కచోటా ఉండ లేను. ఏ పనీ చేయలేను. చేయబూనుకుంటే మాత్రం అద్భుతంగా చేయగలను."

"మీరు పాఠం చెబుతోంటేనే నాకర్థమయింది."

"ఏమని?"

"మీరేదో మహత్తరకార్యంకోసం ఉద్భవించారని."

"ఆ మహత్తరకార్యం ఏమిటో తెలిస్తే బాగుండిపోను. దాన్నిబట్టి నా జీవితవిధానం ఏర్పాటు చేసుకొందును. నా ప్రయత్నాలన్నీ ఆ ఆశయం కోసం చేసి ఉందును."

"ఏ విధమైన ఉద్యోగం చేద్దామని మీ ఉద్దేశమో తెలియడం మంచిది కాదా అండి?"

"నిజమేనమ్మా. రివెన్యూ వగైరాది ప్రభుత్వోద్యోగాలు చేయాలని సరదా పుట్టదు. పోనీ ప్లీడరీ చేద్దామంటేనే అసహ్యం. బుడబుడక్క జోస్యమూ, గాంధోళిగాని హాస్యమూ జ్ఞాపకం వస్తాయి. వర్తకంగాని, వర్తక కంపెనీలో ఉద్యోగంగాని ఆలోచిస్తే ఎలాంటి

వస్తువుల వర్తకమైనా చివరకి అత్తరువులు కంపెనీ అయినా కుళ్ళిపోయిన ఉల్లిపాయల వాసన జ్ఞాపకం వస్తుంది."

"అయితే ఏంచేద్దామని?"

"రిక్షా లాగుదామని."

"అదేమి మాటండీ!"

"రిక్షావాడిబండిలో కూర్చుని వెడుతోంటేనూ, పది ఎద్దులుకూడా లాగలేని సామానులు లాగుడు బండిలోవేసి కాడికఱ్ఱలు పొత్తికడుపునకు తగిలించుకొని, పశవులకున్న బలం లేకపోవడంచేత, ఆయాసపడుతూ హృదయం ఏడుస్తూ, రక్తాశ్రుబిందువులు కారుస్తూ లాగుతూ ఉండే కూలివాళ్ళను చూస్తూ వుంటేనూ, వారి ఆడవాళ్ళు వెనకనుంచి తోస్తూ ఉంటేనూ ఆదృశ్యాలు రెండూ ఏలా చూడగలం అనంతలక్ష్మీదేవి!"

"అవి భరింపరాని దృశ్యాలే. అందుకని సరదాకుకూడ రిక్షాలో కూర్చోలేను."

"అవునమ్మా అవును! అందుకని ఆ రిక్షాలాగాలని బుద్ధిపుట్టుంది నాకు. దానివల్లనే జీవించాలని అనుకుంటాను. కాని ఒక రిక్షావాడి తిండి నేను కొట్టివేశానన్నమాటే కాదా?"

"నిజంగా రిక్షాలాగకండి, చాలా జబ్బు!"

"అవును లక్ష్మీ! లక్ష్మీదేవి! కాని ఎంతమందో రిక్షాలు లాగుతూ ఉంటే, మనం రిక్షా లాగవలసిన దుర్భరస్థితులు మనదేశంలో, ఆఫ్రికాలో, జపానులో, చీనాలో, ఇంకా అనేకచోట్ల ఉన్నా మనం చూస్తూ ఊరుకుంటున్నాము. ఏమీచెయ్యలేము. ఇదొకటి నా ఆవేదన"

"గురువుగారూ, నన్ను లక్ష్మి అనే పిలవండి. అదే నాకు చాలా బాగుంటుంది."

"నువ్వు లక్ష్మివే నిజంగా! అందుకనే నీకు పాఠాలు చెప్పడానికి తగుదునా అని నా ఆలోచన!"

"అదేమిటండి, అలాంటి మాటలు?"

"ఏమి మాటలాడమంటావు లక్ష్మీ! నీకు చదువు చెప్పడం చాలా ఆనందము, లాభదాయకమునూ, అయినా ఇంటి దగ్గర పిల్లలకు చదువు చెప్పుకునే ఉపాధ్యాయునిగా మాత్రం తయారవుతానేమోనని భయం!"

"ఉపాధ్యాయవృత్తి చాలా మంచిదంటారుకాదా?"

"మంచిదే! గోవు మాలచ్చిమి వంటిది ఆవృత్తి. అందులో దిగితే గోవునో, గొఱ్ఱెనో లేకపోతే గాడిదనో అవడానికి సావకాశం ఉంది."

అనంతలక్ష్మి పకపక నవ్వింది.

"కాని, మీరు మా ఇంటికి రావడంమాత్రం మానకండి. నేను ఒక విషయం చెపుతాను. సాధారణంగా ఏలాంటివారి స్నేహాలకూ నేను వెళ్ళను. అందులో నాకు పురుషస్నేహితులసలే లేరు. వాళ్ళతో స్నేహంచేయకుండా నేను వ్రతంపట్టడానికి ఒక ముఖ్యకారణం వుంది. ఇవాళ మీరు చూచిన పెద్ద మనిషి ఒక నాటుకోటి చెట్టియారుగారు. ఆయన్ను చూస్తే మీ రిందాకా అనుకున్నట్లే అనుకుంటాను. ఆయన్ను చూచిన పాపం నాకు పోవాలంటే మీరు నాకు తెలుగుపాఠాలు చెప్పాలి. మీరు తెలుగు చెబితే నేను నెగ్గి తీరుతాను. లేకపోతే తెలుగు సున్న అవుతుంది నాకు."

"నేను తెలుగు చెప్పడానికీ, నాటుకోటి పాపానికి సంబంధం ఏమిటి?"

"కావలసినంత!"

"నాకు పగలు తీరిక ఏమీ వుండదు."

"నాకూ తీరిక వుండదు."

"అయితే ఎల్లాగ?"

"రాత్రి రండి, వెనుకనే ఆ సంగతి మనవిచేశానుకదా?"

"మీ కారుమీద నేనున్న మకామునకు పంపుతానన్నావు రోజూ. ఈ యుద్ధం రోజుల్లో ఈలా ఎన్నాళ్ళవరకూ సాగుతుందని నీ వుద్దేశం?"

"నా పరీక్షలవరకూ సాగితే చాలండి."

"నేను హొటలు గుజరాత్‌లో వున్నాను మరి."

"అక్కడికే పంపుతాను."

"నువ్వు నాకు ఏమీ జీతం క్రింద ఇవ్వకపోతే నేను నీకు పాఠాలు చెప్పడానికి అభ్యంతరంలేదు."

"అలాగే లెండి."

అనంతలక్ష్మికి కలిగిన అనందానికి పరిమితిలేదు. కాని కోనంగికి ఏదో భయం కలిగింది. ఆ భయం యొక్క రూపు రేఖా విలాసాలు మాత్రం అతనికి స్ఫుటం కాలేదు.

"వెడదామా అనంత....?"

"ఎంత చక్కగా వుంది మీరు అనంతా అని పిలిస్తే!"

"ఇదేనా నువ్వు గురువులను మెచ్చుకునే విధానం?"

"ఇతర గురువులు పేర్లతో పిలవరు, ఏమీ పిలవరు. మా అన్నగారు మాత్రం అమ్మిణీ అని పిలుస్తారు."

"యెవరా అన్నయ్య?"

"మా పెదతండ్రి కొడుకు."

"ఆయన....?"

"ఆయన లయోలాలో ఇంగ్లీషు ఆచార్యులలో ఒకరు"

ఇంతట్లో ఇద్దరూ మౌనం వహించారు. కోనంగి పక్క చూపులతో అనంతలక్ష్మిని చూచాడు. అనంతలక్ష్మి తలవంచి ఆలోచిస్తూ పక్కచూపులతో కోనంగిని చూచింది.

చివరకు ఇద్దరి చూపులూ కలిశాయి. ఇద్దరూ పకపక నవ్వుకున్నారు. ఇద్దరి హృదయాలూ ఎందుకో ఉప్పొంగిపోయాయి.

కోనంగికి ఇంతలో ఏదో ఆవేదన కలిగింది. కాని చిరునవ్వుతో అనంతలక్ష్మిని చూచి "శిష్యురాలుగారు, మనం వెళ్ళాలి. మా మకాముకు నేను చేరాలి. మా యజమాని ఉద్వాసన చెప్పితే మాత్రం నీ పని పడతాలే!"

"నన్ను పట్టుకోండి చూదాం, గురువుగారూ!" అంటూ లేచి అనంతలక్ష్మి పరుగెత్తి కారులో కూర్చుంది. కోనంగి లేచి పరుగున నడిచి, "ఓడిపోయాను" అంటూ ముందు సీటులో డ్రైవరు పక్క కూర్చున్నాడు.

## 9

**య**జమానితో తనకు అర్జంటు పని ఉండి ఆగిపోయినానని కోనంగి చెప్పగానే అతడు ఊరుకున్నాడు.

కోనంగి కోసం రాత్రిళ్ళు ఎనిమిదిన్నర గంటలకు అనంతలక్ష్మి కారు వచ్చేది. కోనంగి ఆ కారుమీద వెళ్ళి పదిన్నరవరకూ పాఠం చెప్పి తిరిగివచ్చేవాడు. తెలుగుభాష సంస్కృత భాషకు బిడ్డ అనిన్నీ, ఆర్యులయిన ఆంధ్రులు దక్షిణాదికి రాగానే ఇక్కడ ఉన్న అనాదిజాతుల భాషలో నుంచి కూడా కొన్ని పదాలు తెలుగు భాషలోనికి వచ్చాయనీ అతడు చెప్పాడు

తెలుగుభాషలో పద్యాలు ఎప్పటి నుంచి ప్రారంభమో, తెలుగు భాష్యమైన ఆంధ్రభారతం ముందు కవిత్వంఎల్లా ఉండేదో తెలిపినాడు. భారతకాలంనాటి కవిత్వము, శ్రీనాథ పోతరాజుల యుగము, కాకతీయుల కాలం నాటి ద్విపదయుగము, రాయల ప్రబంధయుగము, సంగీతయుగము, శృంగార పదయుగము, హీనప్రబంధయుగము, నూత్నయుగారంభము, నవ్యకవిత్వ యుగము, అతినవీనయుగము మొదలయిన ఆంధ్ర కావ్యచరిత్ర అంతా చెప్పినాడు.

ఆంధ్రభాష అందము తెలిపినాడు. ఆ తర్వాత సంస్కృతభాషా చరిత్ర తెలిపినాడు. సంస్కృతానికీ ఆంధ్రానికీ ఉన్న మహత్తర సంబంధాన్ని గూర్చి బోధించాడు.

ఈ చరిత్ర తెలుసుకోవడం ప్రతి ఆంధ్రభాషా విద్యార్థికి ముఖ్యమన్నాడు

అక్కడ నుండి అతడు పరీక్షకు ఏర్పాటయిన గ్రంథాల పాఠాలు చెప్పడం సాగించాడు. తిక్కన భారతంలోని ఉపాఖ్యానం ఒకటి ఉన్నది. తిక్కన కవిత్వము, భారత కవిత్వం తిక్కన్నకాలం నాటి చరిత్ర, చరిత్రకు కవిత్వానికీగల సంబంధమూ అన్నీ బోధించాడు.

అతని గంభీరమైన బోధనాశక్తి సౌందర్యవంత మయినది. అతని కంఠము మధురమైనది. అతని గుణగణాలు. ఆతని మూర్తి మనోహరమైనవి. ఒకదాన్ని గమనిస్తూ, ఇంకోటి మరిచిపోతుంది, అన్నీ ఒకసారి గమనిస్తుంది. ఇంకా చెప్పమంటుంది. తొమ్మిదిగంటలకు ప్రారంభించిన పాఠం పదింటికి పూర్తిచేస్తే అతనిపాఠము తనకు చాలటంలేదంటుంది అనంతలక్ష్మి.

జయలక్ష్మి కోనంగి పాఠం చెప్పే విధానం చూస్తోంటే ఆమెకూ ఆనందం కలిగింది. ఎంత బాగా చెపుతారు ఈ అబ్బాయి అనుకుంది. కొంచెం ఆడతనం వుంది అతనికి మోములో, శిశుతనం అతని గుణాలలో, కొంచెం చిలిపితనం ఉంది అతని మాటలలో.

పాఠం పూర్తిఅయిందాకా జయలక్ష్మి వారిరువురి దగ్గరే కూర్చుని ఉండేది. కోనంగిని కారు ఎక్కించి, తర్వాత ఇతర పనులు చేసుకునేది.

అలా నెలా పదిహేనురోజులున్నరకాలం గడిచింది. ఆ తర్వాత ఒకనాడు కోనంగి కారుదిగి హొటలు గుజరాత్ భవనంలో వెనకప్రక్క పని చేయువారున్న గదులలోనికి వెళ్ళబోతూ ఉన్న సమయంలో అక్కడే నిలిచి ఉన్న ఒక పెద్దకారులోంచి, ఒక గూడకట్టు మనిషి వచ్చి, కోనంగిని పిలిచి, "సార్ మీరుదానే కోనంగిరావూ?" అని ప్రశ్నించాడు.

"అవును."

"మిమ్మల్ని అర్జెంటుగా మా జమీందారుగారు తమకారుమీద తీసుకు రమ్మన్నారు."

"ఎవరు మీ జమీందారుగారు? ఎందుకు తీసుకురమ్మన్నారు నన్ను?"

"తిరువేనుంగుడి జమీందారుగారు. ఎందుకు తీసుకురమ్మన్నారో మాకు తెలియదు సామీ! తాము స్వయంగా ఎక్కే డెయిమ్లరు కారే పంపించారు. అర్జెంటుదా సొన్నారు (చెప్పారు)."

"ఇప్పుడే వచ్చాను. అక్కడ ఎంత ఆలస్యం అవుతుంది?"

"యారు సెప్తారు సామీ!?"

"సరే, పదండి."

కోనంగి కారు ఎక్కాడు. కారు ముందుకు సాగింది. అతివేగంగా మౌంటురోడ్డు వెంటనే చెంగల్పట్టు వెళ్ళేదారిని పరుగులెత్తింది. అరగంట అయినది. ఎంతకూ ఆగదు.

కోనంగి పక్కన కోనంగిని ఆహ్వానించిన ఆయన కూర్చున్నారు.

కోనంగి ఆయన్ని చూచి "ఎక్కడ ఉన్నాము? ఎంత సేపటికి వెళ్ళగలము అక్కడికి?" అని ప్రశ్నించాడు.

"ఇక్కడ ఉన్నామురా పైత్తకారీ" అంటూ ఆ పెద్దమనిషి కోనంగిని పళ్ళూడేంత బలంగా చెళ్ళున లెంపకాయ కొట్టాడు. కోనంగి తెల్లబోయి లేవబోయేసరికి ఇంకో చెంపకాయవేశాడు. కళ్ళు పచ్చబడిపోయాయి కోనంగికి ఆ మనిషి చేయి యినుపచేయి.

"ఒరే గాడిద కొడకా, ఆడపిల్లలకు పాఠాలు చెబుతావా? రాత్రిళ్ళప్పుడా! నీ పీకనులిమి ఇప్పుడే ఏ కొండలోనో పారేయాలిరా!" అంటూ అయిదారు చెంపకాయలు కొట్టినాడు కోనంగిని. బాధచేతా, పౌరుషంచేతా, ఏమీ చేయలేనితనంచేతా కళ్ళనీళ్ళు తిరిగాయి. చెంపలు వాచిపోయాయి, క్రింద పెదవి తెగి రక్తం కారిపోతోంది.

మరునిమిషంలో కోనంగి దూలంలాంటి ఆ పెద్దమనుష్యుని గొంతు పట్టినాడు. కోనంగి ఈతలో అఖండుడు ఎప్పుడూ హాకీ ఆడేవాడు. భయపడ్డాడు. వెర్రికోపం వచ్చింది. ఒళ్ళు తెలియని రుద్రరూపుడై ఆ పెద్దమనుష్యుని పీక పట్టుకొని తన సర్వశక్తులు వినియోగిస్తూ అతని కంఠము ముడిబొటనవేళ్ళతో నొక్కినాడు.

ఇద్దరూ కలసి కిందపడ్డారు. అవతలివాడు గుప్పిళ్ళు ముడిచి, కోనంగి తలమీద పిడుగులాంటిగుద్దులు గుద్దుతున్నాడు. కోనంగి, అతనిపీక బ్రహ్మరాక్షసునిలా నొక్కుతూ అతని మోము మీదకు వంగి, తన పళ్ళతో అతని ముక్కును పళ్ళులోనికి దిగేటట్టు కొరికాడు. వాడు గుద్దడం మాని కోనంగి తల వెనక్కు నెట్టడానికి కోనంగిజుట్టు పట్టుకున్నాడు. డ్రైయివరు ఒక పక్కరోడ్డు దొరికేవరకూ కారుపోనిచ్చి, ఆ పక్కరోడ్డులోనికి పోనిచ్చి ఆ కారు ఆపి, తానూ కోనంగిమీదకు ఉరికాడు.

కోనంగి ఆ పెద్ద మనిషిముక్కును కండ ఊడేటంత కొరగ్గానే 'ఓ' అని ఆరచి, అతడు కేక వేయడంవల్ల, అంత గొప్ప వస్తాదును మించిన మహావీరుడు కోనంగి కాబోలు ననుకొనే కారు అపుచేశాడు. డ్రైవరు కోనంగి మీదకు ఉరికాడు. కోనంగి ఈతని పీకనొక్కడం మరింత గట్టిచేశాడు. డ్రైవరు అది చూచి తన మొలలో ఎప్పుడూ వుండే అరువల్ (కత్తి) తీశాడు పొడవడానికి. అది ఎలా గ్రహించాడో కోనంగి, మొదటివాని పీకవదలి రెండవవాడు కత్తిఎత్తేలోపుగా వాడి మొగంమీద తన జోడు కాలితో తన్నాడు. ఆ తన్ను కోనంగి అదృష్టం కొద్దీ వాడి యెడమ కంటికి తగిలి ప్రాణం జిల్లార్చుకుపోయే బాధపెట్టి 'ఓ' అని అరచి కత్తి వదిలాడు.

ఆ కత్తి సీటుమీద పడింది. కోనంగి ఆ కత్తి అందుకుని రివ్వున లేచాడు. డ్రైవరు కారు తలుపు తెరచి పైకి ఉరికాడు. మొదటివాడు కోనంగి పట్టిన గట్టి పట్టువల్ల పది నిమిషాలు ఒళ్ళు తెలియక పడివున్నాడు.

ఇప్పుడు మెలకువ వచ్చి, మొదటివాడు "సామీ, మీరు పొండి, మాకు బుద్ధి వచ్చింది" అన్నాడు.

కోనంగి కాలభైరవునిలా లేచి "ఓరి వెధవల్లారా! మిమ్మల్నిద్దర్నీ చంపి మరీ వెడతానురా" అని అరచాడు.

కింద పడినవాడు తన అరువుల్ మొల నుండి తీద్దామని ప్రయత్నం చేశాడు. కాని కోనంగి ఆ చేతిని తన జోడుకాలితో నొక్కాడు. చేతివేలు ఒకటి ఫెళ్ళున విరిగింది.

త్రాగుడువల్ల నీరసించిన దుండగీళ్ళు త్రాగుడుబలంతో ప్రాణాలుతీయడానికి వెరవరు. స్వచ్ఛమైన బ్రతుకు బ్రతికిన కోనంగిలో వున్న బలం వారు ఊహించుకోలేక పోయారు.

కారు డ్రైవరు రోడ్డు ప్రక్కపడివున్న పెద్దరాయి తీసికొని వెనక తలుపు తెరచి కోనంగిమీదకు వేసేసరికి, కోనంగి డ్రైవరు సీటు లోనికి ఉరికాడు. ఆ రాయి వచ్చి క్రిందపడి లేవబోయేవాడి గుండెకు తగిలి "నీకొం[డ్రు] పోటాయిడా!" అని అరచి వెనక్కి పడ్డాడు. కోనంగి కారులోంచి బయటపడి తనచేతిలో వున్నకత్తితో కారు చక్రం టైర్లు పరపర కోసిపారేశాడు.

డ్రైవరు తనమీదకు వచ్చేసరికి కత్తి పుచ్చుకొని వాడిమీద కురికాడు. వాడు "ఓ" అని కేకలువేస్తూ పొలాలలోనికి ఉరికాడు.

కోనంగి వెంటనే కారుకడకు వచ్చి, కత్తి క్రిందపడవేసి లోనవున్న మనిషిపై రాయితీసి, వాడు మూలగడం చూచి, భయము లేదనుకొని, పక్కపొలంలోని నీళ్ళు తీసుకొని వచ్చి మొగంమీద జల్లి, వాణ్ణి ఎత్తి సీటుమీద పడుకోబెట్టినాడు.

## (10)

**కా**రు సైదాపేటకు ఎనిమిది మైళ్ళలో ఆగింది. ఆ విషయం కోనంగి ముఖ్య రాజపథంమీద మైలురాయిని చూచి తెలుసుకొన్నాడు. హెూటలు గుజరాతుకు పదిహేనుమైళ్ళు నడవాలిరా భగవంతుడా అనుకుంటూ సైదాపేట వైపు దారిపట్టాడు.

వాళ్ళిద్దరూ కలసి కారుచక్రపు టైరు వేరొకటి తగిలించి వెళతారు కాబోలు అనుకున్నాడు. తన మొగం అంతా వాచింది. ఒళ్ళంతా భరింపలేని బాధ. తనతో రాక్షసి యుద్ధంచేశారు ఇద్దరూ.

ఏమిటి వీళ్ళ ఉద్దేశ్యం? ఆడపిల్లలకు చదువు అంటే అనంతలక్ష్మికి చదువు కదా? ఆ చదువు చెప్పడం ఆ జమీందారు కెవ్వరికో ఇష్టంలేదు.

జమీందారూ లేదు గిమీందారూ లేదు. తప్పకుండా ఈ పని ఆ నాటుకోటి చెట్టిగారిది కావచ్చు. చెట్టిగారికి తాను అనంతలక్ష్మికి పాఠాలు చెప్పడం యిష్టంలేదు. ఆ మనిషిని చూస్తేనే వట్టి నూనె మనిషిలా వున్నాడు.

అతనికి అనంతలక్ష్మిని కబళిద్దామనివుంది. ఎవరీ అనంతలక్ష్మి? చెట్టియారుగారికి ఈ కుటుంబానికి ఏమిటి సంబంధం? డెయిమ్లరుకారు చెట్టియారుగారికే ఉండాలి. లేదా వేరే యింకా జమీందారు ఉన్నాడేమో, అతడలా కన్నువేసి వుంచాడేమో! ఈ విషయం చెట్టియారుగారికి ఏమీ తెలియదేమో? తాను ఊరికే భ్రమపడ్డాడేమో?

ఎవర్నీ యిలా ఈ రోజులలో చేయరు. అంత దౌర్జన్యం ఇంకోటిలేదు. ఒక్కబాలికా జీవితంలో అనేక కారణాలవల్ల అనేకులకు వ్యవహార సంబంధాలు వుంటే ఓర్వలేనితనం, చేతకానితనాలవల్ల ఒక దుర్మార్గుడు అలా సంబంధము కలిగివున్న ప్రతివాణ్ణి చంపించి వేయడమేనా? లేకపోతే చావగొట్టడమా?

కాని మా బాగా బుద్ధిచెప్పాడు తాను గుండాలిద్దరికీ. కొంచమయితే తానే వాళ్ళిద్దరనీ చంపేవాడేమో! తన దగ్గిర ఆ కారుడ్రైవరు కత్తి ఆదొంగ పెద్ద గుండా కత్తీ రెండూ వున్నాయి. ఆ కత్తులమీద పేర్లుంటే, ఆ ఇద్దరు రౌడీల పేర్లూ తెలుస్తాయి. వాళ్ళని తానూ బాగా ఆనవాలు పట్టగలుగుతాడు.

వాడు కొట్టిన లెంపకాయలకు తన పెదవి చితికిపోయింది. ఎంత వాచిందో ఈ పెదవి!

ఇంక తన కర్తవ్యం ఏమిటి? తాను భయపడి అనంతలక్ష్మికి పాఠం మాని వెయ్యడమా, చెప్పడమా? ఈ చచ్చుగుండాలకు భయపడి తాను తన గౌరవాన్ని వదలుకోవడమేనా?

"ఓయి కోనంగి! నీ కెందుకు భయమూ?

చాలుచాలు నయమూ

ఏమంటిని రయమూ

త్వరగా నడు టయిమూ"

అని పాడుకుంటూ నడకవేగం ఎక్కువ చేశాడు. తల, మొగమూ యెంతో బాధ పెడుతున్నాయి. నవ్వబోతే పెదవులు మరీ నొప్పి పెట్టాయి.

ఈ చెట్టి ఎంతపనిచేశాడు! "ఓయీ నాటుకోటీ, నీ కోట్లతో కోనంగేశ్వరరావు బ్రతుకు సందులలో ప్రయాణానికి అడ్డం పెడదాము అనుకున్నావు కాబోలు?"

"రాబోకు రాబోకు చెట్టియారూ

నీ బోంట్లు మాబోంట్ల కడ్డురారూ"

అనుకుంటూ వేగం ఎక్కువ చేశాడు. ఇంతట్లో వెనకనించి కారులైట్లు కనబడ్డాయి. ఎందుకైనా మంచిదని ఒక మళుపు తిరిగి పొలంలోనికి దిగి చేతులలో రెండుకత్తులూ ధరించి చెట్టుచాటున నిలుచున్నాడు కోనంగి. కారు నెమ్మదిగా వచ్చి అక్కడే ఆగింది.

అందులోంచి డ్రైవరు ధిగాడు. "కోనంగిరావుగారూ, మీరుదా ఇక్కడ ఉండే రండి! తీసుకువెళ్ళి మీ హోటలులోదా దింపుతాము!" అని ఓ మోస్తరుగా కేకవేశాడు.

"అక్కరలేదయ్యా, నీ కారూ నువ్వూనూ! నడు. నీకారును విమానం చేయగలిగితే ఎగిరి చక్కాబో, స్వర్గలోకానికో, యమలోకానికో" అన్నాడు కోనంగి.

కారుడ్రైవరు "మీ చిత్తందా!" అనినాడు కారులో ఎక్కి. కారు సాగింది. అయిదు నిమిషాలలో మాయమైపోయింది. అక్కడ నుంచి కోనంగి కాళ్ళీడ్చుకుంటూ నడిచి మూడుగంటలకు సైదాపేట చేరాడు. సైదాపేటలో బస్సులు అయిదుగంటలకు బయలుదేరతాయి. ఆ బస్సుస్టాండు దగ్గర ఉన్న కాఫీహోటలుకు ముందున్న బల్లమీద వాలిపోయి కొంచెం చలివేయడంవల్ల ముడుచుకొని పడుకున్నాడు.

చలి ఎక్కువగా వేసింది. తలనొప్పి చంపుతోంది కోనంగిని. ఒళ్ళువేడెక్కింది. ఒళ్ళునొప్పులు ఎక్కువైనాయి. అలాగే ముడుచుకొని పరుండి అయిదుగంటలకు మొదటి బస్సుమీద హోటలు గుజరాతు దగ్గిరదిగి. అప్పుడే సేవకుల దొడ్డిద్వారం తెరచివుంటే అందులోంచి లోనికిపోయి, తన గదిలో తనతోబాటు వుండే ఇద్దరు వడ్డనదార్లు లేకపోవడం కూడ గమనించలేని దశలో తన పక్కమీద పడుకొని, దుప్పటి కప్పుకొని నిదురపోయాడు.

పాడు కలలు. కలలు లేకుండా ఏదో మత్తూ. మైళ్ళకొద్దీ దూరాన ఉన్నట్లు ఎవరో ఎక్కడో మాటాడుతున్నట్లయింది. కోనంగి అలా పడివుండి ఎన్ని యుగాలకో కళ్ళు తెరిచాడు.

ఎదురుగుండా మంచంమీద అనంతలక్ష్మి కూచుని ఉంది. ఆమె వెనుక జయలక్ష్మి కుర్చీలో అధివసించి వుంది.

"గురువుగారూ, ఏలా వుంది?"

"ఎలా ఉండడమేమిటి?" (మాట నీరసంగా వుంది.)

"మీకు పదిహేనురోజుల నుండి ఒళ్ళు తెలియని జ్వరం. మీ ఒళ్ళంతా హైూనమై ఉంది. ఏమిటిదంతా?"

నర్సు "నెమ్మదిగా చెప్పండి కబుర్లు. రోగి ఆవేదన వృద్ధి చేయకండి. ఆయన ఒంటికి మంచిదికాదు" అని అన్నది.

**అనంతలక్ష్మి:** అలాగేనమ్మా!"

**జయలక్ష్మి:** మీ కోసం రెండురోజులు చూచింది మా అమ్మాయి. దాని బాధ ఎక్కువ అయింది. చివరకు పదిరోజుల క్రిందట నేనూ, అమ్మాయి మీకోసం హెూటలు గుజరాత్ వెళ్ళాం. వచ్చిందాకా ఊరుకొంటేనా? అక్కడ ఒళ్ళుతెలియని జ్వరంలో ఉన్నారు. హెూటలువారు మీకేదో మందిప్పిస్తున్నారు. జ్వరంతో అనేరకాల మాటలు. మా కారుమీద ఎక్కించుకొని మా ఇంటికి తీసుకువచ్చాం: మా కుటుంబం డాక్టరు రెడ్డిగారు శాయశక్తులా పనిచేశారు. ఒళ్ళుగాయాలకు కట్టుకట్టించారు. ఇంజక్షనులు ఇచ్చారు. రక్తం పరీక్షచేశారు. నిన్నరాత్రి చటుక్కున జ్వరం తగ్గింది. మీకు వచ్చిన జ్వరం పెద్దరకం మలేరియాటండి. అందులో తలమీద ఏవో దెబ్బలు తగిలి ఆ మలేరియావల్ల మీరు మమ్ము గుర్తు పట్టలేకపోయారు అని తెలిసింది.

"అబ్బా! ఇంత పెద్దగాథ జరిగిందటండి?" అని నీరసంగా నవ్వాడు కోనంగి

## చతుర్థ పథం

# ఆరోగ్యం

**కో**నంగి, చిక్కిన మోముతోనూ, గడ్డం, మీసం పెరిగిన మోము తోనూ తదియనాటి వెన్నెలలా నవ్వుతూ "అదోరకం మలేరియా, పెద్దరకం మలేరియాయే వచ్చింది మన పెద్దరికం తీసేసింది" అని మళ్ళా అన్నాడు.

అనంతలక్ష్మి అతని సంతోషానికీ, అతడు సలిపే హాస్యానికీ, అతడు బ్రతికాడన్న దివ్యభావానికీ ఎండా వానలా పకపక నవ్వుతూ, కళ్ళనీరు జలజల కారుస్తూ మళ్ళీనవ్వుతూ నుంచుంది.

మన నాటుకోటి చెట్టిగారు, పాపం, ఈ పదిరోజులూ వచ్చి కోనంగికి ఎల్లా ఉందని కనుక్కుంటూనే వున్నారు.

"ఆ హెూటల్లో జబ్బుపడి ఉన్న మనిషిని, ఈ అనంతలక్ష్మి తీసుకు వచ్చింది. దీనికి బుద్ధిలేదు! బోగందానిగుణం పోగొట్టుకొందికాదు! ఈ దుర్మార్గుడు చావనన్నా చావక ఈలా బ్రతికి ఉన్నాడు. అయినా తొందరలేదు. జ్వరం తీవ్రంగా వస్తోంది. ఇంతవరకు తెలివిరాలేదు. వచ్చినా అది సంధి తెలివి. ఒకవేళ జ్వరం తగ్గిందా, తనకు తగిలిన దెబ్బలకు బుద్ధివచ్చి ఇకరాడు. వచ్చాడా, ఇంకో చక్కని మార్గం చూచుకోవచ్చును.

అనంతలక్ష్మికి తానుతప్ప కన్యరికం చేయగల శక్తిగలవాళ్ళు ఎవరు" అని లోపల ఊహించుకొనేవాడు. కాని కథ అడ్డం తిరిగింది.

అనంతలక్ష్మి దేహంలో మనస్సులో నిర్మలత్వం ఉంది. రఘునాధరాయని హృదయ మహారాజ్యం ఆక్రమించి, చక్రవర్తియై రాజ్యమేలిన దివ్యసుందరి, భూమికి దిగివచ్చిన పరమాప్సరస సుందరి మధురవాణి అందమంతా ఈ బాలికలో ప్రత్యక్షమైంది. కొంచెం కోల, కొంచెం గుండ్రని మోము, అయిదడుగుల ఎత్తు, పొట్టి పొడుగుకాని ముక్కు సమమైన కోలతనంలో దవడలో, బుగ్గలు ఫాలము ఏకరేఖా ప్రవాహ సామ్యం కుదిరి వుంటాయి. అలాంటి మోము గుంటలుపడే బుగ్గలు, కొంచెం పైకి తిరిగిన పై పెదవీ, కొంచెం అంటే కొంచమే ఎత్తయిన క్రింది పెదవీ, సుడులుపడే సమ చుబుకమూ ఉండి, ఆ మోము కాసు బంగారంరంగు కలిగి, ఆ రంగుకు తగినట్లు లేత గులాబి రాగం అప్పుడప్పుడా బుగ్గలకు ప్రసరిస్తూ ఉంటే, అలాంటి సౌందర్య నిధులన్నీ చేకూరినచోట, ఆ నిధులకు కిరీటంలాంటి కళ్ళ అందం వెలసిందనుకొంటే, ఆ దివ్య సౌందర్యవదనం అనంతలక్ష్మిది. కాంచనమాలను, సుబ్బలక్ష్మిని, నళినీజయవంత్‌ను ముగ్గురినీ కరిగించి పోతబోస్తే అనంతలక్ష్మి అవుతుంది.

అవును. అనేకమందికి చక్కని హృదయాలనన్నీ గబగబ పువ్వుపుణికినట్లు పుణికే శక్తిగల సౌందర్యపూర్ణమైన మోము ఉంటుంది. అంతే. ఆ మోముకు తగిన తలగానీ, తలకట్టుగానీ ఉండవు. అతి పెద్ద లంకగుమ్మడి లాంటి తలో, పొన్నకాయలా మెదడులేని తలో ఉంటాయి. అనంతలక్ష్మికి తలకట్టు, తోడిరాగాలాపన ఆమె కేశ సౌభాగ్యము. కేశరంజనివారి ప్రకటన చిత్రాల తలకట్టులకు పాఠాలు నేర్పుతుంది.

ఎవరైనా ఒకశిల్పి "నీకు ఆ తలమాత్రం చాలదా" అని తెలివిగా అంటే పెదవి విరిచి ఊరుకుంటాడు.

పూర్వకవి అందాల మెడను శంఖంతో పోల్చాడంటే ఊరికే పోల్చాడా? ఇంగ్లీషుకవి వర్ణించే హంసమెడ ఆంధ్రకవిని హడలు కొడ్తుంది.

శంఖంవంటి కంఠం అంటే పైన లావు క్రింద సన్నమనిగాని, క్రిందలావు పైన సన్నమనిగాని కాదని కోనంగి అనంతలక్ష్మి కంఠంవైపు చూపులు పరుస్తూ అనుకున్నాడు. మూడు రేకలతో కూడిన్నీ శంఖం కాబోయే రూపము కలిగిన్నీ, శంఖంలా స్వచ్ఛమైన రంగు కలిగిన కంఠం సౌందర్యాతి సౌందర్యవంతమైనదని కవుల భావం అనుకున్నాడు కోనంగి. అలాంటి భావానికి పరిమళం ఇస్తుందికదా అనంతలక్ష్మి కంఠం.

అనంతలక్ష్మి కోనంగికి దాది అయింది. జయలక్ష్మి అనంతలక్ష్మిని "కాలేజీకి వెళ్ళు తల్లీ. నేను యీయన్ను చూస్తూ ఉంటా"నని బ్రతిమాలినా వినందే! మొదట కోనంగిని జ్వరంతో తీసుకుని వచ్చినప్పుడు కాలేజీకి వెళ్ళింది. కాని అక్కడ ఆమెకు ఏమీ తోచలేదు. ఏడుపు వచ్చినంత పని అయింది. మొదటిగంట కొట్టగానే ఒక ఉత్తరం తనకు జ్వరంగా ఉన్నదని వ్రాసి అనంతలక్ష్మి ప్రిన్సిపాలుగారికి ఇచ్చి, ఈవలకు వచ్చి, ఒక రిక్షా చేసుకొని ఇంటికి వచ్చివేసింది. మళ్ళీ కోనంగికి జ్వరం తగ్గేవరకూ కాలేజీ గడప తొక్కలేదు.

"తల్లీ, నీకు కూడా జబ్బుచేస్తుందేమోనే!" అని తల్లి అంటే ఆమె వినలేదు. తిరుపతి వెంకటేశ్వరులకు మ్రొక్కుకుంది. మన్నారుగుడి శ్రీకృష్ణునికి మ్రొక్కుకుంది. శ్రీరంగం శ్రీరంగశాయికి మ్రొక్కుకొంది అనంతలక్ష్మి.

అతనికి నార్మల్ వచ్చి మాట్లాడుతూ ఉంటే ఆమె ఆనందం వర్ణనాతీతము.

ఈ చరిత్ర అంతా జయలక్ష్మి కనిపెడుతూనే ఉంది. తానూ అలాగే ప్రేమించింది అయ్యంగారుని, తన్ను ప్రేమ సముద్రంలో పూవుల ఓడలలో తేల్చుకొని పోయినా దా ప్రియమూర్తి.

ప్రేమ అనే మహోత్తమ స్థితి మనుష్యుని జీవితంలో ఊరికేరాదు. భర్తతో స్నేహమూ, స్త్రీ పురుష సంబంధ ప్రీతీ సమ్మిశ్రితమై ఒకరకమైన ప్రేమగా పరిణమిస్తాయి. ఒకనాడాస్థితి సంపూర్ణప్రేమ కావచ్చును.

కాని అసలు ప్రేమే స్త్రీకిగాని, పురుషునికిగాని సంభవిస్తే, అది అమృత మహానది. సరస్సు కట్టలు తెగినట్లవుతుంది అని జయలక్ష్మి అనుకుంది.

అనంతలక్ష్మి వరస చూస్తే కోనంగిరావుని పూర్తిగా ప్రేమిస్తున్నట్లే జయలక్ష్మికి నిర్ధారణ అయిపోయింది.

ఏమిటి ఇప్పుడు కర్తవ్యం? అని జయలక్ష్మి అనుకుంటున్న సమయంలోనే అనంతలక్ష్మి కోనంగిచేత బార్లీ జావ త్రాగిస్తున్నది.

"ఆకలి అవుతున్నది, కాని సయించడంలేదు లక్ష్మీ!"

"మీవంట్లో ఒక వీశెడు క్వినయిను ప్రవేశించింది. అందుకనేగాదండీ మిమ్మల్ని పళ్ళరసం తెగతాగమంటారు డాక్టరు!"

"సరేలే! రెండు మూడు రోజులలో పైత్యనాడి తిరగకపోతుందా ఏమిటి? తిరక్కపోతే పైత్తకారినే అయిపోతాను!"

"అయితే గురువుగారూ, మీరు ఎప్పుడూ అల్లా నవ్వువచ్చే మాటలు మాట్లాడుతూనే ఉంటారా?"

"నాకు ఏడుపు మాటలు చేతకావు. కృష్ణశాస్త్రిగారి శిష్యరికంచేసి ఇంత ఏడుపు కవిత్వం రచించడమన్నా నేర్చుకోవాలి!"

"నవ్వు కవిత్వం, ఏడుపు కవిత్వాలేగాని, ఇంకోరకం కవిత్వం తెలుగులో లేనేలేవా అండి?"

"లక్ష ఉన్నాయి. రాయప్రోలువారి ప్రియురాలే చెల్లెలు కవిత్వం, వేదులవారి పూవుల కవిత్వం, నండూరివారి పల్లెటూరి కవిత్వం, తుమ్మలవారి రైతు కవిత్వం, విశ్వనాథవారి ఎత్తుకొండల కవిత్వం, కాటూరి పింగళుల తేనేపెరడు కవిత్వం, కవికొండలవారి అటుకులు, జీడిపప్పు కవిత్వం, దీక్షితులవారి బువ్వాలాట కవిత్వం...."

"అదేమిటండీ! ఒకటడిగితే ఇరవై చెబుతారు ఇంత నీరసంగా ఉన్నారు కూడా?"

"ఈలా మాట్లాడుతూఉంటే, కాస్త జావకూడా సయిస్తుంది. ఇంకో వెండిగిన్నెడు జావా, దానితోపాటు సాతుకుడిరసం ఒక పెద్ద గ్లాసుడూ పట్టుకురా అనంతయ్యగారూ!"

"అలాగేనండి కోనంగమ్మగారో!" అంటూ పరుగెత్తింది అనంతలక్ష్మి నవ్వుకుంటూ.

ఆమె పరుగెత్తుతూ ఉంటే ఆమె దేహసౌష్టవచంద్రిక వెన్నెల కురుస్తుంది అనుకొన్నాడు కోనంగి. ఎక్కడా అపశ్రుతిలేని శరీరాంగ నిర్మాణం ఈమెలో చేతులూ, వక్షనిధులు, నడుము, కటి, కాళ్ళు, పాదాలు బ్రహ్మదేవుడు దివ్యలలిత కళాపారవశ్యకతతో సృష్టించి ఉంటాడను కున్నాడు. అందమైన బాలికలు ఉండడమే లోకానికి ఆపత్తు. అందం సూదంటురాయి. మగవాళ్ళు అనే ఇనుప శకలాలను ఆకర్షిస్తే ఏలాగు తనబోటి దద్దమ్మల బ్రతుకు!

అందాని కందం, ధనానికి ధనం, సంస్కృతి, విద్య అన్నీ ఉన్న ఈ బాలిక ఏమిటి? ఎక్కడో ఒక్క కోనంగి, కొక్కిరాయి తానా?

ఇంతలో అనంతలక్ష్మి బార్లీజావా, పళ్ళరసం పట్టుకు వచ్చింది.

"నేను అమ్మాయినా?"

"నేను అబ్బాయినా?"

## 2

**ప**ది పద్యాలు వంటబట్టి, కోనంగికీ బలం వచ్చింది. మళ్ళీ కోలుకొన్నాడు. వెనుకటి తేజస్సు వచ్చింది.

ఇంక తన హొటలు గుజరాతుకు వెడతానన్నాడు. ఈలోగా మన చెట్టిగారి పుణ్యమా అని కోనంగిని గూర్చిన దర్యాప్తు యావత్తూ జయలక్ష్మికీ, అనంతలక్ష్మికీ కూడా తెలిసింది. చెట్టిగారు బందరు ఉత్తరాలు వ్రాయించి, కోనంగి చరిత్ర అంతా తెలుసున్నాడు. అదంతా తారుమారు చేసి జయలక్ష్మికి తెలియజేశాడు.

"కోనంగి తండ్రి ఎవరో తెలియదు. చెడిపోయిన ఒక బ్రాహ్మణ దానికి వీడు పుట్టాడు. ముష్టిఎత్తుకుని తల్లీ కొడుకూ బ్రతికారు. ముష్టివల్లనే చదువుకున్నాడు. తల్లి ఇంకా జారిణీవృత్తి చేస్తూంది. వీడు వట్టిరౌడీ, ముండల ముఠాకోరు. కొంచెం దొంగతనం కూడా వుంది వీడి దగ్గిర" అని చెట్టియారుగారు జయలక్ష్మికి చెప్పాడు.

జయలక్ష్మి కూతురుతో "అమ్మిణీ, మనకెందుకే ఈ దౌర్భాగ్యుడు? తల్లికీ తండ్రికీ పుట్టని మురికికాల్వ మనిషి. వాడికి చేసిన జబ్బు పాతరోగమట! ఆ రోగం కట్టుతప్పిన చండాలురకు మాత్రం వస్తుంది. ఈ సంగతి మన డాక్టరే చెప్పాడట" అని చెప్పింది.

అనంతలక్ష్మి తల్లి మాటలకు లోలోన మండిపోయింది. కాని పైకి ఏమీ అనలేదు. ఇదంతా ఆ చెట్టియారు మహానుభావుడు తల్లికి నూరి పోసిన భావాలు. తన తల్లి వట్టి తెలివితక్కువ తల్లి కాబట్టి అన్నీ నమ్మింది.

కాలేజీకి వెడుతూ తను డాక్టరును కలుసుకొని, అనంతలక్ష్మి కోనంగి జబ్బుసంగతి అంతా అడిగింది. అయన స్పష్టంగా "కోనంగిరావుగారిని ఎవరో దెబ్బలు కొట్టడంవల్ల ఆయనలో ఎక్కడో అణగిఉన్న మలేరియా బయట పడినది. తలపై యెక్కువ దెబ్బలు తగిలి అలా ఒళ్ళు తెలియక పడి ఉన్నాడు. మంచి ఆరోగ్యవంతుడవటంవల్ల తేరుకున్నాడు" అని చెప్పాడు.

"అయితే ఆయనకేమీ స్త్రీ సంబంధమైన రోగాలు లేవా?"

"ఛా! ఛా! ఆ బాలకుడు ఉత్తముడు. ఎందుకంటావా, సంధిలో అతడు మాటాడిన మాటలన్నీ ఉదాత్తమైనవీ, హాస్యరసపూరితమైనివీన్ని. ఒక్కపొల్లుమాటైనా రాలేదు."

"సంధిలో మాటలనుబట్టి...."

"మంచి చెడ్డలు నిర్ణయించగలం. సంధిలోనూ, మత్తుమందు ఇచ్చినప్పుడూ పూర్తిగా మత్తురాని మునుపూ, హృదయంలో స్త్రీలలో అణచు కొన్న అసలు భావాలు బైటపడతాయి. అందుకని ఆ మాటలనుబట్టి మనుష్యుని నిజతత్వం బయటపడుతుంది."

అనంతలక్ష్మి వెళ్ళిపోయింది. అనంతలక్ష్మి వెళ్ళిన గంటకు డాక్టరుగారి దగ్గిరకు చెట్టియారు చక్కావచ్చారు.

**డాక్టరు:** ఏమండీ! ఇలా దయచేశారు?

**చెట్టి:** మీకోసం డాక్టర్!

**డాక్టరు:** ఎందుకూ?
**చెట్టి:** నా ఉద్దేశం చెప్తాను. కోనంగిరావు అనంతలక్ష్మిపై కన్నువేశాడు. వాడు వట్టి లోఫర్. బి.య్యే. అయితే సరేనా మరి, గుణాలు ఉండాలి. ఇంతకూ వాడు ముండల ముఠా కోరు. నేను అనంతలక్ష్మిని పెళ్ళి చేసుకోదలచుకున్నాను. కోనంగి విషయంలో ఆ అమ్మాయి...
**డాక్టరు:** కొంచెం సదభిప్రాయంతో ఉందని మీ ఉద్దేశం?
**చెట్టి:** అవునండి. మీరు కోనంగికి వైద్యం చేస్తున్నారు. అతనికి సుఖవ్యాధులు ఉండకూడదా?
**డాక్టరు:** అలాంటివి యేవీ లేవని నేను నిర్ధారణగా చెప్పగలను.
**చెట్టి:** ఆమ, ఆమ. మీరు చెప్పింది నిజమే! కాని అనంతలక్ష్మిలో అనురాగరోగం కుదర్చాలి మీరు. నేను పదివేలు ఫీజు ఇచ్చుకో గలను.
**డాక్టరు:** అంత పెద్దజబ్బా అనురాగరోగం! రోగం సంగతి అంతా ఆలోచించి తర్వాత చెప్తానులెండి.

చెట్టియారుగారు సంతోషిస్తూ వెళ్ళిపోయారు.

డాక్టరు రంగనాయకులు రష్యాప్రియుడు, కమ్యూనిస్టువాది. కాంగ్రెసులో పనిచేసి చేసి దేశంలో ఉన్న శక్తులను కాంగ్రెసు కట్టుకు రాలేకపోతున్నదని, అహింసా వాదమువల్ల ఎదుటివాడి హృదయం మార్చడం అనే ఆశయం ఉద్భవం అవుతుందనీ, ఈలోగా తిండిలేక మాడిపోతూ ఉంటారు ప్రజలు అనీ నిర్ధారణచేసుకున్నాడు. ఆచార్య నరేంద్రదేవు, జోషీ, జయప్రకాష్ మొదలగువారి వాదనలు నచ్చాయి. ఆ రోజుల్లో కాంగ్రెసు ఎడమ చేతి వాదన వారుండేవారు. వారు కాంగ్రెసు సోషలిస్టులు, కమ్యూనిస్టులు, అనీ.

జోషి మీరట్ కేసులో ఉన్నాడు జైలుకు వెళ్ళాడు. ఆ సందర్భంలోనే ఆ తర్వాతనే జోషి, డాంగే మొదలగువారు కమ్యూనిస్టులుగా ఉండి రహస్యంగా సామ్యవాదాన్ని ప్రచారం చేస్తూ వచ్చారు. వారిలో చాలామంది కాంగ్రెసు సభ్యులే.

ప్రభుత్వం కమ్యూనిస్టు సంఘాలను నిషేధించింది. ఆ కారణంచేత కమ్యూనిస్టులు కాంగ్రెసులోనే ఉండి పనిచేస్తూ వుండిరి.

జయప్రకాష్ నారాయణ్, మెహరల్లీ, పుచ్చలపల్లి సుందరయ్య మొదలైనవారంతా కాంగ్రెస్‌లో సోషలిస్టులుగా (సాంఘికవాదులుగా) ఉండేవారు.

డాక్టరు వీరి వ్రాతలు చదివేవాడు. బోల్షివిజంను గురించి చదివేవాడు. 1928లోనే పరీక్ష పూర్తిచేసి, 1930లో మదరాసులో ప్రాక్టీసు ప్రారంభించాడు. డాక్టరుగారికి మొదటనుంచీ చక్కని కాతాలు ఏర్పడి మంచి హస్తవాసి అనిన్నీ, దిట్టమైన వైద్యుడు అనిన్నీ పేరుపొందాడు. 1930లో కాంగ్రెసు సత్యాగ్రహం ప్రారంభించింది. 1931 తిరిగి వచ్చింది. మళ్ళీ 1932 కాంగ్రెసువారి నందరినీ కారాగారాలలో బంధించారు. కాని చాలా మందిని ప్రభుత్వంవారు లాఠీ ప్రయోగంచేసి మాత్రం వదులుతూ ఉండేవారు.

అలాంటివారి కందరికీ ఆ రెండవ సత్యాగ్రహంలో డాక్టరుగారు వైద్యం చేసేవారు. కాంగ్రెసు శిబిరానికి వైద్యులయ్యారు. అందుచేత ప్రభుత్వంవారు డాక్టరుగారిని కూడా కారాగారవాసానికి పంపినారు. 1934లో అందరితోపాటు ఆయనా బయటికి వచ్చాడు. మరీ పెద్ద వైద్యుడై, నెలకు సునాయాసంగా పన్నెండు వందలవరకూ తెచ్చుకుంటున్నాడు.

కాంగ్రెసు ప్రభుత్వకాలంలో జనరల్ ఆస్పత్రికి గౌరవ వైద్యుడయ్యాడు.

డాక్టరు రెడ్డి వైద్యం ప్రారంభించినప్పటి నుంచీ శ్రీరంగయ్యంగారు రెడ్డిగారిని

తమ కుటుంబ వైద్యునిగా చేసుకున్నారు. అలా చేసుకొనడానికి ఒక ముఖ్యకారణం వుంది. అయ్యంగారు కారులో ఓ సాయంకాలం బీచికి వెడుతూ ఉన్న సమయంలో లజ్మూల కొంచెం పనివుండి ఆగి, మళ్ళీ కారెక్కి వెళ్ళబోయే సమయంలో, తలుపుమూస్తూ ఉంటే చేతివేలు నలిగింది.

ఎదురుగుండా రెడ్డిగారి వైద్యాలయం ఉంది. అందులోకి అయ్యంగారు పరుగెత్తి చేతికి కట్టుకట్టించుకున్నారు. అప్పుడు అయ్యంగారికి రెడ్డిగారంటే చాలా మంచి అభిప్రాయం కుదిరింది. అనాటి నుంచి రెడ్డిగారు అయ్యంగారి కుటుంబ వైద్యులయ్యారు.

## 3

డాక్టరు రంగనాయకులరెడ్డి ముఖ్యంగా మూలకారణవాది. కారణం లేకుండా కార్యం జరగదంటాడు. అందుకనే చెట్టియారుగారు తనకు పదివేలరూపాయల ఫీజు ఇవ్వడానికి సిద్ధం అయ్యాడే, అందుకు మహత్తర కారణం వెంటనే అర్థం చేసుకున్నాడు. డాక్టరు రెడ్డికి ప్రేమ అంటే నమ్మకంలేదు. స్త్రీ పురుష సంబంధం ఒక ప్రకృతి న్యాయమని ఆయన వాదన. పురుషునికి స్త్రీ కావాలి, స్త్రీకి పురుషుడు కావాలి. స్త్రీపురుషులు జాతి వృద్ధికోసం కలుసుకుంటారు. ఆ తర్వాత ఒకరికొకరికి సంబంధంలేదు.

బిడ్డలను కనవలసింది, పెంచవలసింది తల్లి. బలంకలిగిన మనుష్యుడు ఆంబోతు వంటివాడు కాబట్టి ఇరవై ముప్పదిమంది స్త్రీలను తన జట్టులో ఉంచుకొనేవాడు. ఇప్పటి కోతుల కుటుంబాలలో, అడవి ఏనుగులు, లేళ్ళు అంతేగాదా? ఆడవాళ్ళకు పురుష సంపర్కానికి కాలం, స్థలం కావాలి. పురుషులకు అదీలేదు ఇదీలేదు.

ఇంకప్రేమ ఎక్కడ వుంది? అది మనుష్యునిలోని నీరసత్వము. చరిత్ర ప్రవాహంలో మానవసంఘం చక్కగా నడవడానికి వివాహం అనే సంస్థను ఉద్భవింప చేసుకొన్నారు మనుష్యులు. దానివల్లనే ప్రేమ అనే కొత్తభావం వచ్చింది. విషయాలు తెలిసి ఉన్న వైద్యులు ఈ ప్రేమభావం ఎల్లా ఒప్పుకుంటారు? స్త్రీ పురుషులు ఒకరి నొకరు వాంఛించడం ఒక విధమైన నరముల పొంగువలన కలుగుతుంది. ఆది ప్రేమ ఎలా అవుతుందని ఆయన వాదిస్తాడు.

కాస్త శాస్త్రజ్ఞానం అబ్బిన దేశాల్లో వ్యభిచారం ఎక్కువ అవడానికి కారణం ప్రపంచాన్ని సరియైన విధానంగా అర్థం చేసుకోవడమే. పెళ్ళి స్త్రీ పురుషుల సంబంధాన్ని, రైలుపట్టా ఎక్కించడం వంటిది అని ఆయనవాదం. అందుకనే రెడ్డిగారు వివాహం చేసుకోలేదు. అనేకమంది పెద్దలు, బాలికలు ఆయన మనస్సు తిప్పుదామని ప్రయత్నం చేశారు. కాని లాభం లేకపోయింది.

డాక్టరు రెడ్డిగారు కోనంగి అంటే ఎంతో అనందం పొందినాడు. చెట్టియారుగారు లక్ష రూపాయలిస్తే మాత్రం కోనంగి భయంకర రోగపీడితుడని తాను చెప్పగలడా! ఈలాంటి దొంగసొమ్ము మైలుదూరంలో ఏభైఅడుగుల లోతు కలిగిన నూతిలో పడవేయాలి అని అనుకున్నాడు.

డాక్టరు రెడ్డిగారు కోనంగిని చూడ్డానికి వెళ్ళాడు. కోనంగి కులాసాగా ఉన్నాడు. పథ్యం వంటపడుతూ ఉంది. డాక్టరు ధర్మం, అధర్మము అనేవి మత విషయికములంటే నమ్మడు. శాస్త్రరీత్యా ప్రపంచం ఒకదానితో ఒకటి శ్రుతిగా సంబంధం కలిగిన న్యాయాలతో ధర్మాలతో నిండి వుండాలి. అంతవరకూ తాను ధర్మవాదే అని అనుకుంటూ కోనంగిని "ఏమండీ ఎవ్వరనుకుంటారు మిమ్మల్ని ఎత్తుకు పోయింది?" అని ప్రశ్నవేశాడు.

"నాకు అనుమానం ఉందండి. కాని అనుమానాలు పడడం అందమైన పనికాదు."

"అందమంటే?"

"ఆనందం ఇచ్చేది అందం."

"ఆనందం అంటే?"

"ఆనందం అంటే ఏమిటో జవాబు చెప్పగలమా! మామిడిపండు రుచిని వర్ణించగలమా డాక్టరుగారూ!"

"శాస్త్రరీత్యా ఏ విషయమైనా మనం వర్ణించవచ్చు కాదా అండి?"

"శాస్త్రానికి భాష సరిపోదు. వర్ణించడానికి మామిడిపండు రుచీ, వాసనా ఏమని వర్ణిస్తారు?"

"బాగానే ఉంది. కాని అనేక ఉపమానాలు అవీ చెప్పి ఆనందం అంటే ఏమిటో చెప్పగలను కాదా?"

"ఓ, చెప్పవచ్చును. కాని ఎంత చెప్పినా భూమీ ఆకాశం కలిసే చోటు చూడ్డానికి బయలుదేరడంలాగే ఉంటుంది."

"అమ్మో, మీరు అసాధ్యులండోయి! అయితే ప్రేమ విషయంలో మీ అభిప్రాయం ఏమిటి?"

"ప్రేమ అండి? ఒక పురుషుడూ ఒక స్త్రీన్నీ రాసాయనికంగా కలిసి మిశ్రమైపోదామన్న కాంక్ష!"

"వారెవా! మీ కెప్పుడైనా అలాంటి ప్రేమ కలిగిందా?"

"నాకా అండి? ఇంకా నన్ను నేను పరిశోధనాలయంలో పెట్టుకొని పరిశోధించుకోలేదండి?"

"ఇతరులు చెయ్యాలా? ఎవరికి వారు చేసుకుంటారా?"

"డాక్టరైన వారే ఒక మందును పరిశోధిస్తారు. ఇతరులు ఉపయోగిస్తారు. కాని తనకు తానే పరీక్షించుకోవలసి జబ్బుచేస్తే?"

"నేను ఎరిగున్నంతమట్టుకు ఏ మనిషి కా మనిషి పరీక్షంచుకొనే జబ్బు ఏమీ కనబడలేదే?"

"ఉంది డాక్టరుగారూ, ప్రేమ అనే జబ్బు!"

"ప్రేమ స్త్రీని పురుషుడు కోరడం, పురుషుడు స్త్రీని కోరడమేనా?"

"కాదండి, అంతమాత్రం అంటే సరిపోదు. అది ప్రేమలో ఉన్న ఇరవై గుణాలలో ఒకటి మాత్రం."

"తక్కినవి?"

"ఆ స్త్రీ కనబడకపోతే పురుషుడు గోల పెట్టటం, పురుషుడు కనబడకపోతే స్త్రీ రహస్యంగా కళ్ళనీళ్ళు కుక్కుకోడం."

"ఇంకోటి సెలవియ్యండి."

"స్త్రీ కోరిన పురుషుడు దొరక్కపోతేగాని, పురుషుడు కోరిన స్త్రీ సన్నిహితం కాకపోతేగాని, లోకం అంతా శూన్యం అవడం."

"లోకం అంతా అల్లాగే ఉంటుందా?"

"లోకం అల్లాగే ఉంటుంది. దానికి ఆలోచనా పాలోచనా ఉంటేనా అండి? కాని వీళ్ళిద్దరికీ లోకం ఉండదు. నిద్రబోయేవాడి మనస్సుకు లోకజ్ఞానం లేనట్లు!"

"ప్రేమ అంటే నిద్రవంటిదనా?"

"అయితే బాగానే ఉండును. లోకంలోని మనుష్యులందరూ బ్రతికి పోదురు. నిద్రపట్టనప్పుడల్లా, ఇంత ప్రేమ తెచ్చుకుంటే, నిద్రైనా పడుతూ ఉంటుంది."

"ఇంకా ఏమిటి, ప్రేమకు ఉన్న గుణాలు?"

"దేహ కలయిక ఒకటేకాదు. మనస్సూ, ఆత్మాకూడా కలవాలి."

"ఆత్మ అంటే?"

"మనస్సును మించిన ఒక శక్తి."

"అది ఎలా ఉంటుంది?"

"అసలు మనస్సు ఎలా ఉంటుంది? అది తెలుస్తే!"

"అది తెలియదా మీకు?"

"అబ్బే! తెలిస్తే ఇకనేమండి?"

"తెలియని వస్తువులు గుణాలెట్లా అవుతాయండి?"

"ప్రాణం అంటే ఏమిటో తెలియని డాక్టర్లు ప్రాణం రక్షించడానికి పాటుపడటం లేదాండి?"

"ఎంత దెబ్బకొట్టావయ్యా కోనంగీ!"

"నేను ఇంకా బలహీనంగా ఉన్నాను. దెబ్బలు కొట్టడమే!"

"మీరు ఏం చేద్దామని మద్రాసు వచ్చారు?"

"ఉద్యోగంకోసం."

"ఏం ఉద్యోగం?"

"అది ఇంకా నిర్ధారణ కాలేదు. అయితే బాగానే ఉండును."

డాక్టరు రెడ్డి కోనంగిని తన యింటికి వచ్చి ఉండవలసిందని, బాగా ఆరోగ్యం కుదరగానే ఎప్పుడు రావచ్చునో తానే చెపుతాననీ అన్నాడు. కోనంగి నవ్వుతూ "నేను బాగా వంట చేయగలనండి" అని అన్నాడు.

"మీవంట మాకేం రుచి?"

"చూస్తారుగా!"

## ④

**కో**నంగితో, "మళ్ళీ హోటలు గుజరాత్‌కు మిమ్ము వెళ్ళనివ్వను. మా ఇంట్లో ఉండండి" అని పట్టుపట్టింది అనంతలక్ష్మి.

"అది ఏం సబబండి, మీ ఇంట్లో ఉండడం? నా పనికి అడ్డం కాదుటండీ!"

"ఏమిటి మీ పని?"

"నేను పనీ పాటూ చేయని పనికిరాని వాణ్ణనేనా మీ అభిప్రాయం?"

"అయితే మా ఇంట్లో ఎందుకుండమంటాను. పనికిరాని వాళ్ళంటే నాకు ఇష్టమనా మీ ఉద్దేశం?"

"మంచి బాగా దెబ్బకొట్టావు అనంతలక్ష్మి!"

"మీ పని ఏమిటో నిజం చెప్పండి?"

"నేను ప్రయివేటు ఉపాధ్యాయుణ్ణి...."

"అయితే మీరు మా ఇంట్లో ఉండవచ్చుకాదా అండి?"

"హోటలులో వద్దనవాణ్ణి."

"ఆ మాట నిజమేనా?"

"అంటే?"

"చెట్టియారుగారు చెబితే నేనూ, మా అమ్మా నమ్మలేదులెండి."

"అది నిజం శిష్యురాలా!"

"మీ కంత ఖర్మ మేమి కలిగింది?"

"కర్మబలం మానవబలంకన్న వేయిరెట్లెక్కువ. ఈ మహాయుద్ధం వస్తుందను కున్నారూ ఎవరైనా? అయినా వచ్చిపడింది. జర్మనీ వాడి విజృంభణ చూచావుకదూ?"

"ఆ జర్మనీవాడి విజృంభణ చూచాను. విజృంభించవలసిందే, పోలండు రష్యాతో సంధి చేసుకోమంటే చేసుకోందే. అందుకని సెప్టెంబరు 17-వ తారీఖునకే పోలండు పని క్షవరం."

"ఇప్పుడీ రష్యా ఫిన్లండులకు యుద్ధమేమిటి?"

"బలవంతుడు బలహీనుల్ని తింటాడు. ఇంగ్లండు ఇండియాను వదలుతుందీ?"

"బాగా చెప్పావు అనంతలక్ష్మి! అయితే మీ బాలికలు యుద్ధ విషయాలు చర్చించుకుంటూ ఉంటారా ఏమిటి?"

"ఓ యుద్ధంవల్ల మేం జాగ్రత్తపడ్డాం. ఆదో యుద్ధ సమస్య. ముఖ్యంగా కావలసిన ఫేసు పవుడర్లు, పెదవి రంగులు, గోళ్ళరంగులు, మొత్తంగా కొనేసి దాచుకుంటున్నాము. ఇన్ని కత్తిబ్లేడులు కొనుక్కోరాదూ?"

"భాగ్యవంతులకు ఆ ఆ జాగ్రత్తలు. ఏ ఏ పవుడర్లు యెన్నెన్ని కొన్నావు?"

"నేనా-కూటికోరాలు రెండుడజన్‌లు కొన్నాను. మామూలు ఖరీదుకు పావలా ఎక్కువబెట్టి కొనేశాను! ఈవెనింగ్ యట్ పారీసు సెంట్లు, నూనెలు, పవుడర్లు వగైరాలు డజను డజను కొన్నాను. పాండ్సువారి క్రీమురకాలన్నీ డజను డజను కొన్నాను."

"ఒకషాపు కొన్నావన్నమాట. రెండేండ్లకు సరిపోతాయి!"

రెండేళ్ళేమిటిలెండి. మూడేళ్ళవరకూ వస్తాయి. అనవసరంగా డబ్బు తగల వేయలేను."

"ఎంత జాగ్రత్త!"

"చాలా బాగుంది లెండి. మీరు మా యింటిలో ఉండండి అన్న నా ప్రార్థనను మూలకు తోసి, ఏవేవో భావాలన్నీ తీసుకువస్తున్నారు."

"అదికాదమ్మా, అనంతలక్ష్మి-"

అనంతలక్ష్మికి నిజంగా కోపం వచ్చింది. కోనంగిరావు మాటలను పూర్తిచేయకుండా "నన్ను అమ్మా గిమ్మా అనకండి. మీకు నామీద ఇష్టం లేకపోతే పోయింది. మీ ఇష్టం వచ్చిన చోటకు వెళ్ళండి" అని లోపలికి వెళ్ళిపోయింది.

కోనంగి ఆమెకు ఎందుకు కోపం వచ్చిందో అర్థంగాక హోటలు గుజరాతుకు చేరాడు. హోటలు యజమాని సంతోషంతో కోనంగిని జబ్బును గురించి అడిగి, అతడు కులాసాగా వున్నందుకు అనందం వెలి బుచ్చి, కోనంగికి తక్కిన వాళ్ళతోబాటు నెలకు ఇరవై రూపాయల జీతమూ చేసినాడు.

కోనంగి సంతోషంతో తన పనిలో ప్రవేశించాడు. ఆ దినం రాత్రి యథాప్రకారం కోనంగికోసం అనంతలక్ష్మి కారు వచ్చింది.

కోనంగి అనంతలక్ష్మిగారి ఇంటికి వెళ్ళినాడు. ఉదయం అనంతలక్ష్మి ఇంటినుండి వచ్చినప్పటినుంచీ, ఎందుకా అనంతలక్ష్మికి అంత కోపంవచ్చిందని ఆలోచిస్తూనే వున్నాడు. చిన్నప్పటినుంచీ, అల్లారు ముద్దుగా పెరిగినపిల్ల! తల్లికి కూతురన్న ప్రాణం. బాలిక కూడా వుత్తమ గుణాలు కలిగినది. లేకపోతే చెట్టియారుగారు ఆ బాలికను కబళించకుండా వుంటాడా?

ఎందుకో అనంతలక్ష్మి తోటలో నివసించే ఆ ముగ్గురు వస్తాదులు కారును గూర్చి, ఆ మనుష్యులను గూర్చీ మరీ మరీ తన్నడిగినారు. అందులో ఒకరు "సరే తెలిసిందిరా! వాండ్లా, మేం వాండ్లకు బుద్ధి చెపుతాం అన్నాడు. ఎంత గుచ్చి గుచ్చి అడిగినా వాళ్ళు ముగ్గురూ మాట్లాడలేదు. కాని చెట్టియారుగారు అలా జయలక్ష్మిగారి ఇంటికి రావడం తమ ముగ్గురికీ ఇష్టం లేదనిన్నీ ఆ జయలక్ష్మిగారి కోరికపైనే ఆతడు రాగలుగుతున్నాడనీ చెప్పారు. "సామీ! మా అమ్మిణి అంటే మాకు ప్రాణం. రంగయ్యంగారు మాకు నిండా స్నేహితులుదా. అలాగే జయలక్ష్మి. వాడికేం తెలుసు. ఆ చెట్టి పైత్తకారి అమ్మిణికేసి దురుద్దేశంతో కన్నెత్తిన మర్నాడు, వాడు ఆమెరికాదా పారిపోవాలిదా" అని అన్నారు వాళ్ళు.

అటువంటి బాలిక తనంటే ఏదో, ఎందుకో చక్కని అభిప్రాయానికి వచ్చింది. చక్కని అభిప్రాయం ఏమిటి? చప్పటిమాట! తనపై.... కొంచెం... ప్రేమ కలిగింది ఆమెకు. ఎందుకు ఈలాంటి అద్భుతమైన విషయం. తనకు తెలియకుండగా, తన మనస్సుకు తెలియకుండా మారుమూలలు దాచుకోడం? తనలో తాను తనకు బయట పెట్టుకోడం ఒంటికి మంచిది. ఆమె తన్ను ప్రేమిస్తోంది! తాను ఆ బాలికను ప్రేమిస్తున్నాడు. ఇదీ అసలు విషయం.

ఇది నానాటికీ తమలో తమిద్దరికి స్పష్టమైపోతున్నది. యెంత చిత్రంగా ఉంది. కాని తాను ప్రేమిస్తున్నట్లు ఆ అమ్మాయికి తెలియకూడదు.

ప్రేమ అనే పదార్థం ప్రపంచంలో ఉంటుంది అని అనుకోలేదు. డాక్టరు రంగనాయకులు రెడ్డిగారు లేదు అని వాదిస్తారు. కాని అంతకన్న ప్రేమ ఏంకావాలి, మానవజీవితంలో యౌవనంలో ఉన్నటువంటి బాలకుడు, కొంచం ఎఱ్ఱగ బుఱ్ఱగ ఉన్న ప్రతి బాలికలోనూ స్త్రీ పురుష సంబంధం కలగాలి అని ఆశిస్తాడు. ధైర్యంకల యువతలు, యువకులు అయితే ఆ వాంఛను తీర్చుకుంటారు. కాని తన కెందుకో మొదటి నుండి, ఈ విషయంలో వట్టిపిరికితనం, దమ్ములేదు జావకడి వ్యాపారం.

ఆంధ్రులలో, ఆంధ్రులలో ఏమిటి, సకల భారతదేశంలోను, యువతీ యువకులకు దమ్ములు తక్కువ. ఆలా ధైర్యం కలవారు, ధనవంతులలో, పెద్ద ఉద్యోగాలలోనూ ఉన్నారు. ఇంతకూ నీతి అనీ, పాపమనీ అనకోవడం సరా, కాదా,

తాను ఉద్భవించింది అవినీతివల్లనే! అయినా వివాహం మంచిదో చెడ్డదో నిర్ణయించుకోలేకుండా ఉన్నాడు. తనలో ఏదో వివాహమే సరియైన సంస్థ అనిచెప్తుంది. తనలోని విచారణ శక్తి అది ఒప్పుకోవటంలేదు. ఈరెంటికి తనలో సమన్వయం కుదురలేదు.

కోనంగి కారులోంచి దిగి, ఆనంతలక్ష్మి గదిలోనికి వెళ్ళినాడు. ఆనంతలక్ష్మి ఏదో కోపంగానే ఉంది. కోనంగి ఆమె కోపంగా ఉందని గ్రహించాడు. మాట్లాడకుండా బల్లదగ్గర ఆమె ఎదురుగుండా ఉన్న కుర్చీమీద కూర్చున్నాడు.

ఆ కోపంలో ఆమె ఎంత అందంగా ఉంది. అందాలు ఎన్నిరకాలు. అందమైన స్త్రీ సృష్టికంతకూ కిరీటమే. ఒక్కొక్క దేశంలో అందమైన స్త్రీల అందం ఒక్కొక్కరకం అందంగా ఉంటుంది.

స్త్రీ సౌందర్యం మనుష్యుల పురోగమనానికి నిజమైన ఉత్తేజం కలుగజేస్తుంది. మనుష్యునిచేత స్త్రీ సౌందర్యము ఎంతటి ఉత్తమ కార్యమయినా చేయిస్తుంది. స్త్రీ సౌందర్యం మనుష్యుని హీనమైన పశువునిగా తయారుచేస్తుంది.

## (5)

ఆ రాత్రి కోనంగి పాఠాలు చక్కగా చెప్పాడు. పాతపాఠాలు ప్రశ్నలువేసి పరీక్ష చేశాడు.

అనంతలక్ష్మి ముభావంగా అసలైన విద్యార్థినిలా పాఠాలు నేర్చుకుంది. కాని మామూలు హుషారు, ఆ కంఠంలో ఏది? కోనంగి పాఠాలు పదకొండు గంటలకు ముగించాడు. ఇక లేచి వెళ్ళబోతూ, "లక్ష్మీ! అంత కోపం వచ్చిందేమిటి నామీద! ఇంకా తగ్గలేదా?" అని అడిగాడు.

అనంతలక్ష్మి కంట నీరు తిరిగింది. తల వంచుకొని, కోనంగి చూడడం లేదనుకొని పైటకొంగుతో కళ్ళు తుడుచుకొంది. కాని కోనంగి చూచాడు. చూడనట్లు నటించాడు. 'లక్ష్మి....!"

"ఊఁ! ఊఁ!" అన్నట్లు తల తిప్పింది అనంతలక్ష్మి. కోనంగి "ఎందుకు నీకు కోపం రావాలో అర్థం కావటంలేదు"అన్నాడు. "శబ్దరత్నాకరం మొదలయిన నిఘంటువులలో 'కోపం' అనే మాటకు అర్థం రాస్తాడు గాని, అనంతలక్ష్మికి కోపం ఎందుకు వచ్చిందో రాయడుగా! అందుకు అర్థం ఏమిటని అడిగాను" అన్నాడు.

అవును ఎందుకు రావాలి కోపం తనకు? తనకూ అర్థం తెలవదు. ఎవరు చెప్పగలరు? అనుకుంది అనంతలక్ష్మి.

"అనంతలక్ష్మి! నేను మీ ఇంట్లో ఉండకుండా వెళ్ళిపోయాను అని నీకు కోపం వచ్చిందా, లేకపోతే నిన్ను 'అమ్మా' అని పిలవడంవల్లనా?" అని ప్రశ్నించాడు కోనంగి.

అనంతలక్ష్మి దగ్గిరకుపోయి కోనంగి ఆమె భుజంమీద చేయివేసి "అనంతం! ఇల్లా తిరుగు" అని కోరాడు. అనంతలక్ష్మి చటుక్కున కోనంగివైపు తిరిగి, కరిగిపోయి, అతని పాదాలపై వాలి, "మీరు మా ఇంట్లో ఉండిపోండి" అని అన్నది.

కోనంగి గుండె గుబగుబలాడుతూ ఉండగా ఆమెను లేవనెత్తాడు. వెంటనే అనంతలక్ష్మి అతని చుట్టూ చేతులు పోనిచ్చి, గాఢంగా అతన్ని తన హృదయానికి అదుముకొని తన మోము అతని హృదయంలో దాచుకొన్నది. కోనంగి పులకరించాడు. ఉప్పొంగిపోయాడు. ఆమెను తనకు ఇంకను దగ్గిరగా లాక్కొని, కుడిచేతితో ఆమె మోమునెత్తి ఆమె కళ్ళల్లోంచి చూస్తూ "లక్ష్మి! ఈ బిచ్చగాణ్ణి....."

"అలా అనకండి. నాకు మీకంటె, ఇతరులు కోటీశ్వరులు అయినా అక్కరలేదు" అన్నది.

ఇంతట్లో జయలక్ష్మి "అమ్మిణీ! ఇంకా పాఠాలు కాలేదా" అంటూ వస్తున్న చప్పుడు అయింది. అనంతలక్ష్మి కోనంగి విడిపోయారు. కోనంగి ఆ పక్కనే ఉన్న కుర్చీపైన కూర్చున్నాడు. అనంతలక్ష్మి నిలుచుండి ఉన్నది. జయలక్ష్మి వారిద్దరి దగ్గరకు వచ్చేలోపున,

కోనంగి అనంతలక్ష్మికి ఒక్కదానికే వినబడేటట్లుగా "లక్ష్మీ! ఈ విషయం మనిద్దరం మాట్లాడేవరకూ ఏమీ ఎవ్వరికి చెప్పకు–" అన్నాడు.

జయలక్ష్మి వచ్చింది. "కోనంగిరావుగారూ, ఇవాళ పాఠాలు ఇంత ఆలస్యమయ్యాయి ఏమిటి?" అని ఆమె కోనంగిని అడిగింది.

**కోనంగి:** పరీక్షకు పంపించే పరీక్ష వస్తోంది. పదిహేనురోజులన్నా లేదు. అందుచేత పాత పాఠాలన్నీ తిరగవేస్తున్నాము.

**జయలక్ష్మి:** ఏలా ఉన్నది అమ్మిణి?

**కోనంగి:** అమ్మిణికేమండి! తెలుగులో మొదటి మార్కులు కొట్టుంది.

**అనంత:** అమ్మా! రావుగారు ఇంగ్లీషులోనూ దిట్టమైన చెయ్యి. అన్నీ బాగానే చెప్తారు. కాని ఇంకా కొంచెం ఆ పాఠాలు నాకు గట్టిపరచాలి. హోటలులో మానేసి మనింటిలో ఎందుకుండకూడదు ఈ పదిహేను రోజులూ?

**కోనంగి:** నాకు ఏ మాత్రం వీలున్నా పదిహేనురోజు లేమిటి, పదిహేను సంవత్సరాలుండమంటే ఉంటాను. కాని, ఉద్యోగమో, మగవాడికి ఉద్యోగం పురుషలక్షణం.

**జయ:** ఆ ఉద్యోగం ఉంటే ఏమిటి, వుండకపోతే ఏమిటి?

**కోనంగి:** ఏ ఉద్యోగమయినా అది పురుష లక్షణమే కాదండీ?

**అనంత:** ఏం పురుష లక్షణమండీ! ఇంతకూ నాకు ఇంగ్లీషు చెప్పరన్నమాట.

**కోనంగి:** అల్లా అన్నానా?

**అనంత:** పైకి స్పష్టంగా చెప్పాలా?

**కోనంగి:** ధ్వనిగా సూచించానన్నమాట!

**అనంత:** మౌనంగా మాట్లాడారన్న మాట!

**జయ:** ఇంతకూ కోనంగిరావుగా రేమంటారు?

**కోనంగి:** నేను ఆ హోటలు ఉద్యోగం మానివెయ్యడమేనా? కాబట్టి సాయంకాలం కొంచెం పెందరాళే కారు పంపండి. మీ ఇంట్లోనే భోజనం. అయిదున్నరకు పంపండి. అక్కడ నుంచి ఇంగ్లీషు, తర్వాత భోజనం, తర్వాత తెలుగు. ఇది నచ్చుతుందా అనంతలక్ష్మి!

**జయ:** చాలా బాగుంది!

**అనంత:** సంపూర్ణంగా మా ఇంట్లో ఉంటే బాగుండును. అయినా మీ యిష్టం. మాకు డిశంబరు రెండోవారం అంతా శలవు. మూడోవారం అంతా పరీక్షలు. అక్కడ నుంచి రెండువారాలు క్రిష్టమస్ సెలవులు.

**జయ:** నేను కాదంటున్నానా!

అనంతలక్ష్మి విసవిస లోనికి వెళ్ళిపోయింది. జయలక్ష్మి తెల్లబోయింది. కోనంగి పక పక నవ్వాడు. "మా చదువుకున్న వాళ్ళకు అనుకున్న పని కాకపోతే కోపం వస్తూవుంటుంది" అన్నాడు.

జయలక్ష్మి అవునని తల ఊపింది. తీరా కోనంగిని పంపిద్దామని పోర్చిలోకి వస్తే కారు లేదు. వినాయగంపిళ్ళ అక్కడకు వచ్చి, "అమ్మిణ్ణి, కారు డ్రైవరును వెళ్ళిపొమ్మని చెప్పింది. అందుచేత వెళ్ళిపోయాడు." అని చెప్పాడు జయలక్ష్మితో. జయలక్ష్మి కోనంగి ఇద్దరూ ఆశ్చర్యం పొందారు.

ఏం చేస్తుంది జయలక్ష్మి? కోనంగిరావుని తీసుకొని ఇంటిలోనికి పోయింది. పనిమనిషిని పిలిచి, కోనంగిరావుకి వారి వెనుక గది సిద్ధం చేయమంది.

కోనంగి పందిరి మంచంమీద పడుకొని ఏమిటి అనంతలక్ష్మి ప్రేమ? ఈ బాలిక తన్ను గాఢంగా ప్రేమించిందా, లేక యౌవనపు ప్రథమ సంవత్సరాలలోని కాంక్షలను ఈ రీతిగా తీర్చుకొంటున్నదా? తనకూ స్త్రీ వాంఛ కలుగుతున్నమాట నిజమే! కాని ఫలానా స్త్రీ అన్నది లేదు. అసలు సౌందర్యం స్త్రీ సంపర్కభావం కలిగింది. ఈనాడు హృదయం మధ్య ఈ అందాలబాల చేరింది. ఇది పెద్ద గడ్డు సమస్య తనకు.

తానా బీదవాడు, రేపటి తిండి ఎట్లాగో తెలియక వీధుల గడిపే పాంథుడు. ఈ బాలిక ఐశ్వర్యవంతురాలు. తన కీ సమయంలో వివాహం ఏమిటి? వివాహం చేసుకుంటేగాని, తనకూ, స్త్రీకీ సంబంధం ఉండకూడదు. అది పెద్ద వేదాంతభావము కాదు. నైతికభావమూ కాదు. అది మానవ న్యాయం.

పెళ్ళిళ్ళు జాతికి ఒక చక్కని రహదారి మార్గం వంటివి. పురుషుడు వేడి ఎక్కి ఇష్టం వచ్చినట్లు సంచరించవలసిన అగత్యమేమి? అమెరికాలోవలె వివాహాలు చేసుకోవచ్చును. రద్దు చేసుకోవచ్చును. స్త్రీ పురుష సంబంధం కలుగజేసుకుందామను కున్నప్పుడు వివాహం చేసుకొని, ఇష్టంలేనప్పుడు విడిపోవచ్చును. ఇంత చక్కని రాజమార్గం ఉంటే, అమెరికాలో కూడా, వట్టి మూర్ఖదారుల తిరుగుతారెందుకో స్త్రీ పురుషులు.

అతడు నెమ్మదిగా నిద్రకూలాడు. తెల్లవారగట్ల కలలు వచ్చాయి. యేవేవో అస్పష్టమైన కలలు. ఇంతగా తాను ఎక్కడో పొలాలలో కూలి వానిగా ఉన్నాడు. అనంతలక్ష్మి కూలిపిల్లగా చక్కా వచ్చింది అక్కడకు. తాను ఆమెను తప్పించుకొనడానికి ముందుకు పరుగు, ఆమె తరుముకు వచ్చింది. తానేదో కాలికి తగిలి క్రిందపడినాడు. అనంతలక్ష్మి పకపక నవ్వుతూ, "దొంగ దొరికాడు" అంటూ తనమీదవాలి భుజాలు రెండూ గట్టిగా పట్టుకుంది.

అతనికి చటుక్కున మెలకువ వచ్చింది. అనంతలక్ష్మి దేవతా బాలికలా తనమీదకు వ్రాలి రెండు భుజాలు పట్టుకొని, "ఇంకా నిద్దురే. తెల్లవారింది, ఎండ వచ్చింది, లెండి!" అని కదుపుతోంది.

## ⑥

**కో**నంగి గబుక్కున లేచి కూర్చున్నాడు.

"మీమీద ప్రేమ నన్ను గాఢంగా పొదివికొంంది. నన్ను అమ్మతో చెప్పనే చెప్పవద్దన్నారు ఈ విషయం. అమ్మ స్నానం చేస్తోంది. స్నానం అవగానే జపం చేస్తుంది. అంతవరకూ బయటకు రాదు. అప్పటివరకూ కాఫీ అయినా తాగదు కాబట్టి మనం మాట్లాడుకునేందుకు కావలసినంత వ్యవధి ఉంది" అని అనంతలక్ష్మి తలవాల్చి అన్నది.

**కోనంగి:** అనంతలక్ష్మి, మీ అమ్మగారు నన్ను నువ్వు ప్రేమించడానికి వప్పుకోరు.

**అనంతలక్ష్మి:** మీరు ప్రేమిస్తున్నారా లేదా?

**కోనంగి:** నేను నిన్ను ప్రేమించకుండా ఉండగలనా లక్ష్మీ! నువ్వు నా దేవతవు. నేను ప్రేమ అనేది ఎరుగను. అది ఉంటుందనే తెలియదు. స్త్రీని అప్పుడప్పుడు వాంఛించాను. కాని వివాహం కాకుండా స్త్రీ సంపర్కం అనుభవించడం నా మతం కాదు. నాకు అర్థం కాదాభావం. ప్రేమ అన్నా ఉండాలి, అనుకూలమైన దాంపత్యమన్నా కావాలి. నాకు స్త్రీవాంఛ కవిత్వవాంఛ, సంగీతవాంఛ వంటిది. స్త్రీలకు పురుషవాంఛ, పురుషులకు స్త్రీవాంఛ, ఏదో ఉత్తమ పథాలలో ఉండాలని అనుకుంటాను. అందుకని నాలో కలిగిన

స్త్రీ వాంఛ, ఏ ఒక్కస్త్రీ అని కాక ఒక ఉత్తమ స్త్రీ అనే. నువ్వు కారు డ్రైవు చేస్తున్నప్పుడు మొదటిసారి నిన్ను చూచినప్పుడే, ఈమె నా బాలిక, నా ప్రియురాలు, నా బ్రతుకురాణి అనుకున్నాను.

**అనంత:** నాకు పెళ్ళి అయివుంటే ఏమిచేద్దురు?

**కోనంగి:** నేను ప్రేమించబోతూ ఉంటే నీకు పెళ్ళయి ఏలావుంటుంది?

**అనంత:** ఇంతకు మీరు ఆలోచించిన సంగతి ఏమిటి?

**కోనంగి:** నేను ఏమీ ఆలోచించలేదు. నువ్వు నా సర్వలోకేశ్వరివి. అదే భావం నాకు ప్రస్తుతము. కాని ఆలోచించినకొద్దీ, నేను నీకు తగుదునా! నేను ఎవరిని అన్న-

**అనంత:** అన్న! అన్నాలేదు, చెల్లెలూలేదు. ఒకటిమాత్రం ఆలోచించండి, మీరు నన్ను-

**కోనంగి:** ఉండు ఉండు. నెమ్మదిగా ఆలోచించుకొందాము. మనం ఈ విషయాలలో తొందరపడకూడదు.

**అనంత:** నెమ్మదిగా సంవత్సరాలు ఆలోచించాలి కాబోలు!

**కోనంగి:** నెమ్మదిగా నిముషాలు ఆలోచిస్తేచాలు.

**అనంత:** అప్పుడే మీరు లేచి అరగంట కావచ్చింది. ఇంతవరకూ ఏమీ ఆలోచించరేమి?

**కోనంగి:** నువ్వు ఎదురుగుండా ఉంటే ఆలోచన ఏమి సాగుతుందీ?

**అనంత:** నేనంత అసహ్యంగా ఉన్నాను కాబోలు, పోనీలెండి. నేను వెళ్ళిపోతాను.

**కోనంగి:** వెళ్ళూ! నా ప్రాణాలు నీతోనే వస్తాయి. నేను వట్టికట్టెలా పడుకొని ఉంటానులే!

**అనంత:** మీ ప్రాణాలు నాతో కూడా ఎందుకు? ఒక్కదాన్ని నీళ్ళుపోసుకుంటోంటే ఎవరో చూస్తున్నారని భయపడడానికి!

**కోనంగి:** లక్ష్మీ! నువ్వు లక్ష్మివి, నేను -

**అనంత:** ఆ మాటలన్నీ వద్దండి గురువుగారూ -

**కోనంగి:** చెట్టిగారు కోటీశ్వరులు -

**అనంత:** ఈలాంటి మాటలు ఇంకా రెండు మాట్లాడితే -

**కోనంగి:** ఈ ఆడవాళ్ళతో ఇదే గొడవ.

**అనంత:** మగవాళ్ళతో ఇలాంటి గొడవ లుండవు కాబోలు?

**కోనంగి:** పరీక్షయ్యేవరకూ ఈ గొడవలన్నీ కట్టిపెట్టడం మంచిది కాదా లక్ష్మీ.

**అనంత:** ఇదీ గొడవే?

**కోనంగి:** సరియైన సందర్భాలు కుదరకపోతే అన్నీ గొడవలుగానే ఉంటాయి.

**అనంత:** మీకిది అంతా గొడవగా ఉంటే నేను వెళ్ళిపోతాలెండి.

అనంతలక్ష్మి లేచి విసవిస వెళ్ళిపోయింది. ఉదయమేలేచి, స్నానం చేసి, చక్కనిచీర, రవికా ధరించి, అందంగా అలంకరించుకొని, సౌందర్యాలు మూటలు కట్టినట్టు వచ్చిన అనంతలక్ష్మిని చూస్తూ ఆనందిస్తూ సర్వమూ మైమరచి కూచోక, భార్యను భర్త చెప్పినట్లు పిచ్చి వేళాకోళాలు చేసి అలా తరిమివేస్తే ఏమి బాగుంటుంది. మంచి శిక్ష చేసింది. ఏదో రొట్టి నేతిలో వేసుకు పుట్టాడు గనక, ఆ బాలికను తాను ప్రేమించినట్లే తన్ను ఆమెకూడా మొదటినుంచీ ప్రేమించసాగింది.

ఆ అదృష్టానికి సంతోషించక, లేచి నాట్యమాడక, నూరు టీ పార్టీలు చేయక, తనకు తానైనా వేయి అభినందన తంతులు పంపుకోక, ఈలా కుశ్శంకలు పట్టుకుని కూర్చున్నవాడి గతి ఇంతే.

తనంత అసలైన తెలివితక్కువ ఆంధ్రుడు ప్రపంచంలో ఇంకోళ్ళు ఉండరు! తన కెందుకు అనంతలక్ష్మిని పెళ్ళిచేసుకోడానికి ఇంత భయం? తాను వట్టిబీదవాడు. ఉద్యోగం లేదు. ఉద్యోగం ఇచ్చేవారులేరు. ఇచ్చేవారు ఒకరిద్దరున్నా, వాళ్ళు ఏ వంటవాడి పనో, గుమాస్తా పనో ఇస్తారు. లేకపోతే ఇప్పిస్తారు. అంతకన్న తనకు ఇంక గతి ఏమిటి?

ఈలాంటి తాను, భాగ్యనిధి, సౌందర్య సముద్రమూ అయిన ఒక బాలికను పెళ్ళిచేసుకోవడమే! తనది దొంగ ఎత్తన్నమాటే కాదూ! తనలో కూడా బూర్జువాతనం సంపూర్ణంగా ప్రవేశించింది. గాంధీగారు అహింసా, సత్యాగ్రహ తత్వాలు వ్యతిరేకించాయి అన్నమాటేగా?

తాను నెమ్మదిగా ఈ బాలిక జీవితంలోంచి తప్పుకుందామనుకుంటే, తనలో వృద్ధివించిన ఆ నీరసత్వం, తన్ను వట్టి పిరికివాణ్ణిగా చేసి పారవేస్తుంది. తనలో ఒక వీసమెత్తయినా గౌరవమూ గర్వమూ వుంటే, తాను అనంతలక్ష్మిని వీడి వెళ్ళిపోవాలి. చిన్నతనంలో, ఎన్ని బొప్పెలు కట్టినా, త్వరలో మరిచిపోతాం. ఎంతమంది యువకులు తాము గాఢంగా ప్రేమించాము అనుకున్న భార్యలు తమ్ముడిడిచి, దేహంచాలిస్తే, వెంటనే నెలలన్నా కాకుండా, రెండవ భార్యలను చేసుకోలేదు?

ఎంతమంది యువతులు తమ దైవము అనుకున్న భర్తలు పోతే, నిముషంలో ఊరటపొంది, మామూలుగా తిరగటంలేదు. వారి విచారం అంతా వైధవ్య చిహ్నాలు ధరించి విధవా జీవితం భరించవలసినదనే.

అలాగే తాను అనంతలక్ష్మిని వదిలి వెళ్ళిపోతే ఆ బాలిక కావ్యంలోలా తన్ను ప్రేమించి వుండకపోతే ఒక నెలరోజులలో మరిచిపోతుంది. లేదా తన్ను తలంచుకొని దుఃఖించడం మానివేస్తుంది. తాను అనంతలక్ష్మిని కావ్యంలోలా ప్రేమిస్తుంటే, ఆమె తన హృదయంలో, ఆత్మ అనే పదార్థంలో వుంచి షోడషోపచారవిధిగా అర్చిస్తూ వుంటాడు. తాను బాధపడినా, ఆ బాధంతా మగవానిలా భరించాలి. అంతేకాని ప్రబంధ నాయకులులా ఏడుస్తూ కూర్చోకూడదు.

అతడు లేచాడు. మొగం కడుక్కొని, స్నానాదికాలు కావించి, కాఫీకని హాలులోనికి వచ్చి కూర్చున్నాడు. అనంతలక్ష్మికి కోపం రావడం చాలా మంచి దనుకున్నాడు. ఆ బాలికకు ఈ ఏడాది బాగా చదువుచెప్పి, ఆ తర్వాత ఆమె కంటికి కనబడకుండా వెళ్ళిపోవచ్చు. ముష్టిఎత్తుకొని తిరిగేవాడికి లోకం అంతా వాడిదే!

కాఫీ వగైరాదులు పుచ్చుకొన్నాడు. లోపలికి వచ్చాడు. హోటలు గుజరాతుకు బస్సు ఎక్కి చేరుకున్నాడు. ఆ రోజు జీతం నష్టం అని హోటలు యజమానితో చెప్పితే, యజమాని మండిపోయి "నువ్వు నాకు వద్దయ్యా" అని చెప్పినాడు.

"అవునండీ, ఎవరిక్కావాలి ఈ దరిద్రఘటం. ఘటవాద్యానికి పనికిరాదు. నీళ్ళు పోసుకోడానికీ పనికిరాదు. అమ్మవారి ఘటపూజకూ పనికిరాదు"అని లోనికిపోయి కోనంగి బట్టలపెట్టి సర్దుకుంటూవుంటే, తోటి అరవబాలకుడు పరుగునవచ్చి "నిన్న రాత్రి నువ్వు వెళ్ళిపోయిన తర్వాత, ఎవరో రెడ్డిగారుట. ఒక నాటుకోటిచెట్టి వచ్చి మన మేనేజరుతో చాలాసేపు గుసగుసలాడారు. మన నాయరు 'శంకరన్' రెండు మూడు ముక్కలు విన్నాట్ట. నీ మాటే నూరుసార్లు వచ్చిందట. నిన్ను పంపించివేయమని పట్టు పట్టాడట" అని కోనంగికి చెప్పాడు.

"అంతకన్న ఏం కావాలి మణీ! సరే: నేను వెళ్ళి కొన్నాళ్ళపాటు నల్లతంబి నెల్లూరు హూటలులో ఉంటాను. ఈ బూర్జువాల ప్రతాపం అంతా మనబోటి హెూటలు కుళ్ళువాళ్ళమీదే! ఈలాంటి బూర్జువాలను చేపల దండలులా గుచ్చే సామ్రాజ్యవాదులు వస్తే ఈదద్దమ్మలు తమ కాళ్ళకు ఎంత బలం ఉందో పరీక్ష చేసుకోవడం ప్రారంభిస్తారు. ఇక సెలవు, మనం కలుసుకుంటూ ఉందాం. గాంధీమహాత్మాకీ జై! బూర్జువాలు మురదాబాద్!" అంటూ ఒక రిక్షా చేసుకొని నల్లతంబి నెల్లూరు హెూటలు చేరుకున్నాడు.

## పంచమ పథం

# రాజకీయాలు

**కో**నంగి వెళ్ళిపోయిన తర్వాత కాలేజీకీ వెళ్ళడానికి అనంతలక్ష్మి బయటకు వచ్చింది. కోనంగి లేడు. అతడు బస్సుఎక్కి వెళ్ళిపోయాడు. ఆ బాలిక గుండె గుభిల్లుమంది. పదిహేడేండ్లు నిండి, పద్దెనిమిది సంవత్సరాలు జరుగుతూ అప్పుడే విప్పారే కమలపుష్పమా బాలిక. ఆమె అలాగే తెల్లబోయి నిలుచుంది. కళ్ళనీళ్ళు తిరిగినవి. తాను సరదాకు కోపగించి వెడితే, నిజమనుకుని వెళ్ళిపోయినాడు.

కాలేజీ మాని, హెూటలు గుజరాతుకు వెళ్ళి పట్టుకుందామని. తిన్నగా కారు వేసుకొని, హెూటలు గుజరాతు పక్కనుండే ఒక బట్టలషాపులోకి పోయిడ్రైవరును కోనంగి కోసం పంపింది. అతడు తిరిగివచ్చి కోనంగిని యజమాని పంపివేశాడనీ, అతడు ఎక్కడికో వెళ్ళిపోయాడని తెలిపినాడు.

అంతటితో అనంతలక్ష్మికి కాళ్ళు చేతులు చల్లబడ్డాయి. కాలేజీకి వెళ్ళడానికి ఇష్టం లేకపోయింది. ఆమెకు కోనంగిపైనా, సర్వప్రపంచం పైనా కోపం వచ్చింది. కారు తిన్నగా క్వీన్ మేరీస్ కాలేజీ హాస్టలుకు పోనిమ్మని అక్కడకు పోయింది. హాస్టలు పరిచారికను పంపి తనకు భరించలేని తలనొప్పి వచ్చిందని చెప్పి ఒక స్నేహితురాలి గదితాళం తెప్పించుకొని, ఆ గది తలుపుతీసి, అనంతలక్ష్మి ఆ అమ్మాయి మంచంమీద పడుకొంది.

చిన్నతనాన్నుంచీ కోరిన వస్తువు తెప్పించి ఇచ్చాడు తండ్రి. ఆ బిడ్డకోసమే తల్లిదండ్రులు బ్రతికినారు పండితులచే సంగీతం చెప్పించారు. ఆ వస్తువు బాగుందంటే తండ్రి కొన్నాడు. ఆ బొమ్మ కావాలంటే తల్లి కొంది. ఆ బాలికకోసం సాలుకు మూడు నాలుగు వేల రూపాయలు బట్టలకూ, రెండు మూడు వేల రూపాయలు బొమ్మల సామానులు మొదలయిన వాటికి ఖర్చయ్యేది.

అలాంటి తనకు, ప్రేమించిన ఒక బాలకుడు ఇంత దూరం అవడం ఏమిటి? అతడు దూరమయ్యాడన్న భావం ఆమెకు మరింత ఆవేదన తెచ్చి పెట్టింది. చెట్టియారు అల్లుడు కావాలని తల్లి కోరిక. ఎంత అసహ్యకరమైన కోరిక. తనకు ఇష్టంలేక తల్లి ఏ పనీ చేయదని అనంతలక్ష్మికి తెలుసును. ఎందుకు తనకీ అవేదన? ప్రతిబాలికా ఎవరినో ఒకరిని ప్రేమించి అతని కోసం ఈలా బాధలు పడుతుందా? జీవితాన్ని తలక్రిందులుచేసే సంఘటన వస్తే మనుష్యులు బాధ పడతారు. రానంతసేపూ ఆనందంగానే ఉంటారు జనులు.

మేనేజరు అతన్ని పొమ్మన్నాడనీ, అందుచేత వెళ్ళిపోయాడనీ తనకు తెలిసింది. హొటల్సులో ఎప్పుడూ అలాగే చేస్తారు. హొటలు వాళ్ళకు నీతి నియమాలు ఏలా ఉంటాయి? అంతచదువుకొని ఆయన హొటలులో చేరడం ఏమిటి?

ఆయన బ్రాహ్మణుడు. తాను వేశ్యకులంలో ఉద్భవించింది. తండ్రి అయ్యంగారయితే ఏమి? తన కులంలో ఉద్భవించినా ఒక సుబ్బలక్ష్మిని సుబ్రహ్మణ్యయ్యరు, ఇంకో సుబ్బలక్ష్మిని సదాశివన్ వివాహం చేసుకోలేదా? వరలక్ష్మి చెల్లెలు భానుమతిని, ఇంకో అయ్యరు వివాహం చేసుకున్నాడు.

వాళ్ళంతా సినిమా తారలు. సినిమా తారలను పొదివికొని ఏదో ఒక వర్ణించలేని వెలుగూ, అకర్షణ ఉంటాయి. తాను వట్టి బాలిక. ఎంతమందో తన్ను సినీమా రంగానికి లాగాలని ప్రయత్నించారు. కాని, ఆడసింహంలా తల్లి గర్జించింది.

సినీమారంగంలో స్త్రీలు పశువులై పోతున్నారు. పురుషు లిదివరకే పశువులు. "ఏ బ్రతుకు మానివేసి ఉత్తమ మార్గం పట్టాలని ప్రయత్నిస్తున్నామో ఆ బ్రతుకే ఇంకా అధికమైన అసహ్యతతో సినీమారంగంలో ప్రత్యక్షమవుతంది" అనికదా తన తల్లి జయలక్ష్మి తన్ను సినీమాకు పంపించనని భల్లూకపు పట్టు పట్టింది.

చెట్టియారుగారు పెళ్ళంటారు. ఆయన్ను చేసుకొంటే బాగుంటుందని అందరి వాదనా! కాని, ఆయన్ను చేసుకోవాలని తనకు బుద్ధి పుట్టడంలేదు సరికదా, ఆయన్ను చూస్తే భరించలేని అసహ్యత ఉద్భవిస్తుంది.

ఇంక కోనంగిరావుగారు కనబడకుండా వెళ్ళిపోయినారు. ఆయన ఇంతటితో తన జీవితంలోంచి వెళ్ళిపోతారా? ఆయన్ను హొటలులోంచి వెళ్ళిపొమ్మంటే వెళ్ళిపోయారు. ఎక్కడకు వెళ్ళి ఉంటారు?

ఇంతట్లో అంబుజమ్మ పరుగున తన గదిలోకివచ్చి, "ఏమే అనంత, తలనొప్పి ఏమిటే! ఎందుకు వచ్చిందీ? ఎప్పుడు వచ్చింది?" అని ప్రశ్నించి నుదుటిపై చేయివైచి చూచింది.

**అనంత:** వట్టి తలనొప్పికి నుదుటిమీద ఏముంటుందే?

**అంబుజం:** ఏమో! ఒక్కొక్కప్పుడు వట్టి తలనొప్పికి కూడా నుదురు వేడెక్కుతుంది!

**అనంత:** అవును, నువ్వు డాక్టరు కూతురువు. డాక్టరువు కాబోతున్నావు. అందుకని నీ మాటా కొట్టివేయకూడదు.

**అంబుజం:** నీకు ప్రేమ తలనొప్పి వచ్చిందేమో?

**అనంత:** ప్రేమ తలనొప్పి, ప్రేమజ్వరం, ప్రేమ కడుపునొప్పులు ఉంటాయా ఏమిటే?

**అంబుజం:** ఓసి ఇడియట్టా! అలాంటివి ఉండేవని మన పూర్వ గ్రంథాలు చెప్తున్నాయిగా. అలాగే క్రొత్త గ్రంథాలు చెప్పవచ్చునుగదా!

ఇంతలో మెహరున్నిసా పరుగెత్తుకొని వచ్చింది.

**మెహర్:** ఏమిటే అనంతం! నీకు తలనొప్పి వచ్చిందని అంబుజం చెప్పి ఇక్కడకు వచ్చింది. వచ్చేటప్పుడు నన్ను కూడా పిలవకూడదూ?

**అంబుజం:** క్లాసందరికీ తెలిస్తే, అందరూ ఇక్కడికే వస్తారని నీ ఒక్కదానితో మాత్రం చెప్పాను. మన పార్వతితో చెప్పానా మరి?

**మెహర్:** పార్వతితోను, ఫిలోమెలాతోనూ చెప్పలేకపోయావు. వాళ్ళకు తర్వాత తెలిస్తే ఏమనుకుంటారు?

**అనంత:** నేను అంబుజాన్ని మాత్రం రమ్మన్నానా? ఏదో కాస్తతల నొప్పివస్తే ఈ గడబిడ అంతా ఎందుకే?
**అంబుజం:** ప్రేమ తలనొప్పా అంటే, ప్రేమ కడుపునొప్పి అంటుంది.
**మెహర్:** అనంతానికి తప్పక ప్రేమజబ్బే పట్టుకుంది.
**అనంత:** బాలికలలో చంద్రునివంటిదానవు. నీకు తెలియదటే మెహర్?
**మెహర్:** నాకేమి చెప్తావు నువ్వు? నీకు కొత్తగా అందాలరాయుడు ప్రయివేటుగా తెలుగు చెప్తున్నాడుటగా?
**అనంత:** ఎవరు చెప్పినారే నీకు?
**మెహర్:** పార్వతే!
**అంబుజం:** పార్వతా! అది హైకోర్టు జడ్జీగారి కూతురు. దానికి తెలియకపోతే ఇంకెవ్వరికి తెలుస్తుందే. అదిగో పార్వతిగారు వయ్యారంగా నడిచి వస్తోంది.

పార్వతి నిజంగా వయ్యారంగానే నడచి వచ్చింది. లోనకు రాగానే అనంతాన్ని కౌగలించుకొని, "ఆ చెట్టి నిన్ను బాధపెడుతున్నాడేమిటే?" అని ప్రశ్నించింది.
**అంబుజం:** ఆ మొద్దురాయడేనా? వాడు అనంతాన్ని బాధపెడ్తాడా పార్వతీ? వాడి పళ్ళు రాలగొట్టదూ అనంతం!
**మెహర్:** ఏమే పార్వతీ, ఎవరా కొత్తమాష్టరు? అనంతానికి తెలుగు పాఠాలు చెప్పేది?
**పార్వతి:** ఒక్క తెలుగేమిటి! ఇంగ్లీషు కూడా చెపుతున్నాడు.
**అంబుజం:** అతనికీ, అనంతం తలనొప్పికి సంబంధం ఏమిటి?
**మెహర్:** వచ్చింది, ప్రేమ తలనొప్పి కదా, పాఠాలు చెప్పే పెద్ద మనిషి ఇంట్లో ఉంటే తలనొప్పి తగ్గించలేడూ?
**అనంత:** ఈలాంటి మాటలంటే, కాలేజీకికూడా వినబడేటట్టుగా కేక వేస్తాను.

## (2)

**కో**నంగిరావుకు ఏమిచేయాలో తోచదు. అతనికి ఏ ప్రభుత్వ ఉద్యోగమో చేయడానికి ఇష్టంలేదు. అతనిలో రాజకీయాలు వట్టి మబ్బులులా ఉన్నాయి.

కాంగ్రెసు మహాసంస్థ అనీ, కాంగ్రెసు నాయకులైన మహాత్మాగాంధీ లోకనాయకుడని అతని నమ్మకము. కాని అతనికి అహింస ధర్మాశయంఎల్లా అవుతుందో అర్థంకాలేదు. కాంగ్రెసు రాజకీయాలుగాని, సాంఘిక వాదాలుగాని, సామ్యవాదాలుగాని పూర్తిగాతెలియని విద్యార్థిగా ఉన్నప్పుడు, విద్యార్థి రాజకీయ సభలలో అతడు చేరలేదు.

కోనంగి మతవిషయికాలు అంత ఎక్కువ చదువలేదు. హిందూమతమంటే, బౌద్ధమతమంటే, క్రైస్తవమతమంటే ఏమీ తెలియదనే చెప్పాలి. వేదాంతం అంటే ఏమిటో ఎరగడు. ఉపనిషత్తుల పేరులే తెలియవు ఏ మతపుస్తకాలూ ఎప్పుడూ చదవలేదు.

కోనంగి పాఠ్యపుస్తకాలు బాగా చదివేవాడు. ఆ పాఠ్యపుస్తకాలకు సంబంధమైన పుస్తకాలూ బాగా చదివేవాడు.

పాశ్చాత్యుల మనస్తత్వశాస్త్రం అతడెరగడు. జ్ఞానపిపాస ఒకమోస్తరుగా ఉండేది.

తెలుగు కోసం తన పాఠానికి పుస్తకాలు బాగా చదివాడు. ఈలా చదివిన పుస్తకాలు మాత్రం బాగా అర్థం అయ్యేవరకూ వదిలేవాడు కాడు. అలా అర్థం చేసుకొని పరీక్షలలో ప్రశ్నలకు ఎంతో బాగా ప్రత్యుత్తరాలు రాసేవాడు. అందుచేత అతనికి మొదటి మార్కులు వచ్చేవి.

అతడు కళలను గురించి అంతబాగా తెలుసుకోలేదు. అతని గొంతుక బాగానే ఉంటుంది. విన్న పాటగానీ, పాటపాడే విధానంగాని మరచి పోకుండా చక్కగా పాడతాడు. సంగీత శాస్త్రాన్ని గురించి ఏమీ తెలియదు.

బొమ్మలు చూస్తాడు భారతిలో, మోడరన్ రివ్యూలో, ఇంకా ఇతర చోట్ల ప్రచురణమయ్యే బొమ్మల్ని పరిశీలించి చూస్తాడు. అవి అజంతావైనా ఒకటే. అమరావతి వైనా ఒకటే, చటర్జీవైనా ఒకటే.

తనకు ఏ విషయం గురించి తెలియక పోయినా తెలియదని చెప్పేస్తాడు. మాట్లాడే వాడి ఉద్దేశం గ్రహించి, ఏ విషయాన్ని గురించి వాదన వచ్చినా బాగా చదువుకున్నవాడిలా కోనంగి వాదిస్తాడు.

కోనంగి ఆటలో ఆందెవేసిన చెయ్యే. కాని తాను చదివే విద్యాశాలలో పిల్ల వాళ్ళు మెచ్చుకుంటూ, తమ వీరుణ్ణి చేసుకునేటంతవాడు మాత్రం కాదు.

పరీక్షలలో మొదటివాడుగా నెగ్గేవాడు. పరీక్ష విషయాలను గూర్చి ఎవరు ప్రశ్నవేసినా చక్కగా ప్రత్యుత్తరం చెప్పేవాడు.

చదువు లయ్యాయి. జీవితంలో ప్రవేశించాడు. ఇంటిలోనుంచి బయటకు వచ్చి ప్రపంచాన్ని చూచిన బాలకునిలా అతడు గుమ్మందగ్గిర నిలుచుండి తన్ను తాను ప్రశ్నించుకున్నాడు.

చదువుకున్నన్నాళ్ళు అల్లరిపిల్లవాడే. ఎవరికీ కష్టం కలిగించని అల్లరి, అనేకరకాల వేషాలు వేసేవాడు. స్నేహితులుకూడా గుర్తుపట్టని వేషం వేసివాళ్ళ గదులలోనికి పోయి అల్లరిచేసేవాడు.

ఒకనాడు చాకలివాని వేషం వేసికొని, ఒక స్నేహితుని ఇంటికి వెళ్ళాడు. (అతని చాకలివాని సంగతులన్నీ ఇదివరకే తెలిసికొని ఉన్నాడు) “మరిడయ్య మా చుట్టమేనండి, ఆడే పంపాడండి” అని తన స్నేహితుని తల్లితండ్రులనూ, తక్కినచుట్టాలనూ నమ్మించి బట్టలన్నీ వేయించుకుని తన ఇంటికి తీసుకుపోయాడు.

అక్కడ అవన్నీ మడతలుపెట్టి పెద్ద పార్శెలుకట్టి “దీపావళి బహుమతి” అని పేరుబెట్టి తన స్నేహితునకు తన పేరుతో బహుమతి పంపాడు. కొన్నాళ్ళవరకూ బందరంతా నవ్వింది.

కోనంగికి ఆ రోజుల్లో చాకలి కోనంగి అని పేరువచ్చింది.

ఒకనాడతడు బి.య్యే అయిన రోజులలో, పదిమంది స్నేహితులను వెంటబెట్టుకుని, తాను సర్వేయరులా, కావలసిన సామాను పట్టుకొని బచ్చుపేట – రామానాయుడుపేట కలిసేచోటికిపోయి, ఆ వీధి కొలుస్తూ ఆ దారినివెళ్ళే ఒక పెద్దమనుష్యుని పిలిచి “ఈ చివర పట్టుకోండి సార్” అని కోరినాడు. ఆ వీధి మలుపుతిరిగి, ఇవతలి వీధిలోవెళ్ళే ఇంకో పెద్దమనిషితో “ఈ చివర కొంచెం పట్టుకోండి సార్” అని అందిచ్చి. స్నేహితులతో వెళ్ళిపోయినాడు.

ఆ పెద్దమనుష్యులిద్దరూ, ఒకరికి తెలియకుండా ఒకరు ఆ తాడు చివరలు ఒకరోవీధిలో ఇంకోరోవీధిలో పట్టుకుని ప్రభుత్వాని కెంతో సహాయం చేస్తున్నా మనుకొని ఒక గంటన్నరసేపు అలా ఉన్నారట. చివరకు ఒకాయన చాలా ముఖ్యమైన పని ఉండి ఏమవుతోందో చూదామని వీధిమలుపు తిరిగి చూస్తే తాడును ఒకచివర తాను, ఇంకో చివర ఇంకో పెద్దమనుష్యుడు పట్టుకుని ఉండడం చూచి, ఇంకెవ్వరూ అక్కడ లేకపోవడం చూచి, “ఏమిటండీ ఈ కొలత?” అని అడిగాడు.

"నాకేం తెలుసు, మీకు తెలియాలి!"

"అదేమిటి అల్లా అంటారు? మీకు తెలియదూ?"

"నాకేం తెలుసును. మీకే తెలియాలి?"

"ఎవరు ఇదంతా కొలుస్తున్నది?"

"ఏమో ఏ సర్వేయరో?"

"ఈ ప్రభుత్వం సేవకులకు బుద్ధిలేదు. లేకపోతే ఇదేమిటండీ మనలనిద్దరినీ ఇక్కడ విడిచిపోయాడూ?"

"ఇంజనీరుకు వ్రాసి డొక్క చీలుస్తాను."

"నేనూ దస్కత్తు చేస్తాను రాయండి."

ఇంజనీరుకు రాశాడు. ఆయన ఈ గొడవ మాకేమీ తెలియదని జవాబిచ్చాడు. ఈ విషయం అంతా కృష్ణాపత్రికలో వేశారు. ఊరంతా నవ్వు కున్నారు.

ఆ ఇంటాయన ఎంతకాలంవరకో తనిల్లు యుద్ధంకోసం ప్రభుత్వం తీసుకుంటుందేమోనని భయపడినాడు.

కోనంగి ఒకసారి పెద్దటైపు కొట్టి బందరు కలెక్టరుకు ఒక పెద్దపిటీషను రాశాడు. అందులో "మీరు రాత్రి 10 గంటలకు... పేటకు...నంబరు ఇంటికి వచ్చి చూస్తే ఇరవై ముప్పైమంది కూడి ఏదో కుట్రచేస్తున్న విషయం తెలుసుకోగలరు. మన ప్రభుత్వం సుస్థిరంగా ఉండాలంటే, అలాంటివి జరగకూడదు. ఇవి యుద్ధంరోజులు" అని రాశాడు.

అప్పటికి కోనంగి చదువు పూర్తిఅయింది. జర్మనీ పోలండుమీదకు చొచ్చుకుపోయే రోజులు.

కలెక్టరుగారు నిజంగా పోలీసుదళంతోవచ్చి చూస్తే. అక్కడ హరనాధబాబా భజన జరుగుతోంది. అయినా కలెక్టరుగారికి అనుమానం. అక్కడికి వెళ్ళిగడబిడచేసి యుద్ధానికీ, కుట్రకూ, భజనకూ ఏమీ సంబంధం లేదని తెలుసుకొని, కాస్సేపు పళ్ళుకొరికి, కాసేపు పకపక నవ్వి వెళ్ళిపోయాడట.

## ③

**కో**నంగిలో ఉన్న అసంతృప్తికి కారణం లేకపోలేదు. ప్రపంచంలో నిద్రాణమై ఉన్న శక్తులన్నీ మేల్కొన్నాయి. కోనంగి రాజకీయపు బిడ్డగా ఉద్భవించాడు. కానీ రాజకీయాలనుంచి పారిపోయాడు. అందుకు కారణం అతనిలోని రహస్యమే.

పుట్టిన బ్రతుకు అర్థము లేనిదవడంవల్లనూ, అతనిలో అనంతమైన ఆనందమైన శక్తి ఉండడంవల్లనూ, అతనికి హాస్యరసం శరణాగతమైంది. మానవజీవితంలో సంభవించే ఒడుదుడుకులకూ, కష్టనిష్ఠూరాలకూ బండిని కాపాడే స్ప్రింగువంటిది హాస్యరసం. దుఃఖం అనే చెరువుగట్టు తెగిపోతే, ఆ నీరు వెళ్ళిపోయే తూము హాస్యభావం. హాస్యం అనే కాపుదల లేకపోతే మానవుని హృదయం దుఃఖఘాతం ఒక్కటి తగిలినా ముక్కలై వుండును.

మానవ జీవితం 'అద్దపుసామాను జాగ్రత్త' వంటిది. ఆ సామాను విచ్ఛిన్నం కాకుండా రక్షించే ఉక్కుపెట్టే హాస్యరసం.

సంపూర్ణజీవిగా పుట్టేవారున్నారు. వారికి ఏనాడో లోకసంపూర్ణ జీవితం కైవసం చేసికొనే ఆవేదన వస్తుంది. ఆ ఆవేదన ఉద్భవించడానికి ఒక మహత్తర కారణం కూడా ఉండాలి. కోనంగి అనంతలక్ష్మిని ఎదుర్కొనడమే అతని జీవితభావం అంతా తారుమారు అవడానికి కారణమైంది.

బి. య్యే. పరీక్షలో మొదటి తరగతిలో నెగ్గిన బాలకునకు ఉద్యోగం సంపాదించడం అంత బ్రహ్మవిద్య కాదు. కాని అతనిలో అవ్యక్తంగా ఏదో లోకాన్ని అతివేగంగా అధిగమించే వేదనాభరిత కాంక్ష బయలుదేరింది.

అతని చేతిలో తన మనస్సు తాను చూచుకునే దుర్భిణియంత్రమే ఉంటే, తన్నీ రోజులలో పొదివికొన్న ఆవేదన అర్థమయ్యే ఉండును.

ప్రపంచం అంతా అతనికి లోపభూయిష్టంగా కనబడేది. అతని చూపు వెనక్కులేదు. 'ఇప్పటి' పైనే ఎక్కువగా ఉంది. ఆ 'ఇప్పటి' లో ఉన్న అపశ్రుతులన్నీ అతని మనోనేత్రాలకు వికారాలుగా తోస్తూ ఉన్నవి. అతనికి నవ్వూ, కోపమూ రెండూ ఒక్కసారిగా వచ్చేవి. అతని కోపం నవ్వుతో మిశ్రమై, నిశితమైన అపహాసంగా ఉద్భవించింది.

ఇప్పటిలోని సంఘపథకం అతనికి ముందుగా కనబడుతూ ఉంటుంది. మిస్ మేయో రాసిందంటే రాయదూ! ఆవిడ ఇంకా గౌరవంగా "మదర్ ఇండియా" అని రాసి ఊరుకుంది. "ఏ పూర్ ఇండియా" అనో రాయలేదు. "ఏ డర్టీ ఇండియా" అనో వ్రాయలేదు. అది నయంకాదుటండీ అనుకున్నాడు. వైటువే కంపెనీ మేనేజరుగారి దగ్గర ఆ "మదర్ ఇండియా" పుస్తకం చూచి చదువుకునేందుకు తీసికొని, చదివి ఇచ్చేశాడు. పరీక్షలలో మొదటి తరగతులలో నెగ్గే ఘటమాయను. ఆ ఒక్కసారి చదువులో ఆ గ్రంథం యావత్తూ పూర్తిగా కంఠతః వచ్చింది.

పుస్తకం చదవగానే మొదట అతనికి కోపం వచ్చింది. తర్వాత దుఃఖం వచ్చింది. వెంటనే నవ్వు వచ్చింది. అవును ఆ ముసలావిడకు భరతదేశం కోడలై కనిపించింది. అమెరికావారు భారతదేశీయపు మురుగు కాల్వలన్నీ టెలిస్కోపులో చూడాలని ఇంగ్లీషువారు ఆమెచేత ఈపుస్తకం రాయించారని ఆనాడు గగ్గోలు పుట్టిన మాట నిజం.

మొత్తంమీద మేయో భారతజాతిలో ఉన్న కోటికళంకాలన్నీ వెదికి ఏరి మాలిక అల్లి ఆనందించండర్రా అని తన దేశస్థుల మెళ్ళలో వేసిందా దెయ్యపుదండను.

ఆ పుస్తకం ఎప్పుడు చదివాడో, ఆ వెంటనే దానికి జవాబుగా వచ్చిన నాలుగు పుస్తకాలూ చదివాడు. రంగయ్యంగారి "పాదర్ ఇండియా" లాలాలజపతిరాయిగారి "అన్ హాపీ ఇండియా", ఎర్నెష్టువుడ్‌గారి "యాన్ ఇంగ్లీష్ మాన్సు రిప్లయ్ టు మదర్ ఇండియా", గాబాగారి "అంకుల్ షామ్" అనే పుస్తకాలు చదివాడు.

ఇన్ని పుస్తకాలు చదవడానికి అనంతలక్ష్మి దర్శనమే కారణం కోనంగిరావుకి. ఇంకా ఆఖరు పుస్తకం రెండోసారి చదువుతున్నాడు. ఈ పుస్తకాలన్నీ అనంతలక్ష్మి తండ్రిగారి పుస్తకాగారంలోనివి.

ఈ అయిదు పుస్తకాలూ చదివేటప్పటికి ఆ కాలంలోని అన్ని విషయాలు విచారణకు వచ్చాయి కోనంగి మనస్సులో.

హొటలు గుజరాత్ నుండి తిన్నగా నెల్లూరు హొటలుకుపోయి చేరిన రెండు రోజులవరకూ ఎక్కడికీ కదలలేదు కోనంగి. మూడవ రోజున సాయంకాలం అనంతలక్ష్మి ఇంటికి పాఠానికి వెళ్ళాడు.

కోనంగిని చూడగానే అనంతలక్ష్మికి కలిగిన ఆనందం ఏ రాయప్రోలో, దేవులపల్లో, వేదులో, నండూరో, విశ్వనాథో, శివశంకరులో, కాటూరో, పింగళులో వర్ణించవలసిందే.

"నిన్నా మొన్నా రాలేదేమండీ గురువుగారూ?"

"కొంచెం ఒంట్లో బాగుండక రాలేదు."

"మా ఇంటికి రాకూడదు కాబోలు."

"వచ్చే ఉందును అనంతం. కాని నేను మీ ఇంట్లో ఉండడం అనేక కారణాలవల్ల మంచిదికాదు. నీకు గురువు నవడంవల్ల నా జీవితమే మారి పోయేటట్టు ఉంది.

"అలాంటా రేమిటి, ఏమి మారుతుందంటారు?"

"మారడం అంటే, నేను ఏ ఆవునో, మేకనో, గుఱ్ఱాన్నో, కుక్కనో అవుతానని కాదుసుమా!"

"ఏమో బాబూ! మీరల్లా అయిపోతే!"

"వహ్వా! వేశావు బాణం! అది నిజమే, మీ ఇంట్లో కాపురానికివస్తే కుక్కా గుఱ్ఱాన్నీ కాదుగాని గాడిదను అవుతానని భయం."

"మేమంతా గాడిదలమనా?"

"మంచిదానవే నువ్వు! మీది మంచి తోటన్నమాట. ఆ తోటంతా మేసే గాడిదలా వస్తానన్నమాట!"

"నాకు మీ మాటలు ఏమీ బాగాలేవు గురువుగారూ!"

"మీ ఇంట్లో చేరితే నువ్వు సర్వకాలమూ నా ఎదుటే ఉంటే, నా హృదయమూ, ఆత్మా నీకు సర్వార్పణమైతే ఇంక నా పని ఏమిటి? నేనని ప్రత్యేకత ఏమవుతుంది?"

"ఏమి కవిత్వమండీ!"

"నిన్ను చూస్తే ఎవరికి కవిత్వం రాదూ?"

"చెట్టియారుకు వచ్చిందా?"

"ఏమో, అరవంలో ఎంత కవిత్వం రాస్తున్నాడో?"

"కవిత్వం రాదుగాని కపిత్వం వస్తుంది."

"వట్టి కోతయిపోతాడన్నమాట. నేను గాడిదనయినట్లు."

"మిమ్మల్ని మీరలా తిట్టుకోకండి."

అనంతలక్ష్మి ఆ మాట మహామధురంగా అన్నది. ఆ మాటలు కోనంగి గుండె చెదరగొట్టాయి. అనంతలక్ష్మిని కోనంగి తన దగ్గిరగా తీసుకొని గట్టిగా కౌగలించుకొని, "నేను దొంగతనం చేస్తున్నాను అనంతం! వట్టి నిరుపేదను. అయినా నీ జీవితాలయంలోకి ఈలా నిర్భయంగా వస్తున్నాను" అంటూ ఆమె పెదవులను తనివార చుంబించినాడు.

అనంతలక్ష్మి కరిగిపోయింది. ఆమె కన్నుల నీరు తిరిగింది. అనంద పరవశమైన ఆమె పెదవుల మధురహాసము నృత్యము చేసింది. ఆమె ధైర్యముతో కోనంగిని తనంతట తానే కౌగలించుకొని, అతని మోము వంచి, అతని పెదవుల ముద్దు పెట్టుకుంది.

ఇద్దరికీ సర్వప్రపంచమూ మాయమైంది. ఇద్దరే విశ్వంలో. వారు జంట సెలయేళ్ళు, మహానదులు, వారు అగ్నివాయువులు, వారు రెండుపూవులు, వారు మేఘము మెరుములు, వారు కెరటము సుడిగుండమూ, వారు కొమ్మలో కోకిలజంట!

ఆ మధుర మత్తతలో ముందర మేల్కొన్నది కోనంగే. "అనంతలక్ష్మీ! నేను మీ ఇంటిలో ఉండడము మంచిదికాదు. మీ తల్లికి మన వివాహం సంగతి మనము ఇద్దరమూ చెప్పాలి. అందుకు కొంచెం ఓపికపట్టు. ప్రస్తుతము నీ పరీక్ష అయినవరకూ మన ప్రేమ సంగతి మరిచిపో. చదువు పూర్తి కాగానే, మన విషయం తేల్చుకుందాము" అని అంటూ కోనంగి అనంతలక్ష్మిని తన హృదయానికి మరొకసారి అదుముకొని ఆమె పెదవులు, కన్నులు, తల, మెడ, బుగ్గలు తనివార ముద్దులవర్షంతో నింపినాడు.

# 4

కోనంగికి రాజకీయాలేమీ లేవు కాబట్టే, వ్యవసాయానికి సిద్ధంగావున్న శాలి భూమిలా ఉన్నాడు.

"మదర్ ఇండియా" అతనిని రాజకీయపు నిద్రమత్తు నుండి లేపింది. "ఏమిటీ కాంగ్రెసు? ఎవరీ మహాత్ముడు? ఎందుకీ అహింస? ఏలాంటిదీ సత్యాగ్రహం?" అని ప్రశ్నలు వేసుకున్నాడు. కాంగ్రెసును వ్యతిరేకించే జస్టిస్‌పార్టీ అంటే ఏమిటి?

అతడు ఈ పేర్లు వినలేదనిగాని, వీటి అన్నిటి విషయమూ చూచాయగా తెలియదనికాని కాదు. ఈలాంటి వివిధ భావాలు, సకల ప్రపంచ పథకంలో పెట్టుకొని ఇంతవర కాతడు పరీక్షకు చదివినట్లు చదవలేదు.

అనంతలక్ష్మి ఇంట్లో వేలకొలది పుస్తకాలున్నాయి. పట్టాభిగారి "కాంగ్రెసు చరిత్ర" ఉంది. మహాత్ముని "యంగ్ ఇండియా" పత్రికా సంపుటాలూ, "హరిజన" సంపుటాలూ ఉన్నాయి. అహింస, సత్యాగ్రహం వీనిమీద వ్రాసిన గ్రంథాలున్నాయి. రొమైన్ రోలా మొదలగువారు గాంధీ మీద వ్రాసిన గ్రంథాలున్నాయి. ఈ సంవత్సరమే గాంధీగారిమీద డెబ్బదవ సంవత్సరోత్సవ సంచిక రాధాకృష్ణనుగారు ప్రచురించిన గ్రంథమున్నది. గాంధీగారు వ్రాసిన "హింద్ స్వరాజ్", "సత్యం విషయమై నా పరిశోధన" అనే గ్రంథాలున్నాయి. వారు భగవద్గీతకు వ్రాసిన భాష్యమున్నది.

తిలక్‌గారి భగవద్గీతా భాష్యమున్నది. నటేశన్ కంపెనీవారు ప్రచురించిన ఇతర గ్రంథాలెన్నో ఉన్నాయి. లాలా లజపతిరాయిగారు వ్రాసిన గ్రంథ మున్నది. జవహర్‌లాల్‌గారి "ప్రపంచ చరిత్ర", "జీవిత చరిత్ర" అనే గ్రంథాలున్నాయి.

ముస్లింలీగువారి వ్రాతలు, జస్టిస్‌పార్టీ వారి వ్రాతలు, గోఖలేగారి ఉపన్యాసాలు మొదలయినవి చదవడం ప్రారంభించాడు. నౌరోజి, పాల్, రెనడీ, మెహతా, బెనర్జీ, బాసు మొదలైనవారి జీవిత చరిత్రలు, ఉపన్యాసాలు చదవడం సాగించాడు.

అనంతలక్ష్మి పరీక్షలకు వెళ్ళేరోజులు వచ్చేసరికి 1940 మార్చి నెలకు ఈ గ్రంథాలన్నీ పూర్తి చేశాడు.

ఇవి చదువుతూ 1939 డిశంబరు నుండీ ఉద్యోగంకోసం వెదుకుతూ, 1940 జనవరిలో ఒక తెలుగు సినిమా కంపెనీలో కథానాయకుడుగా చేరాడు.

నెలకు రెండు వందల జీతము. భోజనము కంపెనీవారి భోజనసత్రంలోనే!

బొమ్మ తీయడం ప్రారంభించడం మార్చి నెలనుంచి అనీ, కోనంగి ఆ కంపెనీవారి భవనంలో ఉంటూ తన కిచ్చిన నాయకుని భాగం యావత్తూ కంఠత చదివేయాలనీ, అతని వంతుకు వచ్చిన అయిదు పాటలూ రోజూ రిహార్సల్సులో క్షుణ్ణంగా వచ్చేయాలనీ మేనేజింగు డైరెక్టరు విష్ణుమోహన లక్ష్మీనారాయణగారు చెప్పినారు.

పోర్షనూ, పాటలూ మూడు రోజులలో కంఠతః పట్టినాడు. రోజూ రిహార్సల్సు ఉదయం పదకొండు గంటలు మొదలు, సాయంకాలం ఆరుగంటల వరకూ.

కోనంగి సినీమాలకు ఒక మోస్తరుగా వెళ్ళేవాడు. ఇప్పుడు దాని సంగతి బాగా తెలుసుకోవాలని "సినీమా టెక్నిక్", "మంచి నటన", "ధ్వని" "కెమెరా"," దర్శకత్వం" అను గ్రంథాలు, ఇంకా ఎన్నో గ్రంథాలూ అన్నీ క్షుణ్ణంగా చదివేవాడు.

సినీమాలో అతనికి ప్రవేశం దొరకడానికి కారకుడు డాక్టరు రెడ్డిగారే!

కోనంగి నెల్లూరు హెూటలులో ఉంటూ అనంతలక్ష్మికి పాఠాలు చెబుతూ, డాక్టరు రెడ్డిగారింటికి వెళుతూ ఉండేవాడు.

డాక్టరు రెడ్డిగారూ, వారి స్నేహితులు కొందరు, చుట్టాలు కొందరూ కలిసి, ఒక సినీమా కంపెనీ "ది వండర్‌ఫుల్ పిక్చర్ టోన్" అని పేరు పెట్టి స్థాపించారు. డాక్టరుగారు ఆ చిత్రానికి కోనంగిని నాయకునిగా ఎన్నుకొన్నారు.

ఈలోగా డాక్టరుగారితో రాజకీయాలను గూర్చి కోనంగి వాదించడం అలవాటు పడ్డాడు. రాజకీయాలకూ, మతానికీ సంఘ వ్యవస్థకూ, ఆర్థిక పరిస్థితులకూ అవినాభావ సంబంధం ఉంది కాబట్టి అవన్నీ వాదించాలని డాక్టరుగారు.

1938లో డాక్టరుగారు విదేశాలన్నీ తిరిగివచ్చారు. ఆ తిరగడంలో రష్యాలో ఎక్కువ కాలం ఉన్నారు. ఆయనకు రష్యా విధానం బాగా నచ్చింది. సామ్యవాదాన్ని గూర్చి బాగా చదువుకున్నాడు. ఆర్యసమాజంవారు ఎవరినన్నా సరే వాదంలో ఓడించడానికి క్షుణ్ణంగా తయారై ఉంటారు. అల్లాగే ఎవరివాదం వారు బలపరచడానికి గ్రంథాలు పూర్తిగా చదవాలి. ఎదుట ఏ ప్రశ్నలు వేస్తారో అవి ప్రతిభతో ఊహించుకొని, వానిని నీ వాదనకు సరిపోయే దిట్టమైన ప్రత్యుత్తరాలు సిద్ధం చేసుకుని ఉండాలి అని డాక్టరు వాదన.

మనుష్యుడు బ్రతకడం కోరతాడు. ప్రతిజంతువూ అంతే! తర్వాత తన జాతివృద్ధి కోరతాడు. ప్రతిజంతువు అంతే! ఈ రెంటిలో నుంచి, తన దేహరక్షణ, జాతిరక్షణ అనేవి వస్తాయి. తన దేహరక్షణ విశ్రాంతి బలము, ఆయుధం, తప్పించుకోడం, చుట్టూ రక్షణ నిర్మాణం, రోగనివారణ, ఆకలి బాధ నివారణ, దాహ నివారణ, శీతోష్ణస్థితిగతుల బాధా నివారణ, పరిస్థితి సంజనిత బాధానివారణ అనేవి కోరుతాడు.

జాతిరక్షణ, జాతి, జాతివిద్య, జాతిదక్షత, కోట, యుద్ధము, పోలీసు, సమిష్టి వ్యవసాయం, వివాహం, యువతీయువక సంప్రీతి, శిశుపోషణ, శిశువైద్యము, శిశు విద్య సంఘారోగ్యము, సంఘవైద్యము మొదలైనవి కోరుతుంది.

"ఇవి కాకుండా మనుష్యుడు ఆనందం కోరడా అండీ? ఆటలనీ, పాటలనీ, నాటకాలనీ, సంగీతమనీ, కవిత్వము చిత్రశిల్పాలనీ, నాట్యమనీ?"

"అవన్నీ జంతులక్షణాలే!

"అయితే శాస్త్రజ్ఞానము, కవిత్వాదికళలూ వివాహమూ, బంతి ఆట మొదలైనవి ఇవన్నీనండీ?"

"కోనంగిరావు. ఇవన్నీ కూడా పశువులలోనూ గర్భితమై ఉన్నాయి. కుక్కపిల్ల గుడ్డముక్కతో ఆడుతుంది. సింహంపిల్ల ఎముకముక్కతో ఆడుతుంది. లేడిపిల్ల ఆకులతో ఆడుకుంటుంది. గంతులు వేస్తుంది. వేస్తూ అరుస్తుంది."

"అవే కవిత్వాలు, నాట్యాలు, సంగీతాలూ, ఆటలూ అంటారా ఏమిటి?"

"ఎందుకంటానయ్యా? జంతువులో గర్భితమైన శక్తులు, చిహ్నమాత్రంగా ఉండే శక్తులు, మానవునిలో వ్యక్తమయ్యాయి, అంతే."

"అదే నేనూ అనేది. అలా వ్యక్తం కావడానికి కారణం అతని మనస్సు కాదా అండీ?"

"అదే నేనూ అనేది. అలాంటి మనస్సు కలవాడు కాబట్టి మనుష్యుడు?"

"మీరూ నేనూ ఒకటే అంటున్నాము. ఇంక తేడా ఎందులో ఉంది?"

"మీరు నాతో వాదన ఎందుకు పెట్టుకొన్నట్టు?"

"వాదనను నేను ఓ హారంలా ధరించలేదు!"

"ధరించి ఉన్నారేమో?"

"మట్టి తలకాయను భరించినట్టు"

"ధరించడం మట్టుకు ధరించకండి ఏ మాత్రము!"

## 5

**కోనంగి:** అయితే కాంగ్రెసు రాజకీయాలమాట ఏమిటి?

**డాక్టరు:** కాంగ్రెసు మంచిదే. మహాత్మాగాంధీ ఉత్తమాశయాలు కలవాడు. కాని కాంగ్రెసు ఆశయాల ప్రకారం కాంగ్రెసులో కోటీశ్వరుడు చేరినా ఏమీ ఇబ్బందిలేదు.

**కోనంగి:** సాంఘికవాదులతో మాత్రం కోటీశ్వరులు చేరడానికి అభ్యంతరం వుందా?

**డాక్టరు:** ఇప్పుడు మేము పెట్టుకున్న పద్ధతి ప్రకారం కోటీశ్వరులు చేరవచ్చును. కాని ముందు ముందు తనకున్న ఆస్తి యావత్తు సాంఘిక వాదానికి అర్పించవలసి వస్తుంది.

**కోనంగి:** సాంఘికవాదులు, సామ్యవాదులు మహాత్మాగాంధీగారి బోధనలు ఒప్పుకోరా?

**డా:** ఒప్పుకోరు.

**కోనంగి:** కారణం?

**డా:** ఆ బోధనల నష్టం ఏమిటో, నష్టలాభాలు బేరీజు చేసుకోకుండా సాంఘిక సామ్యవాదులు, ఆయన బోధన ఎలా ఒప్పుకుంటారు?

డాక్టరుగారితో గాంధీగారి బోధ తమకు బాగా అర్థమైంది అని తెలియజేశాడు. మహాత్మాగాంధీగారు నిజమైన సామ్యవాది అని అన్నాడు. "డాక్టరుగారూ, ప్రపంచం ప్రపంచంలో ఉన్న ప్రజలందరిదీ అనీ, ఆ ప్రజలందరూ సమంగా పైకిరావాలనీ ఆ ఉత్తమపథం అందటానికి మనుష్యుని ధర్మశక్తినే ఆధారం చేయాలనే వాదనకన్న గొప్పవాదం ఏమి ఉండగలదు?"

"సామ్యవాదం చెప్పేది అదే. కాని అలాంటిస్థితి ప్రపంచానికి రావాలంటే, మనుష్యుని ధర్మశక్తి పైన ఆధారపడి ఊరుకుంటే, ఆ ఉత్తమస్థితి రావడానికి భూగోళం అంతమయ్యేవరకూ ఎదురుచూస్తూ వుండవలసిందే!"

"దేనిమీద అధారపడితే త్వరగా వస్తుంది?"

"హింసమీదే! తప్పుచేసిన వారిని దండించడం మానవజాతిలో వుండే ఒక పెద్ద శక్తి! ఆ శక్తిని ఉపయోగించడం మానివేసి, ఎక్కడో మూలదాగి వున్న ఒక చిన్న ముసలమ్మ శక్తిని సహాయం తెచ్చుకుంటే ఏం పని జరుగుతుంది? ఆకాశంలో ఎగరాలంటే, విమానాలకు పెట్రోలియమే ఆధారం కావాలి. ముసలమ్మ ఓడలకు మోటారునూనె కావాలి. ఇంకా పాత ఓడలకు బొగ్గు, నీరే ఆధారం! ఇంకా ముసలమ్మ తాతమ్మ ఓడలకు గాలీతెడ్డూ ఆధారం"

"హింసమీద ఆధారపడితే ప్రతిహింస కోరదా హింస?"

"కోరినా భయమేమిటి?"

"హింస ప్రతిహింసలలో ఏది ఎక్కువ బలంకలదైతే అదే నెగ్గుతుంది."

"కాక"

"అయితే సామ్యవాదులకన్న బలవంతులైన సామ్రాజ్యవాదులు వస్తే?"

"అలా రావడానికి వీలులేదు."

"జర్మనీ వస్తుంది. కాని రష్యాకు ఇతర సామ్రాజ్యవాదులు సహాయం చేయకపోతే రష్యా నాశనం అవుతుంది.

"జర్మనీకి రష్యాకు ఇప్పుడు స్నేహంకాదా? రష్యాలోని ప్రజాశక్తి ఎవరు తనపై పడినా కాచుకో కలదయ్యా?"

**కోనంగి:** ఏమిచేస్తాడు భారతీయు డీ ప్రపంచంలో! భారతదేశానికి స్వరాజ్యం కావాలా అక్కరలేదా? స్వరాజ్యం కావలసివస్తే గాంధీజీ చూపించిన దారి ఉత్తమముకాదా? తాము స్వరాజ్యం సంపాదించుకొన్న తర్వాత ఇతర సమస్యలు చూచుకోడం మంచిదికాదా?

**డా:** అవునయ్యా. నువ్వు చెప్పినదాంట్లో అర్థం లేకపోలేదు. మన స్వంత భూమి సంపాదించుకొనేటప్పుడు, ఏలాంటి వ్యవసాయం చేయదలచుకొన్నావో నిశ్చయించుకోవద్దా?

**కోనంగి:** అదేమింటండీ అలా అంటారు? మనం ఇంటిస్థలంకోసం వ్యాజ్యం వేశాము. ఆ స్థలం మనదైన తర్వాతగదా ఏలాంటి ఇల్లు కావాలో నిశ్చయించుకొనేది. పొలం మన స్వాధీనమైనతర్వాత ఎలాంటి వ్యవసాయం చేయాలో నిశ్చయిస్తాము. మొదట స్వరాజ్యం రానీయండి చూద్దాం.

**డాక్టర్:** గాంధీగారి పద్ధతివల్ల స్వరాజ్యం రాదనే నా ఉద్దేశం.

ఎందుకంటే గాంధీగారిని మాయచేసి భారతీయ పూంజీదారులు కాంగ్రెసుకు మద్దతు చేస్తున్నారు. వారి స్వలాభంకోసం భారతదేశాన్ని ఇంగ్లండు నుంచి పూర్తిగా విడిపోనియ్యరు.

కోనంగి డాక్టరుగారితో వాదించడం కష్టమనుకొన్నాడు. కాంగ్రెసులో బిర్లాలున్నారు. అంబాలాలు, సరాభాయిలున్నారు. వారు కోటీశ్వరులే! కాని వారి ధనాశతనం మానుకొన్నారా?

కాంగ్రెసు నాయకుడైన జవాహర్‌లాలు నెహ్రూకూడా సాంఘికవాది అయ్యాడు. అయినా ముందర కాంగ్రెసులో నాల్గణాల సభ్యుడవడం తన కర్తవ్యం అనుకున్నాడు. తాను హెూటలు గుజరాతులో సంపాదించుకొన్న ఆ కొద్ది రూపాయలు పెట్టి ఖద్దరు కొనుక్కున్నాడు.

అనంతలక్ష్మి ఇంటిమూల పడివున్న వార్ధాచరఖా వడకడం ప్రారంభించాడు. ఇంతలో తాను సినిమాలో చేరడం వచ్చింది.

డాక్టరు రెడ్డిగారు రష్యాను గురించి గ్రంథాలన్నీ తన్ను చదవమన్నారు. అవి కూడా చదవడం ప్రారంభించాడు. మార్క్సుగారి 'పెట్టుబడి మూలధనం' చదవడం సాగించాడు. అనుమానాలు డాక్టరుగారి నడగడం! ఈలా మార్చి నెలాఖరుకు ఆ పుస్తకం పూర్తిచేశాడు. లెనిన్‌గారి గ్రంథాలలో "సామ్రాజ్యతత్త్వ విమర్శనము" అనే గ్రంథం చదివాడు. "మార్క్సిజం" అనే గ్రంథం మొదలు ఇరవైనాలుగు సంపుటాల గ్రంథాలున్నాయి. కోనంగి అవన్నీ కూడా చదవడానికి నిశ్చయం చేసుకున్నాడు.

ఒకవేళ తాను ఒక పెద్ద రాజకీయనాయకుడైపోతే! ఇంకేముంది? ఎవరు భరిస్తారు? ఊరేగింపులూ, పూలమాలలూ, జయధ్వానాలున్నూ! ఇంక వూరికే ఉపన్యాసాలిస్తూ వుండాలి కాబోలు, జైలుకు వెళ్ళడం ప్రారంభించాలి కాబోలు. ఇదో ఇబ్బందే. తన తల్లి దుఃఖిస్తుంది. అదో రకం జీవితం క్రింద మారుతుంది. అదృష్టంకొద్దీ తల్లి ఒక విగతభర్తృక అయిన ధనవంతురాలింట వంటలక్కగా చేరింది. తానేమో పెద్ద ఉద్యోగంచేసి తన్ను

మోటారు ఎక్కిస్తాడు కొడుకు అని ఆశిస్తోందో, లేక ఈ పాపం వల్ల పుట్టిన శనిగాడు వదిలాడు అని అనుకొంటోందో?

హెూటలులో వడ్డనదారీ ఉద్యోగం చేసిన పట్టభద్రుడైన కొడుకును కన్నాను అని ఆమెకు తెలియదింకాసు పాపం!

అన్నిరకాల ధనసంపాదనా మానవకృషి అనీ, అవి చవిచూడాలన్న అల్లరిభావం ఒక ప్రక్కా, ఇంత చదువూ చదివి ఇల్లు అలుకుతున్నాడన్న బాధ ఒకవైపునా అతన్ని ఊపుతూనే ఉండేవి.

అసలే కొడుకు నెందుకు కన్నానా అని విచారించే అమ్మ! కాని కన్నకొడుకుపై ప్రేమ తప్పుతుందా? ప్రేమ, అసహ్యమూ, ద్వేషమూ రంగరించిన ఆపేక్ష తనపైన తల్లికి.

ఆ తల్లికి ఎప్పుడు పంపినా యాభైరూపాయలవరకూ పంపాడు తాను. ఇక సినీమా ఉద్యోగం వచ్చిందికాదా బాగా ధనం పంపవచ్చు.

## షష్ఠ పథం

# సినిమా

**డాక్టరు** రెడ్డిగారూ స్నేహితులూ ఏర్పాటు చేసిన సినిమా కంపెనీలో కోనంగి చేరినాడంటే, ఒక టాంకుదళం చేరినంతపని అన్నమాటే! ఆ కంపెనీకి మానేజింగు డైరెక్టరు విష్ణుమోహన లక్ష్మీనారాయణరావుగారు. వీరిని కంపెనీలో వారందరూ వి. యల్. అంటారు. ఇక బొమ్మకు దర్శకుడు? బొంబాయిలో, కొల్హాపూరులో అక్కడ అసిస్టెంటు డైరెక్టరు చేసి కష్టపడి వచ్చిన ఎ. ఆర్. జి. పాటీగారు ఈ బొమ్మకు డైరెక్టరుగా నియమింప బడ్డారు. ఎ. ఆర్. జి. పాటీ అంటే అనంతరావు గార్లపాటి అన్నమాట.

**కోనంగి:** అల్లాగుటండీ! నేను ఆయన ఎవరో మహారాష్ట్రుడనుకున్నా, మహారాష్ట్రునికి తెలుగు అంత బాగా ఏలావచ్చునా అని ఓమాట అనుకున్నా!

**డాక్టరు:** అవునయ్యా! మీరుకూడా ఆర్. కే. నంగే అని పెట్టుకోరాదూ.

**కోనంగి:** మీరు డాక్టరు ఆర్.డీ.డీ. అని పెట్టుకోండి. డ్డి అనే వత్తుమాట డీ.డీ అని శబ్దశాస్త్ర ప్రకారం మారుతుంది. ఏ జర్మనీ నుండో వచ్చిన పెద్ద డాక్టరనుకుంటారు మిమ్మల్ని.

**డాక్టరు:** నంగే అంటే వచ్చిన తప్పేమిటి?

**కోనంగి:** వట్టి నంగిమాటలు మాట్లాడే మనుష్యుడు నాయకుడు వేషం వేశాడు కాబట్టి ఈ చిత్రం తగలడుతుందిరా అని ప్రజలలో అభిప్రాయంపడితే ఇంక చిత్రాన్ని చూడడానికి ఎవరు వస్తారు? లేదూ నంగే అనే మహారాష్ట్రుడు కథానాయకుని వేషం వేస్తున్నాడు, ఇంక మనం కళ్ళారచూడనక్కరలేదు బొమ్మను, చెవులార విననక్కర లేదనుకుంటారు. డైరెక్టరు మహారాష్ట్రుడు కాబట్టి మహరాష్ట్రుణ్ణి పెట్టాడు. ఇది తెలుగు చిత్ర మనుమాట మరచి తెలుగు రానివాళ్ళని పోగుచేస్తున్నాడురా! అనుకుంటారు.

**డాక్టరు:** అది సరేగాని, నీ కథానాయికను చూచుకున్నావూ?

**కోనంగి:** చూచా స్వామీ, చూచా. అదేమిటి? అలాంటి కంచి ఇడ్లీ పిల్లని కొట్టుకు వచ్చారేమిటి?

**డాక్టరు:** మొగం చంద్రబింబంలా లేదటయ్యా?
**కోనంగి:** చంద్రబింబం అంటారేమిటి? దానికి తరగడం పెరగడం ఉన్నాయి. నా నాయకురాలి మోము అచ్చంగా తిరగలి రాయిలా ఉంది. నిజంగా చెప్పండి డాక్టరు గారూ! ఎందుకు ఆ అమ్మాయిని నాయికగా చేయదలచుకున్నారు?
**డాక్టరు:** చెప్పమన్నావు స్వామీ, మాకు డబ్బిచ్చేవారిలో ఒక పెద్దగారు ఉంచుకున్న పిల్ల ఆ అమ్మాయి.
**కోనంగి:** తామెల్లా ఊరుకున్నారు స్వామీ?
**డాక్టరు:** సంగీతం అద్భుతంగా పాడుతుందా లేదా?
**కోనంగి:** ఓ హెూహెూ! ఆ సంగీత మేమిటి! చెప్పడానికి వీల్లేదు. వర్ణించడానికి వెయ్యి నాలుకలు చాలవు. పాపం! ఒక్కటే వుంది.! గొప్ప సంగీతములో కన్నన్‌బాలా, కన్నాంబా; సుబ్బలక్ష్మి, కుర్షీద్ అందరి సంగీతమూ తన గొంతులో నాట్యం చేస్తున్నాయని ఆ ఇడ్డెనమ్మాయి ఉద్దేశం. "నాట్యం కాదుకాని అవన్నీ కలిసి శివాలాడుతున్నాయి. ఒక్కొక్కటే బైటకు వచ్చేద్దామనే తొందరలో, ఒకదాని కొకటి కాళ్ళకద్దాలాడు తున్నాయి. అన్ని శ్రుతులూ, అన్నిస్వరాలూ, అన్నిరాగాలూ, అన్నితాళాలూ, అన్నిగతులూ ఒక్కసారిగా పైకి వచ్చి సంగీత కదంబం, చౌచౌ, భౌభౌ" ఊరుకు అయిన్నాయి.
**డాక్టరు:** నిజం చెప్పవయ్యా కోనంగీ, ఆ అమ్మాయి పనికి వస్తుందా రాదా?
**కోనంగి:** విను స్వామీ! అ అమ్మాయి 'ప్రాణనాథా' అనమంటే, 'పరాణనాదా' అంటుంది. 'నాథా' అనమంటే నాదా అంటుంది. 'థా' ఒత్తు అంటే న్థాదా అని నామీదే ఒత్తు తుంది బాబూ!
**డాక్టరు:** నీమీదే ఒత్తిందీ?
**కోనంగి:** నన్ను ఒక్కణ్ణే ఏం, అక్కడ ఉన్నవారందరినీ, రేపు ప్రేక్షకులనందరినీ కూడా ఒత్తుతుంది.
**డాక్టరు:** నాయిక సంగతి ఈలా ఉందీ, ఇంక తక్కినవారి సంగతి?
**కోనంగి:** నిజంగా మీ అందరి ఉద్దేశమూ 'సహస్రకంఠ రావణాసుర' తీద్దామనే!
**డాక్టరు:** మా వాటాదార్లందరి ఉద్దేశం అదే! కాని నా ఉద్దేశం మాత్రం అదికాదు కోనంగీ!
**కోనంగి:** ఏం లాభం! ప్రతి వెంకయ్యా, సుబ్బయ్య పురాణగాథలు తీద్దామనే. ఇంగ్లీషు వాళ్ళు ఎన్ని పురాణ గాథలు తీశారు? సైన్ ఆఫ్ ది క్రాస్, క్వోవాడిస్ మాత్రమే! ఎన్నో కిరస్తాని మతగాథలు, ఏన్నో గ్రీకుగాథలు ఉన్నాయి: అవన్నీ తీశారా?

వీరిద్దరూ డాక్టరుగారి ఇంటిదగ్గర మాట్లాడుకుంటున్నారు. ఇంతట్లో చిత్రం డైరెక్టు చేయనున్న 'పాటీ' గారు, మేనేజింగు డైరెక్టరు వి.యల్.యన్.గారూ, మేనేజింగు ఏజంట్సులో డాక్టరు రెడ్డితోపాటు భాగస్వామి అయిన నాదమునిచెట్టిగారూ కారుమీద రెడ్డిగారింటికి చక్కా వచ్చారు.

డాక్టరు రెడ్డి వారందరినీ అహ్వానించి, "సమయానికి వచ్చారు రండి. మా కోనంగేశ్వరరావుగారి ఉద్దేశాలు వినండి!" అని అన్నాడు.

ఈలోగా నాయరు టీలూ, ఉపాహారాలూ తెచ్చి బల్లమీద ఉంచితే అందరూ ఉపాహారాదికాలు సేవిస్తూ కబుర్లు చెప్పుకోడం సాగించారు.

**డాక్టరు:** మా కోనంగిరావు పురాణం బొమ్మ వద్దంటాడండీ.
**చెట్టి:** ఏం లోటు వచ్చిందండీ! సహస్రకంఠ రావణాసురునికథ ఇంతవరకూ ఎవ్వరూ తీయలేదు. డబ్బు దోచేస్తుంది. సీతమ్మ వేషం ఆంధ్రదేశాన్ని దోచేస్తుంది.

**కోనంగి:** ఆంధ్రదేశం ఆవిణ్ణి తెరమీదచూచి ఆనందంచేత మూర్ఛ పోతుంది.
**పాటీ:** మీరు వెటకారంగా అంటున్నారా, లేకపోతే నిజంగానా?
**డాక్టరు:** మా కోనంగి హాస్యంగా కాకుండా ఎప్పుడు మాట్లాడినాడూ?
**చెట్టి:** అయితే మీరు మనవి – కాదు చెప్పేది ఏమిటండీ కోనంగి రావుగారూ?
**డాక్టరు:** పురాణకథ తీయవద్దంటారు.
**పాటీ:** కారణం?
**కోనంగి:** పురాణగాథవల్ల డబ్బు వస్తుంది. అంతవరకు నిశ్చయం. సరిగా తీయకపోతే దమ్మిడీ కూడా రాని మాటా నిజమే! పురాణగాథ పురాణపురుషుల వేషం వెయ్యడానికి ఎవ్వరికీ శక్తిలేదు. పురాణగాథలో ఉన్నది అది ఏదో విచిత్ర వాతావరణం, ఇంతవరకు ఇండియాలో ఎవ్వరూ సృష్టించలేదు. ఇక ముందుకూడ ఎవ్వరూ సృష్టించలేదు. కథంతా కృత్రిమంగా నడుస్తుంది.
**చెట్టి:** మీ ఉద్దేశం?
**కోనంగి:** ఈనాటి కథ తీయటం ఉత్తమం. ఇదే డాక్టరుగారి ఉద్దేశమూ!
**డాక్టరు:** అది నిజంగా నా ఉద్దేశమే. ఆ ప్రకారమే కోనంగిరావుగారు అలా చెప్తున్నది.
**పాటీ:** ఏమికథ మరి? నేను డైరెక్టర్ల ఉద్దేశం ప్రకారం రామానుజమూర్తిని సినేరియో రాయమన్నాను.
**డాక్టరు:** ఎవరా రామనుజమూర్తి?
**పాటీ:** ఆయనా? ఆయన్ను ఎరగరా మీరు? అమ్మయ్యో! ఇంతవరకూ ఆయన పది తెలుగు చిత్రాలకు సినేరియో రాశారు. ఇప్పుడు ప్రస్తుతం ఆరు చిత్రాలకో ఎనిమిదింటికో రాస్తున్నారు. ఆయనకు ఆంధ్ర ప్రేక్షకుల హృదయం బాగా తెలుసు.
**డాక్టరు:** కంట్రాక్టు రాసినారా?
**పాటీ:** ఓ!
**డాక్టరు:** ఎంతకు?
**పాటీ:** మూడువేలకు.
**డాక్టరు:** అది రాయించి ఆ మూడువేలు ఆయనకు అర్పించండి.

ఆ సినేరియో వద్దు, గినేరియో వద్దు! కొంచెం పేరు పొందిన కవి ఎవరన్నా రాసిన కథ ఒకటి తీసుకుందాం. ఆ కవీ, మనమూ కథనుగూర్చి ఆలోచించి, ఆయనచేతనే సినేరియో వ్రాయిద్దాము.
**చెట్టి:** మన కథానాయిక మాట?
**డాక్టరు:** ఆవిడ సీత! ఇప్పుడు మనకు సీత అక్కరలేదుగా! ఆవిడ రాసిన కంట్రాక్టు చూచాను. మన కేమీ ఇబ్బంది లేదులెండి. అడ్వాన్సుపోతే పోయింది.

## (2)

అనంతలక్ష్మికి సినీమా సంగతులన్నీ చెబుతూ నవ్విస్తూ ఉండేవాడు కోనంగి.

"నన్ను చూస్తే కోపం డైరెక్టరు పాటీగారికీ, మేనేజింగు డైరెక్టరు రావుగారికిన్నీ, నాయికవేషం వేయడానికి సిద్ధమై మానివేయింపబడిన స్వర్ణలతా దేవిగారికీని."

"నిజంగా కోపమే! ఎందుకా కోపం?"

"ఆవిడ నాయికగా పనికిరాదని అల్లరిచేసిన వారిలో నేను ముఖ్యుణ్ణని ఆమెకు తెలియదా ఏమిటి?"

"తక్కిన నాయికలు మహా బాగున్నట్లు ఆవిడ విషయంలో మీకంత కోపం ఎందుకు?"

"మ. రా. రా. శ్రీ కోనంగేశ్వరరావుగారు నాయకుని పాత్ర వహిస్తూంటే ఆ చిత్రమంతా పాడయిపోవలసిందే?"

"ఆమె పని ఏం చేశారు?"

"ఏమిటి చెయ్యడం. ఆవిడకు కథానాయకుని చెల్లెలు వేషం ఏర్పాటు చేశారు."

"మీ చెల్లెలా?"

"ఓ, అయితే నాకేమన్నా భయమా?"

"నే నెప్పుడన్నా మీరు నటనచేసే సమయంలో వచ్చి చూడాలని ఉంది."

"ఆ పనిమాత్రం చేయకు, నామీద ఉన్న కాస్త గౌరవంకూడా పోతుంది.

"ఇప్పుడు కథానాయకివేషం వేసేది ఎవరు?"

"నువ్వు!"

"నేనా? మా అమ్మ ఒప్పుకుంటుందా? లక్షరూపాయలిస్తే నేను ఒప్పుకుంటానా?"

"నీకు లక్ష? ఖర్మం కాలిపోతే! మూడులక్షలు తక్కువైతే నేను ఒప్పుకోమంటానా?"

"మూడు లక్షలుకాదు. ముప్ఫైలక్షలైనా నేను ఒప్పుకోను."

"నాకు నాయికగా అభినయించడానికైనా ఒప్పుకోవూ?"

"అది మీ ఇష్టమండి సార్!"

సినిమా ప్రపంచం వేరు. ముస్లిం మతం పుచ్చుకోగానే వేరేజాతైనట్లు, సినిమాలో చేరగానే వేరేజాతి మనుష్యులవుతారు కాబోలు అని కోనంగి అనుకున్నాడు. కొత్త నాయికకోసం ఆంధ్రదేశం అంతా గాలిస్తున్నారు.

కథకులని ప్రఖ్యాతి వహించిన విశ్వంభరమూర్తిగారి కథ ఒకటి సినీమా హక్కులకు వేయిరూపాయలకు కొన్నారు. దానికి సినిమా సంభాషణలు వ్రాయడానికి వారినే వేయిరూపాయలకు బేరమాడినారు.

విశ్వంభరమూర్తిగారూ, పాటీగారూ, డాక్టరుగారూ, కోనంగీ కలిసి సినేరియోస్క్రిప్టు తయారు చేయడానికి నిశ్చయం అయింది. చిత్రం తీయడానికి "చితవాక్కు" స్టూడియోస్‌లో బేరం కుదిర్చారు. యుద్ధంలో జర్మనీవారి "ఆగ్ఫా" కంపెనీని ప్రభుత్వంవారు వశపరచు కున్నారు. కాబట్టి, పాటీగారూ ఇంకా కొందరు పెద్దలూ బొంబాయి పరుగెత్తివెళ్ళి "కోడక్" కంపెనీవారితో మాట్లాడి చిత్రానికి తగిన "నెగిటివ్" "పోసిటివ్" ఫిల్ములను సప్లయి చేసేందుకు కంపెనీనుండి కంట్రాక్టు పుచ్చుకొన్నారు.

కథ పేరు ఏం పెట్టాలి అన్న ఆలోచన వచ్చింది. చివరకు కోనంగి కథకు అనుగుణమైన పేరని 'దుక్కిటెద్దులు' అన్న పేరు పెట్టితే బాగుంటుందన్నాడు. అందరూ అద్భుతం అన్నారు.

దర్శకుడు పాటీగారు కోనంగివైపు మొగ్గడం ప్రారంభించాడు. కోనంగి ఇచ్చే అభిప్రాయాలు కొంచెం ఆలోచనాపూర్వకమైనవి. నాలుగో వంతు హాస్యం, తక్కిన మూడువంతులలో సగం శృంగారం, సగం కరుణరస పోషణ ఉండాలనీ, ఇవి బాగా రంగరించి మంచిపథకం అల్లాలనీ కోనంగి వాదన.

అసలు కథపేరు 'పొలం'. కథ ఏమిటయ్యా అంటే–పొలందున్నుకునే ఒక రైతుకు అందమయిన అమ్మాయి ఉంది. ఆ అమ్మాయి చదువుకుంటాననంటుంది. రైతుసంఘంలో చేరిన ఆ చిన్నరైతు చదువుకుంటానన్న తన బాలికను తమ జిల్లా పట్టణం పంపించి చదివిస్తాడు. కథానాయిక తండ్రి హిందూస్తానీ సంస్కృతమూ చదువుకున్నవాడు. చిన్నతనంలో రెండవ ఫారమువరకూ ఇంగ్లీషు చదువుకున్నవాడు. రైతు నాయకుడై కిసాన్ సభలలో ముఖ్యునిగా పేరు సంపాదించుకొన్నాడు. స్వంత వ్యవసాయం.

మన రైతునాయకుడు వెంకటస్వామి. ఆయన్ను అందరూ చాలా గౌరవిస్తారు. గాంధీతత్వవాది, ఖద్దరాభిమాని, కాంగ్రెసులో సభ్యుడు. అప్పుడే రెండుసారులు జైలుకు వెళ్ళివచ్చాడు.

రైతు రెడ్డికులంవాడు. ఆయన కొమరిత కమలాక్షీదేవి ప్రవేశపరీక్షలో కృతార్థత నొంది కాలేజీ చదువుకు కాకినాడ వెడుతుంది. ఈ అమ్మాయి ఇంటరు చదువుతోంటే కమ్మవారి కులానికి చెందిన ప్రసాదరావు అనే యువకుడు బి.యస్.సి. సీనియర్ చదువుతూ ఉంటాడు. ఇద్దరూ ఒకరినొకరు ప్రేమించుకుంటారు.

ప్రసాదరావు తండ్రి ఒక పెద్దరైతు. అతని జిల్లా వేరు. వ్యవసాయం మెరక వ్యవసాయం, తండ్రి ప్రభుత్వ పక్షపాతి. రైతు సంఘాలకు వ్యతిరేకుడు, పూర్వాచార పరాయణుడు. ఆ పెద్ద రైతు తన కుమారుడు ఇతర కులానికి చెందిన ఒక బాలికను వివాహం చేసుకోకూడదంటాడు.

తండ్రి భావాలు కుమారుడు ప్రసాదరావుకు ఇష్టంలేదు. తండ్రి ఇంక చదువు చెప్పించనక్కరలేదనీ, తనకు తండ్రి ఆస్తి ఏమీ అక్కరలేదనీ, ఉత్తరం వ్రాసి కాలేజీ చదువు మాని దేశాలు తెగించి పోతాడు.

ఇవతల కమలాక్షీదేవీ, అవతల ప్రసాదరావు తల్లీ ప్రసాదుకోసం దుఃఖిస్తూ ఉంటారు.

ప్రసాదరావు వేరే జిల్లాలో కొంత భూమి ఒక పెద్ద రైతు దగ్గిర కౌలుకు పుచ్చుకొని, అతని దగ్గిరే పెట్టుబడికి నూరురూపాయలు పుచ్చుకుని వ్యవసాయం ప్రారంభిస్తాడు. నాలుగెకరాల భూమి కొత్త పద్ధతులతో అందమైనతోట అయి అతనికి మంచి రాబడి యిస్తుంది. రైతు పెట్టిన పెట్టుబడి బాకీతీర్చి. ఇంకో వందరూపాయలు ఆ తోటపనికి ఉంచుకుని, తక్కిన నూరురూపాయలతో కథానాయిక ఊరువస్తాడు.

కథానాయిక తండ్రి తన కొమరితను నాయకునికి వివాహం చేయడానికి సందేహిస్తాడు. ఒకరు కమ్మవారు. ఒకరు రెడ్లు. కథానాయకుడు వెళ్ళిపోతూఉంటే కథానాయిక అతన్ని కొంతదూరంలో కలుసుకుంటుంది. ఇద్దరూ వెళ్ళి చెన్నపట్నంలో వివాహం చేసుకుంటారు.

కథానాయకుడు పొలందున్నుతూ, నాయిక చెట్లు పాతుకుంటూ తోటపని వాళ్ళవుతారు. కథానాయకుడు రైతుసంఘ కార్యదర్శి అవుతాడు.

చివరకు ప్రసాదు తల్లి భర్తను వ్యతిరేకించి, తన ఇల్లు వదిలి కొడుకు దగ్గిరకు వచ్చి ఉంటుంది. గాంధీగారు ఆ గ్రామం వచ్చినప్పుడు ప్రసాదు తోటలో మకాం చేస్తారు.

ఇదంతా విని, భార్యాభర్తల తండ్రులిరువురు ఒకరికి తెలియకుండా ఒకరు ప్రసాదును, కమలాక్షిని చూడడానికి వస్తారు. అయిదునెలల బిడ్డడు మోహనదాసు ప్రసాదుకూ కమలాక్షికీ.

చివరకు అందరూ సంతోషంగా కలుసుకుంటారు.

ఈ కథను చలనచిత్రానుగుణంగా మార్చితే అద్భుతమైన కథ అవుతుందని కోనంగి ఉప్పొంగిపోయాడు.

కాని డాక్టరు రెడ్డిగారికి కొన్ని అనుమానాలు ఉద్భవించాయి.

## ③

**డాక్టరు:** కథలో ముందుకుపోయేతనం ఉందిగాని, కొంచెం చప్పగా వుంది.

**పాటీ:** ముందుకుపోయేతనం ఏమిటి, వెనక్కుపోయేతనం ఏమిటి?

**డాక్టరు:** కళ దేశాన్ని ముందుకు నడిపించుకుపోయే శక్తిని విరజిమ్ముతూ ఉండాలి.

**కోనంగి:** ముందుకు నడిపించుకుపోవడం అంటే కళ ప్రచారక స్వరూపంగా వుండాలని డాక్టరుగారి భావంలెండి పాటీగారూ!

**పాటీ:** కళ కాంగ్రెసు ప్రచారకుడటండీ?

**డాక్టరు:** కళాప్రేమ మానవుని ఉన్నత ప్రేమలో ఒకటికదా?

**పాటీ:** అవునండీ. అందులో సినిమాకళ మనుష్యునికి చాలా సన్నిహితమైన కళ.

**డాక్టరు:** దాని ద్వారా మనుష్యుడు పురోగమించే విధానాలు నేర్పడం ఉత్తమాశయం అంటారా కాదా?

**కోనంగి:** అయితే ఇంగ్లీషు సినిమాలలో నాట్య సంగీత సినిమాలు 'బ్రాడ్వేమెలడీ' అని 'థిన్ ఐస్' అనీ అనేకం వచ్చాయి. వాటిలో ఏమీ ప్రచారం లేదు. అయినా అలాంటి బొమ్మలకు లక్షల కొలది డాలర్లు రాబడి వస్తోంది. అవి పనికిరావా?

**డాక్టరు:** అవి పనికిరావు. అవి 'పారిపోయే' భావం తెలియజేసే బొమ్మలు. మనుష్యుడు తన ధర్మం మరచి ప్రపంచం వట్టి ఆనందం కోసం పుట్టిందనీ, ఎల్లాగో అల్లాగ ఆనందం సమకూర్చడమే పరమావధి అనుకొని పాడయిపోతాడు.

**కోనంగి:** పాడయిపోతే?

**డాక్టరు:** లోకం పాడయిపోతుంది.

**కోనంగి:** లోకం పాడయిపోతే?

**డాక్టరు:** మనుష్యజాతి నాశనమైపోతుంది.

**కోనంగి:** మనుష్యజాతి నాశనమైపోతే!

**పాటీ:** అవేమి ప్రశ్నలండీ కోనంగిరావుగారూ?

**కోనంగి:** నా ప్రశ్నలకు అర్థం లేకపోలేదండీ. ఆమెరికాలో పదివేల సంవత్సరాల క్రితం ఏదో తోకచుక్క తాకిందట. అప్పుడు ఆ మధ్య ఆమెరికా అంతా నాశనమైపోయిందట. 1903లో కెనడాలో ఒక చిన్న తోకచుక్క వాలిందట. అది అడివి ప్రదేశం. అయినా లాచాచ్‌కాన్ అను ఆయన పదిహేను వందల రైన్‌దేరులూ, సెమెనోవ్ అనే ఆయన ఇల్లూ, నాలుగు వందల మైళ్ళ ప్రదేశమూ నాశనం అయ్యాయట. అలాగే ఒక పెద్ద తోకచుక్క భూమిని తాకితే భూమి అంతా నాశనం అవుతుందని అంచనా వేశారు శాస్త్రజ్ఞులు. అప్పుడేమవుతుంది మన పురోగమన కళ?

**డాక్టరు:** అమ్మయ్యా! కోనంగిరావుగారూ ఎంత గొప్ప ఉపన్యాసం ఇచ్చారు! అయితే నేనడిగే ప్రశ్నలకు సమాధానం ఇయ్యి. ప్రపంచం శాస్త్రరీత్యా ఆర్థికంగా, రాజకీయంగా, సాంఘికంగా, అభివృద్ధి పొందితే ఏం?

**కోనంగి:** ఏం ఫరవాలేదు. అలా వృద్ధిపొందితే కొంపలు మునిగిపోవు.
**డాక్టరు:** అందుకోసం కళలు తయారుచేస్తే ఏం?
**కోనంగి:** దేశాలు తగలబడిపోవు! భయమేమీలేదు.
**డాక్టరు:** అప్పుడు ప్రజలందరూ సంతోషిస్తారు కాదా?
**కోనంగి:** ఏం చూసి?
**డాక్టరు:** అందరికీ సమంగా తిండీ, సమంగా బట్టా, సమంగా ఆనందం, సాంఘిక సమత్వం, రాజకీయ సమత్వం వస్తుంది. అప్పుడు అందరికీ ఆనందం కాదా?
**కోనంగి:** ఉహు! కాదు! ఒకడు బక్కవాడు. ఒకడు మరుగుజ్జువాడు. ఒకడికి జబ్బుచేస్తుంది. ఒకడికి చేయదు. ఒకడ్ని ఒక అందమైన పిల్ల మోహిస్తుంది. ఒకణ్ని మోహించదు. ఒకడికి తియ్యటి గొంతుక ఉంటుంది. ఒకడికి గార్దభస్వరం ఉంటుంది. ఒకడికి బిడ్డలు పుడుతారు. ఒకడికి పుట్టడానికి శాస్త్రం ఒప్పుకోదు. ఉన్నవాడిని చూచి లేనివాడికి ఏడ్పు. ఇక అందరూ ఒకటే పొడుగూ, లావూ, బరువూ, ఒకటే రూపూ, ఒకటే రంగూ ఉండాలి. అందుకోసం టెస్టుట్యూబు బేబీలు. ఒకరే ఆ బేబీల తండ్రి అయితేనే అదయినా!
**డాక్టరు:** అయినా తల్లులనుబట్టి రూపురేఖా విలాసాలు మారుతాయి నాయినా! పైగా ఒకడేతండ్రి అయినా వాడి పూర్వీకుల రూపురేఖా విలాసాలు, ఒకరిలోఒకరి పోలిక, ఇంకొకరిలో ఇంకొకపోలికా వస్తుందట.
**కోనంగి:** మరి ఇంక సమాన మెక్కడ బాబూ?
**డాక్టరు:** నీ వాదన ఎలా వుందంటే–
**కోనంగి:** అష్టవంత్రకాత్ భవేత్‌గా వుందంటావు. ఇంతకూ సినిమా కథలో ఏమిటి లోటు?
**డాక్టరు:** ఇంకొంచెం కారంగా ఉండాలి.
**కోనంగి:** మరీ కారంవద్దు. మరీ చప్పగా వద్దుబాబూ. రోజుల మాహత్మ్యం డాక్టరూ!

కథ ఎల్లాగో తంటాలు పడుతూ రాయడం సాగించారు.

ఈలోగా కవిగారి పాటలు సంగీతంలోకి సంగీత దర్శకులు మిష్టరు మునీగారు సాగించారు. వీరు ఒక వీధి నాటకంలో ఫిడేలువాయించే వారు. ఆ వీధినాటకం కొన్నాళ్ళకు వృద్ధిపొంది నాటకశాలల కెక్కింది. ఆ సమయంలో మునీగారు ఆ నాటకం కంపెనీకి సంగీత దర్శకులయ్యారు.

సంగీత దర్శకత్వం బాగా నేర్చుకొనడానికి ఆయన మదరాసు పోయి ఉదయశంకర్ నాట్యప్రదర్శనాలు చూశాడు. తమ కంపెనీ నాటకశాల కంపెనీ అవడానికి పెట్టుబడి పెట్టిన పెద్దమనిషి ఇంట్లో మంచి గ్రామఫోనూ, నూరు, నూటయాభై రికార్డులు ఉన్నాయి.

ఆ రికార్డులు వినడం, ఈ కరీంఖానుపాట బావుంది. ఆ జ్యోతికారయిపాట అద్భుతం, ఈ బరోడోకర్ పాట అమందానందకందళితం అని వారి వారి పాటలకు సరియైన తెలుగు పాటలు వ్రాయించడం, అవి పాడించడమూను.

ఉదయశంకర్‌గారి నాట్యప్రదర్శనంలో నాలుగు సితారులు, అయిదు ఇన్‌రాజులు, మూడు మాండోలీనులు, ఒకటి తబలాతరంగ్, రెండు జలతరంగ్‌లు, అయిదు వాయులీనులు. ఎనిమిది వుడోపోనులు, ఆరు వేణులు ఉన్నాయి. గనుక తాను కూడా రెండు వీణలు. మూడు హార్మోనీలు, అయిదు ఫిడేళ్ళు, రెండు తబలా సెట్టులు (అర్కెస్ట్రా) గాన సమ్మేళనం ఏర్పాటు చేశాడు.

ఈయన సమ్మేళనం ఊరూరా పేరు పొందింది. అందుచేత మునీవారే సంగీత దర్శకులన్నారు మానేజింగు డైరెక్టరు రావుగారు.

కవి రాసిన కథలో పది పాటలున్నాయి. కథానాయకుడు పాడినవి మూడు. నాయిక అయిదు. రెండు రైతుసంఘ మహాసభలో పాడినవి. కనక ఇంకో రెండు పాటలన్నా చేర్చాలి అని దర్శకులు పాటీగారు కోరారు.

అందులో ఒక్కొక్కపాటకు ఒక్కొక్కరాగం. ఒక్కొక్కతాళమూ, పాటలోని భావాన్నిబట్టి అమరించాలంటాడు కోనంగి.

పాట అర్థం వికారమైనా సంగీతం ముఖ్యమంటాడు సంగీత దర్శకుడు.

ఈ ఇద్దరి వాదనలలో ఎవరి వాదన వైపు మొగ్గనా అని కవిగారు తటపటా ఇస్తున్నారు.

## 4

**అ**నంతలక్ష్మికి కోనంగి సినీమాలో వేషం వేయడం అంతకన్న ఇష్టం లేకపోవడం ప్రారంభించింది. మొదట తన ప్రియుడు, తన హృదయనాథుడు సినీమా నాయకుడు అవడం ఎంతో అద్భుతం అనుకుంది. ఆమె మనఃపథాలలో ఆశోక్‌కుమార్, సైగల్, బారువా, ప్రేమ ఆదీబ్, పృధ్వీరాజ్, నాగయ్యలతో సమంగా కోనంగిరావూ ఎదురుగుండా కనుపించాడు. తన నాయకుడు అందరికన్నా గొప్పవాడవుతాడు. తన హీరో, తన స్వామీ, తన చక్రవర్తి సినీమా చక్రవర్తి అవుతాడు. ఆ భావంకన్న ఇంక జీవితానికి పులకరం కలుగజేసే భావం ఏముంది?

ఆ తర్వాత సినీమా షూటింగ్ ప్రారంభమైంది అని కోనంగి తెలిపాడు. ఆ ముక్క వినగానే ఆమె ఎదుట అనేకమంది సినీమా నాయకులు బారులుగా ఒకరివెంట ఒకరు నడవడం సాగించారు. విడివిడిగా వారివారి ప్రఖ్యాత చిత్రాలలో సంచరించడం ప్రారంభించారు.

మేరీ వారి యొస్కాలో నెపోలియనుగా చార్లెస్‌బోయర్ కనిపించాడు. ఎంతఠీవి, ఎంతచక్కని వేషం, ఎంత విచిత్రాభినయం? అతని ఎదుట కాంటెస్ మారీ వారి యొస్కాగా గ్రెటాగార్బో ప్రత్యక్షమైంది. ఏమి ప్రేమగాథ! ప్రాణాలు నలిపివేస్తున్నది.

చార్లెస్ బోయరుకు భార్యలేదా? ఆమెను అతడు ప్రేమిస్తున్నాడాలేదా? నిజంగా ప్రేమిస్తే ఇంకో బాలికను – గ్రెటాగార్బోయే అనుకోండి – అలా ఎలా ప్రేమించగలడు? గ్రెటాగార్బోను ప్రేమిస్తున్నాడా, అది నటనా? ఆ కౌగిలింతలు, ఆ చూపులు, ఆ మాటలు, ఆ ముద్దులు, నటన ఎట్లా అవుతాయి? మనస్సులో నిజంలేందే నటన రాగలదా?

రేపు తన గురువు, తన జీవితనాథుడు కోనంగిరావుగారూ అల్లాగే అభినయిస్తారు గాబోలు. తెలుగు సినీమాలలో కౌగలింతలు లేవు. ముద్దులు లేవు. అయినా వందేమాతరంలోలాగ నలిపివెయ్యడం ఉంటుంది. మళ్ళీ పెళ్ళిలో లాగ పక్కగా పడుకొని సన్నిహితంగా అవడం ఉంటుంది. ఆ చూపులు, ఆ నర్మగర్భ వాక్యాలూ ఉంటాయి. నాథా! హృదయేశ్వరీ! అనే మాటలు వస్తాయి. పుస్తెలు కట్టడం, శోభనపుగది రంగాలు అన్నీ ఉండవచ్చును.

ఆ బాలిక ఆ ఆలోచనలు భరించలేకపోయింది. ఆమె గుండె కుంగిపోయింది. అప్పుడే ఆ చిత్రం తీయడం ప్రారంభించి వారం రోజులయింది. రెండువేల అడుగులు చిత్రం తీశారుట.

ఆమె గుండెలో ఏదో బాధ ప్రవేశించింది. కథానాయిక వేషం వేసింది ఎవరు? ఆమె గుణగణా లెలాంటివి? అని ప్రశ్నలు వేద్దామని, కానీ తన గురువు ఏమనుకుంటాడో అని భయం.

పరీక్షలైపోయాయి. చివర పేపర్లు బాగానే జవాబులు వ్రాసింది. మొదటి పేపర్లలో విశ్వవిద్యాలయానికే మొదటగా వస్తుంది.

అనంతలక్ష్మి కోనంగిని సినీమాలో చేరమని మొదట ప్రోత్సహించింది. అంతకన్న గొప్ప యేమిటని వాదించింది. ఇప్పుడు వద్దని ఏలా చెప్పగలదు. నవ్వులాటగా ఉండదా? తన భవిష్యత్తు ఏలా ఉంటుందో?

ఇంతలో కోనంగి చిత్రంలో, ఒక ఘట్టము తీయడమైన వెనక, అనంతలక్ష్మిని చూడడానికి వచ్చాడు. ఒకరాత్రి, ఒక పగలు ఆ ఘట్టం తీయడం జరిగిందట. ఒక చిన్న ఇంటిలోని రంగము, కథానాయకుడూ, నాయికా చిలకాగోరింకల్లా కబుర్లు చెప్పుకొనడం రంగమూ, అక్కడకు కథానాయకుని తండ్రి పంపిన పెద్దవచ్చి, కథానాయకుని బెదిరించే రంగమూ, కథానాయకుని తల్లి వచ్చే రంగమూ అయ్యాయి. ఇంకా ఆ ఇంటికి సంబంధించిన రంగాలు పద్దెనిమిది వున్నాయట.

తానూ కథానాయికా కలిపి పాడిన పాట ఒకటి అతడు అనంతలక్ష్మికి పాడి వినిపించాడు.

అనంతలక్ష్మి చెవులార ఆ పాట విన్నది. అతడు నాయిక పాడినచరణాలూ వినిపించాడు. ఈ పాట ఇదివరకే తీసి ఇప్పుడు ఆపాట యంత్రం వెనక పాడుతూ వుంటే తాము ఆ పాటతో కలిసి పాడుతూ అభినయించామనీ, ఛాయాగ్రహణ యంత్రం మాత్రం ఆ చిత్రం తీస్తుందనీ, పాడిన పాట తమ పెదవుల నటనతో సరిపోయేటట్టే చిత్రం తీస్తారనీ అతడు తెలిపాడు.

అనంతలక్ష్మి కొంచెం విపులం చేసి చెప్పమంది.

**కోనంగి:** ముందర మేము ఇద్దరం పాడిన పాట విను.

**'21వ మేళం-మదగజగమనరాగం-త్రిశ్రజాతి రూపకం.**

*నాయకుడు:* *బంగారు పీటపై*
*శృంగార నాయికా*
*అందుకో నా పూజ*
*అందుకోవేమే!*

*నాయిక:* *పువ్వుల్ల పూజలో*
*ముంచెత్తు పురుషుడా*
*ఎవరోయి నాకడకు*
*ఎందుకొచ్చావూ?*

*నాయికుడు:* *పరభృత స్వనకంఠి*
*పలుకులతో కరిగించి*
*మాయచేస్తువె నన్ను*
*మందార మాలా!*

*నాయిక:* *మందార మాలనో*
*మాయపూ పేరునో*
*కొమ్మలో కోయిలనో*
*కొలుతు వెందుకు నన్ను?*

"ఏలా వుంది పాట?"

**అనంతలక్ష్మి:** అంత ఆడగొంతుకతో ఏలా పాడగలిగారు గురువు గారూ?

**కోనంగి:** రెండు గొంతులు చూపించాగా?

**అనంత:** అవునులెండి. మీరు అనుకరించిన ఆడగొంతులాంటి గొంతుకేనా ఆ అమ్మాయిది?

**కోనంగి:** ఛా! ఛా! అది వేరు. చాలా బాగుంటుంది.

**అనంత:** ఎంత బాగుంటుంది?

**కోనంగి:** నీ గొంతుక ముందర అది తేలిపోతుంది. నీ గొంతుకే అయితే చిత్రానికి కనకవర్షం కురవదూ?

**అనంత:** అన్నీ పొగడ్తలే.

కోనంగి ఇటు అటు చూచి అనంతలక్ష్మిని గబుక్కున కౌగలించుకొని గాఢంగా హృదయానికి అదుముకొని, "అనంతం, నీ కంఠమాధుర్యం నేను వర్ణింపగలనా? నేను అబద్ధం చెప్తానో, పొగడతానో నీకు తెలియదా హృదయసింహాసనరాజ్ఞీ! నీ ప్రేమకు నేను తగుదునా! నీవు నా భార్యవై, ఆ సమ్మోహనాక్షులతో నన్ను చూస్తూ ఉంటే, అన్నీ మరిచిపోయి దారితెలియలేని మొద్దునో, సమస్తమూ తెలిసిన అమృతమూర్తినో అయిపోనా లక్ష్మి!" అని ఆమె పెదవుల చుంబించినాడు.

అనంతలక్ష్మి కరిగిపోయింది. ఆమె పులకరించింది. చైతన్య రహితురాలివలె, తేజరిల్లే ఉపాబాలవలె, కోనంగి కౌగిలిలో ఒదిగిపోయి, "గురువుగారూ! నన్ను త్వరగా పెళ్ళి చేసుకోండి. మిమ్మల్ని విడిచి వుండలేను. మీ యెదుట తిండిలేకుండా సంవత్సరాలు అలా పూజచేస్తూ గాఢంగా మీలో ఒదిగివున్నా తృప్తితీరని బాలికను" అన్నది

కోనంగి కన్నుల నీరు తిరిగింది. "పవిత్రమైన చరిత్ర నీది అనంతా! నీ రూపే, నీ మాటే, నీ హృదయమే నాలో! నేను నీకు తగను. నేను నీ ప్రేమకు ఏ తపోబలంచేత పాత్రత సంపాదించుకొన్నానో!" అని తన కౌగిలిలో తనలో ఒకటై ఉన్న అనంతలక్ష్మి మూర్ధముపై మోమునాన్చి ఆఘ్రాణించినాడు.

"అనంతా! ఎన్నా సమాచారమా? మన చెట్టిగారు వచ్చిరే!" అంటూ వినాయగం కేక వేసినాడు.

ఇద్దరూ కౌగిలింత విడిపోయి చెరి యొక సోఫాపై కూర్చున్నారు. ఇంతలో నాటుకోటి చెట్టియారు లోనికి విచ్చేశారు.

ఈ మధ్య మూడునెలలు ఆ నాటుకోటి చెట్టియారుగారు మలయా వెళ్ళి వచ్చారు. మలయా నుంచి చెట్టిగారుపోయి, అక్కడనుంచి మదరాసు వచ్చినా రా రోజునే! రావడమేమిటి, స్నానాదికాలు, భోజనం చేయకుండానే అనంతలక్ష్మి ఇంటికి వేంచేసినారు.

వినాయగానికి అనంతలక్ష్మి కోనంగుల ప్రేమగాథ అర్థమైపోయింది. అతని హృదయంలో కోనంగిరావుగారే తమ రాజకుమారి అయిన అనంతలక్ష్మికి తగిన వరుడు అని నిశ్చయం చేసుకున్నాడు. అతనికి ఇష్టంలేని మనుష్యుడా ఇంట్లోకి అడుగుపెట్టలేడు. కొందరిని రానిస్తాడు. కొందరు రావాలని కోరుతాడు.

వినాయగం భక్తుడు. అతడొక విధానంగా బాగా చదువుకొన్నవాడు. ఆనంద వికటన్, దినమణి, స్వదేశమిత్రన్ అతనికి ప్రియమైన పత్రికలు.

అతనికి, అతని మిత్రులకూ సంభవించిన ఒక మహత్తరమైన ఆపద నుండి అనంతలక్ష్మి తండ్రి రక్షించాడు. జయలక్ష్మి తల్లిలా వారిని చూస్తున్నది. ఆమెకు సహాయంగా వచ్చిన తరువాత వినాయగమూ, అతని ఇద్దరి స్నేహితులూ భూములు సంపాదించుకొన్నారు. బ్యాంకులో డబ్బు వేసుకొన్నారు. వారి ముప్వురికీ గాంధీవాదం మహాయిష్టం. అహింసాతత్వం పూర్తిగా తెలిసి, సత్యమంటే ఏమిటో అర్థమై కాదు. వారు వినోబాబావేల వంటివారు కారు. కాకపోయినా గాంధీతత్వం వారి హృదయాలు తెలిసికున్నాయి. మెదడులు తెలుసుకోపోతేనేం?

చెట్టిగారు వచ్చారని అనంతలక్ష్మికి తెలియజెయ్యడం తన విధి. చెట్టిగారి కారు హారనుమ్రోత ఆళ్వారుపేట టర్నింగ్ దూరంగా మ్రోగడం విన్నాడు. వెంటనే గేటు బంధించి మెట్లవరకు పరుగెత్తుకొనివచ్చి, పొలికేకతో చెట్టిగారు వచ్చారన్న వార్త ఉప్పు అందించి తాను పరుగున పోయి గేటు తలుపు తీసినాడు.

చెట్టియారుగారు వచ్చేసరికి సినీమా విషయం చెబుతున్నాడు.

"మొదట పాటపాడుతూ ఉంటే రికార్డు (శబ్దగ్రహణ) చేస్తారు. అంటే శబ్దము శక్తిగనుకా, ప్రతిశక్తి యొక్క మూలమూ విద్యుచ్ఛక్తిగనుకా, శబ్దమూ విద్యుత్ రూపము పొంది వెలుగుతుంది. మన మాటలో ఉన్న స్పందన వెలుగు రూపాన హెచ్చుతగ్గులౌతుంది. వెలుగు సినీరీల్ బద్దెపైబడి ప్రొటెక్టార్ (శబ్దపు సారతి) యంత్రంలో పెట్టి ధ్వని ప్రసారం చేస్తారు. ఆ ధ్వని ప్రసారపుపాటలో కలవడం ప్లేబాక్ అంటారు. ఆ పాటతో కలసి నటీనటకులు పాడుతూ అభినయం చేస్తారు.

## 5

చెట్టిగారు తెలివితక్కువవారు కారు. అప్పుడే అతనికి కోనంగి అనంతలక్ష్మిలిద్దరూ ఏవో ప్రేమ రహస్యానందాల నోలలాడుతున్నారని అనుమానం స్ఫురించింది. ఆ ప్రేమగాథ ఎంతవరకూ వెళ్ళిందో? ఈ జయలక్ష్మికి బుద్ధిలేదు. ఈడులో ఉన్న యువకుని పొగరు మోతుని తన కూతున కుపాధ్యాయునిగా ఏర్పాటు చేయడం ఏమిటి? అని అనుకున్నాడు.

తన చరిత్ర తనకు ఏలా తప్పు అవుతుందీ చెట్టియారుకి? కోనంగి పాపచరిత్రుడు. కోనంగికి తగిలిన దెబ్బలకు బుద్ధిరాలేదు. ఏ కాలో చెయ్యో పనికిరాకుండా చేస్తేగాని బుద్ధిరాదు.

చెట్టియారు మండిపోయాడు. అయినా నాటుకోటిచెట్టి, ధనసంపాదన రహస్యాలు అతనికి తెలిసినట్లు యువతీ సంపాదన రహస్యాలూ తెలుసును. అందువల్ల పైకి ఏమీ ఎరుగనివానిలా నవ్వుతూ వచ్చి వారి దగ్గర కూర్చున్నాడు.

"ఏమండీ కోనంగిరావుగారూ, మీరు సినీమాలో చేరారట. నాయకుని వేషం వేస్తున్నారట. మీ కంపెనీలో నేనూ వేయిరూపాయల షేర్లు పది కొంటున్నానులెండి. అవసరమైతే ఇంకా ఇరవై ముప్పైకొందామనే ఉంది. ఏవరు మీ చిత్రంలో కథానాయిక?"

"మావాళ్ళు ఆంధ్రదేశం ఆంతా గాలించి, గాలించి లాభంలేక ఒక అరవ అమ్మాయిని తీసుకువచ్చారు. ఆ అమ్మాయి ఇదివరకు ఎప్పుడూ సినీమాలలో వేషం వేయలేదులెండి."

"అరవ అమ్మాయి తెలుగు పిక్చరులో వేషం వేయగలదండీ?"

"మా తెలుగువాళ్ళు మీ అరవంలో వేయటంలేదా ఏమిటి?"

"వారు అనుభవంగల తారలు. నాగయ్యగారు చిత్తూరువాసులు. సగం అరవవారు. కన్నాంబ మదరాసులో ఉంది. ఉండి అరవతనం బాగా నేర్చుకున్నది."

"సరేలెండి, మదరాసు తెలుగుదేశం. అందుకని మీ అరవతార మా తెలుగుతార అయిపోతుంది."

"మదరాసు తెలుగుదేశం ఎట్లా?"

"చరిత్ర ప్రకారం! ఇప్పటి ప్రత్యక్ష ప్రమాణాల ప్రకారమూ."

"మదరాసుకోసం మా ప్రాణాలు తెగించి పోరాడుతాము."

"ఎవరితో?"

"తెలుగువాళ్ళతో."

"అరవవారు తెలుగువాళ్ళతో దెబ్బలాడతారా?"

"ఆ!"

అక్కడనుంచి ఏదో పనిమీద వెళ్ళినట్లుగా అనంతలక్ష్మి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోవడం ఇద్దరికీ ఇష్టమే అయింది. అక్కడ ఉండకపోవడమే ఇద్దరూ కోరింది. కోనంగి దగ్గిర ఉండకూడదని చెట్టియారూ, చెట్టియారు దగ్గిర ఉండకూడదని కోనంగీ కోరారు. ఆ బాలిక ఆ ఇద్దరి భక్తుల కోరికా నెరవేర్చింది.

**చెట్టిగారు:** "కోనంగిరావుగారూ, మిమ్మల్ని ఎక్కడైనా దిగబెట్టవలసివస్తే మా కారు దిగబెడుతుంది" అన్నాడు.

"ఆ కష్టం మీకు వద్దు. మా కంపెనీ కారు నాకోసం వస్తుంది లెండి."

"ఎన్ని గంటలకు?"

అప్పుడు సాయంకాలం అయిదుగంట లయినది. అది కోనంగికి తెలుసు. అందుకని "రాత్రి తొమ్మిదిగంటలకు" అని అన్నాడు.

చెట్టియారుగారు మండిపోయారు మనస్సులో. పైకి నవ్వుతూ "అల్లాగా అండి. మరీమంచిది. నాభోజనం ఇవాళ ఇక్కడే!" అని అన్నాడు.

"నా భోజనం ఇక్కడ గనుకనే అంతవరకూ ఆగవలసి వచ్చింది."

"బాగుంది మనం మీ సినీమా విషయం మాట్లాడుకోవచ్చును."

కోనంగి ఈ మొండిఘటంగాడు తనంతట తాను వదలడు కాబోలు అనుకున్నాడు. కోనంగిని అనంతలక్ష్మి భోజనానికి ఆగమనీ, రాత్రి ఏదైనా సినీమాకు వెడదామనీ, కూడా తమ పనిమనిషిని ఎవర్నైనా తీసుకువస్తాననీ, తల్లి ఏమీ అనదనీ చెప్పింది. ఇంక అనంతలక్ష్మితో సినీమాకు వెళ్ళడానికి వీలుండదు. ఒక ఉపాయం ఉంది. తెలుగులో ఒక చిన్న చీటిరాసి అనంతానికి అందివ్వాలి. ఆ బాలిక పనిమనిషి కానమోరా సినీ ప్రదర్శనశాలకు వెళ్ళడం తాను కంపెనీ కార్యాలయమూ, నటకుల ఆలయమూ వున్న త్యాగరాజనగరం బయలుదేరినట్లుగా బయలుదేరి కానమోరా చేరుకోడం. తర్వాత చెట్టియారు వెళ్ళగానే అనంతం బయలుదేరి వస్తుంది!

కోనంగి తన కంపెనీ విషయాలు తాను మాత్రం చెట్టికి చెప్పదలచుకోలేదు. ఏవేవో గొప్పలుకొట్టి తప్పించుకొందాం అనుకున్నాడు.

**కోనంగి:** చెట్టిగారూ, ఏ కంపెనీ అయినా ఇప్పట్నుంచే మంచి మంచి సినీమా యంత్రాలు తెప్పించుకు వుంచుకోవాలండీ.
**చెట్టి:** యుద్ధం మూలాన అనేనా మీ ఉద్దేశం?
**కోనంగి:** అవును.
**చెట్టి:** ఎంతకాలం వుంటుందని ఈ యుద్ధం?
**కోనంగి:** ఎంతకాలం ఏమిటి? పది సంవత్సరాలవరకూ సాగుతుందనే నా దృఢమైన నమ్మకం.
**చెట్టి:** యిప్పుడు మీ కంపెనీవారు స్టూడియో పెట్టదలచుకున్నారా?
**కోనంగి:** ఏమో కాని, మన దేశానికి ఎన్నో స్టూడియోలు కావాలండీ! మీరు ఒక గొప్ప స్టూడియో కట్టించాలి! ఏలా వుండాలో ఒకమాటు అమెరికా హాలీవుడ్డు వెళ్ళి చూచిరండి.
**చెట్టి:** అదే ఆలోచిస్తున్నాను.
**కోనంగి:** ఆలోచిస్తోంటే కాలం చాలదు.

ఈలోగా కోనంగి చీటీ ఏదో తోచక గీకుతున్నట్లు నటిస్తూ రాసి స్నానాలగదికి వెళ్ళివస్తానని లోనకుపోయి, ఒక పరిచారికకు ఆ చీటీ ఇచ్చి అనంతలక్ష్మికి అందజేయమని చెప్పి తాను స్నానాల గదిలోకి పోయాడు.

## 6

**కో**నంగి కారు రాగానే వెళ్ళిపోయాడు. కోనంగి వెళ్ళిపోగానే చెట్టిగారికి కాస్త సంతోషం కలిగించింది. ఇక అనంతలక్ష్మి తనదే ననుకున్నాడు. తానే ఆ బాలికతో మాట్లాడుతూ కూచోవచ్చును. ఈ బాలికకు ఆనందం సమకూర్చి మనస్సు రంజింప చేయాలి. తాను మలయా నుంచి, జావా నుంచి, సింహాళా న్నుంచి తెచ్చిన విచిత్రవస్తువులు ఖరీదులు కలవి. బర్మా వస్తువులు ఎన్నో ఆమెకు బహుమానాలు ఈయవచ్చును. మంచి మంచి ఇంగ్లీషు గ్రంథాలు బహుమానాలు ఈయవచ్చును. దేశంలో తయారయ్యే వస్తువులు సమర్పించవచ్చును.

మనస్సు కరిగితే ఏ ఏబది వేల రూపాయలు వెల కలిగిన నగనో బహుమతి యిచ్చి కొంచెం దగ్గరకు లాగవచ్చును.

బాలిక తనకు దూరమౌతున్నదని చెట్టియారుకు తోచినకొలదీ, ఆమెమీద కాంక్ష ఎక్కువైపోయినది. ఏ ఉపాయంచేతనైనా సరే ఆ చిలుకల కొలికిని, కులకుల మిఠారిని పక్కకు తార్చాలి. అందుకు ఒక పెద్ద ఉపాయం ఉంది. ముందు జయలక్ష్మిని నిముషంలోకి పక్కలోకి చేరుస్తే కూతుర్ని అర్పించి తీరుతుంది. జయలక్ష్మికోసం తాను తహతహ లాడిపోతున్నట్లు ముందర ఎత్తులు వేయడం అద్భుతమైన ఉపాయం.

ఇంతలో కారు వెడుతున్నట్లు చప్పుడైంది. ఏమిటా అని హాలులోంచి బయటకువచ్చి తన సేవకుణ్ణి అడిగితే అనంతలక్ష్మి, సేవకురాలూ వెళ్ళారని చెప్పినాడు. మనస్సు మారిపోయింది. కోపంతో దిక్కులు నల్లబడ్డాయి. దీనిపొగరు మితిమీరిపోతోంది. చెట్టిగారి శక్తి దీనికేమి తెలుసును! ముగ్గురు రౌడీలు యిల్లు కాపలా కాస్తున్నారుకదా అని వీళ్ళకు పొగరు మిన్ను ముట్టుతూంది. కోనంగిని ముందు కోనలు పట్టించాలి. అది ముందుతీర్చి తరువాత వీళ్ళిద్దరిపని చూడాలి. కోనంగి వదిలితే అనంతలక్ష్మి శక్తి ఉడిగిపోతుంది. ఒత్తిడి కొంచెం కొంచెంగా ఎక్కువ చేయాలి.

చెట్టియారు జయలక్ష్మితో మాట్లాడడానికి లోనికి వెళ్ళినాడు. వంటలక్కతోపాటు జయలక్ష్మి ఇంట్లో అన్నీ సర్దుకుంటూ ఉంది.

**చెట్టియారు:** 'జయలక్ష్మి' అని పిలిచాడు. 'ఎందుకు స్వామీ!' అని అంటూ ఆమె ఇవతలికి వచ్చింది.

"జయా! నీ కోసం కొన్ని బహుమానాలు పట్టుకు వచ్చాను."

"ఏమిటండీ ఆ బహుమానాలూ?"

"ఒరే కోవాలన్! కారులోవున్న పాకెజీలన్నీ పట్టుకురారా!" అని చెట్టియారు కేక వేశాడు. సేవకుడు అట్టకాగితాలతో చుట్టబెట్టివున్న నాలుగు పాకేజీలూ తీసుకు వచ్చాడు.

తానే స్వయంగా పాకేజీలన్నీ విప్పినాడు. బర్మాలో పనిచేసిన ఒక వెండి బుద్ధుడు నీలాలే కనులు, బంగారు పద్మంపై కూర్చుని ఉన్నాడు. ఆ పనితనానికి ఎవరైనా ముగ్ధులు కావలసిందే. జయలక్ష్మి ఆశ్చర్యంతో నిండిపోయి "ఈ బొమ్మ నాకేనా, లేక అమ్మిణికా?" అని ప్రశ్నవేసింది.

"ఇది నీకే, ఇంకోరికి ఎల్లా ఇవ్వగలను?" అని అంటూ ఆమెవైపు మెరుములా ఒక చూపు పరపి, మళ్ళీ తలదించి, రెండవపాకేజీ విప్పడం ప్రారంభించాడు. సింహళ శిల్పపు పనితనంలో ఒక కంఠపు గొలుసుకు, నాయకమణిగా ఒక పచ్చ, చిన్న చిన్న పచ్చలు ఇరువది ఏడు ఉన్నవి (పచ్చల తారహారము) ఒకటి తీసినాడు.

మూడవ పాకెట్టు విప్పినాడు. అందులో బలిదేశపు లక్కబరిణ ఉన్నది. ఆ బరిణలో ఒక వజ్రపుటుంగరము నాగముల కౌగిలింతగా పని తీర్చినది ఉన్నది. నాల్గవకట్ట విప్పినాడు. అందులో జపానులో తయారైన ఉత్తమజాతి సిల్కుచీర గుడ్డమీద బంగారు పూవులూ, లతలూ ఉన్నాయి. అంచు బెనారసు పనివాళ్ళుకుట్టారు. తొమ్మిది గజాలచీర పిడికిట పట్టవచ్చును. అవన్నీ చూచి విభ్రమాశ్చర్యాల మునిగిపోయి, జయలక్ష్మి "ఇవన్నీ ఏమిటండీ చెట్టిగారూ?" అని అన్నది.

ఆమె మాటలు అస్పష్టంగా వినబడ్డాయి. ఆ వస్తువులన్నీ పది పది హేను వేలుంటాయి అని జయలక్ష్మి అంచనా వేసింది.

"ఇవన్నీ నీ కోసం పట్టుకొచ్చాను జయలక్ష్మీ! నీకు ముప్పయి ఎనిమిది అయినా, పదిహేనేళ్ళ బాలికలా ఉంటావు. నీ అందం ఎవరికి వుంది ఈ మద్రాసంతలోనూ? అయ్యంగారు నీ కోసం సర్వం అర్పించాడంటే ఆశ్చర్యం ఏమిటీ! నా సర్వస్వం నీవే!" అని గుటక మింగినట్టు ఆగి, ఆమెను కళ్ళతో కబళించాడు.

జయలక్ష్మి ఆశ్చర్యం మిన్నుముట్టింది. మాట రాలేదు. అనేకులు ఆమెను ఆశించారు. కాని, ఇతడు తన కూతును పెండ్లికై కోరి వస్తున్నాడనుకొంది. తనకన్న రెండు మూడేళ్ళు చిన్న. పాపం తన్ను ఎంత వాంఛించాడో వెర్రి కుర్రవాడు. తన దేహం వాంఛించాడు. తన సౌందర్యం వాంఛించాడు. ఇప్పటికి తన్ను ఎంతమంది జమీందారులు వాంఛించడం లేదు! తన అందం ఏమీ తీసిపోలేదనీ, అంతకన్న అంతకన్న ఎక్కువైందనీ, అనేకులు ఉత్తరాలు రాస్తూంటారు.

కాని ఈ కుర్రవానికి వర్తక వ్యాపారాదులు తెలిసినట్లు ప్రేమ విషయాలు ఏమి తెలుస్తాయి? ఆమెలో మాతృత్వము ఒక్కసారి పైకుబికింది. తనకు బంగారు కూతురితోబాటు బంగారు కొమరుడు కలుగలేదు.

ఆమెకు అతని తలపై చేయివేయవలెనని బుద్ధి కలిగింది కాని, అది ఈ చెట్టి తప్పు అభిప్రాయం చేసుకోవచ్చు ననుకుంది.

ఆమెలోని స్త్రీత్వము అతని ప్రేమోపాసన వాక్యాలకు ఉప్పొంగింది. ఆమెలోని దేవీత్వము, తాను నిజంగా ప్రేమించిన పురుషుడొకడుండి, తనకు ఒక విధంగా తాళికట్టిన భర్త అయి తన్ను విడిచి వెళ్ళిపోయినప్పుడు, వేరొక్క పురుషుడు ఇతడు అని తెలిసింది. ఆమెకు కోపం వచ్చింది. దుఃఖము వచ్చింది. నవ్వు వచ్చింది. ఆమెలోని మాతృత్వము కూతురికై భయపడింది. తాను తన కూతురుకన్న అందమైందా? తన కూతురును వాంఛించి వచ్చినవారు ప్రతి యువకుడూ తన్ను వాంఛించడం మొదలు పెట్టాడా? ఆమె గజగజలాడిపోయింది.

ఆమె తలవంచుకొనే ఉన్నది. ఇంతలో చెట్టియారు పాములా చేయి ఆమె భుజంమీద వేశాడు. ఆమె ఉలిక్కిపడింది. మత్తు నుంచి మెలకువ వచ్చింది. ఆమె కోపంతో మండిపోయింది.

వెంటనే వెనక్కుతగ్గి "చెట్టిగారూ! మీరు చాలా మంచివారు. జగత్ప్రసిద్ధి పొందిన అనేకమంది సౌందర్యవంతులైన బాలికలను కూర్చుకొని మీరు స్త్రీవాంఛతృప్తి తీర్చుకొంటున్నవారు. అలాంటి మీరు నన్ను ప్రేమిస్తున్నారంటే నమ్మను. నాకు మీ బహుమానాలు వద్దు! ఇంకో విషయం మనవి చేస్తున్నాను. మా అమ్మాయి కోనంగిని ప్రేమిస్తోంది. ఆమె మిమ్ము వివాహం చేసుకోదు. నేను మిమ్ము ప్రేమించలేను. మీకున్న ఆస్తి నంతనూ ధారపోసినా నాకు అక్కరలేదు. ఇక్కడ నుండి మీ స్నేహం మాత్రం కావాలి, సెలవు" అని తెలిపింది.

ఆమె వెంటనే తన పని మనుష్యుని ఒకర్ని రమ్మని కేక వేసి, ఆ ప్యాకెట్టులు కట్టమనిన్నీ, చెట్టిగారి కారులో పెట్టమనీ చెప్పి తాను లోపలికి వెళ్ళిపోయింది.

## 7

**ఆ** రోజు పగలు మదరాసుకు ఇరవైమైళ్ళలో ఒక పొలంలో బాహ్యప్రదేశ చిత్రగ్రహణం (అవుట్ డోర్ షూటింగ్) చేస్తున్నారు సినీమా కంపెనీవారు.

అంతకుముందు పదిరోజుల నుండి అక్కడ ఉన్న మామిడితోటలో నటీనటకులకూ, శబ్దగ్రాహక ఛాయాచిత్రగ్రాహక కళానిపుణులకూ, వారి సహాయులకూ, సహాయ దర్శకులకూ, ఇతరులకూ డేరాలు, పాకలు వేశారు. బల్లలు, కుర్చీలు, మంచాలు వచ్చాయి. వంటశాలలు ఏర్పాటయ్యాయి. అక్కడ ఒక చిన్న గ్రామం సిద్ధమయింది.

నాయకుని వ్యవసాయ చిత్రాలు, పల్లెటూరి జీవితము, పంటకోత మొదలయినవన్నీ తీయవలసి వుంది. వేషాలువేసే డేరాలలో మగవారి డేరావేరు. ఆడవారి డేరాలు వేరు. అలంకారిక శిల్పి స్వయంగా నాయికా నాయకాది ముఖ్య నటీనటకులకు, సాధారణ పాత్ర ధరించి నటకురాలయిన జవ్వని, సుందరి అయిన యువతులకూ స్వయంగా వేషాలు వేస్తాడు.

అతడు మదరాసులో పేరు పొందిన అలంకారికుడు. మొదట నాటకాలలో పాత్రలకు వేషాలు వేస్తూ ఉండేవాడు. ఇప్పుడు గొప్ప అలంకారికుడై పోయాడు.

అతనికి వేషమేమిటి, ఔచితి ఏమిటి, భావమేమిటి అనేవి అవసరం లేదు. తాను వేషందిద్దిన స్త్రీలు బంగారు బొమ్మలు, తాను తీర్చిన పురుషులు మన్మథుళ్ళు.

ఇంక కళా దర్శకుడు చిన్నతనాన్నుంచీ ఫోటోలు చూచి నూనె బొమ్మలు రాసుకునే శిల్పి. అతనికి చారిత్రక దృష్టీ, భావగంభీరతా, కళా చమత్కృతీ ఏమీ తెలియవు. డైరెక్టరులలో ఒకరికి స్నేహితుడు. అందుచే అతన్ని ఏర్పాటు చేశారు.

ఇంక వీరిద్దరి హంగామా వర్ణనాతీతం. కోనంగికి నవ్వు వచ్చేది. డాక్టరుగారి చెవిలో వేశాడు.

డాక్టరు రెడ్డిగారు స్వయంగా ఏమీ తెలియనట్లు అన్నీ చూచాడు. కళాదర్శకుడు ఏం చేస్తాడు? ఛాయాచిత్రకోణం (యాంగిల్) తెలియదు. గంభీరత తెలియదు. వేషాలకూ రంగస్థలానికీ సామ్యమూ చుట్టరికమూ తెలియదు. ఆయనకు ఎంత సేపూ నాటకాల రంగస్థలమే ఎదుట ప్రత్యక్షము.

"నటకులు అభినయించకుండా ఎందుకు అడ్డంగా కుర్చీలూ, సోఫాలూ అని అనేవాడు. అందరికీ నగలూ, మాంచి బట్టలూ, ఎప్పుడూ ఉండాలని వాదన. అసలయిన వజ్రం ఉంటేనేగాని సినీమాలో బాగా ఉండదట. "గాజు రాళ్ళేమిటి?" అని వాదించేవాడు. ఖరీదు తక్కువైనా అనుకరణ దుస్తులు, అనుకరణ భవనాలూ ఛాయాచిత్రగ్రహణంలో చాలా బాగా వస్తాయి అని అతనికి ఇదివరకు చిత్రాలలో పనిచేసినవారు ఎంత చెప్పినా ఆయనకు నచ్చలేదు. వారికి కోపాలూ వచ్చాయి, విసుగూ ఎత్తింది. దర్శకునికి మాత్రం ఆ విషయాలు తెలిస్తేకదా.

ఇంక అలంకారికుడు వేషందిద్దే సమయమే వేయి రూపాయల ఖరీదంటాడు. వేషం వేసే ప్రతి అమ్మాయి కడ నుండీ బహుమతులు చక్కనివి దొరుకుతాయి. ధనమే కాదు. పెదవులదుముట, ఒకరితో ఒకరి హృదయాని కదుముట, ఒకరు యింకో బహుమతీ, ఈలా ఈలా ఉంటాయి.

సినీమాలకు వచ్చిన అమ్మాయిలలో ముగ్గురు ఆరితేరినవారు. నలుగురు ఆరితేరదలచుకొన్నవారు. తక్కిన ఆరుగురిలో సగంమంది ఆరితేర వచ్చును. ఆ సగంలో ఒకతి వట్టి వెఱ్ఱిది. తక్కిన ఇద్దరి విషయంలో జాగ్రత్త! "కొందరు బాలలకు పక్షీంద్రు లుంటారు" అని ఒక సినీమా అనుభవశాలి అన్నాడు కోనంగితో.

**కోనంగి:** ఎవరా పక్షీంద్రులు? ఏమిటి వారి పని?

**అనుభవశాలి:** "తనవెంటన్ సిరి, లచ్చివెంట అవరోధవ్రాతమున్ దాని వెన్కను పక్షీంద్రుడు."

**కోనంగి:** దాని వెంట ఉండేవాడా పక్షీంద్రుడు? అవునండో, చాల మంది తారల వెనకాల ఆ తారల బృహస్పతులు కాని వారు కనబడుతున్నారు.

**అనుభవ:** వారినే చంద్రులు లేక పక్షీంద్రులు అంటారు.

ఆ రోజున చిత్రగ్రహణం చురుకుగా సాగుతోంది. పొలమూ, పశువులూ, కూలీలూ, కోతకోసేవారూ, ఆడకూలీలూ, మొగకూలీలు కలిసి కుప్పలు వేయడం, పాటలు పాడటం, రంగం తర్వాత రంగం తీసిపార వేశారు.

### రంగము 93--పొలం--బాహ్యరంగం

పాత్రలు: ముగ్గురు పొలం కాపులు
కథానాయకుడు
కథానాయిక

ధ్వని: దూరాన పొలం కేకలు
పక్షుల కూతలు
పశువుల అరపులు
సంభాషణ.

వస్తువులు: పొలం దున్నేందుకు మూడు నాగళ్ళు
మూడుజతల ఎద్దులు
మూడు కఱ్ఱలు
తాటాకు గొడుగు
చాప
గడ్డపార
పాఱ
రాట్నం
దూది

వేషాలు: 1 కథానాయకుడు
పంచెకట్టు
బనీను
తలపాగా
కాళ్ళకు పల్లెటూరి చెప్పులు

2 కథానాయిక
చీర ఎఱ్ఱది
రవిక పువ్వులదీ
తలముడిలో పూవు
గాజులు ఎఱ్ఱవి 2 జతలు
మంగళసూత్రము
మెళ్ళో పూసల పేరు
బొట్టు
కాళ్ళకు చెప్పులు

3 కాపులు
పంచెలు ముగ్గురికి
ఇద్దరికి చొక్కాలు
ఒకడికి చొక్కాలేదు, బనీనూ లేదు.
కాళ్ళకు పల్లెటూరి చెప్పులజోళ్ళు
తలపాగాలు
ఒకరికి చేతులకు వెండి మురుగులు
(అతనికీ చొక్కా ఉండదు.)

నటన: 1. పొలం దున్నడం
2. కథానాయిక తాటాకు గొడుగు క్రింద రాట్నం వడుకుతూ ఉంటుంది.

3. కథానాయకుడు గట్టుప్రక్క త్రవ్వి బాగుచేస్తూ ఉంటాడు కథానాయికకు కొద్దిదూరంలో.
4. రైతులు పొలం ఈ చివర నుంచి ఆ చివరకు కథానాయకుడూ నాయిక ఉన్నచోటికి నాగళ్ళు తోలుతూ వస్తూ వెడుతూ ఉంటారు. ఆ సమయంలో మాట్లాడుతూ ఉంటారు.

*సంభాషణ:*

**కథానాయకుడు:** (త్రవ్వుతూ) ఈ యేడు పంటలు బాగా పండితే మన అప్పు తీరిపోతుంది.

**నాయిక:** పొలంపనేనా, ఇంకా మనం ఈ గ్రామానికి ఇతర సహాయాలు ఏమన్నా చేయవద్దా?

**నాయకుడు:** రైతుసంఘం స్థాపించామా, రాత్రి పాఠశాల నడుపు తున్నామా, నా రాణీ.....

**నాయిక:** వేళాకోళానికన్నా నన్ను రాణి అనకండి!

**నాయకుడు:** ఏమి అనమన్నావూ?

**నాయిక:** స్నేహితురాలా అనండి.

**నాయకుడు:** వట్టి చప్పగా ఉంది ఆ మాట. ఆత్మేశ్వరీ అంటాను.

**నాయిక:** అది బాగుండదు. నేను ఈశ్వరినా, శాంభవీ శాకినీ ఢాకినీనా!

**నాయకుడు:** ఏమన్నావు నరసూ?

**నాయిక:** నరసూ ఏమిటి? నరుసులాగ, నేను నరసు కాఫీనా?

**నాయకుడు:** ఓ రైతుపిల్లా! ఏంటంటవు?

**నాయిక:** నన్ను రైతుపిల్లా అనకండి!

**నాయకుడు:** ఏమిటీ నేతి నీతి?

**నాయిక:** నేను నెయ్యీకావా లనలేదు. నూనే కావా లనలేదు.

**నాయకుడు:** ఆముదం కావాలనలేదు పుట్టబోయే చిన్నబిడ్డకు?

**నాయిక:** నాకు సిగ్గు కలిగించే మాట అనకండి!

**నాయకుడు:** సిగ్గుమాలిన బాల
ఎగ్గు ఎరగని బేల
నీలాల ముంగురుల
వాలుచూపుల గోల!

**నాయిక:** పారపట్టిన రైతు
సారమెరుగని రైతు
రైతునంటూ తిరుగు
రంగేలి నా రాజు

**నాయకుడు:** నన్ను రాజనబోకు

**నాయిక:** నన్ను రాణనవోకు

**నాయకుడు:** బంగారు నేలలో

**నాయిక:** పసిడి పండేవేళ

**రైతులు:** బంగారు నేలలో
పసిడి పండిస్తాము
దేశాల మా పంట
దివ్యాక్షతలు కావ?

అందరూ: బంగారు నేలలో
పసిడి పండిస్తాము
బంగారు మా నేల మాకుండగానూ
పసిడి మాకేల!
పసిడి మా కేల?

కెమేరా: 1 దగ్గిర గ్రహణం (క్లోజ్ షాట్) పొలంలో భూమి నాగేటిచాలుగా మారుతో వుంటూ జరిగిపోతోంది – 5 అడుగులు! కోణం ప్రక్కనుంచి.

2. చాలా దూరం అవుతూ వుంటుంది. మధ్యగ్రహణం (మిడ్‌షాట్) చాలూ, మేడితోకా, వెనక రైతూ కనబడతారు.

3. ఇంకా దూరం – మధ్యదూరం (మిడ్ లాంగ్ షాట్) నాగలి, ఎద్దులు, రైతూ కనబడతారు.

4. దూరం – దూరగ్రహణం (లాంగ్ షాట్).

5. కెమేరా నెమ్మదిగా తిరుగుతూ పొలం చూపెట్టుంది.

6. రాట్నంమీద వాలుతుంది మధ్యగ్రహణం. రాట్నం తిరగడం. కొంచెం రాట్నం తిప్పుతూ దారం ఒడికే నాయికను చూపెట్టుంది.

7. ఇంకా కదులుతుంది కెమేరా; తవ్వే నాయకునిపైన వాలుతుంది.

8. ఎ. బి. సి. డి. ఇ. ఎఫ్. జి. హెచ్. గా కెమేరా విభజన ఇంతవరకూ!

9. ఇక్కడ నుండి సంభాషణలు, (మిడ్ షాట్‌లు) నాలుగు క్లోజప్పులు నాయిక, మూడు నాయకుడు.

10. నాయకుడు మాట్లాడుతూ వుంటే నాయిక ప్రేమచూపుల క్లోజప్పులు నాలుగు. మూడు ముఖములు మాత్రం, ఒకటి కన్నులు మాత్రం. నాయకునిది ఒక క్లోజప్పు ముఖం మాత్రం.

**షరా:** ఈ అయిదు క్లోజప్పులూ ఆయా ఇంగ్లీషు అక్షరాల క్రింద ఒకటి, రెండు, నాలుగయిదు.

## ⑧

అలా ఉంటుంది బొమ్మతీసే వ్రాత. దీన్నే "షూటింగ్ స్క్రిప్టు" అంటారు.

కోనంగి కొంచెం బంగారుఛాయ మనుష్యుడు కాబట్టి హాలీవుడ్డు మేక్స్ ఫాక్టరు కంపెనీవారి వేషధారణ రంగులలో 26వ నంబరు క్రీము మొగం అంతా రుద్దుకొని బాగా అద్దుకొని మర్దనాచేసుకొన్నాడు. ఆ తర్వాత ఆ నంబరు ద్రవపదార్థం పెట్టి మర్దనా చేసుకొన్నాడు. ఆ తర్వాత ఆ నంబరు పొడితో మొగం అద్దుకొన్నాడు. అప్పుడు వేషం తయారుచేసే ఆయన, కళ్ళకు, రెప్పలకు, కనుబొమ్మలకు నల్లరంగు వేశాడు. పెదవులకు కొంచెం ఎరువు దిద్దాడు.

మెడకూ చేతులకూ ఆ నంబరు ద్రవపదార్థము రాసుకొని పొడి జాగ్రత్తగా అద్దుకొన్నాడు కోనంగి.

మేక్స్ ఫాక్టరు మొదట ఒక పెద్ద సినీమా కంపెనీలో వేషాలువేసే కళాకారుడు. అదివరకున్న రంగులు దేహానికి హానికరమని ఎంచి బాగా పరిశోధనచేసి కొత్తరంగులు కనిపెట్టాడు. సినీమాలో ఛాయాగ్రహణం వర్ణవిభేదవిధానరూపమై పరిణమించి, గ్రహణపు

బద్దెలు సకల వర్ణఛాయా గ్రహణశక్తి సంపాదితములుగా (ఫాన్ క్రొమాటిక్) తయారు చేయబడినవి. అందుకు తగినట్టే సర్వవర్ణాత్మిక వేషధారణ వర్ణాలు మాక్స్‌ఫాక్టరు తయారు చేశారు. అప్పటి నుంచీ సినీమా లోకం అంతా అదే వాడు తున్నది.

వేషం అయిన తర్వాత ముదురు పసుపురంగు వేసిన పంచెలు, చొక్కాలూ ధరించాలి. అవి అయితేనే చిత్రంలో తెల్లగా కనబడతాయి. ముదురు ఎఱ్ఱరంగు ముదురు నల్లరంగుగా కనబడుతుంది. ఆకుపచ్చరంగు మధ్యరకం నలుపుగానూ, నీలం లేతనలుపుగానూ కనబడుతుంది.

నాయిక వేషం వేసే అమ్మాయికి అంతా కొత్త అయినా, కొంచెం గడుసుపిల్ల కాబట్టి త్వరలో సినీమా విధానాలన్నీ నేర్చుకొంది. పాటీగారూ, మేనేజింగు డైరెక్టరూ, కంపెనీ డైరెక్టరూ, ఛాయాగ్రాహకుడూ, శబ్దగ్రాహకుడూ, వేష కళాకారుడూ, కళా దర్శకుడూ అందరూ ఆమెను వాంఛించారు.

ఆమెకు దేహం అమ్ముకోవడం కొత్తకాదు. చక్కగా పొడగలిగి, అందమైన మొగమూ, పొంకమైన దేహమూ కలిగిన ఆ బాలికకు రుసుము చెల్లించే ప్రేమికుల కేమిలోటు?

కాని సినీమాకు యిదే మొదటిసారి రావడం. సినిమా జీవితాన్ని గురించి బాగా పాఠాలు నేర్చుకుని ఉండడంవల్ల కొంచెం బెట్టుగా ఉండేది.

మేనేజింగు డైరెక్టరుగారికి రెండు మూడుసార్లు తృప్తి తీర్చింది. రెండు మూడునెలలయిన వెనుక ఆయనకు దొరికేదికాదు. తక్కిన కంపెనీ డైరెక్టర్లకు రెండు మూడు కౌగిళ్ళు, నాల్గయిదు చుంబనాలు, అయిదారు సార్లు టీలు, ఫలహారాలు మాత్రం అర్పించి, అంతకన్న వారిని ముందుకు సాగనీయక తప్పించుకుంది.

పాటీగారికి మొహమాటం. కొంచెం భయస్థుడు. లోపల కోర్కెవుంది. కాని ఎవరేమనుకుంటారో! మొదటసారి దర్శకునిగా వీలువచ్చింది. అది పాడుచేసుకుంటే ఏలాగు?

సంగీత దర్శకుడు అమ్మాయికి ఆమె ఇంటి దగ్గరే పాఠాలు చెబుతున్నాడు. అయనకు మంచి వరసలు ఇచ్చినందుకు ఇంటి దగ్గిర తయారు చేసేందుకు ఎప్పుడైనా రుసుముగా ఆమెనే పుచ్చుకుంటున్నాడు. అతడు ఆరితేరిన ఘటం. అందరికీ పాఠాలు నేర్పడంలో దిట్టమైన చేయి.

బాగా వేషం వేస్తాడని వేషాలరాయడిగారికి ఒకటి రెండుసార్లు ఆమె అతనికోర్కె తీర్చింది. అదే పదివేలనుకున్నాడు.

కెమేరా దర్శకుడు పాడుచేస్తే కొత్తరూపం, శబ్దగ్రాహకుడు పాడు చేస్తే గార్దభకంఠమూ తయారవుతాయి. అందుకని వారాని కొకసారి వారి తొందర తీర్చేది.

ఇంతమందిని ఆమె సంతృప్తిపరచింది. కాని ఆమె స్త్రీ, అందులో బాలిక, అందులో గడుసుది, జాణ, ఆమెకు హృదయం ఉంది. ఆమెకు కూడా వాంఛ ఉంది, ఆమె తగిన పురుషుణ్ణి కోరుకుంటుంది. ఆమె హృదయం కోనంగిని వాంఛించింది. తనకు మంగళసూత్రం కడతాడు (ఆ రంగం ఇంకా తీయలేదు). ఈలోగా భార్యభర్తలుగా ప్రేమరంగాలు అవుతున్నాయి. చిన్నవాడు, పెళ్ళికాలేదు, అందగాడు, తెలివైనవాడు, సర్వదా సంతోషంగా ఉంటాడు. అందరినీ నవ్విస్తూ వుంటాడు. వట్టి అనాఘ్రాత పుష్పంలా ఉన్నాడు. ఈగవాలని రసగుల్లాలా ఉన్నాడు. వాయి తీసిన యిడ్డెనులా ఉన్నాడు.

ఆమె అతన్ని గాఢంగా వాంఛించింది. ఆమె అభినయంలో, మాటలలో ఆ గాఢతా, ఆ వాంఛా వ్యక్తమౌతూ ఉంది. కాని కోనంగి అంటీ అంటనట్టున్నాడు. అతని అభినయం కూడా ముభావంగానూ, త్రపాపూరితంగానూ ఉంది.

ఇదంతా డాక్టరు రెడ్డిగారు చూస్తున్నారు. అయినంతమట్టుకు యెలావుందో చూచుకుంటే కథానాయకుడు సిగ్గుపడుతున్నట్లు, అతనికి ప్రేమకన్న మర్యాద ఎక్కువగా ఉన్నట్లు కనబడింది.

డాక్టరుగారు కోనంగితో చాలాసేపు తమ ఇంటిలో వాదించారు. "ప్రేమ అనే ఒక దివ్యభావం ఉందంటే నేను ఒప్పుకోను కోనంగీ! కాని స్త్రీ పురుషుల మధ్య నుండే భావం పశుభావం కాదని నువ్వు వాదించావే, ఆ వాదనంతా నీ అభినయంలో ఏమైపోయింది?" అని ప్రశ్నించాడు.

**కోనంగి:** ఆమె వేశ్యవృత్తిలోవున్న బాలిక కాదయ్యా మరి!

**డాక్టరు:** అయితే నిన్ను ఎత్తుకుపోయిందా?

**కోనంగి:** కాని బజారు వస్తువు అని తెలియడంవల్ల నాకు జుగుప్స.

**డాక్టరు:** ఆ బజారుతనం నీకు కూడ వస్తుందనా?

**కోనంగి:** కాదు.

**డాక్టరు:** కాదూలేదు, గీదూలేదు! అభినయం నిజం అనుకుంటున్నావా?

**కోనంగి:** అనుకోటంలేదు. నిజంలో నుంచి ఇంకా అభినయంలోకి దిగలేకుండా ఉన్నాను.

**డాక్టరు:** అయితే బొమ్మంతా తగలడిపోతుంది.

**కోనంగి:** ఎట్లాగ?

**డాక్టరు:** ఆ అమ్మాయి ఎంత చక్కగా అభినయిస్తోంది. నీ మీద కన్ను వేసిందనుకుంటాను.

**కోనంగి:** అందుకనే అంత బాగా అభినయిస్తోంది.

**డాక్టరు:** బడాయి కూడానా! కాని నువ్వు నీరాణీని అనంతలక్ష్మిని తలచుకో!

**కోనంగి:** ఛా! ఛా! మా ప్రేమ పవిత్రమైంది.

**డాక్టరు:** ఏమిటా పవిత్రత? పవిత్రం ఏమిటి, అపవిత్రం ఏమిటి?

**కోనంగి:** బాబూ! ఆ విషయాలు ఇంకోసారి వాదించుకుందాములే! నన్ను కోపంచేయకు తండ్రీ!

**డాక్టరు:** కోపమా, కోపమన్నరా? ఇంత డబ్బుపెట్టి తీస్తున్న చిత్రమూ, నీ అభినయంవల్ల తగలబడవలసిందేనా? ఎప్పుడూ నిజం అనుకునేటట్లు అభినయిస్తావే! జీవితంలో అభినయమూ నాటకంలో జీవితమూనా నీ వ్యాపారం? రాఘవాచారిగారిని చూడు. ఆయన చెప్పిన విషయాలు మరిచిపోయావూ?

## 9

కోనంగి తన ప్రేమాభినయంలో లోటు వుందని గ్రహించాడు. కారణం, తనలోని భయం. ఆ భయం ఎందుకు కలగాలి? నాయిక పాత్ర వేసే అమ్మాయిని తన హృదయం మెచ్చుకొంది. ఆమెను స్త్రీగా తాను వాంఛింపలేదు, నిజమే. కాని ఫ్రాయిడ్ అన్నట్లు తన హృదయాంతరము ఆ బాలికను తన స్త్రీగా చూడటం ప్రారంభించింది. హృదయమూ, మనస్సూ ఆ వాంఛను అసహ్యించుకుంటున్నాయి. తాను సంపూర్ణ హృదయంతో

ప్రేమించింది అనంతలక్ష్మిని. ఆ ప్రేమ హృదయాంతరములోని వాంఛను ద్వేషించింది. ఈ కలతచేత తన అభినయం కుంటుపడింది. ఈ కుంటుపడడానికి ఇంకో ముఖ్యకారణం లేకపోలేదు.

ఆ బాలిక తన్ను నిజంగా ప్రేమించినట్లో, వాంఛించినట్లో తన అభినయంలో స్పష్టంగా వ్యక్తం చేస్తున్నది.

మొన్నటిరోజున ఆ సాయంకాలదృశ్య రంగం తీసేసమయంలో తన్ను వెనుక నుంచి వచ్చి కన్నులు మూసిన తర్వాత మెడచుట్టూ చేతులు చుట్టి, తన జుట్టు తడిమి తన తల ప్రక్కకు త్రిప్పి చుంబించబోయినట్లు నటించవలసి వచ్చినప్పుడు, ఆమె తన్ను నలిగి పోయేటట్టు కౌగిలించుకొని, తల ముద్దెట్టుకొన్నది. ఆమె కళ్ళు వింతకాంతులతో వెలిగిపోయాయి. ఆ సమయంలో తాను జుగుప్సతో బిగుసుకుపోయినాడు. అప్పుడు దర్శకుడు "కోనంగిరావుగారూ, కొంచెం హుషారుగా ఉండండి" అని ప్రార్థించాడు. "తక్కిన విషయాలలో మీ అభినయం అద్భుతం" అన్నాడు.

ఈ అమ్మాయితో ప్రేమ అభినయించినా అది నిజమనుకుంటుందేమో అని అతడు భయపడినాడు. ఏదో కాలేజీ సహాధ్యాయినులతో మాత్రం మాట్లాడగలిగిన తాను సినీమా తారలతో తను మామూలు ధోరణీగా చనువుగా ఏలా ఉండగలడు? ఈ జీవితమే అతనికి కొత్త అయినా ప్రయత్నించి మెప్పుపొంద నిశ్చయించుకొన్నాడు.

అక్కడనుంచి అతడు దివ్యంగా అభినయించడం ప్రారంభించాడు. "జీవిత మొక బొమ్మల ఆటగా" కాక, జీవితమొక నవ్వుల తోటగా చూచు కొనే కోనంగి ఈ అభినయంలో జీవిత మొక ఏడుపు పాటగా, జీవితమొక బాధల బాటగా కూడా అభినయించాడు.

డాక్టరూ, దర్శకుడూ చివరకు కథానాయిక కూడా ఎంతో మెచ్చుకోడం సాగించారు. ఒకసారి అతడు ఒక గుండెపగిలే దృశ్యం అభినయిస్తోంటే సెట్టుమీద వారందరికీ కళ్ళ నీళ్ళు తిరిగాయి.

అనంతలక్ష్మి తల్లితో కలిసి ఒకసారి సినీమా చూడడానికి వచ్చింది. ఆ రోజున స్టూడియోలోని ఒక పెద్ద భవనపు సెట్టింగులో కథానాయకుడూ తండ్రీ పోట్లాడుకోవడమూ, కథానాయకుణ్ణి తండ్రి కోపపడడము, కథా నాయకుడూ తల్లీ ఈ విషయాలు మాట్లాడుకోవడమూ? కథానాయకుడు తన గదిలో వరండాలో హాలులో ఆలోచించుకొంటూ తిరగడమూ, చివరకు తన గ్రంథాలయంలో ఒక గ్రంథం యాదాలాపంగా చూస్తే, అది అష్టమ ఎడ్వర్డు ఎందుకు రాజ్యం త్యాగం చేశాడు అనే పుస్తకము అవడమూ, ఆ పుస్తకం తీసి చూస్తూ ఆ పుటలలో ఎడ్వర్డూ, అతని ప్రియురాలు డచ్చెస్ బొమ్మ చూచి, ఆ బొమ్మ తన యొక్క, తన ప్రియురాలి బొమ్మగా చూడడం, అంతటితో నాయకుడు ఒక నిర్ధారణకు వచ్చి, ఇల్లు విడిచిపెట్టి కట్టుగుడ్డలతో వెళ్ళిపోవడానికి నిశ్చయించి, తండ్రికీ, తల్లికీ ఉత్తరాలు రాసిపెట్టి వెళ్ళిపోవడమూ రంగాలు తీస్తున్నారు.

అవన్నీ అనంతలక్ష్మి చూచింది. ఆమె తన మనోనాయకుని అభినయ సామర్థ్యము చూచి ఆశ్చర్యం పొందింది. ఆ రోజు ఈమె రావడంవల్ల కాబోలు కోనంగి చార్లెస్ బోయరు, చార్లెస్ లాటన్ మొదలయిన ఉత్తమ నటకులకన్న ఎక్కువ అందంగా నటించాడు.

ఆ రాత్రి నాయకుడు ఒక్కడే తన గదిలో ఆలోచించుకొంటూ, తన హృదయంలో నుంచి వెల్లువలై పారిన ఆవేదనను పాటగా పాడినట్లు కోనంగి అభినయిస్తూ

*"ఏది దారని ఎవరినడిగెద*
*ఏది నిజమని ఏల వెదికెదవో?*
*ఆలసించిన అమృతమేనా*
*కాలకూటముగాక, మారుని*
*వేళదాటిన వేడుకేలా*
*వెక్కిరింతేగా?*
*బ్రతుకు యాత్రలో విధము తెలియక*
*బాటకానిది బాట అది అని*
*మనసు తెలియని మనుజు డెవడో*
*వాడు నాశనమే!"*

అని పాడుకొంటూ కుర్చీలో కూలబడినాడు. ఆ పాటా, ఆ పాట పాడిన గంభీర మధుర కంఠమూ ఆ సెట్టులో ఉన్నవారందరి గుండెలూ నలిపివేశాయి,

నాయకుని పాట వింటూ, అతని తల్లి గదిలోనికి వచ్చి "నాన్నా! ఏమి చేయదలచుకొన్నావు?" అని అడిగినట్లు ఒక రంగంలో అభినయం ప్రారంభం.

**నాయకుడు:** ఏం చేయమంటావు? నువ్వు అంతా చూస్తున్నావు. నీ సలహా ఏమిటి?

**తల్లి:** ఒరే నాన్నా! ఒక్క కొడుకువు! ముగ్గురు ఆడపిల్లల తర్వాత పుట్టావు నీ మీద మీ నాన్నగారికి ప్రేమలేదంటావా?

**నాయ:** ఇక్కడ నాన్నకు ప్రేమలేదన్నమాట ఏమి వచ్చిందమ్మా? ప్రేమ వేరు. ఒక పురుషుని జీవితమార్గం ఏర్పరచుకోవడం వేరు.

**తల్లి:** ఏమి టా జీవితమార్గం?

**నాయ:** రాక్షసులుచేసే ఉద్యోగాలు చేయడమా అది? బానిస అవడమా దారి? ఎందుకమ్మా నాకా డిప్యూటీ కలెక్టరు పదవి. నాన్న స్నేహాలవల్లా, నేరుపువల్లా ఆ ఉద్యోగం ఎం.ఏ. ప్యాసయిన రెండో సంవత్సరమైన ఈ ఏడే నాకు తెప్పించిపెట్టారు.

**తల్లి:** నాన్న తెప్పించడమేమిటి? నువ్వే ఆ పదవికి పెట్టిన పరీక్షలో మొదటగా వచ్చావుటగా?

**నాయ:** నిజం విను, అమ్మా! నేను ఆ పరీక్షలో బాగా కృతార్థుడనయ్యే ఉంటాను. కాని మొదటివాడుగా రావడానికి కారణం నాన్నగారే! ఆయనకూ ఆ పరీక్షకు ఒక ముఖ్యమైన జవాబు పత్రం దిద్దిన ఒక పెద్ద కలెక్టరుగారికి యెంతో స్నేహం. ఒకరివల్ల ఒక రెంతకాలం నుంచో ఉపకారాలు పొందారు. ఆయన నాకు ప్రథమ స్థానం యిప్పించారు.

**తల్లి:** మీ తండ్రి ఇంత ఆస్థి సంపాదించారురా? రెండు మూడు జమీగ్రామాలు కొని జమీందారనిపించుకున్నారు. ఈ ధనానికి తగిన తాహతు, ఉద్యోగము నీకు ఉండాలనీ, నువ్వు డిప్యూటీ కలెక్టరు, కలెక్టరు పనీ చేస్తూ ఉంటే చూచి ఆనందిందాలనీ వారి కోరికరా నాన్నా.

**నాయ:** అవునమ్మా అవును. నా సోదరులను ఖైదుకు పంపే కలెక్టరు, మాట్లాడడానికి వీలులేదని 144 అస్త్రం ప్రయోగించే యోధుడు, నా దేశాన్ని సర్వకాలం శృంఖలాలలో ఉంచే ప్రభుత్వానికి ఉత్తమాయుధములా అయిన ఆ ఉద్యోగం చేయమంటావు. అంతేనేకాని, నాకు వ్యవసాయం అంటే ఇష్టం. అందులో అనేకరీతులు ప్రవేశింపచేసి నా కృషిఫలితం నే ననుభవిస్తానంటే నాన్నకూ నీకూ గిట్టదు.

**తల్లి:** ఎంత లెక్చరిస్తావురా! నువ్వు ఆ గాంధీ జట్టులోనో, ఆ కామ్రేడ్స్ చేతులలోనో చేరి వడవడ వాగి కైదుకు పోవడమో, ప్రాణాలు పోగొట్టు కొనడమో చేసి నా కడుపు చిచ్చు పెడతానంటావు?

**నాయ:** నేను రాజకీయాలలో చేరనని మాటిస్తాను.

**తల్లి:** అంతేనేగానీ ఇంత కష్టపడి తాము పెద్ద గౌరవం సంపాదించి నందుకు, వారికి తగిన కొడుకువై వారు సంపాదించిన ఉద్యోగంచేస్తూ మన కుటుంబగౌరవం నిలబెట్టదలచుకోలేదు.

**నాయ:** నువ్వూ నాన్నా ఒక్కటే!

**తల్లి:** మా జీవితాలు భగ్నంచేయడానికి పుట్టావు తండ్రీ!

ఈ రకంగా రంగం అనేక రకాలయిన కోణాలలో ఛాయాగ్రహణలలో పూర్తి అయింది.

## (10)

**కో**నంగి ఎంత నవ్వుతాడో, అంత ఆవేదన పడుతూ ఉంటాడు. అతని నవ్వూ, అతని చిన్నబిడ్డచేష్టలు, హాస్యకృత్యాలు, అందరినీ అతడు సదా సంతోషజీవి అని అనుకునేటట్లు చేస్తాయి.

కాని అతని హృదయంలో భూగోళం మధ్య ఉన్న భయంకరాగ్ని శిఖలు ఫెళ ఫెళ మండుతూనే ఉన్నాయి. తల్లి పాపంలో పుట్టిన తన బాలకుణ్ణి తిన్నగా చూడలేదు. చెన్నపట్నంలో ట్రిప్లికేను గోషా ఆస్పత్రిలో అతను జన్మించాడు. అక్కడి దాదులే అతన్ని పెంచారు. తల్లి సరిగా చూచేది కాదు. అయినా పది పన్నెండు రోజులయిన తర్వాత దాదులంతా బలవంతం చేస్తే పిల్లవాడికి పాలిచ్చేది. ఆమెలోని మాతృత్వం హాయి పొందేది. తాను పిల్లవాణ్ణి చూచి ఆనందిస్తున్నందుకు విచారించేది.

ఇటు పిల్లవాడిపైన అనురాగం తన్ను ముంచెత్తి పరువులెత్తుతున్నది. అటు అనేక యుగాలనుంచి వస్తూన్న ఆచార సంప్రదాయ ఛాందసమూ, యమలోక భయమూ కలిసి లోననుండి చండాగ్నులతో దహిస్తున్నాయి. ఒకసారి చూచీ, ఒకసారి చూడకుండా తల్లి కుమారుడ్ని పెంచింది. కొమరుడు తన పాపచిహ్నము, ఆ పాపాన్ని పెంచడమే తన కర్మవిపాకము అని ఆమె ఆలోచించుకొనేది. తాను పాపంచేసి బ్రాహ్మణత్వం పోగొట్టుకొంది. కాని తాను పాపంచేసిన పురుషుడు బ్రాహ్మణుడవడంవల్ల కొంత నివృత్తి. పాపంలో జన్మించిన శిశువు సంపూర్ణ పాపి అనీ ఆమె అభిప్రాయం. ఆమె దినదినమూ భగవంతుణ్ణి తన పాప నివృత్తి చేసుకో సహాయం చేయమని ప్రార్థించేది. తిరుగు ప్రయాణంలో కృష్ణ ఒడ్డుకు పోయి తలకట్టు గంగ కర్పించింది.

కొంచెమయినా జ్ఞాపకంలేని చిన్ననాటి భర్తను తలుచుకొని దుఃఖించి అంతవరకూ ఉన్న గాజుల్ని చితుకకొట్టుకుంది.

సంపూర్ణ సన్యాసివేషం ధరించింది. సన్యాసివేషంతో బిడ్డకు పాలివ్వడం ఆమెకు ఎంతో కష్టంగా వుండేది.

కొన్నాళ్ళవరకూ ఆమె ఎవ్వరిమొగం చూచేది కాదు. కోనంగి తండ్రే అమెకు అన్నీ పంపించేవాడు. కోనంగి తండ్రి మొగాన్ని చూచేది కాదు.

"నన్నంత ప్రేమించినదానవు, ప్రేమ అంటే ఏమిటో ఎరగని ఒక నికృష్టజీవికి ప్రేమదానమిచ్చిన దివ్యదేవివి! ఇప్పుడు నీకంత కష్టమేమిటి?" ఆమె మాట్లాడలేదు.

"నువ్వు చేసినపని ఏనాటికీ తప్పుకాదు. ముసల్మానులకు భయపడి పుట్టిన నియమాలన్నీ పూర్వకాలంనాటి వనుకుంటున్నావు. భర్తపోయిన అంబికా అంబాలికా వేదవ్యాసునితో సంగమించి కొడుకులను కన్నారు. వారికిలేని తప్పు నీకు వచ్చిందా?"

ఆమె మరీ మౌనం వహించింది. కోనంగి అసలు తండ్రి లోనికి చొచ్చుకొనిపోయి, ఆమెను బిగియార కౌగలించుకొన్నాడు. అతనికి ఆమె విగతకేశినిలా కనబడనేలేదు. అతని ముద్దులు కఱ్ఱబొమ్మ పెదవులపై పడ్డాయి కాని, ఆమెకు కొంచెమన్నా స్పందనం కలిగించలేకపోయాయి. ఆడవాళ్ళ హృదయం పరమాత్మునికి కూడా తెలియదనుకుంటూ అతడామెను మళ్ళీ తనకు స్త్రీని చేసుకొనే ప్రయత్నం తగ్గించాడు. ఆ మానడం ఒక్కసారిగా తగ్గించలేదు. నెమ్మది నెమ్మదిగా తగ్గిపోయింది.

ఎప్పుడైనా వచ్చి అతడు ఆమె పక్కలో పండుకొని, వేయివిధాల బ్రతిమాలినా ఆమె రాతిబొమ్మ అయిపోయి లోకం కరిగిపోయినట్లు కళ్ళ నీళ్ళుకార దుఃఖించేది. మహాత్ముని శిష్యురాలిలా ఆమె ఇతర అల్లరి ఏమీ చేయకుండా సత్యాగ్రహం చేసేది.

కోనంగి తల్లిపైన ఆ తండ్రికున్న ప్రేమ అంతా కొమరునిపైన మహాప్రేమతో కలిపి కోనంగిపై నే అఖండవర్షం కురిపించేది!

తన్ను కౌగలించుకున్నప్పుడు తనదేహం అతడు ముద్దెట్టుకున్నప్పుడు ఆమె వెంటనే ఆవుపేడ నీళ్ళలోకలిపి స్నానంచేసేది. ఇన్ని ఆ నీళ్ళే త్రాగేది. భగవంతుని ప్రార్థించేది, రోదించేది.

కోనంగి తండ్రి కూడా కొంచెం పాపభీతి కలవాడు కాబట్టి, కొంతమేరకు సాగి ఆమెను రెండవసారి కామవాంఛాతృప్తికి దింపలేకపోయేవాడు.

అతడు ఒకసారి తన్ను పెంచడంవల్ల అతడు తన కొక విధంగా భర్త అని ఆమె అనుకోక పోలేదు అతడు తనలోని గాఢవాంఛతో ఆమెను నలిపివేస్తున్నప్పుడు ఆమెకు తెలియకే ఆమెలోని స్త్రీత్వ నరపుముడులు సడలుకొని కొంచెం కరిగేది గాని, ఆమెలోని పాపభీతి ఆ కరగుటను గమనింపజేయక ఆమెను వట్టి చైతన్యరహితురాలినిగా మాత్రం చేసేది. అంతటితో కోనంగి తండ్రి ఆగిపోయేవాడు.

తన గతి ఇంతేనని, భగవంతుడు ఉత్త కామపురుషుడయిన తనకు ఈలాంటి శిక్ష నిచ్చాడనీ అతడు రోదించేవాడు. ఇవన్నీ కొమారునికి ఒక ఉత్తరం వ్రాసి అతడు పరలోకగతు డయ్యాడు. కోనంగి తండ్రి పోవడం తన అదృష్టమనీ, తన ప్రార్థన భగవంతుడు వినడంవల్లననీ ఆమె అనుకునేది. ఒక ప్రక్క స్త్రీత్వ మేమీలేని రాక్షసి తన భార్యయట. తాను ప్రేమించిన స్త్రీకి విపరీత పాపభీతియట. ఇవన్నీ తన ప్రియపుత్రునికి రాయడానికి కారణం ముందు ముందీ విషయాలనుగూర్చి విచారించి పరిశోధించి ఆ బాలకుని జీవితము ఉత్తమపథంలో నడిపించుకొనడానికేనట!

"బాబూ! మనుష్యుడు కర్మజంతువు. అతడుగాని ఆమెగాని (ముఖ్యంగా పురుషుడు) సర్వకాలమూ పనిలో నిమగ్నుడై ఉండాలి. ఈ కర్మకు పునాది స్త్రీకి పురుషుడు, పురుషునకు స్త్రీ. స్త్రీవాంఛలో పురుషు డే కార్యమూ సాధించలేడు. అలాగే స్త్రీయున్నూ. ఎంత ఉత్తమ కార్యం తలపెట్టినా అంతే. మనం మహాత్మాగాంధీలము కాము కాబట్టి, నాయనా! ప్రేమ అనే వస్తువు వుంది. దాన్ని ఏడిపించక వీధులూడ్చే దానిమీద ప్రేమ కలిగితే, (వట్టి పశు

వాంఛకాదు బాబూ) దాన్ని నీ భార్యగా చేసుకో. ఆ తర్వాతే నీవు లోకంలో ఏ పనికోసం పుట్టావో ఆ పనిచేయి."

ఈ విషయమున్నూ ఇంకా అనేక విషయాలు ఇంగ్లీషులో రాసి ఉంచి, ఒక పెట్టెలో పెట్టి ఆ పెట్టెతాళం బంగారం రింగులో పెట్టి కోనంగి మెళ్ళో కట్టాడు. ఆ ఉత్తరం పెద్దవాడయిన తర్వాత చదువుకున్నాడు కోనంగి.

తల్లి మాత్రం ఎవరికో వంటచేసి బ్రతుకుతోంది. తాను బందరులో వున్నప్పుడే తన్నెప్పుడూ వంట ఇంటిలోకి రానిచ్చేది కాదు. ఎప్పుడూ ఆపేక్షగా పిలిచేదికాదు. "కోనంగి" అని మాత్రం పిలిచేది. కోనంగి "అమ్మా" అని పిలిస్తే మొహం ముడుచుకునేది. నాలుగురోజులు "అమ్మా" అని పిలవకుండా వుంటే యాధాలాపంగా అన్నట్లు "నాన్నా" అని పలుకరించేది. అప్పు"డమ్మా" అని కోనంగి పిలిచేవాడు.

కోనంగి పంపించిన డబ్బు ఆమె కోనంగి కోసమే దాస్తున్నానని రాసింది. ఆమెను ఆమె కులంవారే వంటలక్కగా పెట్టుకున్నారు. అగ్ని హోత్రంలాంటి మనిషని వారు నమ్మినారు. ఆమె కొడుకు ఆమెను చిన్నతనంలో పెళ్ళిచేసుకున్న భర్తకు పుట్టలేదని వారికేం తెలుసు?

తాను అలాంటి చరిత్ర కలవాడు. తనకు కావలసిన వారింకెవరు? తల్లి బంధువులు ఎవ్వరూ ఎప్పుడూ రాలేదు. ఈవిడ విధవయై బిడ్డను కన్నది. అందుకని వారెవ్వరూ ఈమెతో సంబంధము పెట్టుకోలేదు. భర్త వంక వారితో ఆవి డే సంబంధము పెట్టుకోలేదు. తన్ను కన్నతండ్రి వంక వారికి తాను బంధువన్న సంగతే తెలియదు.

ఈలా ఒంటివాడై లోకంలో నిలబడ్డ తాను సర్వసంఘ స్వతంత్రుడు. తన జీవితానికి తానే కర్త. ఇంక తనతో సంబంధం కలవాళ్ళు తన స్నేహితులు. ఇంతకన్న అనువైన జీవితంగల పురుషుడు లోకంలో ఎవరు? తనకున్న పని తాను చేయడానికి ఇంకెవరున్నారు?

## సప్తమ పథం

# ఏ దారి?

**27**వ డిశంబరు 1940 సంవత్సరంలో సినీమా పూర్తి అయింది. సినీమా కంపెనీ జీతం కోనంగికి 3000/-లు గిట్టినాయి. కోనంగి భాగ్యవంతుడయ్యాడు. అతనికి నాయికగా నటించిన సినీమాతారకు రు.10,000/-లు జీతము దొరికింది. అందుకు అతనికిని సంతోషమేకాని ఏమీ విచారంలేదు.

తనకు సినీమా ఇంతటితో సరి అనుకున్నాడు. తాను మంచి అభినయవేత్త కాక కాదు. వీరి బొమ్మ చూచి, ఒక డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీ వారు వెంటనే ఆ చిత్రాన్ని నాలుగున్నర లక్షల రూపాయలకు కొన్నారు. పత్రికలన్నీ కోనంగి పాటకూ, అభినయానికి ఎంతో మెచ్చుకున్నాయి.

ఆంధ్రపత్రిక:

"దుక్కిటెద్దులు" చిత్రం చాలా బాగా ఉన్నది. ఇంతవరకూ తెలుగు చిత్రాలలో ఇంత అద్భుతమైన చిత్రం రాలేదని మేము చెప్పగలం. కథ చక్కగా నడిచింది. కథ సంవిధానంలో, నడకలో ఒక విశిష్టత పైచిత్రంలో ఉంది.

తారలలో నాయకుడూ, నాయికా చక్కగా నటించారు. మొదటి బహుమానం నాయకుడుగా అభినయించిన కోనంగిరావుగారిది. అక్కడక్కడ సంభాషణలో లేని హాస్యం వాచ్యాభినయంవల్ల ధ్వనింప చేసేవారు.

"గంభీరమైన విషాదపూరిత నటన, పెదవి చివరలు తిప్పడంలో, కన్నులర మూతలలో, మొగం వంచడంలో, ఒక చిరునవ్వు ప్రసరించడంలో ధ్వనింపచేశారు."

"ఇప్పుడు సాధారణ భారతీయ ఫిల్ములలో కథానాయకుల నభినయించేవారు కోనంగిరావుగారి అభినయాన్ని చూచి ఎంతో నేర్చుకోవాలి–" అలాని వ్రాసింది.

ఆంధ్రప్రభ కోనంగిని ఆకాశంకి ఎత్తివేసింది.

ఈ బొమ్మంతా చూచి, పత్రికల అభిప్రాయాలు చదివి, ఒక గొప్ప అరవ కంపెనీ వారు కోనంగికి నాయకుని వేషం యిస్తామనీ, ఇరవైవేల రూపాయలు జీతమిస్తామన్నారు. ఎంతో మోమోటము పెట్టినారు. కోనంగికి జీతం తక్కువ అనుకుంటున్నాడేమోనని, ఏదో పేరుపెట్టి ఇంకో పదివేలు ఇస్తామన్నారు.

"దుక్కిటెద్దులు" చిత్రం దేశంలో డబ్బుదోయడం సాగించింది.

కోనంగికి సినీమాలో ఉండాలన్న వాంఛ క్రిందకు జారి పడిపోయింది. తాను నాయకుడుగా అభినయించే రోజులలో, నాయికవేషం వేసిన అమ్మాయి–అసలు పేరు వేదమ్మాళ్. మన కంపెనీవారు ఆమెకు మిస్ వాణి అని పేరు పెట్టినారు.

వాణీదేవి కోనంగిని గాఢంగా వాంఛించింది. ఆ విషయం మొదటి నుండి అతనికి తెలుసు. అదీకాక చిత్రంతీయడం సాగినది. ఒకనాడు ఆమె ఇతరులకు తెలియకుండా, ఇతరులు వినిపించుకోకుండా "రేపు మా ఇంటికి రండి, రేపు సాయంకాలం మూడు గంటలకు ఎవరూ వుండరు" అని అన్నది.

"ఎందుకు వాణీదేవిగారూ?"

"అదేమిటంటీ అట్లా అంటారు? ఎవరన్నా భార్యను అట్లా అడుగుతారా?"

"భార్యేమిటి, భర్తేమిటి?"

"మీరు భర్తా నేను భార్యను కానా?"

"అదేమిటండోయ్, అలా అంటున్నారేమిటి?"

"మొన్న సెట్టింగులో మనం చేసుకున్న పెళ్ళిమాట?"

"అదా!" పకపక నవ్వినాడు కోనంగి, "ఆయన మీ నాన్నేనా, ఆవిడ మీ అమ్మేనా?"

"అలాగే మీరు ఒప్పుకుంటే?"

"నేను ఒప్పుకునేదేమిటి వాణీదేవీ? నువ్వు భార్యగా, నేను నీ భర్తగా లోకం అంతా చాటింపయిపోతుందిలే, బొమ్మ విడుదల కాగానే!"

"అది అలా ఉంచండి! నేను మిమ్మల్ని మూడంటే మూడే ప్రశ్నలడుగుతాను. దాచక, అబద్ధమాడక జవాబులు చెప్పండి."

"అలాగే! నాకు తెలిసివుంటే చెప్తాను. అవి ఇంకోరికి సంబంధించిన రహస్యాలైతే చెప్పను."

"ఒకటి: మీరు నన్ను ప్రేమిస్తున్నారా, లేదా?"

"ఆ ప్రశ్న నీ కెందుకు కలిగింది? నాటకంలో ప్రేమ నిజమైన ప్రేమ అనుకున్నారా మీరు?"

"ఒకమాటు 'మీరు' ఒకసారి 'నువ్వు' మార్చకండి. నన్ను 'నువ్వూ' అంటేనే మంచిది."

"నన్ను గౌరవంచేస్తూ మాట్లాడితే నేనూ అలాగే మాట్లాడుతున్నాను."

"నేను భార్యను. నన్ను మీరు గౌరవం చేయకూడదు."

"మళ్ళీ భార్య అంటారేమిటి? సరే కానియ్యి. నువ్వే అంటాను. అంతమాత్రంవల్ల నేను మొద్దు తలకాయను కానులే. ఇంక ఏమిటీ?"

"నా మొదటి ప్రశ్నకి జవాబియ్యరేం?"

"మొదటి ప్రశ్నా? నీ మొదటి ప్రశ్నా? ఏమిటదీ? అవునవును. నేను నిన్ను ప్రేమిస్తున్నానా లేదా అని కాదూ? ఉహూం? ఏమీ ప్రేమించడం లేదు."

"అయితే ఈ ప్రశ్న విషయంలో కొంత చర్చ చేయాలి."

"ఏమి టా చర్చ?"

"ఏముంది! ఎందుకు ప్రేమించడంలేదు. చేయకపోతే, ఇప్పటికి నాల్గయిదు నెలలనుంచి ప్రేమిస్తున్నట్లు ఏలా అభినయం చేయగలిగినారు? మొట్టమొదట నన్ను ప్రేమించటంలేదని నాకు స్పష్టంగా తెలిసింది. అప్పటి మీ అభినయం అర్థమయింది నాకు."

"తర్వాత అంతే! మొదట అభినయం చేయడం నాకు చేతకాదు, తర్వాత చేయగలిగాను. అదే తేడా!"

"ఆబద్ధాలాడకండి! ఈ విషయం అంతా మా ఇంటిదగ్గిర చర్చించు కుందాం రండి!"

ఆ బాలిక ఇంటికి ఎలాగో తాను వెళ్ళడమూ, అక్కడ ఆ అమ్మాయి అప్సరసలా వేషం వేసుకుని తన్ను సుడిగుండంలా కౌగిలించుకోవడమూ అయింది. అతనికి మొదట ఆశ్చర్యము, తరువాత కొంచెం రక్తం ఉడుకెత్తడమూ జరిగింది. అతడు బ్రహ్మాండముమీద ఆమె కౌగిలి వదిలించు కొని, ఎలాగో ఆమెతో వాదించి, ఆమెకు మనస్సు మార్చ ప్రయత్నం చేయడం అన్నీ కోనంగి జ్ఞాపకం తెచ్చుకొన్నాడు.

"వాణీదేవీ! నువ్వు కామవాంఛాపూరిత జన్మవు. నేను కాను. నా కామవాంఛ నా భార్యవల్లనే తీరాలి. నీ కామవాంఛ ఎవరివల్ల నైనా తీర్చుకోగలవు. అది నాకేమీ సరిపడదు."

కోనంగిరావుగారూ! ఎప్పుడూ నన్ను ఇతరులు వాంఛించడమూ, వారి కోర్కె నేను తీర్చడమూ, అందుకు వేలకువేలు వారు సమర్పించడమూ జరుగుతోంది. ఈ మధ్యనే మన కంపెనీలో ఏభైవేల రూపాయల ధనంపెట్టి డిస్ట్రిబ్యూటరుగా చేరిన నాటుకోటిసెట్టిగారు, మీతో కూడా ఎంతో చనువుగా మాటాడుతారే–ఆయన నాకు పదివేలు ఇస్తాను, నెలరోజులు తనతో ఉండమన్నారు."

"ఆ సెట్టిగారు నీ దగ్గిరా చేరారూ?"

"ఏమి లాభం? నేను ఒప్పుకోలేదు. ఆయన బ్రతిమాలాడు. డబ్బు ఎక్కువ చేస్తానన్నాడు. ఏభై వేలదాకా బేరం వృద్ధి చేశాడు.

"నువ్వు?"

"ఒప్పుకోలేదు!"

"వాడు స్త్రీ చంద్రకల రాహు రాక్షసుడు."

"కానీ నేను మీకు పదివేలు భక్తితో సమర్పించుకుంటాను. నాతో ఒక నెలరోజులు ఉండండి!"

"ఓయి వెర్రి అమ్మాయి. కాపురం చేస్తూ భర్తను భగవంతునిలా ఎంచుకుంటూ ప్రేమించే అమ్మాయిని ఎవరైనా పదివేలు ఇస్తానంటే వాళ్ళతో నెలరోజులు ఉంటుందా? నువ్వు చెట్టియారుతో ఎందుకు ఉండనన్నావు? అలాంటిది నేను నా దేవతగా నా సర్వస్వముగా ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాను. ఆ అమ్మాయి నన్ను ప్రేమిస్తోంది. ఆమే నాకు సకలైశ్వర్యమూ! ఇక నీ మాట కర్థం నాకేమి తెలుస్తుంది. చెప్పు?"

ఆ బాలిక ఏడ్చింది. తన ఒడిలో తలపెట్టుకొని. తర్వాత పాదాలు కళ్ళకద్దుకొని లోనికి వెళ్ళిపోయింది.

అప్పటినుంచి వాణీదేవి తన్నేమీ అలజడి పెట్టలేదు. చిత్రం పూర్తిఅయి చివర రోజులలో ఉపనాయకుడు వేషం వేసిన ఒక ఆంధ్ర బ్రాహ్మణ యువకునికీ ఆ బాలికకూ పెళ్ళి అని అందరకూ శుభలేఖలు వచ్చాయి.

కోనంగీ, డాక్టరుగారూ వివాహానికి వెళ్ళారు. ఆ రాత్రి సినిమా లోకం అందరకూ పెద్ద విందు. ఆ విందు సమయంలో కోనంగి కడకు ఆ అమ్మాయి వచ్చి రహస్యంగా అన్నది "మీరే నాకు గురువు! నేను వివాహం చేసుకున్నా; కాని ఎప్పటికైనా మీరు నాకొక్కసారైనా తృప్తినివ్వాలి" అని అన్నది.

"అదేమిటి పెళ్ళిచేసుకొని!"

"ఆ పెళ్ళికొడుకులో మిమ్మల్ని చూచి అతన్ని చేసుకొన్నాను. మీరు నాకు దేవతలు. ఒక్కటే ఒక్కసారి మీరు నాకు వరం ఇవ్వవలసి ఉంటుంది."

కోనంగి గుండెలో మూడుదెబ్బలు తప్పిపోయాయి.

## 2

**ఈ** దినాలలో సాంఘికంగా ఈ దారినా, ఆ దారినా అనే ప్రశ్నేలేదు. సాంఘికమైన మార్పులు వస్తున్నాయి. వాని అంతట అవి వచ్చి తీరుతాయి. వ్యక్తికి వున్న ప్రశ్న అల్లా "నేను హరిజన సేవ చేయగలనా, చేయలేనా?" అనే ప్రశ్నేగాని, చేయడం మంచిదా, కాదా అన్న సమస్య కానేకాదు. అందులో అలాంటి ప్రశ్నలుగాని, సమస్యలుగాని కోనంగి ప్రత్యుత్తర మీయవలసిన అవసరమే లేదు. అతనికి కులమే లేదు. గుడి మింగేవాడికి గుళ్ళోలింగమెంత? అని అనుకున్నాడు.

ఇంక కోనంగి యెదుట ప్రత్యక్షమైన సమస్యలు రాజకీయమైనవే. అతనికి ఇంక తిండికి కరువు లేదు. సినీమా ప్రపంచం రెండుచేతులు చాచి అతన్ని ఆహ్వానిస్తూనే ఉన్నది. కనక ఆ విషయంలో అనుమానమే లేదు.

అతడు ప్రస్తుతం సినీమా ప్రపంచంలో తిరిగి అడుగు పెట్టదలచుకోలేదు. దానికి కారణం ఆ ప్రపంచంలోవున్న కుళ్ళే! ఆ కుళ్ళు పోవడానికి ప్రయత్నం చేసేవారు లేరు. చేయడానికి తగిన సదుపాయాలూ లేవు. ఆందుకు బ్రహ్మప్రళయం అంతపనిచేస్తే ఒకటి రెండు మార్గాలు దొరుకుతాయి. కానీ ఆ మార్గాలు కోనంగికి అందనే అందవు.

ఇంక కోనంగి మనస్సంతా రాజకీయాలలో పడింది. అతనికి రెండు మార్గాలు కనిపించాయి. ఒకటి అప్పుడే తలఎత్తి బయటకు వచ్చే సామ్యవాదం. రెండవది భరతదేశం

అంతా నిండివున్న గాంధీమార్గం. మధ్యగావున్న మార్గాలు గురించి ఆలోచించ నవసరంలేదు.

ఈ మార్గాలు రెండూ తాను సినీమాలో ఉన్నంతమాత్రాన అడ్డురావు. సినీమాలో ఉన్న మనుష్యుడు తాను పతితుడు కాకుండా సంరక్షించు కుంటూ రాజకీయంగా పనిచేయవచ్చుకాదా?

ఏ ఉద్యమంలో వున్నా, మనుష్యుని శక్తులు ఎక్కువగా స్పందనం అయ్యే సమయంలో ఉత్తమ శక్తులతోపాటు హీనశక్తులూ విజృంభిస్తాయి. సంగీత విద్వాంసులలో, నాట్యవేత్తలలో, నృత్యవిద్యా విశారదులలో, చిత్రకారులలో, శిల్పులలో, కవులలో మనుజుని శక్తులన్నీ కదులుతాయి. కనుకనే వారిలో అనేకమంది పతితులౌతున్నారు.

చివరకు రాజకీయాలలోనూ ఎంత అహింసామార్గం అవలంబించినా మనుష్యుడు కదిలిపోతాడు. ఆ కదలికలో అతని పశుశక్తులు ఉబికివస్తాయి. అందుకనే మత విషయికమైన ఉత్సవాలలో, రాజకీయ ఉద్యమాలలో కళాసన్నివేశాలలో కొన్ని అసంబద్ధపు సాంఘిక వ్యతిరేక సంఘటనలు సంభవిస్తూ వుంటవి అని కోనంగి అనుకున్నాడు.

సినిమా లోకంలో ఎప్పుడూ ఎడతెగని ఉత్సాహమూ, ఎడతెగని దీక్షా, ప్రయత్నమూ, మనుష్యునిలోని ఉత్తమాధమశక్తులు రెంటినీ విజృంభింప చేస్తాయి. రాజకీయోద్యమాలలో అహింసావారమైన కాంగ్రెసు విషయంలో సత్య అహింసాది భావాలు మనుష్యుని విచ్చలవిడితనాన్ని చాలా వరకు అణచివేస్తాయి. మతోత్సవాలలో పాపభీతి అడ్డంవస్తుంది. కళోత్సవాలలో వచ్చే కళాకారులే తక్కువ.

కాని సినీమాలో అత్యంత ధనమూ, రాత్రింబవళ్ళుపనీ, పెద్దజీతాలు, గుణగణాల్నిబట్టికాక కళాశక్తి ననుసరించి ఎక్కువహెూదా, సర్వకాలోత్సవంలా కార్యక్రమమూ స్త్రీ పురుషుల్ని మహా ఝుంఝుం సంచలిత కల్లోలాలులా పై కెగయచేసి లోతుల్లోకి కూలదోస్తూ ఉంటాయి.

పాపభీతి, సాంఘికభీతి, మనుజుడే ఏర్పరచుకున్న అహింసాది నీతి నియమభీతి సినీమా ప్రపంచంలో లేవు.

ఉద్యోగానికి వచ్చి రాజకీయాలనుగూర్చి ఆలోచించే తనంత తెలివి తక్కువ వాడెవరన్నా ఉన్నాడా? ఉద్యోగమా అంటే కావలసినంత డబ్బు దొరికే ఉద్యోగం! తన్ను ప్రేమిస్తున్నది ఒక దివ్యసుందరి, బంగారపు చిలుకా, అంతకన్న తన కేమి కావాలి? తానామెను పెండ్లియాడి సినీమా ప్రపంచంలో ఏవో నాల్గురాళ్ళు సంపాదించుకుంటూ అనందంగా బ్రతుకు దారిని పోవచ్చుకాదా?

కాని ఏదో ఆవేదన, ఏదో అసంతృప్తి, ఏదో వ్యథ అతన్ని కలచి వేస్తున్నవి. దానికి ఏమి కారణం చెప్పకోగలడు? ఏమిటీ ఆవేదన? ఎందుకీ ఆవేదన?

అతనికీ తెలుసు. ఒకరకంగా ఆవేదనకు కారణం మానవుని మనస్సు యొక్క నడవడిక అని! అది అతి విచిత్రమైనది. పరిసరానువర్తిగా ఎంత ఉంటుందో, పరిసరాతీత మార్గాలు సంచరింప అంత కోరుతుంది.

ఆ మనస్సే ఎయిన్‌స్టైయిన్‌చే పరిణామవాదాన్ని కనిపెట్టింపచేసింది. బుద్ధుణ్ణి బోధివృక్షం క్రిందకు పంపించింది. నెపోలియనును రష్యాకు పంపించింది. బాపూజీచే సత్యాన్వేషణం చేయిస్తున్నది. ఫోర్డుచే నిమిషానికి రెండు వందలు గణింపచేస్తున్నది. పెరల్‌బక్కుకు నోబెలు బహుమాన మిప్పించింది.

కోనంగి అనంతలక్ష్మి కళ్ళలోతుల్లో తనదారి వెతుక్కుంటున్నాడు. అనంతలక్ష్మి కోనంగి సినీమాలో పనిచేస్తున్నంతకాలమూ బాధపడుతూనేవుంది. ఎన్నో అనుమానాలూ, ఎన్నో ఆవేదనలు కలిగినవి.

ఒకసారి కోనంగీ తానూ ఒంటిగా ఉన్నప్పుడు కోనంగి భుజంచుట్టూ చేతులు చుట్టి "ఏమండీ గురువుగారూ! మీరు సినీమాలో ఊరకే అభినయం మాత్రం చేస్తున్నారు కాదూ!" అని అడిగింది.

"ఓయి బంగారు పడుచా! కాక ఏమిటి చేస్తున్నాననుకొన్నావు?"

"నా ప్రేమలో నేను పడేవెత్తే!" అని కన్నుల నీరు తిరుగుతూ ఆమె అతని హృదయంలో మోము దాచుకుంది.

అతడామెను అతిగాఢంగా హృదయాని కదుముకొని,

"ఆత్మసామ్రాజ్ఞీ! ఏమిటి నీ వేషం! ఉత్తమ ప్రేమ ఎప్పుడూ అనుమానపడదు. నేను నీకు తగుదునా, తగనా అని లోపల ఆవేదన పడుతూంటాను కాని, నీకు ఆవేదన ఎందుకు? నా జన్మకు, జన్మ జన్మలకు నువ్వే! మన ప్రేమ చిరకాలానుగతం కాబట్టే మొదటిచూపులోనే నిన్ను నేనూ, నన్ను నీవూ ప్రేమించగలిగాము." అని ఆమెను తనివితీర ముద్దుకొన్నాడు.

అలాంటి ప్రేమదేవి తనకున్నది. ఎందుకీ ఆవేదన? ఏమి కావాలి తనకు?

డాక్టరుగారి స్నేహం ఈ ఆవేదనకు కొంత దోహదం ఇచ్చింది. ఆయన కూడా ఎప్పుడూ ఏదో మనస్సులో వెదుక్కుంటూ ఉంటాడు.

సూర్యకుటుంబమూ, సర్వతారాకుటుంబాలూ అంతులేని ఈ విశ్వంలో దేనినో వెదుక్కుంటూ వెడుతూ వుంటాయి. అలాగే మనుష్యుడు ఎడతెగని అసంతృప్తిచేత అలా ఎక్కడికో ఎడతెగని ప్రయాణం చేస్తూనే ఉంటాడని డాక్టరుగారి వాదన.

"నువ్వు ప్రాపంచికమైన సుఖాలకోసం పరిశోధిస్తూ ఎడతెగని ప్రయాణం చేస్తావు. లేదూ మహాత్మునిలా దేహవాంఛలు చంపి, ఏవో మానసికమైన వాంఛలకై, అహింసా సత్యాన్వేషణలు మనోపథంలో పరిశోధిస్తూ ఎడతెగని ప్రయాణం చేస్తావు" అని డాక్టరన్నాడు.

## 3

డాక్టరుగారన్న మాటలకు కోనంగి తల ఊపాడు. కాని అతని అనుమానాలు అతడే తీర్చుకోవాలి! ఇతరులు ఏమి చెప్పగలరు? కుడిచి, కూర్చుని రాజకీయాలలో వేలుపెట్టేవారు వేరు, కావాలని తమ జీవితాలు దేశానికి అర్పించే రాజకీయ సేవకులు వేరు.

అందులో ఈ మహాత్ముడు అతి విచిత్రమైన పురుషుడు. ఏ కొద్దిమందిలోనో అహింసా వాదమున్నది. ప్రాచ్యదేశములోని మహర్షులూ, పాశ్చాత్యదేశాలలో వేదాంతులూ అహింసావాదులు. ఎమర్సన్, థోర్యూ, రస్కిన్, టాల్‌స్టాయి మొదలయినవారూ, కొంతమంది మతోద్యోగులూ, అహింసావాదులు. కాని చాలామంది అహింసావాదాన్ని పాక్షికంగా చూడగలరు, సర్వతోముఖంగా చూడలేరు.

అహింస బీదవాణ్ణీ, కష్టజీవినీ కరుణతో చూడ్డంలో ఉంది. అంతే! తనకూ, తన వర్గానికీ, తన జాతికీ ఇతరుల సంపత్తును తెచ్చుకోడంలో అహింసలేదు. అదేకాదా మేజర్ బార్బరాలో బెర్నార్డుషా మహాకవి తెలిపిన విషయం.

ప్రాచ్యదేశాలలో మహర్షులు అహింసావాదాన్ని, హింసాపూరితమైన వస్తువులను, భావాలను వదలివేయడంలో చూపించారు. కాని ప్రపంచాన్ని ఎదుర్కొని ప్రపంచంతో భాగస్థులై అహింసను ఆచరించేది ఒక్క బాపూజీయే.

రష్యావారు అహింసావాదాన్ని హింసతో నెలకొల్పుతున్నారు. ఆ ప్రయత్నంలోనే వున్నారు.

ఆశయానికి వెళ్ళడం ఆశయ స్వరూపమైన దారినా? లేక ఏదారినైనా సరేనా?

ఇదీ కోనంగికి తగిలిన పెద్ద సమస్య. గాంధీమహాత్ముని గురించిన గ్రంథాలు చదువుతోంటే అహింసా మార్గమంత ఉత్తమమైన మార్గం లేదనుకుంటాడు. తన స్నేహితుడు డాక్టరుగారు చదవమని యిచ్చిన గ్రంథాలు చదువుతోంటే రష్యామార్గమంత ఉత్తమమార్గ మింకోటి లేదనుకుంటాడు.

జర్మనీ వాళ్ళే దేశాలన్నిటికీ రక్ష అనుకుంటాడు మెయిన్ కాంప్ చదువుతూ. కాని వెంటనే నాజీఇజం – సామ్రాజ్యవాద, సామ్రాజ్యవాద సంఘర్షణ జనితమైన పాశ్చాత్య యాదవకుల ముసలం అని అనుకుంటాడు.

లోకంలో వున్న అన్ని ఆవేదనలకూ, బాధలకూ, కష్టాలకూ, బీదతనానికీ, చలికీ, ఆకలికీ, ఎండిపోయే వాంఛలకూ, అఖండ నిస్పృహకూ ఏడుగడ రష్యావారి సామ్యవాదమే అని అనుకుంటాడు. పాశ్చాత్యుల ప్రజా ప్రభుత్వవాదం (డెమోక్రసీ) చెప్పినట్లు వ్యక్తి స్వాతంత్ర్యమే ప్రపంచ రక్షేమో, అది సామ్యవాదమా అని అనుమానిస్తాడు.

ఇంగ్లండులోని ప్రజాపాలన విధానంగాని అమెరికాలోని ప్రజాస్వామ్య విధానంగాని, ఫ్రాంసు వగైరాలలోని ప్రజారాజ్య విధానాలు గాని ఆ యా దేశాలకు ఏమి శాంతి చేకూర్చాయి? అని ప్రశ్నించుకుంటాడు.

అనంతలక్ష్మి ఇంటరు మొదటితరగతిలో కృతార్థురాలైంది. ఇంగ్లీషులో, తెలుగులో యూనివర్శిటీ కంతకూ మొదటిగా రావడంవల్ల రెండు బంగారు పతకాలు బహుమానాలు అందుకుంది.

కోనంగి తన్ను తయారుచేసిన విధానంవల్ల అనంతలక్ష్మికి బహుమానాలు వచ్చాయి. పాఠాలన్నీ అద్భుతంగా బోధించడమే కాకుండా, పరీక్షల ముందు బాగా పరిశీలనచేసి ఈ ప్రశ్నలు వచ్చి తీరుతాయి అని, ప్రశ్న పత్రాలు తయారుచేసి వానికి చక్కని జవాబులు వ్రాయించి తన్ను అద్భుతంగా సిద్ధంచేశారు.

నూటికి ఎనభైవంతులు అతను వస్తాయని అంచనా వేసిన ప్రశ్నలే వచ్చాయి. తక్కినవి ఆమెకు వచ్చును.

పరీక్షలు తెలిసినరోజున కోనంగి సినిమా తయారులో నిమగ్నుడై ఉన్నాడు. యూనివర్సిటీ నుంచి వెంటనే కోనంగి అభినయించే స్టూడియోకు కారుపై వెళ్ళింది అనంతం.

కోనంగి వేషంమీద ఉన్నాడు. సెట్టుమీద అభినయం పూర్తికాగానే అనంతలక్ష్మిని కలుసుకుని "మొదటి తరగతా, రెండవ తరగతా?" అని అడిగాడు.

"మొదటి తరగతి గురువుగారూ! నాకు ఇంగ్లీషులో, తెలుగులో విశ్వవిద్యాలయాని కంతకూ మొదటి బహుమానం!"

"అసి పిల్లా కొట్టావూ! నీకు నా గాఢ అభినందనాలు. నువ్వు ఇంటి దగ్గర ఉండు. నావంతు ఒక అరగంటలో పూర్తిచేసుకొని, తక్కినవి రాత్రికి ఏర్పాటు చేసుకొని మీ ఇంటికివచ్చి వాలుతా! మనం సినిమా, టీ పార్టీ, సముద్రం షికారు, మీ ఇంటి దగ్గర విందూ, నేను నీకు అద్భుతమైన బహుమతిన్నీ!"

"నేనే మీకు చక్కని బహుమతి ఇవ్వాలి గురువుగారూ!"

"నువ్వు ఇల్లా పదిసార్లు వస్తూవుంటే, వీళ్ళందరూ ఏదో అనుకుంటున్నారు."

"వహ్వా! అనుకుంటున్నారని తప్పక అనుకుంటున్నంతా చేస్తారా?"

"ఛా!ఛా!"

"అయితే మీకు భయం ఎందుకు గురువుగారూ? అనుకుంటున్నారని ఉత్తమ కార్యాలు చేయడం మానుతావా లక్ష్మీ! అని తమరేగా నన్ను ఓ సారి కూకలేశారు?"

"అమ్మో! ఇప్పుడే ఇంక నన్ను జాడిస్తున్నావు, రేపు పెళ్ళి అయితే?"

"వట్టి జాడింపులా? నాలుగు తగిలింపులు కూడా!"

"ఏమిటా తగిలింపులు?"

"బుగ్గమీద?"

"లెంపకాయలా"

"పెదవులతో!"

"ఓడిపోయాను లక్ష్మీ!"

"నేను వెదుతున్నాను కృష్ణా!"

## 4

రాజకీయాలలో చేరాలని కోనంగికి ఉబలాటం కలుగుతోంది. దానివల్ల జైళ్ళూ, కాల్పులూ, లాఠీచార్జీలు తనపై ప్రయోగం కావచ్చు! అందువల్ల అతడు భయపడడంలేదు. కాని బాపూజీ శిష్యపరమాణువులా అన్నా - నిర్మాణ కార్యక్రమం అనీ, హరిజనసేవ అనీ, రాజకీయ ఉపన్యాసాలనీ, బ్రహ్మచర్యమనీ లేకుండా, వట్టి రాజకీయవాదిగా తయారయి చివరకు ఏ కార్యదర్శి పదవో స్వీకరించి వచ్చే నాయకులకూ, వెళ్ళే నాయకులకూ సేవ చేస్తూ ఉండడం అంటే స్వతంత్రవాది అయిన కోనంగికి యిష్టంలేక పోయింది.

ఒకసారి శాస్త్రజ్ఞానం వృద్ధిచేసుకొని పరిశోధన సలుపుతూ కాలక్షేపం చేద్దామా అని బుద్ధిపుట్టుంది.

ఒకసారి ఏ పారిశ్రామిక సంస్థలోనన్నా చేరి ఆ పరిశ్రమలో లోట్లు దిద్ది కొత్తమార్గాలు కనిపెట్టి ఈ యుద్ధంరోజుల్లో లోకాని కెందుకు సహాయం చేయకూడదు? అనుకుంటాడు.

డాక్టరుగారి ఇంట్లోనే మకాం. డాక్టరుగారికీ కోనంగికీ దినదినమూ వాదన అవుతోంది. "నువ్వు కమ్యూనిస్టువాదివి ఎందుకు కాకూడదు?" అని డాక్టరుగారి వాదం. "నేను కమ్యూనిస్టు నెందుకవ్వాలి?" అని కోనంగి వాదం.

"ప్రపంచంలో ఉన్న సంపదపై అందరికీ సమాన హక్కంటావు. వ్యక్తిగతోద్యమాలు ఉండకూడదంటావు. ఏ మనుజుడూ జన్మవల్ల తండ్రి అస్తికి వారసుడైగాని, ఎవరి ఆస్తికైనా వారసుడైకాని సంపన్నుడు కాగూడదంటావు. మూఢనమ్మకాలు పనికిరావంటావు. కులంతేడాలు, మతంతేడాలు, ఉద్యోగ వివాహ భోజన సాంఘిక కళాజీవనాలలో ఉండకూడదంటావు. ఇంక నువ్వు సామ్యవాదివి కావడానికి అభ్యంతరం ఏమిటంట?"

"డాక్టరూ! నీవాదన నీకైనా నచ్చిందా? మహాత్ముని వాదనలో నీవు కోరినవన్నీ ఉన్నాయి కాని మీ మార్గం వేరు, వారి మార్గం వేరు."

"నీ మార్గం?"

"నేను ఏ మార్గమూ నిర్ణయించుకోలేదు."

"అహింసామార్గాలవల్ల ఇవన్నీ ఎప్పటికీ రావు."

"రష్యాలో సంపూర్ణంగా మార్క్సిజం వచ్చిందా?"

"చాలవరకు వచ్చింది."

"ఆ మిగిలి ఉన్నదే ముఖ్యం. ఆ వచ్చినవన్నీ సులభంగా గాంధీజీ మార్గంవల్లా వస్తాయి. కాని రష్యాలో వచ్చిన సామ్యవాద జీవితం బలవంతంగా వచ్చింది. బలవంతంగా ఎంతకాలం నిలుస్తుంది."

"నమ్మకంతో వచ్చింది మాత్రం అనంతంగా ఉండిపోతుందా? బౌద్ధమతంలో ప్రజలు నమ్మే చేరారు. తర్వాత ఏమయింది.?"

"అవును బాబూ! నమ్మి చేరినా ఒకటే బలవంతంగా చేరిన ఒకటే. ఏ విధానమైనా మారిపోతూనే ఉంటుంది. అలాంటప్పుడు ముందుకు వెళ్ళే దారి ఉత్తమమయిం దయితే మరీ మంచిదికాదా?"

"ఉత్తమం ఏమిటి, అధమం ఏమిటి? దేంతో కొలుస్తావు?"

"అన్నింటికీ ఏ కొలతబద్దలో, ఏ త్రాసులో, ఏ కొలత గిన్నెలో ఉన్నాయి సామ్యవాద స్థితికి రావాలంటే ఉత్తమాధమ మార్గాలున్నాయా లేవా?"

"అవి నైతికం కావుగా?"

"ప్రాపంచికంవే అనుకో."

"అనుకున్నా!"

"ఏవైతేనేమి, ప్రాపంచిక వాదనకు అవి ఉత్తమమే."

"నైతికవాద మేమిటి ముసలమ్మవాదం?"

"ప్రాపంచికవాద మేమిటి చంటిబిడ్డలవాదం!"

ఈ సంభాషణవల్ల కోనంగి నవ్వడం, డాక్టరు నవ్వడమూ! అంతటితో అఖరయ్యేది.

కాని కోనంగి మాత్రం డాక్టరు వాదనవల్ల సామ్యవాద గ్రంథాలు పరిశీలింపక వదలలేదు.

సామ్యవాదులు జర్మనీతో రష్యా స్నేహం చేయడం అద్భుతం అన్నారు. మంచి ఎత్తన్నారు. కాంగ్రెసువాదులు మాకా గొడవలు అక్కరలేదు. మాతో ఆలోచించకుండా, దేశంలో ఉన్న ప్రభుత్వాలతో ఆలోచించకుండా హిందూదేశాన్ని యుద్ధంలో దింపడం అన్యాయం అన్నారు. హిందూదేశంలో వట్టి బలప్రయోగంవల్ల రాజ్యం చేస్తూన్న బ్రిటిషువారు ప్రజాప్రతినిధుల సలహా సంప్రదింపులు లేకుండా ఎవ్వరిమీద నైతేనేమి యుద్ధంలోకి దింపడం నాజీపద్ధతే అన్నారు.

ప్రభుత్వం సామ్యవాదాన్ని ఒప్పుకోలేదు. సామ్యవాద సంస్థలేవీ ఒప్పుకోలేదు. కాబట్టి సామ్యవాదులు కాంగ్రెసులో ఉండి కొందరూ, కాంగ్రెసు బయట ఉండి కొందరూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తూ ఉండిరి.

ప్రభుత్వం సామ్యవాదంపై కత్తిగట్టి అనేకమందిని నిర్బంధంలో ఉంచింది. కేసులుపెట్టి శిక్షించి జైలుకు పంపింది. కొందరు కమ్యూనిస్టులు విచారణ సమయంలోనూ, కొందరు జైళ్ళ నుండిన్నీ పారిపోయి తమ ఉద్యమం సాగిస్తూ ఉండిరి. వారిని పట్టుకొన్నవారికి బహుమానాలు ప్రచురించారు ప్రభుత్వంవారు.

కాం(గెసువారు మం(తివర్గాలు మానివేశారు. కేం(ద శాసనసభలోంచి వచ్చివేశారు.

మళ్ళీ దేశంలో ఉద్యమం ఏదైనా గాంధీమహాత్ముడు నడుపుతాడా అని అలజడి పుట్టింది.

1905-వ సంవత్సరం (ప్రాంతాలలో బెంగాలు విభజన రోజులలో, దేశం అంతటా పాకిపోయిన విప్లవ ఉద్యమం ఫలితంగా ఎంత మందో రహస్య సంఘాలుగా చేరి దారులు దోచి, బ్యాంకులు దోచి ధనం సంపాదించడం, తెల్లవారిని హతంచేయడం, ఒక్కసారిగా దేశాన్ని (ప్రభుత్వంపై తిరుగుబాటు చేయించడానికై కు(టలు సలపడం (ప్రారంభించారు.

విదేశాలలో అచ్చువేయబడిన రాజ(ద్రోహపు కరప(తాలు, పుస్తకాలు, అనేక మార్గాల దేశం అంతా వచ్చి పడుతూ ఉండేవి.

అవి చదువుకొని యువకులు మండిపోతూ ఉండేవారు.

(ప్రభుత్వం వారికి ఎన్నో రహస్యాలు తెలిసి కు(టలుపెట్టి ఎంత మందినో అండమానుకు పంపారు. తిలకును మాండలేలో నిర్బంధించారు.

అలాగే నేడు సామ్యవాదులు చేయదలచుకొన్నారని (ప్రభుత్వం అనుమానడింది.

## ⑤

శ్రీ మహాత్మాగాంధీ సత్యా(గహం (ప్రారంభించడం ఏమిటి? చౌరీ చౌరాలో అల్లరులు జరిగి, ఒక పోలీసుస్టేషను అంటించివేశారు. దానితో గాంధీజీ సత్యా(గహోద్యమం మానివేశారు. వారిపై (ప్రభుత్వం వారు కేసుపెట్టితే ఆరుఏళ్ళు కారాగారవాసం శిక్ష విధించారు.

దాసుగారు స్వరాజ్యపక్షం స్థాపించారు. కాం(గెసు రెండు చీలికలైంది. ఖైదులో గాంధీగారికి కడుపులో అపెండిక్సుకు శస్త్రచికిత్స జరిగింది. వారు (బతికారు. వారికి విడుదల అయింది. అంతకు ముందే గయా కాం(గెసు, తరువాత బెల్గాం కాం(గెసు అయ్యాయి.

అహింసావాదం నెమ్మదిగా బలం సమకూర్చుకుంటూ వుండగా 1930 మార్చిలో గాంధీజీ ఉప్పుసత్యా(గహం (ప్రారంభించి దండయా(త గావించారు. అప్పటికి కోనంగికి పదమూడేళ్ళు.

దేశం అంతా ఉత్సాహం నిండింది. కోనంగి వెళ్ళి బందరు దగ్గర హంసలదీవిలో ఉప్పుసత్యా(గహం చేశాడు. దేశం అంతా సము(ద్రం దగ్గర ఉప్పుసత్యా(గహమే!

అక్కడ నుంచి పోలీసు అ(క్రమచర్యలు (ప్రారంభం అయ్యాయి. లక్షలకొలది జైళ్ళకు పోయారు. లాఠీ (ప్రయోగాలు, కాల్పులూను. కాని భారతీయులు చిరునవ్వుతో దెబ్బలు తింటూ, (ప్రాణాలు అర్పిస్తూ, జైళ్ళకు వెడుతూ మహోత్తమ అహింసాశక్తిని (ప్రదర్శించారు. గాంధీమహాత్ముని కారాగారంలో ఉంచారు. చివరకు హరిజన (ప్రశ్నపై బాపూజీ నిరశన (వ్రతం చేయగా మహాత్మాగాంధీని వదిలారు. హరిజన సమస్య పరిష్కారం అయింది.

గాంధీ ఇర్విను ఒడంబడిక, గాంధీజీ రెండవ రౌండుటేబిలు సమావేశానికి (ప్రయాణం జరిగాయి. రౌండుటేబిలు సభ నిష్ఫలం అయింది. గాంధీజీని హిందూదేశంలో అడుగుపెట్టగానే కారాగారవాసిని చేశారు. 1930 కన్న ఈ 1932 సంవత్సరంలో (ప్రభుత్వం మరీ తీ(వ్రంగా కాం(గెసుపై దాడి సలిపింది. తిరిగి గాంధీజీ విడుదల అవడం, హరిజన సమస్యపై దేశసంచారం చేయడం జరిగింది.

1935 ప్రభుత్వం వారి భారతపరిపాలనా శాసనం కొత్తది వచ్చింది. కాంగ్రెసువారు ఎన్నికలలో పాల్గొని అఖండ విజయం పొందారు. కాంగ్రెసు మంత్రివర్గాలు వచ్చి చక్కగా పనిచేస్తుండగా యుద్ధంరావడం, కాంగ్రెసువారు ప్రభుత్వంతో అసహకారం చేయడం జరిగాయి.

ఇంతవరకు కోనంగి దేశంలోని జాతీయశక్తుల విజృంభణ ఒక్కసారిగా మనస్సున జ్ఞప్తికి తెచ్చుకున్నాడు.

రాజకీయంగా మహోత్తమస్థితికి రావడానికి గాంధీమార్గమే ఉత్తమోత్తమమని ఒకవైపు వాదన. వేరొకవైపు లోకంలో ఇది ఎక్కడా లేదని సామ్యవాద వాదన. ప్రపంచం అంతా హింసాపూరితమై వుంటే నీ అహింస ఏమి చేస్తుందయ్యా అని డాక్టరు గారంటారు.

అహింస భగవద్ధర్మమని అతడు ఏలా ఒప్పుకొంటాడు? డాక్టరు వాదనలో మహాత్ముడు దేశాన్ని మేలుకొలుపుతూ నూతన చైతన్యం ఇవ్వడం మొదలయిన మహోత్తమ కార్యాలు చేశాడట. అందుకు సందేహం లేదట. కాని ఇకముందు కాంగ్రెసు కమ్యూనిస్టు పంథా అనుసరించాలట.

కమ్యూనిస్టులలో నాయకుడు పి.సి. జోషి. అతడూ, బ్రాడ్లీ, స్ప్రాట్ మొదలయినవారు అంతా కలిసి పెద్ద కుట్రచేశారు. దాన్ని ప్రభుత్వం వారు పట్టుకుని పెద్ద కేసుపెట్టారు. దాన్నే మీరటు కుట్రకేసు అని పిలుస్తారు. అందులో జోషి నాలుగేళ్ళు ఖయిదు అనుభవించాడు.

కాంగ్రెసు చప్పబడినట్లు తోచినప్పుడు బెంగాలులో విప్లవవాదం ఎక్కువైంది. పంజాబులోనూ అది ఎక్కువగా వ్యాపించింది. అప్పుడే భగత్‌సింగ్, రాజగురు, శుకదేవు మొదలయిన యువకులు పెద్ద కుట్రసలిపి హిందూ స్వతంత్ర ప్రభుత్వసేన అని పేరు పెట్టుకొని ఉత్తరాలు పంపడం, ప్రకటనలు గోడలకు అంటించడం మొదలయిన పనులు సాగించారు. వైస్రాయిగారి రయిలుపైనే డయినమైటు ఉపయోగించి పేల్చివేద్దామను కున్నారు. అందరూ పట్టుబడ్డారు.

అప్పుడే రాజకీయఖయిదీలకు సరియైన గౌరవము కారాగారాలలో జరగటంలేదని కలకత్తాలో జితీనుదాసు డెబ్బదిఏడురోజులు నిరశనవ్రతం చేసి ప్రాణాలు బలిచేశాడు. భగత్‌సింగు, శుకదేవు, రాజగురులను ఉరితీశారు. దత్తాను దయదలచి వదలివేశారు.

ఈలా యువకులలో స్వాతంత్ర్య వాంఛలు ప్రబలమై అనేక రీతుల ప్రవహించాయి. సాంఘికవాదులు వేరే ఒక సంస్థగా ఏర్పడ్డారు. వారికి నరేంద్రదేవు, జయప్రకాశ్ నారాయణ, మాసాని, మెహరల్లీ మొదలయిన వారు నాయకులుగా ఉండిరి.

ఆ రోజులలోను డాక్టరు రెడ్డికూడా సామ్యవాది అయి కాంగ్రెసులోనే వుండి పనిచేస్తూ ఉండినాడు. అనేకమంది యువకులవలె కాక, రెడ్డి చాలా జాగ్రత్తగా లోకానికి తన చరిత్ర ఏ మాత్రమూ తెలియనీయకుండా పనిచేస్తూ రహస్యము చక్కగా దాచుకొని ఉండేవాడు.

డాక్టరు ఉచితంగా కూలినాలి జనులకూ, రిక్షావారికి, బళ్ళులాగే వారికి, మిల్లుకూలీలకూ, సామానులు మోసేవారికి వైద్యం చేస్తూ ఉండెను. వైద్యానికి వచ్చినప్పుడే వారితో రాజకీయాలు మాట్లాడుతూ ఉండేవాడు. ఎన్నో కూలి సంఘాలు ఏర్పరచాడు. జట్కావారి సంఘం, రిక్షావారి సంఘం, బళ్ళవారి సంఘం ఏర్పాటు చేయించాడు.

మిల్లులలో, రైల్వేలో, ట్రాంవే, బస్సువారలలో ఇదివరకే సంఘాలు ఏర్పడ్డాయి. ఆ యా సంఘాలకు గుప్తదానాలు చేసేవాడు.

వైద్యంలో నిపుణు డవటంచేత అతడు పట్టిన కేసులు సాధారణంగా నెగ్గి తీరేవి. అందుచేత కూలిప్రజలకు అతడు దేవుడనే భావం.

అతనికి పెద్దవారితోనూ సహవాసం ఉండేది. పైకి కాంగ్రెసువాది. కాంగ్రెసు సంఘాలలో సభ్యుడు తమిళనాడు కాంగ్రెసు సభ్యుడుగానే ఉండేవాడు. తమిళంలో పండితుడు. కాని మదరాసులో తన వైద్య జీవితం ప్రారంభించినప్పటి నుండి తెలుగు బాగా నేర్చుకొని తెలుగుభాషలోనూ పండితుడయ్యాడు.

"డాక్టరూ, నువ్వు తెలుగువాడవయ్యా. అరవవాళ్ళంటే యెక్కువ మొగ్గుతా వేమిటి?" అని కోనంగి ప్రశ్నవేశాడు.

"నేను అరవవాణ్ణే! అరవదేశంలో పుట్టాను!"

"మంచిపని చేశావు. పొరపాటున ఏఆఫ్రికాలోనో పుట్టితే నీగ్రోవాడివై పోదువన్నమాట!"

"ఆ నైగర్ దేశంలో కాపురం చేసే తెలుగు దంపతులకు పుట్టి ఉంటే నీగ్రోనైపోదును."

"ఏ అడవిలో కోతులున్న ప్రదేశంలోనో పుట్టి వుంటే కోతివైపోదువు."

"ఆంధ్రులందరూ కోతులేటగా?"

"అరవలు కొండముచ్చులు!"

"కన్నడులు?"

"లాంగూరులు?"

## ⑥

**కొం**దరి మనుష్యులకు రాజకీయాలు మహాఇష్టం అంటాడు కోనంగి. వారిలో రెండు జాతులున్నా యంటాడు.

ఒక జాతివారు తమ వృత్తికీ, మామూలు పనులకూ భంగం లేకుండా, రాజకీయాలవల్ల తమకు ఏ విధమయినటువంటి ఇబ్బంది లేకుండా రాజకీయాలు, తప్ప ఇంకోటి వినరు, కనరు, చదవరు, మాట్లాడరు, ఊహించరు, నిద్రపోరు, లేవరు, తినరు, నమలరు, మింగరు, ఆరగించికోరు, వాదించరు.

ఇంకో రకంవారికి రాజకీయ జీవితం ఉంటుంది. జాగ్రత్త ఎక్కువ. జిల్లాబోర్డు రాజకీయాలు విద్యాసంస్థల రాజకీయాలు, గ్రంథాలయ రాజకీయాలు, కలెక్టర్లు మొదలయిన ప్రభుత్వోద్యోగుల్నీ, మహాత్మాజీ మొదలయిన జాతీయ నాయకుల్నీ కలుసుకుంటూ ఉంటారు. ఘాటుకాని రాజకీయ ఉద్యమాలకు చందాలిస్తారు. ఈ జాతిలోవారే ఆంధ్ర మహాసభ కార్యకర్తలూ నాయకులూను.

కాంగ్రెసులోనో కమ్యూనిస్టులలోనో చేరి జీవితాలు దేశానికి అర్పించేవారు రాజకీయ మానవులు కారట. వారు వట్టి రాజకీయ రూపాలే అని కోనంగి వాదన.

తాను మాత్రం ఏం కావాలి! స్వరాజ్యమో సామ్యరాజ్యమో వచ్చేవరకూ, ప్రజలందరూ కాకపోయినా తనబోటి పెద్దలు మరి ఏ ఇతర దేశాభ్యుదయ కార్యమూ చేయలేనివారు మాత్రం తప్పక రాజకీయాలలో చేరాలట.

డాక్టరుతోపాటు కోనంగి కూడా మిల్లుకూలీల సమావేశాలకి, ఇతరకూలీల సమావేశాలకి వెళ్ళడం సాగించాడు. ఆ సమావేశాలలో కోనంగి అప్పుడప్పుడు ఎంతో తియ్యగా మాట్లాడేవాడు. డాక్టరే ప్రోత్సాహం!

"కామ్రేడులారా! మీరంతా బట్టలు నేస్తున్నారు. మేమంతా కట్టుకుంటున్నాము. ఈ సంఘం ఒక మహాసంఘం. ఈ సంఘంలో ఈ వ్యక్తీ ఆ వ్యక్తీ అనేది కాకుండా! సంఘమే ఒక వ్యక్తీ. ఈ వ్యక్తి ఒక కోటితలలూ రెండు కోట్లచొప్పున కళ్ళు, చేతులు, కాళ్ళు, పదికోట్ల చేతివేళ్ళు, పదికోట్ల కాలివేళ్ళు, కోటి కడుపులు, ముప్ఫై రెండుకోట్లపళ్ళూ, పదిహేను కోట్ల కోట్ల తల వెంట్రుకలు కలది.

"ఇంతటి మహావ్యక్తిని ఈ మిల్లు యజమానులనే ఖామందు ఒక చిన్నగిన్నెలో పలచని గంజి యిదేరా నీ తిండి అని పోసి తాగమంటున్నాడు. ఈ మహావ్యక్తే లేకపోతే ప్రపంచంలో గుడ్డాలేదు, గుడ్డలో పోగేలేదు. అప్పుడే ఖద్దరువాళ్ళు తప్ప తక్కినవారు దిగంబరావ్రతం పుచ్చుకోవాలి కదా! కాబట్టి మిల్లు కూలీలనే ఈ మహావ్యక్తికి సరియైన అన్నం, కట్టుగుడ్డ, వుండ ఇల్లు ఇవ్వాలి. ఒకటేమిటి అన్నీ ఇవ్వాలి.

"మిల్లే ఒక బ్యాంకు అనుకుంటే, మిల్లు యజమానుదారులు బ్యాంకులో డబ్బు వడ్డీకి వేసేవా రన్నమాట! బ్యాంకులో వడ్డీ ఏడాదికి మూడు రూపాయలు మాత్రం. అలాంటి సందర్భంలో ఈ మిల్లు యజమానులు ఒక కోటి రూపాయలుపెట్టి, నాలుగుకోట్ల రూపాయలు వడ్డీ క్రింద లాగుతున్నారన్నమాట. అది అన్యాయమేకాదు. రౌరవాది నరకం. అడుగున అయిదుమైళ్ళ లోతుగల కళపెళలాడుతూ మండే దురాశ అనే మంట."

ఈ రకంగా మాట్లాడినాడు. డాక్టరు ఇంటి దగ్గర కోనంగితో "నీ ఉపన్యాసం బాగానే ఉంది. కానీ, కొంచెం ఘాటుగా, లెక్కల పూరితంగా ఉండాలి. రష్యాలో ప్రజలెలా ఉత్తమ స్థితిలో ఉన్నారో అనీ చెప్పాలి" అన్నాడు.

"నాకు లెక్కలేమి వచ్చును రెడ్డీ?"

"లెక్కలు చదువు, అందాకా వచ్చినట్లు నటించు!"

"ఉపన్యాసాలలో నటనే?"

"అది జీవిత నటన!"

"వారెవా! ఫ్యాక్టరీలలో నటన, ప్రేమలో నటన, భోజనంలో నటనా?

ఈ ప్రపంచ మొక నాటకరంగం,
అందులో మనమే పాత్రలమూ
అ ం తా న ట నా
అ ం తా ఘ ట నా
అ ఘ ట న ఘ ట నా
ఉ ప న్యా స మ ట నా?"

ఆ రాత్రి అనంతలక్ష్మి ఇంటికి వెళ్ళినాడు కోనంగి. అనంతలక్ష్మి బి.యే. చదువుతూంది. కోనంగి వారి ఇంటికి వెళ్ళగానే అనంతలక్ష్మి కనబడలేదు. పనిమనిషి "అమ్మణిగారు పార్థసారధి మొదలయ్యారు జడ్జీగారింటికి వెళ్ళారు. తాము వచ్చేవరకు మిమ్మల్ని ఆపమని చెప్పారు" అని కోనంగితో చెప్పింది.

ఇంతలో జయలక్ష్మి అక్కడకు వచ్చి "కోనంగిరావుగారూ! కూర్చోండి" అని కోరింది. కోనంగి ఒక కుర్చీలో కూర్చుండి "ఏమండీ! మీరు ఒకసారి అన్ని తీర్థయాత్రలు తిరుగుదామనుకున్నారు. ఎప్పుడు ఏర్పాటు చేశారు? అప్పుడే సెప్టెంబరు నెలకూడా అయిపోవచ్చింది?" అని ప్రశ్నించాడు.

"కోనంగిరావుగారూ! మీతో కొన్ని ముఖ్యవిషయాలు మాట్లాడుదాము అనుకుంటున్నాను-"

"తప్పకుండా ముఖ్యాముఖ్య విషయాలన్నీ మాట్లాడవచ్చును."

"మా అమ్మణి పెళ్ళి వెంటనే చేయమంటారా లేకపోతే బి.యే. పూర్తి చేసిన తర్వాతా?"

"అది రాబోయే పెళ్ళికొడుకునుబట్టి వుంటుంది."

"మా అమ్మిణికి ఉన్న భూమివల్ల పదివేల పై చిల్లర ఆదాయం వస్తుంది. రొక్కం నగదు ముప్పైవేలున్నాయి. నగలు వేయికాసుల బంగారంవరకూ ఉన్నాయి. వజ్రాలు, ముత్యాలు మొదలైనవి ఏభైవేల వరకూ ఖరీదు చేస్తాయి. ఇది మా ఆస్తి."

"అమ్మిణికి ఒక రాజకుమారుడు రావచ్చు!"

"అయితే ఏమి, అమ్మిణి నేను చెప్పినమాట వినదుగా?"

"ఏమంటుంది?"

"చెట్టిగారిని చేసుకోను పొమ్మంది."

"అయ్యయ్యో!"

"అంటే అంది! వాడు పోవడమే మంచిది. వాడు రాక్షసుడు. కాని చెట్టిగారు మావారి అన్నగారి చిన్నకొడుకు శ్రీనివాస అయ్యంగారు దగ్గర సగం ఆస్తి రాయించి పుచ్చుకొని, మా ఆస్తిలో సగం తనదనీ, వాటాలు పంచాలనీ, మావారూ వారి అన్నగారూ అసలే పంచుకోలేదనీ, కాబట్టి వారి ఆస్తి విల్లు చేయడానికి అధికారం లేదనీ, ఇన్నాళ్ళ నుంచీ నేను అనుభవించి నందుకు తనకు ఫలసాయం క్రింద ఏభైవేలల్లో సగం ఇరవై అయిదువేలు రావలసి ఉంటుందనీ వ్యాజ్యం వేశాడు."

"అరి దుర్మార్గుడా! వేశాడూ, ఏం చేద్దామని మీరు?"

"మా అమ్మిణి వాణ్ణి చేసుకుంటే వ్యాజ్యం వదలుకుంటాడుట!"

"ఎంతటి దుర్మార్గుడూ!"

"మీ సలహా?"

"మీరేమి ఆలోచించారు?"

"ఈవాళే నోటీసులు వచ్చాయి. తంజావూరి సబుకోర్టునుండి."

"వకీలుతో ఆలోచించారా?"

"మావారి అన్నగారి పెద్దబ్బాయి అనంతకృష్ణ అయ్యంగారు మా అమ్మాయికి పాఠం చెబుతూ ఉంటాడు. ఆయనకీ నోటీసులు అందాయట. ఆయన తెల్లబోయి ఎంత దుర్మార్గుడు చెట్టియారు అన్నాడు. తన తమ్ముణ్ణి నానాతిట్లు తిట్టినాడు."

## 7

**కో**నంగి చెట్టియారుగారి కోపానికి ఆశ్చర్యం పొందనే లేదు. అతనికి చెట్టియారుగారి గుణగణం కరతలామలకమే. చెట్టియారికి అనంతలక్ష్మిని వివాహం చేసుకోడం

ముఖ్యంకాదు. అనంతలక్ష్మిని అనుభవించడమే అతడు కోరేది. ఆ బాలిక భార్య అయితే అందంలేదు. భార్యలు చప్పబడి పోతారు. మనకు కావలసినప్పుడు వెళ్ళి ఒక అందమైన బాలికను అనుభవించడంలో ఉన్న బ్రహ్మానందం ఆమెను భార్యను చేసుకోవడంలో ఎక్కడ నుంచి వస్తుంది? అది లేనిపోని తద్దినం నిష్కారణంగా నెత్తిన తెచ్చి పెట్టుకోవడమే!

వెల ఇచ్చి అనుభవించే స్త్రీలు నిజమైన ఆనందం ఇవ్వలేరు. వాళ్ళల్లో ధనం ఎక్కువ పుచ్చుకొనేవాళ్ళు ఉండవచ్చుగాక! కాని వాళ్ళు బజారులో వస్తువుల వంటివారు. అందరానిపండుకు ఆశించి, ఆ పండును కోరి కోరి, కష్టపడి సంపాదించుకొని, అనుభవించడంలోనే ఆనందం, మహదానందమూ ఉన్నాయి. అదీ చెట్టియారుగారి వ్యక్తిత్వం అని కోనంగి ఏనాడో అర్థం చేసుకున్నాడు.

చెట్టియారుగారి చరిత్రలు కథలుగా సినీమా లోకంలో చెప్పుకోడం కోనంగి బాగా విన్నాడు. ఊఁ కొట్టాడు. అతడు సినిమా తారలకోసం ప్రాకులాడుతూంటే ఎవరికీ నష్టంలేదు. కాని పండంటి కాపురాలు చెడగొట్టడమూ, ఏమీ ఎరగని బాలికలను అధోగతిలోకి కూలదోయడమూ, సినీమాలలో ఏదో ఒలుకుతుందని కాని, ఏదో తారుమారు చేద్దామనిగాని, బీదతనంచే కుళ్ళిపోయి అది నాశనం చేసుకొని, తలెత్తి బ్రతుకుదామనిగాని, బాలికలు కొత్తగా సినిమా ప్రపంచంలో అడుగుబెట్టితే, ఆ మాయాలోకంలో మన చెట్టియారువంటి ఉదార హృదయులూ, అతి గొప్పనటకులూ పొంచివుండే పెద్దపులులై ఆ బాలికలను కబళించి వేస్తారు. అక్కడే సినీమాలోని విషాదాంత నాటిక ప్రారంభ నాందీశ్లోకం పాడుతుంది అని కోనంగికి దృఢతరమైన నమ్మకం కలిగింది.

మన చెట్టియారుగారు ఎన్ని సినీమా కంపెనీలలోనో భాగస్వామిగా ఉన్నాడంటే ఇదే రహస్యం. ఆయన స్త్రీ వాంఛ అడవుల్ని అడవుల్ని ఆహుతికోరే దావానలం. ఆయన పురుషత్వం ఎప్పుడూ స్త్రీలు అనే జడివానలను కోరే భయంకరమైన ఎడారి. అతని పురుషత్వం వృకోదరం! అతని పురుషత్వం ఎంతో లోతు ఉన్న దొంగ ఊబి.

అతనికి జయలక్ష్మిగాని, అనంతలక్ష్మిగాని అందకపోవడం పెద్ద తలవంపు లయిపోయింది. అతని 'షరం' మచ్చపడింది. అతని 'ఇజ్జత్' విరిగి పోయినట్లయింది. అతని గౌరవం, మర్యాదా మంటకలిసిపోయాయి. అతని సిగ్గు చిట్టిబండలపాలయింది.

అందుకని చెట్టియారుగారు జయలక్ష్మిపై కత్తికట్టాడు. అనంతలక్ష్మి తండ్రి రంగయ్యంగారు మంచి న్యాయానుభవం కలవాడు. అందరిలోనూ తెలివైనన్యాయవాదుల నాయకులు ఆయనకు మిత్రులు. తన ఆస్తి సంపూర్ణ హక్కులతో జయలక్ష్మికీ, అనంతలక్ష్మికీ మరణశాసనం వ్రాసినాడంటే, అన్ని కట్టుదిట్టాలు చేయకుండా వ్రాస్తాడా?

రంగయ్యంగారు పోయి అరేళ్లు కాకుండా వ్యాజ్యం తెచ్చారు. అంతవరకు చెట్టియారుగారు జాగ్రత్తవంతులే. చరాస్తికి దఖలు దస్తావేజులు శ్రీనివాసఅయ్యంగారు రాసి ఇచ్చాడుట. నగలు అవీ కొనడం అన్నీ జయలక్ష్మి పేరునే, ఆయన రాసిన ఉత్తరాలన్నీ జయలక్ష్మిని భార్యగా ఎంచే రాసినారు. అందుకని చరాస్తిపై వ్యాజ్యం వేయలేకపోయాడు. జయలక్ష్మికి ఇప్పుడు నలభయినాలుగేండ్లు. రంగయ్యంగారికీ జయలక్ష్మికీ ఇరవైఏళ్ళ సంబంధం! అయ్యంగారు ఏ అవుసరపు పనులకు తన భూముల గ్రామాలకు వెళ్ళినప్పుడో తక్క జయలక్ష్మిని వదలి ఉండలేదు.

రంగయ్యంగారి విల్లు చెన్నపట్నంలో వ్రాశారు. న్యాయవాదుల సలహా సంప్రతింపులలో ఆ విల్లు రిజిష్టరయింది. అది తర్వాత న్యాయస్థానంలో అనుమతింప బడింది. ఆ ప్రకారమే ఆస్తి అంతా జయలక్ష్మికి దఖలుపడింది.

ఈ విషయాలన్నీ కోనంగి తెలుసుకున్నాడు. కోనంగీ, డాక్టరు రెడ్డిగారూ కలిసి రంగయ్యంగారి వకీలయిన వరదరాజయ్యంగారితోపాటు అప్పటికి బాగా పేరుపొందిన ఆంధ్ర వకీలయిన గోపాలరావుగారిని ఏర్పరచారు.

రంగయ్యంగారు వ్రాసిన విల్లులో రంగయ్యంగారి అన్నగారి దస్కత్తులేదు. కాని కోనంగి రంగయ్యంగారి కాగితాలన్నీ వెదుకుతూవుంటే ఆయన అన్నగారు వెంకటేశయ్యం గారు వ్రాసిన ఉత్తరాలు దొరికాయి. ఆ ఉత్తరాలలో రంగయ్యంగారూ, వెంకటేశయ్యంగారూ పంచుకున్నట్లు స్పష్టంగా వొప్పుకుంటూ వున్నట్లున్నది.

వెంకటేశయ్యంగారి పెద్ద కుమారుడు అనంతకృష్ణయ్యంగారు మర్నాడు తన తమ్ముడు తనకు రాసిన ఉత్తరాలకట్ట పట్టుకువచ్చాడు. ఆ కట్టలో అనేక ఉత్తరాలలో అతడు తన తండ్రికీ పినతండ్రికీ పంపక మయిందని వప్పుకున్నట్లూ, జయలక్ష్మి ఆ భూములు అనుభవించడం వొప్పుకున్నట్లూ స్పష్టంగా వుంది.

అవన్నీనీ, ఇతర దస్తావేజులు అన్నీ చూస్తే పాలుపంపకాలున్నట్లూ, అలా భూములూ, ఇల్లూ అమలు అవుతున్నట్లూ, దానిలో రంగయ్యంగారి భాగం జయలక్ష్మికి దఖలు అయినట్లూ, ఆమె అవి అనుభవిస్తున్నట్లూ స్పష్టమయిపోయింది.

చెట్టియారుగారు వేసిన వ్యాజ్యంలో రంగయ్యంగారు రాసిన విల్లు లా ప్రకారం చెల్లదనీ, అందుచేత ఆ విల్లు లేనట్లే అవుతుందనీ, అలా విల్లు లేక ఆస్తి అన్యాయంగా అనుభవించే జయలక్ష్మికి హక్కు వుండదనీ, భావంచేత వెంకటేశ అయ్యంగారి రెండవ కుమారుడైన శ్రీనివాసయ్యంగారు మొదటి ప్రతివాది హక్కు వొప్పుకొన్నట్లూ, దానికి న్యాయశాస్త్ర దృష్ట్యా ఏమీ తాహతు లేదనీ వుంది.

ఈ పనంతా కోనంగి చక్కబెడుతూ తనకున్న దస్తావేజులకు జాబితా, వానిలో వుండే సారాంశమూ రాస్తూ వుంటే, అతనికి అనంతలక్ష్మి ఎంతో సహాయం చేస్తూ వున్నది.

"మీరు ప్లీడరుగారు, నేను గుమాస్తానూ కాదూ?"

"కాదు లక్ష్మీ నేను పెద్ద వకీలును, నీవు చిన్న వకీలువు!"

"ఆమ్మో! నాకు న్యాయవాదం చదవాలని లేదండీ గురువుగారూ!"

"నాకు మాత్రం మహావున్నట్లు, న్యాయవాద విద్య నేను చదవలేదు. చదవదలచుకోలేదు."

"మీలో ఆ శక్తి వుంది;"

"నీలో లేదా?"

"నాలో గుమాస్తా శక్తి వుంది!"

"నాలోనూ అంతే. నేను హెడ్ గుమాస్తాను, నువ్వు నా సహాయకురాలవు."

"మీకు మావ్యాజ్యాల గొడవ ఎందుకు?"

"మా ఆవిడ వ్యాజ్యాలు నావి కావా?"

"ఏమిటి! అయితే, నేను చేసేవంటకు మీరు సహాయం చేస్తారా?"

"ఓ! భోంచేయడం!"

"అయితే నేను వంటే చేయను."

"నువ్వు వంటచేయని భోజనం నేను ఆరగిస్తా?"

"ఎల్లాగు?"

"నిన్ను తనివార ముద్దు-"

"అఁ ఆఁ!"

## 8

“అనంతలక్ష్మి! నేను ప్రేమ అంటే ఏమిటో యిదివరకు యెరగను. నాతోపాటు చదివిన కొందరు బాలలను దూరంగా చూస్తూ గుటకలు మింగేవాడిని. దగ్గిరకు వెళ్ళి యెంతో జాగ్రత్తగా వ్యంగ్యార్థాలు కూడా మాట్లాడేవాణ్ణి. హాస్యసంభాషణ చేసి నవ్వించేవాడిని. ఈడు వచ్చిన బాలుణ్ణీ, బాలికను కామం స్పందింప చేస్తుంది. కాని ప్రేమ అనేదికాని. విపరీత కామేచ్ఛగాని వుంటేనే బాలబాలికలు హద్దు మీరుతారు. బాలికలకు బాలురందరినీ వాంఛించడం వుండదు. వారిలో జాగ్రత్త ఎక్కువ. అనుమానాలు ఎక్కువ. అందుచేత యెప్పుడో కాని బాలిక హద్దు మీరదు. బాలుడు యెప్పుడూ హద్దుమీరడానికి సిద్ధమే. కాని వివాహాదులకు మాత్రం జాగ్రత్తగా ఆలోచిస్తాడు.

“ఎందుకండీ ఈ ఉపన్యాసమంతా?”

“వస్తున్నా! నిన్ను చూచినంతవరకూ ప్రేమ అనే పదార్థము ప్రపంచంలో వుంటుంది అనుకోలేదు. ఇది వట్టి కవుల భావన మాత్రం అని అనుకునేవాణ్ణి”

“అయితే మీరు ఏ బాలికనూ వాంఛించలేదా?”

“ఈ ఊళ్ళో ‘అనీ’ అనే ఆంగ్లో ఇండియన్ బాలిక వుంది. ఆమె నన్ను ఒకసారి గాఢంగా వాంఛించింది-”

అనంతలక్ష్మి చటుక్కున లేచింది. ఆమె మోము కందిపోయింది. కళ్ళు నిప్పులు కురిశాయి. కోనంగి అది చూచి నవ్వుతూ లేచి, “అనంతం! తొందరపడకు చివరవరకూ విను. నేను ఆ క్షణంలో గంగలో పడిపోదును. కాని నిన్ను అదివరకే చూచివున్నాను. అదో కారణం. వివాహం లేక కామసంబంధం పెట్టుకోలేనన్న నాలోని మహాకోర్కె ఓటి నన్ను క్రిందకు పడిపోకుండా ఆపుచేసింది. నేను ఇంతవరకూ స్త్రీదోషమేమీ ఎరుగనని నీతో ఆత్మపూర్వకంగా చెబుతున్నాను లక్ష్మీ!” అన్నాడు.

అనంతలక్ష్మి కన్నుల నీరు కారిపోవగా, నెమ్మదిగా అడుగులువేస్తూ కోనంగి కౌగలిలోనికి పోయింది వారలా ఎంతసేపున్నారో, జయలక్ష్మీ రావడంవారు చూడనేలేదు జయలక్ష్మి దగ్గు దగ్గింది. అంతటిలో వారిరువురు కౌగిలి విడిపోయారు. ఇద్దరి కన్నులు బాష్పములతో నిండివున్నవి.

జయలక్ష్మి ఆ విషయం ఏమీ గమనించనట్లు నటించి “ఏమండీ కోనంగిరావుగారూ! మీపని ఎంతవరకు వచ్చింది?” అని అడిగింది

**కోనంగి:** అన్ని దస్తావేజులు అయిపోయాయి. ఇంక ఉత్తరాలు మిగిలివున్నాయి.

**జయలక్ష్మి:** అమ్మిణి మీకు సహాయం చేస్తోందా, పనికి అడ్డువస్తోందా?

**అనంతలక్ష్మి:** అదేమిటే అమ్మా! నేనేమి అడ్డువస్తున్నాను. అలా అంటావు? నేను లేకపోతే మా మాష్టరుగారు సగం దస్తావేజులన్నా పూర్తిచేయలేకపోదురు.

**కోనంగి:** అంతవరకూ నిజమేనండీ!

**జయ:** ఏమో మీరిద్దరూ తోడిదొంగలే!

**కోనంగి:** మీరన్నది కొంత నిజం కూడాను!

**అనం:** ఆయన దొంగేమో కాని, నేను మాత్రం కాను అమ్మా!

**జయ:** నిన్ను మాత్రం నమ్మమని ఎక్కడుంది. మీరిద్దరూ భోజనానికి లెండి. మన దావా స్టేటుమెంటుకు పదిహేనురోజులే వాయిదా! మీరిద్దరూ ఈపని పూర్తి చేసిన వెంటనే

మనం ముగ్గురమూ, ఇక్కడి మన వకీళ్ళూ, మా గుమాస్తా అందరమూ బయలుదేరి తంజావూరూ, మన్నారుగుడీ పోవాలి.

**కోనంగి:** తప్పకుండా!

**అనంత:** తప్పకుండా

**జయ:** నువ్వు వెళ్ళి భోజనానికి దుస్తులు మార్చుకురా అమ్మిణీ!

అనంతలక్ష్మి వెంటనే లోనికి వెళ్ళుతూ తల్లికి కనబడకుండా కోనంగికి కళ్ళు గలిపి చక్కాబోయింది.

**జయ:** కోనంగిరావుగారూ, మిమ్ము మా అమ్మిణి ప్రేమిస్తోంది. మిమ్మల్ని తప్ప ఎవర్నీ పెళ్ళిచేసుకోనని స్పష్టంగా చెప్పేసింది. మీరు తన్ను గాఢంగా ప్రేమిస్తున్నారనీ, పెళ్ళిచేసుకుంటారనీ అమ్మిణి నాతో చెప్పింది. మొన్న కొంచెం ఈ విషయం మీ దగ్గర కదిపాను. మీ ఉద్దేశం స్పష్టంగా చెప్పండి.

**కోనంగి:** మీ అమ్మిణినే నేను ప్రేమిస్తున్నాను. ఇదివరకు ప్రేమ అంటే ఏమిటో ఎరుగను. ఇంతవరకూ ఏ స్త్రీతోనూ ఎలాంటి సంబంధమూ ఎరగను. అనంతలక్ష్మికి భర్త నవడంకన్న నా అదృష్టం ఇంక ఏదీ ఉండదు. నన్ను గురించి మీరు పూర్తిగా తెలుసుకున్న తర్వాతగదా నన్ను మీరా ప్రశ్న వేయడం? నేను మీ అమ్మాయికి తగుదునా అనే భయంచేత మొదటి నుండీ అనంతాన్ని నిరోధం చేశానుకాని, నేనుకూడా కాదనలేని స్థితికి లాక్కుని వచ్చింది. మీ అమ్మాయి ఎంతో ఉత్తమస్థితికి వెళ్ళవలసివున్నది.

**జయ:** ఏమిటా ఉత్తమస్థితి?

**కోనంగి:** ఇంగ్లండు అమెరికాలు వెళ్ళి పెద్ద పరీక్షలు ప్యాసయి రావసిన అమ్మాయి.

**జయ:** ప్యాసయి?

**కోనంగి:** ఇక్కడ పెద్ద ఉద్యోగాలు చేయవలసిన అమ్మాయి!

**జయ:** మీరు?

**కోనంగి:** నేను కటిక దరిద్రుణ్ణి!

**జయ:** సినీమాలో బాగా సంపాదించారుగాదా! సంపాదించగలరు!

**కోనంగి:** సినీమా నా కేమీ ఇష్టంలేదు.

**జయ:** ఇష్టంలేక?

**కోనంగి:** ఏదైనా పారిశ్రామిక విద్య చదువుకుందామని.

**జయ:** ఏమిటది?

**కోనంగి:** ఇంకా ఏదీ నిశ్చయం చేసుకోలేదు. గ్లాసు పరిశ్రమో, ఇనప కర్మాగార విద్యో, నూనె పరిశ్రమో, విద్యుచ్ఛక్తి విద్యో?

**జయ:** అయితే మా అమ్మిణిని మీరు వివాహం చేసుకోవడానికి ఏమి అభ్యంతరం?

**కోనంగి:** నేను బీదవాణ్ణి!

**జయ:** అదేమిటండీ! మాట్లాడితే బీదవాణ్ణంటారూ? మీ బీదతనంవల్ల మాకు అభ్యంతరం లేదు. మీరే మా అమ్మిణికి తగినవారు. నాకు ఆమె ఒక్కతే బిడ్డ! కొడుకులు లేరు. భగవంతుడే మిమ్మల్ని మా ఇంటికి తీసుకు వచ్చి ఆ రోజున మా గుమ్మం దగ్గిర నిలబెట్టాడు. మా అమ్మాయిని వివాహం చేసుకుని నాకు కొడుకులు లేని లోటు తీర్చండి. ఇది నా ప్రార్థన! మీకు ఇష్టంలేక ఈ నాటక మాడుతున్నారంటే స్వచ్ఛమయిన మా అమ్మాయి జీవితం అంతా కుంగదీసిన వాళ్ళవుతారు.

కోనంగి తలవంచుకొని, "అలాగేనండి! ఆమె నాకు భార్యకాక, నేను జీవంలేని కళ్లనే అయిపోతాను. పెద్దలతో ఆలోచించి మీరు ఎప్పుడు ముహూర్తం పెట్టినాసరే!" అన్నాడు.

జయలక్ష్మి కోనంగి కడకు కళ్ళనీళ్ళు తిరుగుతుండగా వచ్చి అతని చెంపలంటి తన చెంపలకు విరిచికొని లోనకు గబగబ వెళ్ళిపోయి తన పూజామందిరము కడ ఉన్న భర్త చిత్రానికి సాష్టాంగపడి. స్వామీ, ఈ అబ్బాయి అమ్మిణికి తగిన భర్తేనా?" అని వేడుతూ అడిగింది. ఆమెకు ఆ బొమ్మ చిరునవ్వు నవ్వినట్లయింది.

## ⑨

డాక్టరు ఇంటిదగ్గర ఉండే రోజుల్లో కోనంగికి డాక్టరు స్నేహితులు జనాబ్ మొహమ్మద్ మొహిద్దీన్, బార్-ఎట్-లా గారితోనూ, కామ్రేడ్ కాంతారావు, ఎం.ఎల్.సి. ఆంధ్ర కమ్యూనిస్టుపార్టీ అధ్యక్షునితోనూ, రిక్షావారి సంఘం ఉపాధ్యక్షుడు, రిక్షాలాగే వారిలో ప్రథమ బహుమానమందిన వారునూ అయిన వరదరాజులతోనూ, అఖిలాంధ్ర రైతుసంఘ కార్యదర్శి కృష్ణదేవరాయచౌదరితోనూ మంచి స్నేహం కుదిరింది.

కోనంగి మొదటి నుంచీ కాంగ్రెసు వారితో స్నేహం చేస్తూనే ఉన్నాడు. ఆంధ్ర కాంగ్రెసు కార్యాలయంలో మూర్తి అనే కాంగ్రెసు సేవకునికీ, కోనంగికీ ఎంతో స్నేహం అయింది. డాక్టరు రెడ్డి కాంగ్రెసు వారికీ వైద్యుడే! అక్కడే రియాసత్ ఆలీ అనే కాంగ్రెసు ముస్లిం కూడా కోనంగికి స్నేహితులయ్యారు. వీరే గాకుండా వీనస్ వస్త్రయంత్రాలయం కూలీల నాయకుడు పాములపాటి జేమ్సు అనే క్రైస్తవునితో స్నేహం గాఢమైంది.

స్నేహితులందరితో ఎప్పుడూ కోనంగి వాదిస్తూ ఉండేవాడు. ఎవరు ఏ విషయంమీద వాదిస్తే వారికి ఎదిరిగా వాదించడం అంటే కోనంగికి మహాసరదా. ఆ వాదనైనా తర్కరూపంగా ఉంటుందా? హేళన, హాస్యము, అవహేళన, అపహాస్యమూనూ! అవతలివాడు అతిఘాటుగా మాట్లాడుతూ ఉంటే ఆ వాదనంతా ఇనుపగుండు అనుకున్నవాణ్ణి దూదిపింజలా ఎత్తి అవతల పారవేస్తాడు. కోనంగిని బాగా అర్థం చేసుకున్నవాళ్ళు నవ్వేస్తారు. తక్కిన వాళ్ళకి కోపాలు కూడా వస్తూ ఉంటాయి.

ఎంత మనిషినైనా కోనంగి ఏడ్పించగలడుగాని తనను మాత్రం చెక్కు చెదర్పలేడు. ఇంతమంది స్నేహితులున్నా తన హృదయం సంపూర్ణంగా చెప్పే స్నేహితులు కోనంగికి ఇద్దరే! ఒకడు డాక్టరు రంగనాయకులు రెడ్డి, రెండోవాడు రియాసత్ ఆలీనీ.

డాక్టరు రెడ్డిగారి ఇంటా, ఆంధ్రమహాసభా మందిరంలోనూ కోనంగి అనేకమందిని కలుసుకుంటూ ఉండేవాడు.

ఆంధ్రమహాసభ వాతావరణంలో మూడే ముఖ్యవిషయాలు. ఒకటి పేకాట, రెండు నాటకాలు, మూడు బిల్లార్డ్సు, టేన్నిస్, పింగ్‌పాంగు మొదలయిన ఆటలూ, వాని పందేలూ.

మదరాసు ఆంధ్రులు పేక ఆడడం మొదలుపెడితే ఆట వరసగా రోజులు రోజులు ఆడగలరు. హోటల్సునుంచి సెట్టు గిన్నెలలో భోజనాలు వస్తాయి. మహాసభ భవనంలో మంచి కాఫీహోటలుంది. సిగరెట్లు, బీడి, వెత్తలపాకు దుకాణమూ ఉంది. మూడుముక్కల ఆట, అయిదు ముక్కల ఆట, బ్రిడ్జీ ఆంధ్రులకు మా ఇష్టం. కొందరు జట్టులవారు రూపాయలు మేజులుపెట్టి ఆడ్తారు. వేలకొలది రూపాయలు మారుతూ వుంటాయి. ఆంధ్ర మహాసభకు ఒక్క పేక అమ్మకంవల్ల అద్దె డబ్బులు రెండువందలు వచ్చేస్తాయట.

ఇంకా నాటకాల విషయంలో మహాసభవారు చాలా శ్రద్ధ తీసుకుంటారు. మహాసభ సభ్యులలో చాలామంది వేషాలు వేస్తారు. చక్కగా అభినయం చేయగలరు. ఊళ్ళో అనేకం సినీమా కంపెనీలు ఉండడంవల్ల అనేక మంది తారలు మధ్యే మధ్యే పానీయం క్రింద ఆంధ్రమహాసభా నాటకాలలో వేషాలువేస్తూ ఉంటారు.

కోనంగిరావుగారు కూడా ఆంధ్రమహాసభలో సభ్యుడయ్యాడు. ఒక చిత్రంలో ఎంతో ఖ్యాతి సంపాదించుకున్న సినీమా నాయకునికి ఎక్కడ ప్రవేశంలేదుకనక!

అయినా ఆంధ్రులు వీరపూజావలంబకులు కారు. వారికీ రాజకీయ నాయకులన్నా లెక్కలేదు. ఒక్క మహాత్మాజీ విషయం మాత్రం ఒక మోస్తరుగా ఆలోచిస్తారు. తక్కిన పటేలు, నెహ్రూ, రాజేంద్రబాబు, సరోజినీనాయుడు మొదలయిన వారంటే లెక్కా పత్రమూ లేదు. అలా అని గౌరవం చేయరనుకోకూడదు. ఎంత మాత్రము కూడదు. ఊళ్ళ ఊళ్ళలోనూ లక్షలకొలది జనం రావడం, నాయకుణ్ణి బ్రహ్మరథం ఎక్కించడమూ ఉండి తీరుతుంది.

కోనంగి పెద్ద వీరుని క్రింద తన్ను తన ఆంధ్రులు చూడలేదని ఏమీ బెంగపడలేదు. ఇంతకూ అతన్ని వేషం వేయమన్నారు అదే పదివేలు.

వేసే నాటకం ఉషాపరిణయం. కొందరు కోనంగిరావుగారు అనిరుద్ధుడుగా ఉండాలన్నారు. కొందరు మరొకరన్నారు. చివరకు కోనంగిరావుకు ప్రద్యుమ్నవేషం ఇచ్చారు. అయితే ఉషవేషం వేసే అమ్మాయి ఒక పెద్ద తెనుగు సినీమాతార. పెద్ద అంటే ఆరడుగుల దెయ్యంలాంటి మనిషి కానేకాదు. సన్నగా పొట్టిగా శలాకులా బంగారు పిచ్చికలా ఉండే మనిషి! అవిడకి ఒకే పక్షీంద్రుడు కాక ఇద్దరు పక్షీంద్రులున్నారు. అయినా అవిడ హృదయం నవనీతం గనక తన యౌవన సుధారసాన్ని సరియైన, తను అందుకోగల, తన కవసరమైన రసికావతంసులకు గ్లాసులకొద్దీ గ్రోలనిస్తుంది.

ఆవిడకు మామగారుగా మాత్రం రావడం కోనంగికి తన అదృష్టమనుకున్నాడు. అయితే ఇంక రతీదేవి ఎవ్వరుబాబూ అని కోనంగికి అందోళన కలగకపోలేదు. అవిడ తనపాలిట రతీదేవే అయితే ఇంక తాను అతనుడు, అనంగుడు, అశరీరుడు, విదేహుడు కావలసి ఉంటుంది. అలా తాను అనంగుడు కాలేకపోతే సీనారేకు పుష్పబాణాలు చేయించుకొని వంటినిండా వాడి మొనలుగల ఆ బాణాలు దండలుగా దండికడియాలు కాళ్ళ కడియాలుగా మొలనూలుగా యజ్ఞోపవీతంగా తలకిరీటంగా మీసాలుగా (పూల మీసాలు ఎందుకు ఉండకూడదు? అని కోనంగి వాదన) ఉంటే కొంత రక్షకపూల కవచం కుదరవచ్చును అని కోనంగి అనుకున్నాడు.

ఎవరో వస్తున్నారు వస్తున్నారు అని ఆంధ్ర మహాసభ నాటకాల కార్యదర్శిగారు మూడురోజులు ఊరించి చివరకు మూడోరోజు రాత్రి కారు మీద ఆ రతీదేవిని తీసుకు వచ్చారు.

వీరందరూ రిహార్సల్ వేసే గదిలోకి ఆ అమ్మాయి రాగానే, అమ్మయ్యా అని కోనంగికి ఎంతో అనందం అయింది. తన రతీదేవి, దుక్కిటెద్దుల చిత్రంలో తన నాయికే!

కోనంగిరావుగారి ఆవిడ "ఏమండీ భర్తగారూ, మళ్ళీ మనం ఇద్దరం భార్యాభర్తల మవుతున్నాము" అని పలుకరించింది.

"వట్టి భార్యాభర్తలటండీ!"

"ఏదైనా గట్టిరకం భార్యాభర్తలం అవుతామా ఏమిటి? నిజం చెప్పండి! మా ఆయన గోలపెడ్తాడు!"

గట్టిరకంకన్న పై రకమమ్మా, స్త్రీపురుషులందరూ భార్యాభర్త లవడానికీ, ప్రేమికా ప్రేమికులవడానికీ, విటనాయికా నాయకులు కావడానికీ, తాత్కాలిక కామసంబంధాలు కలవడానికీ ఎవరైతే కారకులో ఆ దివ్య భార్యాభర్తలం! రతీమన్మథులం మనం!

## 10

ఆంధ్ర మహాసభలో నాటక కార్యదర్శిని కలుసుకొన్నాడు కోనంగి. ఆయనతో నాటకం విషయంలో తన అభిప్రాయాలు ఘట్టిగా తెలిపాడు.

**కార్యదర్శి:** మీ సలహా నాకు వినడానికి ఏమీ అభ్యంతరం లేదు గాని, మనం నాటకాలలో ఈనాడు ఉన్న భావాలు గమనించాలి కదండీ!

**కోనంగి:** అది సరేగానీ, ఈ రోజున సరియైన నాటకాలు ఆడడం విధానం ఎక్కడ ఉందండీ?

**కార్యదర్శి:** మన స్థానం నరసింహారావుగారు లేరా? బందా కనకలింగేశ్వరరావు గారు లేరా? నిడుముక్కల సుబ్బారావుగారు, మాధవపెద్ది వెంకట్రామయ్యగారు, పులిపాటి వెంకటేశ్వర్లుగారు, సూరిబాబుగారు, బెల్లంకొండ సుబ్బారావుగారు, రాఘవాచార్యులుగారు, వీరంతా నాటకాలు ఆడటం లేదా?

**కోనంగి:** అవును, వున్నారండీ బాబూ వున్నారు. నాట్యకళను వెలిగించడానికి!

**కార్యదర్శి:** అదేమిటండీ అలా మాట్లాడుతారూ?

**కోనంగి:** ఏమండీ చిదానందంగారూ! మీరు కోప్పడకుండా వుంటే చెపుతాను. ఉదయశంకర్ వచ్చి నాట్యకళకు నూతనజీవం పోసేవరకూ, మనదేశంలో కూచిపూడివారి నాట్యాలు, భోగంవారి నాట్యాలు ఎలా వుండేవి చెప్పండీ?

**చిదా:** ఏమో, నేనా నాట్యాలూ చూడలేదు, నాటకాలు చూడలేదు!

**కోనంగి:** నేను మాత్రం మహాచూశానా ఏమిటిగాని, అయినా చూసినంతమట్టుకు చెబుతున్నాను. తైతక్కతైతక్క డాన్సులూ, గంతులూ, కోతి అభినయాలూ, వేషాలూ విరేచనాల మందు పుచ్చుకుంటే కడుపులో కుదిపేసినట్లే! ఈనాటికికదా కాస్త వెంపటి సత్యనారాయణ, వేదాంతం రాఘవయ్య, వేదాంతం జగన్నాథశర్మా మొదలయినవాళ్ళు నాట్యరూపం మార్చి; అసలయిన భారత సంప్రదాయానికి నూతనజీవం, నవ్యశక్తి, నూతనోద్దీపన ఇచ్చారు. సంప్రదాయ విరుద్ధం కాకుండా కొత్త ఆశయాలూ, కొత్తదైన ప్రదర్శన విధానము చూపిస్తున్నారు.

**చిదా:** బాగా ఉందండీ కోనంగిరావుగారూ! నాటకాలు కూడా సినీమా భావాలవల్ల నైతేనేమీ, పాశ్చాత్య సంపర్కంవల్ల నైతేనేమీ మార్పులు పొందనే పొందాయికాదా?

**కోనంగి:** పొందాయి. ఒక్క డి.వి.సుబ్బారావుగారి కంపెనీయూ, అలాంటివే కొన్ని అమెచ్యూరు కంపెనీలూ తప్ప, సరియైన కంపెనీలుగాని, సరియైన నాటక విధానంగాని ఒక్కటంటే ఒక్కటైనా ఉందా?

**చిదా:** ఇంతకీ మీరనేది?

**కోనంగి:** నేననేది ఏముందీ? మనకు ఒకకోటి వీళ్ళున్నాయి. అద్భుతమైన నాటకవిధానం చూపించడానికి.

**చిదా:** ఏదో గాలికబుర్లు చెప్పక నాలుగు గట్టి విషయాలు చెప్పండిమరీ.
**కోనంగి:** ఏమి గట్టి విషయాలు, మన తెలుగుదేశం నిండా నిండిపోయిన నాటకాలలో గట్టివిషయాలు ఏమున్నాయి చిదానందంగారూ! పద్యాలు గొంతుక చించుకుని నాటకశాల అంతా నిండి, ఆ చుట్టుప్రక్కల వీధులు నింపి, ఆ ఊరంతా నింపి, పక్క ఊళ్ళు కూడా పాకేటంతగా అరిచే వారంతా గొప్పనటకులు. అభినయం మన సంప్రదాయమూకాదు, ప్రకృత్యనుకరణమూ కాదు, చివరకు ప్రాపంచకవాదమూ కాదు.
**చిదా:** మంచిదారి ఏమిటో సలహా యివ్వండీ అంటే, ఉన్నవాళ్ళ నందరినీ ఏకితే ఎలాగండీ?
**కోనంగి:** చిదానందంగారూ! ఏకకుండా పరుపు ఎల్లా కుడతామండీ?
**చిదా:** సరేలెండి, ఏకండి, ఏకండి! ఏ పరుపు కుడతారో అదీ చూస్తానుగా!
**కోనంగి:** నాటకం, ఏకపాత్రాభినయం కలది అయితే ఒక్కడే నటకుడుగాని, అభినయించే బాలికగాని, నాటకం జరుపవచ్చు: చంద్రశేఖరంగారిలా, చెంచయ్యగారిలా పేరూ సంపాదించవచ్చు. కాని నాటకం అంటే సాముదాయకాభినయపూర్ణము కాబట్టి అందరూ శ్రుతిగా అభినయించాలి. అలాంటి సందర్భంలో ఈ కాంట్రాక్టు నాటకాలు ఏమిటండీ? ఇటువైపు నుంచి ఏ పులికాటుగారో వచ్చి, ఊళ్ళోవాళ్ళను నలుగురిని కలేసుకుని నాటకం ఆడటం ఎంత హాస్యాస్పదమూ, కళకు ఎంత అవమానమూ?
**చిదం:** ఇవాళ మీరు నాకు లెక్చరిచ్చే సరదాలో ఉన్నారు. కానీయండి.
**కోనంగి:** ప్రస్తుతం నేను లెక్చరిచ్చే వీరుడిలా తయారై ఉన్నాను. మీరు వినకపోతే, ఈ గోడలకూ, ఈ బెంచీలకూ ఉపన్యాసం హెూరాహెూరీగా ఇచ్చేస్తాను.
**చిదం:** అందరూ ఏమనుకుంటారు?
**కోనంగి:** అనుకుంటే అనుకోనీయండి. నాటకం పోర్షను జ్ఞాపకం కోసం గట్టిగా జ్ఞాపకం చేసుకున్నా ననుకుంటారూ? జూలియస్ సీజరులో ఆంటనీలా.
**చిదం:** ఇంతకీ మీ సలహా?
**కోనంగి:** వినండి. ఒకటి: మాట్లాడవలసినచోట ఆ భావాన్ని పద్యంగాగాని, పాటగాగాని అభినయం చేయకూడదు. రెండు: అభినయానికి అనవసరంగా చేతులు కదల్చడం, మొగం, కళ్ళూ తిప్పడం ఉండకూడదు. మూడు: తెరలు ఒకే రంగువి వుండాలి. రంగస్థలం తెల్పడానికి సెట్టింగులుండాలి. నాలుగు: వేషాలు వేయడం నూతన విధానాన్నను సరించి ఉండాలి. అయిదు: సంగీతంలో హార్మోనియం ఉండకూడదు. ఆరు: నాటకంలో, పార్టు పాఠంగా వచ్చేవరకూ రిహార్సలు జరగాలి. ఏడు:
**చిదం:** మీ జాబితా ఎంతవరకూ ఉందిబాబూ?
**కోనంగి:** మీరు ఆచరించ గలిగితే దెబ్బయివరకూ ఉంది.

ఈలా అలరించేస్తూ కోనంగి కొంత నాటకవిధానంలో మార్పు తీసుకు వచ్చాడు. అసలు కవి రాసిన నాటకంలో, అనిరుద్ధుణ్ణి పట్టుకోగానే ఉష –

"ఆహా! నా ప్రాణేశ్వరు
హతవిధి బంధించెనుగా!
ఈ సుకుమారుడు మన్మథ తనయుడు
ఏలా భరించయించు కష్టములు ఆహా!

అని ఏడ్చి మూర్ఛపోతుంది. అది చూచేసరికి కోనంగి రిహార్సులు గది అంతా నిండిపోయేటట్లు పకపకా నవ్వాడు. అందరూ తెల్లబోయారు. కొందరికి కోపం వచ్చింది.

చిదంబరంగారు మొగం చిట్లించుకుంటూ "ఏమిటండీ ఆ నవ్వు? రిహార్సల్సులో ఈలా ప్రతిబంధకాలు పెడితే నాటకం ఏలా తయారవుతుందండీ కోనంగిరావుగారూ?" అని అన్నాడు.

"అవదండి నాకు తెలుసును. కాబట్టి కానీయ్యండి. ఏమిలేదు ఆ పాట ఎందుకూ? ఏడుస్తూ ఎవరన్నా పాట పాడతారా? అని నవ్వు వచ్చింది" అని కోనంగిరావు అన్నాడు.

ఒక నటకుడు "మీకిష్టం లేకపోతే నాటకం మానివెయ్యండి" అన్నాడు.

"కోనంగిరావుగారు మానివేస్తే నేనూ మానివేస్తాను" అని ఉష వేషంవేసే అమ్మాయి లేచి నిలుచుంది.

"మన్మథుడు లేకపోతే రతి ఎందుకు?" అని రతీదేవి వేషంవేసే అమ్మాయి లేచింది.

కార్యదర్శి గోలపెడుతూ "అదేమిటండీ, నన్ను కూయంనదిలో పడమన్నారా, ఈ నాటకం అవుతుందని పేపర్లన్నిటిలో వేశాం. ఆహ్వానాలు పంపాము. కరపత్రాలు అచ్చువేసి పంపుతున్నాము. టిక్కట్లప్పుడే వేయిరూపాయల వరకూ అమ్ముడయ్యాయి. అందులో కోనంగిరావుగారి పేరు చూచే మూడు నాలుగు వందల రూపాయలు వచ్చాయట. నాటకం మానివేసి ఆంధ్రమహాసభను నడిసముద్రములో ముంచుతారా?" అని అన్నాడు.

కోనంగి నవ్వుతూ "చిదంబరంరావుగారూ! మీరేమీ భయపడకండి. నేను మానటంలేదు. ఎవ్వరూ మానరు. ఉషా అనిరుద్ధులు కలిసినప్పుడు విడివిడిగా పాటలు పెట్టారు. రతీమన్మథులు కలిసినప్పుడు పెట్టారు. అవి చాలు. ఈ రంగం తర్వాత ఒక కొత్త రంగం ఉష తన గదిలో ఒంటిగా ఉండి, తన చరిత్రకు సంబంధించినట్లు ఒక పాట పాడితే బాగుంటుంది. అది మన కవిగారే రాసినారు. అది నేను కోరితే ఇచ్చారు. ఆ రంగం కూడ రాసినారు" అని చదివి ఆ పాట పాడి అందరకూ వివిపించాడు. అది చదువుతోంటే, పాట పాడుతూంటే విని అక్కడివారు ఆ నాట్యాభినయానికి ఆనంద నిమగ్నులైపోయినారు.

## 11

*నీలాలు విరిగినవి, నింగిలో బూడిదలు*
*నీటి కలువలు తూలి నిలువునా కూలాయి*

**1**

*మసక మసకేసింది మధుమాస శశిమూర్తి*

**2**

*కుసుమ మధువులు అలమె విసపు మంటలు శక*

**3**

*తెగిపోయెనా వీణ తీగెలన్నీ నేడు*
*పొగలెగసె ధూపాల సెగలెత్తె హృదయాన*
*చిత్రఫలకమునందు చేరలేదే కుంచె*
*పత్రరచనకు రావు వర్ణనిన్యాసాలు*
(ఆమె కంటిలో అశ్రువులు చేరాయి)

## చిత్రలేఖ ప్రవేశించును

**చిత్ర:** చెలీ! ఏమిటి ఆ కంటనీరు లేక కళ్ళుబారి కూర్చున్నావు. నీ భర్త వట్టి అందకాడు మాత్రం అనుకున్నావు.

(ఉషాసుందరి ఎదుటికిబోయి ఆమె ఎదుట మోకరించి) ఈలా చూడా రాజకుమారీ, నీ తండ్రికి వేయి చేతులున్నాయి. కాబట్టి ఆయనను ఎవ్వరూ ఓడించలేరు. సుకుమారుడు త్రిలోకమోహనుడు అయిన నీ అందాల బాలుని సాలీడు మధుపాన్ని పీల్చినట్లు పీల్చివేయగలడని అనుకుంటూ భయపడుతున్నావు.

**ఉష:** (తల తిప్పకుండా నిస్పృహతో) చిత్రలేఖా, నిన్నెవరు ఆ కోమలాంగుని మాయచేసి తీసుకురమ్మన్నారు?

**చిత్రా:** నువ్వేగాదూ!

**ఉష:** ఏ విద్యచేత త్రిలోకపూజ్యుడు ఉన్నాడని గ్రహించగలిగావో, ఏ శక్తిని ఉపయోగించి అతణ్ణి ఇక్కడికి తీసుకు రాగలిగావో, అవన్నీ ఇప్పుడు బలహీనమై నిన్ను వదలి మాయమైపోయాయా?

**చిత్ర:** ఏమిటా మాటలు!

**ఉష:** రోగంతో బలహీనమై పోయాయా? ఆ మాటకు సమాధానం చెప్పవేమి?

**చిత్ర:** బలహీనం కాలేదు. అప్పుడెంత అవిచ్ఛిన్నంగా ఉన్నాయో ఇప్పుడూ అంతే.

**ఉష:** అయితే వానిని నీ కంటిపాపలా కాపాడుతూ వెంటనే ద్వారకలో విడిచిరా! వెంటనే వెళ్ళు.

**చిత్ర:** ఇక్కడ నా శక్తికన్న మించిన శక్తిగల సేనాపతులు అనిరుద్ధ కుమారుని బంధించినారు.

**ఉష:** అయితే ఏమిటి? నువ్వు నాకు ఊరడింపు మాటలు చెప్పడం సాగించావు. నీ మాయే ద్వారకా నగరవాసుల్ని మోసంచేసినప్పుడు, నీ మాయ కన్న అనేక రెట్లు గొప్పదైనదా సేనాపతుల మాయ! అలాంటిది మా నాయనగారి మాయ ఎంతో శక్తిగలదే! దానిముందు పది ద్వారకా నగరాలు ఎత్తి వచ్చినా అవి ఏమి చేయగలవు?

**చిత్ర:** వారేవా! యెంత తెలివిగా మాట్లాడుతున్నావు! ద్వారకా నగరము అంటే ఏదో పెద్ద పట్టణం, అందులో మామూలు ధైర్యవంతులు మాత్రం ఉంటారు. వారు మీ తండ్రిగారి ముందు ఏం చేయగలరని?

**ఉష:** అవును చిత్రలేఖా! (విచారంగా)

**చిత్ర:** ఎంతైనా తండ్రి! వెనక మీ మామగారి మేనత్త సుభద్రాదేవి నువ్వు పడిన క్లిష్ట సమస్యలోనే పడింది. అక్కడ ఆవిడ తన భర్త అన్నగారు యెక్కువ శక్తిలవారు అని అనుకోవడానికి కారణాలున్నాయి?

**ఉష:** వారికేమి ఉన్నాయీ?

**చిత్ర:** ఏమిటా, ఆమె అన్నగారు అవతారపురుషుడని ఆమె నమ్మకం.

**ఉష:** ఇక్కడ?

**చిత్ర:** ఇక్కడ నీ మనోనాయకుని తాతగారు ఆయనేగా?

**ఉష:** అవును చిత్రా! నాతో చెప్పావుగా శ్రీకృష్ణభగవానుని పౌత్రులే ఈ...

**చిత్ర:** పరమ సుందరకారుడు-అని చెప్పినానులే! నేను ఆ భగవానుని ఇచ్ఛలేనిదే అనిరుద్ధకుమారుని తీసుకొనిరాగలిగాననా?

**ఉష:** ఏమిటి నువ్వనేది?

**చిత్ర:** నీకు నీ మీదే నమ్మకంలేదు. అసురబాలికా లక్షణం పోగొట్టుకొన్నావుకావు. మీ అత్తగారు అసురబాలిక, మీ సవతి అత్తగారూ అసుర రాకొమరితే! వారందరి చరిత్రలు నీ వంటివే! కనుక ఏమీ దిగులు పెట్టుకోకు. నీ తండ్రి పరమశివుణ్ణే ఇంట్లో కట్టేసుకున్నాడు. అయినా నీ తండ్రి ఎప్పుడైనా కౌరవుల పక్షం అవుతారేమోనని ఉన్న వేయి చేతులబలం తగ్గించివేద్దామని ఆ కృష్ణయ్యగారి ఆలోచన అనుకుంటా!

**ఉష:** ఉండు చిత్రా, అయితే నువ్వు వెంటనే బయలుదేరి ఆ భగవానునకు జరిగిన సంగతి చెప్పి వారిని వీరిసాయంగా....

**చిత్ర:** తప్పక తీసుకువస్తా! ఏమీ సందేహంలేదు. అలా ధైర్యంగా ఉపాయాలు ఆలోచించు. ఈలోగా నీ శక్తి ఉపయోగించి కారాగారంలోనో, ఇవతలనుండో వారిని కలుసుకో!

(చిత్రలేఖ నిష్క్రమించును)

## రంగం - కారాగారం

ప్రవేశం అనిరుద్ధుడు

**అనిరుద్ధుడు:** కాపలాకాసే అసురవీరుడా!

ప్రవేశం అసురవీరుడు

**అసురవీరుడు:** ఏమయ్యా! ఏమిటి? ఎందుకు పిలిచావు ప్రభూ!

**అనిరుద్ధ:** ఒక వీణ తెప్పించి ఈయగలవా?

**అసుర:** చిత్తం ఎలాంటి వీణ తెమ్మన్నారు? నారద, శారద, రుద్రవీణలున్నాయి. విపంచి, రావణ హస్తము, కిన్నెర వీణలున్నాయి. ముఖవీణలున్నాయి.

**అనిరుద్ధ:** రుద్రవీణే తెప్పించు.

**అసుర:** చిత్తము. పురుషునివలె అడిగారు! వాయించగలిగితే రుద్రవీణే వాయించాలి. మీ గురువు ఎవరు?

**అనిరుద్ధ:** మా తండ్రిగారు నాకు వీణ చదువు చెప్పారు! మా తాతగారు పూర్తిచేసినారు.

**అసుర:** మా రాజకుమారిగారికి నారదమహర్షులు గురువు.

**అనిరుద్ధ:** నారదమహర్షులు మా తాతగారు సృష్టించిన నూతన విధానాలు, మా తాతగారి దగ్గరకే వచ్చి నేర్చుకున్నారు.

**అసుర:** ఎవరు ప్రభూ! మీ తాతగారు?

**అనిరుద్ధ:** శ్రీకృష్ణమహాత్ములు.

**అసుర:** అలాగా! విన్నాను. ఇక్కడికి ఏభైయోజనాల దూరం ఉన్న ద్వారకా నగరంలో ఉన్న వేదాంతులైన రాజర్షికాదూ?

**అనిరుద్ధ:** అవునయ్యా వీణమాట ఏమి చేసినావు?

**అసుర:** చిత్తం ఇదుగో తెప్పిస్తున్నా!

అసురవీరుడు నిష్క్రమించును. ఉషాబాల బాలుని వేషంలో వీణ మోయుచుండగా అసురవీరుడు ప్రవేశిస్తాడు.

**అసుర:** ప్రభూ! ఈ బాలుడు వీణలో ప్రసిద్ధ గాయకుడట. మహారాజకుమారిగారు వీరిని తమకడ వీణవాయింప పంపినారు. నాకు ఎదురైనాడు వారి ఆజ్ఞతో. ఈతని పాట వింటూ ఉండండి. ఈలోగా మీకు రుద్రవీణ వచ్చేటట్లు చేస్తాను.

అనిరుద్ధుడు ఉషాదేవిని ఆనవాలు పట్టలేదు.

**అని:** రావయ్యా లోనికి, నువ్వు పట్టుకువచ్చిన వీణ నేను చూచినట్లున్నది.

ఇద్దరూ లోనిమందిరములోనికి నిష్క్రమిస్తారు.

తెర వాలును.

## (12)

## రంగం - కారాగారంలో ఒక మందిరం

**ప్రవేశం:** అనిరుద్ధుడు అక్కడ ఒక చిరుసింహాసనముపై అధివసించి, ఉషాదేవి బాలకస్వరూపంలో వీణ వాయిస్తూ-

**ఉష:** (వీణ వాయిస్తూ ఉంటుంది పాట అయినది)

**అని:** ఏమిటయ్యా! ఈ పాట చాలా కొత్తరకంగా ఉందే?

**ఉష:** (నోటివైపు వేలుతో చూపించి మాటలాడలేనని వ్యంజనం చేస్తుంది)

**అని:** పాపం వినికిడి వున్నది. కాబట్టి పుట్టుకలో బధిరత్వంకాదు. ఎందుచేత మాటాడలేవు?

**ఉష:** (నాలిక చూపించి తన నొసట వేలు రాసి, విధికృత్యమని వ్యంజనము చేయును.)

**అని:** జబ్బు చేసిందా?

**ఉష:** (అవునని గట్టిగా తల ఊపును.)

**అని:** భగవంతుడు ఎంత నిర్దయుడు? వాయించవయ్యా, ఇంకో పాట వాయించి రాగాలాపనచేయి. నీ పాట బాగానే ఉంది.

**ఉష:** (ఒక కొత్తరాగం వీణమీద ఆలపించును. ఆ ఆలపించడమూ కొత్త విధానంగా ఉంది. సంప్రదాయ విరుద్ధంగా ఉంది; కాని సంప్రదాయానికి శ్రుతిగానూ ఉంది. పాట పూర్తి అవుతుంది)

**అని:** ఇదేమిటి? సంప్రదాయ విరుద్ధంగా ఉన్నా లేనట్లు కనబడుతుంది. ఎక్కడిదయ్యా ఈ విధానం?

**ఉష:** (వీణమీద తాను ఉషాదేవిగా వాయించినట్లు వాయిస్తుంది.)

**అని:** (ఆశ్చర్యం పొందుతూ ఆ బాలకుని వైపు చూస్తాడు.)

**ఉష:** (వాయిస్తూ, తన తీయని కంఠంతో పాట పాడుతుంది.)

పద్మ బంధిత మధుపమూ ర్తికి
పాటలేలా పదములేలయ్యా,

**అని:** ఏమిటీ? ఎవరు నువ్వు? (చటుక్కున లేచి ఆ బాలకుని తల చీర ఊడతీస్తాడు. ఉషాదేవి జడ క్రిందకు వాలుతుంది.)

**ఉష:** అదేమిటండీ, నా గౌరవం అంతా భగ్నపరుస్తున్నారు?

**అని:** దొంగా! కంటికాటుకతో రచించుకొన్న మీసాలు అచ్చంగా నూనూగు మీసాలే అనుకున్నాను. నన్ను ఎంత భ్రమపరచావు? అసురమాయ!

(ఆమె దగ్గిర కూరుచుండి తన కండువాతో ఆమె మీసము తుడిచి వేయును.)

**ఉష:** నా పాటకు అడ్డం రాకండి. అంతఃపుర ద్రోహం చేసిన బంధితులకు పాట లెందుకనైనా ఆలోచింపక నేను వచ్చి పాడుతూ ఉంటే నన్ను బాలిక అంటూ అవమానపరుస్తారా!

**అని:** అవును, నీవు ఉషాకుమారుడవు. నేను పొరపాటున నిన్ను ఉదయించే ఉష అనుకున్నాను.

**ఉష:** మీరు రాత్రా!

**అని:** నేను రాత్రినో, ఉషను హృదయంలో ఒదిగించుకొన్న నీలాకాశాన్నో! నాకేమి తెలుసును.

**ఉష:** అంత మతిపోవడానికి కారణం?

**అని:** ఒక ఎఱ్ఱి అమ్మాయి వలలో పడ్డాను. దాంతో సగం మతిపోయింది. ఆ అమ్మాయి తండ్రి ఒక వేయి కిరణాల, బాణాల అసురుడు. విరసుడు బంధించడమువల్ల, ఆ ఎఱ్ఱి అమ్మాయిని విడిచి ఉండడం అనే విరహంలో బడి తక్కిన మతి కూడా పోగొట్టుకున్నాను.

**ఉష:** పాపం! అందుకనే మందులివ్వడానికి వచ్చాను.

**అని:** ఆ మందు నువ్వే యివ్వగలవు, రా! ఓయి వైద్యుడా, నా దేహానికి ముందు నా హృదయానికి మందు –

**ఉష:** చాల్లెండి! నేను వెళ్ళి మందులపెట్టి పట్టుకువస్తాను.

**అని:** అబ్బా! నువ్వు వెళ్ళడమే నాకు భయంగా ఉంది. నన్ను గట్టిగా అదిమి పట్టుకో వైద్యుడూ, ఎఱ్ఱిని ఆ నీ పెదవులు.

**ఉష:** నేను వెడుతున్నా... (ఆమె లేచును. అనిరుద్ధుడు ఆమె చేయి పట్టుకొని ఆ వెనక రెండు భుజాలు పట్టుకొని, ఆమె కళ్ళల్లోకి చూస్తూ ఉంటే...)

ప్రవేశం బాణుడు సంరంభంగా

**బాణు:** ఓయి దుర్మార్గుడా! అంతఃపుర ద్రోహం చేశావని, ప్రాణశిక్ష విధించాలని కారాగారంలో పెడితే ఇక్కడ కూడా....

**ఉష:** (భయపడుతుంది వణికిపోతుంది. తండ్రి కడ మోకరించి చేతులు జోడించి) చక్రవర్తీ! ఇదంతా నాది తప్పు, నన్ను శిక్షించండి!

**బాణా:** ఛీ! నిన్ను శిక్షించడమేమి? ఈతడు అంతఃపుర ద్రోహం చేశాడు.

**ఉష:** చేయించింది నేను.

**బాణా:** నువ్వు చేయించడమేమిటి?

**ఉష:** నేనే ఆయన్ను నా అంతఃపురంలోకి రప్పించుకున్నా!

**బాణా:** నువ్వేలా రప్పించుకోగలవు?

**ఉష:** నా చెలికత్తె నొక బాలికను పంపి ఈ మహాపురుషుడు నిద్రపోతోంటే, నా మందిరానికి రప్పించుకొన్నాను.

**బాణా:** అయినా వీడు పురుషుడు! అబల అయిన బాలిక ఒకర్తె మంచీ చెడుగూ తెలియని పసిబిడ్డ తన అంతఃపురానికి రప్పించుకుంటే తాను ద్రోహం చేయడమే?

**ఉష:** భర్త భార్యను అంతఃపుర ద్రోహం ఎల్లా చేస్తాడు?

**బాణా:** వాడు నీ భర్తా?

**ఉష:** అవును మహారాజా అవును! ఈయన్ను నేను మన అసురశక్తిచే నా అంతఃపురంలోనికి రప్పించగానే ఒక పురోహితుని రప్పించి అగ్నిసాక్షిగా వివాహం –

**బాణా:** ఏమిటి వివాహమా? అయితే నువ్వూ శిక్షార్హురాలివే!
**ఉష:** వేయండి, నా భర్తతోపాటు నాకు కూడా శిక్ష. నన్ను అబల అన్నారు. పసిబిడ్డనన్నారు. స్త్రీలు అబలలా చక్రవర్తీ? ఎవరు చేశారు మమ్మల్ని అబలలుగా? మా మామగారి సవతితల్లి సత్యవతీదేవి నరకమహారాజును ఓడించినప్పుడు స్త్రీలు అబలలుగా కనపడ్డారా తమకు?
**బాణా:** ఏమిటీ నువ్వు అంతకన్న అంతకన్న ఔచిత్యం మీరి మాట్లాడుతున్నావు. నీ ఎదుటనే నీ దొంగ భర్తను బట్టలొలిపించి ఒళ్ళంతా హూనమయ్యేటట్లు కొరడాతో- (అంటూ అనిరుద్ధుని కడకుపోయి అతని రెండు చేతులు పట్టుకుంటాడు. ఉష తూలి క్రిందకు వాలిపోతోంది.)

ప్రవేశం ప్రత్యక్షమయినట్లు ప్రద్యుమ్నుడు.

**ప్రద్యు:** (పకపక నవ్వుతూ) వేయి బాహువుల బలంగల మా బావగారు బాలకుల మీదకు పోతున్నారు, ఇదట ఇదీ మీ ప్రతాపం? సమఈడుగల వియ్యంకులమీద చూపుదురు కాని.
**బాణా:** (సంశయంతో ప్రద్యుమ్నుని ఒకసారి, అనిరుద్ధుని ఒకసారి చూసి అనిరుద్ధుని చేతులు వదలి) ఎవరయ్యా నువ్వు? ఈ అబ్బాయి పెద్దన్నగారిలా ఉన్నావూ?
**ప్రద్యుమ్నుడు:** (పకపక నవ్వుతూ) కోడలు వాలిపోయింది. మామగారియందు భర్తతో మా అనిరుద్ధ కుమారుడు యుద్ధం చేయడు. చటుక్కున పట్టుపడ్డాడు. భర్త అనిన్నీ, తన తండ్రి సహస్ర బాహుబలం కలవాడనీ అనుకుని భయపడి కుంగిపోయింది. కోడలిని సేదతీర్చవా ప్రాణేశ్వరీ!

ప్రవేశం మాయాదేవి ప్రత్యక్షమయినట్టు.

**మాయా:** (రతి) ఉషా రాకుమారీ! లే! ఈలా వచ్చి నా హృదయాన వాలు (ఉషను పొదివి పట్టుకుంది.)
**బాణా:** ఇదేమిటయ్యా. నా అంతఃపురాలలోకి భార్యతో వచ్చావు. ఎవరు నువ్వు?
**ప్రద్యు:** మేము ప్రద్యుమ్న నామధేయులము. మా జనకులు శ్రీకృష్ణ...
**బాణా:** అలా చెప్పు. ఆ నలుపూ. ఆ నెమలిపించాలూ చూస్తూ కూడా ఆనవాలు పట్టలేక పోయాను. నాతో యుద్ధం చేయడానికి ఆ చేతిలో ఆ లీలాకమలం ఏమిటీ?
**ప్రద్యు:** ఈ పువ్వు యొక్క శక్తి ఎరుగరు మీరు బావగారూ! (ఆ పుష్పంతో బాణుని రొమ్ముపై లీలగా కొట్టగా విద్యుచ్ఛక్తి తాకిడి అయినట్లయి తూలిపోతాడు. తెర ఎత్తగా 20 మందిగాని, 30 మందిగాని బాలికలు నాట్యంచేస్తూ వగలు చూపిస్తారు. ఇక్కడ వెలుగు దర్శకత్వం బాగా చూపించాలి. సంగీతం అతిమనోహరం. బాలికలందరు బాణుని చుట్టి కౌగిలింతలు. ముద్దులు మొదలయిన చర్యలు నాట్యంలో చూపిస్తారు, చేస్తారు.)

## (13)

ఈ రకంగా నాటకం అంతా పూర్తి అయింది. ప్రద్యుమ్నుని పాత్రపోషణ, మాయాదేవి పాత్రపోషణా, కథాసంవిధానంలో వీరిరువురకూగల గాఢసంబంధమూ చాలా రంగాలలో విన్యసింపబడింది. నాటకానికి అసలు దర్శకుడు కోనంగే అయ్యాడు. అసలు కథా, దాని సంవిధానం అంతా మార్చించాడు.

నాటక ప్రారంభంలో, ఇద్దరు వేదపండితులు వచ్చి వేదసూక్తము ఉషాదేవిని ప్రార్థిస్తూ గానం చేస్తారు.

తెర పైకి లేస్తుంది. పొలం, ఉషఃకాంతులు అంతటా ప్రసరిస్తాయి. రైతులు వచ్చి

*"మా దేశానికి ప్రత్యూష వచ్చిందీ*
*మా ఎదదలోనే స్వేచ్ఛాకాంతులు దరిశాయీ*
*హిందూ ముస్లిం పారశీ శిక్కూ*
*అందరం ఏకం అవుతామూ*
*సంపూర్ణంగా దేశమాతకూ*
*స్వాతంత్ర్యాన్ని తెస్తామూ"*

అనేపాట పాడుతూ జై భరతమాతకూ జై అని వెడతారు.

ఇంతలో ఒక ఆంధ్రకళోపాసి వచ్చి "నేను ఆంధ్రుడనండీ, ఉష మా ఆడపడుచు. బాణుడూ, నరకుడూ మా వాళ్ళు. ప్రాగ్జ్యోతిషమే ధనకటక నగరం అయింది. ఆ రాజకుమారి బాగా చదువుకున్న అమ్మాయి. సర్వకళలూ నూతన జీవితం పోసుకున్నాయి. సిద్ధహస్త అయిన ఆమె ప్రతిభ చేత, ఉషా సంప్రదాయం జగత్ ప్రసిద్ధము! ఆమె సర్వశాస్త్ర జ్ఞానంలో ఆరితేరిన పండితురాలు. కాబట్టే ద్వారకలో వున్న తన మనోనాథుని కొద్ది కాలం వ్యవధిలో తన నగరానికి తెచ్చుకుంది. నూత్న సంప్రదాయాలు తెచ్చినది ఉషాదేవి! తండ్రి పూర్వ సంప్రదాయం, ఆయనకూ కళలకు నూతనత్వం చేకూర్చినది కృష్ణుడు. అనిరుద్ధుని విషయంలో మహా యుద్ధము అవుతుంది. అనిరుద్ధుడు యువక హృదయమూర్తి. ఉష సర్వకళలలో నిత్యమైన నూతనోదయం. కళారహస్య ప్రద్యుమ్నుడు, రసము, అతి సమ్యస్థితి శ్రీకృష్ణుడు. పూర్వాచారము బాణుడు. ఈ నాటకం ప్రసిద్ధి కెక్కిన నవ్యకవి భూదేవరాజు వ్రాసినాడు. సెలవు" అని సూత్రధారులు వెళ్ళిపోయినారు.

నాటకం ఎంతో రక్తికట్టింది. భారతంలోని ఉషాసుందరీ పరిణయ ఘట్టంలోని పద్యాలు అబ్బయామాత్యుని "అనిరుద్ధ చరిత్ర" కావ్యంలోని పద్యాలూ, రంగమూ, రంగమూ మధ్యన మంచి గొంతుకలుగల ఇద్దరు యువకులు నేపథ్యం నుండి చదువుతూ వచ్చారు.

నాటకం పూర్తికాగానే, చివర అభినందన సమర్పణ అయింది. ప్రద్యుమ్న పాత్ర నిర్వహించిన కోనంగిని ఎంతమందో మెచ్చుకుంటూ మాట్లాడారు. అ నాటకం ఇంకోసారి అక్కడే ఆడడానికి నిశ్చయించారు. ఆ రాత్రికి రాత్రి అప్పుడే అయిదువందల రూపాయల టిక్కెట్లు అమ్ముడై పోయాయి.

కోనంగి మొగం తుడుచుకుంటూఉంటే అనంతలక్ష్మి పరుగున వచ్చి "ఓహో ఏమి అద్భుత అభినయం మీది? అందరూ మెచ్చుకున్నారు. ఈ నాటకానికి ప్రద్యుమ్నుడే కథానాయకుడా అన్నారు కొందరు సుమండీ" అన్నది.

**కోనంగి:** నన్ను ఎక్కువ మెచ్చుకోకు లక్ష్మీ!

**అనంత:** అంత బాగా అభినయించారు. మీ రక్తంలో కూచిపూడి వారి సంప్రదాయం ఏమన్నా ప్రవహిస్తోందా?

**కోనంగి:** అవును లక్ష్మీ! మా అమ్మగారు కూచిపూడిలోని ఒక కుటుంబంవారి ఆడపడుచు.

**అనంత:** అలా చెప్పండి. మా దక్షిణాది నర్తకీ జాతికి గురువులు మీ కూచిపూడి వారేనట.

ఇంతలో సీతాదేవి అక్కడికి వచ్చింది. "హల్లో, కోనంగిరావుగారూ! మీరు బందరు నుంచి తిరిగి వచ్చి దుక్కిటెద్దులు సినీమాలో అభినయించారు. ఇంతవరకూ ఎనిమిది సారులు చూశాను. ఎంతబాగా అభినయించారండీ ఆ చిత్రంలో. ఇంకా ఏ ఏ బొమ్మలలో అభినయిస్తారు? ఈ నాటకంలో అభినయిస్తున్నారని తెలిసి వచ్చాను" అని గబగబ మాట్లాడి అతని హస్తము స్పర్శించి సంతోషంగా జాడించింది.

**కోనంగి:** సీతాదేవిగారూ! మిమ్మల్ని చూడడం చాలా సంతోషంగా వుంది. మీరు ఈ ఏడు సీనియర్ ఎఫ్.ఏ.కు వచ్చారుకదూ?

**సీత:** అవునండీ.

**కోనంగి:** అనంతలక్ష్మి వీరు సీతాదేవిగారు. హేబారు అయ్యంగార్లు వీర్ని పెండ్లి చేసుకుందామనే ఈవూరు వచ్చాను. కాని లాభం లేకపోయింది. వీరి తండ్రిగారు ప్రభుత్వ కార్యదర్శి కార్యాలయంలో ఒక కార్యదర్శి. సీతాదేవిగారూ, ఈ బాలిక అనంతలక్ష్మి- నా జన్మాన్ని ఏలబోయే చక్రవర్తిని, బి.ఏ. జూనియర్ చదువుతున్నది.

**సీతా:** వీరిని బాగా ఎరుగుదును. వీరు మా కాలేజీలో ఎన్నో బహుమానాలు, ఆటలలో, ఉపన్యాస వ్యాసంగంలో కొడుతూ వుంటారు.

**అనంత:** వీరిని నేనూ ఎరుగుదును. మా కాలేజీ తమిళ సంఘంలో సభ్యులుగా వున్నారు.

**కోనంగి:** రండి మనం పోదాం.

**సీతా:** మీరిద్దరూనూ మా యింటికి రేపు టీ పార్టీకి రావాలి.

**కోనంగి:** తప్పకుండా, ఏమంటావు అనంతలక్ష్మీ!

**ఆనంత:** వస్తానండీ సీతాదేవిగారూ! ఎన్నిగంటలకు?

**సీత:** సాయంకాలం అయిదున్నరకు. తప్పకుండా రండి. మా తండ్రిగారి ఆహ్వానము రేపు ఉదయమే అందుతుంది. సెలవు. మంచిరాత్రి మంచిరాత్రి!

ఆమె అతివేగంగా వెళ్ళిపోయింది. అనంతలక్ష్మి, కోనంగీ గబగబ మెట్లుదిగి, అనంతకారులో కూర్చున్నారు! జయలక్ష్మి అదివరకే వెళ్ళికారులో కూర్చుంది. వీరు కూడా వెనుక స్థలంలో కూర్చుంటే కారు కదిలి వెళ్ళింది.

**జయలక్ష్మి:** కోనంగిరావుగారూ! చెట్టియారు రాయించే ఉత్తరాలు చూస్తున్నారుకాదూ! అరవభాష మీకు రాదు. చదవరాని భయంకర భావాలతో ఉన్నాయి. ఎవరిచేతనో రాయిస్తున్నాడు. అదేదో చచ్చు తమిళం వారపత్రికలో పేర్లు మార్చి నన్ను గురించి, మా అమ్మాయిని గురించీ కథ రాయిస్తున్నాడు. నేను ఏమిచేయను?

**కోనంగి:** అత్తగారూ, మీరేమీ కంగారు పడకండి. ఈ చెట్టియారుకు భగవంతుడు త్వరలో బుద్ధిచెబుతాడు లెండి. మనం ఏమీ తొందరపడవద్దు. సత్యం మనకు తెలుసు. మన స్నేహితులందరకూ తెలుసును. అందుచేత వాడు ఎన్ని అవకతవక పనులు చేస్తే ఏమి భయం?

**అనంత:** అమ్మా! ఈ విషయం మా మాష్టరుగారు నాకు బాగా బోధించారు. ఆ రాతలవల్ల, ఆ ఉత్తరాలవల్ల, మనకు వచ్చే నష్టమేమిటి?

**కోనంగి:** నిజంగా ఆలోచిస్తే మనకు వచ్చే నష్టం ఏమీ కనబడదు. మనం గోలపెట్టి మనస్సులో బాధతో తొందరపడి ఏ పనైనా చేశామా వారి ఉద్దేశం మొదటి తరగతిలో మొదటగా, నూటికి యాభై మార్కులతో నెగ్గిందన్నమాటే!

వారు ముగ్గురూ అనంతలక్ష్మి ఇంటికి పోయారు. జయలక్ష్మి కోనంగిని తన ఇంటి దగ్గరనే పడుకోమని కోరింది.

డాక్టరు తనకోసం కనిపెట్టుకొని ఉంటాడనీ, ఒక గంట మాట్లాడి కాస్త కాఫీ త్రాగి తాను నడిచి వెళ్ళిపోతానని కోనంగి అన్నాడు.

జయలక్ష్మి లోనకు వెళ్ళిపోయింది. వెంటనే అనంతలక్ష్మి కోనంగి భుజంచుట్టూ చేతులుచుట్టి 'పాపం, మీరా సీతాదేవిని ఎందుకు పెళ్ళిచేసుకోలేకపోయారో' అని ప్రశ్నించింది.

"చేసుకునేవాడనే, ఆ అమ్మాయి వద్దంటే నేను ఏమి చేయను?"

"చేసుకుంటానంటే ఏంచేద్దురు?"

"అనదు! నా ఆశయరూపిణి నాకోసం ఎదురుచూస్తూవుంటే ఎలా ఒప్పుకుంటుంది?" అంటూ కోనంగి ఆమెను హృదయానికి అదుముకొన్నాడు.

తనకో పెద్ద సంసారం సిద్ధం అయింది. ఇదివరకు కోనంగి తన ఇష్టం వచ్చిన దారిన తిరిగాడు. తోటదారులలో, సిమెంటురోడ్డులో, కంకర రహదారిలో, పుంతలో, రాధారులో, కాలిబాటలో, అతడు సముద్రం ఎదుట నిలిచాడు. కాని ఆ సముద్రభావం ఏమి తెలిసింది. అతడు వీధులలో నడిచాడు. ఆ వీధుల పొదివికొన్న ప్రజానీకం అనుభవించే బాధలూ, ఆనందాలు ఎంత లోతులలో ప్రారంభం అయ్యాయో, ఎంత పై ఎత్తుకు ఎగిరిపో గలవో, ఎవరు చెబుతారు.?

కోనంగి ఒంటిగానే లోకం మధ్య నిలిచి వున్నట్లే లోకంలో బాధలూ లోకం ఆశయాలు, ఆవేదనలు అతని కేమి తెలియును? ఒకనాడు తాను ఎడారి దారిని నడుస్తున్నాననీ, దానికి అంతులేదనీ, తాను దాహంతో ఏమయిపోవాలో అని వణికిపోయాడు. ఒకనాడు లక్షలకొలది జనం మధ్య వారితోపాటు తోసుకుంటూ వారి చెమటలు, వారు ఒంటికి రాసుకున్న అత్తరువులు, వారి ఊపిరి వెంట గంధాలు, వారి తాంబూలపు సువాసనలు, మాసిన చిరిగిన బట్టలకంపు, చాకలి ఉతికి తెచ్చిన బట్టలపై, వారలలుముకున్న సువాసనల ముంపు ఇవన్నీ అతన్ని పొదివికొన్న మాటా నిజమే?

కాని జీవితం యొక్క బాధకు నిజస్వరూపము విశ్వరూపమై అతనికి దూర దూరంగానే వుండిపోయింది. అతని బాధకు అతని నవ్వు విరుగుడు. లోకబాధకు లోకాన్ని నవ్విస్తే నవ్వు చండాగ్నిని ఆర్పగలిగే పాలసముద్రం అవుతుంది.

కోటి కోటి చేతులు చాపి, కోటి కోటి గొంతుకలెత్తి లోకప్రజ యుగాల నుండి హృదయానికీ, దేహానికీ, మనస్సుకూ, ఉత్తమస్థితి, న్యాయంకానిస్థితి, ధర్మమైనస్థితి కోరుతూంది. అందుకై కుములుతూవుంది. అప్పుడప్పుడు ప్రళయ తాండవ మాడింది. కుంగి భూమిపై వ్రాలిపోయింది, ఒక్కొక్కణ్ణి నాయకుణ్ణి చేసుకుంది. ముందుకు సాగింది. మళ్ళీ లేచి చిన్న మార్గాల చూచి ముందుకు సాగింది. ఎడారులు దాటింది. దారిలో నశించింది. ఆవలికి వెళ్ళింది. అక్కడ నందనవనాలు లేవు! అలా నడిచి ముందుకు పోతోవుంది.

కళలో, కవిత్వమో, వేదాంతమో, భక్తో, నమ్మకమో, జ్ఞానమో ఆ ప్రజకు చేతికఱ్ఱలుగా, నడిపించే శక్తిగా, దారిని వెలిగించే వెలుగుగా, దారిగా అయ్యాయి.

ఈ మహాదృశ్యము ఈ అనంత అఖండ విశ్వ ప్రజాజీవితం స్పందించే కోనంగి హృదయాన్ని తలుపు తట్టింది.

వెళ్ళవలసిన దారులనంతం. ఏ దారి అయినా ఒకటే అని కోనంగి అనుకున్నాడు.

మన ప్రాణస్నేహితులు కాబోయేవారు ముస్లింలీగువారు, కాంగ్రెసువారు, హిందూ మహాసభవారు, ఈలా ఎంతమందో ఉన్నారు.

సినీమా ప్రపంచంలో, నాటక ప్రపంచంలో ఒడుదుడుకుగా స్పందించే జీవితాలు తన జీవితగృహంలో ఆతిథ్యం పుచ్చుకుంటాయి.

జీవితపు మధ్యదారిలో కోనంగి నడవవలసిందే. నడుస్తున్నాడు. పరుగెత్తుతున్నాడు. ఇతరులు కొందరు పడిపోతున్నారు. కొందరు పాటలు, కొందరు ఆటలు, కొందరు

తాత్కాలిక బసలో చేరారు. కొందరు దారి దౌర్భాగ్యులకు సహాయం చేస్తున్నారు. కొందరు హేళన చేస్తున్నారు. కొందరు ఎవ్వరితోనూ మాట్లాడక తమ దారిన తాము పోతున్నారు. కొందరు ఆగి కూర్చుండి తమ చుట్టూ రక్షణకై గోడలు కట్టుకుంటున్నారు.

ఎంత విచిత్రమైనదీ దృశ్యం. ఈ మహాదృశ్యం, ఈ బ్రహ్మాండదృశ్యం అంతా చూడగలిగినవారు మహాపురుషులు. అదే ఎయన్‌స్టెయిను భావం. అదే శ్రీకృష్ణ భావం. అదే కారల్‌మార్క్సు భావం. అదే మహాత్మాజీ భావం.

ఇందులో ఎవరు ఈ ప్రపంచ ప్రళయాలు సృష్టించేవారు? వాని అర్థం ఏమిటి? అని కోనంగి డాక్టర్ని ప్రశ్నవేశాడు.

"ఓయి వెర్రివాడా! ఒక మనుష్యునిలో ఒక పెద్దజబ్బు ప్రవేశిస్తే అది ఎన్నో రూపాలుగా పైకి వస్తుంది. సామ్రాజ్యవాదం అనే జబ్బు లోకంలోకి వచ్చింది. ఇది పదిహేడవ శతాబ్దంలో విజృంభింపసాగి, ఇప్పటికీ లోకాన్ని బాధపెడుతూంది. ఆ జబ్బు యొక్క వెర్రితలలు ఫాసిజం, నాజీజమూను!"

"సామ్యవాదంలో లోట్లులేవా?"

"ఉండవచ్చును. అవి ఒక్కొక్క దేశంలో ఆ వాదం వేళ్ళు పాదుకోవడంలో వచ్చిన లోట్లు."

"ఆ లోట్లు ఎల్లా పోతాయి? లేకపోతే అవి పోనేపోవా?"

"కొన్ని పోవచ్చును. కాని ఎప్పటికీ పోకపోవచ్చును."

"డాక్టరులా మాట్లాడావు?"

"నేను డాక్టరు నయినప్పుడు ఇంక ఎల్లా మాట్లాడుతాను?"

"కొందరు డాక్టర్లు కూడా మామూలుగా మాట్లాడబోతారు."

"కొందరు మామూలు వాళ్ళు డాక్టర్లులా మాట్లాడబోతారు."

"కాని డాక్టరు డాక్టరుగా మాట్లాడడం అన్నింటిలో పనికి వస్తుందా నాయనా?"

## (14)

అనంతలక్ష్మి త్వరలో వివాహం కావాలని తల్లితో నిర్మొహమాటంగా చెప్పింది.

"అదేమిటే అమ్మిణీ! అవతల భూమి అంతా వ్యాజ్యంలో పడింది. ఇప్పుడే ఈ గొడవ అంతా ఎందుకు?"

"ఎప్పుడూ వారితో కలిసి మెలసి ఉంటూ వారి దగ్గర ఉన్నప్పుడు తదితర లోకం అంతా మరిచిపోయే నన్ను..."

"ఎంతకాలం ఈలా దూరంగా ఉండాలంటావు? అని నీ ప్రశ్న? నీ చదువన్నా పూర్తి అవ్వాలా?"

"అయితే అవుతుంది, లేకపోతేలేదు, చదువుకీ..."

"చదువుకీ పెళ్ళికీ సంబంధం లేదంటావు."

"స్నేహితురాండ్రందరూ వేళాకోళంచేసి చంపేస్తున్నారు."

"పెళ్ళి అయిన తర్వాత మాత్రం వేళాకోళం చేయరా?"

"చేయరమ్మా, పెళ్ళి అయిన వారి మాట అలా ఉంచు. మా కాలేజీలో పిల్లల తల్లులయిన వాళ్ళెందరో ఉన్నారు. పెళ్ళయినవారి జోలికి వెళ్ళకూడదని మా కాలేజీలో నియమం ఉంది."

"నీకు వీలుగా ఉంది నియమం!"

"నాకు వీలుగా ఉందోలేదో అదికాదు విషయం. నేను వారిని ఒక్క నిముషం వదలి వుండలేను. స్నేహం తప్ప యింకో సంబంధం లేకపోతే వారితో తిరుగుతూ యితర అనుమానాలకు గురికాకుండా ఎట్లా వుంటాను? నువ్వు ఏనాడు తెచ్చిపెట్టావో ఆ సెట్టియారును, ఆ రాక్షసుడు నెమ్మది నెమ్మదిగా మా కాలేజీలో నన్ను గురించి వినరాని అపవాదులన్నీ వెదజల్లు తున్నాడు."

"ఇదా వెర్రితల్లీ నీ భయమూ? మన్నారుగుళ్ళో మన అయ్యావార్లం గారిని ముహూర్తం పెట్టమందాం. నేను కోనంగిరావుతో చెప్పి అన్నీ సిద్ధం చేస్తాను."

ఆ మాటలు వింటూనే అనంతలక్ష్మి తల్లిని కౌగిలించుకొని తల్లి బుగ్గను ముద్దు పెట్టుకొని నాట్యంచేస్తూ తాను తన కాలేజీలో ఆడిన నాటకంలోని ఒకపాట:

*"లోక మెంత తీయనైంది*
*శోక మెంత హీనమైంది*
*మూక బాధ లేల ప్రజకు*
*ఆక లేల చీకటేల?*

*పూవులుండె తావులుండె*
*పూలనాను మధుపముండె*
*తావి పన్నీరుజల్లు*
*తావిరంగు ఉదయముంది.*
*రంగు రంగు భూమిపైన*
*రమ్యరూప దర్శనమ్ము*
*దారి పొడుగునా వెలుంగు*
*తలిరుటాకు తరళమూర్తి.*

*ఏదో యీ ఉదయంలో*
*హృదయంలో రాగమాల*
*ఆనందం తాళాలై*
*అడుగువేసె బ్రదుకుదారి"*

అని పాడుకుంటూ తన్నతిమనోహరంగా అలంకరించుకుంది. నాటకమైన నాల్గవరోజది. కోనంగి రావడం తరువాయి. అతన్ని పొదువు కోవడమే! అతను కదలడానికి వీల్లేదు. అది క్రిష్టమస్ సెలవరోజులు గనుక అనంతలక్ష్మి ఇంటి దగ్గిరే ఉండడం, కోనంగి సినిమాకు తీసుకు వెళ్ళాలి. కోనంగి బీచికి తీసుకొని వెళ్ళాలి. కోనంగి ఎక్కడికైనా తీసుకు పోవాలి. ఎన్నూరో, కంచో, మహాబలిపురమో, తిరుక్కాళికుందరమో (పక్షితీర్థం) కోనంగి వచ్చి శిల్ప సందర్శనమూ, క్షేత్ర ప్రదర్శనమూ చేయించాలి. తిరువన్నామలై వెళ్ళి రమణ మహర్షిని దర్శింపించాలి.

వాళ్ళకు సెలవలు సంక్రాంతి చివరకు. ఈలోగా చెన్నపట్నంలో గానసభలన్నింటికీ వెళ్ళారు. ఆమె తీగలా కోనంగిని అల్లుకుపోయింది.

కోనంగి ఆమె ప్రేమావేశం చూచి ఆశ్చర్యం పొందాడు. ఇంతవరకు అనంతలక్ష్మికి తన యందు గాఢప్రేమ లేదని ఎప్పుడూ అనుకోలేదు. కాని ఈ విధంగా తన్ను వివాహం కాకుండానే ఇంత చుట్టివేస్తుందని ఎప్పుడూ అనుకోలేదు.

ఒకరోజు సినిమా నుంచి వస్తున్నారు ఆమె కారులో. అనంతలక్ష్మి వెంటనే అతని కౌగలిలో ఒదిగిపోయింది. అతని మోము తన మోముకు గట్టిగా అదుముకుంది. అతని కన్నులు, అతని పెదవులు గాఢచుంబనాలతో ముంచెత్తింది. అతడు పరవశుడైకూడా, వట్టి సాక్షిలా ఆమె చేష్టలు గమనిస్తూ అలా ఊరకున్నాడు.

ఇల్లు వచ్చింది. లోనికి వెళ్ళాడు. "అనంతం! నీకీ మధ్య ఇంత ప్రేమ విజృంభణమైంది. దానికి నేనెంత ప్రశ్నించుకున్నా తోచటంలేదు?" అని ప్రశ్నించాడు.

అనంతం అతని వైపు తేరిపార చూచింది. ఆమె చూపులలో ఏవో తృష్ణలున్నాయి. ఆమె చూపులో ఒక నిమేషంలో దీనత అలము కొన్నది.

"మాష్టరుగారూ, మిమ్మల్ని ఒక ప్రశ్న అడుగుతాను. మీ హృదయంలో ఏమీ దాచకుండా నిజం చెప్పండి, మీరు నాటకాలలో, సినీమాలలో పాలు పుచ్చుకుంటున్నారు. ధనంకోసం కాదు. అని నా కర్థమవుతుంది. ఆ పనులలో మునిగిపోతారు. ఆ సమయాలలో ఒక్కొక్కప్పుడు నన్ను కూడా మరచిపోతారు. నాకు ఏమీ అర్థంకాక భయం కలుగుతూ ఉంటుంది."

"ఓసి వెఱ్ఱి అమ్మాయి, నీకు ఈ అనుమానం ఎందుకు కలగాలి? నువ్వు చదువుకొన్న అమ్మాయివి. నీకు చదువు ఎందుకు అని నేను ప్రశ్నవేయ వచ్చునా?"

"మాకు చదువు పురుషులతోపాటు ఆడవాళ్ళు సమం అవడానికి!"

"పురుషులు ఏమి చేస్తూ ఉంటారు?"

"అన్ని పనులూ."

"ఆ పనులన్నీ ఆడవారూ చేయాలా?"

"ఆ చేయలేనివి ఒకటి  రెండు ఉండవచ్చుగాక."

"అలాగే స్త్రీలు చేయగలిగిన పనులు మగవారు చేయలేనివి కొన్ని వున్నాయి!"

"అవును."

"అంతేగాని, అస్తమానమూ స్త్రీపురుషులు ప్రేమ ప్రేమ అని కూచోరుగదా!"

అనంతలక్ష్మి తెల్లబోయి కోనంగి వైపు చూచింది. అతడు చిరునవ్వు నవ్వుతున్నాడు. ఒక్క నిముసం అలా చూచింది. అనంతలక్ష్మి కన్నుల నీరు నిండింది. గబగబ లోనికి పరుగెత్తిపోయి, తన పడకగదికిపోయి, ప్రక్కమీద వ్రాలి వెక్కి ఏడవడం ప్రారంభించింది.

కోనంగి తెల్లబోయాడు. తానేమన్నాడు  ఆమెతో? ఆమె కళ్ళలో నీరు నిండిందే! ఆ దివ్యసుందరగాత్ర హృదయంలో ఏ బాధ చేరింది? ఆ అమలహృదయ మనస్సులో ఏ అనుమానం మొలకెత్తింది?

అతడు నెమ్మదిగా ఆమె గదిలోకి వెళ్ళినాడు. ఆమె పరుపుపై బోర్లగిల పడుకొని దిండులో తలదూర్చి సముద్రమై కరిగిపోతున్నది.

## 15

**"ఈ**లా చూడు లక్ష్మీ!" కోనంగి అనంతలక్ష్మిపై వ్రాలి, ఆమెను పొదివిపట్టుకొని, తనవైపు తిప్పుకొని, ఆమె చెవిలో "నువ్వు నాకు రాజరాజేశ్వరివి. నువ్వు నాకు ఆత్మవు. ఎందుకీ దుఃఖం? ఏమిటీ ఆవేదన? నువ్వు ఆజ్ఞ ఇయ్యి. అగ్నిపర్వతంలో ఉరుకుతాను. నువ్వు నాకు చక్రవర్తినివి! నాకు నీ పైన ప్రేమ ఎంతవుందో దాని అనంతత్వము నాకు మాత్రం తెలుసునా లక్ష్మీ?"

ఆమెను గాఢంగా తన హృదయానికి అదుముకున్నాడు. ఆమెను ఊపిరాడనట్లు చుంబించినాడు. ఆమెను నలిపివేశాడు.

అతనికి కళ్ళనీళ్ళు తిరిగాయి. ఆ విషయం ఆ గడబిడలోనే అనంతలక్ష్మి చూచింది. ఆమెకు మనస్సు ఒడుదుడుకై పోయినది. వెంటనే తన దుఃఖం కష్టపడి ఆపి వేసుకొని, మంచంమీద నుంచి లేచి స్నానాల గదిలోనికి వెళ్ళిపోయింది.

కోనంగి ఆ బాలిక వచ్చేవరకూ అలాగే కూర్చున్నాడు. అరగంట వరకూ చూచినాడు. అనంతలక్ష్మి రాలేదు. అతనికి ఆశ్చర్యం కలిగింది. జాలివేసింది. ఈ బాలికలు చదువుకున్నా బాలికలే! బాలికలలో స్త్రీలలో చదువు నరనరాలకూ ఎక్కిపోలేదు. రెండు మూడుతరాలవరకూ చదువులు హత్తుకుపోతేగాని, స్త్రీలలో భావగమనము క్రొత్తదారులు పట్టదు.

అయినా, అనంతలక్ష్మి హృదయం అనుమానం అయ్యే జాతిదికాదనే తాను నిశ్చయానికి వచ్చాడుకదా! ఇంక అనుమానం తప్ప అనంతలక్ష్మిని ఈ స్థితికి తీసుకువచ్చింది ఏమి ఉంటుందిగనకా? నాటకాలలో, సినిమాలలో ఎవరెవరో యౌవనంగల అందమైన స్త్రీలతో కలిసి అభినయించవలసి వస్తుంది. అప్పుడు తెలివితక్కువ భార్య అనుమానపడుతుంది.

లోకంలో కార్యసంబంధం ఉన్నవాళ్ళందరూ ఇతరులతో సంబంధం లేకుండా ఎలాగు? పురుషులకు ఒక్క పురుషులతో మాత్రం అనిగాని, స్త్రీలకు ఒక్కస్త్రీలతో మాత్రమే అనిగాని. భార్యగాని, భర్తగాని పంతాలుపట్టి కూర్చుంటే లోకం కాలప్రయాణం ఎలా చేయగలదు?

ఈ బాలిక సాధారణ బాలికలకన్నా అదృష్టవంతురాలు. ధనమూ, ఆస్తీ, రూపమూ, హృదయమూ, విద్యా ఉత్తమంగా ఉన్నాయి. అలాంటి బాలిక అనుమాన రోగానికి పాల్పడితే తన జీవితమూ, తన భర్తజీవితమూ యమలోకం చేసుకుంటుంది.

కోనంగి నిట్టూర్పువిడుస్తూ లేచాడు. నెమ్మదిగా గది బయటకు వచ్చాడు. అనంతలక్ష్మి చదువుకునే గదిలోనికిపోయి అక్కడ ఒక సోఫాలో ఆలోచిస్తూ కూచున్నాడు. కళ్ళు మూసుకున్నాడు. కాని నిద్రమాత్రం లేదు.

అతడల్లా పండుకొని ఉండగానే కొంతసేపటికి పనిమనిషి ఒకతె వచ్చి ఆ గదిలోకి తొంగిచూచి కోనంగివైపు తేరిపార చూచి వెళ్ళిపోయినది. ఆ విషయం కోనంగి ఎరుగడు.

తాను బీదవాడై ఒక ధనవంతురాలైన బాలికను వివాహం చేసుకోవాలని సిద్ధం అయ్యాడు. ఆ బాలిక అందాన్ని చూచి ఆ బాలిక కావాలని కోరేవారు చాలామంది వున్నారు. ఆ బాలిక తన్ను ఏమి చూచి ప్రేమించింది? ప్రేమకు అర్థం వుందా లేదా! ప్రేమ దేహాన్ని కామకాంక్ష తృప్తిపరచుకోడానికి కోరటం వంటిదా? వివిధ వ్యక్తుల కోరికలు వివిధంగా వుంటాయి. బాహ్యరూపం మాత్రం చూచి స్త్రీని పురుషుడుగాని, పురుషుని స్త్రీగాని కోరేయెడల. ఒకేస్త్రీని చాలామంది పురుషులు, ఒకేపురుషుని చాలామంది స్త్రీలు కోరవచ్చును.

మానసికమైన ప్రేమ అయితే, మనస్సులు కలిసినవారు మాత్రమే ప్రేమించు కుంటారు. అలాంటి వారు ఒకే స్త్రీని మానసికంగా ప్రేమించేవారు ఉన్నారు. అలాగే ఒక పురుషుని నలుగురైదుగురు స్త్రీలు ప్రేమించవచ్చును.

కాని ఒకే పురుషుడు, ఒకే స్త్రీ ఇది ఏదో అతి విచిత్రభావం. ఇది దేహాతీతము. మానసికాతీతము అయిన ఏదో విచిత్రశక్తికి సంబంధించి ఉండాలి.

తాను అనంతలక్ష్మిని ప్రేమిస్తున్నాడు. ఆ బాలికను ఒక్కదాన్నే ప్రేమిస్తున్నాడా లేక ఇతర బాలికలను కూడా వాంఛింపగలడా? ఇంతవరకూ తనకు సంభవించిన రెండు పరీక్షలలో, 'అనీ' తన్ను వాంఛించి నప్పుడుగాని, తన సినీమా నాయిక వాంఛించి నప్పుడుగాని, తాత్కాలికంగా తన దేహం కొంత ఉప్పొంగగా, మనస్సూ హృదయమూ రెండూ ముడుచుకుపోయాయి. కాని అనంతలక్ష్మే తన భార్య అన్న భావానికి చలనం లేదే!

ఇంతకూ అనంతలక్ష్మికి ఎందుకు కోపం వచ్చినట్లు? ఆమె ఈపాటికి పండుకొని నిదురపోతూ ఉంటుంది. తనపై కోపం వచ్చిందా లేక తన విషయంలో ఏదో అనుమానంపడి, బాధ పడుతున్నదా?

అతనికి నిద్రపట్టలేదు, కదలక కన్నులు మాత్రం మూసుకొని, హాలులోనికి వినాయగం దీపాలు ఆర్పడానికి వచ్చినా కోనంగి కదలలేదు. దీపాలు ఆర్పి వినాయగం వెళ్ళిపోయాడు.

తాను డాక్టరు ఇంటికి వెళ్ళిపోవలసింది. కాని అనంతం ఈలా సంచరించడంవల్ల తాను ఇక్కడ ఈలా పరుండవలసి వచ్చినది. ఎప్పుడైనా ఈ ఇంటిలో తాను పండుకోవలసి వస్తుందని తనకు ప్రత్యేకంగా ఒక గది ఏర్పాటు చేశారు.

అనంతలక్ష్మి ఆ గదిని ఎంతో మనోహరంగా అలంకరించింది. గదిలో తనకోసం ఎన్ని విచిత్రమైన వస్తువులు ఉంచింది! తనకు కాబోయే భర్తకు అది చదువుల గది అట. ఆ భర్త ఎవరో తనకు తెలుసునట! అతనికి ఇష్టాఇష్టాలు, ప్రీతికరమైనవీ, అనందం ఇచ్చేవీ ఆ గదిలో ఉండాలట. అలా అని ఎన్నో సంగతులు యాదాలాపంగా అడిగినట్లు అడుగుతూ అందులోకి చేర్చేది.

అందులో ఒక చక్కని మంచం వేసి తాత్కాలికంగా అది తనకై పడకగది చేశారు.

అలా చీకటిలో ఒక అరగంటసేపు పడుకునేసరికి, అక్కడికి జయలక్ష్మి చక్కావచ్చి దీపం వెలిగించి, "ఏమండి కోనంగిరావుగారూ! మీరు పడుకున్నారేమిటి?" అని ప్రశ్నగా కేక వేసింది.

## 16

జయలక్ష్మి మాటలు విని కోనంగి సువ్వున లేచినాడు.

"అబ్బే! నిద్దర పట్టలేదు. ఏదో ఆలోచించుకుంటూ పడుకున్నా."

"మీకూ అమ్మిణికీ మాటా మాటా వచ్చిందా?"

"మాటా మాటా పట్టింపులేమీ రాలేదుగాని లక్ష్మికి నేను నాటకాలలో, సినీమాలలో పాల్గొనటం యిష్టంలేక మనస్సులో బాధ పెట్టుకుందను కుంటాను."

"మీరు సినీమాలలోనే వుంటారా?"

"నేను సినీమాలలోనే వుండనని మొదటే చెప్పాను కాదూ అత్తగారూ! అనంతలక్ష్మికి తగినట్టి భర్తను కావాలని నాఆశ. జీవితంలో ఉత్తమపథం కనుక్కుందామని నా ఆశయం."

"అమ్మిణి కుళ్ళిపోతోంది. కారణం అడిగితే చెప్పదు. నా కాశ్చర్యం వేసింది. నేను హడలి బేజారయాను."

వెంటనే కోనంగి ముందుకువచ్చి చిరునవ్వు నవ్వుతూ "నా లక్ష్మికినేను విష్ణువు కావాలండీ. ఎక్కడ వుంది?" అని అడిగినాడు. తన పడకగదిలోనే వుందని ఆమె జవాబు చెప్పింది. కోనంగి నెమ్మదిగా నడచి అనంతలక్ష్మి పడక గదిలోకి వెళ్ళాడు. ఆమె మంచంమీద బోర్లగిలా పడుకొనివుంది.

"లక్ష్మీ! ఈ ప్రపంచంలో నీ వొక్కదానివే బాధపడుతున్నట్లు కనబడుతోంది. నీవు లక్ష్మివి. నేను విష్ణుని. నిన్నిప్పుడే నేను నా హృదయంలో ధరించుకోవాలి. ఏ దివ్యమూర్తినో సంపాదించుకొని, నేనీ మేడంత మనిషినై, నా హృదయాన్ని యీ గదంత పెద్దది చేసుకొని, అందులో బంగారపు సింహాసనమేసి, దానిపైన ఎన్నడూ వాడని గంగాతరంగిత డోలాయిత పద్మాన్నొక దాన్ని తెచ్చి, అది సింహాసనంమీద వుంచి, దాని పైన నిన్ను దివ్యమూర్తిలా కూర్చోపెట్టి, నేనే నాహృదయంలోనికి చొచ్చుకు వెళ్ళి నీ సింహాసనం యెదుట మోకరించి, వందే లక్ష్మీదేవీం, నా యొక్క ప్రాణేశ్వరీం, ఆత్మేశ్వరీం, నేను వట్టి దండర్ హెడ్డునుం నీ హృదయానికి బాధ కలిగించినందుకు క్షమింపుమాం. నేను చేసిన తప్పిదానికి నీవు ఏ విధమైన శిక్ష వేసినా నేను భరింప సిద్ధముగా వుంటినః అని ప్రార్థింపదలచినాను" అని అంటూ ఆమె మంచం దగ్గరకుపోయి చేతులు జోడించినాడు.

అనంతలక్ష్మి చటుక్కున లేచి కూర్చున్నది. ఆమె పకపకా నవ్వుతూ "ఓయి భక్తుడుగారూనాం. నిన్ను క్షమించితినం. అహం నీకు ఏ కోర్కె కావాలో అది తీర్చ సిద్ధముగా వుంటినః" అని వరదహస్తమూ, అభయ హస్తమూ పట్టినది.

కోనంగి మోము ఆనందముచే వెలిగిబోయినది. అతడు అస్పష్ట వాక్కులతో మోకరించి, ఆమె వైపు చేతులు చాపి "లక్ష్మీం క్షీరసముద్రరాజ తనయాం, శ్రీరంగధామేశ్వరీం, దాసీభూత సమస్త వనితాం! ధర్మార్థ కామమోక్ష ప్రదాయినీం, నా హృదయాన వాలిపోం. నాకు రెండు చుంబనాలు ప్రసాదించుమీం" అని అన్నాడు.

అనంతలక్ష్మి మంచంమీద నుంచి ఒక్కవురుకున అతని చేతులలోనికి వ్రాలినది. అతడామెను క్రింద పడకుండ బంతివలె పట్టుకొని, ఆమె తన మెడచుట్టూ చేతులు బిగియార కౌగలింపగా, లేచి గట్టిగా అదుముకుంటూ, ఉదయశంకర నాట్యం ప్రారంభించి

*నే.... నే.... యీశ్వరుణ్ణి....*
*నే.... నే.... నారాయణుణ్ణీ....*
*నే.... నే.... ఆనంద నాట్యపూరితుణ్ణి*
*నే.... నే.... సర్వ విశ్వాత్మక మధ్యస్థ పురుషోత్తముడను*
*నా అర్ధదేహ కామేశ్వరీ....*
*నా హృదయ మధ్య కమలేశ్వరీ*
*నే....నూ....నా దేవీ....*
*నా దేవీ.... నేనూ...."*

అని పాడినాడు.

ఈ విచిత్ర ప్రేమ ప్రదర్శనము గుమ్మాని కెదురు గుండా చీకటిలో నిలుచుండి జయలక్ష్మి చూస్తూ ఆనందంతో మైమరచిపోయి భర్తను ధ్యానించుకొన్నది, ఆమె నెమ్మదిగా ఆమె గదిలోనికి వెళ్ళిపోయింది.

నాట్యము చాలించి అతడామెను ఆలాగున ఎత్తుకొనే ఇంటి తోటలోనికి తాము మామూలుగా కూర్చుండు స్థలమునకు తీసుకొనిపోనా అని అతడడిగినాడు. ఆమె నవ్వుతూ

అతని చేతులలో చిన్నబిడ్డలా ఒదిగే ఉన్నది తోటలో ఆమె క్రిందకు దిగినది. అతని నడుంచుట్టూ తన చేయి వేసి, అతని చేతిని తన నడుంచుట్టూ చుట్టగా ఇద్దరూ తోటలో తిరిగినారు. వారలా వెళ్ళడం వినాయగం చూచినాడు. తనలో నవ్వుకొన్నాడు, ఆనందంతో హృదయము నింపుకొన్నాడు.

వారు నెమ్మదిగా అడుగులిడుకుంటూ, వారిరువురూ వెన్నెలలో తాము సాధారణంగా కూర్చునే పొదరింటి పందిరికడకు పోయినారు. అక్కడ బల్లపై కూర్చున్నారు. వారిరువురి హృదయాలు నిండి ఉన్నాయి.

అత డనుకొన్నాడు. మనుష్యునికి ఆకలి వేస్తుంది. ఆకలితో బాధపడతాడు. షడ్రసోపేతమైన భోజనం లభిస్తుంది అతడు సంతోష స్వాంతుడౌతాడు. మనుష్యుడు బీదతనంతో క్రుంగిపోతాడు. ఇల్లు పోయింది. కట్టగుడ్డలు లేవు. పదిమంది బిడ్డలుగల సంసారము. అంతకన్న అంతకన్న నీచస్థితికి పోతుందా కుటుంబం. అప్పుడాతనికి ఒక్కసారిగా లక్షలు వస్తాయి. అతని ఆనందం ప్రాపంచికానందం. ఈ రెండూ స్త్రీ పురుషుల ప్రేమ కలయికవరము ప్రసాదించే ఆనందంతో సరిపోగలవా? ఇది ఆనందము. అవి అతిశయ సంతోషాలు మాత్రం.

ఆమె అనుకొన్నది. స్త్రీ జన్మకు తన జన్మ అణువుఅణువునా లీనమైన పురుషుడే మోక్షం. అతని నుండే ప్రపంచం! అతడు ప్రసాదించే బిడ్డలే ఆ మోక్షంలో భాగాలు. ఓహెూ నాకు ఉత్తమ పురుషుడు భర్త అయినాడు. నేను ఎన్నివేల దేవుళ్ళవలన కోటి కోటి వరాలు ప్రసాదించబడినానో! అని.

ఇరువురూ ఒకరి నొకరు చూచుకున్నారు. ఇరువురూ ఆనందమత్తులైనారు.

దివ్యవరము దివ్యలోకంలో ఉద్భవిస్తుంది. జ్ఞానలోకంలో వినిపిస్తుంది. హృదయ లోకమవతరిస్తుంది. అక్కడ వేగవంతమై బాహ్యలోకం అంతా నిండిపోతుంది.

ఇరువురూ ఆ పుల్కరింపు మైమరపు సమయంలో ఒకరి దేహమొకరు వాంఛించారు! ఇద్దరూ గాఢకామం వాంఛించినారు. రూపం తాల్చిన ప్రేమకు తమ దేహాలను నివేదన లిద్దామనుకున్నారు!

కాని, తమ ప్రేమ దేవాలయం తలుపులు ఇంకను మూయబడి ఉన్నట్లు వారికి తోచింది. ఆ తలుపులకు పెళ్ళి కాకపోవుట అన్న తాళం బంధింపబడి ఉన్నట్లు తోచింది. ఇద్దరూ రొజుతూ ఒకరి కౌగిలి నుండి ఒకరు విడిపోయినారు. సిగ్గు పొందారు. పకపక నవ్వుకొన్నారు. వేడిని జ్యోత్స్నగా మార్చుకొన్నారు.

**అష్టమ పథం**

# కారాగారం

స్వస్తిశ్రీ చాంద్రమాన విక్రమ సంవత్సర ఫాల్గుణ శుద్ధ దశమీ బుధవారం రాత్రి పునర్వసుయుక్త కన్యాలగ్నమందు చిరంజీవి కోనంగేశ్వరరావుకును చిరంజీవి సౌభాగ్యవతి అనంతలక్ష్మీదేవికిని వధూ గృహంలో అఖండవైభవముగ వివాహం జరిగింది.

డాక్టరు రెడ్డిగారు వరుని తరపున పెళ్ళిపెద్ద. వధువు తరపున ఆమె పెదతండ్రి పెద్దకొడుకు అనంతకృష్ణయ్యంగారు పెళ్ళిపెద్ద.

వివాహానికి నగరంలోని పెద్ద లెంతమందో వచ్చినారు. కాంగ్రెసు పెద్దలు, కమ్యూనిస్టు పార్టీవారు, ముస్లింలీగువారు, థియాసఫిస్టులు, బ్రహ్మ సమాజంవారు, కళాస్రష్టలు, సంగీతనిధులు, నాట్యవేత్తలు దంపతుల నాశీర్వదింప వచ్చినారు. వివాహం రిజిష్టర్డు వివాహంగా, హిందూ వివాహంగా రెండింటి క్రిందా అయినది.

మూడు రోజులు ఉత్సవాలు జరిగినాయి. మూడు సాయంకాలాలు గానసభలు, రాత్రిళ్ళు నృత్య ప్రదర్శనాలు జరిగినవి.

తనతో చదువుకొన్న బాలకులు ఎంతమందో కోనంగి వివాహానికి వచ్చినారు, వారి రాకపోకలకు కర్చు లాతడే ఇచ్చినాడు. వారందరు పెళ్ళి కొమరితను చూచి కోనంగి వంటి అదృష్టవంతుడీ భూలోకాన లేడని పొగడినారు. కొందరు కోనంగి అదృష్టానికి తమకు ఓర్వలేనితనం వస్తున్నదని అల్లరిచేసినారు.

కోనంగి వివాహానికి 'సారా' కన్యయు, సీతాదేవియు వచ్చినారు. సీతాదేవి కోనంగితో తనకును సంబంధము కుదిరిదనిన్నీ ఏలాగన్నా తాను చేతులారా కోనంగిని వదలుకొన్నానని తెలిపింది. రాబోవు వరుడు పి.డబ్ల్యు.డి. శాఖలో సబుడివిజనలు ఆఫీసరుగా ఏర్పాటయిన అరవ అయ్యరు అబ్బాయి అనియు, అతనికి అలా ఏర్పాటు చేసింది తనతండ్రే అనిన్నీ ఆమె తెల్పింది.

'సారా' అనంతలక్ష్మిని కౌగలించుకొని "అనంత్, నువ్వు అదృష్టవంతురాలివి, తెలివిగలదానివిన్నీ. కోనంగి నీ జన్మకు సంబంధం కలగడం అదృష్టం. అతన్ని నువ్వు ప్రేమించడం ఉత్తమజ్ఞానం. అతడు దేవకుమారుడు" అని అన్నది.

అనంతలక్ష్మి స్నేహితురాండ్రందరూ వచ్చినారు. ఆ ఉత్సవాలు, ఆ ఉప్పొంగులు, ఆ అల్లరులు, ఆనందాలు, మదరాసు నగరంలో ఒక్కసారి వేయి యువతీయువకుల జంటలకు వివాహము లైనట్లయింది.

వెంపటి సత్యం, వేదాంతం రాఘవయ్య, సామ్రాజ్యలక్ష్మి కలసి ఒక జట్టుగా నాట్యం చేశారు.

భోలానాథ్ జట్టువారు ఒకరోజున నాట్యం చేసినారు.

దక్షిణాది నుండి ఒక నర్తకీ బృందమొకదినమున నాట్య ప్రదర్శన మిచ్చింది.

వివాహము అనంతలక్ష్మి పరీక్షలైన వెంటనే అయినది. ఇక ముందున్నది మధుమాసము.

నాల్గవదినాన ఆచారం ప్రకారము కోనంగికీ అనంతలక్ష్మికీ సంధాన ముహూర్తం అయినది.

జయలక్ష్మి అయ్యంగార్ల ఇంట సాధారణంగా జరుగు వేడుకలే తన ఇంటనూ చేయించినది. కోనంగికి కృష్ణుని వేషమును, అనంతలక్ష్మికి రాధ వేషమును అలంకరించి వెండికోళ్ళుగల పూల ఉయ్యాలయం దూపుచూ జయలక్ష్మి చుట్టపు పుష్పాంగనలందరు కోకిల కంఠాల పాటలు పాడినారు.

ఎన్నెన్నియో వేడుకలైనవి. బందరు నుండి కోనంగి ప్రాణ స్నేహితుడు మధుసూదనరావు పెళ్ళికి వచ్చాడు.

ఆ రాత్రి స్వర్గధామంలా అలంకరించిన శోభన మందిరంలో వారిద్దరొంటిగా ఉన్నారు. వారి ఆనందము ఆ నాడా గదిలోనికి గవాక్షాల గుండా తొంగిచూచే ఆకాశమే వర్ణించి మరునాడు సూర్యునకు నివేదింపలేక పోయింది.

అంతకుముందు సాయంకాలం కోనంగి ఇంటివెనుక తోటలో ఒంటరిగా కూర్చున్నాడు. ముసలివాళ్ళు చిన్నపిల్లల చేసికొని కొద్ది రోజులలో తాము ఆకాశంలో ఏవో లోకాలకు పోయి ఆధరువులేని పసికూనలకు స్వాతంత్ర్యం ఇచ్చే రోజులు పోయాయి అని కోనంగి అనుకొన్నాడు. అయితే ఆ దినాల్లో ఒక ముసలమ్మ ఒక పసిబిడ్డను పెళ్ళిచేసుకున్న వార్త లేమన్నా ఉండేవా?" అని అనుకుంటూ నవ్వుకున్నాడు.

ఆ సమయంలో స్నేహితుడితో కాస్త కాలం వెళ్ళబుచ్చుదామని డాక్టరు రెడ్డి కారుపై పెళ్ళి వారింటికి వచ్చాడు.

ఆ రాత్రేగదా కోనంగి భార్యతో కలియడము! ఆ సందర్భంలో కొన్ని సలహాలు కోనంగి కివ్వాలని డాక్టరు రెడ్డి వచ్చాడు.

"ఏ మోయ్ కోన్, నువ్వు గర్భనిరోధక విషయాలేమన్నా ఎప్పుడన్నా చదివావా?"

"గర్భనిరోధకం? నాకు గర్భం వస్తుందని నేనెప్పుడన్నా భయపడితేకదా!"

"వహ్వా! ఏమో నిన్ను చూస్తూ ఉంటే ఏదో ఓ రోజున ఓ బిడ్డ నెత్తుకొని పాలిస్తూ కనబడేట్లున్నావు."

"ఆ బిడ్డకు తమరే తండ్రి అవుతారు కాబోలు కామ్రేడ్‌గారూ!"

"నువ్వే ఆడదాని వైనట్లయితే నీకు నేను తప్పకుండా భర్తనయ్యేవాణ్ణే."

"ఎన్నేళ్ళు నన్ను భర్తగా కంట్రాక్టు చేసికొని వుందువు?"

"ఏ అయిదో ఆరో రోజులు."

"ఓరీ నీ అసాధ్యంకూలా షారియర్ రాజులా తయారవాలని వుందన్నమాట! అవసరం అయ్యాక పెళ్ళాల పీక ఎగరవేస్తూ వుందువన్న మాట."

"ఇంకీ సంభాషణ చాలించి, నిన్ను నేను సీరియస్‌గా అడుగుతున్నా, తొందరలోనే నీ భార్య తల్లి అవాలని వుందేమిటి నీకు?"

"తల్లే అవుతుందో కూతురే అవుతుందో మనకేం తెలుసునోయ్!"

"నీకు ఎంత బుద్ధి చెప్పినా యీ హాస్యంగా మాట్లాడడం మానవు."

*"ఆఁ!*
*నా కీ ప్రపంచమంతా ఒక జోక్*
*తక్కినవాళ్ళ కిది పెద్దషాక్*
*నీ కంటావా*
*నే చెప్పాలా*
*నువ్వు ముందుకు సాగలేని నల్లరాక్*
*కొందరి దద్దమ్మల కిది వట్టి షోక్*
*వాళ్ళకి మధ్య మధ్య ఒక్క పోక్*
*యిస్తేనేగాని, జాంబక్*
*రాస్తేగాని, వట్టి హంబక్*
*లై వూరుకుంటార్న మాట నిజమో కాదో త్రింబక్*
*క్షేత్రంలో విచారించవయ్యా డాక్టరు డాంబిక్ లేకపోతే వెళ్ళు ముసాంబిక్"*

"ఆహా! ఏం పాటండి! వట్టి సర్‌రియలిస్టు కవిలాగున్నావే?"

"నేను సర్‌రియలిస్టును కాదు, నేను డ్యూక్ రియలిస్టుని."

*"ఓయి వెర్రికవీ! నిన్ను మోదవాకం*
*ఆస్పత్రిలోనో, లేక నుంగంబాకం*
*కాలేజీలోనో చేర్చకపోతే వట్టి పోరంబోకం*
*లేక, పరశువాకం*
*బేరక్‌వో, వట్టి మీనంబాకం*
*ఏరోడ్రోమువో, లేక కోడంబాకం*
*పెద్ద చెరువువో, లేక కీలుబాకం*
*స్వదేశి ఆస్పత్రివో, లేక విల్లివాకం*
*కల్లుదుకాణానివో, లేక వట్టి మైసూరుపాకం*
*అయి వూరుకుంటావో, మాకేం."*

"నేను నిన్ను నిజంగా మెచ్చుకున్నానోయ్ డాక్టరూ! నీవు సూపర్ సర్‌రియలిస్టు కవిలాగున్నావ్."

"సరేగాని నీ భార్య బి. యే. చదువుకున్నదని తెలుసా నీకు?"

"ఆ తెలుసును. నాకు రెండుచేతులున్నాయని ఎంత స్పష్టంగా తెలుసునో అంత స్పష్టంగా తెలుసును."

"ఏమోలే, నేను నమ్మలేనులే. నీ వ్యాపారము చూస్తే ఏమీ నమ్మటానికి వీలులేకుండా వుందిలే. మరి మీ ఆవిడ చూశావా, బి.ఏ. పరీక్షకు వెళ్ళేసమయం పిల్లతల్లి అయి కూర్చోవాలని వుందా నీకు?"

"నువ్వు అంతా నిర్‌వేళాకోళంగా మాట్లాడుతున్నావు గనుక నేనూ తీవ్రకార్యాలోచనా పరుండనై ప్రతివచనం బిచ్చుచుంటిని. గైకొనుము వైద్యశేఖరుడా, మిత్రమా, సర్ రామస్వామి మొదలియార్ సత్రమా, గార్దభంబు గాత్రమా, తాటియాకు ఛత్రమా, నల్లరాతి పాత్రమా, అఖండ కమ్యూనిస్టుల మిత్రమా!"

"ఆ... చాల్లే నువ్వు వొట్టి వోటిపాత్రమా గాని..."

"అవునయ్యా, ఏమి చేయమంటావు?"

"గర్భనిరోధక సాధనాలు వుపయోగించవయ్యా అంటాను."

"ఎంత గర్భనిర్భేద్యమైనమాట చెప్పావూ" అయితే, డాగు దొరా, యీ విషయాన్ని గురించి యీ మధ్య పత్రికల్లో జరిగిన వాదోపవాదాలన్నీ వింటూ ఉన్నాను. హృదయంలో వరదలుకట్టి పారుతున్న కోరికలను చంపుకోలేక, అవ్వా కావాలి, బువ్వా కావాలని అనే పెద్దమనిషిని కాదలచుకోలేదు."

"ఓయి వెర్రివాడా! ఆకలి చంపుకోలేవూ, నీ కిష్టమొచ్చిందల్లా తింటావూ! కడుపు నొప్పివస్తే, అజీర్ణం చేస్తే మందుకోసం పరుగెత్తుతావూ! తిండి, మందూ, అవ్వా బువ్వా కావుకాబోలు!"

"నిజమే, నేను మాత్రము అతిపురుషుణ్ణి కాదలచుకోలేదు. ఒక్క మాటమాత్రం నీ కిస్తాను. ఈ వేసవికాలంలో మాత్రమే యీ ఇంట నూతనదంపతులు తమ కాలాన్ని మధుమాసం చేసుకుంటారు. తక్కిన నెలలు వారిద్దరూ ప్రాణస్నేహితులు మాత్రం."

"అభివందనములు. నిన్న మెయిల్లో మీ స్నేహితులంతా ఉత్తరానికి పోయినట్టున్నారే. తెలుగువాళ్ళకి, ముఖ్యంగా నీ స్నేహితులకు, కమ్యూనిస్టులంటే అంతకోపం ఏమిటోయ్?"

"నువ్వు మహా అరవవాడవు అయినట్టు! అంతగా లెక్కచూస్తే, తెలుగువాళ్ళలోనే కమ్యూనిస్టు లెక్కువున్నారు. అంతకన్న కాంగ్రెసువారూ ఎక్కువున్నారు మీ అరవవాళ్ళకన్నా."

"ఒకమాటు నన్ను తెలుగు వాడంటావు. ఒకమాటు అరవవాడంటావు. ఈ మూడురోజుల ఉత్సవాలు, యీ రాత్రి జరగబోయే వుత్సవంతో, నీ మతి పోయినట్టుంది."

"ఆ, ఒక విధంగా మతిపోయిందోయ్. నేను ఈ రోజునే గదా గృహస్థాశ్రమ ప్రాంగణందాటి లోనికి పోయేది?"

## 2

తానూ కోనంగి చుట్టాల పెద్దలతో, స్నేహితులతో కలిసి వివాహం రిజిస్ట్రారుగారి దగ్గర వివాహపత్రంలో సంతకాలు పెట్టేడప్పుడు, అనంతలక్ష్మి సంతోషంతో వణికిపోయింది. తనంత అదృష్టవంతురా లెవ్వరు? అందరూ పెళ్ళివారింటికి వచ్చారు.

తాను ఎదుట చూచిన పురుషుడు ఏ లోకాల నుంచో అవతరించినట్టు అవతరించి ఆ దినాన తన గేటు గుమ్మం దగ్గర ఎదురు చూస్తూ ఉండడం ఎంత అదృష్టం? అలా రాకుండా ఉన్నట్లయితే తన బ్రతుకు ఎడారి బ్రతుకై ఉండేది?

తన భర్త ఎంత ఉత్తముడు! ఎంత చక్కనివాడు. ఎంత తెలివైనవాడు. ఆయన పాదాలకడనే తన సర్వస్వమూ! ఆయనే తన భర్త, ప్రియుడు, భగవంతుడు అని భావం గలిగింది. అదేనా ప్రేమ? వారు తిరిగి తన్ను ప్రేమించడం ఎంత మహోత్కృష్టమైన అదృష్టము!

ఈ రాత్రి చుట్టాలంతా తమ శయనమందిరంలో ఏదో అల్లరులు చేస్తారు. తాను సిగ్గుచేత కుంగిపోవలసి వస్తుంది. తన భర్త కూడా సిగ్గుపడతారా? మగవాళ్ళకు సిగ్గు ఉంటుందా?

తాను... వారు? ఈ లోకం మధ్య! ఇదివరకు వారు మాట్లాడే విధానం వేరు. ఈనాడు వేరుగా ఉంటుందా? ఎన్నిసారులు తానూ ఆయనా ఇద్దరు మాత్రమే వాహ్యాళికి వెళ్ళలేదు. ఎన్నిసారులు ఇద్దరు మాత్రమే సినిమాలకు వెళ్ళలేదు? తానూ వారూ మాత్రమే తన పడకగదిలో కూర్చుండి మాట్లాడుకున్న సమయాలు ఎన్నో ఉన్నాయి. తన మాష్టరుగారు. తన్ను తమ గుండె కదుముకున్నప్పుడు తన దేహం అంతా ఝల్లుమనేది. ఏదో మత్తత, ఏదో మధురత తన్ను ముంచెత్తేవి. తనకా సమయాలల్లో భయమూ కలిగేది, వారు ఔచిత్యభంగం ఒనరిస్తారేమోనని?

అలా వారు ఔచిత్యభంగ మొనరించినా తాను భయంతోనన్నా ఆనందంతో మాత్రము ఒప్పుకొని ఉండును.

ఇతర పురుషులు తన్ను ముట్టుకొన్నప్పుడు ఏమీ ఆనందం ఉండేది కాదు సరికదా జుగుప్స కూడా కలిగి ఒళ్ళు ముడుచుకుపోయేది.

ఈ దినమందు–వారూ తానూ ఒంటిగా–ఈ ఆలోచనలకు అంతరాయంగా ఆ బాలిక సహాధ్యాయినిలు పకపకలాడుతూ అనంతలక్ష్మి దగ్గరకు పరుగెత్తుకొని వచ్చారు.

ఆ బాలికలు ఆమెను పెట్టిన అల్లరి ఇంతా అంతా కాదు. అంబుజం వెనక నుంచి అనంతం మోముమీదికి వంగి ఆమె పెదవులు ముద్దుపెట్టుకొని, కలకల నవ్వుతూ, "ఆసి దొంగా! కోనంగిరావుగారే అనుకున్నావా అమ్మా!" అన్నది.

**పార్వతి:** ఎందుకో అంబుజం? అది పగటికలలుకంటూ కూర్చుంది. మధ్య పానకంలో పుడకలాగ, నీ చిలిపిచేష్టలేమిటి?

**మీనాక్షి:** ఉండండి, ఇవాళ నుంచి అనంతానికి మనతో మాట్లాడడానికి తీరుబడే ఉండదు. అసలు మనకు తిన్నగా కనబడుతుందా?

**యోగం:** ఎప్పుడే అనంతం, మీ రిద్దరూ మధుమాస యాత్రకు బయలుదేరేది?

**మేరీ:** ఎక్కడికే లక్ష్మీ! ఊటీకా, కాశ్మీరానికా?

**మీనాక్షి:** హిమాలయాలా, సింహళమా?

**పార్వతి:** ఈలాంటి తీయతీయని రహస్యాలన్నీ మనతో చెప్పుకుంటుందేం?

**ద్వారకాబాయి:** సిగ్గు వెయ్యదుటే పాపం!

**కమల:** ఏమిటే అనంతం, కళ్ళు వెదుకుతున్నాయి.

**మేరీ:** ఎవరో ఒకర్ని. తనకు తెలుగు చెప్పిన ప్రయివేటు మాష్టరో? –

**యోగం:** ఒక సినీమాలో వేషం వేసిన కథానాయకుడో? –

**ద్వారకా:** నాటకాలలో హీరోనో! –

**మీనాక్షి:** అడాడా! ఎన్నా ఇది ఇందమాదిరి విషయం పండ్రారే? నాణతినాల్ అవళ్ ముగం శివందు పోరదే.

నవ్వుకుంటూ అనంతం ఇవన్నీ వింది. "రండర్రా, కొత్త ఫలహారాలు చేద్దురుగాని" అని అనంతం లేచింది.

"ఇది ఫలహారంగచ్చేరీదానే. వేరు ఒండు ఇల్లియే?" అని మీనాక్షి అంది.

ఇంతలో జయలక్ష్మి అక్కడకు వచ్చి "ఫలహారాలు సిద్ధంగా ఉన్నాయి, రండని" వారి నందరిని సగౌరవంగా పిలిచింది.

ఇల్లూ మేడా దీపాలతో, అలంకారాలతో కలకలలాడిపోతూ ఉంది. బాలికలందరూ అనంతలక్ష్మిని సంధాన శయనగృహానికి పంపించి మరీ ఇళ్ళకు వెళ్ళినారు.

అలా తలుపువేసి వెళ్ళారు. కోనంగి ఒక్కసారిగా అనంతలక్ష్మిని కౌగిలిలోకి కబళించి వేశాడు. ఆ బాలిక అతని కౌగిలిలోనే ఒక ఆనందామృత ప్రవాహమై అతని జన్మ సహస్రాలు అలముకుపోయింది. వారికి మాటలులేవు. వారే ఆనందమూర్తులయ్యారు. ఆనంద శిఖరితమైన అమృతము బిందువులై అతని కన్నులు తిరిగినవి. ఆమె తలకట్టు, ఫాలము, కనుబొమలు, కన్నులు, నాశిక, నాశికాపుటములు, చెంపలు, చెవులు, గడ్డము కంఠము అతడు పుణికినాడు. ఆమె పరవశమైనది. వివశయైనది. అతడామెపెదవులు, అతని పెదవు లామె! ఒక పరమమోహన సందేశ గాఢచుంబనావ సంగమ మైపోయినవి నాల్గు పెదవులున్నూ.

*"అమృత కలశివి నువ్వు*
*అమర లోకానీక*
*ఏకైక మూర్తినై*
*ఏను కోరెద నిన్ను"*

అని కోనంగి అనంతలక్ష్మిని తన ఒడిలో గాఢపు కౌగిలింతలో ఒరిగించుకొని ఈ పాట పాడినాడు అస్పష్టవాక్కుతో.

"మీ ఆనందం అంత అనంతమైనదా!"

"అనంతత్వం నా ఆనందం ముందు ఒక క్షణిక మాత్రం అనంతలక్ష్మి!"

"అయితే నాకన్న మీ ఆనందం ఎక్కువా? పోనీలెండి. నన్ను వదలండి నే వెళ్ళిపోతాను!"

"నా అనంతమే నా ఆనందం. అనంతా! అసలు ఆనందం నా అనంతం ముందు ఒక్కక్షణికం అని!

*"నా అనంతం ముందు*
*నళినాక్షీ ఒక లిప్త*
*మాత్రం అసలనంత*
*భావ మాత్మేశ్వరీ!"*

"మాటలాడటం మాని, పాటలతో మాట్లాడుతారా?"

*"మాటల్లో లోతేది*
*పాటల్లో తీపేది*
*నా జీవితేశ్వరీ*
*నళినాక్షులను పొగడ!"*
*"పాట పాటకు రాజ*
*మాటలాడకు నాథా*
*మూగనోమే నీకు*
*ముద్దుగులికే సొగసు."*

"నీకూ పాటలు వస్తున్నాయి లక్ష్మి!"

"ఇన్నాళ్ళు మీ సహవాసం చేసి!"

"తెల్ల వారుతోంది గడియారం జరిగిపోతుంది."

"గడియారం ఆపు చేయండి."

"నువ్వే చేయి ఆ పని. వెనక సురభీదేవి కుండలు అమ్ముతూ వెడుతూంటే రాజుగారి భార్య కబుర్లు చెబుతూ ఆమెను ఆపుచేసిందట. నెత్తిమీదకు పొద్దురాకముందే భర్తకు అన్నం పెట్టాలట. అందుకని ఆవిడ 'సూర్యదేవుడా? ఉన్నచోటే ఆగు నాయనా!" అని అందట. ఆ మహాపతివ్రతమాట ఆజ్ఞ అయి సూర్యదేవుడు ఆగిపోయాడట. దానితో లోకం తల్లక్రిందులయిందనుకో. నువ్వూ! అలా చేయి. లోకం తల్లక్రిందులైతే మనకేం భయం?"

"ఏలాగా తలక్రిందులుగా జరుగుతోనే వుంది. కాని మీరో? వెనక వశిష్ఠులవారు తపస్సు చేసుకుంటోంటే, సూర్యుడు నెత్తిపైకి వచ్చాడట. వశిష్ఠుడు చేతిగుడ్డ పైకి ఎగరవేశాడట. ఆది పెద్ద మేఘమై సూర్యుణ్ణి అరికట్టిందట! మీరు మీ జేబురుమాలు ఎగరవేయండి."

"అనగనగా ఒక అందమైన అమ్మాయట. అ అమ్మాయి అందం వర్ణించాలని బ్రహ్మ, ఆదివిష్ణువూ పంతాలు వేసుకున్నారట..."

"అనగనగా ఆ అందమైన అమ్మాయి, ఒక అందంలేని అబ్బాయిగార్ని వరించిందట..."

"ఆ అబ్బాయి ఆ ఆమ్మాయిని ఈలాగే పెదవుల..."

"ఉందురూ, మీరూ మీ పోకిరితనాలూ"

"ఉండను, పదికోట్లకూ ఉండను వేయికోట్లకూ ఉండను-"

"ఉండక వెళ్ళండి...."

"వెళ్ళను, కోటికోట్లకూ వెళ్ళను. శతకోట్లకూ వెళ్ళను..."

"ఉండక, వెళ్ళక ఏం చేస్తారు?"

"నా ప్రియురాలిని..."

అనంతలక్ష్మి అతని నోరుమూసి, "ఏమిటా అల్లరి మాటలు?" అని గదిమింది.

అతడు ఆమె చేయి వెనక నుంచే "నా ప్రియురాలిని నాలో కలుపు కుంటాను అంటే అల్లరిమాటా" అన్నాడు.

అనంతలక్ష్మి తన లేత తమలపాకు చేయి అతని నోటిపై నుండి తీసి,

"మీలో కలుపుకుంటే, నా పరీక్ష లెవరు చదువుతారు!" అని నవ్వింది.

"నేనే!"

"మీరు ఆడపిల్లయి చక్కబోతారు!"

"నువ్వు నాలో మొగపిల్లవాడవుతావా?"

"అయి పుడతాను!"

"నీకు తల్లినౌతానా అబ్బాయీ?"

"మనమొకరం సుగాత్రి శాలీనులం!"

"నా ప్రాణమే నీవు. నా ఆత్మే నీవు! అనంతం! నేను ఏ మహాతపస్సు చేసుకున్నానో కదా!"

## ③

అంబుజం అనంతలక్ష్మి ప్రథమ శోభన యామిని వర్ణిస్తూ పాట రాసింది.

*"నొకరి నొకరు చూచినారు*
*వికసించే హృదయాలతొ*
*ప్రకటించని ఉప్పొంగుతొ*
*కికురించిన నవ్వులతో*
*గంధమలదె వధూబాల*
*కంఠములకు కరములకే*
*కమ్మని అత్తరు పూసెను*
*కాంతుని చేలాంచలమున*
*తమలపాకు చిలుకకొరికి*
*తరుణి నోటి కందిచ్చెను*
*తరుణుడు నమలుతు నవ్విన*
*తళ తళమనె వధువు కనులు*
*వేడుకలతొ మేలమాడు*
*చేడెల అల్లరిలోనే*
*వ్రీడావతి వధువు చూసి*
*కోడెగాడు కన్నుగీటె"* అని

అలాగే జరిగాయి ఆ రాత్రి శోభనమందిర ప్రథమ సంధాన దినపు వేడుకలు. చదువుకున్న పిల్లలు అల్లరి చేయడం మొదలు పెట్టితే ఆపే వారెవరు?

వధూవరులు ఆపలేరు, వాళ్ళలో వాళ్ళు ఆపుకోలేరు. జయలక్ష్మి ఏమంటుంది. కోనంగి అనంతలక్ష్మికి అత్తరు రాయాలి. అనంతలక్ష్మి కోనంగికి అత్తరు రాయాలి. ఒకరి కొకరు గంధాలు రాయాలి. అల్లరిగా బుగ్గలమీద రాయాలి. పన్నీరు చల్లించారు. ఇద్దరూ ఒకరి మెళ్ళో ఒకరు పూలదండలు వేయాలి. కోనంగి అనంతలక్ష్మి తల్లో పూవులు ముడవాలి. అనంతలక్ష్మి కోనంగి ఖద్దరు పట్టుచొక్కా గుండీకి పూలగుత్తి తగిలించాలి.

ఇద్దరూ తొమ్మిది చొప్పున తమలపాకుల చుట్టలు కొరికి వధువు వరుని నోట్లోకి, వరుడు వధువు నోట్లోకి అందివ్వాలి.

వీళ్ళు తమలంకూడా నోటికి నోటితో అందివ్వమంటారేమో దైవమా అని కోనంగి భయపడ్డాడు.

**పార్వతి:** నమలవే అనంతం!

**మీనాక్షి:** నమలండీ కోనంగిరావుగారూ!

**కోనంగి:** నములుతున్నా నమ్మా, నములుతున్నాను.

**అంబుజం:** మింగివేయకండి కోనంగిరావుగారూ!

**మీనాక్షి:** ఆ తమ్మ–

**అనంతలక్ష్మి:** మీనాక్షి!

**పార్వతి:** ఎందుకమ్మా మీనాక్షి? మీరు ఒకరి కొకరు తమ్మ అందియ్యాల? చేతులతో కాదండీ కోనంగిరావుగారూ!

**కోనంగి:** ఒక పాట రాసుకువచ్చాను. పాడమంటారా?

**అందరూ:** తప్పకుండా! అభివందనాలు.

**మీనాక్షి:** ఆ తర్వాత అనంతం ఓ పాట పాడాలి!

**కోనంగి:**–

*ఆకాశ దూరాల కంతేది చివరేది?*
*హృదయామృతము రుచికి*
*పదములల్లే దెవరు?*
*ఈ కొండ నోవాగు ఆ కొండనోవాగు*
*రెండు వాగులు కలియు*
*ప్రేమ క్షేత్రంబేది?*
*ఆనంద డోలికాయానాన కంతేది?*
*ఆర్ద్రకంఠంలోని ఆలాప నేరూపు?*
*చీకటిలో చీకటి చేరినట్లెవరెరుగు?*
*వెలుగు వెలుగున చేరు విధము ఎరిగిన దెవరు?*

**అంబుజం:** ఏమిటిబాబూ ఈ వేదాంతం? కాని పాడడం దివ్యమే!

**అందరూ:** అద్భుతంగా ఉంది.

**మీనాక్షి:** నీ వంతో అనంతం!

**అనంతం:** నాకు వచ్చిన పాటలు కృతులే!

**అంబుజం:** కృతులకూ, ఇప్పటికీ శ్రుతి కలవదే!

**అనంతం:** నేను ఒకరి వ్రాత పుస్తకంలో వ్రాసుకొన్న ఓ పాట ఆ మధ్య చదివాను, అది పాడుతాను!

**పార్వతి:** ఆనందం! కానీ!

**అనంత:** ***ఆడవో శిఖిరాజ ఆడు పించమువీడ***
***ఆలము నీలపు కాంతి అడవి కుసుమాలతో***
***ఆకాశవీధిలో అరుదెంచె మేఘాలు,***
***మేఘాల నృత్యించె మెరుపు బాలిక ఒకతె!***
***నీలి బాలునివేణు ఆలపించెను నీలమేఘ మల్లారి నా మేనెల్ల పులకించె!***

ఈ పాట ఆపుతూనే బాలికలందరు పరుగున ఆ మందిరం విడచి, తలుపులు పైన బిగించారు.

* * * *

కోనంగి తల్పములో తెల్లవారుతున్నది. భార్యను కౌగిలిలో అదుముకొనే

*"ఏ మహాతపస్సును చేసినానో*
*ఏ పవిత్ర సుకృతాన్ని చేసినానో*
*నువ్వు నా దేవివై వెలసితివి బాలా?"* అని పాడినాడు.

అనంతలక్ష్మి అతని కౌగిలి నుండి జారి అతని పాదాలపై తల నుంచి అవి ముద్దు పెట్టుకొంది. కోనంగి తానూ క్రిందకు వ్రాలి అనంతలక్ష్మిని సువ్వున ఎత్తుకొని హృదయాని కదుముకొన్నాడు. అయిదుగంటలు కొడుతున్నది.

ఇంతలో ఎవరో వారి శోభనగృహపు తలుపులు కొట్టినారు.

యిద్దరూ కౌగిలి వదలి ఒకరి నొకరు ఆశ్చర్యంగా చూచుకొన్నారు.

"అమ్మిణీ!"

భయపడిన, సగం ఏడుపు కలసిన జయలక్ష్మి మాట వినబడింది.

ఇద్దరూ తెల్లబోయి తలుపు వైపు చూచారు.

"అమ్మిణీ!" ఇప్పుడు వెక్కి వెక్కి ఏడుపుతో జయలక్ష్మి పిలిచింది.

కోనంగి రెండంగలలో వెళ్ళి తలుపు తెరిచాడు. ఎదుట జయలక్ష్మి, అనంతలక్ష్మి స్నేహితురాండ్రు, చుట్టాలు కళ్ళనీళ్ళతో ఏడుస్తూ కనబడ్డారు. వాళ్ళ వెనకాల పోలీసు అసిస్టెంటు కమీషనరు, ఇద్దరు ఇనస్పెక్టర్లు, కొంత మంది కానిస్టేబిల్సు కనబడ్డారు.

కోనంగిరావు తెల్లబోయాడు. "ఏమిటండీ ఇది?" అని జయలక్ష్మిని అడిగాడు.

అప్పుడు అసిస్టెంటు కమీషనరు "అయ్యా! మిమ్ము అరెస్టు చేస్తున్నాను. సాయంకాలమే చేయవసింది. కాని ఇది మీ శోభనపు దినం. అందుచే మీకెవ్వరికీ తెలియకుండా మీ మేడచుట్టూ కాపలా ఉంచి, తెల్లవారుతోందిగదా అని ఇప్పుడు అరెస్టు చేయడానికి వచ్చాను."

జయలక్ష్మి నిలువునా కూలిపోయింది. అనంతలక్ష్మి చైతన్యంలేని కట్టబొమ్మలా నిలుచుంది.

## 4

"గాంధర్వ కుటీరం" (జయలక్ష్మి ఇల్లు) ముందునే పోలీసువాను ఉంది. అందులోని కోనంగిని ఎక్కించారు పోలీసువారు. ఆ వెనకే తాము ఎక్కారు. అందులో నలుగురు పోలీసు జవానులు, ఒక పెద్దమనిషి ఉన్నారు. ఒక 'జవాను' తలుపులు వేశాడు. వాను సాగింది. కమీషనరుగారు తన కారులో బయలుదేరారు. వానులో ఇద్దరు సబు ఇనస్పెక్టర్లు ఉన్నారు.

ఆ 'వాను' వేగంగా సాగిపోతోంది. కోనంగి ప్రాణం బిగుసుకుపోయింది. "ఎందుకు పోలీసువారు తన్ను అరెస్టు చేశారు? ఎక్కడ కేసు పెట్టారు? ఆ రాత్రి తాననుభవించిన స్వర్గాతీతానంద మేమిటి? ఆ వెంటనే ఈ అరెస్టేమిటి? తన మాట అలా ఉంచండి, అక్కడ అనంతలక్ష్మి ఏమవుతుంది? ఏమనుకుంటారు తన్ను. ఇది వైట్‌వే వారు పెట్టిన కేసు కాదు గదా? తానేమీ తప్పు చేయలేదే! తప్పు చేయగలిగిన ధైర్యం ఏదీ తనకు?

అనంతలక్ష్మి ఎలాంటి ప్రేమ అర్పించింది! ఆ దివ్యాతిదివ్య క్షణాలు తలుచుకునేందుకు కూడా తాను తగడే? అనంత అమృతమూర్తి, సౌందర్య పరమావధి! తాను అతి అదృష్టవంతుడు కాబట్టి ఆమెతో ఆ కొద్ది గంటలన్నా ఏదో పరమ సమ్మోహస్థితిలో దేవత్వమే పొందాడు! కాని ఆ బాలిక? తమకిద్దరకూ పెళ్ళికాకుండా ఉన్నప్పుడు ఈ అరెస్టు జరిగి ఉంటే బాగుండునే! తనకన్న వేయిరెట్లు, కోటిరెట్లు మంచివాడు భర్తగా దొరికి ఉండును. తానామెకు తగడు. అందుకు భగవంతుడిలా "ఓయి చచ్చుపెద్దమా! నువ్వు చేసిన పుణ్యం ఎంతో మంచిది గాబట్టే నీకామె ఒక రాత్రికన్నా భార్య అయింది!" అంతవరకే తనకు వరమిచ్చాడు.

శోభనమని ఈ పోలీసువారు రాత్రికి రాత్రి అరెస్టు చేయలేదు. అదే పది కోటికోటి అదృష్టాలముద్ద. పోలీసువారయితేనేమి, వాళ్ళు మనుష్యులే! కాని కేసు ఏమిటి? తానేమి తప్పు చేశాడు? త్వరలో డాక్టరుకు కబురు పంపి బెయిలు పిటీషను పెట్టించాలి" అనుకొంటూ కోనంగి తలఎత్తి, పోలీసువారి మధ్య ఉన్న పెద్దమనుష్యుని వంక చూశాడు. అతడు బేడ్రెస్సులో ఉన్న ఒక పోలీసు ఇనస్పెక్టరను కొన్నాడు.

"కోనంగీ! కంగారుపడకు."

కోనంగి చకితుడై ఆ ధ్వనివైపు చూచాడు. ఆ అదృష్టకాంతులలో ఆ పెద్దమనుష్యుడు తనవైపు చూస్తున్నాడు. మాట తనకు చిరపరిచయమైనట్లే ఉంది.

"ఏమి కోనంగీ, ఆనవాలు పట్టలేదా?"

"నువ్వా డాక్టర్!"

"అవును నేనే; డాక్టరును."

కోనంగి హృదయం తేలికైపోయింది. తన్ను విడిపించే మగవాడు రానే వచ్చాడు. తెల్లవారగానే పోలీసువారు తన్ను విడుదల చేసి తీరుతారు. అమ్మయ్యా! అతని గుండెల్లోంచి బరువు తీసివేసినట్లే అయింది.

**డాక్టరు:** కోనంగీ, నేను నీవలెనే ఈ పోలీసువారి ఖైదీని.

**కోనంగి:** ఏమీటీ! నువ్వా...? నాకు తల తిరిగిపోతోంది డాక్టరూ!

**డాక్టరు:** పడుకుంటావా?

**కోనంగి:** నిజంగా తల తిరగటంకాదు. ఏమీటీ అరెస్టు అని?

**డాక్టరు:** ఏముంది, మనం ఇద్దరం కమ్యూనిస్టులమట! మనం ఇద్దరము తక్కిన ఇంకా ఎంతమందో కమ్యూనిస్టులతో కలసి ప్రభుత్వంపై కుట్ర చేస్తున్నామట!
**కోనం:** మనమా? కుట్రా?
**డాక్టరు:** అవునయ్యా, అవును.
**కోనంగి:** మనకు కుట్ర ఏమిటోయ్?
**డాక్టరు:** కమ్యూనిస్టు రష్యా జర్మనీతో సంధి చేసుకున్న తరువాతనేగా, జర్మనీ పోలెండుమీద విరుచుకుపడింది.
**కోనంగి:** విరుచుకుపడనీ, తిననీ, దానికీ మనకూ సంబంధం ఏమిటంట?
**డాక్టరు:** జర్మనీకీ ఇంగ్లండుకూ యుద్ధమేనా?
**కోనంగి:** నువ్వన్న ముక్కలు నాకర్థం కాక కాదు నాయనా?

రష్యాకూ ఇంగ్లండుకూ స్నేహమే కదా! పైగా రష్యాకూ జర్మనీకీ జరిగిన సంధి "నన్ను ముట్టుకోకు నామాలకాకి, నిన్ను ముట్టుకోను నీమాల కొంగ!" అన్నదేగాదా అంట.
**డాక్టరు:** ఇవన్నీ ఇప్పుడు మనం వాదించుకుంటే ఏమి లాభం?
**కోనంగి:** మన్ని కోర్టులో విచారిస్తారా?
**డాక్టరు:** విచారణాలేదు, గిచారణాలేదు. ఈయుద్ధావసరం నిమిత్తం వచ్చిన-
**కోనంగి:** అర్ధణాలు. ఆర్డినెన్సులు -
**డాక్టరు:** ఆ ఆర్డినెన్సులలో ఒకదాని క్రింద -
**కోనంగి:** దేని క్రిందైతేనేం, పైనైతేనేం, మనం ఇద్దరం జైలు ప్రవేశ శుభమహూర్తోస్తు అన్నమాట.
**డాక్టరు:** అదిదా నాయనా! నువ్వు కాస్త తేరుకున్నట్లున్నావు. ధోరణి ప్రారంభం అయింది.
**కోనంగి:** ఏం ధోరణి రెడ్డీ! నీ మాట విని ఏదయినా సినీమా ఏమో అని కొంత కొంత సంతోషించాను. కాని, నిజమయిన జయిలు అంటే కాస్త బిక్కుబిక్కుమంటూనే ఉంది ప్రాణం!
**డాక్టరు:** ఇదివరకు ఎప్పుడయినా జైలుకు వెళ్ళావా?
**కోనంగి:** నేనేమన్నా దొంగననుకున్నావా?
**డాక్టరు:** ఓరి నీ యిల్లు బంగారంకానూ! ఏ కాంగ్రెసు ఉద్యమంలోనన్నా వెళ్ళావేమో అనోయీ నా ప్రశ్న?
**కోనంగి:** నాకుద్యమాలేమిటి నాయనా! నాకు ఉద్యోగం ఏమిటీ? అన్న ఉద్యమం తప్ప.
**డాక్టరు:** ఇల్లారా, దగ్గర కూర్చో! అప్పుడే తిరుక్కాలిక్కుందరం రోడ్డు వచ్చింది.
**కోనంగి:** ఎక్కడి కేమిటి మన యాత్ర?
**డాక్టరు:** రామేశ్వరమో? -
**కోనంగి:** తిరువనంతశయనమో?

కోనంగి లేచి పోలీసు జవానుల సహాయంతో, ముందుకు పోయి డాక్టరు ప్రక్క కూచున్నాడు.

డాక్టరు నిట్టూర్పు పుచ్చి "కోన్, ఏమి అత్తరువాసన కొడుతున్నావు. బట్టలన్నా మార్చుకోకుండా వచ్చావా?" అని అడిగాడు.

కోనంగి తెల్లబోయాడు. ఒక్క నిమిషం గుండె ఆగిపోయింది. లేని నవ్వు తెచ్చుకొని "అనంతంతో చెప్పనన్నాలేదు రెడ్డీ?" అన్నాడు. మా అత్తగారు మూర్ఛపోయింది. అనంతం సంగతి ఏమయిందో?" అని తల వంచుకున్నాడు.

"ఇది ఎలా వచ్చిందో నాకు అర్థంకావటంలేదు."

"ఎవడో ఒక రాస్కెల్ అబద్ధాలు కల్పించి మన ఇద్దరిమీదా ప్రభుత్వం వారికి రిపోర్టు ఇచ్చాడట?" అని అన్నాడు డాక్టరు.

"నీ కెల్లా తెలిసింది?"

"అసిస్టెంటు కమీషనరు నాకు స్నేహితుడు. అతడీ ముక్క నా చెవిని వేశాడు."

"ఎవడా మహానుభావుడు?"

"గర్భాదానపు గదిలో నుంచి కథానాయకుణ్ణి ఖయిదుకు పంపిన హీనుడు."

"ఘోటక బ్రహ్మచారివి నువ్వు. నామాట కేమిగాని నిన్ను కటకటాల వెనక్కు వాటంగా నెట్టిన ఘోరపాపి ఎవడు వాడు?"

పోలీసువాన్ చెంగల్పట్టు పోలీసు స్టేషను దగ్గర ఆగింది. పోలీసు వారు కోనంగినీ, డాక్టరునూ మొగాలు కడుక్కొని ఫలహారాలు చేయమన్నారు. వారిద్దరూ ఇడ్డెనులు, దోసెలు, వడలు సాంబారు, కాఫీ ఫలహారాలు చేశారు.

"ఈ మర్యాద అత్తవారి మర్యాదలానే ఉందోయి" అన్నాడు కోనంగి.

"ఒక అత్తవారింట్లోంచి ఇంకో అత్తవారింట్లోకి వెడుతున్నావు."

"నీకిది మొదటి అత్తవారిల్లేగా?"

"అవునయ్యా, భార్య మాత్రం లేదుగాని."

* * * *

అలా ఆమె భర్తను పోలీసువారు పట్టుకుపోయారు. భర్తతో మొదటి రాత్రి ముగియలేదు. దిక్కులు తెలతెలవారలేదు. ఆమె అలా నిలుచుండిపోయినది.

అనంతలక్ష్మికి తల్లి మూర్ఛపోయిన సంగతి తెలియదు. ఎనమండుగురు స్నేహితురాండ్రు అక్కడ ఉన్నారన్న సంగతి ఆమెకు స్ఫురించలేదు. తనకు సంధాన మహోత్సవము జరిగింది అన్న జ్ఞానం ఆమెకు మాయమైంది.

భర్తను తీసుకుపోయారు. తన ప్రభువును, తన పరమ మిత్రమును, తన పురుషోత్తమోత్తముని తీసుకుపోయారు. ఎవరు? ఎందుకు? ఈప్రశ్నలేమీ ఆమె కుదయించలేదు. ఆమె కన్నులు మూయకుండా గుమ్మంవైపు చూస్తూ నిలుచుంది. ఆమె చూపులలో చైతన్యములేదు. ఆమె మోమున రక్తములేదు. ఆమెకు తాను అన్నజ్ఞానము పోయింది. ఆమెకు తానెక్కడ ఉన్నదీ తెలియదు.

కాని ఆమె మూర్ఛపోలేదు. ఏడవలేదు. కన్నులు మూస్తున్నట్లే వారెవ్వరికీ కనబడలేదు.

ఆ రాత్రి అక్కడ ఉన్న స్నేహితురాండ్రు ఆమెను చుట్టుముట్టి ఆమె సాధారణంగా పడుకునే గదిలోనికి నెమ్మదిగా తీసుకొనిపోయారు.

ఆమెను కూచోమంటే కూచుంటుంది. మొగం కడుక్కోకపోయినా ఇంత ఘాటు కాఫీ ఇచ్చారు. తాగు అంటే ఒక గుక్క తాగుతుంది. అలాగే బ్రతిమాలి ఎలాగయినా ఒక కప్పు త్రాగించారు.

* * * *

జయలక్ష్మి అల్లుణ్ణి అరెస్టుచేసి తీసుకు వెడుతున్నారని తెలియగానే ఒళ్ళు విరుచుకొని పడి మూర్ఛపోయింది. చుట్టాలు, ఆడవాళ్ళు గొల్లుమని జయలక్ష్మి దగ్గరకు వ్రాలినారు. కొందరు మొహమ్మీద నీళ్ళు చల్లినారు.

జయలక్ష్మికి మెలకువ వచ్చింది. కోనంగినీ, పోలీసువాళ్ళనూ, తన దురదృష్టాన్నీ తిట్టుకుంటూ జయలక్ష్మి ఏడవడం మొదలు పెట్టింది. ఒకరు డాక్టరు రెడ్డిగారింటికి పరుగెత్తారు. డాక్టరు రెడ్డిగారిని కూడా అరెస్టుచేసి తీసుకెళ్ళారని అక్కడ తెలిసింది.

ఎందుకు అరెస్టు చేసినట్లు అని ఇంటిల్లిపాదిని విచారం ఆకర్షించింది. చుట్టపు మొగవాళ్ళు కారువేసుకు వెళ్ళి జయలక్ష్మిగారి అడ్వకేటును తీసుకు వచ్చారు. ఆయన వచ్చి సంగతులన్నీ తెలుసుకొని, కోనంగిరావు గారి అరెస్టు విషయమై, సర్వమైన దర్యాప్తులు చేస్తానని చెప్పి వెళ్ళాడు.

జయలక్ష్మి సేదతేరుకుంది. ఆమె తన కూతురు దుఃఖం, కంట నీరులేని భయంకర విచారం చూచి బేజారై పోయింది. వర్ణించలేని, అర్థం కావటంలేని, గుండెను కలచివేసే అనంతలక్ష్మి స్థితిని చూసి జయలక్ష్మికి ఎక్కడలేని భయమూ వేసింది.

కూతుర్ని వదలిపెట్టి ఉండకండని చుట్టాలను స్నేహితురాండ్రను ప్రార్థించి, తాను స్నానాదికాలు కావించి పూజా గృహంలోకి వెళ్ళింది. పూజ ముగించుకొని, భగవంతుని ఎదుట పద్మాసనం వేసుకొని అలాగే కూర్చుంది.

ఆమె పూజాపీఠంలో కూడా భర్తయొక్క ఛాయాచిత్రముంది.

భగవంతునర్చిస్తూ స్వచ్ఛమైన జీవితం గడుపుదామన్న ప్రతివానికీ ఇలా కష్టపరంపరలు రావలసిందేనా? భక్తుల శక్తి సామర్థ్యాలనూ, దీక్షనూ భగవంతుడు పరీక్ష చేస్తాడట. సుఖమంటే మనిషికంత ప్రీతేమిటి? అనంతంగా ఎవడు సుఖవంతుడు? ఉత్కృష్టమైన ఆనందంవల్ల వచ్చే అనుభవమూ, భయంకరమైన దుఃఖంవల్ల వచ్చే అనుభవమూ, రెండూ చీకటి వెలుగులు కాబోలు.

ఇలాంటి జీవిత రహస్యాలు తన భర్త తనకు బోధించలేదా?

* * * *

దొడ్డిలోని ముచ్చురు వస్తాదులకు పట్టరానికోపం వచ్చింది. అనంతలక్ష్మిని తమ బిడ్డను తమ సహోదరి కొమరితను, ఎవరయ్యా ఈలాంటి దుర్భరమైన అవమానంచేసి ఆమె దివ్యానందకలశాన్ని ముక్కలుచేసి, కోనంగిని బంధించి తీసుకుపోగలిగారు? తాము ముగురు తలచుకుంటే ఏ పోలీసువారు ఆగుతారు? వాళ్ళను ముక్కలుచేసి కోనంగిరావుగార్ని ఆపు చేసి వుండేవారుకదూ!

ప్రజలలోని అరాజకత్వాన్ని అదుపాజ్ఞలలో ఉంచేవారు పోలీసువారు మాత్రం కాదు. ప్రజలలోని అరాజకత్వం నాయకులపై భక్తీ, పెద్దలంటే భయమూను.

ఎన్నిసారులు మన ముచ్చురు వస్తాదులూ పోలీసువారికి ముగ్గురు నలుగురు మహా భయంకరులయిన దుర్మార్గులలో దుర్మార్గులను పట్టి యివ్వలేదు! దుర్మార్గ ప్రపంచానికి నాయకులయిన రౌడీలు, మన వస్తాదులు ముగ్గురూ అంటే గజగజలాడుతారు. వారి ద్వారా వీరు రౌడీమహారణ్యంలోని హీన క్రూరమృగాలను పట్టి యిచ్చారు పోలీసువారికి.

ఒకరోజు కలకత్తా మెయిలు వచ్చింది. ఆ బండిలో నుండి ఖద్దరు వస్త్రధారులైన ఒక కుటుంబమువారు దిగారు. ఆ కుటుంబం పెద్ద కాంగ్రెసు ప్రపంచంలో కొంచెం

పేరు పొందినవారు. సాధుమూర్తి. ఏదో పని వుండి తిరుపతి చూచిన తర్వాత మదరాసు వచ్చాడు. మదరాసులో రామస్వామి మొదల్యారు సత్రంలో మకాంపెట్టి, మూడు రోజులుండి పని చూచుకొని, ఆ వెనుక తిరిగి వెళ్ళిపోదామని ఆ తెలుగు పెద్దమనిషి ఉద్దేశం.

రైలు దిగీ దిగడంతోటే, కూలీలను మాట్లాడుకొని కుటుంబంతో జట్కాబళ్ళ దగ్గిరకు వద్దామని నడుస్తూ ఉన్నాడు. టికెట్టు గేటు దాటడం తోటే ఒక జట్కావాడు వచ్చి "రాండి స్వామీ!" అని కూలివాని నెత్తిమీద మూటలు లాక్కొని ముందుకు సాగినాడు.

ఈ పెద్ద "అక్కడ సామాను పెట్టు, నేనే జట్కాల స్టాండు దగ్గరకు వచ్చి బేరం మాటాడుకుంటానయ్యా" అని అన్నాడు. ఆ జట్కామనిషి వినకుండా సామానుతో ముందరకు పోసాగాడు. ఆ పెద్దమనిషికి కొంచెం కోపం వచ్చి, తన చేతిలోని సామాను క్రిందను ఉంచి పరుగెత్తుకొని వెళ్ళి జట్కామనిషి చేతిలోని మూటలు లాక్కొన్నాడు. దానితో ఆ జట్కావాడు పాములా బుసకొడుతూ "బయటకు రారా పైత్తకారీ నీ పని బడతా"నని వెళ్ళిపోయాడు.

ఈ పెద్దమనిషి జట్కాల దగ్గరకు కుటుంబంతో వెళ్ళేసరిగి ఆ జట్కావాడు "ఏమిరా వెధవా! నా చేతిలో మూటలు లాగుతావుట్రా, ఇక్కడ నిన్ను నీ పెళ్ళాం వాళ్ళ ఎదుట పాతివేస్తా"నంటూ మీదకు వచ్చాడు.

ఆ పెద్దమనిషి తెల్లబోయాడు. నోట మాట రాలేదు. చుట్టుప్రక్కల ఎవ్వరూ లేరు. అంతా జట్కావాళ్ళే! కుటుంబంవారు ఘొల్లుమన్నారు. జట్కావాడు ఆ పెద్దమనిషిని చెంపపై బలమైన బలమైన దెబ్బకొట్టబోతూ, చటుక్కున ఆపుచేసి వెనక్కు తగ్గాడు.

ఇదేమిటా అని ఆ పెద్దమనిషి ఇటూ అటూ చూస్తే అప్పుడే ఖద్దరుషర్టూ, ఖద్దరు గూడకట్టూ, ఖద్దరు టోపీ పెట్టుకొన్న శలాకలా ఉన్న ఒక మనుష్యుడు వస్తున్నాడు. ఆ పెద్దమనుష్యుని చుట్టూ మూగిన జట్కావాళ్ళంతా చూసి భయంతో వెనక్కు వెళ్ళిపోయారు. ఆ మనుష్యుడు వాళ్ళవైపన్నా చూడకుండా "ఏమండీ స్వామీ, ఏమిటిదా గడబిడ?" అని ప్రశ్నించాడు.

**పె. మ:** ఆ జట్కావాడు నన్ను కొట్టాలని మీదకు వచ్చాడు.

**మను:** ఎందుకు?

**పె. మ:** రైలులో నుంచి వస్తోంటే, మా కూలీ నెత్తిమీదనుంచి నాతో బేరం ఆడకుండానే మూటలులాగి గబగబ ఇక్కడకు వస్తోంటే, నేను భయపడి నా మూటలు నేను లాక్కున్నాను. ఇక్కడకు రాగానే, "నా చేతిలో మూటలు లాక్కుంటావా?" అంటూ ఏదో అరవంలో అంటూ, ఈ జట్కా వాళ్ళందరూ నా చుట్టూ మూగుతుండగా నన్ను లెంపకాయ కొట్టడానికి సిద్ధమైనాడు."

"అలాగా? ఏమిరా కందప్పన్, ఈలారా" అని జట్కా వాళ్ళ వైపు చూచి వాళ్ళచాటున వున్న ఆ పొగరుబోతు జట్కావాణ్ణి పిలిచాడు. వాడు గడగడలాడుతూ ఆ మనుష్యుని దగ్గరకు వచ్చాడు.

"ఏమిరా కందప్పా? మీ జట్కావాళ్ళు పొగరెక్కి పోతున్నారా ఏమిరా? మాట్లాడవేం? ఆయన కాళ్ళు పట్టు. ఇక్కడ నుంచి జాగ్రత్త. నేను చూడకపోతే ఆయన్ను లెంపకాయ కొట్టేద్దువుదానే? నువ్వు చేసిన ఈ తప్పిదానికి ఏమి శిక్ష విధించాలిరా?"

ఆ పెద్దమనిషి ఈ ఆగంతకుని చూచి "ఏమండీ స్వామీ, మీరెవరో తెలియదు. ఈ తప్పిదానికి ఆయన్ను క్షమించండని మా ప్రార్థన" అని తెలియజేశారు. ఆ ఆగంతుకుడు

వినాయగంపిళ్ళ, ఆతడు తీవ్రంగా జట్కావాడు కందప్పను చూచి, "ఏమిరా కందప్పా, ఎంత కండకావరంరా, వారు గాంధీజీ శిష్యులనయినా ఆలోచించలేదే నువ్వు? లెంపకాయకు చెయ్యెత్తినావే" అని మళ్ళీ అడిగాడు. జట్కావాడు ఆ ఖద్దరు వస్త్రధారి యెదుట సాగిలబడినాడు.

ఈ వినాయగం అనినా, ఆతని ఇద్దరు స్నేహితులనినా దుష్టులకు అలాటి భయం!

## (5)

కారాగారంలోకి అడుగిడగానే 'గోరంటు' (క్వారంటైను)లో ప్రవేశపెడతారు. జైలు సర్వరోగ నిరాకరణ ప్రదేశమనిన్నీ, ఆరోగ్యదేవతా తాండవ రంగస్థలమనీ ప్రభుత్వంవారు బాగా నమ్మి ఉండడంచేత అలాంటి పరమ శుభ్ర ప్రదేశంలోకి వచ్చేవారు కొన్ని క్షాళనాలు పొందితేనేగాని అడుగు పెట్టడానికి వీలులేదని నిర్ణయించారు. ఆ క్షాళన ప్రదేశం "గోరంటు"

ఏడురోజులు 'గోరంటు'లో ఉండి కోనంగిరావూ, డాక్టరు రెడ్డి జైలు ప్రథమద్వారం (అది రథాలు కూడా వెళ్ళేటంత పెద్దది) దాటారు, కార్లూ, గీర్లూ, రథాలూ వగైరాలకే తెరుస్తారు. మామూలు ఖైదీలు ప్రవేశించేటప్పుడు, పెద్దగేటులో ఒక చిన్న తలుపు ఉంటుంది. అది తెరచి ప్రవేశింపబెడ్తారు ఖయిదీని.

ఆ ద్వారభాగం కాల్వ 'లాకు' లా ఉంటుంది. ఇక్కడ ఖయిదీని పూర్తిగా పరీక్ష చేస్తారు. ఏ వస్తువులన్నాదాచి పట్టుకువస్తున్నాడా అని బట్టలు కూడా విప్పి పరీక్షచేస్తారు.

ఆ తర్వాత అతనికి కఠిననరకం అయితే దుస్తులు: 1. పొట్టిలాగు, 2. బనీను, 3. నెత్తిటోపీ ఇస్తారు. అవి ఖయిదీ దుస్తులు. అవి రెండు సెట్టులు ఇస్తారు. అవి పట్టుకొని రెండవ గేటు దాటాలి. ఇక జైలాశ్రమ ప్రవేశం. ఏ-తరగతి ఖయిదీలకు ఖయిదీ దుస్తులు లేవు.

జైలులో ఒంటిగా ఏ ఖయిదీ వెళ్ళకూడదు. కూడా వార్డు (వార్డర్) గాని, కానీ కార్టు (కాన్విక్టు వార్డరు) గానీ, (ఎడ్వార్డు) హెడ్ వార్డరుగాని కూడా ఉండాలి.

జైలు వంకర టింకరలతో కలిసి ఒక రథచక్రంలా ఉంటుంది. పెద్ద జైళ్ళకు మధ్యను 'టారు' (టవరు) ఉంటుంది. చిన్న జైళ్ళకు ముఖ్యద్వారమే టవరు.

టవరుమీద సూపరెంటు (సూపరింటెండెంటు) ఆఫీసు ఉంటుంది. జైలు వేరు (జైలరు) ఆఫీసూ ఉంటుంది.

జైలులో చేసే పనులన్నీ ఖయిదీలే చెయ్యాలి. నూనె గానుగ ఆడడం, నూలుచేత, గొంగళీ, తివాసీ నేత, వడ్రంగిపని, తోటపని, వడుకు పని, రంగులు వేసే పని, కార్ఖానాపనీ అన్నీ ఖయిదీలే చేయాలి.

వంటా వారే. మంగలి, చాకలి పనులూ వారే, పాకీ పనులూ వారే!

కాంగ్రెసు గాంధీమహాత్ముని ఆధ్వర్యం క్రిందకు వచ్చి, అహింసా వ్రత దీక్షాపరులు వేలకువేలు, లక్షలకు లక్షలు జైళ్ళకు వెళ్ళడం ప్రారంభించిన కొలదీ జైళ్ళలో అనేకమైన మార్పులు వచ్చాయి.

అంతకుముందు మామూలు జైళ్ళకు చుట్టే యినప పట్టాలు పదును పెట్టిన మంగలికత్తులుగా వాడేవారు. ఆ కత్తులు వెంట్రుకలతోపాటు చర్మపు పెళ్ళలు కూడా చెక్కివేస్తుండేవి.

తువాళ్ళబదులు చదరపు చేతిరుమాళ్ళుండేవి. స్నానం చేయడానికి గోచీగుడ్డ లుండేవి. అందరూ కలిసి మలవిసర్జనకు పోయేవారు. అదైనా నియమిత కాలంలో ముగించాలి. వ్యవధి ముగియగానే కూడా ఉన్న వార్డు 'టెంషను' (అటెంషను) అంటాడు. అందరూ లేచి శుభ్రం చేసుకొని వచ్చి వరుసగా నిలబడాలి. ఈ విషయమై జైలు నియమాలలో ఒకటి "నిష్కారణంగా మలమూత్ర విసర్జనం చేయరాదు" అని.

కాళ్ళకు కడియాలు, మెళ్ళోపుస్తెల్లా ఖయిదీల వరుస సంఖ్య, వెళ్ళే అవి యిప్పుడు లేవు. బేడీలు తీసివేశారు, పాయిఖానా అందరూ కనబడే బందెలదొడ్డిగాగాక, విడి విడి దొడ్లుగా ఏర్పాటు చేశారు.

పూర్వం జైలు తిండి అధ్వాన్నంగా ఉండేది. జైలు అధికారుల స్వంత ధనాగారం నింపే పెద్ద సంస్థలలో జైలు భోజనపు సంస్థ ముఖ్యమైనది.

మనుషునకు ఇరవైరెండు తులాల బియ్యం ఇవ్వవలసివస్తే, బియ్యంలో పదితులాల బియ్యం జైలు అధికారుల జేబులలోనికే! అలాగే కూరగాయల విషయంలో, ఉప్పు, పప్పు, నూనెల విషయంలో, ఇంక కారాగార నివాసుల కడుపుల్లో, తుక్కూదూగరా, మండే మశానమూనూ!

ఇప్పుడు కాంగ్రెసు బందీలు పూర్తిగా రేషను పుచ్చుకొని తామంతా కలసి వేరే వంట చేసుకోవడమే! నెయ్యి, మజ్జిగలు, వచ్చాయి. గోధుమలు తినేవారికి గోధుమలు వచ్చాయి.

కోనంగి, రెడ్డి లోనకు రాగానే అదివరకే అక్కడ ఉన్న పన్నెండుగురు రాజకీయ నిర్బంధితుల జట్టులో చేరారు. డాక్టరు రెడ్డి తన ఊరగాయలు తెప్పించుకోవచ్చునట! తన పరుపూ, పక్కా, కాంపుకాటు అన్నీ తెచ్చుకోవచ్చును.

జైలు ఎల్లా ఉంటుందో అని ఏవేవో ఊహించుకున్నాడు కోనంగి. ఊహకు మించే ఉంది అసలు జైలు.

అతనికి ప్రత్యేకం ఒక గది. నామకఃతువాళ్ళు కొసలు ముడివెయ్యడం పని. పుస్తకాలు తెచ్చుకోవచ్చును. వ్రాతకు పెన్సిలు, తెల్లకాగితాల పుస్తకమూ ఇచ్చారు. నెలకు రెండుసార్లు ఉత్తరాలు వ్రాసుకోవచ్చును. రెడ్డిగారు వారాని కోసారి వ్రాసుకోవచ్చును. అలాగే చుట్టాలూ, స్నేహితులూ వచ్చి చూడడమూ అంతే. అక్కడ నుండి అనంతలక్ష్మికి ఉత్తరం వ్రాయడం ప్రారంభించాడు కోనంగి.

| | |
|---|---|
| కారాగారవాసి | కడలూరు జైలు |
| నెం. 2056 రు | బ్లాకు ఎనిమిది |
| 6 ఏప్రిల్ 1942 | గది పద్దెనిమిది |

ప్రియమైన అనంతా!

ప్రాణం నీ దగ్గిరే మరచిపోయి వచ్చి ఉంటాను. మొన్న నా పక్క చుట్టలలో, ఇతర సామానులలో వెతికాను. ఎక్కడా కనపించందే! నీ దగ్గర మరచిపోయిన వస్తువును ఎల్లాగ మరచిపోయాను, అది కాస్త జాగ్రత్తగా చూస్తూ వుండు.

నీకు నేను ఇంతవరకు ఒక ఉత్తరమన్నా వ్రాయడానికి వీలులేకపోయింది. తీయతీయని పరిమళాల ఉత్తరాలు నీకు వ్రాసే అదను కల్పించినందుకు ప్రభుత్వానికి నా ధన్యవాదాలు.

జైలులో లేకుండా పైనేఉంటే, నేను ఉత్తరపుధృవం వెళ్ళవలసి వచ్చినా, నీతో కూడా వెళ్ళవలసిందే కారణాంతరాన, నీకు ఉత్తరం వ్రాయడానికి ఈలాంటి పరమాద్భుతసావకాశం కల్పించిన ఈ ప్రభుత్వముమీద ఆరువందల నవరత్నాలు వ్రాయవలసిందే!

ఇంక మన వ్యాపారం ఇక్కడ బాగానే ఉంది. ఈపాటికి నా ఈయక్ష శాపకారణం మీ అందరికి తెలిసే ఉంటుంది.

ఆత్మేశ్వరీ! ఎన్నో వ్రాయాలసి వుంది. అవన్నీ జైలువాళ్ళు చూస్తారన్న సిగ్గు. నేను వ్రాయవలసినవన్నీ వ్రాయడానికి చేసే ప్రయత్నం అర్థంచేసుకో!

నువ్వు ఏమీ బెంగపెట్టుకోకు. నీవు భారతీయాంగనవు. స్వాతంత్ర్యం లేని భారతీయుల స్వాతంత్ర్యం దివ్య ప్రయత్నంలో భాగస్వామినివి కావాలి.

నువ్వూ ఏమీ ఎరుగవు. నేనూ ఏమీ ఎరుగను. ఎందుకు నన్నీ పవిత్ర ప్రదేశానికి పంపారో నాకు కారణ గీరణాలు తెలియవు.

ఆ దినం మొదటిరాత్రి కదూ! ఆ అమృత క్షణాలు విశ్వకావ్యంలో స్థాయీభావ పవిత్ర సమయంకాదూ! ఆ క్షణాలు శాశ్వతంగా ఉండిపోతాయి. కాళిదాసాదుల వంటి కవులు వర్ణించలేని ఆనంద క్షణికంలో మనం లయమైపోయాము.

ఎడబాటు అందకుండా, అలాంటి క్షణానికి ఉత్తరక్షణంలో, ఒక వర్ణనాతీత గాథ విషాదపూరిత విరహగాథ ప్రారంభం అయింది. అక్కడే ఉండి అందం! అదే కావ్య సౌందర్యం. సాధారణ జీవితంలో కూడా కావ్య సౌందర్యం అనుభవించే శక్తి సంపాదించు కోవాలి! అంతే. కాని, ఏడ్చి, దొర్లి, ఉన్న దుఃఖాన్ని పదిరెట్లు వృద్ధిచేసుకొని, ఆ మహా దుఃఖం అందరూ చూచి ఎంతో ఓ ఓ ఓ సానుభూతి చూపిస్తున్నారా లేదా అని చూచి, కొయ్యబారిపోయి, దుఃఖం భరించలేమనుకొని, ఏ నదిలోనో పడడం, ముఖ్యంగా అది దగ్గరవాళ్ళు గోల, ప్రపంచం పాపం అనడం, ఇది మామూలు తంతు.

కాని అనంతలక్ష్మి అలా చేస్తూంటుందా? ససేమిరా పరీక్ష పూర్తిచేసి వేసవికాలంలో వచ్చి నన్ను చూస్తుంది. ఎంత అద్భుతంగా ఉంది ఆ భావం. నా సర్వేశ్వరీ!

నేను రేపటెల్లుండి ఓ పుస్తకాల జాబితా వ్రాసి పంపిస్తా! ఆ ప్రకారం పుస్తకాలు కొను, నాకు పంపించు.

అంత తియ్యగా నవ్వుతావు నువ్వు, ఎక్కడ సంపాదించావు నవ్వులు? పూర్వకాలంలోని వెన్నెలలు ఆ నవ్వులు. ఈనాడు అవి ఉదయసంధ్యా మధుర పరిమళ అరుణరాగాలు. ఏదీ ఒక్కసారి నవ్వవు అనంతలక్ష్మీ!

ఎన్ని యుగాలో తపస్సు చేసిన భక్తునికి, భగవంతుడు ప్రత్యక్షమయితే వచ్చే ఆనందం వర్ణించగలరు కవులు, కాని ఆ రాత్రి నాకు కలిగిన ఆనందం గొప్ప పాశ్చాత్య కవులూ, ప్రాచ్యకవులూ కలసిపోయి, ఒక మహా ప్రవాహంలా ప్రవహించినా వర్ణించలేరన్న మాటే! అందుకని అలాంటివి అతిరహస్యం అన్నారు.

నీ అనుభవం వ్రాయాలి, నా అనుభవం నేను ఒక పెద్ద గ్రంథంగానే నీకు వ్రాస్తాను.

ఈ గ్రంథంమీద నీ అభిప్రాయం వ్రాయాలి. అదిగో నాగది. ఇనప కటకటాల తలుపులు తెరిచే గంట కొడుతున్నారు. ఉత్తరం ముగిస్తా.

నేను రోజూ డెయిరీలా, నా కథ వ్రాస్తా, అదే నేను వ్రాసే ఉత్తరం. నువ్వు ఎన్ని ఉత్తరాలు వ్రాసినా పరవాలేదు.

ప్రేమతో,
కోనంగి.

కోనంగిని పోలీసువారు తీసుకొని వెళ్ళగానే స్తబ్ధురాలయిన అనంతలక్ష్మిని స్నేహితురాండ్రందరూ తీసుకువెళ్ళి వేరేగదిలో పడుకోబెడదామని చూశారు. లాభం లేకపోయింది. ఆమె పండుకోలేదు. మంచంమీద కూర్చుంది.

చెప్పిన పని చేస్తుంది. భావంలేని చూపులు మాత్రం చూస్తుంది. మొగం కడిగించారు. దుస్తులు మార్చారు...

**అంబుజం:** అనంతం! ఏమిటీ వ్యాపారం, నీ సంగతికి ఏమన్నా అర్థం ఉందా?

**మీనాక్షి:** కాఫీ కాస్త తాగవే!

**పార్వతి:** దేశంకోసం జైలుకుపోయిన భర్తనుగూర్చి ఈలా అయిపోతే నీ దేశభక్తి అంతా కూపంలో కలిసిందా?

**ఆండాళ్ళు:** మాట్లాడితే 'జన, గన, మన' పాడడానికి సిద్ధం అయ్యేది.

**అంబుజం:** ఎవరివంతుకు వారికి వస్తేనేగాని నిజం బయటపడదు!

**పార్వతి:** అదికాదే అంబుజం! మనకందరికీ దేశభక్తిలేదని వాదించేది కాదూ?

**కనకవల్లి:** మాటలకూ, చేతలకూ చాలాదూరం!

**మీనాక్షి:** ఖద్ధరు చీరలు కొన్నది, ఖద్దరు పట్టుచీరలు కొన్నది.

**నీలలోచన:** ఈ మధ్య ఖద్దరు వడుకుతోంది మొన్న హిందీ ప్రచారక సమితి ఉత్సవాలలో వడకటంలో మొదటి బహుమానం కొట్టింది.

**పార్వతి:** హిందీ చదివి ఈ ఏడు ప్రాథమిక పరీక్షకు వెడతానంది.

**అంబుజం:** తాను భర్తను గాఢంగా ప్రేమించింది. పాపం! ఆయన విరహతాపం భరించలేక ఈలాంటి అవస్థలో పడింది.

ఇంతలో లయోలా కాలేజీ ప్రొఫెసరు అయ్యంగారు అన్నగారు, డాక్టరుగారు ఒకర్ని తీసుకువచ్చారు. డాక్టరు అనంతలక్ష్మిని పరీక్షచేసి జబ్బు ఏమీ లేదనీ, అమ్మాయి నరాలకు భర్తను అరెస్టుచేసి తీసుకుపోవడం దెబ్బ అయిందనీ, ఇప్పుడు ఆమె స్నేహితురాండ్రు చేసే విధానం మంచిదేననీ, అనంతలక్ష్మిదేవికి కోపం తెప్పించడమే ఉత్తమమనీ, ఆ విషయం జాగ్రత్తగా ఆలోచించి కోపం తెప్పించండనీ చెప్తూ నరవిశ్రాంతికి మందుచీటీ వ్రాసి ఇచ్చి, సాయంకాలం మళ్ళీ వస్తానని చెప్పినాడు.

జయలక్ష్మిని పరీక్షచేసి, ఆమె నయంగా ఉందని ఆమెకూ కాస్త హుషారునిచ్చే మందు వ్రాసియిచ్చి వెళ్ళిపోయాడు.

ఈలోగా అయ్యంగారు ప్రొఫెసరు, అనంతలక్ష్మి స్నేహితులతో ఆలోచించాడు. ఈ పనంతా చెట్టియారుగారు చేశారని కథ అల్లి అమ్మాయితో చెప్పమన్నాడు. ఆ కథ మామూలు మాటలుగా అనంతలక్ష్మి వినేటట్లు మాట్లాడండని ఆయన సలహా ఇచ్చాడు. ఆ నాటకం ఆడే విధానం అంతా ఏర్పాటు చేశాడు.

అనంతలక్ష్మిచేత ఎల్లాగో కాఫీ త్రాగించారు. తర్వాత మందురాగానే మందూ త్రాగించారు. ఆ సమయంలో ఆమె ఉన్న గదిలో స్నేహితురాండ్రంతా చేరారు.

**నీలలోచన:** అసలు కోనంగిరావుగారి అరెస్టుకు కారణం ఏమయి ఉంటుంది అంబుజం? నువ్వు జడ్జీగారి కూతురువు కూడాను.

**అంబుజం:** ఏమయి ఉంటుందో మనకెందుకే! ప్రస్తుతం అనంతలక్ష్మికి మనం ధైర్యం చెప్పాలిగానీ?

**పార్వతి:** ఏమిటట్రా! అనంతానికి ధైర్యంలేదని మీరంతా అనుకోడం నాకేమీ నచ్చలేదు. నా ఉద్దేశం అనంతం ప్రస్తుతం ఆలోచించేది తాను కూడా జెయిలుకు ఎల్లా వెళ్ళాలా అని.

**మీనాక్షి:** దాని చేతకాదా జైలుకు వెళ్ళడం? పోలీసువాళ్ళు ధైర్యం చేస్తే అయిదు సెకండ్లలో అనంతం కారాగారవాసం చెయ్యగలదు.

అంతలో అనంతలక్ష్మి అన్న అయ్యంగారు అక్కడకు వచ్చారు.

**నీలలోచన:** ఏమండీ మాష్టరుగారూ! కోనంగిరావుగారిని ఎందుకు అరెస్టు చేసినట్లు?

**అయ్యంగారు:** అదంతా మన కెందుకులెండి!

**కనకవల్లి:** ఎందుకని తోసివేయకండి.

**అయ్యంగారు:** నేను తోసివెయ్యాలని అనుకుంటున్నానా? ప్రస్తుతం ఆ గొడవ మన కెందుకని?

**మీనాక్షి:** మేము తెలుసుకు తీరాలండీ మాష్టరుగారూ!

**అయ్యంగారు:** మా వాళ్ళింటికి ఒక నాటుకోటిసెట్టిగారు వస్తూ ఉండేవాడు...

**నీలలోచన:** వాడా? రాస్కెల్!

**అయ్యంగారు:** వాడు కోనంగిరావుగారు డాక్టరుగారితో కలిసి ప్రభుత్వముపై కుట్ర చేస్తున్నాడని పోలీసు కమీషనరుకు రిపోర్టు ఇచ్చాడట!

**అంబుజం:** ఏమిటీ ఆ రాస్కెల్, ఆ రాక్షసుడే!-

అనంతలక్ష్మి గబుక్కున మంచంమీద నుంచి లేచింది. ఆమె మహిషాసురమర్దనిలా అయి. ఆమె కన్నులు చింతనిప్పు అయ్యాయి. గజగజ వణకింది. ఏమిటి అన్నా? ఏ-ఏ-ఏమిటి? ఆ సెట్టిగాడా? రిపోర్టు ఇచ్చాడా? అన్నది.

అంబుజం గబుక్కున లేచి, అనంతలక్ష్మిని పట్టుకొని, "కూచోవే అనంతం. పోనీలెద్దు ఆ చచ్చు శెట్టి సంగతి మనకెందుకు?" అన్నది.

**అనంతం:** మనకెందుకా? ప్రభుత్వంమీద కుట్రచేశారని రిపోర్టు ఇచ్చాడా వాడు, వాణ్ణి ఇక్కడే ఉంటే-

**మీనాక్షి:** నీదాకా ఎందుకు? నేను వాడి గుడ్లు పీకేద్దును-

**నీలలోచన:** ఆ రిపోర్టు వ్రాసినవాడి చేతికి వాతలు పెట్టేదును.

**పార్వతి:** వాడి పళ్ళు రాలగొట్టుదును.

**అనంతం:** రాజకీయాలలో ఏమీ భాగం పుచ్చుకోనివారిని, అలాంటి నిందలువేసి రిపోర్టు యిచ్చాడా?

కోపం చల్లారి అనంతలక్ష్మి కన్నీరు కారిపోవ మంచంమీద పడి వెక్కి వెక్కి ఏడిచింది.

అమ్మయ్యా! అని అందరూ నిట్టూర్పులు విడిచారు.

**అంబుజం:** అనంతం! ఈ సంగతంతా మా నాన్నగారి ద్వారా తెలుసుకొని నేను చేసేపని అంతా చెప్తాను.

**నీలలోచన:** సీతాదేవి తండ్రి కూడా ఉపయోగిస్తాడు ఈ విషయంలో!

**మీనాక్షి:** నిన్న వచ్చిన 'సారా' అనే యూరోపియను అమ్మాయి కూడా మనకు సాయం చేయవచ్చునల్లా -

**అయ్యంగారు:** శెట్టిగారికి బుద్ధి వచ్చింది. నిన్న సబుకోర్టులో జయలక్ష్మిమీద వాడు తెచ్చిన వ్యాజ్యం క్షవరం చేశారు కోర్టువారు.
**మీనాక్షి:** అంతటితో ఊరుకుంటే ఎల్లాగు? ఆ రౌడీకుంకకు బాగా బుద్ధి చెప్పాలి.
**పార్వతి:** మంచి ఉపాయం ఏదయినా మనం ఆలోచించాలి.
**అనంతలక్ష్మి:** గాంధీతత్వవాదులు ప్రభుత్వంమీద కుట్ర ఎలా చేస్తారు?

## 6

అనంతలక్ష్మి కోలుకోడం జయలక్ష్మికి ధైర్యం కలిగింది. జయలక్ష్మి భగవంతుని పూజ ఎక్కువ చేసింది. భర్త ఛాయాచిత్రాన్ని ఎడతెగక ప్రార్థనచేస్తూ రహస్యంగా కళ్ళ నీళ్ళు కళ్ళ కుక్కుకునేది.

శోభనమందిరం అలంకారాలతో అలాగే ఉంచండని, ఆ మందిరానికి తాళం వేసింది. కోనంగి తిరిగి రాగానే తాను వ్యాజ్యం నెగ్గినందుకు సత్యనారాయణవ్రతం అఖండ వైభవంగా చేయాలని నిశ్చయించుకుంది. కోనంగి మీద శెట్టియారు చెప్పిన నేరాలన్నీ ఏనాడో వట్టి అబద్ధాలని అయ్యంగారు బందరు ఉత్తరాలు వ్రాసి సమాచారం తెప్పించాడు.

అలాంటి ఉత్తమ బాలకుడు తనకు అల్లుడు కావడం తన అదృష్టమని జయలక్ష్మి కోనంగి అనంతలక్ష్ముల వివాహం నిర్ణయించే ముందే నిశ్చయానికి వచ్చింది.

శెట్టియారు వ్యాజ్యం ఓడిపోయినా ఊరుకోక అప్పీలు చేస్తాడని కబురు వచ్చింది. చెయ్యనీ! ఖర్చులు దాఖలుచేసి మరీ అప్పీలు చెయ్యాలి. లంచాలిచ్చి ఎంత సాక్ష్యం తెచ్చినా, న్యాయమయిన సాక్ష్యం ముందు అవి పొగలా మాయమయిపోయాయి. ఇంత త్వరలో వ్యాజ్యం తేలిపోతుందని యెవరూ అనుకోలేదు. పాలుపంపులు జరిగాయా లేదా అన్న ప్రశ్నపయినా, జయలక్ష్మి భర్త రంగయ్యంగారి విల్లు చెల్లుతుందా లేదా అన్న ప్రశ్న పయినా విచారణ జరిగింది. ఇంత త్వరలో విచారణ జరగడానికి ఎన్నో కారణాలు వచ్చాయి.

రంగయ్యంగారి అన్న కొమారుడు ఆచార్య అయ్యంగారు అనంతలక్ష్మికి హృదయ బాధ తీర్చడానికి పుట్టించినగాథే నిజమయిందని ఒక రోజున సీతాదేవి వచ్చి విజయలక్ష్మితో చెప్పింది. సీతాదేవి కోనంగిని పెళ్ళిచేసుకోనని చెప్పి పంపినా, కోనంగి అంటే ఆమెకు ఆపేక్ష కలిగింది. కోనంగి తనవాడనీ, తాను కాదన్న కోనంగి మంచి అందమయిన భార్యను సంపాదించుకునేటట్లు చూడడం బాధ్యత తనదనీ ఆమె నిశ్చయించుకొంది. కోనంగి సినీమా పదిసార్లు చూచిన వాళ్ళల్లో ఆమె ఒకర్తె. క్వీన్ మేరీ కళాశాలలో బాలికల సంభాషణ విషయాలలో కోనంగి ముఖ్య విషయమయి పోయాడు. ఆ సందర్భంలోనే కోనంగి అనంతలక్ష్మికి ఉపాధ్యాయుడయ్యాడన్న సమాచారం వింది.

సీతాదేవి ఆనాటి నుంచీ అనంతలక్ష్మితో స్నేహం వృద్ధి చేసుకుంది. కోనంగితో గంటలకొలది తన మామూలుధోరణి సంభాషణ ప్రారంభించింది. ఈరోజు రాగానే ఆమె అనంతలక్ష్మి దగ్గరకు వెళ్ళింది.

**సీతాదేవి:** అనంతలక్ష్మి! నిన్న మీనాక్షి మా ఇంటికివచ్చి ఎందుకు కోనంగిరావుగార్ని అరెస్టు చేశారో, మా తండ్రిగారిని కనుక్కోమని కోరమని చెప్పింది.
**జయలక్ష్మి:** ఎందుకు అరెస్టు చేసిందీ కనుక్కున్నారా?

**సీతా:** మా నాన్నగారు ప్రభుత్వ ఉపకార్యదర్శికాదండీ!
**జయ:** ఔనమ్మా ఔను. మాకు తెలుసునుగా!
**సీతా:** నేను మా తండ్రిగారిని హడలిగొట్టాను కనుక్కోమని.
**జయ:** కనుక్కున్నారా?
**సీతా:** పోలీసు డిపార్టుమెంటు ఉపకార్యదర్శి మా నాన్నగారికి మంచి స్నేహితుడండోయి!
**జయ:** కాదు మరీ? ఒకే పాయలోవాళ్ళు యెంతో స్నేహంగా ఉంటారు. కనుక్కున్నారా?
**సీతా:** అలాంటి రహస్యాలు యెల్లా చెప్పేదీ. ఎంత స్నేహమున్నా అవి రహస్యాలన్నాట్ట!
**జయ:** (నిట్టూర్పు) అంతేనా -
**అనంతలక్ష్మి:** (నిట్టూర్పు) ఎందువల్ల అరెస్టు అయితేనేమి. ఇప్పుడు మనం ఏమిచేయగలం?
**జయ:** మనం ఏమిచేయగలం నిజంగా!
**సీతా:** ఉండండి, అంతటితో మా నాన్న ఊరుకోలేదు.
**జయ:** మీ నాన్నగారు ఏ పని తలుచుకుంటే ఆ పని చేసి తీరగల సామర్థ్యం గలవారు.
**సీతా:** ఆ శాఖలో పెద్ద గుమాస్తా మా నాన్నగారి సహాయంవల్లనే పైకి వచ్చారు.
**జయ:** గుమాస్తాలు తలుచుకుంటే ముఖ్యకార్యదర్శులే ఏమీ చేయలేరు.
**అనంతం:** రాజకీయాల సంబంధం తెచ్చుకున్నవారికి ఎప్పుడో జయిలు తప్పదు. డాక్టరు రెడ్డిగారు యిదివరకే జయిలుకు వెళ్ళివచ్చారు.
**జయ:** ఇంతకూ ఏమైనట్లు తల్లీ?
**సీతా:** పోలీసుశాఖ గుమాస్తాగారు ఉన్న రహస్యమంతా మా నాన్నగారికి చెప్పారు.
**జయ:** ఏమని?
**సీతా:** మా నాన్నగారు నాతో వచ్చి చెప్పారు.
**అనంత:** మీ నాన్నగారు ఏమి చెప్పినారు సీతా?
**సీతా:** ఎవరో నాటుకోటిశెట్టి పోలీసు కమీషనరుకు సంపూర్ణమైన సాక్ష్యంతో కోనంగిరావూ, డాక్టరు రెడ్డీ కలసి ప్రభుత్వంమీద కుట్ర చేస్తున్నారని ఋజువు చేశారట. ఆ పైన కోనంగిరావును అరెస్టు చేశారట.
**జయ:** అనుకున్నంతా అయింది మా అబ్బాయి చెప్పినమాట నిజం! శెట్టే ఈ పని చేశాడు. వాడు కాకపోతే కోనంగిరావుగారు ఒక్క రాజకీయ సభలోనన్నా ఉపన్యాసం ఈయలేదే. యెలా అరెస్టు చేస్తారు?
**అనంత:** శెట్టియారు ఎంత దుర్మార్గుడు! ఇప్పుడు చూశావా అమ్మా? నేను ఆ రోజులలో గోలబెట్టితే విన్నావూ? ఆ రాక్షసుడు దేవత అనుకుంటూ, అపర హరిశ్చంద్రు డనుకున్నావు. ఒక కోటీశ్వరుడు అల్లుడౌతాడంటే ఉప్పొంగావు!
**సీత:** కోటీశ్వరుళ్ళు అల్లుళ్ళయితే అన్నీ యిబ్బందులే. కోనంగిరావుగారు వెళ్ళిపోయిన తర్వాత, నన్ను పెళ్ళిచేసుకుంటానని ఒక ఐ.పి.యస్. పరీక్షకు పోయే యువకుడు వచ్చాడు. కాని ఐ.పి.యస్. లంటే నాకు మంట.
**అనంతం:** కోనంగిరావుగార్ని నువ్వన్నా పెళ్ళి చేసుకుంటే బాగుండి పోవును సీతా! ఆయన జయిలుకు వెళ్ళకపోవును. నా దురదృష్ట జాతకం ఆయనకు తగిలింది!
**సీత:** అవేమి మాటలు అనంతలక్ష్మీ? నువ్వు ధైర్యంగా ఉండు. నేను అతన్ని ప్రేమించలేదు. నన్ను అతడు అంతకన్నా ప్రేమించలేదు. ఆ సంగతి మొదటే తెలుసుకున్నాను.

జయలక్ష్మి శెట్టిమీద మండిపోతోంది. వీడు తన కుటుంబానికి రావణాసురుడయ్యాడు. ఎక్కడ నుండి దాపురించాడు? ఇంతకూ అమ్మిణి అన్నట్లు వాడు తన ఇంటిలో అడుగుపెట్టడానికి కారకురాలు తానే! అప్పుడే వాణ్ణి రానీయ వద్దంది. వాడిని చూస్తే తనకు భయమంది వెర్రితల్లి. అన్నీ తాను సాలెగూడు దులిపినట్లు దులిపి పారేసింది. ఈనాడు తాను అనుభవిస్తోంది, తన కూతుర్ని అనుభవింపచేస్తోంది. ప్రాపంచికంగా లాభం ఆశించేవారికి, ఆ రకంగానే చెంపదెబ్బలు పెళ్ళున తగులుతాయి.

కోనంగిరావుగారు ఎన్ని సంవత్సరాలకు బయటపడతాడో! అందాకా అనంతలక్ష్మి కృంగిపోతూ ఉంటుంది. కోనంగిరావు పరీక్షలకు తయారుజేస్తే మొదటితరగతిలో ప్యాసయింది.

శోభనమహోత్సవ ప్రథమ దివసంనాడే అతడు వెళ్ళిపోవలసి వచ్చినది. భోజనంచేస్తూ మొదటిముద్ద తిన్నవానిని ఆ తక్షణం లేచి పొమ్మనట్లు, యువతీ యువకులలో ప్రథమ ప్రేమదినాలకన్న మహదానందం సమకూర్చే వస్తువు లింకేమి ఉన్నాయి?

జయలక్ష్మికి రంగయ్యంగారు తన్ను ప్రేమించిన దినాలు జ్ఞాపకం వచ్చాయి. భవభూతి ఉత్తరరామాయణంలో "రాత్రిరేవ వ్యరంసీత్" శ్లోకం చెప్పినట్లు చెంప చెంపకు చేర్చి ఒక్కక్షణమైనా విడిపోని కౌగిలిలో, అర్థంలేని పిచ్చిమాటలు చెప్పుకుంటూ కునుకయినా ఎరుగని ఏదో మధుర మత్తతలో గడిచిపోయేవి ఆ దినాలు.

విడిపోవడం మరీ గాఢంగా కలుసుకొనడానికే! స్త్రీ పురుషుల జీవితంలో ప్రేమావస్థ ఎక్కడో ఆకాశంలో ఉండే ఉత్తుంగశిఖరం.

ప్రేమికులు ప్రయాణాలు చేయడం ఆనందం. తానూ రంగయ్యంగారూ, రెండు సీట్లు ఉండే మొదటితరగతిలో ప్రయాణంచేస్తూ ఉత్తమక్షేత్రాలన్నీ యాత్రలు సలిపినారు.

ప్రేమికులు ఒక్కొక్కచోట ఒక్కొక్క రకమయిన ప్రేమానుభవం పొందుతారు. ప్రేమ ఒక మహాపుష్పమయితే ఒక్కొక్క ప్రేమానుభవం ఆ పుష్పంలోని ఒక్కొక్క పుటవంటిది.

అంత ఆచారపరుడయ్యూ తన భర్త తన వంట తినేవాడు. వైష్ణవ దేవుడు కృష్ణుడు గొల్లవాడట. రాముడు శబరి ఎంగిలి తిన్నాడట.

తామిద్దరూ బృందావనం దగ్గర యమునాతీరంలో ఒక అడవిలో మకాం పెట్టినప్పుడు తాను వంట చేసింది. తాను వంట చేస్తుంటే, త్యాగరాజ కృతులు పాడుతూ నాట్యం చేశాడు. భర్త నాట్యంచేసి వచ్చి వంటచేసే తన్ను గాఢంగా కౌగలించుకొని పెదవులు ముద్దుకొంటూ "జయా, నువ్వు నా కర్పించేవన్నీ దివ్యామృతపు విందులేనే" అన్నారు. ప్రేమ! ఓహో ప్రేమ!

## 7

అనంతలక్ష్మి పెళ్ళి సందర్భంలో మదరాసు పతిత జనోద్ధరణాశ్రమానికి అనంతలక్ష్మి వెయ్యి నూటపదహారు రూపాయలు చదివించింది. తన గురువూ, తన భర్తా అయిన కోనంగిరావు "నాబోటి కులహీనులను, చరిత్ర హీనులను, సంరక్షించటానికి ఏర్పాటయిన యీ సంఘానికి నువ్వు వెయ్యి నూట పదహార్లివ్వటం యెంతో భగవత్ప్రీతికరం, అనంతా!" అన్న మాటలు అనంతలక్ష్మికి జ్ఞాపకం వచ్చి కళ్ళనీళ్ళు తిరిగినవి. తన భర్త ఎక్కడ పడితే అక్కడ తిరుగుతున్నట్టే ఆమెకు తోచింది. ప్రేమకు అంతరాయం కలిగినప్పుడే దాని గంభీరశక్తి వ్యక్తుల జీవితాల చుట్టూను, జీవితాలలోనూ స్పందిస్తుంది.

అనంతలక్ష్మి ప్రతిక్షణము తన చుట్టూ పొదివికొని వున్నట్లే తోచింది. "గురువునై నిన్ను ప్రేమించి నీ ప్రేమను చూరగొన్న నేను బిలహణుణ్ణి. నువ్వు యామినీపూర్ణతిలకవు" అని అనిన ఆయన మాటలు ఆమెకు నిమిష నిమిషము సాక్షాత్కారమయ్యాయి!

ఆయన పతితుడా! తాను పతితురాలా? వివాహం ఉత్తమ సంస్థ. ఆత్మసాక్షాత్కార దివ్యమందిరానికి సోపానమార్గం వివాహం. అలాంటి వివాహ సంస్కార విహీనపంకిలంలో ఉద్భవించిన నత్తగుల్ల తానని తన గురువుగారన్నారు. వారే తన ప్రేయసి మాత్రం పతితురాలు కాదని వాదించారు. మధురవాణి పతితురాలెట్లా? అని వారి ప్రశ్న. మధురవాణి వంశంలో ఉద్భవించిన తాను మాత్రం ఉత్తమ జన్మ అన్నారు తన గురువుగారు.

తాను, తన భర్తా వివాహంనాడు వధూవరులై తీయించుకొన్న ఛాయా చిత్రాలన్నీ చూస్తూ అనంతలక్ష్మి తన చదువుల గదిలో కూర్చుండి ఆలోచించుకొంటున్నది.

ప్రేమను గురించి తాను ఎన్నో గ్రంథాలు చదివింది. ఇంగ్లీషు కావ్యాలు పఠించి వ్యాసాలు చదివింది. అన్నీ చదివి ఈలా ఉంటుంది ప్రేమ అని ఊహించుకొంది. కాని తన ఊహలకు మించిపోయే ఏదో ఒక దివ్యస్థితిని ఊహించి తన గురువుగారు తమ యిద్దరి వివాహానికి పూర్వం వర్ణించేవారు.

ఒకరోజు తనూ, తన గురువూ ఇద్దరూ కలసి మహాబలిపురం వెళ్ళి సముద్రంలో కలసిపోయే, ఆ విచిత్ర పరమాద్భుత శిల్పపు కట్టడాలలో సముద్రం పరికిస్తూ కూర్చున్నారు. ఆ సమయంలో ఎంతకాలమో వారిద్దరూ ఆ పరమసౌందర్యానుభూతిలో లయమై మాట లేకుండా ఉండిపోయారు.

కొంటెవారయ్యూ, తన గురువు సౌందర్యోపాసి. తాను వీణ వాయిస్తూ తన గొంతుక ఆ వీణకు శ్రుతి కలిపి, "రామాభిరామా" మొదలయిన కృతులు పాడుతూ ఉంటే, వారు ఉప్పొంగిపోతూ వింటూ, ఆనందాంబువులలో కరిగిపోయేవారు.

ఆనంద మధురమయిన ఇంతే వలపూ టొంపూ లేని నీ గొంతుక సౌందర్య వస్తువులలో కాంచనగంగ, నువ్వు ధవళగిరివి, నీ ప్రేమ గౌరీ శంకర శిఖరము, నిన్ను నా ఆత్మకు పొదివికొన్న నా అదృష్టము నందదేవి" అని వా రా నాడు అన్నారు. "లక్ష్మీ! సౌందర్యవస్తువుల నారాధించడం మనుష్యునిలోని సంస్కారోత్తుంగ కల్లోలకిరీటం. నువ్వు నాకు సన్నిహితం కావడంవల్ల సౌందర్యోపాసన నాకు సులభ లభ్యమయిపోయింది ప్రాణకాంతా!" అన్నారు ఇంకో రోజున.

సౌందర్య వస్తుదర్శనమే వారి హృదయాన్ని సర్వలోకం ఆక్రమింప జేస్తుందట. "ఆ ఆరాధనలో లోకం అంతా ఒక విశ్వసౌందర్యాంతర్భాగమై దర్శనమిస్తుంది. అనంతం! లోకంలో బాధలు, లోకంలో ఉత్తమ పథాలకు పోవాలన్న కాంక్ష, బీదవారి ధనవాంఛ, కూలివారు కోటీశ్వరులతో సమానం అయ్యేందుకు చేసే మహాయజ్ఞం, కాటకాలలోని నాశనం అన్నీ అందులో భాగమై కనబడతాయి. గులాబిపూవు సౌందర్యాన్ని నిజంగా అర్థం చేసుకున్న వారికి పల్లేరుముల్లు అందం తెలుస్తుంది. భైరవిరాగంలో లీనమయిపోగల హృదయం గలవానికే లోకంలో ధనదులచే, జమీందారీ రాక్షసులచే పిప్పి చేయబడే బీదవాళ్ళ ఆక్రందనములోని పరమార్థం అర్థం ఆవుతుంది. నిర్మల నీలాకాశ మనోజ్ఞతను హృదయమార క్రోలగలవాడే, చావునాచురంగు, కుళ్ళు నల్లరంగు, బాధ బూడిదరంగు పూర్తిగా అర్థం చేసుకుంటాడు. అనంతలక్ష్మి! మహాత్మాగాంధీ వంటి సౌందర్యోపాసి ఇంకోరు లేరుసుమా! ఆయన రాట్నధ్వని బీదతనం లోకంలో ఉండకూడదు అన్న మహానినాదరాగం

సుమా!" అని మహాబలిపురంలో సముద్రతీరాన తన్ను వారి హృదయానికి అదుముకొని అన్నారు.

**తాను:** ఈ రాళ్ళతో చెక్కిన చెక్కడాలు సౌందర్య వస్తువులెల్లా అవుతాయండీ?

**కోనంగి:** ఏవీ నీ పెదవులు. ఆ పెదవుల అందం స్వతస్సిద్ధంగా ఉంటుందా? యవ్వనం అనే శిల్పి ఆ పెదవులను ప్రపంచాద్భుత సౌందర్య వస్తువులుగా తయారు చేసినాడా?

**తాను:** యవ్వనం కలిగిన అందరి పెదవులూ అందమైనవా?

**కోనంగి:** ఆ యవ్వనానికి శ్రుతైన యవ్వనం కలిగిన ఇంకొకనికి!

**తాను:** అందరికీ కావన్న మాటేగా?

**కోనంగి:** కొన్ని పెదవులు అందరికీ, కొన్ని కొందరికీ, కొన్ని ఒక్కడికే!

**తాను:** ఎవ్వరికీ అందంగాని యవ్వనపు పెదవులు వుండ వచ్చుగా?

**కోనంగి:** ఆ పెదవుల అందం తెలుసుకొనే యాత్రికుడు వచ్చే వరకూ!

**తాను:** వాడు రాకపోవచ్చుగా!

**కోనంగి:** రాకపోవచ్చుగాక, మలయాళదేశ సముద్రతీరంలో ఒక ముత్యపుచిప్ప పగిలి, ఆ ఇసుకలో అద్భుతమైన ఒక ముత్యం పడివుందనుకో; దాన్ని అనుభవించేవారు అక్కడకు వెళ్ళకపోయినంత మాత్రాన ఆ అందం లేదనట్టవుతుందా?

ఆ సముద్రం ఒడ్డున సముద్రపు పచ్చలతో, ఆకాశనీలాలతో, ఆ నల్లని రాళ్ళశిల్పాలు ఏదో దివ్యశ్రుతి పొందుతున్నాయి. ఆ శ్రుతికి పరమస్థాయి తానూ, తన గురువుగారి ప్రేమా అట.

ప్రేమను గురించి వారిద్దరికీ సంభాషణ జరిగింది.

**కోనంగి:** నా ఆత్మేశ్వరీ, ప్రేమ ఒక మహారాగంలోని ప్రాణస్వరం వంటిది.

**తను:** రాగం ఏమిటీ?

**కోనంగి:** నువ్వు!

**తాను:** మీరు?

**కోనంగి:** నేను శ్రుతిని.

అప్పుడు ఆయన పాడిన పాట ఎప్పటికీ తాను మరచిపోలేదు.

*ఈ నీలి కెరటాల ఎదుట నువ్వూ నేను,*
*నీలోన నీలమే నాలోన కెరటమే!*
*ఈ అనంతపథాల ఎదుట నువ్వూ నేను*
*నీ వనంతానివే నేను పథికుడ రాణీ*
*ఈ శిల్పసౌందర్యదీప్తి నువ్వూ నేను*
*శిల్పమూర్తివి నువ్వు శిల్పి నేనో దేవి!*

ఆ పాట పాడుకుంటూ అనంతలక్ష్మి తన మనోహర విశాలనేత్రాలు అరమూతలుగా "గురువుగారూ, నన్ను వదలి మీరు ఒక్కరూ జైలుకు వెళ్ళారా! ఎంత నిర్దయ మీది? అందులో మన ప్రథమ గాఢ సంశ్లేష సమయాన ఆ సంధ్యా కాంతుల్లో ఎక్కడికో వెళ్ళిపోయారా? మీది కఠిన హృదయం కాదూ! ఆ రాత్రే కాదూ నా కళ్ళలోకి తేరిపారచూస్తూ "అనంతలక్ష్మీ! నిన్ను ఒక్కక్షణమైనా వదలి ఉండ" నన్నారు. ఆ మాట అంతలోనే అసత్యం చేశారా?" అని అనుకుంటూ కన్నుల నీరు నిండ తల హృదయం మీదకు వాల్చుకుంది.

## 8

రెడ్డిగారికి కారాగారం అలవాటే, అందులో 'ఏ' తరగతి బంధితుడు. క్యాంపు మంచం, పరుపు, కుర్చీలు, అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. కోనంగీ డాక్టరూ రాత్రిళ్ళు తప్ప పగలల్లా కలిసే ఉండేవారు. అనేక విషయాలనుగూర్చి చర్చలు సాగుతూ ఉండేవి.

ముఖ్యమైన సమస్య సామ్యవాదం. ప్రపంచోద్ధరణ సామ్యవిధానం వల్లనే జరుగుతుందని రెడ్డి అంటాడు. కోనంగి తన వాదనతో సామ్యవిధానం ఒప్పుకుంటాడు. కాని, అందుకు మార్గం గాంధీ విధానం అంటారు.

**కోనంగి:** రష్యా రాజకీయ విధానం ప్రపంచానికి ఆదర్శప్రాయంగా ఉంది ప్రస్తుతం. కాని స్టాలిన్ ఎందుకు రక్షకభటులతో కాపలా కాయించు కుంటూ వెడతాడు?

**డాక్టరు:** ప్రాణరక్షణ ముఖ్యావసరం, ఎంత ప్రజారాజ్యం స్థాపించినా, యితర రాజ్యాల వారికి రష్యా జయమువల్ల ఉడుకుబోతుతనమూ, కోపమూ ఉద్భవించాయి. రష్యా రాజ్యవిధానం మంటగలిపి, రష్యాను నాశనం చేయాలని వారెప్పుడూ ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. అందులో స్టాలిను చావు మొదటి కోరిక వారికి.

**కోనంగి:** రష్యా దేశంలోని వాళ్ళెవరూ స్టాలిన్‌కు విరోధులు లేరంటావా?

**డాక్టరు:** లేరనను. ప్రతి దేశంలోనూ, ఉత్తమాశయాలను నాశనం చెయ్యాలి అన్న దుర్మార్గులు ఉండనే ఉంటారు.

**కోనంగి:** మన దేశంలో గాంధీజీకీ వ్యతిరేకులు, గాంధీజీ పేరు చెప్పితే, కాంగ్రెసు పేరు చెప్పితే మండిపోయేవారు లేరా?

**డాక్టరు:** ఉన్నారు.

**కోనంగి:** అయితే బాపూజీ యెందుకు రక్షకభటుల్ని పెట్టుకోదు? కాంగ్రెసు మంత్రి వర్గాలున్నంత కాలం మంత్రులెవ్వరూ రక్షకభటుల్ని పెట్టుకోలేదేమీ? కాంగ్రెసు నాయకులకు రక్షకభటులు లేరేమి?

**డాక్టరు:** అది ఒక గొప్పా? నిజమైన స్వాతంత్ర్యం మన దేశానికి వస్తే, అప్పుడు మంత్రులూ గింత్రులూ రక్షకభటుల్ని పెట్టుకోవాలి. ఇవాళ ఇంగ్లీషువారు నిన్ను రక్షిస్తున్నారు గనుక నీ ఆటలు సాగుతున్నాయి.

**కోనంగి:** అన్నావు నాయనా అంతమాటాను. పాపం ఇంగ్లండులో వాళ్ళ రాజ్యమే కాదుటండీ, అక్కడ కూడ స్కాట్లండుయార్డు, రక్షకభటులు మంత్రులనూ, ముఖ్యమంత్రినీ ఎందుకు కాపలాలు కాస్తుంటారు.

**డాక్టరు:** ఇంతకూ నీ వాదన ఏమిటి నాయనా?

**కోనంగి:** నా వాదన ఏమిటో తమకు అర్థంకాలేదు కాబోలు?

అంత మట్టితలకాయా నీది? మట్టి అయినా పంట పండుతుంది; బూడిదా?

**డాక్టరు:** బూడిదలో అనేక రసాయనాలున్నాయి. అన్నీ ఉపయోగించవచ్చును.

**కోనంగి:** ఏమీలేని ఖాళీ బుఱ్ఱా?

**డాక్టరు:** గాలి ఉంటే గాలి ఉపయోగం. గాలి లేకపోతే 'ఎక్సురే'కు ఉపయోగం.

**కోనంగి:** సరే ఎందుకో అందుకు ఉపయోగించు తమ్ముడూ! నా మాటలు అర్థం చేసుకోడానికి మాత్రం ఉపయోగించకు.

**డాక్టరు:** ఓ యమ్మో! అతితెలివైన అర్థంగల 'యారు' నువ్వు? నువ్వు చెప్పేది నాయకుల ప్రాణం రక్షించవలసిన అగత్యంగల దేశంలోని రాజ్యవిధానం లోపభూయిష్ట మయినది అని. నువ్వు సామ్యవాదాన్ని, గాంధీ వాదాన్నీ ఎల్లా సమన్వయం చేస్తావు?

**కోనంగి:** ఓయి ఎక్సురే బుఱ్ఱగల వైద్యశిరోమణీగారూ, కొంచెం శ్రద్ధగా విను.

**డాక్టరు:** ఓయి వంకర బుఱ్ఱ కొక్కిరాయిగారూ, రెండు కళ్ళూమూసుకొని మాట్లాడు.

**కోనంగి:** గాంధీజీవాదనలో ఏమీ లోటు లేదు –

**డాక్టరు:** సామ్యవాదనలో ఏమీ లోటులేదు –

**కోనంగి:** ఈ రెండు కలిపితే అసలే లోటు ఉండదు –

**డాక్టరు:** ఆ రెండూ ఇంకంపాటబిల్సు – ఎప్పుడూ ఏ విధంగా కలవనివి. పైగా ఏదో కొత్తరకం విషయం అయి లోకాన్ని దహించి వేస్తాయి.

**కోనంగి:** నువ్వు ఆ రెంటినీ కలిపి, పరిశోధన చేసి చెబుతున్నావా, లేక డబ్బా వాయిస్తున్నావా?

**డాక్టరు:** నువ్వు డ్రమ్ము వాయిస్తున్నావు కాబోలు.

**కోనంగి:** డ్రమ్ము వాద్యవిశేషం. డబ్బా గొంతెమ్మ పండగవాళ్ళ గడబిడ విశేషమూనూ!

ఈలా వాళ్ళిద్దరూ ఆనందంతో గడిపేవారు. కాని కోనంగి హృదయాంతరాళాలలో ఆనందం ఏదీ? రెండు మూడుసారులు ఒంటిగా రాత్రిళ్ళు, తన కొట్టులో కటకటాల వెనకాల పడుకొని ఉన్నప్పుడు, కళ్ళ నీళ్ళలో కరిగిపోయాడు. ప్రేమావేదన అనుభవించిన వాళ్ళకే అర్థం అవుతుంది ఆ అవస్థ!

ఒక్కనిమిషం కూడా అనంతలక్ష్మి ఎదుట నుంచి మాయంకాదు. ఆ ప్రథమ సంధాన దివ్యముహూర్తపు మహామధురత ఎవ్వరూహించుకోగలరు?

అదివరకు ఆతడూ అనంతమూ కలిసి తిరిగేవారు. ఇద్దరు మాత్రమే కలిసి తిరిగారు. ఒకరి నొకర గాఢంగా కౌగలించుకొన్నారు. ముద్దులు కొనినారు. ఒకరిలో ఒకరు ఒదిగిపోయినారు.

ఆ యా ఆనందాలు, ఆ ప్రథమ దివసపు ఉత్కృష్టానందం ముందు హిమాలయము ముందు నీలగిరి కొండలులా, గంగానది ముందు దండకారణ్యపు సెలయేళ్ళలా, గులాబి ముందు మల్లెపువ్వులులా కన్పిస్తాయని కోనంగి అనుకున్నాడు.

తలుపు వేయడంతోటే, అనంతలక్ష్మి సిగ్గుతో మంచంమీదనుంచి లేచి నుంచుంది? ఆ సిగ్గు కూడా ఎంత మధురమయి ప్రత్యక్షమైంది.

ఎవ్వరికీ వినపడకుండా తాము తమలో పాడుకున్న పాటలు, ఆమె పాడిన మువ్వగోపాల పదాలు, తా నా పవిత్ర యామినీ సంధానానికై రచించిన పాటలు పాడుకొన్నారు.

విద్యుత్ దీపాలు ఆర్పి, ఆ మేడపై కిటికీ దగ్గర వెన్నెల తమ మీద పడేటట్లు ఇద్దరూ ఒకటిగా జన్మించినట్లయిపోయిన కౌగలింతలో నిలుచున్నారు.

సౌందర్యాతి సౌందర్యమూర్తి అయిన ప్రియురాలి నగ్నసౌందర్య దర్శనము అతిపవిత్రము, ఆనంద పరమావధి.

"అనంతలక్ష్మీ! ప్రేమరాగాలాపన ప్రథమ స్వరంలోనే అపస్వరం సమకూర్చానా హృదయవీణకు?

ప్రాణేశ్వరీ! నువ్వు ధైర్యం వీడని స్థిరవై ఉన్నావా? కరిగిపోయిన కాసారజలంలా ఉన్నావా?

ఆత్మనాయకీ! పక్షిలా ఒంటినై జీవిత విశాలాకాశంలో ఎగిరే నన్ను నీ అందాలతో, అమృతగానాలతో బంధించి నీ ప్రక్కనే చేర్చుకుంటే ఏ పాడుబోదకాలు నన్నీవలలో పట్టి మనల నిద్దరినీ విడదీశాడు?

దగ్గరకు రాలేనంత దగ్గరకు వచ్చిన నిన్ను నేను విడినట్లా ఇంకనూ దగ్గరయినట్లా నా జీవిత పరమావధీ?

*"ఈ కటకటాల బొచ్చెదు ఇందుమూర్తి*
*నీకు నా హృదయార్తిని నిద్రలేమి*
*తెలివిహీనుడై నిను జేరి తెల్పునంచు*
*ఇనుమడించిన భయముతో వనటబడుదు"*

*ఇలా పద్యాలు వ్రాసుకుంటే ఈ గుండెలోని వర్ణనాతీతమైన బాధ తగ్గుతుందా?*

*"ఎవరయ్యా పూజంటను*
*ఇటు తెంపిరి అటు తెంపిరి?*
*ఎవరయ్యా చంద్రుని చంద్రిక*
*విడదీసిరి విసిరివేసిరి?*
*ఎవరయ్యా వీణను తీగలు*
*విదలించిరి విరిచేసిరి?"*

## నవమ పథం

# ఉత్తరాలు

**ఆ** సంవత్సరము బి.ఏ. జూనియర్ పరీక్షలో అనంతలక్ష్మి కృతార్థత నందింది. కోనంగి వ్రాసిన ఉత్తరాలు ఆనందంగా చదువుకొంటోంది. ఆ ఉత్తరాలన్నీ పెట్టుకొనేందుకు నాలుగువందల రూపాయలుపెట్టి బంగారం పొదిగిన వెండిపెట్టె కొంది.

కోనంగి జయిలు అధికారుల ద్వారా పంపించే ఉత్తరాలు కాకుండా, రహస్య మార్గాలకూడా ఉత్తరాలు పంపించసాగాడు. అనంతలక్ష్మి భర్తకు రోజురోజుకు ఉత్తరం వ్రాసి, వారం అయ్యేసరికి, అవన్నీ ఒక ఉత్తరంలాగే కలిపి పంపించేది. డాక్టరు రెడ్డి ఇంటికి కొన్ని ఉత్తరాలు పంపితే అవన్నీ ఎలాగో కొన్ని రహస్య మార్గాల ద్వారా జయిలులో కోనంగికి అందేవి.

ఉత్తరం రాగానే కోనంగి, కళ్ళకద్దుకొని, చింపి ఉప్పొంగిపోతూ చదువుకొనేవాడు. విడిపోయిన ఆ యిద్దరూ ఇతరులు చూస్తారన్న సిగ్గును వదలి రిజిష్టరు చేసిన ఉత్తరాలులా వ్రాసుకొనేవారు. ఒకరికొకరు వ్రాసుకొన్న ఆ ఉత్తరాలలో ఒక్కొక్కప్పుడు వారి ప్రణయజీవిత నిగూఢ రహస్య భావాలు తాండవం చేస్తూండేవి. అడ్డగట్టు వేస్తే, వరదలు వచ్చిన నది కట్టపొర్లి లోకం అంతా ముంచెత్తుతూ, పరవళ్ళెత్తి ప్రవహించిపోయినట్లు వారి ప్రేమ దశదిశలూ నిండుతూ పొంగిపోయింది.

గాంధర్వనికేతనం,
మైలాపురం,
12-4-41.

ప్రాణకాంతా!

జయిలులో ఉన్నా మీరు ఉత్తరం వ్రాయగలుగుతున్నారు అన్న సంతోషం ఒక ప్రక్కా, నీలాకాశంలో పిడుగు పడినట్టు మీకూ నాకూ ఆ పవిత్ర ముహూర్తంలోనే ఎడబాటు కలిగిందన్న భరింపరాని బాధలు ఒక ప్రక్కా నన్ను ఊపివేస్తున్నాయి.

మిమ్ము విడిచి యుగాలయినాయన్న నిస్పృహ వేధిస్తున్నది. ఏనాడో మిమ్ము తిరిగి చూడడం!

ఏం చేస్తున్నారు? అంత నిర్దయగా వెళ్ళిపోయారు. ఏం చేద్దామని?

నేను చదవలేను, పుస్తకం ముట్టలేను. ఈ ఏటి పరీక్ష ఏమవుతుందో?

ఇంట్లో కూచోలేను. ఇంటిబయటకూ వెళ్ళలేను. ఎడారి ఎల్లా ఉంటుందో నేనెప్పుడూ చూడలేదు. కాని ఎడారినిగూర్చి చదివినవన్నీ నిజమే అయితే, నా మనస్సు ఏమీ ఓయాసిస్సులేని 125 డిగ్రీలు వేడిగల, పది సహారా ఎడారులు కలిసినట్లయి పోయింది.

నా హృదయప్రభూ! మీరు నా జీవితంలోకి రాకపోయివుంటే, నాజన్మ బూడిదలా రాలిపోయి వుండును. మీరు వచ్చారు. నా జన్మకోటి కాశ్మీర విశాలమయింది. అలాంటిది మీరల్లా నన్ను వదలి వెళ్ళిపోయారు. ఎంత నిర్దయో మీది?

వెనక శ్రీకృష్ణుడు రాధను వదలి మధురకు వెళ్ళినప్పుడు ఆమె పడినబాధ, నా బాధ ముందు సంతోషం వంటిది, ఆత్మానాథా!

మీ నిర్బంధానికి కారణం మన దుష్టగ్రహము చెట్టిగాడే! నన్ను వాంఛించి, విఫలుడై ఆ రాక్షసుడు అలా చేశాడు. వెనక సీతాదేవిని రావణుడు ఎత్తుకపోయినాడు. ఈ పిశాచి రాముణ్ణే ఎత్తుకుపోయాడు. నేనే బయలుదేరి కడలూరుకు వస్తున్నా. కటకటాలు ముక్కలుచేసి, గోడలు పిండిగొట్టి, మిమ్మల్ని తిరిగి తీసుకువస్తాను. నాకు లక్ష్మణులు వద్దు, హనుమంతులు వద్దు, వానరబలగం వద్దు.

నేను అందగత్తెనని మీరంటారు. అది నాకు ఏమీ నమ్మకం లేదు. మీకు శిల్పం విషయం ఏమీ తెలియదు. మీ అందం మీరెరుగని అమాయకులు ప్రాణేశ్వరా! మీ మోముతో పోల్చడానికి సృష్టిలో ఏ వస్తువూ దొరకదు నాకు. ఫాలం ఆకాశం అని ఏదో పోల్చుకుంటాను. ఆకాశంలో గంభీరత ఒకనాడు కనబడకపోవచ్చును, కాని మీ ఫాలం అనంతవిశ్వాలు దాటిన మహా భావపూరితమని చెప్పగలను. మీ కనుబొమల సౌందర్యము ఆకాశగంగకు లేదని మాత్రం చెప్పగలనండీ.

మీ కన్నులు నేను వర్ణించలేను. ఆ కన్నులు పెద్దవీకావు, చిన్నవీకావు. అవి తారకలూ కావు, సూర్యచంద్రులూ కావు. అవి కాలమూకావు, కాలాతీతాలూ కావు.

మీ ముక్కు మకరసంక్రమణ ఉదయారుణకిరణము, కోటికోటి కిరణాలు.

మీ పెదవులూ, వానిలోని నవ్వులూ, ఒక్కొక్క అవతారం ఉద్భవించినప్పుడు దేవతలు పొందే దివ్యానందం!

మీ మూర్తిని తయారుచేస్తూ మిగిలిన భావాలతో సృష్టికర్త. జయంతుణ్ణి, నలకూబరుణ్ణి తయారుచేసేవాడని అనుకుంటాను.

నా వర్ణన నాకే లోటుగా ఉంది. ఆ అస్పష్టకాంతిలో చూచాను మొదట మిమ్మల్ని. దానితోనే నా మతిపోయింది. నేనూ మా బాలికలతో పాటు ప్రేమ అనేది ఉండదు అనే అనుకొనేదాన్ని.

కాని ప్రేమ ఇంత అద్భుతము, వర్ణనాతీతము అని అనుకోలేదు. ఎంత విచిత్రమైనవారు మీరు! మొదటి రోజులలో మీరు కనబడినంతసేపూ గుండె పంజాబు మెయిలే! మీరు పొరపాటున నన్ను ముట్టుకుంటే ఏదో వివశత్వం కలిగేది. నా రహస్య హృదయంలో మీరు నా దేహాన్ని ఏక్షణమైనా కోరితే అది వెంటనే సమర్పించాలి అన్న గాఢాతి గాఢవాంఛ ఒక ప్రక్క, ఇంకో ప్రక్క మిమ్ము నేను ఎంత ప్రేమించినా, మీరు వివాహం అయిన వరకూ ఒక విధంగా పరపురుషులే అన్న భావమూ నన్ను గగ్గోలు చేశాయి.

మీరు నన్నన్నిసారులు కౌగలించుకొన్నారు. ఆ నిమిషాలలో మీరు కావాలంటే నా సర్వస్వము మీది! అయినా మీరు నన్నంత గాఢంగా అదుము కొని, నా పెదవులు మీ పెదవులు లయింపచేసుకొని, గాఢతా, లాలిత్యమూ రెండూ వ్యక్తం చేశారు నా ఆత్మేశా!

ఎన్ని జన్మముల నుండి తపస్సు చేశానో మిమ్ము నా సర్వస్వనాథునిగా వరం పొందడానికి? మీరే నాకు కోటి జన్మముల నుంచీ భర్తలై యుండాలి. లేకపోతే ఆ అస్పష్ట కాంతులతో దర్శనమిచ్చిన ప్రప్రథమ క్షణంలోనే మీరే, మీరే నానాథులని నాకు ఎందుకు తోచాలి?

మీలో లయమైపోవడానికి దేహమడ్డం అనిపిస్తుంది. ఆ దేహంలేక మీతో నా పూర్ణయౌవనానంతమత్తత అనుభవించడం ఏలాగు అని అనిపిస్తుంది.

మీరు నా కేశసౌభాగ్యం కోటి కాదంబినీమాల అన్నారు. కోటి కోటి శ్రీకృష్ణపరమాత్మ దేహకాంతులన్నారు. నన్ను తలంటుకోమని, ఎన్నిసారులు నా కచభారము మీ మోమునంతా కప్పుకోలేదు? మీరు వట్టి కొంటెవారు. లేకపోతే అన్నిసారులు నా కురులన్నీ చిక్కులు చేసి అల్లరిచేస్తారా, చెప్పండి? నేను మీ తల ముద్దెట్టుకొంటే, మీది వట్టి క్రాఫింగు తల అయినా మీ బుద్ధిలో ఉన్న పరిమళపు ఆలోచనలు ఆ తలలోంచి పయికి వస్తూ ఉంటాయి కాబోలు, దివ్యమయిన మీ తలను ఆఘ్రాణించి, ముద్దు పెట్టుకొంటోంటే మత్తు వచ్చినంత పని అయింది.

పూవులు పూవులన్నారు మీరు. స్త్రీలకూ పూవులకూ మీరన్నట్లు ఏదో అననుభూతమయిన సంబంధం ఉన్నది. మా తండ్రిగారి కుటుంబంలోనూ, మా తల్లిగారి కుటుంబంలోనూ కూడా కుసుమ రచనా లలితకళ ప్రపంచ శిఖరితమైనది గురుదేవా! మీరు కోరినప్పుడల్లా ఒక్కొక్క రచనరచించి నా జడను; నా జడముడిని అలంకరించు కొన్నాను. జడను వేయడమూ, జడముడులు రచించడమూ మా కుటుంబంలో ఉంది.

గులాబీలు, మల్లెలు, మల్లెలు, జాజులు, చేమంతులు, కదంబాలు, కనంకాబరాలు, గొబ్బిపూలు, కేతకీకుసుమాలు, పొగడలు, నీలిహృదయాలు, ఘంటికా పుష్పాలు, కరవీరాలు, మందారాలు, సువర్ణకరవీరాలు, మరువక దమనక, కురువేరులు, నూతనంగా వచ్చే ఆర్చిడ్లు, దాలియాలు, జినియాలు, నీబాపూలు, కాశీరత్నాలు, మదనభాణాలు అన్నీ నేనే అల్లాలి జడలలో. ముడులలో, అర్ధజడలలో, అర్ధశిఖలో నేనే పూవులు కూర్చాలి.

జీవితేశ్వరా! మీ కోసం నేను, నా అందం మీకోసం, నా చదువు మీకోసం, నా సంగీతం మీ కోసం!

ఓ రోజున మీకు జ్ఞాపకం ఉందీ? నేను ఫిడేలు వాయిస్తూ ఒక మువ్వగోపాల పదం పాడాను:

*"ఎంత చక్కనివాడే*
*నా సామీ-వీ*
*డెంత చక్కనివాడే!*
*ఇంతి మువ్వగోపాలుడు*
*సంతతము నా మదికి*
*సంతోషము చేసెనే... ఎంత?*
*మొలక నవ్వుల వాడే*
*ముద్దు మాటల వాడే... ఎంత?"*

అని పాడుతూ వుంటే కళ్ళనీళ్ళతో ఏదో దివ్యకాంతి మీ మోమున ప్రసరింప నా ఒడిలో తల పెట్టి కరగిపోయారు!

నా గురూ! రండి, నేను ఎన్నో పాటలు పాడుతానండీ.

మీ పాదపద్మాల
అనంత.

## ②

ఏ రోజు కారోజు ఉత్తరం భర్త కడ నుండి రావలసిందే. ఆ వేసవి కాలంలో ఆమెకు ఉత్తరాలే మల్లెపూలు, గులాబీలు, వట్టివేళ్ళ అత్తరులు, చల్లగాలులు, చల్లటి నీళ్ళు, సముద్రం వ్యాహాళులు.

కోనంగిమయ ప్రపంచం ఆమెకు. అతడుపయోగించిన ప్రతివస్తువూ పవిత్రమూ, పూజార్హమూ!

ఒక రోజున వచ్చిన పెద్ద ఉత్తరాన్ని మామూలుగా చదివే పదిసార్లూ కాకుండా పది హేనుసార్లు చదువుకుంది. మామూలుగాపెట్టే ముద్దుల కన్న కొన్ని వందలు ఎక్కువ పెట్టింది. ఆ ఉత్తరం తన బాడీజేబులో గుండెకు దగ్గరగా దాచుకుంది.

ఆ ఉత్తరం నరాల ద్వారా ఇంజెక్షను ఎవ్వరైె నా ఇవ్వగలరా? లేక తన హృదయం తెరచి లోపలపెట్టి తిరిగి కుట్టెయ్యగలరా?

కడలూరు జైలు,
14-4-41.

ఓ ఆనంద వికసిత విశాలనయనా!

నా అనంతా, నా లక్ష్మీ! నవనీతవచోపూరితకంఠీ, ఎన్నాళ్ళయింది నీ తీయతీయని పాట విని.

*అమృతపానంలోన*
*అర్ధభాగముపాలు*
*కామధేనువుపాలు*
*సోమరసములు కలిపి*

*అందిచ్చినారు నీ*
*అందాల మధుధార*
*పారిజాతపరాగ*
*పరిమళమ్ములు కలిపి*
*అందిచ్చినారు నీ*
*అందాల గొంతులో*

ఎన్నో గాంధర్వ ప్రదర్శనాలు చవిచూచాను దేవీ! నీ కంఠం వీడిన ఆ దివ్యగానం అనుపమానం. ఆ సంగీతస్వన ప్రారంభము నాకానాడు సృష్టి ప్రారంభమే.

అంతా చీకటి! చీకటి మధ్యలో చిన్న వెలుగుచుక్క. ఆ అణువు కాంతి పెరిగి, విశ్వమంతా ఆవరించి అనంతజ్యోత్స్నలై, ఉప్పొంగే ప్రవాహాలై కరుళ్ళుకట్టి, తోడుకుపోయి, కోటి కోటి మందారాలై, కోటికోటి పారిజాత ప్రసూనాలై, సుడులుపోయి దెసలు గాఢపరిమళాలు కప్పి, కరిగిపోయి అనంతతంత్రుల విశ్వవిపంచై స్పందించిన వ్రజసుందర హస్తాంచిత దివ్యమురళీనినాదమై, నా జీవితాన లీనమైపోయింది.

నీ దివ్యగాంధర్వానికి శ్రుతిగా, దూరాన, దగ్గర, అన్ని వైపులా నృత్యాంచిత నటేశ్వర పాదమంజీర స్వర్ణకింకిణీ నిస్వానము లోకసమ్మోహనమైపోయింది.

లోకంలో దరిద్రుల నిట్టూర్పులు, బానిసల వేదనాభరితార్తనాదాలు, అవధిపొంది వందేమాతర దివ్యగీతమై లామార్పలేపవిత్ర స్వనమై, విముక్త రష్యానందమూర్ఛనై సర్వబంధిత ప్రజాపాదనిగళిత శృంఖలాపతన మహోత్తమ రాగాలాపనయై ప్రత్యక్షమయింది.

నీ అందం చూచాను. ఆంధ్ర సౌందర్యరత్నాలు, దాక్షిణాత్య శిల్పభూషణాల పొదిగించిన శిరోభూషణానివి నువ్వు.

ఏమీ ఎరుగని బీదవాడికి కోహినూరు రత్నం దొరికినట్లు నాకు దొరికావు. ఎక్కడ దాచుకోను నిన్ను?

ఎల్లోరా కైలాసగుహ నా గదిలో ప్రత్యక్షం అయింది. అది నీదేనయ్యా అన్నారు ప్రజలు!

శారదాదేవి క్రొత్త వాద్యవిశేషాలు కావాలనుకొని, విశ్వకర్మకంపెనీలో ఆర్డరిచ్చి, ఆ వీణవైపు నేను కాంక్షాపూరిత నయనాలతో చూస్తూ ఉంటే, "నాయనా కోనంగీ! ఇది నీకు బహుమతి" అని ఇచ్చింది!

కృష్ణావతారం తర్వాత నందనవనం చేరిన పారిజాత భద్రతరువు వచ్చి నా పెరట్లో మకాం పెట్టింది.

గరుత్మంతుడు తీసుకుపోవయ్యా అంటే, ఆ సురేంద్రుడు పాముగాళ్ళను మోసం చేసి, ఎగతన్నుక పోతోంటే, ఆ ముసలాయన చేతిలోనించి జారి ఎగురుతూ ఎగురుతూ వచ్చి అమృతకలశం నా జన్మలో వాలింది. దేవతలకు ఈ రహస్యం ఏమీ తెలియదు.

అనంతలక్ష్మీ! నిన్ను పొంది నేను అంబుజాక్షుడను.

నేను జయిలు నుంచి వచ్చేసరికి ఏ పాలసముద్రమో చూడడానికిపోకు.

అనంతలక్ష్మి లక్ష్మికి కొమరిత. అవిడ ఏ పద్మాన్నో నివాసగృహం చేసుకుంటే, అక్కడకు ఏ కమలపరిమళంగానో నువ్వు చేరితే, నేనయ్యా అల్లుడనని ఆ పద్మగృహవాసానికి

సిద్ధం అయితే, ఏదో కప్ప వచ్చిందని నన్ను తరిమివేయరుకదా! మీ యింటి ప్రక్కనున్న కొక్కిరాయిగాళ్ళు.

సౌందర్యనిధీ! అంతమంది ప్రాచ్యులూ, అప్రాచ్యులూ, వారి వారి దేశాలలో వారి వారి భాషల్లో వర్ణించుకొన్న వారి సౌందర్యాంగనలు. ఏ విధంగా ఆలోచించినా వట్టి చింపిరి నాగమ్మలులా ఉంటారేమిటి? కాకీపిల్ల కాకికిముద్దు అన్న సామెతలా ఆడకాకి మగకాకికి హంసలా కనబడుతుంది.

పరీక్షలో ఎలాగో నెగ్గాననన్నావు. ఏమిటి మరి. గౌరవం దక్కడానికి నేను గురువునయ్యాను. కాని నీ గురువు నవడంవల్ల కొలత వేయలేని లాభం నాదే!

నేను నీ కోసం విరహతాపం పడటంలేదు అని వ్రాస్తే అబద్ధం! నిజం వ్రాస్తే నువ్వు బాధపడతావు. ఏమీ వ్రాయకుండా ఊరుకుంటే, 'మౌనం అర్ధాంగీకారం' అన్న ఇంగ్లీషు సామెత అమలులోనికి వస్తుంది.

నువ్వు వ్రాసిన ఉత్తరం ఎంతకూ తరగని అమృతసముద్రం నేను కుంభసంభవుణ్ణి. ఒక్క వుడిసిలి పడతామంటే, నాకు విశ్వమంత అంజలి లేదాయను.

నేను లోకంలో ఎందుకు పనికివస్తాను హృదయేశ్వరీ! రాజకీయ నాయకుణ్ణి కాలేను. వినాయకుణ్ణి కాలేను. అనుసరించే సామాన్యుణ్ణి కాలేను. స్వయంగా యే క్రొత్త మార్గమూ సృష్టించుకోలేను.

నువ్వు పంపిన పుస్తకాలన్నీ చదువుతున్నాను. ప్రస్తుతం వేదాంత పుస్తకా లేవీ పంపకు.

రాజకీయాల విషయంలో ఏమి చేయాలో నాకేమీ తోచడంలేదు. నేను రాజకీయవాదిని కాను. జయిలు నుంచి రాగానే ఏదయినా పరిశ్రమలో చేరుదామని ఉంది. నీ సలహా ఏమిటి?

నువ్వు ఎప్పుడు వస్తావు చూడడానికి? నన్ను చూచి బెంబేలుపడకు. ధైర్యంగా ఉండు. నువ్వు, వెన్నెల వర్షిస్తున్నట్టు మందహాసవదనవై రా! పాలసముద్రము ఉప్పొంగినట్లు ధైర్యంగా రా! రాజకీయ ఖైదీలుగా కోర్టుకు వెళ్ళినా వాళ్ళని పట్టుకు వదిలేస్తారు పోలీసువారు.

కోరకుండా అదృష్టంవల్ల వచ్చిన జయిలు, నన్ను కూడా ఒక నాయకుణ్ణి చేశారు ప్రభుత్వంవారు. అయిదారు ఉపన్యాసాలు ఇస్తేనేగాని రాని నాయకత్వం, క్రిందటి ఏ జన్మలోనో పుణ్యంచేసి ఉండడంవల్ల దాని అంతట ఆదే వచ్చి మెళ్ళో దండలు వేసి వరించింది.

నా జీవితేశ్వరీ! ఉత్తరం పంపించేవేళ ఔతోంది. ఎంత వ్రాస్తే నీ దగ్గర ఉన్నట్లవుతుంది? నీ పెదవులు హృదయమార గ్రోలినట్లవుతుంది?

గాఢ ప్రేమోత్కంఠుడు
నీ ప్రాణపతి
కోనంగి.

ఉత్తరం చదువుతూ కన్నీళ్ళతో కరగిపోయింది, ప్రేమతో ఉప్పొంగి పోయింది. కలకల నవ్వుకుంది. ఆ ఉత్తరం కళ్ళకద్దుకొంది. చదువుకొంది. చదవకుండా చూస్తూ కూచుంది! హృదయంలో దాచుకుంది అనంతలక్ష్మి.

## 3

ఇంత అద్భుతమైన ఉత్తరాలు తాను వ్రాస్తూ, తన భర్త తనకు వ్రాస్తూ ఉన్న సమయంలో, ఒకరోజున చిరునామా టైపు కొట్టిన ఉత్తరం ఒకటి వచ్చింది. తన స్నేహితురాం డ్రెవ్వరైనా వ్రాసి ఉంటారనుకొని, అనంతలక్ష్మి ఉత్తరం విప్పింది. లోపల కూడా టైపుతోనే ఉన్నది! ఆ ఉత్తరం చదువుతూ ఉండగా అనంతలక్ష్మికి కోపం ప్రారంభించి అంతకన్న అంతకన్న కోపం పెరిగిపోయింది.

ఆమె చేతులు వణికాయి. కన్నులు కెంపెక్కినాయి. ఆమె క్రింది పెదవి ఆమె పళ్ళతో నొక్కిపట్టగా గాట్లుపడి రక్తం కారింది.

ఒక్కసారిగా ఆమె కళ్ళవెంట నీరు కారిపోయాయి. ఆమెకు గుండె బరువెక్కి పోయింది. చేతిలో ఆ ఉత్తరం ఉండగానే మంచంమీద వాలి పోయింది.

ఒక అరగంటకు తన్నుతానే సమాళించుకొని, లేచి మంచంమీదే కూర్చుండి, ఆ ఉత్తరం మళ్ళా చదవడం ప్రారంభించింది.

ఆ ఉత్తరం తమిళభాషలో ఉంది.

మద్రాసు - మైలపూరు,
సింగపుర భవనం,
18-4-41.

ప్రియమైన అనంతలక్ష్మీ!

కొన్ని అనివార్యమయిన కారణాలచేత మీ మీద వ్యాజ్యం వేయవలసి వచ్చింది.

నన్ను నువ్వు పూర్తిగా ఎరుగుదువు. నేను నిన్ను ఎంత ప్రేమిస్తున్నానో నీకు బాగా తెలుసును. నా ప్రేమ ఒక మహాసముద్రం, నాకున్న ఏభయి అరవై లక్షల ఆస్తి నాకు నీ ప్రేమ ముందు గడ్డిపరకతో సమానం.

ఈ ప్రేమతో నాలో తుపానులు చెలరేగి ఉన్నప్పుడు. నువ్వు నన్ను కాదనడంవల్ల నేను నా ప్రేమావేశంచేతనే అమితమైన కోపం వచ్చి అలా వ్యాజ్యాలు వేశాను.

ఇప్పుడైనా ఏమీ పరవాలేదు. నన్ను బాగా తలుచుకో! నేను ఏలాంటి శక్తిగలవాణ్ణో. నేను గవర్నరు జనరలుతో సమానంగా మాట్లాడగలను. నేను కలెక్టరు ఉద్యోగాలు ఇప్పించగలను. నా పాదాలమీద వ్రాలి అనేకులు ప్రభుత్వ ఉద్యోగులు బ్రతుకుతున్నారు.

నువ్వు నా దానవై ఉంటే, నిన్ను దివ్యమయిన విమానంమీద అధివసింపచేసి లోకాలు తిప్పగలను. నీకోసం మహారాజులు ఎరుగని రాజభవనాలు కట్టి ఇవ్వగలను. రోజూ నిన్ను పన్నీట స్నానం చేయిస్తూ ఉండగలను. నీ కొరకై వేలకొలది ఎకరాల తోటలు వేయించి ఇవ్వగలను. నీ అంతబంగారు విగ్రహాన్ని చేయించి నీకు బహుమతి ఇవ్వగలను.

నీ పూర్వీకులైన వారు సరియైన వాళ్ళను ప్రేమించారు. మధురవాణి రఘునాథ నాయకునకు రాణి అయింది. నీ తల్లి లక్షాధికారిని చేబట్టింది.

నీకూ నాకూ మధ్య ఎవరూ రావడానికి వీలులేదు. నీ మీద ఉండే ప్రేమవల్లనే. నీకు ఇష్టుడు అని నీవనుకున్న మనుష్యుడు ఏవో మంచినీళ్ళు త్రాగుతున్నాడు. నా ప్రేమ ఆవేశంలో నన్ను నేను మరిచిపోయి ఉంటే, వాడికి కన్నూ, కాలూ, ముక్కూ, చెవులూ పోయివుండును.

నీకు జరిగిన పెళ్ళి వేళాకోళం పెళ్ళి. ప్రేమ ఉన్నచోట పెళ్ళి ఏమిటి? ప్రేమలేని పిచ్చివాళ్ళకు పెళ్ళి. అందుకనే నేను పెళ్ళిచేసుకున్న మా కులం అమ్మాయి మొగం ఇంతవరకూ చూడలేదు. నీ మీద నా ప్రేమ అలాంటిది.

ఇప్పుడయినా మునిగిపోలేదు. ఒక్కసారి వచ్చి నా యింట్లో, నా దివ్యమందిరంలో ఒక రాత్రి గడుపు. ఆ పిచ్చి కోనంగి మర్నాడు నీ ఇంటికి వస్తాడు. మనం కలుసుకుంటూ నిజమయిన తనివితీరని మధుర రాత్రులు కలిసి గడుపుకుంటూ ఉండవచ్చును. వాడికి నీ చిత్తం వచ్చిన ఉద్యోగం ఇప్పిస్తాను.

వాడు చెడిపోయిన వెధవ దానికి ఓ వెధవయ్యకు పుట్టినవాడు. వాడికి నీతీ నియమమూ ఎలా వుంటుందనుకున్నావు. ఆ పిశాచిగాడు సినీమాతారల ద్రాక్షసారాయి మత్తు పెదవుల్ని ఎన్ని త్రావి త్రేవులు త్రేన్చాడో! ఎంత మందికి వాడు రాత్రిళ్ళప్పుడు దాసుడయ్యాడో నాకు తెలుసును; నీకేం తెలుసును?

వాడి స్నేహితుడు డాక్టరు ఇంకా చిత్రమయినవాడు. వాడికి పెళ్ళి పెటాకులు ఎందుకు లేవనుకున్నావు? వీడూ వాడూ కలసి ఆ సినీమాతారలతో ఎంతో గాఢసంబంధం పెట్టుకొని ఉండేవారట. జయిలుకు వెళ్ళవలసి వచ్చింది. కాని, అంతవరకూ ఆ తారలను వీళ్ళిద్దరూ వదలలేదట. లేకపోతే వాళ్ళ కంత స్నేహం ఎందుకనుకున్నావు? అలాంటి ఒక చచ్చుగాడా నీకు భర్త?

కాబట్టి నా దర్జా నీ అందమూ, నా ధనమూ నీ విలాసమూ కావేరీవేగయిలుగా కలిసినట్లు అవ్వాలి. ఊఁ అను. ఒక్క కార్డు నీ దస్కత్తుతో పంపించు. నీ అందంక్రోలే తుమ్మెదనై నీ దగ్గర వాలుతాను.

ఇట్లు నిజంగా
నీ ప్రియమైన భర్త
చెట్టి.

ఆ సమయంలోనే కడలూరు జయిలులో ఉన్న కోనంగిరావుగారికి, ఒక ఉత్తరం వచ్చింది.

మద్రాసు, సింగపూరు భవనం,
16-4-1941. మైలాపూరు.

ప్రియమైన కోనంగిరావుగారూ,

మీరు చాలా మంచివారు. మిమ్మల్ని చూస్తే జాలేస్తుంది. మీ సాధుత్వమూ, మీ మంచీ అందరూ ఎంతోగా చెప్పుకుంటారు.

కాని నేను జయలక్ష్మిమీద ఎందుకు వ్యాజ్యం వేశానో చెప్పవద్దూ మరి. జయలక్ష్మి, దాని కూతురు అనంతలక్ష్మీ నా ఉంపుడుకత్తెలు. అనంతానికి నేను దాని పద్నాలుగో ఏటనే కన్నెరికం చేశాను.

జయలక్ష్మి వట్టి గడ్డురండ. నా డబ్బు యెంత తిందో! అనంతం అయ్యంగారిపిల్ల కాదు. అయ్యంగారు మాత్రం సామాన్యుడా? వాడికా డబ్బంతా ఎల్లా వచ్చింది ఈ జయలక్ష్మిని కోటీశ్వరులకు సప్లయిచేసి డబ్బు సంపాదిస్తూ ఉండేవాడు.

వాడు ఆడందేది. చివరకు వాడికి జబ్బు చేసింది. ఆ జబ్బులో వాణ్ణి తిన్నగా జయలక్ష్మి చూడకపోవడంవల్ల వాడు చచ్చి ఊరుకున్నాడు.

అలాంటి సంసారం వలలో నువ్వు పడ్డావు. బోగంవాళ్ళు బోగంవాళ్ళే! యెన్ని గంగాస్నానాలు చేసినా ఊరకుక్క నందినీధేనువు అవుతుందా? అది గౌరవంకోసం నిన్ను పెళ్ళిచేసుకుంది.

డాక్టరు రెడ్డికీ అనంతానికీ జయలక్ష్మికి ఏదో ఉండేదనేవారు. నా కావిషయం అంత నమ్మకంలేదుగాని, అనంతం నా చాటున గూడా కొందరు కాలేజీ కుఱ్ఱవాళ్ళ దగ్గర తన్ను అర్పించుకొని డబ్బు కొట్టో ఉండేది. ఆ విషయం దీనితో జతపర్చిన ఉత్తరం చదివితే బోధపడుతుంది. మిమ్మల్ని చూసి జాలివేసి పట్టలేక ఈ ఉత్తరం వ్రాశాను.

మీరు సినీమాలో సంబంధం కలిగి ఉన్న సినీమా తారలు ముగ్గురూ కులాసాగా ఉన్నారు. మిమ్ము మరీ మరీ అడగమన్నారు.

## (4)

ఆ ఉత్తరం చూడగానే కోనంగికి అంతులేని కోపం వచ్చింది. ఎంత విషం ఈ సెట్టియారుకి! "ఖలునకు నిలువెల్ల విషము గదరా సెట్టీ!" అని అనుకున్నాడు. తన్ను తాను మరిచిపోయేటట్లు చేయగలడు సెట్టి. ఇంకా కావాలంటే కొన్నాళ్ళకు కోనంగి వట్టి గుండా అని సంపూర్ణ నమ్మకం కోనంగికే కలుగచేయగలడు సెట్టి అని అతడనుకున్నాడు.

తనకు ఉత్తరం వ్రాసినట్టుగానే, అనంతానికి కూడా ఉత్తరాలు వ్రాస్తున్నాడా? ఏమి వ్రాశాడా? దాని ఫలితమేమో తెలిసేదెట్లా? ఈ పిశాచి ఉద్దేశం ఏమిటి? పెళ్ళి కాకమునుపు ఈలాంటి పనులు చేసి ఉంటే కొంచెం సెట్టికి ఉపయోగపడి ఉందునేమో! ఇంక తన ఆనందం విచ్ఛిన్నం చేయాలనేగా వీడు ప్రయత్నించేది? తన్ను కొట్టించాడు ఆ దెబ్బతో తాను చచ్చినా దిక్కెవరూ?

స్త్రీకోసం పురుషపుంగవులు ఎంతైనా చేస్తారు. ధనం కోసం, తిండి కోసం దొంగతనాలు, దోపిళ్ళు. హత్యలు చేయడం అర్థం అవుతుంది. వివాహంకోసం ఎన్నో తాపత్రయాలు పడవచ్చును! కాని స్త్రీని పొందడంకోసం మాత్రం పురుగుకన్న హీనుడూ, నరమాంసభక్షకునికన్న భయంకరుడూ కావాలా? ఒక స్త్రీని ప్రేమించి ఆ స్త్రీకోసం ఎంత బీభత్సం చేసినా కొంత అర్థం ఉంది. ఎవరో ఒక స్త్రీని కామించి, తన పశుతృప్తి తీర్చుకోడానికి ఎంత పనికయినా వెరవకుండా ఉండడము సంపూర్ణ పశుకృత్యంకన్న ఎంత నీచస్థితోగదా అని కోనంగి ఆలోచించుకుంటూ కూర్చున్నాడు.

ఈ ఉత్తరం డాక్టరు రెడ్డికి చూపించడమా, చూపించక పోవడమా? తన అనంతం వ్రాసిన ఉత్తరం రెడ్డికి చూపించడమా, చూపించక పోవడమా? తన అనంతం వ్రాసిన ఉత్తరం రెడ్డికి చూపించనివాడు ఇప్పు డీ ఉత్తరం చూపించడంలో అర్థమేమి ఉంది? అని అత డాలోచించుకున్నాడు.

అక్కడ అనంతలక్ష్మి ఉత్తరం రెండవసారి చూచుకొని, దాన్ని ముక్కలు ముక్కలు చించివేద్దామని అనుకొంది. కాని ఈ ఉత్తరం అవసర మయితే పనికివస్తుందని దాన్ని దాచింది.

ఆ మర్నాడే రెండు ఉత్తరాలు కోనంగిరావు పేర అనంతలక్ష్మి ఇంటి చిరునామాకు వచ్చాయి. అనంతలక్ష్మి ఆ కవరులు రెండూ తన ఉత్తరంతో పాటు కోనంగికి పంపాలని సంకల్పించి విప్పి చూచింది.

## మొదటి ఉత్తరం

నెం. 65
షణ్ముగంచెట్టివీధి
త్యాగరాజనగరం

మద్రాసు,
18-4-41

గాఢ ప్రియమూర్తి కోనంగీ,

నీ కౌగిలింతలు, నీ చుంబనాలు రుచిచూచి, నీ శృంగార నాయకత్వంలో ఓలలాడి ఎన్నో సంవత్సరా లయినట్లుంది.

నువ్వు పెళ్ళి చేసుకున్నావని విన్నాను ప్రాణకాంతా! ఆ నీ భార్య నాబోటిదేనటగా! ఇదివరకే ఆరితేరిన ఘటం అటగా-ఎంతమందో కాలేజీ విద్యార్థుల కౌగలింతలో కరిగి వారి దాహం, ఆకలి కడుపునిండా తీర్చినదే నటగా!

సరే, నువ్వు డబ్బుకోసం అక్కడికి చేరి ఉంటావు. ఒకవారం రెండు వారాలయిన వెనుక నువ్వు కాస్త నావంక కూడా చూడుసుమా. ఏమధ్యాహ్న మొచ్చినా సరే! నీ పెదవులు రుచి చూచిన నాకు ఇంకొకరి ముద్దులు చేదుగా ఉండవా మధుమోహనమూర్తీ!

నీతో సినిమాలో కలసి, నువ్వు నాయకుడుగా కలిసి పనిచేసిన నా అదృష్టమే అదృష్టం. మనం ఇద్దరం నిజంగా నాయికా నాయకులు అయ్యాం గనకనే అంత బాగా నటించగలిగాము.

ఆ రోజులలో నువ్వు ప్రదర్శించిన ప్రేమావేశం గ్రేటా గార్బో ఎదుట నటించిన చార్లెసు బోయెరు ప్రదర్శించగలడా?

ప్రాణనాయకా, నీవు నాకు వరమిచ్చిన ప్రణయం అంతా మీ క్రొత్తభార్యకు ఇచ్చేటప్పుడు, ఈ పాత భార్యను మరువక కొంతైనా నాకోసం ఉంచాలి సమండీ!

ఇట్లు,
"........."

ఈ ఉత్తరం ఎలా చదివిందో చదివింది అనంతలక్ష్మి. రెండో ఉత్తరం చదవలేకపోయింది.

ఆమె తల తిరిగిపోయింది. ఆమె ధైర్యం పూర్తిగా సడలిపోయింది. ఆమె గజగజ వణికిపోయింది. బిగుసుకుపోయింది. ఆమెలోని బలమంతా తూటుపడిన బిందెలో నీరు కారిపోయినట్లయి పోయింది. పదివేల టైఫాయిడ్ల జ్వరము తగలి నెమ్మదించిన నీరస మామెను కప్పింది. ఆమె ఏడ్వలేక పోయింది. ఆమె దేహంలోని రక్తం అంతా పది సంవత్సరాలై ఇంకి పోయినట్లయింది.

ఆ సమయంలో వినాయగంపిళ్ళ "అమ్మిణి! కారు సిద్ధం అయింది. మీ అన్న తొందరపడుతున్నాడు" అని లోనికి వచ్చాడు.

వచ్చీ రావడంతోటే వినాయగానికి అనంతలక్ష్మి అతి నీరసంగా వుందనీ, ఏదో మహత్తరమైన బాధకు ఆమె లోనయిందనీ తోచింది.

"అమ్మిణీ!" అని అతడా బాలిక కడకురికాడు. ఆ అరపులోని అనంతబాధ అనంతలక్ష్మికి అమృతపు మందు నరానికి ఇంజెక్షను ఇచ్చినట్లయింది.

"ఏమీ లేదు మామా!" అనంత అన్నది.

"ఏమీ లేదేమిటి, నా తల్లీ! ఏమి జరిగింది? నిన్నటి నుంచి నువ్వదోలాగా ఉన్నావు. తల్లీ చెప్పు ఆయన వెళ్ళిపోయాడనా? తప్పక వస్తాడు. నిజం చెప్పు. అది కారణం అనుకోను!" అని రాతినైనా కరగించే ఆవేదనతో పలికినాడు.

ఆనంతలక్ష్మికి చల్లని మంచినీళ్ళు నోటి కందించినట్లయి, ఏమి బుద్ధిపుట్టిందో, అక్కడ ఆమె అలంకరించుకునే బల్లమీద ఉన్న ఆఉత్తరాల వైపు చేయి చాపింది.

"ఆ చిన్నడ్రాయరులో ఇంకో ఉత్తరం ఉంది. అది కూడా చదువు మామా!"

వినాయగంపిళ్ళ ఆ ఉత్తరాలు మూడూ చదివాడు.

అతనికి కుస్తీలో ఒక భయంకరమైన పేచీలో ప్రత్యర్థి చిత్తుచేసినంత అఘతం కలిగింది. అతని ఆలోచన మాయమయింది. అతని గొంతు కెండి పోయింది. నిస్తబ్ధుడై అలా నిలుచుండిపోయాడు.

అనంతలక్ష్మి వినాయగం అవస్థ చూచి మరీ నిస్పృహ పొందింది.

ఏమో నిజమేమో, తన గతి ఇంక అధోగతే! తాను బ్రతికి ప్రయోజనం లేదు.

ఏమో నిజమేమో! నిజమే! నిజమే అయివుండాలి! కాదు, ఇదంతా మోసం. తప్పకుండా మోసం. అనంతలక్ష్మి గజగజ వణికింది. నూట నాలుగు డిగ్రీల మలేరియా వచ్చినట్లు వణికిపోయింది.

## 5

**వి**నాయగంపిళ్ళ తమ అమ్మిణిని కష్టపెట్టిన ఆ చెట్టియారును తలచుకొంటూ ఉగ్రుడై పోయాడు.

వినాయగం పేరు పొందిన వీరుడు. మల్లయుద్ధంలో గామానయినా ఎదిరించ దగినంత వీరుడు. అతని కండశక్తీ నరబలమూ జగత్ప్రసిద్ధము. ఉక్కుకడ్డీలు విరుగుతాయి. అతని అవయవాలు విరగవు. అతనికి కోపం రాదు. అతనికి ఆవేశం లేదు. ప్రకృతిశక్తికి పాఠాలు చెప్పే శక్తి అతనిది.

ఇప్పటికీ వినాయగంపిళ్ళ దగ్గర కుస్తీలు నేర్పుకోవడానికి అనేకులు శిష్యులు వస్తూ ఉంటారు. అతడు కోడి రామమూర్తిగారి సర్కసులో రంగూను, చీనా, జపాను, మలయా, జావా, మొదలయినవన్నీ తిరిగాడు. కోడి రామమూర్తి అతనికి గురువు. తన గురువునకు బాటసగా అతడు ఎన్ని బలప్రదర్శనాలన్నా చూపించేవాడు. ప్రసిద్ధి కెక్కిన దక్షిణాది గురువుల దగ్గర మల్లవిద్య నేర్చుకొని రామమూర్తి సర్కసులో ఉండే రోజుల్లో గామా దగ్గర అనేకమయిన నూతన మల్లయుద్ధ ప్రయోగాలు (పేచీలు) నేర్చుకొన్నాడు. గామా వేగానికి సమానమయిన వేగం అతనిది. గామాగారి తదితర శిష్యులు అతనితో కుస్తీ పోటీపడడం అంటే భయపడతారు.

అలాంటి వినాయగంపిళ్ళకు నేడు దావానలంవంటి కోపం ఉద్భవించింది. "అమ్మిణీ! ఈ ఉత్తరాలు నేను నమ్మను. నీ పెళ్ళి యింకా వారం రోజులు ఉందనగా నేనూ, మా వాళ్ళూ కలిసి జాగ్రత్తగా కోనంగిరావుగారిని గూర్చి విచారించాము. నా స్నేహితుణ్ణి ఒకర్ని బందరు పంపించి దర్యాప్తు చేశాము. కోనంగిరావుగారంత మంచివారు ఇంకొకరు లేరు. చెట్టికి వినాశకాలం వచ్చింది. వాడు చేసినపని ఇదంతా! ఇది ఏమనుకున్నాడో? మేము ముగ్గురము ఇక్కడ ఉన్నామన్న సంగతి మరచిపోయాడు. మాకు

నీ వంటే ఉండే అభిమానం, గౌరవం, ప్రేమా సంగతి మరచిపోయాడు. మేము ఎవరమో అన్న విషయమే అతని స్మృతిపథాన్నుంచి పోయినట్లుగా ఉంది. నువ్వేమీ బెంగపెట్టుకోకు తల్లీ! మేము ముగ్గురమూ కోనంగిరావుగారిని గూర్చి విచారించడం అల్లా ఉంచు. మా హృదయాల్లో కోనంగిరావుగారంటే ఈషణ్మాత్రం అనుమానంలేదు. నీ పేరగాని, మీ ఆయన పేరగాని వచ్చిన ఉత్తరాలన్నీ మా కిచ్చివేయి. తర్వాత సంగతి మేము చూస్తాము.

"వాడు ఏ దురుద్దేశంతో వ్రాస్తున్నాడో ఆ ఉద్దేశం నెరవేరడమే అవుతుంది, నువ్వు దుఃఖిస్తే. లే; నీ మామూలు ప్రకారంగా నువ్వుండు. నీ స్నేహితురాండ్ర సహాయంతో కోనంగి విషయం. పోలీసువారికి పూర్తిగా తెలిసేటట్టు చేస్తాము. నువ్వు సంతోషంగా వుండు" అని బ్రతిమాలాడు.

గంభీరమైనవీ, చల్లనివీ, శాంతిపూరితమయినవీ అయిన అతని మాటలు అనంతలక్ష్మికి ఎంతో ఉపశమనం కలుగజేశాయి.

అనంతలక్ష్మి ధైర్యంగా లేచింది. వినాయగం కాళ్ళకు నమస్కారం చేసింది. ఇంతలో మెహరున్నీసా అనే స్నేహితురాలు తన పరదాకారులో యెక్కి అనంతలక్ష్మిని చూడడానికి వచ్చింది.

అనంతలక్ష్మి వెంటనే తన స్నానాల గదిలోనికి వెళ్ళి తన మొగము కడుక్కొని యథాప్రకారం చిరునవ్వుతో హాలులోకి వచ్చి మెహరున్నీసాను బిగియార కౌగలించుకున్నది.

మెహరున్నీసా చెన్ననగరం ముస్లింలీగు నాయకులలో నొకరయిన మొహమ్మద్ ఫైజుల్ హుస్సేన్‌గారి కొమరిత. ఫైజుల్ హుస్సేన్‌గారు చాలా మంచి వకీలు, ఆయనకు ఎంతమందో హిందూ స్నేహితులున్నారు. ఆయనకు హిందువులంటే కోపం లేదు. మతావేశము కలవాడు కాదు. ముస్లింలీగు చాలా గట్టిపడితే, ముస్లిం లందరూ ఒకటైతే, కాంగ్రెస్‌తో సమాధానంపడి సంధి షరతులు నిర్మాణం అయితే దేశానికి అభ్యుదయం కలుగుతుందని ఆయన వాదన.

ఫైజుల్ హుస్సేన్‌గారికి మేనల్లుడంటే ఎంతో ప్రేమ. కాని అతడు లీగును పూర్తిగా అర్థం చేసుకోలేదని వాదిస్తాడు.

మెహరున్నీసా రియాసత్ ఆలీని ప్రేమిస్తున్నది. రియాసత్ ఆలీ తన మేనమామ కూతుర్ని ప్రేమిస్తున్నాడు. వారిద్దరికీ వివాహం జరుగుతుందని నిశ్చయమే! కాని రాజకీయంగా భావాలు తేడాలయి కొంచెం తీవ్రత పొందాయి. ముస్లిం లెవ్వరూ కాంగ్రెసులో ఉండకూడదంటుంది ఆమె. అల్లా అందని లీగుస్థితి అధ్వాన్నమని వాదిస్తాడు.

ఫైజుల్ హుస్సేన్‌గారిలో లేని తీవ్రత వీరిద్దరికీ వచ్చింది. మెహరున్నీసా క్వీన్ మేరీస్ కళాశాలలో అనంతలక్ష్మి తరగతే. ఇద్దరూ ఇంటరు చదివారు; ఇద్దరూ బి.ఏ. చదువుతున్నారు.

మెహరున్నీసాకుగాని, అనంతలక్ష్మికిగాని రాజకీయాలేవీ తెలియవు. అయినా ఉన్నీసాకు ముస్లింలీగు అంటే వెర్రి అభిమానం. అనంతలక్ష్మికి కాంగ్రెసంటే అభిమానం. అనంతలక్ష్మి స్నేహితురాండ్రలో కొందరు జస్టిసుపార్టీ వారున్నారు, కొందరు ఏ రాజకీయ భావాలూ లేని వారున్నారు.

మెహరున్నీసాకూ అనంతలక్ష్మికీ గాఢ స్నేహం. ఆమెకు ఇంకా పరదా ఉంది. తెరలు కట్టిన కారులో కాలేజీకి వెడుతుంది. బైటికి వెళ్ళదు. ఇంగ్లీషు సినీమాలకు వెళ్ళినా, బొమ్మలు మొదలుపెట్టిన తర్వాత హాలులోకి వెళ్ళేది. మధ్య విశ్రాంతిలో మేలిముసుగు

వేసుకునేది. భారతీయ చిత్రాల ప్రదర్శనాలలో స్త్రీలకు ప్రత్యేకస్థలం ఉండేది. కనుక ఇబ్బంది ఉండేది కాదు ఆమెకు.

రియాసత్‌కు పరదా అంటే పడదు. పరదా స్త్రీ పురుషులను పశువుల చేస్తుందని అతని వాదన. పరదా తీసివేయడమంటే విచ్చలవిడిగా తిరగడమని తన అభిప్రాయం కాదనీ, హిందువులు పరదా లేకుండా ఉన్నా వీధుల వెంబడి తిరుగుతున్నారా అనీ అతడు వాదిస్తాడు.

మెహరున్నీసా పరదా లేకపోతే స్త్రీ బోను విడిచిన పెద్దపులి లాంటిదంటుంది. హిందువులు, ఆంగ్లేయులు పూర్తిగా పరదా అవలంబిస్తే ముస్లింల ఆశయాలు క్షుణ్ణంగా అర్థం చేసుకుంటారు అని వాదిస్తుంది.

## 6

**మె**హరున్నీసా, అనంతలక్ష్మీ గదిలో కూర్చుండి అనేక విషయాలు చెప్పుకున్నారు. తమ ప్రేమవిషయం మెహర్ ఒక్క అనంతలక్ష్మితోనే చెప్పుకుంటుంది. అనంతలక్ష్మి ఆమె హృదయం పూర్తిగా ఎరిగి ఉన్న బాలిక. అనంతలక్ష్మి తన ప్రేమ విషయమూ మెహర్‌తో తెలిపేది. వీళ్ళిద్దరూ తమ ప్రేమగాథలు ఒకరి కొకరు చెప్పుకునట్లు తమ ఇతర స్నేహితురాండ్రయిన బాలికలకు తెలియనీయరు. మెహర్ ఇంటికి అనంతలక్ష్మి వెళ్ళినప్పుడో, అనంతలక్ష్మి ఇంటికి మెహర్ వచ్చినప్పుడో, తక్కిన స్నేహితురాండ్రు లేనప్పుడో, వీరిద్దరూ తమ ప్రేమ విషయాలు ఎవరికయినా వినబడుతుందేమో అన్నట్టుగా గుసగుసలతో మాట్లాడుకొనే వారు.

ఆ రోజున మెహర్ తన ఆవేదన అనంతలక్ష్మికి వెళ్ళబుచ్చుకునేందుకూ, అనంతలక్ష్మి ఆవేదనను తాను భరించేందుకూ వచ్చింది.

ఇద్దరూ అతిదగ్గరగా ఒకరి నొకరు కౌగలించుకొని కూర్చున్నారు.

**అనంతలక్ష్మి:** ఏమే మెహర్! పరీక్షలయిన తర్వాత ఇప్పుడా రావలసింది నువ్వు?

**మెహరున్నీసా:** మీ ఆయన ఆరెస్టు అయిన తర్వాత అన్నిసార్లు వచ్చినా, పరీక్షలయ్యాయి. నా వివాహం సంగతి మళ్ళీ తర్జనభర్జనలయ్యాయి. మా పొపీజాన్ (మేనత్తగారు) మా బాబాజాన్ (తండ్రిగారు) తో నా వివాహ విషయం తొందర పెట్టింది.

**అనంత:** మెహర్, నీకు కోపంవస్తే నేను చెప్పలేనుగాని, రియాసత్ ఆలీగారిని నువ్వు ప్రేమిస్తున్నావు. ఆయన నిన్ను ప్రేమిస్తున్నారు. ఆయనకు ఈ ఏటితో వైద్యచదువు పూర్తి అవుతుందిగదా!

**మెహర్:** అయితే మాత్రం?

**అనంత:** ఆయన స్వంత వైద్యం ప్రారంభించడమో, లేకపోతే కొన్ని వైద్యాలలో ప్రత్యేక పరీక్షలకు వెళ్ళడమోగదా?

**మెహర్:** అయితే ఏమంట? నా వివాహానికీ దీనికీ సంబంధం ఏమిటే?

**అనంత:** అలాంటి సమయంలో నువ్వు కూడా ఆయన దగ్గర ఉండడం మంచిదిగాదటే?

**మెహర్:** యెవరకే?

**అనంత:** మీ ఇద్దరికినూ?

**మెహర్:** నాకు కూడానా?

**అనంత:** ఆ!

**మెహర్:** నాకు మాత్రం మంచిదిగాదు. మా యిద్దరి రాజకీయాభిప్రాయాలు, అంత తేడాగా ఉంటే, మేం యిద్దరం నిమిష నిమిషానికి కొట్టాడుకొంటోంటే మా ప్రేమ మట్టిగలిసిపోదూ?

**అనంత:** అంత గట్టిదా మీ ప్రేమా? రాజకీయాలు, వ్యక్తిగతాభిప్రాయాలు ప్రేమకు అడ్డంపడతాయా? ప్రేమ మతాలనూ, రాజకీయాలనూ, వ్యక్తి భావాలనూ మించి మహోత్తమ వేగంతో ప్రసరిస్తూ ఉంటుంది.

**మెహర్:** ఏమి చక్కనిమాట చెప్పావు? ఓహోహో! నీకేం నువ్వు చెప్తావు అడుగులకు మడుగులొత్తే భర్తను చేసుకొని!

**అనంత:** నేను గాంధీతత్వవాదిని, ఖద్దరు కట్టకపోవచ్చుగాక, వడకక పోవచ్చుగాక! కాని మావారు జస్టిస్‌పార్టీ అయినా లేక ప్రభుత్వ పక్షపాతీయులయినా నాకు లెక్క లేకుండా ఉందును.

**మెహర్:** నువ్వు అసలు గాంధీవాదివనుకో. నువ్వు ఖద్దర్ తప్ప ఇతర వస్త్రాలు కట్టుకోవనుకో. నువ్వు ఎప్పుడూ వడుకుతూ ఉంటావు అనుకో! అలాంటప్పుడు మీ ఆయన నిన్ను ఖద్దరు మానివేయమనీ, వడకడం పనికిరాదనీ, గాంధీతో సంబంధం ఏ మాత్రమూ పనికిరాదనీ పట్టుబట్టాడనుకో, అప్పుడేం చేస్తావు?

**అనంత:** నీకు నిజమయిన ప్రేమ ఉంటే, ఇలాంటి వాటికి భయపడవు, నేనే ఐతే నా ప్రేమ విధానము ఎల్లాంటిదయినా వారినే పెళ్ళి చేసుకుంటాను.

మెహర్ తలవంచి ఆలోచనలో పడింది. అనంతలక్ష్మి కాఫీ, ఉపహారాలు తీసుకురమ్మని చెప్పడానికి వెళ్ళింది. మెహరున్నీసా అనేకవిధాల ఆలోచించుకొంది. రియాసత్ ఆలీ మంచి క్రికెట్టు ఆటగాడు. ఎన్నిసారులో మదరాసు జట్టులో ఆడి వందలకొలదీ పరుగులుచేస్తూ ఉండేవాడు. రియాసత్ హృదయం యెంతో మంచిది. అతడు తానేమన్నా, ఎంత వాదించినా, చివాట్లు పెట్టినా నవ్వుతూ ఊరకుంటాడు. అతడు వాదం చేయడంలో కూడా యెంతో నెమ్మది ఉంది. అలా అని సమర్థత లేకపోలేదు.

ఈలా ఆలోచించుకుంటూ ఉంటే, అనంతలక్ష్మి అక్కడకు చక్కా వచ్చింది.

"ఒసే మెహర్! రా ఇంట్లోకి. కాస్త ఫలహారం చేసి కాఫీ తాగుదాము?

"యింటి దగ్గర ఉపాహారాలు చేసి వచ్చానే!"

"చేశావులే! మా యింటిదగ్గర కాస్త తినవోయ్"

మెహరున్నీసాకు తెలుగు బాగా వచ్చును. ఆమె తండ్రి ఆంధ్రదేశవాసి. ఆంధ్ర దేశానికి పూర్వము ఎప్పుడో వలస వచ్చిన అరబ్ ముస్లింసర్దారుల వంశంవాడు. అందుచేత వారింటి వారందరికీ తెలుగు బాగా వచ్చును.

ఇద్దరూ వెళ్ళి ఉపాహారాలు సేవించి కాఫీ త్రాగినారు. మెహర్ పారశీక రాకుమార్తెల అందం అంతా పుణికిపుచ్చుకుంది. వారిద్దరూ అనంతలక్ష్మి చదువుకొనే గదికి వచ్చారు. అక్కడ మెహర్ తన ప్రేమ విషయం అంతా తెల్పింది.

"చిన్నతనాన్నుంచీ మేం ఇద్దరం యెంతో స్నేహంగా పెరిగాం. చిన్నతనంలో మా బావ నన్ను చేసుకుంటాడు అని అల్లరిచేసేవారు. నాకూ మా బావ అంటే చాలా యిష్టమే! అయినా ఇద్దరం కలిసి పెరగడంవల్ల మా బావ నాకు అతిచనువయిపోయారు."

"ఇంతకూ నీ అభిప్రాయం ఏమిటే?"

"యేముంది, మా బావ ముస్లింలీగులో చేరితేనేగాని నేను అతణ్ణి పెళ్ళిచేసుకోదలచుకోలేదు."

"ఆయన చేరడనుకో!"

"చేరకపోతే చేసుకోను. అది నిశ్చయం."

"ఇంకొకరిని చేసుకుంటావా?"

"అసలు పెళ్ళే చేసుకోను."

"ముసలిదాని వైనంతవరకూ అల్లా ఉండిపోతావా?"

"ఆ!"

"పూర్వకాలంలో క్రైస్తవ మిషనరీలు క్రొత్తగా వచ్చినప్పుడు తెల్లగా, బొల్లిగా ఉన్న వాళ్ళమ్మాయిలు కూడా వచ్చేవారు. ఆ అమ్మాయిలను చూపించి, చదువుకునే యువకులను ఊరించి, వాళ్ళ క్రైస్తవమతం పుచ్చుకుంటే, ఆ తెల్లపిల్లలను చేసుకోవడానికి తమ అభ్యంతరం లేదనే వారట ఆ మిషనరీలు. ఆ పిల్లల కాసించి ఎంతమందో మతం పుచ్చుకొనే వారట."

"నీ కథకూ నా వివాహానికీ సంబంధం ఏమిటే?"

## 7

"అనంతలక్ష్మి మెహరున్నీసా మాట వింటూనే తన భర్త జ్ఞాపకము వచ్చి, కళ్ళనీళ్ళతో దీనముఖంతో తలవాల్చుకుంది. మెహర్ అనంతలక్ష్మిని కౌగలించుకొని హృదయానికి గట్టిగా అదుముకొని, "అనంత్, నీకు ఈ పామరత్వమేమిటే? మన చదువంతా గంగలో కలిసిపోయిందన్న మాటే? దేశంకోసం అని ఆలోచించి వెళ్ళకపోయినా, నీ భర్త జయిలుకు వెళ్ళడం దేశంకోసమేకదూ! వీరనారివై, పదిమందిలో అతిసంతోషంతో తిరక్క, ఏమిటీ వాజమ్మతనం?" అని గదిమింది.

"ఈ ఉత్తరాలు చదువు" అని అనంతలక్ష్మి చెట్టియారూ, ఆ సినీమా తారలూ వ్రాసిన ఉత్తరాలు మెహరున్నీసా చేతిలో పెట్టింది.

అందులో తెనుగు ఉత్తరాలు రెండూ చదువుకొంది మెహర్. ఆమె గులాబీపూవు మోము ఎఱ్ఱగా జేవురించింది.

"ఈ ఉత్తరాలేమిటి? ఏ రాక్షస స్త్రీలు ఈ ఉత్తరాలు వ్రాయగలిగారు?" అని బాలిక ప్రశ్నించింది.

"ఈ అరవ ఉత్తరం చదివి అర్థం చెబుతాను విను" అని అనంతలక్ష్మి తలయెత్తి కన్నీరు తుడుచుకొని, ఆ ఉత్తరాలు చదువుతూ మెహరునకు అర్థం చెప్పింది. ఇంక మెహర్ పట్టలేకపోయింది. క్రోధమూర్ఛిత వ్యాఘ్రిపోలిక ఆమె రాజుతూ "ఈ రోజుల్లో చదువుకొనే బాలికలను, ఈ పురుష వెధవ పందికొడుకులు బ్రతకనీయ దలచుకోలేదు. వెనక నాకు రెండు మూడు ప్రేమ ఉత్తరాలు, తిరువలిక్కేళిలో అక్బర్‌సాహెబ్ వీధిలో మా బంగాళా ప్రక్కను చదువుకొనే కుఱ్ఱకుంకలు వ్రాశారు. నాకు వచ్చిన కోపం మిన్నుముట్టింది. అయినా ఊరకున్నాను! వాళ్ళు కారులో నేను వెళ్ళి కూర్చోబోయే ముందు పొంచివుండి చూసేవారు" అని అన్నది.

"ఆ ఉత్తరాలు ఏంచేశావు?"

"ఉండు; ఆ కథ అంతటితో ఆఖరా? వాళ్ళు నేను మాట్లాడక ఉండడం చూసి మరీ పేట్రేగేరు. ఒక రోజున మా పనిమనిషికి లంచం యిచ్చారు కాబోలు, వెండి వస్తువుల్ని ఏవేవో నాకు పంపించారు రహస్యంగా. ఇక నా కోపం చూడు, ఆ పనిమనిషి పిశాచిని పళ్ళూడగొట్టాను. ఆ వెండి వస్తువుల్ని రాతితో ముక్కచక్కలు చేశాను. "వీట్నీ చూసి వాళ్ళను బుద్ధి తెచ్చుకోమని చెప్పు. ఈ పట్టు ఇంకో తెలివి తక్కువ పని చేశారంటే పళ్ళూడకొట్టిస్తాను అని చెప్పు" అన్నాను. ఆ పనిమనిషి బేజారైపోయింది. అప్పటి నుంచీ, నాకు ఉత్తరాలు లేవు. ఇంక ఇల్లాంటి గడబిడలు జరుగలేదు. మీ చెట్టిగాణ్ణి కాస్త దేహ గౌరవం చేయించు. మీ వినాయగం ఉన్నాడుగా!" అంది.

"అవును, మా వినాయగం, అతని స్నేహితులూ ఉన్నారు మెహర్. కాని నాకు హింస అంటే నమ్మకం లేదు."

"ఏమి గాంధీతత్వవాది! ఎక్కడ నేర్చుకొన్నావు ఈ వేదాంతము? యెప్పుడు ప్రవేశించావు కాంగ్రెసులో?"

"అహింసే పరమసాధనం అని నమ్మడానికి కాంగ్రెసులో చేరాలా ఏమిటే మెహర్?"

"ఏమోలే! అయితే ఏం చేద్దామని నువ్వు చెట్టియారుగారి విషయంలో?"

"ఏమీ చెయ్యను. వాడి ఉద్దేశం నాకూ మా గురువుగారికీ ఎడబాట్లు కలుగచేద్దామని! వాడు నా గుమ్మం యెదుట కత్తితో పొడుచుకు చచ్చిపోయేది, నేను నా గురువుగారిని వదలను. నా భక్తి అలాంటిది."

"అది మంచిదే. నీ నిశ్చయానికి నా హృదయ పూర్వకంగా నిన్ను అభినందిస్తున్నాను. ఇక నాకు నువ్విచ్చే సలహా ఏమిటే?"

"ఒసే మెహర్! ప్రేమ అంటే నీ ఉద్దేశంలో ఒక చీర వంటి దనుకున్నావా, మనం యిష్టం వస్తే ధరించుకొనడానికీ, బుద్ధిమారితే విప్పివేయడానికినీ? మా గురువుగారన్నట్లు ప్రేమ మనదేహంలో దేహం, మనస్సులో మనస్సూ, ఆత్మలో ఆత్మ అయిపోతుంది. దేహ మనఃప్రాణాల విషయంలో మనకు తెలిసి ఉండీ మనకు ముప్పు తెచ్చుకుంటున్నవట్లు ప్రేమ విషయంలోనూ మనం తెలివితక్కువగా సంచరించి ప్రాణం మీదకు తెచ్చుకుంటాము. నువ్వు ఏమైనా రియాసత్ ఆలీగారిని విడువకు. మీ మీ రాజకీయాలు కూయంలో వేయండి."

"ఇంత అద్భుతంగా నువ్వెప్పుడూ మాట్లాడలేదే అనంతం! నేను వెడతా. నా విషయం నేనే ఆలోచించుకోవాలి!"

"ఏమి నిర్ధారణకు వచ్చావో నాకు తెలియజేయి."

మెహరున్నీసా వెళ్ళిపోయింది. మెహర్ రావడంవల్ల అనంతలక్ష్మికి ఎక్కడలేని ధైర్యమూ, శక్తీ వచ్చాయి.

ఆ బాలిక వెంటనే లేచి, స్నానంచేసి, ఉత్తమమయిన ఖద్దరు వస్త్రాలు ధరించి, మహిళా ఖాదీ ప్రచార కార్యాలయానికి తన కారు మీద వెళ్ళింది. జయలక్ష్మి కొమరితతో బయలుదేరక ఇంటికడనే ఉండిపోయింది. భర్తను నిర్బంధించినందుకు ఇంటికడ ఎప్పుడూ దుఃఖిస్తూ కూర్చోకుండా, భర్తకు ప్రీతియని ఖద్దరు పనిలో, మహిళా సేవాసదనోద్యమంలో పాలుపుచ్చుకుంటూ అనంతలక్ష్మి పనిచేయడం ఆమెకు ఆనందం అయింది. కొమరితను సర్వవిధాలా ఆమె ప్రోత్సహించింది.

ఆ రెండు సంస్థలకూ ఆమె బాగా విరాళాలిచ్చింది.

అనంతలక్ష్మి మహిళా ఖాదీ ప్రచార కార్యాలయానికి పోయి వడికేది, యితరులకు వడకటం నేర్పేది. అక్కడ నుండి రాయపేట హైరోడ్డులో ఉన్న మహిళా ఖాదీ ప్రచారాలయ వస్త్రవిక్రయశాలకుబోయి, అక్కడ ఖద్దరు అమ్మేది. ఆ బాలిక ఖాదీ ప్రచారక సోదరీమణులతో బాగా స్నేహం చేసుకున్నది.

వారందరితో కలిసి ఎప్పుడయినా సేవాగ్రామం వెళ్ళి అక్కడ మహాత్ముని దగ్గిర కొన్నాళ్ళపాటుండాలని అనంతలక్ష్మి నిశ్చయించుకుంది.

వేసవి కాలంలో సేవాగ్రామం భరింపరాని వేడితో మాడిపోతూ ఉంటుందని, జయలక్ష్మి వాదించినా అనంతలక్ష్మి వినలేదు. తన నిశ్చయం భర్తకు ఉత్తరం వ్రాసి, తల్లితో బయలుదేరి వార్ధా చేరింది. ఇదివరకే సేవాగ్రామాశ్రమ కార్యదర్శితో వారుత్తర ప్రత్యుత్తరాలు సలిపి, ఆ జట్టువారు ఆశ్రమంలో ఒక బస ఏర్పాటు చేసుకున్నారు.

సేవాగ్రామంలో అనంతలక్ష్మి పొందిన ఆనందము ఆకాశపథ మంటినది. ప్రతి ప్రార్థనా సభకూ ఆమె హాజరు. ఆ ప్రార్థన సమయంలో మహాత్ముని సమీపంలో ఆమె అనుభవించిన శాంతీ, ఆనందమూ పరమోత్తమస్థితి నందింది.

## 8

**జ**యిలులో ఉన్న కోనంగికి చెట్టియారుగారి ఉద్దేశాలు తెలియక పోతాయా! ఆయన ఉత్తరాలలోని అంతరార్థం అప్పుడే అవగాహన అయిందాతనికి. అయితే చెట్టియారు ఈలాంటి ఉత్తరాలు అనంతలక్ష్మికీ పంపించి ఉంటాడు. ఆ బాలిక ఎంత బాధపడుతుందో? యేలాంటి విపరీతాభిప్రాయాలకు వచ్చిందో? ఎంతటి క్రూరుడండీ!

కుక్కకు పిచ్చి ఎక్కితే, ఊరకే కరుచుకుంటూ పోతుంది ప్రతి ప్రాణినీ. అందరికీ పిచ్చి ఎత్తుతుంది. ప్రాణాపాయం వస్తుంది. కుక్కకాటుకు చెప్పుదెబ్బ అన్నారు కాని, కాటువేసిన కుక్కకే చెప్పు దెబ్బలు తగిలిస్తే కరచినవారికి జబ్బు నిమ్మళిస్తుంది. ఆ చెప్పు పాతది, కుట్లు ఊడిపోయి, మేకులు పైకి వచ్చివున్న చెప్పయితే దెబ్బ తగిలించాలి. కొత్త చెప్పు అయితే దెబ్బలు తిన్నవాడికి గౌరవం. చెట్టిగారికి సరియయిన చెప్పు పెంటకుప్పలో నుంచి వెదకాలి.

కోనంగి ఆలోచించి ఉత్తరం ఒకటి అనంతలక్ష్మికి వ్రాస్తూ తనకు వచ్చిన ఉత్తరాలలో తన్ను దెప్పినవి మాత్రమే మతలబులు వ్రాసి తన ఉత్తరంలో పెట్టి పంపించాడు. ఆ మర్నాడు కోనంగికి అనంతలక్ష్మి కడనుంచి ఉత్తరం వచ్చింది.

రెండు ఉత్తరాలూ ఒకదాని తర్వాత ఒకటి మధ్యదారిలో ఒకదాని ప్రక్కనుండి ఒకటి వెళ్ళి ఉంటాయి.

ఏ ఉద్దేశంతో తాను అనంతలక్ష్మికి ఉత్తరం వ్రాసినాడో ఆ ఉద్దేశం తోనే అనంతలక్ష్మి తనకు ఉత్తరం వ్రాసింది! యిద్దరి ఉత్తరాలూ రహస్య టపాదారినే ప్రయాణాలు సాగించాయి.

ఆమె ఎంత చక్కగా వ్రాసింది! ఎంత ఉత్తమభావాలున్నాయి?

"ప్రాణకాంతా! మీకూ చెట్టిగారి ఉత్తరాలు కొన్ని అంది ఉండాలి. మిమ్మల్ని గూర్చి దూషిస్తూ, వినరాని అబద్ధాలు వ్రాస్తూ నాకు వ్రాశాడు. ఇద్దరు తారలచే మీకు వ్రాసినట్లు వ్రాయించి నాకు అందేటట్టు చేశాడు. నన్ను గురించి యెన్ని అబద్ధాలో మీకు వ్రాయించి ఉంటాడు, వ్రాసి ఉంటాడు. అవి మనజీవితంలో కలతలు పెట్టవు.

పోనీయండి ఆ చెట్టిని. వాడి పాపాన వాడేపోతాడు. నా స్నేహితురాండ్రందరూ మిమ్ము మరీ మరీ అడిగామని ఉత్తరాలు. నేను ఆంధ్రమహిళా ఖాదీసంఘంలో చేరాను. రోజూ ఖద్దరు నూలు వడుకుతున్నాను. ఖద్దరు బట్టలే కట్టుకుంటున్నాను.

మీరు యెప్పుడు వస్తారో నాకు తెలియదు. ఆర్డినెన్సు క్రింద వెళ్ళినారు. యుద్ధం ఆఖరువరకూ ఉంటారు కాబోలు. కమ్యూనిస్టులలో కొందరు ప్రభుత్వానికి దొరక్కుండగా పారిపోయారు. కొందరు జయిలులోంచి తప్పుకుపోయారు. ఇది వేళాకోళయుద్ధమా అని కొందరనుకొంటున్నారు. పోలండు పని అయింది. హాలెండు పతనం, బెల్జియం శరణు. చివరకు ఫ్రాంసు పూర్తిగా లోబడిపోయింది. క్రిందటి సంవత్సరం యివన్నీ జరిగాయి. డంకర్కు తరువాత ఇంగ్లండులో దిగుతాడేమోనని మనం భయపడ్డాము. ఇటలీ వెనుక దెబ్బకొట్టింది అని మీరు వాదించారు.

జర్మనీవారు ఇంగ్లండులో దిగలేరు అని మీరు వాదించారు జ్ఞాపకం ఉందా ఆత్మేశ్వరా! కాని ఆ సమయంలో భారతగాథ ఒకటి నాకు చెప్పారు. జ్ఞాపకం ఉందా? ఒకనాడు ద్రోణుడు దుర్యోధనునకు పరమాద్భుతమయిన మంత్రకవచం యిచ్చాడనీ, ఆ కవచం ధరించి దుర్యోధనుడు అర్జునునిపై తనరథం తోలించాడనీ, అప్పుడు అర్జునుడు యెన్ని బాణాలో దుర్యోధనునిపై వేశాడనీ, అవన్నీ వృథా అయిపోవడం చూసి, పార్థసారథి హేళన చేశాడనీ, అందుపై అర్జునుడు మంత్రకవచ ప్రభావమని తెలుపుతూ సర్వ కవచభేదిని అను అస్త్రం ప్రయోగించాడనీ, ఆ అస్త్రాన్ని శక్తివైచి అశ్వర్థామ దారిలోనే నరికివేశాడనీ, అప్పుడు అర్జునుడు కోపించి దుర్యోధనుని సూతునీ, గుఱ్ఱాలనూ చంపి, రథం చూర్ణంచేసి, పట్టిన విల్లల్లా ముక్కలుచేసి, నిరాయుధుణ్ణిచేసి వదలినాడనీ, అలా హిట్లరు ఇంగ్లీషువారిని జయించాలంటే, ఈజిప్టు, సుడాను, ఎరిట్రియా, సొమలీలాండు, పాలస్తీనా, ఇరాక్, ఇండియాలు పట్టుకోవాలనీ, కాని హిట్లరు వెనుక నెపోలియను చేసిన తెలివితక్కువే చేసి, రష్యామీద పడి నాశనం అవుతాడనీ అన్నారు.

మీ మాటలే అక్షరాలా నిజం అయ్యాయి. మొన్న జూన్ 23వ తేదీని జర్మనీ రష్యామీద విరుచుకుపడ్డాడు. ఇటలీ రుమేనియాలు యుద్ధం ప్రకటించాయి. ఇక ఇంగ్లీషువారి ఆనందం చూడండి. ఇంగ్లండులో దిగడం తప్పిపోయిందని అనుకుంటున్నారు. ఈ రోజు 24 ఈ నాటికే వేయిమైళ్ళ యుద్ధముఖంలో జర్మనీ రష్యాపైకి చొచ్చుకుపోతున్నాడు. పదిరోజులలో మాస్కోను పడతానంటున్నాడు హిట్లరు. ఈ విషయాలకు మీ డాక్టరుగారు ఏమంటారు?

ఇక్కడ పైన ఉన్న కమ్యూనిస్టులు జర్మనీపై మండిపోతున్నారు. కొందరు ప్రభుత్వం వారిని కలుసుకొని ఏదో రాయబారాలు సాగిస్తున్నారు.

ఇంక రాజకీయాలు అలా ఉంచండి. ఆత్మేశ్వరా! జూలై వస్తోంది. కాలేజీలో చేరనా వద్దా? మీరు దగ్గరలేక నాకు చదువుమీద ఇష్టం పోయింది. మీరు వచ్చునంతవరకు చదువు మానేసి కూర్చుంటాను. మదరాసు ఇల్లు మూసి, మన్నారుగుడి వెళ్ళమన్నారా? కడలూరులో ఒక యిల్లు అద్దెకు తీసుకొని అక్కడ కాపురం పెట్టమని మా అమ్మతో పోరుపెడుతున్నాను.

ప్రాణపతీ! మీరు కటకటాల వెనకాల ఉంటారా? సాయంకాలమే తాళాలు వేస్తారా? ఒక్కరూ ఉంటున్నారు? నేను వినాయగం ద్వారా పంపిన పరుపు మీకు జయిలు అధికారులు ఇచ్చారా? మళ్ళీ మాకు మీ దర్శనం వారం రోజులలో, వారం రోజులంటే 168 గంటలు.

168 గంటలంటే 10,080 నిమిషాలు. 10,080 నిమిషాలంటే 6,04,800 సెకండులు. ప్రతి సెకండూ ఒక యుగమయితే ఎన్ని ప్రళయాలు నా జీవితంలో వస్తాయో?

క్రిందటి సారి నన్ను ముట్టుకోడానికి యెంత చక్కని ఎత్తు వేశారండీ! ఈపట్టు నేనే మిమ్మల్ని ముట్టుకుంటాను చూస్తూ ఉండండి.

*ఒక్కదాన్నే ఇంటినంటీ,*
*ఒక్కదాన్నే దారివెంటా,*
*ఒక్కదాన్నే జగమునంతకురా*
*ఓ ప్రాణరాయా!*
*ఏడపోతివి ప్రథమయామానే?*
*ఒంటితీగా వీణమీటీ*
*ఒక్కరాగమె ఆలపించీ*
*ఒక్కపాటే పాడుతున్నారా*
*ఓ ప్రాణరాయా!*
*గానమంటే కలలు రావేరా?*

ఈ పాట వ్రాస్తున్నా ప్రాణపతీ! నేను రోజుకో పాట వ్రాస్తున్నా! అన్నీ మీ మీదే నా పాటలు. ఇవన్నీ అచ్చు వేయిద్దాము అనుకుంటున్నది అమ్మ. అలాని నాచేత యెన్నో పాటలు వ్రాయించాలని ఆలస్యంగా వస్తారా? మీరు వచ్చినా నా ఆనందంలో ఇంకా అద్భుతమైన పాటలు వ్రాయగలనండీ!

నిన్న రాత్రి వ్రాసిన పాట అది. ఇవాళ ఉదయం వ్రాసిన క్రింది పాట వినండి.

*ఈదూ ప్రాణము ఆత్మా*
*వేడుతున్నవి నాథా,*
*తోడితేవటే, కా*
*పాడవె దివ్యాంగినీ,*
*తోడి రాగిణీదేవీ!*

మీరు నా పాటలమీద మీ అభిప్రాయం ఇవ్వరూ?

ప్రేమతో
గాఢచుంబనాలతో
కౌగలింతలతో
మీ
అనంత."

## 9

**"అ**వును అనంతం! నువ్వు చెప్పింది. నిజం. ఉత్తమభావాల సంచరించే ప్రేమకు ప్రపంచంలో ఏదీ అడ్డంరాదు. అడ్డం వచ్చినా నాశనమయి పోతుంది, ఆ ప్రేమకు ప్రపంచానికి అభ్యుదయ పూర్వకమయిన మార్గం ఏది ఉందో అదే కనబడుతుంది. స్త్రీ పురుషుల సమ్యక్స్థితి వారిద్దరినీ ఒక సంపూర్ణ వ్యక్తిని చేస్తుంది. అలాంటి సంపూర్ణ వ్యక్తులుగాని లోకసేవ చేయలేరు.

"అనంతం! నేను డాక్టరుగారితో ఎప్పుడూ వాదిస్తూ అన్ని విషయాలూ గ్రహిస్తున్నాను. ఒంటిగా ఉన్నప్పుడల్లా వివిధాలోచనలలో వివిధ విషయాలు చర్చించుకుంటున్నాను. ఈ ప్రపంచంలో బీదవాడూ, బాధపడేవాడూ ఉండకూడదు. మనుష్యుడు, మనుష్యునికీ మనుష్యునికీ కల్పించిన తేడాలు అంతమయిపోవాలి. ప్రకృతో, భగవంతుడో, లేకపోతే యిద్దరో యిచ్చిన తేడాలు కూడా తగ్గించి, అనేక రీతుల నాశనంచేసి నమన్వయం చేయడానికి మనుష్యుడు ప్రయత్నం చేయాలి. అక్కడ స్త్రీ పురుషులకు మహదానందం వరమై వస్తుంది. కమ్యూనిస్టువాదనా, గాంధీవాదనా నమన్వయం చేసుకొని మనుష్యుడు తన నిత్యజీవితం దిద్దుకొన్ననాడు, లోకంలో అనేకమయిన హీనాసంతృప్తులు పోయి, ఉత్తమ సంతృప్తులు ఉద్భవిస్తాయి. అప్పుడే మానవజాతి పురోగమిస్తుంది.

ఏమిటీ వేదాంతమంతా అని నువ్వు అనుకోవచ్చును. నేను వేదాంతిని కాను. వట్టి కార్మికుణ్ణి. ఈ కార్మికవాదనే భగవద్గీతలో కర్మవాదన కాబోలు. నాకు తెలియదుసుమా!

ఇంక కమ్యూనిస్టు సిద్ధాంత ప్రకారం నన్ను గడబిడచేసేవి చాలా ఉన్నవి. డాక్టరుగారి వాదనలో ముఖ్యసూత్రాలు కొన్ని ఏమిటంటే: 1. మనుష్యుడే మనుష్యునికి అధికారి. ఇంక దేవుడనిగాని దెయ్యమనిగానికాదు. 2. యేది మనుష్యునికి ఉత్తమమో అదే నైతికము. 3. మనుష్యుని ఉత్తమస్థితికి ఏ మార్గము తక్కువ కర్చుతో, వేగంతో, విజయ నిశ్చయంతో, సరిగా తీసుకొని వెడుతుందో అదే సరియయిన మార్గం. అది హింసాత్మకంకానీ, అహింసాత్మకం కానీ!

ఈ మూడు సూత్రాలూ ముఖ్యంగా ప్రతి మనుష్యుడూ ఆచరణలో పెట్టవలసిన విధి అంటారు. ఈ మూడు సూత్రాలూ నేను ఒప్పుకొన్నాను. ఇవన్నీ గాంధీజీ లోకానికి ఉపదేశించిన సూత్రాలే!

ప్రపంచంలో కమ్యూనిస్టులూ, గాంధీవాదులూ, మధ్యనున్న అనేక వేల యితర వాదులూ యెవరి దారిని వారు వెడుతూ ఉంటే, ఏ మార్గం మంచిదో అదే తోస్తుంది అనే పద్ధతి ఒకటీ, మంచి మార్గం ఏదో నిర్ణయించిదాన్ని గురించి ప్రచారం చెయ్యాలనే మార్గం ఒకటీ ఉన్నాయి.

ఇవన్నీ ఆలోచిస్తూ నిన్న రాత్రి నా ఖయిదులో పండుకొని ఉన్నాను. ఆ సమయంలో ఈ రోజున కళలను గూర్చిన వాదనలన్నీ ఎదుట ప్రత్యక్షం అయ్యాయి ప్రాణదేవీ!

"కళకోసం కళ" అని ఒకరు అంటారు. ఇంకోవాదన చతుర్విధ పురుషార్థ ప్రయోజనం కళ అని. మరొకరు కళ నైతికము అని. వేరొకరు కళ దేశాభ్యుదయదాయకంగా ఉండి తీరాలి అని. ఇంకా ఒకరు ఒక్కదేశాభ్యుదయమే కాదు, సకల మానవాభ్యుదయ పూర్వకంగా ఉండాలి అని. మరి వేరే వాదన ఉంది. కళ అనేందుకు కొన్ని గుణాలు ఉండాలి. ఆ గుణాలుంటే తర్వాత ఆ కళకు ప్రయోజనం ఉన్నా సరే, లేకపోయినా సరే అంటారు.

ఆలోచించిన కొలదీ నాకు ఈ వాదనలవల్ల కొంత మతిపోయింది. ఈ విషయాలన్నీ పరిశీలనగా మనస్సుకు హత్తింప చేసుకొందామని, ఆయా వాదనలకు సంబంధించిన పుస్తకాలన్నీ తెప్పించామ నేనూ డాక్టరూను చదివాము. మేము ఇద్దరం హెూరాహెూరీ వాదించాము.

నా రాణీ! మా యిద్దరి వాదనలూ ఈ క్రింది సంభాణ రూపంగా ఇస్తాను. నువ్వు పూర్తిగా అర్థం చేసుకో.

**నేను:** కళకోసం కళ అంటే, నీలో కళ సృష్టించాలి అన్న ఆవేదన కలిగి, కళ సృష్టించడం, అంతేనా డాక్టర్?

**డాక్టర్:** అది అవునూ, కాదూ! కళ సృష్టించాలన్న ఆవేదన కలగకుండా, కళను ఎవ్వరూ సృష్టించలేరు. అది ఒకటి. రెండోది కళాప్రజ్ఞ కలిగి, సర్వకాలమూ సిద్ధహస్తుడై ఉన్న కళాకారుని, ఫలానా విషయం ఒక శిల్పం చెక్కమనీ, ఒక బొమ్మ వేయమనీ, ఒక పాట వ్రాయమనీ అంటే ఆ కళావేత్త అది సృష్టిస్తాడు.

**నేను:** రెండోది కళకోసం కళ కాదుగదా?

**డాక్టరు:** ఓయి వెర్రివాడా! కళకోసం కళ అంటే వట్టి ఆనందం కోసం కళ సృష్టించడం అన్నమాట! నువ్వు సృష్టించే కళ ఒక ప్రయోజనం ఆర్థించకుండా ఉద్భవిస్తుంది. అలా ఉద్భవించిన తర్వాత అది ఏదయినా ప్రయోజనం నిర్వర్తింపబడవచ్చు. దానికి ఓ ఉదాహరణ ఇస్తాను. ఒక కళావేత్త తనలో కలిగిన ఆనందంచేత ఒక పళ్ళగంప చిత్రాంచాడనుకో. ఆ బొమ్మ చాలా బాగుంది. అది వేసేటప్పుడు ఆ కళావేత్త హృదయంలో ఏ ప్రయోజనమూ లేదు. అదే కళకోసం కళ అంటారు. తర్వాత ఒక తోటల కంపెనీవారో, పళ్ళ కంపెనీవారో వారి వస్తువుల ప్రచారంకోసం ఆ బొమ్మ కొనుక్కొని ఉపయోగించా రనుకుందాం. అప్పుడది ఒక ప్రయోజనం సంపాదించుకుందన్నమాట.

**నేను:** వారెవా! అయితే నాయనా! ఆ కళ పనికిరాదని యెందుకు వాదిస్తావు బాబూ?

**డాక్టరు:** ఓయి పెద్దమనిషీ! ఆ కళ పనికిరాదని అనను. ఆ కళ వద్దనే నా వాదన.

**నేను:** కొంపలు ముంచావు బాబూ!

**డాక్టర్:** ముంచలేదు, తేల్చాను. కళ మనుష్యులలోని ఉత్తమశక్తి. మనుష్యుని శక్తులన్నీ మనుష్యుని అభ్యుదయంకోసం ఉపయోగించాలి. అలాంటిది అది ఉత్తమశక్తే అయితే ఇంకా ఎక్కువ ఉపయోగించాలి.

**నేను:** ఇంక వాడికి తిండి అక్కరలేదూ? అభ్యుదయంకోసం ఉపయోగిస్తూ తన జీవితం దుబ్బులపాలు చేసుకోవాలా?

**డాక్టర్:** ఎంత పిచ్చిమాట నీది?

**నేను:** నీది నచ్చేమాట కాబోలు!

అనంతలక్ష్మీ! ఈలా ప్రారంభం అయ్యాయి మా వాదనలు. ఇవన్నీ ఊరకే వాదించడం కాదు సుమీ! నువ్వు కళా విశారదవు కావాలి. కవయిత్రివి కావాలి. నేను ఏదైనా పరిశ్రమ ప్రారంభిస్తాను. నేను రంగుల పరిశ్రమ ప్రారంభిస్తాను. గోడల రంగులు, కలప సామాను రంగులు, నూనె రంగులు, బొమ్మలకు రంగులు, ఫోటోగ్రఫీ రంగులు, రంగులు రంగులు తయారు చేస్తాను. మదరాసులో స్థాపిస్తాను. ఈ రంగుల పరిశ్రమతోపాటు కుంచెల పరిశ్రమను కూడా ప్రారంభిస్తాను. అందులో పనిచేసే కార్మికులకు ఎన్నో అధికారాలు, హక్కులు ఇస్తాను. ఆ సంస్థను గాంధీతత్వమూ, కార్మికతత్వమూ రెండూ రంగరించి ఉద్భవింప చేస్తాను.

ఇంక నీ పని సంగీతమూ, కవిత్వమూ. నీ ఉత్కృష్ట సంగీత ప్రజ్ఞతోపాటు కవిత్వము వృద్ధిచేసుకుంటే, నీ నా దాంపత్యము ఈ కార్యములు నిర్వహింపగలిగిననాడు మన ఇద్దరి ప్రేమా సార్థకమౌతుంది ప్రియా!

*ప్రాణేశ్వరీ! ప్రేమా పరమావధి లోక సంగ్రహణము.*
*ఇరువురమూనూ చేయిచేయీ*
*ఉరుకుదా మటు కార్యరంగము*
*వెరపులేనీ బ్రతుకుదారిని*
*విజయమే మనకున్.*

"ఆత్మేశ్వరీ! ఈ మాట అన్నిటి వెనకా నీకై నా వాంఛ అవిచ్ఛిన్నమై, అద్భుతమై లోకాలనే స్పందింప చేస్తున్నది.

నీ గాఢ ప్రేమాభిలాషి
ప్రియ పతి
కోనంగి."

ఈ ఉత్తరం అనంతానికే అందింది.

## 10

ఈ ఉత్తరం వ్రాసిన మర్నాడే కోనంగి ఇంకో ఉత్తరం వ్రాశాడు.

కడలూరు జైలు

"ప్రియతమా!

ఇంతలో మనం ఏ జాతక ప్రభావంచేత విడిపోయాము? ప్రేమించిన వస్తువు నుండి బలవంతంగా విడిపోవడం హృదయాన్ని పిండివేసినట్లే ఆత్మేశ్వరీ! నేను నిన్ను విడిచి రాత్రింబవళ్ళు బాధపడుతున్నాను. ఈ ఆవేదన మహోత్తమ స్థితికి పోవాలి. లేక మనుష్యుణ్ణి అధోగతిపాలు చేస్తుంది. నా ప్రేమను నేను పవిత్ర గంగాప్రవాహంలా ఎంచుకుంటాను. నా ప్రేమ విధానము నాలో హత్తుకుపోయి నేనూ ఆమే ఒకటైపోయాము. నేను వేరు, నా అనంతలక్ష్మి వేరు అన్న భావం ఏనాడు మనం మన ప్రథమ సంశ్లేషతలో పెదవులు చుంబించుకున్నామో ఆనాడే పోయింది. నాలో లయమై పోయావు. ఆ వీరత్వం నాకు వేయి ఏనుగుల బలం ఇచ్చింది. ఆ బలం పట్టి ప్రాపంచిక స్వార్థంకోసం ఉపయోగించడం అల్పత్వమే అవుతుంది. ఆ బలం ప్రపంచంకోసం ఉపయోగించాలి.

"ప్రేమబలము అనంతం అనంతలక్ష్మీ! ఆ బలాన్ని ఉత్తమంగా ఉపయోగించాలి అని నేనంటే దాని అర్థం బ్రహ్మచర్యం ఆవలంబించాలి మనుష్యులంతా అని కాదు. బ్రహ్మచర్యం అంటే మన ఋషుల అభిప్రాయం భగవంతుని మార్గం అని. భగవంతుని మార్గం అంటే సర్వశక్తులు మానవ లోకానికి అభ్యుదయం చేకూర్చేటట్లు చేయాలని.

"భార్యాభర్తలు బిడ్డలు కనాలి వివాహం అనే సంస్థ ఉద్భవించడానికి కారణం బ్రహ్మచర్యమే. బిడ్డలు కనడం బ్రహ్మచర్యము భర్తగాని భార్యగాని మితిమీరి రతికోరడం, నూతన పురుషశక్తి స్త్రీ శక్తి విచ్చలవిడిగా ఉపయోగించడమే. అది బ్రహ్మచర్యంకాదు. ఆ విచ్చలవిడితనంలో లోక ద్రోహం ఉంది. భార్యాభర్తలు తమ జీవితం ఆనందమయం చేసుకొని తమ ప్రేమను తమ జీవిత పరమావధి చేసుకొని, ఆ ప్రేమ ఉత్తమపథ సంచారితము చేసి ఆకాశగంగా శక్తివంతంగా చేసిన నాడు స్త్రీ పురుషులు ఎలాంటి మహత్తర కార్యమయినా సులభంగా, ఉత్తమంగా నెరవేర్చగలరు.

ప్రాణపత్నీ! నువ్వు నా దేవతవు. నా అభయ భూమికవు. నేను కలలుగన్న దేవివి. చిన్ననాడు నాతో ఆటలాడుకొన్నావు. నిన్ను నాతో చదువుకున్న బాలురలో చూచాను.

నిన్ను నాకు విద్య చెప్పిన గురువులలో చూచాను. నన్ను కలిపివేసిన సంగీతంలో నిన్ను విన్నాను. నన్ను కదిలించి వేసిన కవిత్వంలో నిన్ను అనుభవించాను. గాంధీ మహాత్ముని బోధనలో నీ దేశికత్వం అనుభవించాను; మహాపురుషుల జీవితాలలో నీ నృత్యం చవిగొన్నాను. బీదల అరువులో నీ ఆవేదన విని దుఃఖించాను. రష్యాదేశ విజృంభణలో నీ ఆనందం చూచి అందులో లయమయిపోయాను దేవీ! నువ్వు ఎక్కడ ఉన్నావో అని వెదికాను.

"నాకు యవ్వనం వచ్చిన ప్రథమ దినాలలో, బాలికలు నాకు అప్సరసలై కనిపించే కాంక్షాపూరిత గడియలలో నువ్వు కనపడక తలవాల్చి ముందుకు సాగిపోయాను.

"నాకు పరీక్షలు పూర్తయి జీవితమార్గం వెదకుకొనే రోజులలో నిన్ను దూరాన చూస్తూ, నీ అడుగుల మంజుల కింకిణీరవాలు దూరాన వింటూ, ఎక్కడ? ఎక్కడ? అని వెదకినాను. ఆ మధురస్వనమే నన్ను నీ దగ్గరకు తీసుకొని వచ్చింది.

"దేవీ! పురుషుడు స్త్రీకీ, స్త్రీ పురుషునకూ ఉపాస్యదైవములు కావాలి. ఈ పూజే మనుష్యుని పశుత్వంలోంచి తప్పించి ఉత్తమ మానవుణ్ణి చేస్తుంది.

"వివాహం అంత పవిత్రమైనది కాబోలు! నిన్ను ప్రేమించి ప్రేమించి నీ స్థితి నా స్థితికన్న ఎక్కడో పైన ఉండడం తలచుకొని, తలచుకొని బాధపడి నిన్ను నా దేవిగా మాత్రం ఎంచి ఉండాలనుకొన్న నాకు నీ హస్తం పట్టి నిన్ను అగ్నిసాక్షిగా అర్ధదేహముగా ఏర్పాటు చేసుకోవడం నాకెంతో ఆనందం సమకూర్చింది. వివాహమాడి నీ చేయిబట్టి ఏడడుగులు నడిచి నిన్ను రాత్రి హృదయాన కదుముకొని ఇది నిజమా అని ఆశ్చర్యంలో మునిగి నా అదృష్టానికీ, నిన్ను చేపట్టగల నా ప్రజ్ఞకూ ఆనందపూర్ణుడనై పోయినాను.

"నాలోని ఆశయ దేవతా, నువ్వూ ఏకమైపోయారు. లోక ప్రేమ చరిత్రలో మన ప్రేమ ఒక ప్రత్యేక ప్రకరణం కాదూ లక్ష్మీ!

"నువ్వు లక్ష్మివే! నా హృదయమే కమలము. నా జీవితమే కమలము. అందులో నువ్వు కమలాలయవై ఉంటావు. నా శక్తి, నా విద్య, నా హృదయము, నా మెదడు నాలుగు ఏనుగులై, నిన్ను పూర్ణకుంభాలలో అమృతం కురిపిస్తూ పూజిస్తాయి.

"ఓ దివ్యనవమోహనాంగీ, నువ్వే నా చేయి పట్టుకొని ఈ బ్రతుకు దారులలో నడిపించుకుపో. ఓ మహామధుర పరిమళాంగీ! అద్భుత సౌందర్య రేఖా సమన్విత జగన్మోహినీ! నీ ప్రేమచే నేను పవిత్రుణ్ణి. నిన్ను ప్రేమించడంచేత శక్తిమంతుణ్ణయి నీతో ఈ విశాల జగత్తులో నడుస్తాను.

"మనం ఇద్దరము మానవసేవాశయ పవిత్ర క్షేత్రానికి పోదాం!

ఇట్లు
నీ పదపద్మాలు
హృదయాన ధరించు
కోనంగి."

ఈ ఉత్తరం చదువుతూ అనంతలక్ష్మి కన్నుల నీరు నింపుకొని సోఫాలో కూలిపోయింది.

తన ప్రభువు ఎంతటి ఉదారభావాలతో తన్ను ముంచెత్తుతున్నాడు.

అవును. వారు చెప్పినట్లు ఆయన్ను అర్ధాంధకారంలో చూచిననాడే గుండె గుభిల్లుమంది. ఏనాడో చూచిన పురుషుడై, ఎన్ని జన్మాల నుండో గురువై, తన ఆశయమూర్తిగా కలలుకన్న పురుషోత్తముడై తోచినారు.

ఆమె ఆ ఉత్తరం రెండు మూడుసార్లు చదువుకుంది. తాను భర్తపై వ్రాసుకొన్న పాట గొంతెత్తి కచ్చేరి చేస్తునట్టు పాడుకొన ప్రారంభించింది.

*"ఎవరోయి నువ్వా*
*ఎదర చేరావూ?*
*ఎవరోయి నీ పాట*
*భువనాలు ఎగురుతూ*
*నా బ్రతుకులో కలిసి*
*నన్నె పాటను చేసె?*
*ఎవరోయి నీ నవ్వు*
*ఏడు లోకాలలో*
*ఆనంద ఝురులుగా*
*ఐక్యమయినది నన్ను?*
*ఎవరోయి నీ చూపు*
*ఇనుని కిరణాలవుతు*
*విశ్వతేజస్సవుతు*
*వెలిగించె నా బ్రతుకు*

## దశమ పథం

# యుద్ధ ప్రళయం

హిట్లర్ రష్యామీద విరుచుకుపడి ముందుకు సాగిపోతూ ఉన్నాడు.

రష్యా ఇంగ్లండులు ఒకదాని కొకటి సహాయం చేసుకొనడానికీ, జర్మనీ సంపూర్ణంగా ఓడిపోయి కాళ్ళమీద పడేటంతవరకూ ఏ విధమయిన సంధీ జర్మనీతో చేసుకొనకుండా ఉండడానికీ, ఇద్దరూ కలిసే ఏపనైనా చేయడానికి, ఒకరికి తెలియకుండా ఒకరు ఏవిధమైన సంధీ ఎవ్వరితోనూ చేసుకొనకుండా ఉండడానికీ సమాధానానికి వచ్చారు.

రష్యా స్నేహంనమ్మి తాను పడమటి రాజ్యాలలో యుద్ధం చేస్తూ ఉంటే, రష్యా బెసరేబియా ఆక్రమించి, యుగోస్లేవియా మద్దతు చేసి. ఎస్థోనియా, లిథుయోనియాలను ఆక్రమించి తనమీద భయంకర ద్రోహం చేసిందనీ, తాను ఇతర దేశాలతో యుద్ధం చేసే ఈ సమయంలో తన వెనుకనుంచి విడుచుకుపడి జర్మనీని నాశనంచేయ చూస్తూందనీ, అసలు పోలందు యుద్ధంలోనే నమ్మకద్రోహం చేసి పోలందును సగం ఆక్రమించుకుందనీ, అలాంటి ద్రోహం చేసినా కూడా తాను ఊరకున్నాననీ హిట్లర్ ప్రకటించాడు.

జర్మనీ సైన్యాలు పోలందును ఆక్రమించాయి. లిథుయోనియా, ఎస్థోనియాలను ఆక్రమించాయి స్మాలెంస్కు అయిపోయింది. మాస్కోమీదకు చొచ్చుకుపోతున్నాయి.

రష్యామీదకు యెప్పుడు జర్మనీ విరుచుకుపడిందో, ఆ మరుక్షణమే కమ్యూనిస్టుల కందరకూ జర్మనీమీద ప్రళయరుద్రుని కోపం వచ్చింది. కమ్యూనిస్టుపార్టీ నాయకులు పైన ఉన్నవారు ఈ యుద్ధం ప్రజాయుద్ధం అన్నారు. 'ప్రజాయుద్ధం' అనే వారపత్రిక

పెట్ట సంకల్పించారు. ప్రపంచాని కంతకూ ముప్పుతెచ్చే జర్మనీ ముందు నాశనమై పోవాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వానికి సర్వసహాయం చేస్తామన్నారు.

ఆ వెంటనే భారతీయ కేంద్ర ప్రభుత్వంవారు కమ్యూనిస్టులను విడుదలచేయ తీర్మానించుకొన్నారు. కడలూరు జిల్లా జైలు సూపరెంటెండెంటు డాక్టరు రెడ్డిగారినీ, కోనంగిరావుగారి జూలై 14-వ తారీకు ఉదయం తన ఆఫీసులోకి పిలిచి, "మీరు ఇద్దరూ, మీ కమ్యూనిస్టుపార్టీ వారితో ఏకీభవించి యుద్ధ విషయంలో ప్రభుత్వంవారికి సర్వ సహాయాలూ చేస్తారా?" అని అడిగాడు. ఆయన కమ్యూనిస్టుపార్టీ నాయకుల ఉత్తరాలు రెడ్డిగారికీ, కోనంగిరావుగారికీ చూపించారు. అందుపై రెడ్డిగారు తమ మాట్లాడుతూ తామెప్పుడూ ప్రభుత్వాన్ని వ్యతిరేకించలేదనీ, తమకా ఉద్దేశమే లేదనీ, ప్రభుత్వం ఒప్పుకుంటే తాను ప్రభుత్వానికి సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాననీ, కోనంగిరావుగారు అసలు రాజకీయాలలో లేరనీ, ఉద్యోగార్థమైవచ్చి అందుకే ఎదురు చూస్తున్న యువకుడనీ, అతని వివాహంనాడే అరెస్టు చేసి తీసుకువచ్చారనీ చెప్పినాడు.

జయిలు సూపరింటెండెంటుకు వీరిద్దరినీ, వీరితోపాటు ఖయిదులో ఉన్న ఇంకా కొందరు దక్షిణాది కమ్యూనిస్టులను విడుదల చేయవలసిందనీ, విడుదలయ్యే వారితో మాట్లాడి వారి భాషలు కనుక్కొని, వారిలో పైకి ఒక రకంగా, లోన ఒక రకంగా మాట్లాడేవారిని కనిపెట్టి వారి విషయం ఇనస్పెక్టరు జనరల్ ఆఫ్ ప్రిజన్స్‌గారికి తెలియజేయవలసిందని ప్రభుత్వపు తాఖీదులు వచ్చాయి.

అందుచేతనే విడుదల ముందు అధికారి ఈ రకంగా మాట్లాడినాడు.

వెంటనే వారిని తమ తమ సామానులు సర్దుకోమన్నారు. కోనంగిరావుగారూ, డాక్టరు రెడ్డిగారూ జయిలులో స్నేహం చేసిన వారందరి సెలవు పుచ్చుకొని ఈవలికి వచ్చారు.

కోనంగికి కన్నుల నీరు తిరిగింది.

డాక్టరుగారూ, కోనంగిరావుగారూ, ఆ ఊళ్ళో భోజనం చేసి రాత్రి రైలెక్కి ఉదయానికి మదరాసు చేరారు. అదివరకే ఫలానా బండిలో వస్తున్నామని జయలక్ష్మికి, అర్జంటు టెలిగ్రాం యివ్వడంవల్ల అది రాత్రే అందింది. ఇంక జయలక్ష్మికీ, అనంతలక్ష్మికీ కలిగిన ఆనందం ఇంతింతని కాదు. కన్నీళ్ళు కన్నీళ్ళలో నవ్వులు, అనంతలక్ష్మి నాట్యం చేస్తూ లోపల "వస్తాడే మా బావ!" అనే పాట పాడుకుంది. ఇద్దరూ ఏదో ఇల్లంతా సర్దడం. ఊరకే ఆటూ తిరగడం.

అందరూ చేరి కబుర్లు చెప్పుకుంటూ అతిసంతోషంగా కాలం వెళ్ళబుచ్చుతున్నారు. అనంతలక్ష్మికి ఏమీ తోచలేదు. కాలం జరగదు. కారు వేసుకొని ఇద్దరు ముగ్గురు స్నేహితురాండ్ర ఇండ్లకుపోయి. వాళ్ళను గట్టిగా కౌగలించుకొని "వస్తున్నారు! వారు వస్తున్నారు! కోనంగిరావుగారు వస్తున్నారు! నిన్ననే విడుదలై వస్తున్నారు. యుద్ధము మూలాన రైళ్ళు లేక రాత్రి రైలుకు బయలుదేరి వస్తున్నారు. ప్రొద్దునకే వస్తారు!" అని చెప్పింది. వాళ్ళు ముగ్గురూ అంబుజం, పార్వతీ, అలమేలూ అందరూ ఆ రాత్రికే అనంతం ఇంటికి వచ్చారు.

ఎవ్వరికీ నిద్రపట్టదు. అందరూ అనంతలక్ష్మిని వేశాకోళాలతో వేపేశారు.

**పార్వతి:** ఇక అనంతం మనతో మాట్లాడుతుందా?

**అలమేలు:** ఎందుకు మాట్లాడుతుంది! మాట్లాడేందుకు లక్షస్నేహితురాళ్ళ ముద్ద వస్తున్నాడుగా!

**అంబుజం:** కోటి స్నేహితురాళ్ళు ముద్దకట్టినా మద్రాసంత లావవడానికి అసలు ఆనందం ఏమి ఇవ్వగలరే!

**పార్వతి:** ఏమిటే ఆ ఆనందం?

**అంబుజం:** అనందం సంగతి అనంతానికే తెలియాలి? మనకా విషయాలలో ఏమి అనుభవం ఉందే?

**అనంతం:** మిమల్ని ఆ అనుభవం సంపాదించు కోవద్దన్నాన్నా? ఆ అనుభవం మీకు సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నారు ముగ్గురు.

**పార్వతి:** ఎవరు బాబు వాళ్ళు?

**అనంతం:** ఈపాటికి పుట్టకుండా ఉంటారా వాళ్ళు?

**అలమేలు:** వాళ్ళు చిన్నబిడ్డలు కాబోలు తల్లీ!

**అనంతం:** ఏమో, మీ ముగ్గురి విషయమూ చంద్రహాస నాటకంలా అవుతుందేమో?

**పార్వతి:** ఏం కులుకమ్మా! ఓహెూ పాడవే పాట! వాహినీ వారి పుణ్యమా అని "వచ్చాదే నా మొగుడూ!" పాట పాడేయి.

**అంబుజం:** ఆ పాట "వచ్చాడే మా బావ !" అన్నదే.

**పార్వతి:** బావైతేనేం, మొగుడైతేనేం, మొగుణ్ణి బావా అని పిలువకూడదా?

**అనంతం:** పార్వతి తన మొగుణ్ణి "బావా" అని పిలుస్తుంది. అంబుజం "మొగుడా" అని పిలుస్తుంది.

**అలమేలు:** అనంతం "గురువుగారూ!" అని పిలవడం నేను విన్నాలెండ్రా!

**పార్వతి:** అందరికీ చదువు చెప్పే గురువే భర్త అవడానికి సాధ్యం ఎల్లా చెప్పండీ!

**అనంతం:** అందుకనే "మొగుడా' అని పిలుస్తానన్నానుగా?

**పార్వతి:** నా కిష్టమే! ప్రియ 'హబ్బీ' అంటాను వటీరావు మల్లే! కాదు, కాంతం మల్లే "ఇదిగో చూడండి" అంటాను.

**అనంతం:** ఆ పుస్తకాలన్నీ నేనూ చదివానోయ్!

**అలమేలు:** నేను చదవలేదు. నాకు తెలుగు రాదుగా!

**అంబుజం:** నేను మాత్రం చదివానా!

**అనంతం:** మీ ఖర్మ. "నాయడుబావా!" అను. అతడు "మఘవ మస్తక మకుట మాణిక్య రాజ్ఞీ!" అంటాడు.

**పార్వతి:** లేదూ, సుందరీ! అని పిలుస్తాడు నన్ను!

**అనంతం:** నువ్వు "నందా!" అని పిలు.

**అంబుజం:** మీ భాష నాకర్థం అవటం లేదర్రా!

**పార్వతి:** నేను లాటిను మాట్లాడడంలేదు.

**అనంతం:** నేను హీబ్రూలో జవాబు చెప్పడం లేదు.

**అంబుజం,**

**అనంతం:** తప్పకుండా మీ ఇద్దరూ నీగ్రో భాష మాత్రం మాట్లాడుతున్నారు.

* * * *

చెట్టిగారికి కోనంగి, డాక్టరు రెడ్డి విడుదలై వస్తున్నారని తెలిసింది. ఆ రోజున అతని కోపం మిన్ను ముట్టింది. శుద్ధ అరవంలో ప్రభుత్వాన్నీ, కమ్యూనిస్టులనూ, రష్యానూ బండబూతులు తిట్టేశాడు. తన అనుయాయు లందరూ చుట్టూ ముగి ఉండగా, ఇటూ అటూ పచార్లు చేస్తూ నిప్పులు కక్కుతూ, ఖడ్గరోముని గొంతెత్తి అరిచేశాడు. "వెధవ రష్యా ఎందుకు జర్మనీతో విరోధం పెట్టుకోవాలి? జర్మనీదాన్ని తగలవేసి, నాశనం చెయ్యాలి! కమ్యూనిస్టులు నాశనం అయిపోవాలి. గుండాలందరూ కమ్యూనిస్టులు. జర్మనీ ఈ కమ్యూనిస్టు రాక్షసుల్ని పిండి పిండి చేస్తుంది. చచ్చు బ్రిటిషు ప్రభుత్వం ఏం చేయగలదు? భాగ్యవంతుల పిల్లల్ని తగుల్కొనే ముండాకొడులంతా కమ్యూనిస్టులా? మళ్ళీ సినిమాలా వీళ్ళకు? పైత్తెకారి పయ్యంగళ్, నాయీగళ్."

అతడు కోనంగినన్నా జయిలులో యుద్ధం ఆఖరు అయ్యేవరకూ ఉండేటట్లు చేయడానికి ప్రయత్నించాడు. కాని ఎందుకో ప్రభుత్వాధికారులు అది పెడచెవిని పెట్టినారు. అందుకు కారణం ఏమై ఉండునా అని అతడు ఆలోచించాడు. తన స్నేహితుడే, తన డబ్బు రుచి చూచిన ఒక పోలీసు ముఖ్యాధికారి, కొంచెం యెదురు తిరిగి తన్నే సన్నగా చీవాట్లు పెట్టినాడు.

## (2)

ఎగ్మూర్ స్టేషను వస్తోంది అనగానే కోనంగి కూర్చోలేకపోయినాడు, నుంచోలేక పోయినాడు. కంపార్టుమెంటు అంతా కాలుకాలిన పిల్లిలా తిరుగుతున్నారు. యేమీ తోచదు. డాక్టరు చూచాడు, చూచాడు చిరునవ్వు నవ్వుతూ.

"కాస్త కంగారుపడితే ఎగ్మూరు స్టేషన్ త్వరగా వస్తుందనే నీ ఉద్దేశం?" అన్నాడు.

"రైలు కొంచెం వేగంగా వెడుతుందని ఉద్దేశం డాబుదొరా?"

"డాబుదొరంటే ఏడిసినట్లే ఉంది."

"డాబుగా ఉంటే ఏడిసినట్లా? 'డాక్టరు' తెలుగులో 'డాకటరు' 'డాగతరు' 'డాగుదొర' అవుతుంది. 'డాదు' అంటే ఇంగ్లీషులో తప్పు అర్థం వస్తుంది కాబట్టి 'డాబుదొర' అయింది.

"ఏమి సైకాలజీ అండీ?"

"అది లాల్జీ గోవిందదాసుగారు కాదుగదా పొరపాటున?"

"లాల్జీ గోవిందదాసుగారి పూర్తి చరిత్ర నాకు తెలియదుగాని, తమరు ప్రేమజీ పిచ్చిజీగారులా ఉన్నారు."

"ఒకరు ప్రేమ్‌జీ అవడం మాటలా ఏమిటోయి? నీ బోటి హెూటలు జాతివాళ్ళకు ఏం తెలుస్తుంది?"

"హెూటలు జాతి వాళ్ళేమిటి?"

జీవితం అంతా హెూటళ్ళలో తినేవాళ్ళుంటారు. ఎరుగుదువా? వాళ్ళకు ఇల్లూ, వాకిలీ, భార్య, బిడ్డలు భావం ఉండదు. వాళ్ళు మనుష్యులు వెనక్కిపోవాలి అని వాదించే రకంవాళ్ళు. అంటే పశువులు, సరీసృపాలు, పురుగులు కావాలి అని వాదించే జాతి వాళ్ళు."

"ఏమిటా కసి నీకు? మనుష్యుని ప్రథమస్థితి ఎలాంటిదో ఉత్తమస్థితీ అలాగే ఉన్నట్లు కనబడుతుంది. పురోగతి వర్తులాకారంగా ఉండి, చుట్టలు చుట్టులుగా పైకి పోతుంది. కోతీ మనుష్యుడూ ఒకటే పోలిక చాలా వాటిల్లో."

"అదో వాదన. నా ఉద్దేశం పురోగతి వర్తులాకారం కాదనీ. ఆకాశంలోకి వెడితే తిరిగి తిరిగి మొదటి పోలికలు రావు. ప్రగతి పైకి ఉంటుంది. తమ జీవితం ఒక ప్రపంచగోళం అని అనుకున్ననాడు తిరిగి తిరిగి బయలుదేరిన చోటికే వస్తావు. ఇంక సోషలిజం ఎందుకు? సామ్యవాద మెందుకు? నువ్వు గడిచిన పథం మళ్ళీరాదు అని తెలిసికొని వెళ్ళితే ఎప్పుడూ ముందుకే విశ్వంలో. జీవితం ఒక భూగోళం కాదయ్యా!"

యూరపులో ఇంగ్లీషువారూ, ఇంగ్లండులో జర్మనులూ బాంబులు వేస్తున్నారు. పట్టణాలు నాశనమైపోతున్నాయి. ప్రజలు దూదిపింజలై ఎగిరిపోతున్నారు.

రైలు అతివేగంతో మీనంబాకం దాటింది. ఈ పక్కా ఆ పక్కా చెట్లూ చేమలూ, టెలిగ్రాఫ్ స్థంభాలూ అతివేగంగా వెళ్ళిపోతున్నాయి.

కోనంగి ఒక సిగరెట్టు వెలిగించాడు. లోగొంతుకతో తాను సినిమాలో పాడిన ఓ పాట పాడుకొంటూ చూడని చూపులతో కిటికీలోంచి సర్వప్రపంచమూ చూస్తున్నాడు.

*"వెళ్ళుము రా ప్రియమూర్తీ!*
*వెళ్ళుము రా!*
*వెళ్ళుము నీవూ వేగపు నడకల*
*భళ్ళున తూర్పున తెల్లని రేకలు*
*తోచెను రా ప్రియమూర్తీ!*
*వెళ్ళుము రా!*
*కన్య బాలికా కలకంఠములో*
*గానామృతములు వానలు`కురిసెను*
*అమృతమూర్తిర నీ చేడియ*
*వెళ్ళుము రా!"*

**డాక్టరు:** ఆ పాటంటే నాకు కోపం.
**కోనంగి:** అయితే నా మీదా కోపమేనా?
**డాక్టరు:** నీమీదెందుకు?

కోనంగి డాక్టరు ఎదురు గుండా నిలుచున్నాడు.

"చూడబ్బాయి, నేనూ నా ప్రియురాలికోసమే తహతహలాడుతూ వెడుతున్నానుగా?"

"అయితే మాత్రం నీమీద కోపం ఎందుకు స్వామీ?"

"ఆ పాట నాకూ వర్తిస్తుందిగా!"

"అందుకనే ఆ పాటమీద కోపం నాకు."

"నయమే! నీబోటి ఓ పెద్దమనిషి తన మొగంమీద కోపం వచ్చినప్పుడల్లా, ఎదురుగుండా ఉన్న అద్దం బద్దలుకొడుతూ ఉండేవాడట."

"కాబోలు. అతి తెలివైనవాడే! అలాంటి కవిత్వంమీద కోపం నాకు."

"ప్రేమకవిత్వం వట్టి ఎస్కేపిస్టు కవిత్వం అంటావు."

"కాదా మరి?"

"దేశంమీద కవిత్వం? సామ్యవాదంమీద కవిత్వం? కూలీలమీద కవిత్వం?"

"అది నిజమయిన కవిత్వం! పారిపోని కవిత్వం!"

"నీకు దేశ ప్రేమ పారిపోనిదా? స్త్రీపై ప్రేమ పారిపోయేది గదా? గోధుమలు తింటే వేరా? అన్నం తింటే వేరా?"

"స్త్రీ ప్రేమ స్వార్థం. దేశప్రేమ పరమార్థం."

"దేశ ప్రేమలో తాను ఉండడు? తనకు మాత్రం స్వరాజ్యం రాదు? ఓహోహోహో!"

రైలు గిండీ దాటింది. సైదాపేట దాటింది. త్యాగరాజనగరం దాటింది.

కోనంగి పకపక నవ్వుతూ డాక్టరు భుజంతట్టి "నువ్వు వట్టి ఉండు కవిత్వం వ్రాయి. నేను పారిపోయే కవిత్వం వ్రాస్తా."

రైలు కోడంబాకం దాటింది.

చెట్‌పట్ దాటింది.

మాట లేకుండా ప్లాట్‌ఫారం వచ్చేవైపు కిటికిలోంచి కోనంగి తొంగి చూస్తున్నాడు.

## 3

రైలు ప్లాటుఫారంమీద జయలక్ష్మి. అనంతలక్ష్మి, ఆమె స్నేహితురాండ్రు, సేవకురాండ్రు, వినాయగంపిళ్ళై, అతని ఇద్దరి స్నేహితులు, ఆనందంనాయుడు, అతని కుటుంబం, అందరూ తిరువనంతశయనం ఎక్స్‌ప్రెస్ బండికి సిద్ధంగా ఉన్నారు. బండి ఆగింది. కోనంగి బండిలో నుంచి ఉరికాడు. రెండు ఆంగలలో కోనంగి అనంతలక్ష్మి దగ్గరకు వెళ్ళాడు.

"అనంతా!"

"గురువుగారూ!" అస్పష్టంగా దగ్గుత్తికతో అనంతలక్ష్మి అన్నది.

ఇద్దరి కళ్ళూ మిలమిలలాడిపోయాయి. మోములలో ఏదో పరమ పవిత్రకాంతులు చంద్రికలై ప్రసరించినవి. ఒకరి నొకరు సర్వలోకమూ మరచి చూచుకొన్నారు. అందరూ కోనంగివయిపే చూపులు.

అయిదు నిమిషాలు వారిద్దరూ ఒకటిగా!

కోనంగి అనంతలక్ష్మి స్నేహితురాండ్రను అందరినీ అతి సంతోషంతో పలుకరించాడు. అత్తగారి దగ్గరకు వెళ్ళి అత్తగారికి సమస్కరించి "అత్తయ్యగారూ!" అన్నాడు. జయలక్ష్మి కన్నుల ఆనందంతో రంగరించిన కన్నీళ్ళు తిరిగినవి. కోనంగి వెంటనే వినాయగంపిళ్ళ వాళ్ళ దగ్గరకి పోయి అందరినీ చేతులు పట్టుకొని గట్టిగా నొక్కినాడు. ఆనందంనాయుడు దగ్గరకు వెళ్ళి కోనంగి "ఏమండీ బావగారూ, అంతా క్షేమమా?" అన్నాడు. పనివాళ్ళ నందరినీ పలుకరించాడు. ఇలా మాట్లాడుతూ కారు దగ్గరకు వెడదామని బయలుదేరే ముందు సారా ప్లాట్‌ఫారం దగ్గరకు గబగబా పరుగెత్తుకొని వచ్చింది.

"హలో కోనంగిరావ్" ఆమె పలుకరిస్తూ కోనంగి దగ్గరకు వచ్చేటప్పటికి కోనంగి "హలో, సారా! బాగున్నవా?" అని ఆమెకు కరస్పర్శ చేశాడు, సారా పకపక నవ్వుతూ, యిదిగో మీ ఆవిడ ముఖం ఏం ప్రపుల్లమైపోయిందో చూసుకో. ఏమి నీలో చూచి మీ ఆవిడ యింత ముచ్చటపడి పోతోంది?" అన్నది.

"నేను లోకైక సుందరుణనిన్నీ, ఒక చిన్న గొప్ప నెపోలియన్ లాంటివాణ్ణనిన్నీ అనుకొని యీ వెర్రిబాగుల పిల్ల ఆనందంచేత ఆకాశం అంటుతోంది" అని అన్నాడు కోనంగి.

అవతల డాక్టర్ రెడ్డికోసం కమ్యూనిస్టు నాయకులు కొందరు, ఆయన చుట్టాలు కొందరు స్టేషనులోనికి వచ్చి ఉన్నారు. వారంతా డాక్టరుగారితో అనేక విషయాలు

ముచ్చటించుతూ నిలుచున్నారు. వారితో మాట్లాడుతూనే, డాక్టరు రెడ్డి కోనంగి, ఆనందము; అనంతలక్ష్మి అందరినీ చూస్తూ చిరునవ్వు నవ్వుకొన్నాడు.

కోనంగి 'రెండడుగుల్లో డాక్టరు రెడ్డి దగ్గిరకు వెళ్ళి అక్కడ వుండే వారందరికీ నమస్కారాలు చేసి రెడ్డిని తన వాళ్లున్న చోటికి లాక్కొచ్చాడు.

అనంతలక్ష్మి, జయలక్ష్మి మొదలగు వారందరు డాక్టరు రెడ్డిగారికి నమస్కారాలు చేశారు, జయలక్ష్మి "డాక్టరుగారు! మీరూ కోనంగిరావుగారూ యిద్దరూ చిక్కేరండి ఎలాగైనా జయిలు.... –" అంది.

**డాక్టరు:** (నవ్వుతూ) మనం యివతల ఉంటే అనవసరంగా తిని కొవ్వులు పెంచుకుంటాం. జైల్లో అవసరమయిన తిండీ, ఒళ్ళు దిట్టంగా గట్టిపడడం, మంచి ఆరోగ్యం.

**కోనంగి:** ఇక యిక్కడ నుంచి ఎవరికైనా జబ్బుచేస్తే, మా డాక్టరు మూడు మోతాదులు జైలునివాసం మందిస్తాడు గావలెను?

**సారా:** ఓయి భగవంతుడా. అంత చేదుమందు నాకు మాత్రం చీటీ వ్రాసివ్వకండి డాక్టరుగారూ. నేను మాత్రం కొవ్వు జబ్బు తెప్పించుకొదలచలేదు.

అనంతలక్ష్మి, ఆమె స్నేహితురాండ్రు అంతా నవ్వారు. కబుర్లు చెప్పుకుంటూ అందరూ, టిక్కెట్టు కలెక్టరుకు టిక్కెట్లు యిచ్చి వంతెనమీద నుండి కారుల దగ్గిరకు వచ్చారు. డాక్టరు రెడ్డిగారు అందరి దగ్గర సెలవు తీసుకొని, తన స్నేహితులతో కలసి కారుమీద యింటికి వెళ్ళి పోయాడు.

కోనంగి, అనంతలక్ష్మి, జయలక్ష్మి మొదలయినవారంతా వాళ్ళకార్లలోనూ, వాళ్ళ టాక్సీలలోనూ యింటికి వచ్చారు. రాగానే జయలక్ష్మి లోపలికి పరుగెత్తుకు వెళ్ళి తాను సిద్ధంచేసి వుంచిన దృష్టిదోష పరిహారపు వస్తువులు తీసుకువచ్చి అనంతలక్ష్మికి, కోనంగికి దృష్టితీసి లోపలికి వెళ్ళి పోయింది.

సారా, పార్వతి, అంబుజమూ, అలమేలూ అందరూ హాలులో సోఫాలమీద కూర్చొని కబుర్లు సాగించారు. కోనంగి, అనంతలక్ష్ములు వారిగదిలోకి వెళ్ళారు.

గదిలోకి వెళ్ళడమేమిటి, కోనంగి అనంతలక్ష్మిని తన హృదయానికి అదుముకొని తన సర్వస్వము పొదివికొన్న గాఢ చుంబనములో కరగి పోయినాడు.

"అనంతా!"

అనంతలక్ష్మి ఏమీ మాటలాడలేకపోయింది. ఆమె నవ్వూ, కన్నీళ్ళూ, ఆనందమూ, ఏదో పరమశ్రుతి రూపమై అతని జీవితము ఆణువు అణువునా నిండిపోయినాయి.

అతని కన్నుల ఆనంద బిందువులు తిరిగి అతని చెక్కుల ప్రవహించినవి. అతడు మాటాడలేక అలాగే మళ్ళీ మళ్ళీ అనంతలక్ష్మిని హృదయానికి అదుముకొన్నాడు. అతడక్కడ వున్న సోఫాకుర్చీలో కూర్చుండి, అనంతలక్ష్మిని తన ఒళ్ళో కూర్చుండచెట్టుకొని హృదయాని కదుముకొన్నాడు. ఆమె అతని మెడచుట్టు చేతులు పెనవేసి అతనిలో ఒదిగి పోయింది.

అయిదు నిమిషాలు, పది నిమిషాలు, ఇరవై నిమిషాలు వారు మాట్లాడలేక పోయినారు. ఒక్క హృదయమై, ఒక్క మనస్సై, ఒక్క ఆనందమై, ఒకరై అతి వియోగానంతర సమయోత్తమ పునస్సమాగమ ప్రపంచాద్భుత సంఘటన ప్రేమీ ప్రేమిక చరిత్రలో కలిసిపోయినారు.

అనంతలక్ష్మి చెలులందరూ చల్లగా ఎవరి యిండ్లకు వారు వెళ్ళి పోయినారు. జయలక్ష్మి అల్లునికి రకరకాల వంటలు అన్నీ సిద్ధంచేస్తున్నది. ఆ మరునాడు కూతురూ,

అల్లుడూ కలసి సత్యనారాయణవ్రతము చేసుకొన డానికి కావలసిన సరంజాములు చేస్తూ ఉన్నది.

మేడంతా కలకలలాడిపోతూ ఉన్నది. జయలక్ష్మి, అనంతలక్ష్మి గది గుమ్మం దగ్గరకు వచ్చి "అమ్మిణీ! అల్లుడుగారికి స్నానానికి ఏర్పాటయినది" అని తెలియపర్చెను,

సోఫా కుర్చీమీద కూర్చున్న కోనంగీ, అతని ఒడిలో ఒరిగి ఉన్న అనంతలక్ష్మీ ఒకరి కౌగలింతలో ఒకరు కరిగిపోతూ, చుంబన మహాంబుధిలో మునిగిపోయి ఆ ఇద్దరూ ఉలిక్కిపడి లేచినారు. కోనంగి "వస్తున్నాను అత్తగారూ" అని ప్రతివచనంగా కేక వేసి అనంతలక్ష్మిని ఇంకొక సారి దీర్ఘ చుంబనము వరం పొందినాడు. ఇద్దరూ లేచినారు.

స్నానం ఒనర్చి కోనంగి శుభ్రవస్త్రాలు ధరించి హాలులో కూర్చుండి తన్ను చూడడానికి వచ్చిన అయ్యంగారు బావగారితో, ఇతర బంధుగులతో కబుర్లు చెప్పుకుంటూ, వీళ్ళింకా త్వరగా వెడితే బాగుండిపోనురా అనుకుంటూ కాలం గడిపాడు.

**కోనంగి:** అనంతం, నువ్వు నెమ్మదిగా ఆంధ్ర భోజనం అలవాటు చేసుకోవాలి.

**అనంతం:** మీ ఖారం నేను తినలేను బాబూ!

**కోనంగి:** నువ్వు తినడానికి కాకపోయినా, నా కక్కరలేదా ఏమిటి?

**అనంతం:** ఏమిటి?

**కోనంగి:** గోంగూరపచ్చడి?

**అనంత:** అవునండోయి, నా చిన్నతనంలో, వందేమాతరం బొమ్మ చూచాను. ఆంధ్రుల్ని గోంకూరలు అంటాడు రాజాబహదూరు.

**కోనంగి:** అరవల్ని మావాళ్ళు సాంబారుగాళ్ళు అన్నట్లు.

**జయలక్ష్మి:** మేము అరవవాళ్ళము కాము అల్లుడుగారూ!

**కోనంగి:** కాకపోతే ఏం! అరవదేశంలో ఉండి ఉండి అరవ భోజనం అలవాటు చేసుకున్నారు మీరు.

**జయలక్ష్మి:** మా యింట్లో అయ్యంగారు వంటాయనకదా మరి?

**కోనంగి:** అందుకనే అంటున్నాను. మా గోంగూర మా పచ్చళ్ళు, మా పులుసులు, మా ఆవకాయ, మాగాయ, మెంతికాయ, మా కొరివి ఖారం, మా కూరలు రుచి చూస్తే వదులుతారు మీరు! మా పచ్చిపులుసుల మజా మీకేం తెలుసు?

**అనంతం:** మా కవన్నీ ఎల్లా తెలుస్తాయండీ?

**కోనంగి:** నాతో బందరు వచ్చే నేర్చుకుందువుగాని!

**జయలక్ష్మి:** బందరెందుకు స్వామీ?

**కోనంగి:** కోడలు అత్తగార్ని చూడవద్దా?

**జయలక్ష్మి:** మా వియ్యపురాలుగారే యిక్కడకు వస్తే బాగుంటుందేమో!

**కోనంగి:** మొదట మే ఇద్దరం బందరు వెళ్ళి మా అమ్మను లాక్కురావడానికి ప్రయత్నం చేస్తాము.

**అనంతం:** తప్పకుండా వెడదామండీ గురువుగారూ!

**కోనంగి:** అవును అనంతం! ఆంధ్రదేశానికి కోడలివి నువ్వు. రాజ రాజనరేంద్రుడు చేసినట్లు నిన్ను మా దేశానికి తీసుకువెళ్ళి చూపిస్తాను.

భోజనాలయ్యాయి. కోనంగీ అనంతం తమ గదిలోనికి పోయినారు. అనంతం భర్త వద్ద కూర్చుండి భర్తకు తాంబూలం ఇస్తూ ఉంది. కోనంగి ఒక్కొక్క ఆకుచిలక ఆమె నోటికి అందిస్తున్నాడు.

ఇంతట్లో కోనంగితోపాటు, దుక్కిటెద్దుల సినీమాలో అభినయించిన వారూ, దర్శకుడూ, కళాదర్శకుడూ, సంగీత దర్శకుడూ, ముఖ్యతారా మొదలయినవారు పదిమంది కోనంగిని చూడటానికి వచ్చారు.

కోనంగిరావూ, డాక్టరు రెడ్డీ విడుదలయ్యారన్న వార్త ఆ ఉదయం పత్రికలలోనే వచ్చింది!

## 4

కోనంగి జైలునుంచి వచ్చిన పదిహేనురోజులు అమృతపక్షమే ఆ యవ్వన దంపతులకు! ప్రేమ మహాసముద్రము అంత గంభీరము! అంత ఆనందకల్లోలపూరితము! అంత అవధి రహితము!

కోనంగి బందరు వెళ్ళేందుకు మెయిలుబండిలో మొదటి తరగతి రెండుసీట్ల కంపార్టుమెంటులో ప్రయాణంచేస్తూ, అనంతలక్ష్మిని తన ఒడిలో ఒదిగించుకొని పడమట వైపుకు వాలే పంచమి చంద్రవంకను భార్యకు చూపిస్తూ "అనంతా! నీ జీవితరహస్యం తెలుసుకోవాలంటే, నీ ప్రేమ మాహాత్మ్యభావం అర్థం చేసుకోవాలంటే, ఆ చంద్రవంకను ఉపాసిస్తూ వేయేళ్ళు తపస్సు చేయాలి" అన్నాడు.

"తపస్సు చేస్తే?"

"అర్థం అవుతుంది!"

"ఏది?"

"నీ ప్రేమ!"

"నా ప్రేమ అంత అర్థంకానిదా?"

"అవును!"

"నా జీవిత రహస్య మేమిటి? నా జన్మలో మీకు తెలియని రహస్యాలు లేవే!"

"రహస్యంలేని నీ జన్మ యావత్తూ రహస్యాతీతమైనది."

"రెండూ ఒకటేనా?"

"రెండూ ఒక టెల్లా అవుతాయి? ఒకటి నీ జీవితమార్గం నిష్కల్మషమయినదనీ, రెండవదాని అర్థం నీ జన్మ ఏదో పరమశ్రుతి నర్థించి వచ్చిందనీ!"

"మీబోటి గురువుగారిని పిల్లి అంటే అర్థం ఏమిటని అడిగినాడట ఒక శిష్యుడు. ఆ గురువుగారు మార్జాలము అని జవాబు చెప్పినాడట. ఆ కుర్రవాడు అది విని అదేదో పెద్దజంతువో ఏమిటో అని కళ్ళు పెద్దవి చేసి కూర్చున్నాడట."

"అనంతలక్ష్మీ! నీమీద వ్రాసుకొన్న ఈ మూడుపాటలూ విను! ఇవి పారిపోయే కవిత్వం అయినా నాకు భయంలేదు. వ్యక్త్యానందంలోంచి, ఆ వ్యక్తియొక్క లోకసేవాగాఢరక్తి ఉద్భవిస్తుంది. ప్రేమరహితునకు మానవ సేవాభావమే అర్థంకాదు."

"పారిపోయే భావం ఏనమిటి?"

"మన ఇద్దరి స్థితీ"

"మీ పాటలు పాడరూ! అవి నాకు నచ్చాయా మీకు ఎన్ని ముద్దులన్నా బహుమానం ఇవ్వగలను."

*"సిగ్గులేని పిల్లా! రైలు వింటుంది.*
*ఓసి దివ్యప్రేమమయీ!*
*ఓసి లోకానంతమూర్తీ!*
*నిన్ను ప్రేమించి నిజమెరిగినవాడనే*
*నీలోన వివసించు నఖిలలోకమ్మంచు*
*ఓసి అమృతమందాకినీ!*
*ఓసి ఆనందవారాసి!*
*నిను నే కాంక్షించి, అరిబాధితప్రజా*
*కాంక్షలన్నీ లోన కరగించుకొన్నాను.*
*ఓసి వేదనాభరితాత్మ!*
*ఓసి పరమకరుణార్ద్రితా!*
*నిన్ను నే పూజించి నిండించుకొన్నాను*
*మనుజు మనుజుల మధ్య మందేటి ద్వేషమ్ము*
*ఓసి పూర్ణసౌందర్యాంగి!*
*ఓసి లావణ్య తేజస్వి!*
*హృదయాన నిను పొదివి మది తెలుసుకొన్నాను*
*దేశ దేశప్రేమ దేశాల శాంతియని!"*

అతని పాటా ఆ పాటా తాళమూ వేగంగా పోయే రయిలు చక్రనినాదంతో శ్రుతులయ్యాయి. అనంతలక్ష్మి భర్త దగ్గరగా, ఇంకా దగ్గరగా ఒదిగి "నన్నిలా మీరు నానామాటలు అనవచ్చునా? ఈ పాట నామీద వ్రాసినారని లోకం అంతా ప్రచారం ఏమనుకుంటారు?"

"కోనంగి వట్టి పిచ్చివాడని!"

"ప్రజల మొగం చూడడానికి నాకు సిగ్గు అవదండీ గురువుగారూ?"

"ఎందుకూ?"

"అందరూ మీ పాట చదివి, ఆ పాట ఈ అమ్మాయిమీదే వ్రాశాడు కోనంగికవి అని అనుకుంటూ నన్ను తేరిపార చూడరూ!"

"వట్టి తేరిపార చూడడమా? ఈమె కోనంగి గీతానాయిక అంటూ తండాలుగా వచ్చి నీ మెళ్ళో ఇన్ని దండలువేసి ఊరంతా ఊరేగించి పెద్ద మీటింగు చేసి, అనేక వినతిపత్రాలు, నవరత్నాలు, తారకామాలలు అర్పించి కృతిసమర్పణలుచేసి, పట్టుచీరెలు, పట్టురెవికలు బహుమతు లివ్వరూ! అప్పుడు నువ్వు నాతో మాట్లాడుతావా ఏమన్నానా?"

*"చాటునుండే ఎంకి*
*సభకు రాజేశావ*
*పదిమంది నోళ్ళల్లో*
*పదమంట రాశాద!"*

అని ఎంకెన్నట్లు అల్లా నామీద పాటలు వ్రాస్తారా మీరు? న్యాయమా చెప్పండి?"

"వట్టి అన్యాయం. శుద్ధ అన్యాయం. నీ మొగుణ్ణయిన నేను కవి అయిన కోనంగిమీద రామప్పంతులులా డామేజీ దావా పడేసి డొక్కచీలుస్తాను."

"దావాలు గీవాలు వేయకండి. నాకు కోర్టులంటే హడలు. రెండో పాట పాడరూ!"

*"ఏ తపస్సు చేసినానో*
*ఏ అదృష్టము పొందినానో*
*నీవు దర్శనమిచ్చి నావూ*
*నిత్యశోభాంగీ!*
*మధురకంఠీ! మసృణాంగీ!*
*మామకీన విల్పుప్తజన్మము*
*నిందు చేసిన నిర్మలాత్మా*
*నీవటే దేవీ!*
*చూపవేమే సకలలోకము*
*చూపవేమే ప్రజాహృదయము*
*సుప్తి ఎరుగని మానవార్తిని*
*చూపవే దేవీ!*

"నేనో ప్రశ్న అడుగుతాను, భావికవిత్వపు జవాబు చెప్పక నిజం చెబుతారూ!"

"భావికవిత్వం అబద్ధమనా?"

"భావికవిత్వం నిజానికి అతీతమని మీరేగా అన్నారు."

"అంటే ఏమని నీ ఉద్దేశం?"

"ప్రాపంచిక సత్యం, అర్ధసత్యమూ పావుసత్యమూ మాత్రమేకాని భావసత్యము ఆనంత సత్యానికి దగ్గర అని మీరన్నారు."

"అవును అన్నాను."

"అయితే అనంత సత్యం ఏమిటి?"

"నీ సత్యం!"

"పోనీ లెద్దురూ! ఉండండి నా సత్యం మీరే!"

"నువ్వు నా సత్యానివి!"

"సరే లెండి చాలా బాగుంది. అనంత సత్యమేమిటో చెప్పండి."

"అనంత సత్య మేమిటో నాకు తెలియదు. శాస్త్రవేత్తలు సృష్టికి పునాది ఎలక్ట్రానా, ఇంకా ఏమన్నానా తేల్చలేదు ఇంకా! అయినా ప్రాథమిక రూపంలో వస్తువులను ముక్కలు చేస్తే వాటి ఆధారం ప్రోటానుల ఆ ఎలక్ట్రానుల కలయిక అని మాత్రం తెలుసుకున్నారు. అది అంతవరకు సత్యం. అయినా ఈ చిన్న చిన్న సత్యాల వెనుక నిజమయిన సత్యం ఒకటి ఉంది అని వారు గ్రహించారు. అదేమిటో వారికి తెలియదు. అది రావసత్యం. ప్రాపంచికమైన సత్యాలు, ఇంకా ఒక లక్ష ఇతర రకం సత్యాలూ వీని అన్నింటి వెనకా ఏదో ఒక సత్యం ఉంది. అది అనంతసత్యం!"

"మీరు లెక్కలు మాట్లాడుతున్నారే!"

"అయితే లెక్కల ప్రకారం నా కివ్వవలసిన ముద్దుల బాకీ నాకిచ్చేయి."

# 5

**కో**నంగి, అనంతలక్ష్మీ బందరు స్టేషనులో దిగగానే అక్కడకు అతని ఉత్తరం ప్రకారం, అవతల యిచ్చిన టెలిగ్రాం ప్రకారం అతని స్నేహితుడు మధుసూదనరావు స్టేషనుకు కొందరి స్నేహితులతో వచ్చి సిద్ధంగా ఉన్నాడు.

కోనంగి, ఈ రెండేళ్ళలోనూ ఆనవాలు పట్టరానంత మారినట్లు వారికి తోచింది. స్నేహితులందరూ కోనంగిని కౌగలించుకునేవాళ్ళూ, చేతులు జోడించేవాళ్ళూ ఆయి అతనికి స్వాగతం యిచ్చారు.

సామాను అదీ తాను వెంట తీసుకువచ్చిన టాక్సీలమీద వేసుకొని మధుసూదనరావు యింటికి వెళ్ళారు.

మధుసూదనరావు కుటుంబమువారు రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు బందరు నోబిలు కాలేజీలో లెక్చరరుగా ఉన్నప్పుడు బ్రహ్మసమాజంలో కలసి కులభ్రష్టులయ్యారు. ముట్నూరి కృష్ణారావుగారు, పట్టాభి సీతారామయ్యగారు మొదలయిన వారితోబాటు మధుసూదనరావుగారి తాత సాంఘిక సంస్కరణలు తన కుటుంబంలో తీసుకువచ్చి కొమరిత పెద్దమనిషి అయిన తర్వాత బొంబాయిలో ప్రభుత్వ వైద్యుడుగానున్న ఒక బ్రహ్మ సమాజికునకిచ్చి వివాహం చేశాడు. ఆ మధుసూదనరావుగారి మనుమడు ఈ మధుసూదనరావు. కోనంగి వివాహానికి కూడా వచ్చి ఉన్నాడు. అప్పుడే భార్యాభర్తల నిద్దరినీ బందరు రావలసిందని ఆహ్వానించాడు.

కోనంగి స్నేహితులు, మధుసూదనుడు కోనంగి భార్య అత్యంత రూపవతి అని చెప్పడం విన్నారుకాని, ఇంత సౌందర్యవతి అని వారనుకోలేదు.

బచ్చుపేటలో ఉన్న మధుసూదనరావు ఇంటికిపోయి, తన కేర్పాటయిన గదిలో సామాను సర్దుకొని, స్నానాదికాలు నిర్వర్తించి వారందరితో భోజనం చేసిన వెనుక పన్నెండు గంటలకు ఒక జట్కా తల్లి కోసం పంపించాడు కోనంగి.

ఇదివరకే కొడుకూ కోడలూ వస్తున్నారని ఆమెకు తెలియగానే తబ్బిబ్బయిపోయింది కోనంగి తల్లి పార్వతమ్మగారు. ఏదో తన బ్రతుకు తాను బ్రతుకుతూ వుంది. ఇప్పుడు వీడు రావడమేమిటి? వాడు ఒక్కడూ వచ్చి తనును చూచి వెళ్ళిపోయినా తనకు అంత ఇబ్బంది ఉండేది కాదు. ఎవరో కులం తక్కువ అమ్మాయిని చేసుకొని, ఆ పిల్లను కూడా తీసుకు వస్తాడట.

ఆమె నిజచరిత్ర ఎవరికి తెలుస్తుందో అని భయం. కొడుకు మదరాసులో ఉండి ఏదో సినీమా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడని పదిమందికీ తెలిసినా, ఆమె అంత కంగారు పడలేదు.

ఇవాళ తన కొడుకూ, తన కొడుకు పెళ్ళి చేసుకున్న ఆ పిల్లా వచ్చారనీ, వెంటనే జట్కా ఎక్కిరమ్మన్నారనీ కబురు రాగానే బేజారైపోయింది. మధుసూదనరావు తనింట్లోనే కోనంగిరావూ, అతని భార్య ఉంటారని చెప్పినప్పుడే, ఈ బ్రహ్మసమాజంగాళ్ళ ఇంట్లో ఉన్న కొడుకు దగ్గరకు వెళ్ళినా తంటే, వెళ్ళకపోయినా తంటే అనుకుంది.

ఇప్పుడు తన్ను రమ్మంటున్నారు కొడుకూ కోడలూ ఇద్దరూ అని కబురూ బండి రాగానే తన కొడుకు ఫలానా వారింటిలో ఉన్నాడని తెలియగానే, తాను వంటచేసే కుటుంబం యజమానురాలూ, ఆమె చుట్టాలూ ఏమనుకుంటారో అని గజగజలాడి

పోయింది. ఎవరూ అడగకుండా, యజమానురాలి దగ్గరకు పోయి, "అమ్మా! మా అబ్బాయి వచ్చాడట వాడు బండి పంపించాడు. వెళ్ళి చూచి వస్తాను" అని చెప్పి గబగబవచ్చి బండి ఎక్కింది.

బండి వెంటనే బయలుదేరి బచ్చుపేట వచ్చింది. బండి రాగానే ఆమెను ఎదుర్కొనడానికి మధుసూదనరావు సిద్ధంగా ఉన్నాడు.

పార్వతమ్మగారు దిగీదిగటంతోటే లోనికి వెళ్ళి "ఏడీ కోనంగేశ్వరుడు?" అని ప్రశ్నిస్తూ మధుసూదనరావువైపు తిరిగింది. అప్పుడే కోనంగీ, అనంతలక్ష్మి హాలులోనికి వచ్చి పార్వతమ్మగారి పాదాలకు నమస్కరించారు. అనంతలక్ష్మి అత్తగారికి సాష్టాంగపడింది.

అనంతలక్ష్మిని చూస్తూనే పార్వతమ్మ ఆశ్చర్యంతో మునిగిపోయింది. పూర్తిగా అరవ బ్రాహ్మణ బాలికలా నగలూ అవీ. సౌందర్యవతియైన ఆ బాలిక పార్వతమ్మ కళ్ళల్లో మిలమిలలాడిపోయింది.

కోనంగి "అమ్మా! నీ కోడల్ని చూచావా? అనంతలక్ష్మి. మా అమ్మగారు" అని అన్నాడు.

పార్వతమ్మ తెల్లబోయి చూడడమేగాని మాట్లాడలేకపోయింది.

"రండి అత్తయ్యగారూ! గదిలో కూర్చుండి మాట్లాడుకుందాం"

అని అనంతలక్ష్మి పార్వతమ్మను పిలిచింది. పార్వతమ్మ మాట్లాడకుండా అనంతలక్ష్మికీ కోనంగికీ ఏర్పాటైన గదిలోనికి పోయింది.

పార్వతమ్మ అక్కడ ఉన్న కుర్చీమీదగాని, చాపమీదగాని తివాసీ మీదగాని కూర్చోడానికి నిరాకరిస్తూ "నిలుచుంటానే అమ్మాయీ, మడికట్టుకున్నాను." అంది.

**అనంత:** అత్తయ్యగారూ! మీరు మదరాసు రావాలి.

**పార్వతమ్మ:** నేనా, నేను మదరాసా, అమ్మయ్యో!

**అనంత:** అదేమిటి అల్లా అంటారు. మీ అబ్బాయిగారు పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసి బోలెడు సంపాదిస్తూ ఉంటే మీరు ఈ ఊళ్ళో వంట చెయ్యటం ఏమీ బాగాలేదండీ. నేనందుకు ఎంతమాత్రమూ ఒప్పుకోను.

**పార్వతమ్మ:** మీరు ఏ కులం అమ్మాయి?

**అనంత:** మేము తెలుగువాళ్ళమేనండీ!

**పార్వతమ్మ:** మీరు తెలుగువాళ్ళే అయి ఉండవచ్చును. కాని కులం?

**అనంత:** మాది హిందూమతం!

**పార్వతమ్మ:** అంటే, అదేం కులం?

**అనంత:** మేము వైష్ణవ మతస్థులం!

**పార్వతమ్మ:** వైష్ణవులా? అయ్యో మా వాడు వైష్ణవ బాలికను పెళ్ళి చేసుకున్నాడా?

**అనంత:** అత్తయ్యగారూ! మా అమ్మమ్మ బోగంది. మా అమ్మా అంతే! కాని మా తాతయ్య గారు వైష్ణవ బ్రాహ్మణుడు. మా అమ్మ వైష్ణవ మతస్థురాలు. ఆమెను ఒక రంగయ్యంగారు పెళ్ళి చేసుకున్నారు. ఆ ఇద్దరికీ నేను పుట్టాను.

పార్వతమ్మ తెల్లబోయింది. పదినిమిషాలు మాట్లాడలేకపోయింది. అనంతలక్ష్మి తెల్లబోయింది. అయినా తన భర్త తన తల్లిని గూర్చి సమాచారం యావత్తూ ఇదివరకే తనకు చెప్పి ఉన్నాడు. కాని ఇంత వెర్రిబాగుల చాదస్తపు ఆవిడ అని అనంతం అనుకోలేదు.

ఇంతలో కోనంగి లోనకు వచ్చాడు.

"ఏమిటి అత్తాకోడళ్ళిద్దరూ మాట్లాడుకొంటున్నారు. అమ్మా! నువ్వు మాతో రావడమేనా?" అని తల్లిని ప్రశ్నించాడు.

పార్వతమ్మ "నేను రానురా! నేను మదరాసువస్తే నా జన్మ తగలబడి పోదూ!" అంది కన్నీళ్ళు నింపుకుంటూ.

## 6

**యు**ద్ధం ఘోరమైంది. ఇంగ్లండును నాశనం చేయాలని జర్మనీ అతి భయంకరమయిన విమాన దాడులను సాగించింది. పాపం కోనంగి ఆ వార్త చదివినప్పుడల్లా గజగజలాడిపోతాడు. యుద్ధంలోని ఒక్కొక్క పిరంగి ప్రేలుడు యొక్క భయంకరధ్వని కోనంగి హృదయంలో భూకంపం అవుతూ ఉంది.

ఏది కోరి జర్మనీ ఈ యుద్ధంలో దిగింది? 1914వ సంవత్సరములో ఏది కోరి జర్మనీ యుద్ధం ప్రారంభించింది? ఆశ అనే మహారోగం పట్టుకుంటే ఎన్ని మందులు ఆ రోగాన్ని నివారించగలవు? ప్రపంచం అంతా మందై ఒక్క మోతాదై ఆ జబ్బు వాడి చేతులోకి వచ్చినా, ఇంకో మోతాదు కావాలని ఆ జబ్బు అల్లరి చేస్తుంది.

ఇంగ్లండుకు ఆ జబ్బు పట్టుకునేగా, అదే జబ్బు పట్టుకుని బాధపడుతూన్న స్పెయిన్‌ను నాశనం చేసింది. ఇంగ్లండుకు అమెరికా, ఇండియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, మలయా, న్యూగినియా, న్యూజిలాండు, అన్నీ మోతాదులయ్యాయి, ఈ జబ్బు గమ్మత్తు ఏమిటంటే, మందు పుచ్చుకున్న కొలదీ జబ్బు ఎక్కువౌతుంది. జబ్బు ఎక్కువైన కొలదీ మందు యెక్కువ కావాలి.

కోనంగి ఈ మహారోగాన్ని గూర్చి ఆలోచించిన కొలదీ, మరింత భయపడి పోయాడు.

"అనంతం! ఈ రోగం ఉందే భగవంతుడికో, ప్రపంచ ప్రజలందరికో మాత్రమే లొంగుతోంది."

"మనకు కూడా పట్టుకోదుగదా ఈ జబ్బు?"

"విడివిడి మనుష్యులకూ పట్టుకుంటుంది ఈ రోగం?"

"ఇది అంటుడు రోగమా?"

"ఆ! టర్కీ నుంచి స్పెయినుకు, స్పెయిను నుంచి ఇంగ్లండుకు పట్టుకుంది. పోర్చుగల్‌కు తగిలింది. అక్కడ నుంచి ఫ్రాంసుకు పాకింది. ఆస్ట్రియాకు పాకింది. ఆస్ట్రియాతో దెబ్బలాడి స్వతంత్రం సంపాదించుకొన్న ఇటలీకి పాకింది. రష్యాకు పాకింది ఇంగ్లండు నుంచి స్వతంత్రం సంపాదించుకొన్న అమెరికా వారికి ఈ రోగం తగిలింది. రష్యాతో దెబ్బలాడి విజయం పొందిన జపానుకు పుట్టింది."

"సరేగాని మీ కవిత్వం మాని, యుద్ధం రోజులలో మనం చేయవలసిన పనేముందండీ! మనదేశానికి బలంలేదు. ప్రపంచంలో నైతికబలం మృగ్యమైకదా ఈ యుద్ధాలు వచ్చేది. రామరామా! ఎంతమంది బిడ్డలు, ముసలివాళ్ళు, యువకులు, యువతులు నాశనం అయిపోతున్నారు! ఏ ప్రళయమో వచ్చి నాశనం అవడంలేదు. మనుష్యుని చంపడం అనే భావం ఎంత హృదయ విదారణమయిందండీ!"

"ఎలా యుద్ధం చేయగలరో మనుష్యులు? చంపడం అనే భావం జంతు ధర్మానికి చెందింది. ఆ జంతువైనా, క్రూరజంతువు అనంతం!"

"ఏమిటండీ ఈ పాశ్చాత్య నాగరికత?"

"పాశ్చాత్య ఏమిటి? ప్రాచ్యమేమిటి? చంపడం భావం వస్తే అందరూ ఒకటే ప్రాణేశ్వరీ! మనదేశంలో పార్టీ కక్షలు, పొలం తగాదాలు వస్తోవుంటాయి చూడలేదూ! భారతీయులు ఎంతోమంది బ్రిటిష్ సైన్యంలో చేరి యుద్ధాలు చేయడం లేదూ ప్రియమూర్తీ! గూర్ఖాలు, పఠానులు, శిక్కులు, పేరు చెప్పితే ప్రపంచంలోనే హడలు.

ఒక రోజున పేపరు చదువుకుంటూ ఆ యవ్వనదంపతులిద్దరూ ఈ సంభాషణలో పడినారు. అనంతలక్ష్మికి బందరు వట్టి మారుమూల స్థలంలా కన్పించింది. వచ్చిన మూడురోజులవరకూ హుషారుగా గడిపారు ఇద్దరూ. సముద్రం ఒడ్డు, జాతీయ కళాశాల, బందరు వీధులూ చూపించాడు. తను ఆడుకున్న స్థలం, తాను చదివిన హిందూ కాలేజీ అన్నీ అనంతానికి చూపించాడు కోనంగి.

"అదియే బొంబాయి, అల్లదే కనుము పట్టాభి మహానాయకుడదియే" అని అతడు ఆశు కవిత్వంగా పాడుతూ అనంతలక్ష్మిని సాయంకాలానికి బందరు కోటకు తీసుకు తీసుకువెళ్ళాడు. ఆ చుట్టుప్రక్కల రాత్రి ఎనిమిదింటి వరకూ తిరిగి, ఇంటికి చేరుకున్నారు.

కోనంగితల్లి పార్వతమ్మ కుమారునితో "నాయనా! నేను నా వంటపని మాని మదరాసు వచ్చి ఏం చెయ్యగలను తండ్రీ! నేను చేసిన మహాదోషానికి నేను అనుభవించాలిరా? నువ్వు సంపాదించి నన్ను సుఖపెట్టాలని వున్నా, నాకు సుఖం ఎక్కడిదిరా? నాకు ప్రపంచం అంతా తారుమారుగా కనబడుతోంది. నువ్వెందుకు వచ్చావో ఈ లోకంలోకి. నీకీ పెళ్ళేమిటో నా కేమీ అర్థంకావటంలేదు. నా బ్రతుకు ఇట్లాగే బ్రతకనీ! తర్వాత ఏది ఎల్లా ఉంటుందో? మీరిద్దరూ త్వరగా ఈ ఊరు నుంచి వెళ్ళిపొండి" అని విషాదంగా, ఖండితంగా చెప్పింది.

కోనంగికి తల్లి హృదయం అర్థం అయింది. ఆమెకు తాను పుట్టడమే తప్పని అతడనుకొన్నాడు! ఈ విచిత్రమైన భారతదేశంలో జీవితాదర్శాలు, జీవిత భావాలు విచిత్రపథాల ప్రయాణం చేస్తూ వుంటాయి. ఫ్రాయిడ్ మొదలయిన వారి సిద్ధాంతాలన్నీ భారతీయ స్త్రీల విషయంలో వర్తించవు అని అనుకొన్నాడు.

మర్నాడు భార్యాభర్తలు ఇద్దరూ స్నేహితులందరి దగ్గరా సెలవు పుచ్చుకుని వెళ్ళారు. మధుసూదనరావూ, అతని భార్యా, కోనంగీ, అనంతలక్ష్మి కలిసి ఫోటో తీయించుకొన్నారు.

మధుసూదనరావు కోనంగితో ఆ నాలుగయిదు రోజులూ తన విషయం చెప్పుకొని గొంతెత్తి ఏడ్చాడు. "ఒరే కోనంగీ, నా జీవితం వట్టి నిరర్థకం అనుకుంటున్నానురా! యేం చెయ్యను? యుద్ధానికి పోదామనుకున్నాను.

"ఏమిటి వ్యాపారం?"

"మాకు ఋణాలు ఎక్కువయితే భూములన్నీ అమ్మేసి అప్పులు తీర్చాం. ఉద్యోగాలు లేవు కొద్దిగా బంగారం ఖరీదు ఎక్కువవడంచేత మాయింట్లో ఉన్న బంగారం అంతా అమ్మేసి కాలక్షేపం చేస్తున్నాము బి.ఏ. పూర్తి చేశాను ఎల్లాగో. ఉద్యోగం? తమ్ముడు ఇంకా చదువుకుంటున్నాడు. అమ్మాయిలు మా చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళిళ్లు కాలేదు."

"పెద్దచెల్లెలు చౌధురాణీ బి.ఏ. పూర్తి చేసింది కాదురా?"

"ఆ! రాణీ ఏం చెయ్యాలో తెలియక కొట్టుకుంటోంది. దాన్ని చూస్తే మరీ బెంగ."

"రాణీని ట్రెయినింగుకు పంపించరాదూ!"

"ట్రయినింగుకు ఇచ్చే పిఠాపురం రాజావారి స్కాలరుషిప్పు దానికి అక్కడ ఉండడానికి సరిపోతుందా!"

"సరే కాని, వెంటనే నువ్వూ, నీ భార్య, చౌధురాణీ మదరాసు రండి. అక్కడ మా యింట్లో ఉందురుగాని."

"ఛా! ఛా! నువ్వే మీ అత్తవారింట్లో ఉన్నావు."

ఇంతట్లో అనంతలక్ష్మీ, చౌధురాణీ, మధుసూదనుని భార్యా అక్కడకు వచ్చారు. మధుసూదనుని భార్య కమలనయన "కోనంగిరావుగారూ! మీ ఆవిడ మమ్మిద్దరినీ చంపేస్తోందండీ!" అన్నది.

అనంతలక్ష్మి నవ్వుతూ "చూడండి! వీళ్ళిద్దరినీ. మధుసూదనరావు అన్నగారినీ నాలుగురోజులపాటు మదరాసుకు రమ్మంటే, అల్లరి చేస్తారేమిటండీ?" అన్నది.

"ఒరే మధూ, మీరు రాకపోతే నన్ను మరిచిపొండి, అంతే!" అన్నాడు కోనంగి.

## 7

**చె**ట్టియారు మధురలో యుద్ధపారిశ్రామిక వస్తువులను తయారుచేసే పారిశ్రామికులను తయారుచేసే పారిశ్రామిక విద్యాలయం పెట్టాడు. ప్రభుత్వ సలహా ఉద్యోగి (మంత్రుల బదులు వీరు వచ్చారు) ఒకరు వచ్చి ఆ విద్యాలయం తెరిచారు. ప్రభుత్వం కూడా సహాయం చేస్తూ ఉంది. దీనికి తగినట్లు ప్రభుత్వ సహాయంతో ఒక తమిళ దైనికపత్రిక పెట్టాడు. స్వయంగా అరవంలో అరవదేశం అంతా తిరుగుతూ యుద్ధ నిధికి సహాయము చేయమనీ, యుద్ధంలో చేరమనీ ఉద్బోధించసాగాడు. తాను స్వయంగా ఒకసారి లక్షరూపాయలు ఇచ్చినాడు. గవర్నరుగారు వచ్చినప్పుడు రెండులక్షల రూపాయలు నిధికి అర్పించినాడు. వైస్రాయిగారు మదరాసు వచ్చినప్పుడు నాలుగులక్షలు ఇచ్చినాడు.

దీనికంతకూ వెనకాల దిట్టమయిన ఒక మూలకారణం ఉంది. అనంతలక్ష్మీ అమృతతుల్య మందహాసమే. ఎలాగయినా, ఎప్పటికయినా ఆ మందహాసం తనకు ఆస్వాదనభోగం ఇచ్చితీరాలి! ఆ అద్భుత ముహూర్తంకోసం తాను యెంత కర్చుకైనా వెనుదీయదలచుకోలేదు.

ప్రభుత్వస్నేహం శక్తినిస్తుంది. ఆ శక్తివల్ల మదరాసురాష్ట్రం అంతా తన వెనుక రయిలు ఇంజను వెనుక బండ్లులా వచ్చి తీరుతుంది. ఆ వచ్చే బండ్లలో ఒక మొదటి తరగతి బండిలో, చక్కని అలంకారం చేసిన దాంట్లో అనంతలక్ష్మి ఒక్కతే మన్మథుని రాణిలా తనకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. తాను మన్మథుని వేషంతో దర్జాగా ఆ గదికి వెడతాడు.

అతని కన్నులు అరమూతలు పడ్డాయి. రుచిగల వస్తువును తలచుకొని పెదవులు చప్పరించే దౌర్భాగ్యునిలా చెట్టిగారు తన పెదవులు చప్పరించుకొన్నాడు.

ఇంక కోనంగి కూడా తన రైలు క్రింద పడిపోతాడు. రైలు వాణ్ణి ముక్కముక్కలుగా ౦ండించి పారేస్తుంది.

ఈ ఆలోచనరాగానే చెట్టిగారు మధుర నించి చెన్నపట్నం బయలు దేరబోయే వేళ ఒక తమిళ వారపత్రిక పోస్టులో తక్కిన టపాతోపాటు వచ్చింది. ఆ పత్రికను చూచీ

చూడడంతోటే చెట్టిగారు మండిపోయారు. కళ్ళు కాలిన ఇటుకరాళ్ళలా ఎరుపెక్కినాయి. ముక్కుపుటాలు విస్తరించాయి.

"తిరట్టు పయ్యగాడు. ఏమంటాడు, ఏమంటాడు?" అంటూ ఆ పత్రిక తీశాడు.

ఆ పత్రిక చూడకూడదు, చదవకూడదు. అని కోటివేలసారులు అనుకున్నాడు. అయినా కల్లు దుకాణానికి వెళ్ళకూడదు అనుకుంటూనే రోజు నాగా లేకుండా తల వంచుకుపోయే పందిలా, చెట్టిగారు ఆ పత్రికపై అంటించిన విలాస కాగితం చింపి 'నిజం' అనే ఆ వారపత్రిక మడత విప్పి, చదువుకోవడం సాగించాడు. లోపల కుడివైపు పేజీ ఒక దాంట్లో, "చెట్టి నవాబుగారి మన్మథ విజృంభణ" అన్న పెద్ద అక్షరాల వ్యాసం కనబడింది. చెట్టిగుండె దడదడ కొట్టుకుంది.

"మా చెట్టిగారి జనాభా నాటికి వృద్ధి అవుతోంది. మా చెట్టిగారు కోటి మన్మథులను కలేసి నూర్చి పాకంకట్టి, వంటవండిన ముద్ద. వీలయితే చెట్టిగారు లోకంలో ఉన్న ప్రతి అందమైన బాలికా తన శృంగారమందిరంలో తనకోసం నిరీక్షణలో ఉంచుకుంటాడు. అందరూ ఇంగ్లీషు సినిమాలలో నాట్యంచేసే సుందరీమండలిలా, తన ఎదుట నాట్యం చేస్తారు. ఉలిపరబట్టలు కట్టుకుంటారు. ఆ బట్టలు లేకపోతే మరీ అందంగా ఉంటాడు వాళ్ళ మధ్య తాను! ఒక సినిమాతార కురంగినయన తన ఎదుట!

ఎందుకు కురంగినయన అని మీరు మమ్ము అడగవచ్చును. చెట్టియారుగారి మలయాకోట్లు ఎవరిని సువర్ణలక్ష్మిని చేస్తున్నాయి? కురంగినయన ఎక్కి తిరిగే స్టుడిబేకరు కారును, కురంగినయన ఎవరి చెక్కుబుక్కులలో చెక్కుపెట్టి కొనుక్కుంది?

"కురంగినయనా, మన చెట్టిగారూ తిరుచునాపల్లిలో ఆయన మేడలో ఇద్దరే... తారీఖున మూడురోజులు గడిపారే, వారు చేసుకున్న ఉత్సవమేమిటి?"

చెట్టియారుగారి హంసడిభకులు, చెట్టియారుగారు శ్రీరంగంలో ఒక్క ఇంటిలోకి దూరబోతూ ఉంటే అడ్డంబెట్టిన ఒక భర్తను యెందుకు తన్నారు?"

"...తారీఖున సాయంకాలం ఎనిమిది గంటలకు చెట్టియారుగారి ఇంటిలో మదరాసుల ఆరుగురు సినీమాతారలతో చెట్టిగారు రాసక్రీడ సలిపారేం! ఆ తారలు కురంగినయన, కుమారి మీనాక్షి, కృష్ణబాల, తరలాక్షి, కావేరీఅంబాళ్, కనకదేవి అనే వారేనా? ఈ రాసక్రీడ ఉద్దేశమేమిటి? ఒక విలేఖరి?"

చెట్టియారు కోపం మిన్నుముట్టి స్వర్గం, సత్యలోకం దాటిపోయింది. ఆయన క్రోధం అతల, వితల, సుతల, మహాతల, తలాతల, రసాతల, భీతల, భాతల, పాతాళాది లోకాలకు దిగి కమ్ముకు పోయింది. అతని పళ్ళుకొరుకు ధ్వనులు యూరపు అమెరికాలు, అఫ్రికా ఆస్ట్రేలియాలు, ఆసియా ఖండాలు నిండిపోయాయి.

వెంటనే నూరు విమానాలకు వేయిటన్నుల బాంబులు, తిరుచునాపల్లిలో ఉన్న ఆ ముద్రణాలయంమీద విసరివేయండని మనస్సులో ఆజ్ఞలను జారిచేయించినాడు.

"ఒరే సభాపతీ!" అని కేక వేశాడు. తన అరువల్‌తో ఆరుమంది నన్నా బలిగొన్న సభాపతి పిళ్ళ లోపలికి వచ్చి చెట్టియారునకు దణ్ణం పెట్టాడు.

"ఈ 'నిజం' పత్రికగాడు?"

"చిత్తం మీరు ఎప్పుడు 'ఆమ' అంటే ఆ మర్నాడు 'నిజమా' ఉండదు. దాన్ని రాసే ఆ పైత్తకారీ ఉండడు."

"మంచి వీలు చూడండి. వాడిని-"

"సెహబాస్ స్వామీ! వాడు అయిపోయిందుదా!"

"వెనకా అల్లాగే అన్నావు?"

"ఏం చెయ్యమూ వాడితో మాట్లాడడానికిదా ఆ దినం పోలీసు సబుఇనస్పెక్టరు ఒకడు వచ్చాడు. ఆ పోలీసు సబుఇనస్పెక్టరు పళ్ళెత్తు, పళ్ళతోబాటు వాడికి మెదడు ఎత్తులేదు స్వామీ!"

"అయితే వాడి మెదడు ఎత్తు అవడానికి నాలుగు కాసులు బోటునిల బెట్టండి?"

మదరాసులో చెట్టిగారు అడుగుపెట్టడంతోటే ఒక సేవకుని పిలిచి, అనంతలక్ష్మి గారింట్లో ఎవరెవరు ఉన్నారో కనుక్కు రమ్మనమని పంపించాడు.

బందరు నుండి ఆ ఉదయమే కోనంగిరావుగారూ, అనంతలక్ష్మి తిరిగి వచ్చారని వార్త తీసుకువచ్చాడు చెట్టియారుగారికి ఆయన సేవకుడు.

వాళ్ళిద్దరూ దేశాలు తిరుగుతున్నారు. భార్యాభర్తలు! ఆ కోనంగి అనంతలక్ష్మితో ఎంత ఆనందం అనుభవిస్తున్నాడో! చెట్టిగారికి కళ్ళనీళ్ళు వచ్చినంత పని అయింది.

## 8

జూలై నెలాఖరుకు జపాను ఏమి చేస్తుందో అని ప్రపంచం అంతటా గుసగుసలు బయలుదేరాయి. జపాను జర్మనీ పక్షం చేరుతుందని అందరికీ అనుమానాలు ఎక్కువయ్యాయి. ఇంగ్లండు బర్మా, చీనాలకు హిమవత్ పర్వతాల గుండా ఒక రోడ్డు నిర్మించింది. దాన్నే బర్మా రోడ్డంటారు.

చీనాకు జపానుకు యుద్ధం ప్రారంభమై అప్పుడే మూడేళ్ళు దాటిపోయింది. చీనాదేశం తగ్గిపోని పట్టుదలతో పోరాడుతూంది.

జపానువారి శక్తిముందర చీనా ఎంత అనే వాదన దేశాలన్నిటిలోనూ బయలు దేరింది. భారతదేశంలో కొంతమందికి తమ రహస్య హృదయ భాగాల్లో చీనా పూర్తిగా జపానుకు లోబడి పోవలసిందే అని మహాకోర్కె. కాని కాంగ్రెసువారికి జపానుమీద కోపంగా ఉండేది.

కోనంగి జపానంటే మండిపోయేవాడు. ఆసియా ఖండవాసులు ప్రపంచనాయక జాతులుగా కావాలని కోరితే వాళ్ళల్లో ఒకళ్ళకొరకు యుద్ధం చేసుకో కూడదు. తమలో ఉన్న శక్తిని కేంద్రీకరించుకొని ఇంగ్లీషు మొదలయిన సామ్రాజ్యశక్తి వినాశనం చేయాలి. అప్పుడే ప్రపంచానికి ఎంతో శ్రేయస్సనీ. శాంతి తప్పకుండా చేకూరుతుందనీ కోనంగి వాదిస్తాడు.

కోనంగి స్నేహితుడు మధుసూదనరావు భావాలు వేరు. ఎవరైతే బ్రిటిషు సామ్రాజ్య విచ్ఛిన్నానికి ప్రయత్నం చేస్తారో వాళ్ళు అవతారపురుషులంటాడు. జర్మనీని మెచ్చుకుంటాడు. రష్యాను బూతులు తిడ్తాడు. చీనా ఆసియాకు గుదికర్ర అంటాడు. ఏభయికోట్ల జనాభాతో స్వతంత్రం కలిగి ఉండిన్నీ ఆసియా ఖండానికి ముక్తి ప్రసాదించడానికి ఏమీ ప్రయత్నం చేయలేదనిన్నీ, అదీగాక బోగందాని ఇల్లులా ప్రతి పాశ్చాత్య రాజ్యమూ వచ్చి తన్నుక పోవడానికి సిద్ధమై ఉండడంచేత అనేక పట్టణాలలో, రాష్ట్రాలలో ఇంగ్లండు, ఫ్రాంసు, అమెరికా, రష్యా, జర్మనీలు అధిరాజకీయ ప్రతిపత్తులు సంపాదించుకున్నారనీ అతని వాదన.

అందుకనే ఇంగ్లీషువారు బర్మారోడ్డు కట్టివేయడం మా మంచిపని! అని వాదించాడు. కోనంగీ, అతడూ మదరాసులో అనంతలక్ష్మి ఇంటిలో కూర్చొని ఈ వాదనంతా చేస్తూ ఉంటే అనంతలక్ష్మి మధుసూదనుని భార్య సరోజనీ వింటూ కూర్చున్నారు. జయలక్ష్మి రవికలకు పూవులు కుట్టుతూ కూర్చుంది.

**అనంత:** మీరు ఎంత వాదించండి, నాకు ఈ యుద్ధం ఏమీ అర్థం కావడంలేదు.

**సరోజిని:** అనంతలక్ష్మి వదినా, ఈ మగవాళ్ళు శాంతిదూతలులా కనబడినప్పుడు వాళ్ళని నమ్మకు. వాళ్ళందరికీ రక్తపాతం అంటే ఇష్టమే!

**కోనంగి:** గాంధీ మహాత్మునకూనా సరోజినీదేవీ?

**సరోజిని:** ఆయన మాట తీసుకరాకండీ అన్నగారూ! ఆయన పురుషాతీతుడు.

**కోనంగి:** స్త్రీలకు రక్తపాతం ఇష్టంలేకపోతే మాంసాహారం ఎల్లా గుటకాయస్వాహా చేస్తున్నారు?

**అనంతలక్ష్మి:** ఏమి ప్రశ్న వేశారండి గురువుగారూ! మాలో ఉన్న అహింస మీవల్లనే పాడయిపోతో ఉంటుంది.

**కోనంగి:** ఏమి నంగనాచులండీ! ద్రౌపదికాదూ కృష్ణునితో రాయబారానికి వెళ్ళవద్దని రాజసూయావబృథ స్నానపవిత్రమై దుశ్శాసనునివల్ల అపవిత్రమైన వేణిని చూపింది?

**సరోజిని:** అన్నగారూ, సీతాదేవి హనుమంతుడు తన్ను తీసుకొని వెడ్తానన్నా వద్దు రాముడేవచ్చి రావణుని సంహరించి తన్ను తీసుకువెళ్ళాలంది. అంతమాత్రాన సీత హింసావాదినా?

**మధు:** మగవాళ్ళకన్నా స్త్రీలు నయమని ఒప్పుకోవాలి. కాని రష్యాలో స్త్రీలుకూడా యుద్ధంలో పాల్గొంటున్నారు.

**అనంత:** తప్పనిసరి వచ్చిందా మా ఆడవాళ్ళు దద్దమ్మల్లా ఊరుకుంటారా అన్నగారూ, సత్యభామ నరకాసురుణ్ణి చావతన్నింది.

**కోనంగి:** రుద్రమదేవి మహాదేవరాజు డొక్కచీల్చింది.

**అనంతలక్ష్మి:** గురువుగారూ! మీరు వాదాని కెంతయినా గమ్మత్తుగా మాట్లాడు తారండీ! మొన్నేగా మీరు మమ్ము శాంతిదూతలని పొగడుతూ పాట వ్రాశారు? అది పాడి వినిపించరూ?

**మధు:** మంచిమాటన్నావమ్మా అనంతలక్ష్మి!

**సరోజిని:** ఆ పాట పాడండి!

**జయ:** కోనంగిరావుగారూ, పాడండి!

**కోనంగి:** మీ పాటముందూ, మీ అమ్మాయి పాటముందూ నా పాటేమిటి?

**అనంత:** అయితే ఎందుకు పాడారు నా ఎదుట?

**కోనంగి:** నువ్వూ నేనూ ఒకటే గనుక.

**అనంత:** అయితే, ఓ నేనూగారూ! ఓ పాట పాడండి.

**కోనంగి:** అయితే, ఓ నేనూప్రియా! పాటుతున్నా విను!

***రూపజిత స్వర్ణదీ***
***దీప్తిజిత జ్యోత్స్నాళి***
***ఆపలే రెవరు నీ***
***ఆనందజృంభణము!***

*ద్వేషదుర్గముపైన విజయయాత్రకు పోయి*
*క్రోధకుడ్యములెల్ల కూల్తు ప్రేమాస్త్రముల (రూ)*
*ఆటపాటల ప్రేమ అందాలపై ప్రేమ*
*కాటుకలదిద్దేటి కళలపై తన ప్రేమ (రూ)*
*ప్రణయలీలా నృత్యశృంగారనాయకీ*
*పంచమస్వనరాగ భావగీతిక ప్రేమ (రూ)*
*బంగారు శిశువు ఒడిని పాలిచ్చు సుత ప్రేమ*
*పతికి పరిచర్యలిడు పరమసతియై ప్రేమ (రూ)*
*ఆర్తికై కుందేటి అమృత ప్రేమాప్లవిత*
*అఖిల లోకద్వేష మాహుతించే దేవి (రూ)*

ఆ పాట కోనంగి మాయామాళవగౌళ రాగంలో పాడుతూ, సర్వలోకమూ మరచి, తన అనంతలక్ష్మినే చూస్తూ దివ్యభావాలతో కరగిపోయి కన్నుల నీరు నిండ నిలిచిపోనాడు.

అందరికీ కన్నుల నీరు తిరిగాయి. అనంతలక్ష్మి భర్తపై నిరవధిక ప్రేమ తన్ను ముంచెత్త కళ్ళల్లో తన గంభీరపూజ జ్యోత్స్నాకాంతిలా ప్రవహింప, లేచి వేగంగా నడచిపోయి తన పడకగదిలో మంచంమీద వాలి పోయింది.

కోనంగి అనంతలక్ష్మి వెనకాలే వెళ్ళాడు. కోనంగి రెండడుగులలో అనంతలక్ష్మి బోర్లగిల పండుకుని ఉన్న తమ పర్యంకము దగ్గరకు వెళ్ళి"ఏమిటిది అనంతా! ఏమిటి నీ ఆవేదన?" అని ఆతురతతో అడుగుతూ, మూర్తికట్టిన సౌందర్యమైన భార్య నడుముచుట్టూ తన ఎడంచేయి పోనిచ్చి ఆమె భుజాల చుట్టూ తన కుడిచేయి పోనిచ్చి తనవేపుకు తిప్పుకున్నాడు. అనంతలక్ష్మి మధురంగా నవ్వుతూ, కళ్ళనీళ్ళు తుడుచుకొని. భర్త చెంపలదిమి అతని కళ్ళల్లోకి తేరిపారి చూచి, "నా గురువుగారూ, నా భగవంతుడు గారూ, మీ పాటకు నా మనస్సు కరిగింది. ఏదో ఆవేదన నన్ను అదిమి వేసింది. ఆనందమూ, ఆవేదనా, అవి రంగరింపులయ్యాయి. మీ అందమయిన, అద్భుతమయిన పాటకూ, మీ అమృత గానానికీ తక్షణం కౌగిలించుకోవాలని బుద్ధి పుట్టింది. కాబట్టి ఇక్కడకు వచ్చాను. మీరు నా వెనకాలే వస్తారని నాకు తెలుసును" అంటూ అతని మోము తన వక్షానికి అదిమి పట్టి అతని జుట్టు ఆఘ్రాణిస్తూ, అతణ్ణి తనపైకి లాగుకొని గాఢంగా కౌగిలించి పెదవులు చుంబించింది.

కోనంగి, ఆమెను మరీ హృదయానకు అదుముకున్నాడు. తెప్పరిలి ఇద్దరూ ఒకరికొకరు దగ్గరగా మంచంమీద కూర్చున్నారు. కోనంగి తన ఎడంచేయి ఆమె నడుంచుట్టూ వేసి, కుడిచేత్తో ఆమె గడ్డం పట్టి మోమెత్తి, ఆమె కళ్ళల్లోకి పరికిస్తూ.

"ఆవేదన ఏమిటి శిష్యురాలా!" అని ప్రశ్నించాడు.

"లోక శాంతికోసం అంత ఆవేదన ఉందా మీకు?"

"ఎవరికి ఉండదు లక్ష్మీ!"

"మీ పాటవల్ల నాకూ ఓ పెద్దప్రశ్న బయలుదేరింది సుమండీ!"

"ఏమిటది చెప్పు వెన్నెల వెలుగూ!"

"ఎప్పుడూ నవ్విస్తారు. మీకు ముచికుంభత రానే రాదా?"

"ముచికుంభత ఏమిటి ముచికుందుడులాగ?"

"ముచికుంభత అంటే సీరియస్‌నెస్ తెలిసిందా? మా తంజావూరు ప్రాంతంలోనూ, రాయలసీమలోనూ ఇది విరివిగా వాడతారే. మీ కృష్ణా గోదావరీ వాళ్ళకు తెలుగు రాదేమిటండీ?"

"ఎంతదెబ్బ కొట్టావు జ్యోత్స్నాదేవీ!"

"ఈలా చూడండి! మీ ప్రేమ ఇంత పరమాద్భుతమై నన్ను ముంచెత్తుతోంది, చివరకు నా స్వాతంత్ర్యం లేకుండా నన్ను వట్టి బానిసనుగా చేసుకుందామనా? అప్పుడే సగం బానిసనయిపోయాను స్వామీ!"

"నేను నీకు బానిసను, మరీ బానిసను, ఏ మాత్రమూ వంపూసొంపూ లేని బానిసనయిపోయాను."

"మనిద్దరికీ ఇక స్వాతంత్ర్యం లేదా?"

"లేదు! లేదు! ముమ్మాటికీ లేదు!"

## 9

**కోనంగి:** డాక్టరూ! హిట్లరు మాస్కోను ముట్టడించాడు. మాస్కో పని ఏమవుతుంది?

**డాక్టరు:** లెనిన్‌గ్రాడును పట్టుకోగలిగాడా?

**కోనంగి:** లేదుకాని, రష్యావారిని ఓడించగలడా?

**డాక్టరు:** వారు తలక్రిందులయ్యేది, ఓడించలేడు. ఎందుకంటావా? రష్యా ప్రజలతో, వారి భావాలతో, ఆశయాలతో, హృదయంతో వీరు దెబ్బలాడాలి. జర్మనీవాళ్ళు అతి మిలిటరీవాళ్ళు. అతి మిలిటరీతనం మొదట విజయం సమకూర్చినా, చివరకు నాశన మయిపోతుంది. అదేగాదు, రష్యా ప్రజలతోనేగాక ఆ నాజీగాడు రష్యాతోనే యుద్ధము చేయాలి. అంటే, దేశం శత్రువు. యుద్ధయాత్ర చేయడానికి అనువయిన దేశంకాదు. దేశం పెద్దది, అనంతమైనది. దేశంలో ఏకాలం వచ్చినా, అత్యంతమయిన మార్పుతో వస్తుంది. జర్మనీ చుట్టూ కొండలు ఉండడంవల్ల జర్మనీవాళ్ళు భయంకరమైన శీతాకాలాలు ఎరుగరు. రష్యా శీతాకాలం రష్యావాళ్ళకు స్నేహితుడు. వాళ్ళకు ముఖ్య సేనాపతి.

**కోనంగి:** ఏమో బాబూ! నీ మాట నిజమయితే లోకానికి కళ్యాణం, నాకు అంతకన్న. అంతకన్న 'మహాత్మునివాదమే జగద్రక్షకరము' అన్నభావము నిశ్చయమయి ప్రత్యక్ష మౌతోంది. అందుకని హింసాత్మక తరగతిలో ఫస్టుమానిటర్ అయిన జర్మనీ సంపూర్ణముగా ఓడిపోతే, ఇకనేముంది! లోకంలో రెండవపాఠం నేర్పబడిందన్నమాటేగా!

**డాక్టర్:** ఒకవైపు అహింస అంటావు. ఒకవైపు రష్యా జర్మనీని నెగ్గాలంటావు. నీకు మతిపోతోందా?

**కోనంగి:** మాటల వెనకాల ఉన్న భావధ్వని తెలుసుకోలేని నీమెదడు మెత్తబడిందేమో నాయనా! కాస్త ధారా వైద్యం చేయించుకో.

**డాక్టర్:** ఏమిటా పిచ్చిధ్వని?

**కోనంగి:** లోకానికి ఎప్పటికన్నా ఉత్తమమార్గం అహింసా, సత్యాలే. ఈలోగా హింసామార్గం అవలంబించిన రెండుదేశాల విషయం ఆలోచిస్తే, ధర్మం ఎవరిపక్షం ఉందో వాళ్ళవైపు మొగ్గుతుందని నాబోటి వాళ్ళ హృదయం!

**డాక్టర్:** నీబోటివాళ్ళ హృదయాల విశిష్టత ఏమిటి నాయనా?

**కోనంగి:** అహింసా సత్యమార్గాలంటే యిష్టంపడి, ఆ దారిలో ప్రయాణించేయ ప్రయత్నించే వాళ్ళ హృదయాలన్నమాట కత్తిచేతరాయా!
**డాక్టర్:** ఒకటి మనవి చేసుకుంటా ఉండు, జావకుండ చేతిరాయా!
**కోనంగి:** మనవి చేసుకోవచ్చునయ్యా స్టెతస్కోపు ఆయుధహస్తా!
**డాక్టర్:** ఆకర్ణింపుము చీపురుకట్టహస్తా.
**కోనంగి:** చెవి ఒగ్గి నాయనా థర్మామీటరు కొలతబద్ధ విభూషా!
**డాక్టర్:** లోకంలో కడుపునిండా తిండి తినేవాళ్ళు పదికోట్లు. ముప్పాతిక తిండి మాత్రమే కలవాళ్ళు పదిహేనుకోట్లు. అర తిండి కలవాళ్ళు ముప్పదికోట్లు. పావు తిండి కలవాళ్ళు ఆరవైకోట్లు. పాతికకోట్లకు ఏమీ తిండేలేదు.
కోనంగి: రెట్టింపు తిండి ఉన్నవాళ్ళూ, లెక్కలేనంత తిండి ఉన్న వాళ్ళూ, వాళ్ళ లెక్కచెప్పవేం?
**డాక్టర్:** రెట్టింపుతిండి ఉన్నవాళ్ళు పదికోట్లు ఉంటారు. అయిదు రెట్లు తిండి ఉన్న వాళ్ళు రెండుకోట్లు ఉంటారు. ఏభై రెట్లు తిండి ఉన్నవాళ్లు పది లక్షలు ఉంటారు. వేయిరెట్లు తిండి ఉన్నవాళ్లు పదివేలుంటారు. లక్షరెట్లు తిండి ఉన్నవాళ్ళు నూరుమంది ఉంటారు. పదిలక్షల రెట్లు తిండి ఉన్నవాళ్లు ఒకరో ఇద్దరో ఉండక తప్పదు.
**కోనంగి:** సరే! అంచనాలు నిజమే అనుకుందాము...
**డాక్టర్:** నిజమే అనుకోక అబద్ధం అనుకో! నీబోటి బూర్జువాలు ఏదయినా అనుకుంటారు. బీదతనం ప్రపంచంలో పోకూడదు. మానవ బానిసత్వం పోకూడదు. అహింసా, అహింసా అని వాగే నీబోటి దద్దమ్మలే హింసావాదులు. డయాబిటీసు వచ్చి మధుమేహవ్రణం వేస్తే, తులసి ఆకులతో మంత్రించే నీబోటివాళ్ళు రక్తంతాగే జాతి వాళ్ళు. ఆపరేషను చేస్తే తప్పా? అది హింసా? రోగిని మంటగలిపే మంత్రించిన నీళ్ళప్రయోగం అహింసా?
**కోనంగి:** అంతకోపం యెందుకు నాయనా?
**డాక్టర్:** కోపంకాదూ! ఎంతకాలము ప్రపంచం ఊరుకుంటుంది? ఎంతకాలం ప్రజలు ఊరుకుంటారు? ప్రజాచైతన్యం విజృంభిస్తోంది రష్యా నెగ్గనీ, ఈ బూర్జువాల, నీబోటి పూంజీదారుల ప్రభావమూ, శక్తీ మంటగలిసి పోతుంది.
**కోనంగి:** వినండి వినండి, అని కేకలు నేను. సామ్యవాదం జిందాబాద్! పూంజీదారులు మురదాబాద్! అని గందరగోళం.
**డాక్టర్:** ఏమిటి నువ్వనేది?
**కోనంగి:** నాటకంలో భాగం అప్పజెప్పుతున్నా.
**డాక్టర్:** నీ వ్యాపారం అంతా నాటకంలాగే ఉంది. డబ్బుగల పిల్లను చేసుకొని కులుకుతున్నావు.
**కోనంగి:** దెబ్బకొట్టు! "నువ్వు కూడా నా బ్రూటసూ" అన్నట్టు నువ్వూ చెట్టిగారితో చేయిచేయీ కలుపు.
**డాక్టర్:** నువ్వు ఏం చేస్తున్నట్లు?
**కోనంగి:** నాకు అనంతలక్ష్మి ధనం కావాలా? ఐశ్వర్యం కావాలా? నా బ్రతుక్కి ఆవిడ డబ్బులో ఒక్క దమ్మిడీ అయినా వాడుకోను. నాకు అత్తగారింటిలో ఆంబోతులా పెరుగుదామని ఉందనుకున్నావా? నేను తీవ్రంగా ఒక విషయం ఆలోచిస్తున్నాను.
**డాక్టరు:** ఏమిటా మహత్తర విషయం?

**కోనంగి:** దానికి మా అనంతమే కారణభూతురాలు. ఆవిడగారు నన్ను ఒక తెలుగు దినపత్రిక పెట్టమంటూంది. ఇదివరకే స్థాపితమై నేడు భూస్థాపితమయినంత పనైన ఒక దినపత్రికను నామకః డబ్బుపెట్టి కొనమంది.
**డాక్టరు:** పెట్టుబడి?
**కోనంగి:** తాను ఒక లక్షరూపాయలు పెట్టుబడి పెడుతుందట!
**డాక్టర్:** వారేవా! కాని ఏదో పనిచేయి. నీ దృష్టిలో నూతన దృక్పథం తీసుకురా. ఆ పేపరు పేరు?
**కోనంగి:** "నవజ్యోతి" ఆ పేపరు 1936లో బయలుదేరి 1937లో తొంగుంది. అందుకు సంబంధించినవన్నీ అమ్ముడుపోయాయి. పేరు మిగిలింది. కంపెనీ లిక్విడేటు కాలేదు. మా అనంతం క్లాసుమేటు స్నేహితురాలిని తీసుకొనిపోయి, ఆ అమ్మాయి తండ్రి ప్రభుత్వ అడ్వైజరీగారిని సలహా అడిగింది. ఆయనా కాగితం 'కోటా' (వంతు) ఇప్పిస్తానన్నాడు.

కోనంగి డాక్టరుగారితో అన్న ముక్కలు నిజమే! దినపత్రిక పెట్టడం చాలా ముఖ్య మనుకున్నాడు. ఏ రాజకీయ పక్షంవైపూ మొగ్గకుండా ఉండడం మొదటిరోజులలో, తర్వాత "అటునుంచి ఇటు నరుక్కురమ్మన్నాడు" అనుకున్నాడు.

పేపరు జయలక్ష్మి అనంతలక్ష్ముల పేరను కొనవలసి వచ్చింది. పత్రికామందిరానికి హారిస్‌రోడ్డులో ఒకపెద్ద మేడిల్లు అద్దెకు పుచ్చుకున్నాడు. డాక్టరుగారి సహాయంతో ఒక చిన్న రోటరీ మిషను రెండు వేలకు కొన్నాడు.

రియాసత్ ఆలీ అడ్వర్‌టైజ్‌మెంటు మేనేజరు పని చేసేవాడు. అనంతలక్ష్మి కోనంగిరావులు సంపాదకులు. మధుసూదనరావు మేనేజరయ్యాడు. ఇతర ఆంధ్ర దినపత్రికలలో పనిచేసే ఇంకొక పెద్దమనిషి సుబ్బారావుగారు వార్తా సంపాదకుడు. ఇంకా ఇద్దరు అనుభవంగల యువకులు ఉపసంపాదకులయ్యారు.

అనంతలక్ష్మి స్నేహితురాండ్రూ కారులమీద పోయి నెలరోజుల వరకు ప్రకటనలు రోజుకు పదిహేను నుండి ముప్పదివరకూ వచ్చే ప్రకటనలు పట్టుకువచ్చారు.

జయలక్ష్మి తాను బాగా ఎరిగిన అరవయ్యంగారు జ్యోతిష్కుని ఒకరిని పట్టుకొని ముహూర్తం పెట్టించింది.

హారిస్‌రోడ్డులోని "నవజ్యోతి" కార్యాలయానికి అన్నీ జేర్చి, ఆ కార్యాలయం సిద్ధం చేసేటప్పటికి 1941 సెప్టెంబరు నెలాఖరయింది.

టైపు ఏది పెట్టాలని వాదన వచ్చింది. పాయింటుటైపు అందం అంటాడు డాక్టర్‌గారు. మధుసూదనుడు పూర్వకాలపు జి.పి., ఇంగ్లీషు బాడీలు ఉత్తమం అంటాడు.

చివరకు డాక్టర్‌గారి మాటే నెగ్గింది. టైపు కేసులు వచ్చాయి. కంపోజిటర్లు చేరారు. అక్టోబరు నెలలో ప్రారంభ ముహూర్తం.

## (10)

వెనుకటి 1914 ప్రపంచయుద్ధానికీ, ఈనాటి ఈ రెండవ ప్రపంచ యుద్ధానికీ ఎంతో తేడా ఉంది.

వెనుకటి యుద్ధానికీ ఈ యుద్ధానికీ పోలికలు కొన్ని ఉన్నాయి.

1. ఆ యుద్ధమూ ఈ యుద్ధమూ ప్రారంభించిన మహానుభావులు జర్మనీవారు.
2. ఈ రెండు యుద్ధాల్లో ఇంగ్లీషువారూ, ఫ్రెంచివారూ మిత్రమండలి అయ్యారు.

"ఇంక తక్కినవన్నీ తేడాలే. అప్పుడు జర్మనీ ఫ్రాంసులోనికి కొంతదూరమే చొచ్చుకు వచ్చింది. అక్కడ నిలవరించారు ఆనాటి మిత్రమండలివారు.

"అప్పుడు రష్యా మొదటి నుండీ మిత్రమండలి తరఫున ఉంది. ఈ రోజున రష్యా మొదట జర్మనీతో సంధి చేసుకొని, తర్వాత జర్మనీవాళ్ళ దౌర్జన్యంవల్ల యుద్ధంలో చేరింది.

యింక యుద్ధంలోని యిరువాగులవారి బలాబలాలను నిర్ణయించడం పూనుకొంటే తేలే అంశాలు:

1. జర్మనీ తన మొదటి ఓటమిని మనస్సులో ఉంచుకొని సంపూర్ణంగా తయారై యుద్ధంలోకి దిగింది. కాబట్టే జర్మన్‌లకు యూరోపు ఖండంలో (రష్యా తప్ప) సంపూర్ణ విజయం చేకూరింది.

2. ఇవతల ఇంగ్లీషువారూ, ఫ్రెంచివారూ యుద్ధానికి సిద్ధంగా లేరు. ముఖ్యంగా ఫ్రెంచి రాజకీయ నాయకులలోనూ, యుద్ధ నాయకులలోనూ ఐకమత్యతలేదు. కాబట్టి జర్మనీదాడిని అడ్డుపెట్టడానికి నిర్మించిన మేజినాటు రక్షణశ్రేణి పూర్తికాలేదు. ఆ కారణం చేతనే ఫ్రాంసులోనికి జర్మనీ సైన్యాలు మూడురోజుల ప్రయత్నముతో జొరబడగలిగాయి.

3. పైగా ఫ్రెంచివారిలో దేశభక్తి ఉన్నా, పార్టీభక్తి ఎక్కువై, అదే జన్మాశయమై వారి దారిని కుంటుచేసింది. కొందరు ఆంగ్ల ప్రేమికులు, కొందరు జర్మన్ ప్రేమికులు, కొందరు రష్యా ప్రేమికులు, జర్మన్ ప్రేమికులు కొద్దిమందైనా బలవంతులు. కాబట్టి ఫ్రాంసు తనకు పూర్తిగా తెలియకుండానే జర్మన్ యుద్ధ జగన్నాథ రథచక్రాల క్రింద పడి నలిగిపోయింది.

4. "ఇంగ్లీషువారు ప్రజా ప్రభుత్వవాదులు, యుద్ధప్రియులు కారు కాని, సామ్రాజ్యప్రియులు. యుద్ధంకోసం దేశాన్ని తయారుగా ఉంచడం అన్నభావం వారిని క్రోధపూరితులను చేస్తుంది. రాజ్యం ముప్పాతిక పూంజీదారుల చేతులలో ఉంది. అయినా తమ రాజ్యపాలన విషయంలో ప్రజారాజ్య విధానసూత్రం వారికి గాఢాశయం. అది వారి స్వప్నం, వారి పోలీసులు, వారి న్యాయస్థానాలు, వారి న్యాయవిధానం ప్రపంచ శిఖరితం. అందుచేతనూ, వారి దేశం చుట్టూ తవ్వని బ్రహ్మాండమైన అగడ్తగా సముద్రం ఉండడంచేతనూ, వారికి వారు ఉత్తమ నావికులు అనే సంపూర్ణ నమ్మకం ఉండడంచేతనూ, వారి నౌకాబలం నిజంగా మంచిదవడంచేతనూ యుద్ధము వస్తోంది అని వారికి తెలిసినా వారు యుద్ధానికి సిద్ధంగా లేరు.

"ఈ కారణాలచేత జర్మనీవారు అవిచ్ఛిన్నంగా విజృంభింపగలిగారు. కాని ఇంగ్లీషువారి ఓపికా, ఆంగ్ల సామ్రాజ్యముయొక్క సంపూర్ణశక్తీ జర్మనీపైన ప్రయోగించ బడలేదు. ప్రయోగింపబడితే వారి వారి బలాబలాలు ఎలా ఒకదాన్ని ఒకటి ఎదుర్కోగలవో మనం చెప్పలేము.

"ఒక్కటిమాత్రం మిత్రమండలివారికి అతిబలం చేకూర్చగల సంస్థ ఉంది.

"ఆ సంస్థే అమెరికా. అమెరికావారు స్వాతంత్ర్యప్రియులు. అమెరికాలో ఎందరు ఇతర యూరోపియను జాతులవారు చేరినా ఆ దేశంలో పుట్టి మహావృక్షంలా పెరిగిన తత్వం మధ్యమాంగ్లతత్వం.

"అందుచేతనే అమెరికా వారికి ఆంగ్లేయులంటే మహాయిష్టం. ఆమెరికా కోటీశ్వరదేశం. ఆకాశహర్మ్యదేశం. ఏ పని చేసినా అమెరికా వారి అంచనాలు, ఆశలు,

అశయాలు మహత్తరాలు. వాళ్ళ దేశమే అలాంటిది. ప్రపంచంలోకల్లా పొడుగాటి పెద్దనది వాళ్ళదేశములో ఉంది. ప్రపంచంలోకల్లా పెద్ద మంచినీళ్ళ చెరువు వాళ్ళ దేశంలోఉంది అందుకనే వాళ్ళు నిర్మించుకున్న జాతీయ క్రీడావనం వేలకొలదీ చదరపు మైళ్ళుంది.

"అలాంటి అమెరికాకు ప్రజ్ఞావంతుడయిన రూజువెల్టు అధ్యక్షుడు. ప్రపంచంలో శాంతి ఉండాలని కోరే ఉత్తమ పురుషుడు. శాంతికోసం వేయి విధాల ప్రయత్నించాడు. హిట్లరుకి, ముసోలినీకి స్వయంగా ఉత్తరాలు వ్రాశాడు 'శాంతి శాంతి!' అని. కాని లాభం లేకపోయింది.

"వెనుక వుడ్రో విల్సను అధ్యక్షుడు, అమెరికా ప్రపంచ రాజకీయాలలో భాగం ఉంచుకోవాలి, తన పధ్నాలుగు సూత్రాలు ప్రపంచంలో ఆచరణలోకి రావాలి అని వాదించి తన దేశాన్నే ఒప్పించలేక కుంగిపోయాడు."

"కాని అమెరికా ఇంగ్లండుకు, ఇప్పుడు యుద్ధంలోకి దిగిన రష్యాకు ఎంతయినా సహాయంచేస్తా నన్నది. అమెరికా 'అప్పు–కౌలు చట్టం' తీర్మానించి సహాయం చేస్తోంది.

"ఇంక రష్యా విషయంలో ఆలోచిస్తే, హిట్లరు రష్యాపైన ఉరకడం నాజీతత్వ నాశనానికే అని మా దృఢనిశ్చయం. రష్యా అమెరికాకు రెండు రెట్లున్న దేశం. అమెరికా ఎల్లా అయితే మహత్తత్వాన్ని ప్రదర్శిస్తుందో అల్లాగే రష్యా. రష్యామీద విజృంభించి ఏ మహావీరుడూ విజయం పొందలేదు. ఈనాడు రష్యా పదహారణాలూ రష్యావారిదే. రష్యాదేశం, రష్యా శీతాకాలం, రష్యా ప్రజలు సంపూర్ణంగా హిట్లరుతో ప్రతి అంగుళ దశాంశమూ యుద్ధం చేశారు. రష్యాలోనే నాజీపురుషుని గోరీనిర్మాణమై ఉందని మా నమ్మకం.

రష్యా నాయకుడు స్టాలిన్ అంటే ఉక్కుమనిషి వజ్రాన్నయినా ఖండించే ఉక్కుమనిషే. అతడే రష్యా, రష్యాయే అతడు."

"ఇంక ఇవతల పక్షంలో హిట్లర్. హిట్లర్‌లోని శక్తి ఫ్రాంకెయిన్ స్టెయిన్ శక్తి, జర్మనీలోని యుద్ధప్రియ రాక్షసత్వం తన విజృంభణకోసం సృష్టించుకొన్న భూతం హిట్లర్. ఆ భూతానికి ఆత్మలేదు. కాబట్టి ఆ భూతాన్ని ఆ అమిత యుద్ధ దాహానికే మింగేస్తుంది."

ముసోలినీ రూపానికి భయంకరుడే. బూచివాడంటివాడు. లబ్సీనియా, లిబియా, ట్రిపోలీ, మొరాకోలవంటి చంటిబిడ్డల్ని బెదరించే పెద్దవాడు. మొదట హిట్లర్ని అలాగే బెదరించాడు! ఇప్పుడు ఎరిట్రియా, అబ్సీనియాలు క్షవరం చేసుకుంటున్నాడు.

"ఇంక మిగిలింది జపాన్. జపాను నిజంగా ప్రాచ్యదేశాలకు నాయకత్వం వహించదలచుకుంటే, చీనాతో యుద్ధం మానేసి, చీనాకు తాను చేసిన ద్రోహానికి ప్రాయశ్చిత్తం చెల్లించి, తన శక్తిని నాజీ రాక్షసత్వాన్ని నాశనం చేయడానికి ఉపయోగించాలి. కాని నాజీ యుద్ధతత్వాన్ని పోలిన యుద్ధతత్వం జపానుది. ఉండి ఏ రష్యామీదో విరుచుకుపడి, ఏ ద్రోహం చేస్తుందో ఎవరికి తెలుసు?"

ఈ రకంగా కోనంగి మొదటిరోజున 'నవజ్యోతి' రెండవ సంపాదకీయం వ్రాశాడు. ఆ రోజు మొదటి సంపాదకీయం 'మేము' అనేది. అందులో ఆ దినపత్రిక ఆశయాలూ, కార్యక్రమమూ తెలుపుతూ ఆంధ్రదేశసేవా, భారత జాతీయసేవా, ప్రపంచ భద్రతాభిరక్తీ తమ కార్యక్రమానికి ఆధారాశయాలు అనిన్నీ, ఆంధ్రులకు ఈ నూత్న పత్రికా శిశువును పోషింప ముఖ్యబాధ్యత ఉందనిన్నీ వ్రాసినాడు.

ఏకాదశ పథం

# సంపాదకుడు

కోనంగిరావుగారు పత్రిక ప్రారంభించి రెండు నెలలన్నా పూర్తి అయిందో లేదో జపాను పెరల్ హార్బర్‌పై విరుచుకుపడింది, 1941 డిశంబరు 9-వ తారీఖున.

పత్రిక ప్రారంభించిన శుభముహూర్తం నుంచీ రియాసత్ ఆలీ విజృంభించాడు. బొంబాయి కలకత్తాలు తిరిగాడు. న్యూఢిల్లీ వెళ్ళినాడు. ప్రభుత్వం వారి వివిధ ప్రచారశాఖల ప్రచురణల పరంపరలన్నీ సంపాదించాడు అన్ని పత్రికలలో పడే మందుల కంపెనీల ప్రచురణలు "మహాత్ముల వరప్రసాదలబ్ధ పంజాబ్ ఔషధాలు, మహోత్తమ జ్యోతిష్యుల అతి నిజమయ్యే ఫలితాలు, ఎంత ముసలివాడయినా పది మోతాదుల సేవనతో ముప్పదేళ్ళ కౌమారం ఇచ్చే దివ్యౌషధాలు." ఈలాంటి వాటి ప్రచురణ ప్రచార జైత్రయాత్రలు కొట్టుకువచ్చాడు.

రియాసత్ ఆలీ పొడుగరి. అందమయినవాడు, స్ఫురద్రూపి. ఇంటరు బి.ఏ.లలో రెండవభాష తెలుగు పుచ్చుకున్నాడు. ఐచ్ఛిక విషయాలు: ఉరుదూ, అరబిక్, పర్షియన్ భాషలు.

అతనికి వరవడి మౌలానా అబ్దుల్‌కలాం అజాద్. రియాసత్ తీయని తెలుగు వ్రాస్తాడు, గంభీరంగా ఉరుదూ వ్రాస్తాడు. సాధుమూర్తి. కాని కోపం వస్తే రుద్రుడు అవుతాడు. భక్తుడు. ఉదయ సాయంకాలం ప్రార్థన చేసుకుంటాడు. నిజమయిన మతభక్తుడు. తక్కిన మతాలను ద్వేషించకూడదని అతని వాదం. మతం వ్యక్తిపరమయినదని దృఢంగా నమ్ముతాడు.

ఎక్కువ బలంకలవాడు కాడుకాని, గట్టి ఆరోగ్యం కలవాడు.

అతని ప్రేమనిధానం మెహరున్నీసా! ఇద్దరూ మేనత్త మేనమామ బిడ్డలు. చిన్నతనాన్నుంచీ ఒకరిని ఒకరిని ప్రేమించుకొన్నారు. ఈనాడు రాజకీయంగా వేరు వేరు భావాలు కలిగి ఉండడంవల్ల విడిపోవలసివచ్చింది. భర్త కాంగ్రెసు, భార్య ముస్లింలీగు; యెందుకు ఉండకూడదని అతడంటాడు. భార్యాభర్తలిద్దరూ ఒకే రాజకీయ మతవిషయికాభిప్రాయాలు కలిగి ఉండాలని మెహర్ వాదన.

ఆ పరిస్థితులలో రియాసత్ తన మేనమామ ఇంటిలో ఉండలేక పత్రికా కార్యాలయానికి దగ్గరగా ఉన్న ఒక మేడలో రెండుకొట్లు, ఒక వంటయిల్లు అద్దెకు తీసుకొని ఒక ముస్లిం వంటవాణ్ణి పెట్టుకొని కాపురం ఉంటున్నాడు. ఆ వంట మనిషే అతనికి సేవకుడు. ఆ వంట మనుష్యుని పేరు ఫజిల్.

కోనంగి, రియాసత్, మధుసూదనలూ, డాక్టరు అంతకన్న అంతకన్న ఒకళ్ళొ కళ్ళు విడరాని స్నేహంలో ఓలలాడిపోతున్నారు.

జపాన్ పెరల్ హార్బర్‌పై విరుచుకుపడింది అనగానే నలుగురు స్నేహితులు నాలుగు రకాలుగా వ్యాఖ్యానం చేశారు.

**కోనంగి:** నేను జపాను రష్యామీదకు ఉరుకుతుందని వ్రాయడం ఉద్దేశం జపాను యుద్ధంలోకి దిగుతుందని మాత్రమే. జర్మనీ మల్లేనే జపానూ సిద్ధమయి ఉంది. జర్మనీకన్న జపానుకు నౌకాబలం చాలా ఎక్కువ అంతే తేడా!
**మధు:** ఇంత ఆలస్యంగా జపాను రంగస్థలంలోనికి రావడం వట్టి తెలివితక్కువ పని. ఇదివరకే జర్మనీతోపాటు వచ్చి ఉంటే రష్యా పని అయి ఉండును.
**డాక్టరు:** ఏమి నాయనా, నీకు రష్యామీద అంతకోపం?
**మధు:** నాకు రష్యామీద కోపం లేనేలేదు. నాకు కావలసినది, భారతదేశానికి విముక్తి.
**రియాసత్ ఆలీ:** విముక్తికోసం ప్రపంచంలోని దేశాలన్నీ కొట్టుకుచావాలా?
**మధు:** చావవా అంట! ఇన్నాళ్ళ నుంచి ప్రాచ్యదేశాలను పీడించుకుతిన్న పాపఫలితం ఎక్కడికి పోతుందీ?
**కోనంగి:** పాపఫలమో, పుణ్యఫలమో నాకు తెలియదు. కాని, జపాను తన నాశనం తానే భస్మాసురునిలా తెచ్చి పెట్టుకుంటుందని నా వాదన.
**రియాసత్:** అన్ని రాజ్యాలు ఈ ప్రపంచ యుద్ధంలో క్షవరం ఔతాయి. ఈ దెబ్బతోనన్నా ఈజిప్టు, లిబియా, మొరాకో, అల్జీరియా, పాలస్తీనా, ట్రాంసు జోర్డాను, సిరియా, ఇరాక్‌లకు విముక్తి దొరికి తీరుతుందని నా ఉద్దేశం.
**డాక్టరు:** చక్కని ఉద్దేశమేకాని, ఈ పట్టు ప్రపంచయుద్ధంలో జర్మనీ పుణ్యంవల్ల ప్రాచ్యదేశాలకన్నిటికీ స్వాతంత్ర్యమూ సామ్యతత్వమూ రెండూ కలిసి వస్తాయని నా నమ్మకం.
**మధు:** చివరదొక్కటే వస్తుందని నీ ఉద్దేశం కాద్రేమేడు!
**డాక్టరు:** (పకపక నవ్వుతూ) కాదా మరి! ఎవరి విధానం వారికి రావాలని ఉంటుంది. ఏమి సంపాదకీయం వ్రాస్తావు కోనంగిరావ్?
**కోనంగి:** నేను పత్రికా ప్రపంచంలో ప్రవేశించడమే సంపాదకునిగా. అయినా ఈ రెండు నెలలు దంచేశానా, లేదా?
**డాక్టరు:** ఊఁక!
**రియా:** నీ సామ్యవాదం వస్తే వడ్ల దంపా డాక్టరూ?
**మధు:** నా ఫార్వర్డు బ్లాకు వస్తే గోధుమ దంపు.
**కోనంగి:** ఏమి చిత్రంగా ఉందీ మన పేపరు? నా సినిమా స్పెషల్ వ్యాసరాజంబులు అమృతంగా ఉంటున్నాయా లేదా?
**డాక్టరు:** నీ వ్యాసాల మాటకేంగాని, మీ ఆవిడ దంచేస్తోంది. వెనుక ఇంగ్లండులో సఫ్రెజెట్ ఉద్యమంలో కూడా ఆడవాళ్ళ వ్యాసాలు, ఉపన్యాసాలు అంత ఘట్టిగాలేవే?
**కోనంగి:** మా అనంతం ఏమిటో అనుకున్నావు. నా ప్రతి సంపాదకీయం క్రిందా స్త్రీ సమస్య ఒక్కొక్కటి తీసుకొని తాను ఉపసంపాదకీయం వ్రాస్తోంది.
**మధు:** తాను పరీక్షకు వెడుతుందా! నువ్వు ఈ పని ప్రస్తుతం నాకు వదలవమ్మా తల్లీ అని మా సరోజ అంటే వినదు! రాత్రి పాఠాలు చదువు కున్నాక, తన సంపాదకీయం వ్రాస్తోంది.
**రియాసన్:** సరోజినీదేవి మాత్రం తన ప్రత్యేక స్త్రీ సమస్యా చర్చల భాగము అద్భుతంగా నిర్వహిస్తోంది.
**డాక్టరు:** ఒక దినపత్రికలో ఒక అర్ధపేజీ, ఆఖరుకు మూడుకాలాలు స్త్రీ సమస్యలతో, వార్తలతో నింపుతోంది సరోజినీదేవి, చాలా దిట్టంగా పనిచేస్తోంది.

**కోనంగి:** ప్రపంచ స్త్రీల వార్తలు, స్త్రీల హక్కుల వ్యాసాలూ–మా చెల్లెలుగారు దయనమో!
**మధు:** అన్ని మహిళా సమాజాల నుండి వార్తలే!
**కోనంగి:** మనం ప్రస్తుతం వ్యాసాలు వ్రాసే సోదరీమణులకూ, వార్తలు పంపే మహిళామణులకూ ఏదో కొంచెం ముట్టచెప్పాలి. ఏమంటావయ్యా రియాసత్?
**రియా:** అట్లాగే ప్రారంభిద్దాము.

దినపత్రిక ఒక పెద్ద సంస్థ. పేపరుకి సాయంకాలం ప్రచురణ సంచికలు కట్టలుగా రైల్వే పార్సిళ్ళుగా వెళ్ళాలి. విడి సంచికలు పోస్టాపీసుకు పోవాలి. ఉదయం సంచికలు పట్టణంలో అమ్మకానికి.

చెన్ననగరమంతా ఏజంట్లను పెట్టినారు. పత్రిక అంతకన్న అంతకన్న స్త్రీలు ఎక్కువ కొనుక్కొనసాగించారు దినదినమూ. స్త్రీలకోసం యేర్పడిన దినపత్రిక ప్రపంచంలో ఇంకోటిలేదు. ఇంతవరకు స్త్రీలు వార్తాహరులుగా పాశ్చాత్యదేశాలలో ఎక్కువగా ఉన్నారు. ఇప్పుడు "నవజ్యోతి" ఆంధ్రభాషలో వార్తాహరులను ఏర్పాటు చేయగలిగింది. అంతకన్న అంతకన్న కార్యాలయంలో స్త్రీభాగం పెద్దది చేయవలసి వచ్చింది, ఇద్దరు ఉప సంపాదకురాండ్రు పనిచేస్తున్నారు.

పత్రికకు టెలిప్రింటరు సంపాదించారు. ఆడవాళ్ళు తలుచుకుంటే, రాయిటరు ఏజంట్లూ గీజంట్లూ ఆగుతారా?

## (2)

**జ**పాను యుద్ధంలో ఉరికింది. ఆ మర్నాడు అమెరికా యుద్ధం ప్రకటించింది. వెంటనే జర్మనీ ఇటలీలు అమెరికామీద యుద్ధం ప్రకటించాయి.

"అమెరికా యుద్ధంలోకి రావడంయొక్క పరమార్థం వీరభద్రుడు దక్షయజ్ఞంలోకి ఉరకడం అన్నమాటే! హనుమంతుడు అశోకవనంలోకి దూకడం అన్నమాటే!" అని కోనంగి సంపాదకీయం వ్రాశాడు.

ప్రపంచ రాజకీయాలు, భారతీయ రాజకీయాలు కోనంగి ఎల్లా అర్థం చేసుకున్నాడో! అనంతలక్ష్మి తన చదువు కాగానే భర్త ఒళ్ళోకి వాలుతుంది. కోనంగీ, అనంతమూ నిత్య ప్రేమికులయిపోయారు. అనంతం భర్తను ప్రపంచ రాజకీయాలు అడుగుతుంది. భార్యకు రాజకీయాలు చెప్పుతూ కోనంగి తన భావాలను స్పష్టం చేసుకుంటాడు. మాటలలో అతనికి కొత్త కొత్త భావాలు వస్తూ ఉంటాయి. తన నూత్నోద్భవ భావాలకు తానే ఆశ్చర్యం పొందుతాడు. అవి విపులం చేస్తాడు అనంతలక్ష్మికి పాఠం చెప్పినట్లు.

అనంతలక్ష్మికి పాఠం చెబుతోంటే వారిద్దరూ బ్రహ్మ సరస్వతులౌతారు. లోకాన్ని దర్శిస్తూ వారిద్దరూ లక్ష్మీనారాయణులౌతారు. వారి ప్రేమలో వారు అర్ధనారీశ్వరులౌతారు.

"అనంతం! ఉదయం కార్యాలయానికి పోతానా–అక్కడ ఒంటిగంట వరకూ, జనరల్ మేనేజరు, మీ అన్నయ్య అయ్యంగారున్నారే ఆయనా, నేనూ పత్రికల పంపకం వగయిరా వ్యాపారాలన్నీ వివిధశాఖల వారితో సంప్రతించి ఏర్పాట్లు చేసుకుంటాము. ఒంటిగంటకు అత్తగారు పంపిన ఉపాహారం అందుతుంది. రెండుగంటల నుండీ మూడువరకు దినపత్రికలు చదువుతాను. ఈలోగా రేడియో వార్తలు వింటాను. మూడుగంటల నుండి అరగంటలో వచ్చిన వార్తలూ, అందులో పత్రికలలోకి తర్జుమా అయిన వార్తలూ చూస్తాను. ఒక ముఖ్య విషయం ఏరుకొని అరగంటలో సంపాదకీయం దంచేస్తాను. ఇంత చేస్తున్నా నా జీవిత సామ్రాజ్ఞి నా ఎదుటే?"

"అదేమిటండీ, ఎంత ప్రేమించినా అస్తమానమూ ప్రియురాలిని తలుచుకుంటూ కూర్చుంటారా ఏమిటి?"

"నయమే నిన్ను చదువు మానివేయమని పొద్దస్తమానాలు నా కౌగిలింతలో ఇమిడించుకు కూర్చొని ఉండలేదుగా?"

"ఏమో, మీ వ్యాపారం చూస్తే అంతపనీ చేసేటట్టే ఉన్నారు."

"లేకపోతే ఏ ఆడవేషమో వేసికొని, నీతో కాలేజీకి రావలసి ఉంటుంది."

"వెనుకటికి మీ వంటి ఒక నవకవి-

"ఓసి ప్రియురాల! నిను వీడి ఒక్కక్షణిక

మైన మనజాల నగుట నీ మేన దాల్చు

వలువనై కంచుకమునై భూషలునునై త్వదీయ మధుర లోచనముల దీప్తినగుదు"

అన్నాట్ట.

అల్లాగే నా జడలోని పూలదండై నాతోనే రండి."

"అలాగే అనిపిస్తుంది అనంతం! అనంతంమీద అనంతమయిన ప్రేమ గలిగిన అనంగసుందరుడైన కోనంగి ఆమె పెదవులపైన రేకలు, కనుబొమల వంపు, గడ్డం క్రింద పుట్టుమచ్చ, అరచేతి ఎరుపు అయిపోయాడని ఈరోజు మాకు రాయిటరు వార్త వచ్చింది."

"ఎవడావార్త పంపిన వార్తాహరుడు?" (కోపం నటిస్తూ)

"పురుషుడు కాదు. స్త్రీ ప్రత్యేక విలేఖరి!"

"ఎవరామె చెప్పండి. ఇప్పుడే తక్షణం?" (ఇంకా కోపంగా)

"ఆమె నేంచేస్తావు?"

"కౌగలించుకుంటాను."

"పురుషుడయితే ఏమి చేసి ఉందువు?" (కంగారుగా)

"హల్లో బ్రదర్ అని షేక్‌హాండ్ చేసి ఉందును!"

"వహ్వా!"

"గురువుగారూ! జపానుమీద మీరు వ్రాసిన సంపాదకీయం ఎంత బాగుందండీ! భాష బాపూజీగారి ఇంగ్లీషులా ఉంది. ఆ సంపాదకీయం మూడు సార్లు చదువుకున్నాను."

"ఇంగ్లీషు పత్రికలకు ఇదివరకే సంపాదకుడుగా గాని, మంచి సహాయక సంపాదకులుగా గాని పేరున్నవాళ్ళే కావాలి! తెలుక్కి ఇప్పుడే సంపాదకజాతి ఉద్భవిస్తోంది. అదివరకు పేరుపొందిన సంపాదకులు ముట్నూరి కృష్ణారావుగారు, కీ.శే. దేశోద్ధారక నాగేశ్వరరావుపంతులుగారు."

"ఆంధ్రప్రభ నారాయణమూర్తిగారో?"

"వారు కొత్తగా ఉద్భవించిన సంపాదక కుమారులలో పెద్ద కుమారుడు."

"సహాయకులుగా చాలామంది లేరుటండీ మరీ మీరు?"

"ఉన్నారు ఉపసంపాదకులు వారంతా పైకి రావలసినవారే. ఏవీ తెలుగు దినపత్రికలు?"

"మన దేశానికి ఎన్ని దినపత్రికలుండాలని మీ ఉద్దేశం?"

"తెలుగువారి జనాభా మూడుకోట్ల యాభై లక్షలు ఉంది. మూడు దిన పత్రికలు ఏంచేస్తాయి. ఆరు దినపత్రికలన్నా ఉండాలి."

"ఆరు పత్రికలకు చందాదారులు ఉండవద్దా?"

"ఒక్కసారి ఆరు పత్రికలూ వస్తే అన్నీ దెబ్బతింటాయి. నిజమే!

ఒక్కటొక్కటే రావాలి. ఒక్కొక్కపత్రిక ఒక్కొక్క ప్రత్యేకతా, వ్యక్తిత్వమూ సంపాదించు కోవాలి."

"ఏమిటా వ్యక్తిత్వము?"

"పేపరు రూపం, పేపరు వార్తలిచ్చే విధానం, పేపరు సంపాదకీయం వ్రాసే విధానం, కొన్ని ప్రత్యేక రచనలూ ఉండాలి."

"ఆంధ్రప్రభ నారాయణమూర్తిగారు "పాన్ సుపారీ" అని వ్రాస్తారు. అలాగా?"

"అవును, 'టైమ్సులో' కాండిడన్' 'క్రానికల్' 'బీరబల్' లాంటివి!"

"నవజ్యోతి"కి పెట్టుబడిడబ్బు పెట్టినవారు ఓ పదిమంది ఉంటారు.

అందరూ తలో ఇరవైవేలూ వేసుకొని రెండులక్షలు చేసి ప్రారంభించారు.

జయలక్ష్మి, డాక్టరు రెడ్డి, అనంతకృష్ణయ్యంగారు, డాక్టరు రెడ్డిగారి స్నేహితులు కొందరు కోనంగి సినీమా స్నేహితులు కొందరు, రియాసత్ ఆలీ మేనమామా వాటాదార్లు.

పేపరు రూపం చాలా అందంగా వచ్చేటట్టుగా కోనంగి స్వయంగా తాను చూసుకుంటాడు.

మొదట పేజీ ఒక్కసారి ఆకర్షించేటట్టు ఆంధ్రప్రభ చేస్తుంది. ఆంధ్రపత్రిక కొంచెం నిదానంగా నడుస్తుంది.

కోనంగి ఆలోచించాడు, ఆలోచించాడు పత్రిక ప్రారంభించక ముందే.

దినపత్రికకు సాధారణంగా వారానికి రెండుసార్లు ప్రపంచవార్తలలో ఒకటి ముఖ్యమైన వార్త ఉంటుందనీ, అతడు ఆరునెలలు పాత అంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, హిందూ, ఎక్స్‌ప్రెస్ పత్రికలు చూచి కోనంగి ఈ నిశ్చయానికి వచ్చాడు. పదిహేనురోజుల కొకసారి ఒక్కటి మరీ ముఖ్యవార్త వస్తుందట!

నెలకు ఒక్కటి మరీ మరీ ముఖ్యవార్త వస్తుందని అతడు తేల్చుకున్నాడు. ఇక వర్ణించడానికి కూడా అతీతమయి అద్భుతమయిన వార్త మూడునెలల కోసారి వస్తుందట.

ఈలాంటి వార్తను గ్రహించటం సంపాదకత్వం యొక్క ప్రజ్ఞ అని కోనంగి తన సంపాదకులతో, సహాయసంపాదకులతో తన విజ్ఞానమంతా వెల్లడిస్తూ చెప్పినాడు.

**ఒక సంపాదకుడు:** అది గ్రహించి ఏమి చెయ్యాలండీ?

**కోనంగి:** నమిలి మింగండి అని కాదు. ఆ వార్త చేతబట్టుకొని, ఆ వార్తకు నాయకుం డెవ్వరో నిశ్చయింపవలయును. (అందరూ నవ్వుతారు)

**కోనంగి:** నవ్వకండి రామారావుగారూ, మొఖంబు అతి ముచిగుంభనంగా అనగా సీరియశంబుగా పట్టి వినండి!

**రామారావు:** అవధారు!

**కోనంగి:** ఆవార్త అనే కావ్యానికి నాయకు డెవరో ఆయన చిత్రం సంపాదించాలి!

**శ్రీనివాసరావు:** ప్రతి ముఖ్యవార్తా కావ్యము వంటిదే అంటారు. అయితే కథానాయిక కూడా ఉంటుందా అండీ?

**కోనంగి:** ఒక్కొక్క ముఖ్యవార్తకు కథానాయకుడో, కథానాయికో ఉంటారు. నాయకుడైతే నాయకిన్నీ, నాయిక అయితే నాయకుడున్నూ తెర వెనుక ఉంటారు.

**శ్రీనివాస:** ఇందిరానెహ్రూ పెళ్ళివంటిదయిదే నాయికా నాయకులు తెరముందరే ఉంటారన్నమాట.

**కోనంగి:** అద్గదీ విషయం!

**రామా:** ఉపనాయకులూ, నాయికలూ, ప్రతినాయకులూ, నాయకులు ఉండవచ్చు గాదాండీ?

**కోనంగి:** ఆ! లేకపోతే కావ్యం ఎల్లాగ? ఒక్కొక్కప్పుడు వార్త భావకావ్యం వంటిది కావచ్చును. అప్పుడు అలాంటి వగయిరాలు ఉండకపోవచ్చును.

**రామారావు:** బొమ్మ సంపాదించి ఏమి చేయమంటారు?

**కోనంగి:** దాని అతిముఖ్యత, పరమముఖ్యతలనుబట్టి మన పత్రికలో ప్రచురించే కొలత నిర్ణయించాలి రామారావుగారూ!

**శ్రీనివాస:** మీరు 'గిలిగింతలు' అని ఒక ప్రత్యేక "శీర్షిక" కాలం వ్రాస్తున్నారే! దాన్ని లోకం అంతా మెచ్చుకుంటున్నదండీ!

**కోనంగి:** హాస్యంగా, మధురంగా దెబ్బకొట్టడం, అభినయంలో నాయిక జడచివర పూలకుచ్చుతో కొట్టటంవంటిదండీ!

**రామా:** మనం పూర్తిగా కాంగ్రెసుపక్షం అవకూడదా అండీ?

**కోనంగి:** మనం ఎల్లాగా కాంగ్రెసుపక్షమే. కాని అది వ్యక్తం చేయకుండా నిఖారసయిన జాతీయపక్షం. అందులో కాంగ్రెసు ఒక సంస్థ అన్నట్లు చూపాలి!

**శ్రీనివాస:** "హిందూ" పక్షం అదేకదా అండీ?

**కోనంగి:** కాదండీ. హిందూ కొంచెం, సాంబారు పక్షందా. ఖారంజాస్తీ ఉండదుగా, పంచదార అసలే లేదుకదా!

(అందరూ పకపకమని విరగబడి నవ్వుతారు)

## 3. మా పత్రిక

**"ప**త్రికాసంస్థ దేశంలోని ముఖ్యసంస్థలలో నాలుగవది. మొదటిది ప్రజలు, రెండు శాసనసభలు, మూడు ప్రభుత్వకార్యవర్గం, నాలుగు పత్రికాసంస్థ, అయిదు న్యాయస్థానాలు, ఆరురాజకీయ సంస్థలు, ఏడు సారస్వతము, ఎనిమిది సాంఘిక సంస్థలు.

"అలాంటి పత్రికా సంస్థలలో దినపత్రిక రాణి. దినపత్రిక సంపాదకీయం ఆరాణికి మకుటం. వార్తలిచ్చే విధానం భూషణాలు, వార్తాహరులు భోజనం. రాజకీయాలు వ్యక్తిత్వం.

"ప్రజల అభిప్రాయాలు ప్రజలకే వ్యాఖ్యానంచేసి పత్రిక చెప్తుంది. ప్రజల భావాలను మార్చగల నాయకుడౌతుంది పత్రిక. తీవ్రంగా విమర్శిస్తుంది. ప్రజలను పొగుడుతుంది. బ్రతిమాలుతుంది.

"శాసనసభలకూ ప్రభుత్వానికీ మార్గాలు చూపిస్తుంది. వానిని విమర్శిస్తుంది, ఖండిస్తుంది, పొగుడుతుంది, ప్రభుత్వానికి వెరవకుండా సంచరిస్తుంది. ప్రభుత్వం శిక్షిస్తే అనుభవిస్తుంది. పొరపాట్లకు క్షమాపణ అడుగుతుంది. గూడుపుఠానీలు, కుట్రలు బయటపెడ్తుంది. లోకులను మాయచేసే వంచకులను చీల్చి చెండాడుతుంది పత్రికాసంస్థ.

ప్రజోద్యమాలకు కోటివిధాల సహాయం చేస్తుంది. అభ్యుదయ మార్గాలను అన్వేషిస్తుంది. చందాలు వసూలుచేసి పెడుతుంది. బాధపడే మారుమూల ప్రజలకు

సహాయమౌతుంది. ప్రజలలో దాగివున్న మూగబాధలను గంభీరకంఠమై, ఒత్తించుకు తిరిగేవ్యక్తుల, సంస్థ, ప్రభుత్వాల నిలిపి నిలిపి వారివారి ధర్మాలు వారికి బోధిస్తుంది.

"పత్రిక ఒక అద్భుతమయిన లలితకళాసంస్థ. శిల్పము, చిత్రలేఖనము, సంగీతము, నాట్యము, కవిత్వము ప్రజలకు అందుబాటు చేస్తుంది. అవి ఉత్తమంగా అనుభవించే విధానం నేర్పుతుంది.

"తానే ఒక లలితకళ అవుతుంది. ఆనందం సమకూరుస్తుంది. ఒక చిత్రమౌతుంది. శిల్పమౌతుంది. ఒకపరమ మాధుర్య గీత మౌతుంది. విచిత్రమూర్ఛన అవుతుంది. కథానిక అవుతుంది. హృదయాలను కదల్చివేసే నాటిక అవుతుంది.

"ఈ మధ్య జరిగిన పెరల్ హార్బరు ఒక విషాదాంత నాటిక. ఈ నాటికకు సూత్రధారుడెవరు, నాయకుడెవ్వరు, ప్రతినాయకుడెవ్వరు, ఇవన్నీ పత్రికలలో ఎంత హృదయోద్రేకముగ వర్ణించబడ్డాయి! టోజో ప్రతినాయకుడు. రావణునికన్న, హిరణ్య కశ్యపునికన్న, ఇయాగోకన్న దుర్మార్గుడు. ధ్వనిగా, వాచ్యంగా ఈ కావ్యం పత్రికలు వివిధ వ్యక్తిత్వాలుగా ప్రచురించాయి.

"ఇది మా పత్రిక! ఆంధ్రదేశంలో ఈమెను ఒక వ్యక్తిత్వంగల మహత్తర సంస్థగా చేయదలచుకొన్నాము.

"మేము ఏ పార్టీకి చెందము. భారతదేశానికి పదహారణాలూ స్వరాజ్యం కావాలని వాదిస్తాం. అందుకు మేము నడుంకట్టుకొని పోరాడుతాము.

"మేం ఆంధ్రులం. మా పత్రిక సంపూర్ణంగా ఆంధ్రుల బిడ్డ! ఆంధ్రరాష్ట్రం లోటూ పాటూ లేకుండా పూర్తిగా బీహారు, ఒరిస్సా, సింధు, సరిహద్దు, అస్సాంరాష్ట్రాలవలె రావలసిందే. రావడానికి మా సాయశక్తులా ప్రయత్నిస్తాము.

"ఇదిగో ఇదే మా ప్రథమ పత్రికా పుష్పం. ఇది పారిజాతంలా నిత్యయౌవనంతో, నిత్యపుష్పితయై, వాడని పుష్పాలు దేశానికి అర్పించడానికి అవతరించింది.

"ఆనాటి పారుజాతం, కృష్ణావతారం అవగానే స్వర్గానికి వెళ్ళిందట. మాది ఆంధ్రదేశంలో అనంతంగా ఉండిపోతుంది. ఆంధ్రులకు సేవ చేస్తుంది. ఆంధ్రలోకము మము గాఢప్రేమతో ఆదరిస్తారని మా సంపూర్ణనమ్మకం.

ఇది తన మొదటిరోజు సంపాదకీయాలలో రెండవ సంపాదకీయం. అది మళ్ళీ చదువుకొంటూ, దంచివేశామురా ఆంధ్ర సోదరా అనుకున్నాడు.

దైనందినమూ "ఆంధ్రరాష్ట్రం ఎందుకు కావాలి?" అను శీర్షిక ఒకటిపెట్టి ఆంధ్ర దేశంలోని పెద్దలూ, పిన్నలూ, ఆంధ్రేతరులయిన పెద్దలూ, చిన్నలూ అందరి వ్యాసాలు ప్రచురించడం సాగించాడు. ఆ వ్యాసాలకు వ్యక్తినిబట్టి, వ్యాసం తూనికనుబట్టి పారితోషికాలు పంపించడం సాగించాడు.

"ఆంధ్రులు రాజకీయంగా ప్రత్యేక రాష్ట్రం పొంది తీరాలి" అన్న మొదటి వ్యాసం ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులు వ్రాశారు. "ఆంధ్రులు ఆర్థికంగా ఆంధ్రరాష్ట్ర విజయ నిర్వహణ చేయగలరు" అన్నది రెండవరోజు వ్యాసము. మూడవ సంచికలో "ఆంధ్రతేజం" అన్న శీర్షిక క్రింద ఆంధ్ర కవులలో నవ్వులలో పెద్దలూ, పెద్దలలో నవ్వులూ, నవ్వులలో నవ్వులూ, పెద్దలలో పెద్దలూ, పద్యాలూ, పాటలూ వ్రాసినవి ప్రచురించాడు.

"వ్యవసాయంలో ఆంధ్రదేశం భారతదేశానికి శిరస్సు" అని ఉపకార వేతనం పుచ్చుకుంటున్న ఒక పెద్ద ప్రభుత్వ వ్యవసాయోద్యోగి వ్యాసం వ్రాసినాడు.

ఈలా సాగించాడు కోనంగి, ఇతరులను తిట్టకుండా, ఒకరికీ మనస్సు నొవ్వకుండా, ఆంధ్రరాష్ట్ర సంపాదన విషయంలో ప్రతి ఆంధ్రుడూ ఒక్కనిమిషమూ ఏమరుపాటున ఉండకూడదని అతని వాదన.

మొత్తంమీద 'నవజ్యోతి' ఆంధ్రదేశం అంతటా ఒక్కసారిగా గడబిడ చేయటం సాగింది.

అవతల సరోజినీదేవి స్త్రీలకు జరిగే అన్యాయాలు, స్త్రీల హక్కులు, శాసనసభలు చేయవలసిన మార్పులు, ప్రజాసంస్థలు చేయవలసిన కర్తవ్యాలు వరుసగా వ్రాయ నారంభించింది.

హిందూ ధర్మం ప్రకారం స్త్రీలకు పురుషులకు విడాకులు ఉండాలా, లేదా? అన్న విషయం ఆవిడ చర్చకు నింపింది. ఓట్లు తీసుకుంది. ఓట్లు అక్కరలేదు అన్నవి ఎక్కువ వచ్చాయి, మహిళల దగ్గిరనుంచే.

ఇదంతా మొగవాళ్ళ కృత్రిమం అని ఒక సంస్కర్త్రి వ్రాసింది. అందుకు జవాబుగా ఒక మధ్యవాదిని అలాంటి ఆరోపణలు స్త్రీల గౌరవానికి భంగకరం అని వ్రాసింది.

ప్రసిద్ధ దేశ నాయకురాండ్రు ఎప్పుడూ స్త్రీలపుటలో పెద్ద పెద్ద వ్యాసాలు వ్రాస్తున్నారు. భారతీయ మహిళామణులు ఎవరు మదరాసు వచ్చినా సరోజినీదేవీ, అనంతలక్ష్మీదేవి వారి అభిప్రాయాలు కనుగొనడానికి సిద్ధం.

అనంతలక్ష్మి ఒక చక్కని చిన్న ఛాయాగ్రహణయంత్రం కొంది. చాలా విలువగల యంత్రమది. వెలుగుయంత్రమూ కొంది. ఏ ప్రసిద్ధ నారీమణి వచ్చినా వీరిద్దరూ కారుమీద వెళ్ళడం, వారి చిత్రం గ్రహించడం, తమ పత్రికలో ఆ రోజే వేయించడం, లేకపోతే మర్నాడు వేయించడం, ఆంధ్ర మహిళలు ఇది మా పత్రిక అన్నారు.

కోనంగి అనంతలక్ష్మిని చూచి "అనంతం! కొన్నాళ్ళకు ఈ దినపత్రిక పూర్తిగా మళయాళం చేస్తావా?" అని అడిగాడు.

"మీకు కావలసినన్ని మొగపఠాలం పత్రికలు లేవా ఏమిటి?" అన్నది.

## 4

**కోనంగి:** వచ్చే ప్రతివార్తా ఉప సంపాదకులు తర్జుమాచేస్తూ ఉంటారు. దానికి శీర్షికలిస్తూ ఉంటారు. పూర్వకాలపు భావాలుగల పత్రిక అయితే శీర్షికలు చిన్నవి. ఒక కాలం మాత్రమే ఇస్తారు. ఎంత గొప్పవారయినా అంతే!

**డాక్టరు:** ఈనాటి పత్రికలు!

**కోనంగి:** ఈనాటి పత్రికలు వార్త యొక్క ముఖ్యతనుబట్టి ఎన్నికాలంలో నిర్ణయించాలి డాక్టరూ! కాలంలే కాదు, ఆ శీర్షిక అక్షరాలసైజూ నిర్ణయించాలి.

**డాక్టరు:** ఆ విషయాలన్నీ ఈనాటి పత్రికలన్నింటిలోనూ చూస్తూనే ఉన్నాము ఇక తామేమిటి, కొంటె కోనంగేశ్వరరాయ బహదూర్‌వారూ సెలవిచ్చేది? తమ అద్భుతమయిన, అతి నవీనమయిన –

**కోనంగి:** అతివిచిత్ర, చిత్ర, పరమ మాధుర్య, అశనిపాతయిక, గంభీరాతి గంభీర, అనర్గళ, హృదయబాంబు సంఘాత విధానం ఏదీ? అని అనబోతున్నావు!

**డాక్టరు:** నేనలా అనబోలేదు! నేను –

**కోనంగి:** అలాంటి అర్థం ఇచ్చే మాటలే అనబోయావు!

**డాక్టరు:** అలాంటి అర్థాలుగాని, ఆ అర్థాలకు సరిపోయే అర్థాలుగాని, దగ్గర చుట్టాలయిన అర్థాలుగాని అనబోలేదు.
**కోనంగి:** నువ్వు అనబోయిన మాటలు, అవి మాటలో లేక ఏవో అయి ఉండాలి.
**డాక్టరు:** పాటలా, పద్యాలా?
**కోనంగి:** పాటలుకావు, పద్యాలుకావు, గద్యాలుకావు, వచనాలుకావు, పద్యగద్యాలు కావు, నాటికలుకావు, రాగాలుకావు, తాళాలుకావు.
**డాక్టరు:** అవి తప్పెట్లు, మురజలు, డిండిమాలు, బాకాలు, క్లారియొసెట్లు –
**కోనంగి:** అవి ఒక పెద్ద జంత్రగాత్ర సమ్మేళనమాలిక!
**డాక్టరు:** ఇంక చాలించి నా మాట విను.
**కోనంగి:** అమ్మయ్యా, దారికి వచ్చాడండీ, ఇక కానీ!
**డాక్టరు:** ఒక్కొక్క సైజులో రెండేసి జాతుల అక్షరాలు మాత్రమే ఉన్నాయి. ఒక జాతి రంగు ఒత్తుగా ఉండేది, రెండోది సన్నగా ఉండేది. ఇవేకాక, ఇంకా అయిదారు జాతులు ఉండాలని నా వాదన.

డాక్టరుగారు ఇచ్చే వార్తలన్నీ సామ్యవాదులకు సంబంధించినవి. కోనంగీ అతడూ కలసి ఒక పక్షంవారు ఇంకో పక్షంవారిని ఆడిపోసుకునే వార్తలకు ప్రాముఖ్యత ఉండకూడదనిన్నీ, అలాంటి ఉత్తమ విషయాలను గురించి వచ్చిన ఉత్తరాలు ప్రచురించకూడదనీ నిశ్చయించుకున్నారు.

"ఏ రాజకీయ పక్షమయినా దొంగపక్షం కాకూడదు. అంతే మనం చూచుకోవాలి" అని కోనంగి అన్నాడు.

అనంతలక్ష్మి పరీక్షలయిపోయి, భర్తతోపాటు పత్రికాలయానికి వచ్చి, తాను దిట్టంగా పనిచేయడం ప్రారంభించింది. భార్యాభర్తలిద్దరూ నిజమయిన సంపాదకులయ్యారు. ఇద్దరూ కారుమీద వస్తారు.. ఇద్దరూ పనిలో నిమగ్నులౌతారు. మధుసూదన కోనంగులూ, సరోజానంతలక్ష్ములూ, రియాసత్, ఒకప్పుడు డాక్టరూ కలసి ఉపాహారాలకు ఏదయినా మంచి కాఫీ హోటలుకు పోయేవారు, లేదా తమ కార్యాలయానికే తెప్పించుకొని ఆరగించేవారు. కాఫీ మాత్రం, కార్యాలయంలో విద్యుచ్ఛక్తిస్టవుపై నీరూ, పాలూ కాచి అనంతలక్ష్మో, సరోజినీదేవో తయారు చేసేవారు.

పేపరు ఎలాగయినా విజయవంతంగా నిర్వహించాలని వారందరూ సాయశక్తులా తంటాలు పడుతున్నారు.

ప్రతిదినమూ వారందరూ సాయంకాలం పని పూర్తికాగానే ఏబీచికో, వాహ్యాళికో పోయేవారు లేదా సినిమాకో పోయేవారు. అందరూ కలసి అనేక విషయాలు చర్చించుకునేవారు.

పత్రికా నిర్వహణ ఎంతయినా పని. అది ఆ రోజుకు ముగియగానే కాస్తసముద్రతీర విహారమో, కొంచం సినీమా ప్రదర్శనమో, క్వచిత్ మృత్తికాతైల శక్తి జనితవేగశకటవిహారమో ఒంటికి మంచిదిగాదా అని కోనంగి వాదిస్తాడు.

ఈ ఇరువురి దంపతుల ఆనందము చూస్తూ రియాసత్ ఆలీ నిట్టూర్పు విడుస్తూ వుంటాడు. తన మెహర్ ఇంక తనకు కాదు. తన ప్రేమ నిరర్థకమై మురిగిపోతుంది. ఆ ప్రేమతో తానూ హరించిపోతాడుగాక. స్త్రీలను ప్రేమిస్తాము. వారి పాదాలకడ మన సర్వమూ ధారపోస్తాము. వారు మనల ప్రేమిస్తారు. ఏ తిక్కవస్తుందో నిన్ను ప్రేమించడం

లేదని వారంటారు. నివేదనకై సమర్పించిన ప్రేమామృతపూరిత సువర్ణకలశాన్ని వారు కాలతన్నుతారు. ఆ అధికారం వారిది. పురుషుల హృదయాలను విచ్ఛిన్నంచేసే అధికారం వారిది.

అతడు తెలుగులో పద్యాలు వ్రాసుకున్నాడు. పాటలు వ్రాసుకున్నాడు. ఉర్దూలో ఇష్కియార్లు (ప్రేమగీతాలు) వ్రాసుకున్నాడు.

*"నీకె ఈ అధికారమ్ము నీకె ఈశి*
*లా హృదయ కఠినత నీకై లలితచంద్రి*
*కా దృగంచలాలు అదియు కలుషసహిత*
*ప్రేమ నిత్యత నెట్లు కంపించగలవు!"*

అతని ఆవేదన స్నేహితులతో ఏమని చెప్పుకోగలడు. గంభీర హృదయుడు, మితభాషి, సరసవాది, గాఢమిత్రుడు, ఉత్తమ చరిత్రుడు. అతనికి పని అంటే ఆనందము. ఒక్క నిమిషమయినా పనిలేకుండా కాలం వెళ్ళబుచ్చలేడు. అందులో ఈ ప్రేమభంగము అంతరించినప్పటి నుండీ ఒంటిగా ఉండడమూ, ఆలోచనా, మరీ వేదనాభరితాలై దుర్భరమైపోయాయి.

కోనంగి బోధించినట్లు ప్రేమను అంతర్ముఖం చేసుకొని, ఆ శక్తి తన జీవితమే ఆక్రమించేటట్లుచేసి, నిరంతర పురోగమన యోగవంతుడు కావాలి. తమ పత్రికను మహోన్నత పథాలకు తీసుకుపోవాలి.

మెహర్ ఏమి ఆలోచిస్తుంటుంది. తమ పంతాలు, తమ రాజకీయాలు, తమ పవిత్రప్రేమను మహాగ్నితప్తంచేసి ఇంకించి వేయవలసిందేనా? ప్రేమ నీచాశయాలకు అందనిది కాదా? ప్రేమ ఎట్టి కల్మషాలనయినా నాశనంచేసే శక్తిగలది కాదా? తాను ఆమెను, ఆమె తన్నూ ఈలా వ్యర్థంగా ప్రేమించుకుంటూ లేనివి అడ్డం పెట్టుకొని కూలబడిపోవలసిందేనా? తానొక మజ్నూ, మెహరొక లైలా కావలసిందేనా? చివరికైనా లైలా తెలిసికొంది. మెహర్ తన అంత్యదశలోనైనా తన్ను సమీపిస్తుందా?

ఒకరోజున అనంతలక్ష్మి తన మెహర్ ఇంటికి వెళ్ళి మాట్లాడిందట. మెహర్ అనంతలక్ష్మి ఒళ్ళోవాలి వెక్కివెక్కి ఏడ్చిందట. ఎందుకా దుఃఖం? కాంగ్రెసులో చేరినంత మాత్రాన తాను ద్రోహం చేస్తున్నాడా ఏమిటి? కాంగ్రెసు ముస్లింలు చేసిన దోషం ఏమి? అభిప్రాయభేదాలు పనికి రావా? అంతమాత్రంతో మనుష్యులు భరింపరానంత విరోధులవుతారా?

తనకు మాత్రమా పంతం ఎందుకు? తన ప్రేమనిధానంకోసం తన భావాలు ఆహుతి చేయకూడదా?

కాని ప్రేమతో ఒకరికొకరు నిశ్చితాభిప్రాయాలను ఆహుతి ఇచ్చుకోడంకన్న వాటిని అధిగమించి, ఉత్తమపథాలలో ఐక్యం కాకూడదా? ప్రేమ ఉత్తమపథ సంచారిణి కాదా? వట్టి కామతృప్తికోసమే ప్రేమ అయితే, పశువులకు స్వంత భావాలేమిటి, ఆశయాలేమిటి? కామవాంఛ గలిగి రెండు జంతువులు సంయోగానికి అడ్డంకులు లేకపోతే కలుసుకుంటాయి. కామతృప్తి నందుతాయి.

ప్రేమ కామవాంఛ కాదు. ఇరవైనాలుగు గంటలూ మనుష్యుడు కామంకోసం బ్రతకడు. కాని ఇరవైనాలుగు గంటలు కాదుకదా, ఇరవై నాలుగులక్షల గంటలు ప్రేమకోసం బ్రతకమంటే ఆలా బ్రతకడానికి సిద్ధం అవుతాడు.

# 5

జపాను విజృంభణ మహావేగంతో అపరానిదై సాగిపోతూ ఉన్నది. ఫిలిప్పైన్సు దీవులు పూర్తిగా ఆక్రమించుకొంటున్నాడు. ఇటు మలయాలోకి దిగాడు. ఇంగ్లీషువారి సైనికబలం, అమెరికావారి యుద్ధబలం జపానువారి ధాటీముందు ఏమీ నిలువలేక పోతున్నాయి. గుమ్మడికాయ తగిలినట్లు వారి పురోగమనము నిరాటంకముగా సాగిపోతూ వుంది.

"నన్నెవ్వరాపలే రీవేళ నాధాటికోర్వలే రీవేళ" అని బసవరాజుగారన్నట్లు జపాను నావికాబలాలు ఫసిఫిక్కుమహా సముద్రంలో చిన్న చిన్న ద్వీపాల్ని ఆక్రమించుకున్నాయి. వారి విమానదాడులు దోమల ముసురూ. మిడతలదండులా రావడమే! రంగూన్ నాశనమైపోయింది. సాగినారు జపానువారు.

ఇంగ్లీషు సైన్యాలు, వారితోబాటు భారతీయ సైన్యాలు వెనక్కు వెళ్ళుతున్నాయి.

"ఎందుకు ప్రభుత్వంవారు సరియయిన విమానాలూ, టాంకులూ, తుపాకులూ, ఫిరంగులూ పంపించరూ?" అన్న ప్రశ్నవేశాడు. ఆ ప్రశ్నలోనే "జపానును అరికట్టండి" అని పెద్దవ్యాసం డాక్టరు వ్రాసినాడు.

అటు ఉత్తర ఆఫ్రికాలో రోమెల్ సేనాని ఇంగ్లీషు సైన్యాలను తరుముకుంటూ వచ్చి 1941 జూలై ఐదుకు అలెగ్జాండ్రా దగ్గర మకాంవేశాడు. ఆ సంవత్సరం స్టాలిన్‌గ్రాడు పట్టుకుందామని ప్రయత్నించిన జర్మనులు సెప్టెంబరులో పూర్తిగా విఫలులైపోయి 23-వ తారీఖున తిరుగుముఖం వట్టారు. నవంబరులో ఫ్రాన్సు పూర్తిగా జర్మన్ల వశమైపోయింది డిశంబరు 1-వ తేదీని టోబ్రూకును బ్రిటిషుసేనలు పట్టుకున్నాయి. డిశంబరు 24-వ తేదీని అడ్మిరల్ డార్లానును ఎవరో హత్యచేశారు.

1942-వ సంవత్సరంలో జపాను వారు మానిల్లా ఆక్రమించుకున్నారు. ఫిబ్రవరిలో సింగపూరు పడిపోయింది. ఏప్రియల్‌లో అనంతలక్ష్మి పరీక్షలయాయి. రంగూన్ పతనమైపోయింది. మాండలే పతనమైపోయింది. జపాను సేనలు అస్సాంవైపు పురోగమిస్తున్నాయి ఆంగ్లప్రభుత్వంవారు క్రిప్సుగారిని హిందూదేశానికి ప్రభుత్వ రాయబారిగా పంపారు.

క్రిప్సురాకను గూర్చి పత్రికలన్నీ సంపాదకీయాలు వ్రాసినాయి. క్రిప్సు రావడం దేశం అంతా అల్లకల్లోలమయినది. కొందరు స్వరాజ్యపు ఛాయలైనా వస్తాయన్నారు కొందరు చర్చిలుగారినీ, ఆమెరీగారినీ ఎరగమా, దేశానికి వచ్చేదేమీలేదు. ఇంకా రెండు మూడు కేంద్రప్రభుత్వ సభ్యత్వం భారతీయులకు లభిస్తాయి అన్నారు. కొందరు మోసపోకండి అన్నారు. కొందరు వచ్చిన వీలు వదలకండి అన్నారు. క్రిప్సుగారు నాయకులందరినీ కలుసుకున్నారు. మహాత్మునితో మాట్లాడారు. రాష్ట్రపతి ఆజాదును, నెహ్రూను కలుసుకున్నారు. ఖయిదేఆజం జిన్నాగారిని కలుసుకున్నారు హిందూ మహాసభనాయకులు వీర సావర్కారుగారు, శ్యాంప్రసాదుగారూ క్రిప్సును కలుసుకున్నారు.

క్రిప్సుగారు కార్మికపక్షం మనుష్యుడు. ఆంగ్లరాజ్యంతోగాఢ స్నేహసంబంధం కలిగి, భారతదేశం స్వాతంత్ర్యం కలిగివుండాలని ఆయనవాదన. అందుకనే రాగానే "స్వరాజ్యం వస్తుంది. మీరంతా ఇంగ్లండు పోవడానికి మూటాముల్లే కట్టుకు సిద్ధంగా ఉండండి" అని ఆయన ఇంగ్లీషు ఉద్యోగులతో నవ్వుతూ అన్నాడు, నవ్వుతూ అన్నా, ఆ నవ్వువెనుక

క్రిప్సు హృదయంలో ముచికుంభత ఉంది అని వాళ్ళు గ్రహించారు. ఆ వెంటనే వాళ్ళంతా రహస్యంగా చర్చిలుగారికి తంతివార్తలు పంపారు. వెంటనే చర్చిలుగారు క్రిప్సు గారికి, వైస్రాయి గారికి, సర్వసైన్యాధ్యక్షులయిన వేవెవ్ గారికి తాఖీదులు పంపాడు.

"తాను ప్రధానమంత్రిత్వంలో ఆంగ్లసార్వభౌముని సామ్రాజ్యంలో రాజ్యాలు రాజ్యాలుగా మాయచేయడానికి ఉద్భవించలేదు అన్న చర్చిలుగారు తన హయాములో జాతీయ మహాసభలలో పాటుపడతాడా?

"వైస్రాయి క్రిప్సు త్రిపాత్ర నాటకం ఆడారు. ఆజాద్ నెహ్రూలకు చేతులు బోర్లించి చూపారు. కాంగ్రెసు కార్యవర్గం ఏదో అవుతుందని ఢిల్లీలో సమావేశమయ్యారు. రాజగోపాలాచార్యులవారు ఏం గోలపెట్టినా కాంగ్రెసువారు వట్టి గుల్లస్వరాజ్యం తీసుకోమన్నారు. వారి మాటలకు తందానతానా అన్నారు లీగువారు.

"క్రిప్సు ప్రతిపాదనలు ఎవరికీ ఆనందం సమకూర్చవు. ఈ భయంకర యుద్ధం జరిగే రోజుల్లో బ్రిటిషు ప్రభుత్వం యుద్ధమంత్రిత్వం భారతీయులకు ఇవ్వకపోతే ఏమి లాభం? ఈ సమయంలో ఆ పనే జరిగితే భారతీయులందరూ ఒక్కుమ్మడిగా లేచి జపానును తమ చేతులతో నెట్టిపారవేస్తారు.

"క్రిప్సు గిరి వాదన-ఉన్న 1919 సంవత్సరపు రాజ్యాంగశాసనంలోనే అధికారాలు భారతీయులకు ఇవ్వగలం అన్నది వట్టి శుష్కవాదన అని మా ఉద్దేశం. బ్రిటిషు ప్రభుత్వం తలుచుకుంటే ఎంత సేపు పార్లమెంటులో ఒక క్రొత్తశాసనం పుట్టడం?

"ప్రస్తుతం ప్రజాప్రభుత్వం అనే ఉత్తమాశయాన్ని వట్టి వేళాకోళం చేసిన వందలకొలదీ ఆర్డినెన్సులు పోయి నిజమయిన ప్రభుత్వం ఏర్పడితే ఆంగ్ల - భారతీయ స్నేహం ఘట్టిది అయిపోవునుకదా!

"దినాలు ఏమీ బాగాలేవు యుద్ధం ఇంతట్లో ముగిసే సూచనలు లేవు. కాబట్టి కాంగ్రెసువారూ ముస్లింలీగువారూ, ప్రభుత్వంవారూ రాజీపడాలని మేము ఆశిస్తున్నాము."

ఈలా నడిచింది కోనంగి వ్రాసిన సంపాదకీయం. ఇంతపని చేశానని, ప్రక్కగదిలో కూర్చుని ఉన్న భార్యను పిలిచి సంపాదకీయం అంతా చదివి వినిపించాడు.

"అద్భుతం!" అంది అనంతలక్ష్మి,

కోనంగి ఇటూ అటూ చూచి భార్యను ఒళ్ళోకి లాక్కొని గాఢంగా కౌగిలించి చుంబించాడు.

అనంతలక్ష్మి కోపం అభినయిస్తూ లేచి పయ్యెదా చీరకుచ్చెళ్ళూ సవరించుకొని "ఏమిటండీ మీధూర్తత్వం" అంది.

అప్పుడు కోనంగి నవ్వుతూ,

*"ప్రియురాలా కోపించకు*
*నయగారపు ముద్దుగాదు నమ్ముము నన్నున్*
*స్వయముగ నీవే వచ్చిన*
*ప్రియ ఉప్పొంగి ముద్దుపెట్టితి నిన్నున్!"*

అని ఆశుధారగా కందం చదివాడు.

"కందం ఎవరయినా సులువుగా రచింపగలరు!" అని నవ్వుతూ అనంతం తన గదిలోకి పారిపోయింది.

మధుసూదనుని రెండవ చెల్లెలు కమలనయనా, ఆమె అక్క చౌధురాణీ 1942 జూలై నెల్లో మదరాసు వచ్చినారు. ఇంటరు మొదటితరగతిలో నెగ్గి రాయపురం స్టాన్లీ మెడికల్ కాలేజిలో చేరడానికి వచ్చింది కమల. అతని చెల్లెలు చౌధురాణీ పత్రికలో పనిచేయడానికి వచ్చింది. ఆతని తమ్మునికోసం బందరులోనే ఉండిపోయింది మధుసూదనుని తల్లి.

కమలనయనకు పందొమ్మిదేళ్ళు. చౌధురాణికి ఇరవై రెండేళ్ళున్నాయి. కమలనయనకన్న చిన్నవాడు మధుసూదనుని తమ్ముడు. అతని పేరు రమేశుదత్తు. ఈ పేళ్ళన్నీ వారి తండ్రి బ్రహ్మసమాజంవాడవడంచేత బంగాళీ బ్రహ్మసమాజంవారి పెద్దల పేర్లు పెట్టుకున్నారు.

చౌధురాణీ అంతకుముందు సంవత్సరమే బి.ఏ. ప్యాసయి ఉంది. ఆమెకు ఏమీ ఉద్యోగంలేక శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు, పట్టాభిగారు మొదలగు పెద్దల సహాయంచేత ఒక బాలికా పాఠశాలలో తాత్కాలికంగా నలభై రూపాయలకు చేరింది.

ఇప్పుడు కోనంగీ, డాక్టరూ ఆలోచించి అనంతలక్ష్మీ, జయలక్ష్ముల సంప్రదింపులతో చౌధురాణీకి నూరురూపాయల జీతంపై ఉపసంపాదకురాలినిగా తీసుకున్నారు.

కమలనయన వైద్యకళాశాలలో చేరింది. మధుసూదనుని కుటుంబం అంతా అనంతలక్ష్మి ఇంటికి అనతిదూరంలో ఆలివర్‌వీధిలో ఒక చిన్న మేడ అద్దెకు తీసుకున్నారు. కమలనయన కాలేజీ హాస్టలులో బాలికా భాగంలో చేరింది.

చౌధురాణీ, కమలనయన వచ్చేరోజున రైలు దగ్గరకు కార్లమీద కోనంగీ, అనంతలక్ష్మీ, మధుసూదనరావూ, ఆతని భార్య సరోజనీదేవీ, డాక్టరు రెడ్డీ వెళ్ళారు. వారిరువురూ ఆడవాళ్ళ ఇంటరు బండిలోంచి దిగారు. చౌధురాణీ మోము శిల్పశాస్త్రం ప్రకారం సౌందర్యాంగ సమన్వితం అని చెప్పలేము. కాని, ఆమె మోములో సౌందర్య కాంతులూ ఏవో మధుర విషాదకాంతులూ కలయిక పొంది ఆమెకు కృష్ణశాస్త్రీ కవిత్వ మనోహరత్వం సమకూర్చాయి. అతి సున్నితమయిన ఆరోగ్యం, అతి బక్కపలచని బాలిక. ఆమె నడుస్తూ ఉంటే వీణ తీగమీద ఏదో రాగం సంచరించినట్లే ఉంటుంది.

రెడ్డి ఆ బాలికను చూచాడు అలాగే నిర్ఘాంతపోయి నిలుచున్నాడు. ఈమెకు కురిషిద్ గడ్డమూ, మెహతాబ్ పెదవీ, నసీమ్ కరుణపూరిత నయనాలూ ఉన్నాయి అనుకున్నాడు. కమలనయన మగవీరుడు. ఆమె అచ్చంగా స్నేహప్రభలా ఉంటుంది.

"హల్లో డాక్టర్, మీకు ప్రత్యర్థిగా రానులెండి. మీరు బెంగపెట్టు కోకండి?" అని రెడ్డిగారిని ఒకసారి పలకరించి కరగ్రహణ లాంఛనం జరిపింది. చౌధురాణి డాక్టరు రెడ్డిగారికి నమస్కారం మాత్రం చేసింది.

వచ్చిన వెనుక మూడురోజులు గడచినప్పటి నుంచీ చౌధురాణి నవజ్యోతి ఉప సంపాదకవర్గంలో చేరింది. ఆమె చేరిన వారం రోజుల నుంచి రెడ్డిగారు ఎక్కువ శ్రద్ధగా పత్రికా కార్యాలయానికి రావడం సాగించారు.

డాక్టరు రెడ్డి ఎక్కువగా మధుసూదనరావు విషయం కనుక్కుంటూ అతన్ని హుషారుపరుస్తూ తనింటి కాతన్ని ఎక్కువగా తీసుకుపోసాగినాడు.

ఆవులించకుండానే ప్రేవులు లెక్కపెట్టగల కోనంగి డాక్టరుని వెంటనే అర్థం చేసుకున్నాడు. ఇన్నాళ్ళ నుంచీ మన్మథుడు డాక్టరు దగ్గరకు వెళ్ళడం అంటే భయపడేవాడు. ఈనాడు ఆ పంచాస్త్రుడు గురి తప్పకుండా ఝుంఝుం అని డాక్టరు గుండె మధ్య నుంచి తన బాణం గాటంగా పెద్దతూటు పడేటట్లు వేయగలిగాడయ్యా అని అనుకున్నాడు కోనంగి.

డాక్టరుగారికి ప్రేమలేని వైరాగ్యలోలాయత ఈనాడు చౌధురాణీ వాటర్లూ యుద్ధంలో ఓడించి జయమందిందయ్యా అని ఆనందించాడు కోనంగి.

*ఓడినాడు చివరకూ*
*మా*
*వాడురెడ్డి పిన్నడూ*
*ఓటమంటె ఏమిటంటు*
*మాటలాడు వై ద్యుడూ!*
*ఓడినాడు చివరకూ*
*మా*
*వాడు రెడ్డి పిన్నడూ!*
*వాలుకనుల వాలుగాలు*
*దాలుతాగి తూలెనంటు*
*మేలమాడి ప్రాలుమాలి*
*బేలుకొట్టే ధీరుడూ*
*ఓడినాడు చివరకూ*
*మా*
*వాడు రెడ్డి పిన్నడూ!*
*సెంటిమెంటు అంటనట్టి*
*చిత్తధైర్య కవచధారి*
*సర్వకవచ భేదాస్త్రము*
*చక్కనయిన పిల్ల చూసి*
*ఓడినాడు చివరకూ*
*మా*
*వాడు రెడ్డి పిన్నడూ!*
*శుకయోగిని నేనంటూ*
*సొకుమాట లాడువాడు*
*ఋష్యశృంగుడై బాలిక*
*దృక్కుదారి నడిచినాడు*
*ఓడినాడు చివరకూ*
*మా*
*వాడు రెడ్డి వీరుడూ!"*

ఈ పాట వినగానే డాక్టరు చిరునవ్వు నవ్వాడు. తరువాత ముచికుంభత తాల్చాడు.

"కోనంగీ, ప్రేమకలవాళ్ళు ప్రేమపాశ బద్ధులయినవారి హృదయాలు నిమిషంలో గ్రహిస్తారు. నాకు ప్రేమ అనే భావం వట్టి సెంటిమెంటల్ నాన్సెన్స్ అనుకున్నాను. ఇంతలో మా జోషీ భారతదేశంలో అందమయిన బాలికల్లో ఒక ఆమెను ప్రేమించాడు అని వినేటప్పటికి నాకు ఆశ్చర్యం వేసింది. ఈ రోజున నా పనీ అంతే అయింది నాయనా!" అన్నాడు రెడ్డి.

"ఈ విషయం రియాసత్ కూడా గ్రహించాడు. తక్కిన వారెవరికీ ఇంకా అనుమానాలు తట్టలేదనుకుంటాను."

"కానీ ఆమె ఉద్దేశం?"

"ఓయి నీయిల్లు బంగారంకానూ! పదిహేనురోజులు కాలేదు, నాయిక అవతరించి! ఏమి ప్రేమవేదన! వారేవా!"

## ⑥

డాక్టరు రెడ్డికి ప్రేమ దావానలంలా, ఉప్పెనలా, తుపానులా వచ్చిపడింది. రోగుల్ని పరీక్షిస్తూ ఉంటే చౌధురాణీ ఎదురుగుండా దర్శనమిస్తుంది. ఎవరికైనా ఇంజెక్షన్ ఇస్తోంటే, రాణికే ఇంజక్షను ఇస్తున్నానని భయపడతాడు. తాను పెద్ద శుకమహర్షికాడు. తనది సదోపవాసి బ్రహ్మ చర్యం. అప్పుడప్పుడు దేహం కామవాంఛాపూరితం అయినప్పుడు ఏ నర్సునో, ఏ సినీమా తారనో, ఏ ఆమెనో తన పడకగదికి రప్పించుకొనేవాడు. ఏమైనా శుభ్రభావం కలవారు కాబట్టినీ, కొంచెం రసవాది అవటంవల్లనూ అందమయిన యువతులను, ఆరోగ్యాలను ఏరుకొనేవాడు. వారికి కామతృప్తీ, ధనతృప్తీ బాగా కలిగించేవాడు.

అతని స్నేహితులకు ఈ విషయం తెలుసును. కాని తక్కినవారికి ఏమీ తెలియదు. కొందరు మాత్రం ఏ సన్యాసోతక్క, తక్కిన మానవ మాత్రులు బ్రహ్మచర్యం అవలంబించలేరు అని నమ్మేవారు. "అమ్మో! డాక్టరు అలా కనబడతారు! లోతునీళ్ళు అతి నిర్మలం" అని అంటారు.

వెనుక రోజుకోసారో లేక రెండురోజుల కొకపర్యాయమో పత్రికా కార్యాలయానికి వచ్చే డాక్టరు, ఈ మధ్య రోజుకు రెండుమాట్లూ, మూడుమాట్లూ రావడమో, లేకపోతే వచ్చినప్పుడు రెండుగంటలపాటు వరసగా వ్రాస్తూ తన కాలం ఉపయోగించడమో ప్రారంభించాడు.

కోనంగి నవ్వుకుంటూ రెడ్డితో "కాలజ్ఞానము లేనివారుగదరా కామాస్త్ర సంపీడితుల్" అన్నాడు.

రెడ్డి నవ్వుతూ,"నాయనా,ఈ ప్రేమ అనేది మా చెడ్డవస్తువులా కనబడుతోందే! నా మతి పోగొట్టింది ఆమె దేహం కాదు, ఆమె అందం కాదోయి నా మతిపోగొడ్తా. ఆమే. ఆమె సర్వస్వమే!" అన్నాడు.

"ఓ పిచ్చివాడా! నన్ను ఆరోజుల్లో పిచ్చివాడనని వేళాకోళం చేశావ్. ఈ రోజున తెలిసిందేం! 'తనవరకూ వస్తేగాని ధర్మాలకు అర్థాలుండవు' అన్నమాట వృథా అనుకున్నావా?"

"ఆ బాలికలో ఏమి ఉంది? నన్ను మతి లేనివాణ్ణి చేసి పారవేసిందే!"

"నిన్ను మతిలేనివాణ్ణిగా తయారుచేసే శక్తి ఉంది."

"నా మాట ఎప్పుడయినా వస్తుందా?"

"నీ మాట అక్కడ ఎందుకు వినబడుతుంది మాకు! నువ్వు వస్తే వినబడుతుంది."

"సంతోషించాములే! ఆ బాలిక ఎప్పుడయినా తెస్తుందా?"

"ఆ బాలిక నీ మాట ఎందుకు తీసుకురావాలి?"

"నేను ఆ బాలిక మాట తీసుకురావటంలేదా?"

"నువ్వు ఆమెను ప్రేమిస్తునావు గనకనూ!"
"అందుకనే అడిగానయ్యా స్వామీ!"
"నిన్ను ప్రేమిస్తోంటే ఆ అమ్మాయి నీ మాట తీసుకువస్తుందికదా అనా!"
"ఆమ, ఆమా!"
"డమ! డమా!"
"చెప్పవయ్యా!"
"ఆ అమ్మాయి ఏదో మాటవరసను నీ మాట ఎత్తినమాట నిజము!"
"ఏమిటా మాటలవరస?"
"ఈ డాక్టరుకు మతిపోయిందా? అని నన్నడిగింది."
"ఛా!"
"ఆ! ఈ పేపరుకు ఇంతడబ్బు పెట్టాడు. ఆయనకు మతిపోయిందా?" అని అడిగింది.
"ఇంకా?"
"ఇంకా, ఏమిటి? ఇదేమన్నా ఇడ్లీలోకి సాంబారు వడ్డించడంటయ్యా?
"చెప్పుదు స్వామీ!"
"చెప్పుతాన్, సామీ!"
"ఆడవాళ్ళ మనస్సులు అతి విచిత్రాలూ, సినీమా చిత్రాలూను. ఆమె మనస్సులో ఏమి ఉందో?"
"సరేలే! మనుష్యుల్ని ఏడిపించడమంటే, మనకు చాలా సరదాదా!"
"ఏడవడమెందుకూ, నవ్వమంటూాంటే!"
"ఏది చూచి నవ్వడం?"
"ఆ అమ్మాయిని చూచి!"
"ఆ అమ్మాయి హృదయం తెలియందే!"
"నేను మూడు నాలుగు రోజులలో నీకు ఏ విషయమూ చెప్తానుగాదా!"
"నాలుగురోజులా!"
"ఆగు! ఆ మాత్రం నిరీక్షణ చేయలేవా? ప్రేమ కాలాతీతం తొందరపడి దాన్ని గడియలలోకి లాక్కొస్తానంటావేమిటి?"
రెడ్డి నిట్టూర్పు విడుస్తూ వెళ్ళిపోయాడు. ఆ రాత్రి కోనంగి చౌధురాణితో ఏదో లోకాభిరామాయణంవేసి కూర్చున్నాడు.
"చౌధు! ఎల్లా వుంది పత్రికా ఉపసంపాదకత్వం?"
"అదో గమ్మత్తుగా ఉంది చిన్నన్నయ్యా!"
"నీకు విసుగురావడంలేదుగదా!"
"మొదట కొంచెం విసుగుగా ఉండేది. తర్వాత తర్వాత ఉసిరి కాయలు తిన్నట్టే!"
"అబ్బా చాలా బాగుంది. మా డాక్టరూ, మా అత్తగారూ ఈ పత్రిక ఆరంభించడం నాకు కోటివేల సహాయం అయింది."
"నీకేమిటి, అన్నకో?"
"అన్న కృతజ్ఞత వర్ణించలేను. డాక్టరు అన్నకూ, నాకూ ఎంత ఉపకారం చేస్తున్నాడు?"

"ఎవరీ డాక్టరు అన్నా?
"నాకు ప్రాణస్నేహితుడు."
"ఎన్నాళ్ళ నుంచీ మీ ఇద్దరి స్నేహం?"
"ఇక్కడకు వచ్చినప్పటి నుంచీ."
"ఏమిటీ, ఇక్కడకు వచ్చిన తరువాతనే!"
"అమదా!"
"ఏమి చేస్తూవుంటాడు?"
"ఏవరీ డాక్టరు అని నీ ప్రశ్న? అతడు అమృతం కలవాళ్ళలో ఒకడు!"
"సరేకాని, చిన్నవదిన ఎంత అందమైంది?"
"నా అదృష్టం. పల్లుతోము పుల్లకు చెట్టు ఎక్కితే, సంజీవకరణి దొరికినట్లయింది."
"అదుగో వదినే వస్తోంది."

అనంతలక్ష్మి పరుగున వచ్చి, "రండి, మన బ్రౌన్" మేడమీద నుంచి క్రింద పడింది!" అని వగరుస్తూ చెప్పింది.

## 7

బ్రౌన్ అనంతలక్ష్మి కుక్క. ఐరిష్ స్పానియల్ మేలుజాతికి చెందినది. నేబిలు రంగు, ఎరుపుబొచ్చుతో ఎర్రవెలుగుబంటిలా ఉంటుంది. దాని కంఠంలోని స్వనము మేఘగర్జనమే! బ్రౌను గుణాలన్నీ ఉత్తమ మైనవి. దానికై ఏర్పాటు చేయబడిన కుర్చీలోనే అధివసిస్తుంది. అనంతలక్ష్మి స్నేహితు లెవ్వరు వచ్చినా ఏమీ మాట్లాడదు. కొత్తవారు గుమ్మం ఎక్కడానికి వీలులేదు. పోర్చిలో నిలబడవచ్చును, కారుమీద వస్తే వరండాలోకి వచ్చి అక్కడ ఉన్న కుర్చీలలో కూర్చోనిస్తుంది. తర్వాత హాలులోనికి వెళ్ళి అక్కడ తన ఆసనం అధివసిస్తుంది. క్రింద పడుకోదు. ఎప్పుడూ తనకై కేటాయింపు చేయబడిన కుర్చీలలోనే అధివసిస్తుంది. విశ్రాంతి తీసుకుంటుంది. ప్రకృతి బాధలు తనకై నిర్మాణం చేసిన దొడ్డిలో తీర్చుకుంటుంది. వేళకు తన భోజన ప్రదేశానికిపోయి భోజనం చేస్తుంది. ఎముకను సాయంకాలంలో కొరుక్కునేందుకు తోట వెనుక ఒకచిన్న అరుగు చేరుతుంది.

"ఈ స్పానియల్ కుక్కతోబాటు డాల్మేషియన్ కుక్కను ఒకటి కొనండి గురువుగారూ!" అని అనంతలక్ష్మి భర్తను అడిగింది.

"అనంతం! నాకీ కుక్కల సంగతి పూర్తిగా తెలియదు. ఎందుకు ఈ పెద్దజాతి కుక్కలు? ఆస్థి, ఐశ్వర్యమూ అందరికీ సమానం అయితే కుక్కలే అక్కరలేదు. మన బంగారాలు వగైరాలు కాపాడడానికే ఈ కుక్కలు!"

"కుక్కలు ఒక విధంగా మనుష్యులకు ఆనందం ఇస్తాయి. కొన్ని జాతికుక్కలు మనుష్యులకు ఎంతో సహాయం చేస్తాయికాదా?"

"అవును. వేటాడేందుకు, నీళ్ళలో పడిపోయేవారిని రక్షించేందుకు."

"మీరు నన్ను హేళన చేయనక్కరలేదు. నాకు మంచిజాతి కుక్కల్ని చూస్తే ఆనందం."

"ఏమిటా మంచిజాతి అనంతం?"

"కుక్కజాతులు మనుష్యజాతులకన్న మంచివి. గ్రేట్‌డేన్, గ్రేహౌండు, బ్లడ్‌హౌండ్, వాటర్‌హౌండ్, హోరియల్, టెర్రియల్ జాతులు. అందాల కుక్కలయిన పోమరేనియన్ వగయిరాలు, పెకింగీస్, జపానీస్, గ్రిషాంక్సు వగైరా వగైరాలు."

"చాలు ప్రాణేశ్వరీ చాలు! కుక్కశాస్త్ర గ్రంథాలు చాలా చదివినట్లుంది."

ఆ తర్వాత కోనంగి డాల్మేషియనూ కొనలేదు, కూలిజాతి కుక్కనూ కొనలేదు. కాని బ్రౌనుకూ అతనికీ ఎంతో స్నేహమయింది.

అలాంటి బ్రౌన్‌కు ఆపత్తు ఏదో జరిగిందనగానే పరుగెత్తినాడు కోనంగి. బ్రౌన్ కులాసాగానే ఉంది. ఏదో కాంచెం గీచ్చుకుపోయింది. అంతే!

"నా తల్లి రా! నా తండ్రి రా! దెబ్బ తగిలిందా?" అని కళ్ళనీళ్ళతో అనంతలక్ష్మి బ్రౌనును గట్టిగా హృదయానికి అదుముకుంది.

బ్రౌన్ కులాసాగానే ఆడుకుంటూ ఉన్నది. అందరూ పత్రికా కార్యాలయానికి వెళ్ళినారు.

అనంతం కొంచెం మనసులో ఏదో బాధపడుతూ ఉన్నది. కోనంగి తన భార్య కుక్క విషయం మనస్సులో ఖేదపడిందనుకొని, ఏవో నాలుగు మాటలు ఊరడింపుగా పలికినాడు. అతడు ఆఫీసులో సంపాదకీయంలో పడినాడు.

మహాత్మాగాంధీగారు క్రిప్సుగారి రాయబార షరతులకు "రాబోయే తారీకు వేసిన చెక్కు" అని పేరు బెట్టారు. అంటే అది ఒక ప్రామిసరీ నోటువంటిది అని కోనంగి అన్నాడు. చిన్నపిల్లవాళ్ళ కోరికకు సమాధానంగా 'లేవు' అని ఇంటిగోడమీద రాయడం వంటిది అని కోనంగి హేళనచేశాడు. 'క్రిప్సు'గారు వట్టి 'ట్రిక్సు' గారిలా ఉన్నారని నవ్వాడు. చర్చలుగారికి చర్చలు అంటే మహాఇష్టమన్నాడు. కాబట్టి ప్రభుత్వం సంప్రదించి, వారితో కలిసి యుద్ధం కొనసాగించాలన్నారు.

డాక్టరు రెడ్డి వచ్చి కోనంగి గదిలోనే కూర్చొని, "ఏమి చేశావోయి నన్ను గూర్చిన రాయబారాన్ని!" అని అడిగినాడు.

"ఈ రోజే ప్రారంభించాను."

"ఎంతవరకూ వచ్చింది?"

"ఆమెకు ఒక మైలుదూరంవరకూ వచ్చింది"

"అంతదూరమే?"

"ఏమయ్యా, ఇదివరకు మూడువందలమైళ్ళదూరంలో ఉన్న రాయబారం మైలు దూరంవరకూ రావడం వాయువేగాన్నంటావా, మనోవేగాన్నంటావా?"

"ఏదో త్వరగా చెప్పునాయనా?"

"ఏమి విరహతాపం! దీనినిబట్టి తమకు కొంచెమన్నా అభిప్రాయాలు మారాయా?"

"ఏ అభిప్రాయాలు?"

"ప్రేమనుగూర్చి!"

"ఏమని?"

"ప్రేమ పారిపోవుతనమన్నావు. ప్రేమకవిత్వం పారిపోవు కవిత్వం అన్నావు-"

"నా ప్రేమనుగూర్చి నాకు కవిత్వం వ్రాసుకోవలసిన అవసరం ఎందుకు రావాలి? అది అచ్చు వేయించి అందరిమీదా రుద్దడమెందుకు?"

"రుద్దడమంటావు. కవిత్వం ఆముద మనుకొన్నావా, ఆవు నెయ్యనుకొన్నావా. అమృతాంజనమనుకొన్నావా?"

"అన్నీ అనుకోవాలె. మీ ప్రేమకవిత్వాలు చూస్తే!"

"ఓయి వెఱ్ఱివాడా, నీ ప్రేమవల్ల నీకు ఆనందం కలిగితే, దానివల్ల కళారూపం సృష్టించ వాంఛ కలిగితే, అలా కవిత్వం ఉద్భవిస్తే, నీ భావాలే సర్వమానవభావాలు కాబట్టి, వారాకవిత్వం విని రసానందం అనుభవిస్తే, ఇదంతా పారిపోయేతనం అంటావు. నీ ప్రేమ పారిపోయేతనం కాదూ? అందరి ప్రేమలూ పారిపోయేతనాలు కావూ? ఈ పారిపోయేతనాలు పనికివస్తాయా! కళలో పారిపోయేతనాలు పనికి రావూ?"

"ఇంత పెద్దలెక్చరిచ్చావు, నాడి సరిగ్గా ఉందో లేదో నన్ను చూడనీ!"

"నాకేమీ జబ్బు లేదుగాని, నీకు చేసేటట్లున్నది, నాలుగురోజులు వరుసగా ఆ అమ్మాయిని కనుక్కోకపోతే."

డాక్టరు నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు. ఆ సాయంకాలం కోనంగీ, అనంతలక్ష్మీ, మధుసూదనూ, సరోజినీ, చౌధురాణీ అందరూ కలిసి సినీమాకు పోయారు. రెండు మూడు సారులు చౌధురాణి వెనుకసీటులో నుంచి, ముందుసీటులో కారు నడుపుతూ ఉన్న అనంతలక్ష్మి ప్రక్కను కూర్చునివున్న కోనంగిని "అన్నా! ఏమవుతుందంటావు క్రిప్సు రాయబారం?" అని అడిగింది.

అనంతలక్ష్మి క్రీగంటితో ఈ దృశ్యమంతా చూసింది. పళ్ళు బిగపట్టి కారు సినిమాహాలుకు పోనిచ్చింది.

## (8)

**అ**నంతలక్ష్మి సినీమాలో చల్లగా, చప్పగా కూర్చున్నదని ఎవ్వరూ చూడలేదు. అది 'పత్ని' సినిమా. సారథివారి సారధి రామబ్రహ్మంగారు సారథిత్వం వహించిన 'రూపవాణి' శిలప్పాధికారగాథ తెరమీద కెక్కిన చిత్రం. సెట్టింగులు, అలంకారాలు అతిచక్కగా ఉన్నవి. తారాగణం ఆకాశంలో నిర్మల నీలాకాశంలో తారలే. సంగీతం ఫరవాలేదు. సారథత్వం ప్రతిభతో నడిచింది. కాని కథ మాత్రం చిత్రానికి అనువైనదికాదు.

ఆంధ్రదేశంలో పెద్ద ప్రదర్శనశాలలలో పదహారు వారాలన్నా చిత్రం నడిస్తే డబ్బు వచ్చిందన్నమాటే. ఆడవాళ్ళు చిత్రం చూడడానికి వచ్చిహాలంతా ఏడుపులతో నింపితేగాని ధనం వారలుకట్టదు. ఆడవాళ్ళు హడలిజేజారై రావడం మానితే. ఆరురోజుల్లో సినీమా ప్రదర్శనం ఆఖరు.

ఇవన్నీ ఆలోచిస్తూ కూర్చున్నాడు కోనంగి. అనంతలక్ష్మి భర్త మోము మూడుసారులు చూచింది. ఆలోచనాదీనమయివున్న అతని మోము ఆ కనుచీకటిలో ఎవరో ఒక కొత్తవాని మోములా తోచింది. అనంతలక్ష్మి హృదయంలో రాబోయే వాన మొదటి చినుకులా, అనుమానపు రాళ్ళవాన మొదటిరాతి చినుకుపడింది.

పేపరులో సంపూర్ణంగా మునిగిపోయి తన్ను మరచిపోయినారా! బందరులో తన్ను అక్కా అని పిలిచింది చౌధురాణి ఈ రోజు 'అన్నా, అని కోనంగిరావుగారిని పలకరిస్తోంది. ఏవో రాజకీయాల వాదప్రతివాదనలేగాని ప్రేమ సంభాషణలలో, ప్రణయ విలాసాలలో ముంచెత్తు తన మనోనాయకుడు ఈ దినాలలో దూరంగా ఉంటున్నారు. ఆమె రెండు మూడుసారులు కోనంగి చౌధురాణితో ఏవో రహస్య మంత్రాంగాలు సలుపుతూ ఉండడం చూసింది.

అనంతలక్ష్మి చిత్రంలో కూర్చోలేకపోయింది. చటుక్కునలేచి, అప్పుడే వస్తానని బయటకు పోయింది.

కోనంగి తన భార్య ఎందుకో వెళ్ళిందనుకున్నాడు. అయిదు నిమిషాలలో కథా భాగాల అనుసరణలో నిమగ్నుడయ్యాడు. పదినిమిషాలయింది. అనంతలక్ష్మి రాలేదు. అతని మనస్సు ఎందుకో చెదిరి మళ్ళీ కథవైపు ప్రసరింపలేదు.

ఇరవై నిమిషాలయింది. అనంతలక్ష్మి రాలేదు. ఏదో కంగారు పుట్టి లేచి బయటకు వచ్చి, తన భార్య కారు ఆపుచేసి వుంచిన స్థలం దగ్గరకువస్తే, కారూలేదు, అనంతమూ లేదు. కారువేసుకు వెళ్ళిందా? వెళ్తే ఇంటికేనా, లేక ఏదయినా పనిమీద ఎక్కడికైనా వెళ్ళిందా? అలా వెడితే స్నేహితురాండ్ర ఇళ్ళకు మాత్రం వెడుతుంది. ఈ మధ్య తనతో చెప్పకుండా ఎక్కడకూ వెళ్ళటంలేదే! వంటో బాగుండక తక్కినవారి ఉత్సాహం పాడుచేయడం ఎందుకని ఆమె వెళ్లిపోయి ఉంటుంది! అతడు గబగబ బస్సు ఆగేచోటికి పోయి బస్సుఎక్కి యింటికి చేరినాడు. గదిలో మంచంమీద అనంతం పడుకొని ఉంది. జయలక్ష్మి కుమార్తె పక్కలో కూర్చుండి, 'కాఫీ తాగమ్మా' అని బ్రతిమాలుతూ ఉన్నది.

కోనంగి వస్తూనే "ఏమిటండీ అత్తగారూ? అనంతానికి వంట్లో బాగా లేదా ఏమిటి?" అని కంగారుగా మాట్లాడి మంచం దగ్గరకు ఉరికినాడు. జయలక్ష్మి "అమ్మాయిచేత మందు తాగించు నాయనా! నాకు పని ఉంది!"

"అసలు ఏమిటి? డాక్టరుకు కబురు పంపినారా?"

"కంగారు పడకు, ఏదో కొంచెం తలనొప్పిగా ఉందంది!" జయలక్ష్మి వెళ్ళిపోయింది.

కోనంగి భార్య ప్రక్కను కూర్చుండి, ఆమె నుదుటిపై చేయివైచి చూచాడు. నాడి చూచాడు. నాడి ఏదో కొంత వేగంగా ఉంది. కాని జ్వరం ఏమీ లేదు. కోనంగి ఆమెను దగ్గరగా లాక్కొని, మోము తనవైపు తిప్పుకొని, ఆమె కన్నులవెంట నీరు ధారగా ప్రవహించడం చూచి, "అనంతం!" అని తన కళ్ళలో నీరు తిరిగినంతపని కాగా, ఆమె కన్నులు చుంబించాడు.

మూసిన కన్నులు అనంతం తెరవదు. భార్యను మరీ హృదయానికి అదుముకున్నాడు.

"కాఫీ త్రాగు అనంతం!"

అనంతం మాట్లాడలేదు

"బాగాలేదా, కాఫీ సయించలేదా?"

అనంతం మాట్లాడలేదు. కోనంగికి ఆదుర్దా ఎక్కువయింది.

"నీవంట్లో బాగా ఉండలేదా? వెంటనే చెప్పు, మన డాక్టరు గారిని పిలుచుకు వస్తాను."

"నాకు తలనొప్పిగా ఉన్నది. మీరు ఊరికే నన్ను మాట్లాడించకండి. నాకు కాఫీ వద్దు, డాక్టరూ వద్దు. మీరు కాసేపు పడుకోనివ్వండి. నన్ను ఎవరయినా ముట్టుకుంటే నాకు తేళ్ళూ జెర్రులూ పాకినట్లుంది."

కోనంగి కొంచెం కించపడి, లేచి విద్యుద్దీపం ఆర్పివేసి, దూరంగా ఆ గదిలో ఉన్న సోఫాపై కుంగిపోయి కూర్చున్నాడు.

అనంతానికి, ఎప్పుడూ పెంకితనంలేదు. ఆ బాలికకు తనపై ఉన్న ప్రేమ అనంతము, జగదద్భుతముకదా! నిజంగా జబ్బుచేసిందా? వట్టి గోలపిల్లవడంచేత వంట్లో బాగుండకపోయినా, ఏదో అనుకొంటుందేమో. పసితనం వదలని ఈ పరమ సుందరిలోన ఏదోగా ఉండడంవల్ల అది తెలియక చీకాకు పడుతుందేమో అనుకున్నాడు. ఈ బాలికకు

తెలియకుండా డాక్టరుకు కబురు పంపితే? తీరా ఏ అజీర్ణమో చేస్తే తలనొప్పి వచ్చిందేమో? హాస్యం చేసినా, ఈలాంటి వాటిల్లో ఛాందసము మంచిదేమో?

ఇంతట్లోకే "అనంతం అక్కా!" అని చౌధురాణి, "ఏమిరా కోనంగీ!" అని మధుసూదనుడు. ఇంతలో ఇద్దరూ "మామయ్యగారూ!" అంటూ సరోజినీ, "వారెవా! ఏమి దంపతులండీ!" అంటూ కమలనయనా చక్కావచ్చారు.

జయలక్ష్మి హాలులోనికి వచ్చి "అమ్మిణికి వంట్లో కులాసాగా లేదు. అక్కడే ఉన్నాడు కోనంగిరావుగారు" అన్నది.

అందరూ అనంతలక్ష్మి గదిలోనికి వచ్చారు. వీళ్ళు వస్తున్నారని కోనంగి స్విచ్ నొక్కినాడు. అనంతలక్ష్మి భర్త దీపం వెలిగించే లోపునే గబగబ చీకటిలో మోము దుప్పటితో తుడుచుకొని, కళ్ళు మూసుకొని ఉంది.

దీపం వెలిగింది. అందరూ గదిలోకి వచ్చారు. మధుసూదనుడు కోనంగిని చూచి,"ఏమిరా! ఎల్లా వచ్చావు? నువ్వు వెళ్ళావు. పదినిమిషాల తర్వాత ఏమి జరిగింది బాబూ అంటూ బయటకు వచ్చాము. అప్పుడే కారు వచ్చింది. మేమూ వచ్చాము. నువ్వు ఎట్లా వచ్చావు?"

**కోనంగి:** నేను బస్సుమీదే వచ్చాను. నువ్వు ఎల్లా వచ్చావని నన్నొక్కణ్ణే అడుగుతావేమి?

**మధు:** ఆనందం మాతో చెప్పినాడు. "మా చెల్లెలు ఒక్కతే డ్రైవు చేసుకుంటూ వచ్చింది. వంట్లో బాగుండలేదు కూడా!" అని మాతో చెప్పాడు. ఏమిటో, ఎందుకో అని కంగారుపడి ఆ కారుమీద పరుగెత్తి వచ్చాము.

## ⑨

ఎప్పుడూ సంతోషంగా ఉండే కోనంగి ఎంతో కుంగిపోయినట్లయ్యాడు.

"బ్రదర్! అల్లా కుంగిపోయినట్లున్నావు?" చౌధురాణి ఎప్పుడూ ఇంగ్లీషులో మాట్లాడుతుంది. ఇంగ్లీషులో బావను ఇంగ్లీషువారు "బ్రదర్" అనే అంటారు. ఆమెకు కోనంగి వరసకు బావే! చిన్నతనాన్నుంచీ కోనంగీ మధుసూదనూ "బావా! బావా!" అనుకునేవారు. చౌధురాణి తెలుగులో మాట్లాడినా కోనంగిని "బ్రదర్" అనే పిలుస్తుంది.

ఒక బాలికను ఎవరయినా ప్రేమిస్తే ఆ విషయాన్ని ఆ పురుషుడు ఎంత రహస్యంగా దాచుకున్నా, ఆ బాలికకు హృదయంలో ఆ విషయం స్ఫుర్యత నందుతుంది. చౌధురాణికి డాక్టరు రెడ్డి హృదయం అర్థమయింది. డాక్టరు రెడ్డి ఆమెకు ఒక విచిత్ర వ్యక్తిగానే కనిపించాడు. ఈయన కమ్యూనిస్టు అని కోనంగిరావు అన్నాడు. చాలామంచివాడు, పేరుపొందిన డాక్టరు, సంస్కారి అనీ కోనంగి బ్రదర్ అన్నాడు.

మాటయాసా, ఇంకా ఒకటీ రెండు విషయాలలో తప్ప డాక్టరు రెడ్డిగారు బ్రాహ్మణునిలా ఉంటాడు. బ్రాహ్మణుడు కాదా అన్న ప్రశ్న తనకెందుకూ? తనకు కులాలూ, గొడవలు ఉన్నాయా? రెడ్డి ఎవరయితే తనకేమి అనుకుంది.

కాని ఎదుట ఒక హృదయం ఆమెపై ప్రేమతో వీణతీగలై మ్రోగుతూ ఉంటే, ఆమె హృదయంలో శ్రుతితీగలే ఉంటే, అవన్నీ ప్రతి స్పందన అయి మ్రోగవలసిందే కదా!

రెడ్డి తన జోలికి రాలేదు. తన ఎదుటకు వచ్చి నాల్గయిదుసారులు మాత్రం అందరితోపాటు కూర్చున్నాడు. ఏదో మాట్లాడినాడు.

రెడ్డి అందరితోనూ అతిచనువుగా మాట్లాడేవాడు. ఆమెతో సాధారణంగా మాట్లాడడు. ఆ విషయం ఆమె గమనించకపోలేదు.

ఆమెకు డాక్టరు రెడ్డి విషయం ఎందుకో అస్తమానం మనస్సుకు రావడం ప్రారంభించింది. కొన్నాళ్ళకు ఆ రావడం కొంచెం కొంచెం కంగారు పెట్టడం ప్రారంభించింది.

అందుచేత చౌధురాణి పదిసార్లు తన సోదరునితో సమానుడయిన కోనంగి దగ్గరకు రాసాగింది. కోనంగి చిన్నతనంలో అంటే పది, పన్నెండు పదమూడు ఆ ప్రాంతాల "నిన్ను పెళ్ళిచేసుకుంటాను కోనంగి బావా!" అనేది. పధ్నాలుగు, పదిహేను సంవత్సరాలలో మాట అనకపోయినా కోనంగిని ప్రేమిస్తున్నానని అనుకుంటూ అతన్ని ప్రేమించిన దానివలె నడతలో చూపించేది.

కోనంగి నవ్వుకుంటూ ఉండేవాడు. ఎప్పుడూ కలుసుకుంటూ ఉన్నా కోనంగికి ప్రణయలేఖలు వ్రాసి చెల్లెలు కమలనయనచేత పంపించేది. అవన్నీ మధుసూదనునకు చూపిస్తే కోనంగీ, మధూ ఇద్దరూ నవ్వుకొనేవారు. "పోనీ మా చెల్లెలిని పెళ్ళి చేసుకోరాదట్రా?" అని మధు కోనంగిని అడిగేవాడు. కోనంగి "ఒరే! నాకు చెల్లెళ్ళులేరు. వీరిద్దరూ నా చెల్లెళ్ళు. చౌధు నన్ను నిజంగా ప్రేమిస్తుందనా నీ ఉద్దేశం! అదీ ఒక తియ్యటి ఫాషన్" అన్నాడు.

ఇంటర్ చదివేరోజులలో ఆమెకు కోనంగిమీద ప్రణయం పొగమంచులా మాయమయింది. ఆ మొదటి దినాలలో కోనంగిని చూడడానికి సిగ్గుపడింది. తర్వాత కలుసుకొని ఆ గొడవమానేసి ఇతర విషయాలు మాట్లాడేది.

ఇంతలో కోనంగి మదరాసు వెళ్ళిపోయినాడు.

మదరాసు బయలుదేరే రోజునే చౌధురాణి కోనంగికి క్షమాపణ ఉత్తరం వ్రాసింది.

"అన్నయ్యా! నువ్వు నన్ను గురించి ఏమీ తప్పు అభిప్రాయం పడవద్దు. నేను నీకు అనుంగు చెల్లెలిని. నువ్వు నీ ఉత్కృష్ట ప్రేమతో నన్ను నీ ఏకగర్భజనిత అయిన చెల్లెలిగా చూచుకొన్నావు. నాకా రోజులు చిన్నతనం. ఈనాడు నేను ప్రపంచాన్ని సరీగా అర్థం చేసుకుంటున్నాను. అన్నా! నాకు ఇద్దరు అన్నలు. ఎప్పుడూ నీకు అనుగు చెల్లెలిని.

నీ ప్రియసోదరి

చౌధు."

అని వ్రాసింది. ఇది చూచి కోనంగి కళ్ళు చెమరించగా నవ్వుకున్నాడు. ఆ బాలిక వ్రాసిన ఉత్తరాలన్నీ తగలవేసి, ఈ ఉత్తరంమాత్రం దాచుకొని మదరాసు వచ్చినాడు.

అలాంటి చౌధురాణి తనలో తనకు అర్థంకాని ఏవేవో ఊహలు ఉద్భవిస్తే అవన్నీ చెప్పుకుందామని తనకు అన్నకన్న అన్నఅయిన కోనంగి దగ్గరకు చేరింది. కాని ఏమీ చెప్పలేదు.

నేడు తన ప్రియమైన వదిన అనంతలక్ష్మి అలా ఉండడమూ, తన అన్న ఏదో దిగాలుపడి ఉండడం చూచి ఎంతో దిగులుపడింది.

ఈలోగా మధుసూదనుడు కారు తీసుకువెళ్ళి డాక్టరు రెడ్డిని లాక్కొని వచ్చాడు.

డాక్టరు అనంతలక్ష్మికి జ్వరం సంగతి చూచి, నాడి పరీక్ష చేసి ఏమీలేదు కొద్దిగా అజీర్తి చేసిందని ఆయన హాలులోనికి వచ్చి కూర్చున్నాడు. అక్కడకు మధుసూదనుడూ, కోనంగీ కూడా చేరారు.

**డాక్టరు:** కాంగ్రెసు కార్యవర్గంవారు బ్రిటిషువారిని దేశం వదలి నడవమన్నారు. ప్రభుత్వాన్ని ఈ దేశంనుండి నడపడానికి తీర్మానం చేశారు, అది ఆగష్టు మొదటివారంలో బొంబాయిలో జరిగే అఖిల భారత జాతీయ మహాసభా సమితి ఎదుట పెడ్తారట.

**కోనంగి:** అవును, పెట్టరా.

**డాక్టరు:** 'క్విట్ ఇండియా' విధానం లేవదీశాడు గాంధీజీ.

**మధు:** అదే మహాత్మాజీలోని మహత్తు. దేశం క్రుంగి ఉన్నప్పుడు ఒక్కొక్క క్రొత్త భావం ప్రజలలో విసురుతాడు.

**డాక్టరు:** రాయిలా!

**కోనంగి:** అమృతఘుటికలా!

**డాక్టరు:** మీ మహాత్ముడు జపాను యుద్ధాన్నిగూర్చి అలా వ్రాశాడేమిటి?

**కోనంగి:** ఏమి వ్రాశాడు? తానయితే జపానుకు వెళ్ళి వాళ్ళను తాము చేసే ఈ దురన్యాయపు యుద్ధం చెడుగుదని బోధిస్తా నన్నాడు.

**డాక్టరు:** దానిమీద బ్రిటిషు పత్రికలు ఈ ముసలాయన్ను తిట్టిపారేస్తున్నాయి.

**మధు:** తిట్టవు మరీ ... ఆయన భావానికి చెయ్యాలని తప్పర్థం చేసి అవాకులు వాగితే సరి.

## (10)

క్రిప్సుగారు కాంగ్రెసును, భారతీయులను నాలుగు తిట్టి చక్కాబోయారు. లండను వెళ్ళి తిట్టినారు. బ్రిటిషు ప్రభుత్వంవారూ నాలుగు తిట్టినారు.

దేశంలో ప్రజలకు బ్రిటిషువారిపై ద్వేషం ఎక్కువై పోతోందని మహాత్మాజీ అఖండ సత్యాగ్రహం ప్రారంభించాలన్నారు. నాయకులు సంపూర్ణ సత్యాగ్రహం జరుగుతుంది, సిద్ధం అంటున్నారు.

పత్రికలన్నీ ప్రభుత్వంవారిని చివాట్లుపెడుతూ కాంగ్రెసుతో రాజీపడండి అని కోరుతున్నాయి.

జపాను నేడో రేపో ఇండియాలో దిగుతుంది అన్న కింవదంతులు ప్రబలిపోయాయి.

విరోధుల రేడియో వార్తలు వినవద్దని ప్రభుత్వంవారు ఆర్డినెన్సు చేసినా ప్రజలలో చాలమంది వింటూనే ఉన్నారు. జర్మనీ నుంచీ, సైగాను నుంచీ, జపాను నుంచీ వార్తలు, ప్రసంగాలు వస్తున్నాయి.

భారతదేశం నుండి ఏ రకంగా మాయమయ్యారో సుబాస్‌బాబు జర్మనీ చేరి అక్కడ భారతీయ సైన్యం ఏర్పాటు చేశాడని రేడియోలో వినబడసాగింది.

ఏమి గడబిడలు జరుగుతాయో అని ప్రభుత్వం ఆర్డినెన్సులూ, అరెస్టులు జరిగే విషయాలన్నీ ఆలోచించుకొని సిద్ధంగా ఉన్నారు.

కమ్యూనిస్టులు కాంగ్రెసువారిని ఇప్పుడిప్పుడే సత్యాగ్రహం పెట్టవద్దనీ, ఫాసిస్టులను నాశనం చేయవలసిన ఈ సమయంలో కాంగ్రెసువారు సత్యాగ్రహం ప్రారంభించడం దేశానర్థదాయకమనీ వ్యాసాలు, ఉపన్యాసాలు మారుమ్రోగిస్తున్నారు.

రాడికల్ డెమొక్రటిక్ పార్టీవారూ, వారి పెద్ద ఎం. ఎన్. రాయిగారూ కాంగ్రెసును, గాంధీజీని దుమ్మెత్తి పోయసాగారు. కమ్యూనిస్టులకు రహస్యంగానూ, రాడికల్ వారికి బహిరంగంగానూ ప్రభుత్వం డబ్బిస్తోందని దేశంలో మారు మ్రోగుతోంది. ఫార్వర్డుబ్లాకు పార్టీవారి నందరినీ ప్రభుత్వం జయిళ్ళకు పంపించింది. ఫార్వర్డుబ్లాకు పార్టీనే నిషేధించింది.

ఈ గడబిడలో నవజ్యోతి, అటు ప్రభుత్వం కొండకూ, ఇటు కాంగ్రెసు కొండకూ తగలకుండా చక్కని సంపాదకీయాలు అర్పింపసాగింది. డాక్టరు రెడ్డి సామ్యవాది అయినా నవజ్యోతిని సామ్యవాదపు పేపరు చేయదలచుకోలేదు. కోనంగీ, అనంతలక్ష్మీ కాంగ్రెసు వైపే మొగ్గి ఉన్నా నవజ్యోతిని కాంగ్రెసు పేపరు చేయదలచుకోలేదు.

ఈ సందర్భంలోనే అనంతలక్ష్మికి కోపం వచ్చిన సంఘటన జరిగింది. ఆ దినం ఆగస్టు ఒకటవ తారీఖు.

హాలులో డాక్టరు, కోనంగి, మధుసూదనుడూ మాట్లాడిన వెనుక డాక్టరూ మధుసూదనుడూ వెళ్ళడానికి లేచారు.

ఈ లోపుగా చౌధురాణీ, సరోజినీ, కమలనయనా అనంతలక్ష్మితో ఏవో పిచ్చాపాటీ మాట్లాడుకొని, అనంతలక్ష్మి కులాసాగా ఉండడం చూచివారూ వెళ్ళడానికి హాలులోకి వచ్చారు.

చౌధురాణీని చూడగానే రెడ్డి గుండెలు దడదడ కొట్టినాయి. చౌధురాణీ రెడ్డిగారి వంక చూడనట్లు కనిపించింది. కాని, చూడవలసిన రీతిగా చూడనే చూసింది.

అందరూ వెళ్ళిపోయారు. కోనంగి చాలా పొద్దుపోయినా, హాలులో ఒక సోఫాలో కూర్చొని ఉన్నాడు. అతడు కుంగిపోయి ఆలోచనలులేని ఆలోచనలలో మునిగియున్నాడు. దీపం వెలుగుతూనే ఉంది గుడ్డిగా.

మదరాసులో బ్లాకుఅవుటు అవడంచేత ఇళ్ళలో కూడా దీపాలచుట్టూ నల్లటి బురకాలు పెట్టవలసి వచ్చింది. ఒక గంట అయింది. కోనంగి చటుక్కున లేచి తన పడక గదిలోనికి వెళ్ళినాడు.

అనంతలక్ష్మి పందిరిమంచంమీద కళ్ళు తెరిచే పడుకొని ఉన్నది. కోనంగి నెమ్మదిగా వెళ్ళి మంచంమీద కూర్చుండి "అనంతం! వంట్లో బాగా కులాసాగా ఉందా?" అని అడిగినాడు. అనంతం చేతులు చాచింది. కోనంగి ఆమె హృదయంపై వ్రాలి ఆమెను గాఢంగా తన హృదయానికి అదుముకొన్నాడు.

* * * *

తెల్లవారి ఏడుగంటలు అయింది. కోనంగి భార్య పక్కనుండి మెల్లగా లేచి ఆ గదిలో వారిద్దరికోసం ఉంచుకొన్న ఒక చక్కని రేడియోను మదరాసు మీటరు తిప్పి మంచం దగ్గరకు వచ్చి నిదురలో సౌందర్యనిధియై పడుకొన్న అనంతలక్ష్మిని చూస్తూ మంచం దగ్గరే నిలుచున్నాడు

అనంతలక్ష్మి గులాబిమొగ్గల పెదవులు కొంచెం విడివడి ముత్యాల పలువరస కొంచెముగా కనబడుతూ ఉన్నది. ఆమె పెదవులూ, మూతలు పడియున్న కన్నులూ నవ్వుతూ ఉన్నాయి.

"ఈలాటి పరమ కల్యాణమూర్తిని భార్యగాగల ఎవ్వనికి కవిత్వంరాదు!" అని కోనంగి అర్థస్ఫుటంగా అనుకున్నాడు.

ఆమె ముంగురులు అర్థచంద్ర సుందరమయి ఆమె ఫాలంపై చెదిరి ఉన్నాయి. ఆమెకు మెలకువ రాకుండ నెమ్మదిగా కోనంగి ఆ కురులు సర్దుతున్నాడు.

పయ్యెద నుండి ఓరగా తప్పుకున్న ఒక బంగారు హృదయదేవాలయము పయ్యెద మరుగున ఉన్న గోపురములు ఆమె ఊపిరితో పైకి లేస్తూ దిగుతూ ఉన్నాయి. అతని చూపులా పరమ పవిత్ర ద్వయముపై ప్రసరించినవి. అప్పటి నుండి ఆతని చూపులు ఆమె చుబుకముపై వ్రాలినవి.

ఇంతలో రేడియోలో మద్రాసు నుండి స్పష్టంగా ప్రభాత గీతిక వినిపించ సాగినది. ఆ రాత్రే కోనంగి ఒక పాట ఆ ప్రభాత గీతిక వరసనే వ్రాసి ఉంచుకున్నాడు. ఆది ఆ రేడియో గీతికలో కలిపి పాడసాగినాడు.

*"జయమో సుందరి నీకూ*
*జయలక్ష్మీ తనయా!*
*జయమ హెూ సుందరి నీకూ!*
*పల్లవాధరీ! ఫుల్లసుమానన*
*హల్లకకుట్మల యుగ్మకుచా!*
*జయమహెూ సుందరి నీకూ!*
*నీదు స్వప్నములు నిర్మలకాంతులు*
*నన్ను పొదువునవి నిశ్చలప్రేమలు*
*జయమహెూ సుందరి నీకూ!"*

## ద్వాదశ పథం

# ఆగస్టు ఎనిమిది

ఆగష్టు ఎనిమిది తారీఖున బొంబాయిలో కాంగ్రెసు మహాసభ సమితి సమావేశమై "బ్రిటిషువారు ఇండియా వదలాలనీ, లేకపోతే ప్రతి భారతీయుడూ సత్యాగ్రహం చేయాలనీ, ఆ సత్యాగ్రహం గాంధీగారు ప్రారంభిస్తారనీ, ఆ సత్యాగ్రహం ప్రారంభించే ముందు మహాత్మాజీ ప్రభుత్వం వారికి తెలియజేసి రాజీకి వ్యవధి ఇస్తారనీ" తీర్మానింపబడింది.

రాత్రికి తీర్మానం అయింది, తెల్లవారకట్ల కార్యవర్గ సభ్యులనందరినీ అరెస్టుచేసి ఎక్కడకో తీసుకుపోయారు. మహాత్మాగాంధీజీని, ఆయన అనుచరవర్గాన్ని తీసుకుపోయి ఆగాఖాన్‌భవనంలో ఖయిదుచేశారు. ఆగస్టు తొమ్మిది ఉదయించింది.

ఆగస్టు తొమ్మిదిలో ఏదో మహత్తరావేశం పొంగిపోయి అఖండ విద్యుచ్ఛక్తిలా దేశం అంతా ప్రాకిపోయింది.

ప్రతిగ్రామంలో, పురంలో, నగరంలో ప్రజలు ఆందోళనావశులైరి.

ప్రభుత్వంవారు డజన్లకొలదీ ఆర్డినెన్సులు అమలులో పెట్టారు. కాంగ్రెసు మహాసభ, కార్యవర్గము, రాజధానీసభలు, కార్యవర్గాలు, జిల్లాసభలు, కార్యవర్గాలు. గ్రామ జాతీయసంఘాలు నిషేధింపబడినాయి.

రాష్ట్రనాయకులు, జిల్లానాయకులు బంధింపబడినారు. ప్రజలు లక్షలు బయలుదేరి రైళ్ళాపి, పెట్టెలు తగులబెట్టినారు. పట్టాలు లాగిపారవేశారు. తంతితపాతీగలు తెంపిపారవేశారు. రైయిలు స్టేషనులు, తాలూకాఫీసులు, కలెక్టరాఫీసులు తగులబెట్టారు.

అనేక స్థలాలలో పోలీసు కాల్పులు, ప్రజల చావులు, పోలీసులనే కొన్నిచోట్ల తగులబెట్టినారు. దిట్టమయిన జాతీయ నాయికా నాయకులు మారుమూలలకు పోయి ఉద్యమం సాగిస్తున్నారు.

కొన్నిచోట్ల బ్రిటిషురాజ్యము మాయమైపోయింది; కొన్నిజిల్లాలలో ప్రజారాజ్యాలు స్థాపించారు.

బ్రిటిషుపత్రికలు మహాత్మునీ, కాంగ్రెసునీ తిడ్తున్నాయి భారతీయ పత్రికలలో ప్రభుత్వం ఇష్టంలేకుండా ఈ 1942 సత్యాగ్రహవార్తలు ప్రచురించకూడదట! అమెరికన్ పత్రికలకు వార్తలు సరిగా వెళ్ళటంలేదట బ్రిటిషువారలంటే ఇష్టంవున్న పత్రికలు ఇండియా చర్యలను నిరసిస్తున్నవి.

కమ్యూనిస్టులు కాంగ్రెసువారి చర్యలను నిరసించారు. రాయిష్టులు కాంగ్రెసును దుమ్మెత్తిపోసినారు. పత్రికాసంపాదకులందరూ కూడి ప్రభుత్వంవారు తమ స్వాతంత్ర్యం అరికట్టడం నిరసించారు. తాము యుద్ధవిషయంలో ప్రభుత్వానికి ఎంత సహాయంచేసిందీ వివరించారు. చివరకు ప్రభుత్వంవారే రెండుమెట్లు క్రిందికి దిగినారు.

జర్మనీ నుంచీ, సైగాను జపాన్ నుంచీ రేడియోలో ఇండియాలోని వార్తలన్నీ ప్రచారం కాసాగాయి. సుభాష్‌బాబుగారు బర్మా, మలయాలలో భారతీయ జాతీయసేన నిర్మించారు. ఒక సేన జర్మనీలో నిర్మించారు; భారతీయ సేనలు జపానువారికి పట్టుబడినవి. అవి జాతీయసేనలో చాలా వరకూ చేరినవి.

మలయా, బర్మాలలో భారత జాతీయప్రభుత్వం నెలకొల్పినారు. సుభాష్‌బాబు దానికి నేతాజీ అయినాడు. అక్కడె జాతీయబ్యాంకు నిర్మాణం చేయగా కోటిరూపాయలు వసూలయినాయి.

భారతదేశంలోనే రహస్యంగా రేడియోస్టేషనులు బయలుదేరినవట. వాటి పలుకులు కూడా ఉద్యమాన్ని హుషారు చేయడం సాగించాయి.

చాలామంది పత్రికానేతలు ప్రభుత్వంవారు విధించిన నిషేధం అన్యాయమని తమ ప్రచురణలు ఆపి వేసినారు.

రైళ్ళు సరిగా వెళ్ళటంలేదు. దేశం అల్లకల్లోలమైపోయింది.

లోకం అంతా ఇంత తల్ల క్రిందులౌతుందని కోనంగి కలలో అనుకోలేదు. అన్ని జాతీయ పత్రికలతోపాటు కోనంగి తన పత్రికా కట్టివేశాడు. ప్రభుత్వంవారు పత్రికలు చేసిన గడబిడవల్ల చాలావరకు నిషేధాలు తీసివేశారు. ప్రభుత్వానికి పత్రికా సలహాసంఘం పెట్టారు. అప్పుడు తక్కిన పత్రికతోపాటు కోనంగి నవజ్యోతిని మళ్ళీ ప్రకటించ సాగించాడు.

నవజ్యోతి పత్రికాసంస్థ సామ్యజాతీయవాద సమ్మిళిత పత్రిక. పత్రిక అచ్చుపని వారికి. యంత్రపనివారికి, గుమాస్తాలకు, అచ్చుపత్రాలు సరిదిద్దువారికి అందరకూ ఒకటే జీతం, డెబ్బదిఅయిదు రూపాయలు. పనివాళ్ళ ముఖ్యునకూ, ఉపసంపాదకులకూ నూరురూపాయలు జీతం. సహాయసంపాదకునకూ ప్రకటన పెద్దకూ, ఆఫీసు మేనేజరుకూ, పత్రిక సరఫరాపెద్దకూ నూటయాభైరూపాయల చొప్పున జీతం.

పనివాళ్ళ పనితనంబట్టి జీతాల తేడాలున్నాయి. రోజుకు రెండుగాలీలన్నర వారు డెబ్బది అయిదు రూపాయలవారు. రెండుగాలీలవారు కాని మంచి పనివారికీ అంతేజీతం. అక్కడ నుంచి అరవై, ఏభైవరకూ ఉన్నాయి. కార్యాలయ బాలురకు ముప్పది రూపాయల జీతం. స్త్రీ యెడిటర్లకు నూటడెబ్బదిఐదు చొప్పున ఏర్పాటు చేసుకున్నారు.

పెట్టుబడికి, వడ్డీకి-యంత్రాలు, టైపులు అరుగుదలకు ఇంతంత మొత్తము తీసివేయగా, జీతాలు నాతాలు ఖర్చులు పోగా మిగతా మిగిలిన సొమ్ములో ప్రావిడెంటు ఫండు, బోనసులు ఏర్పాటు చేశారు. సెలవలు, జబ్బు సెలవలు, పనిసెలవలు ప్రతివారికి సమంగా ఇచ్చారు. కోనంగికి రెండువందల యాభై రూపాయల జీతం.

పత్రికా నిర్వహణంలో అందరికీ సమంగా ఓట్లు ఉన్నాయి. పత్రికలో పని చేస్తుంటే ఇతరులు చూచి ఆశ్చర్యపడుతూ వుంటారు. ఎవరిపని వారు చేసుకుంటారు. పని సరీగా జరుగుతుంది.

కోనంగి దేశంలో అల్లకల్లోలం ఏంటూ హింస లేకుండా వుంటే బాగుండునంటాడు. డాక్టరు ఏదీ వుండకూడదు అంటాడు. రియాసత్ ఆలీ ఫరవాలేదులే, దేశానికి ఆమాత్రం మగతనం ఉండవద్దా అంటాడు. మధుసూదనుడు "ఇంకా చాలదు. ప్రతి కలెక్టరాఫీసూ, ప్రతి కోర్టూ అంటుకుపోవాలి. ఇదే సమయం జపానువాడు రావడానికి. ఆస్సాంవరకూ వచ్చి ఆగిపోయాడే నాయనమ్మ. అసలు అమెరికా మీదకు వెళ్ళకూడదు" అంటాడు.

చౌధురాణీ, సరోజినీ, అనంతలక్ష్మి ఆనందము పడుతున్నారు. హడలిపోతున్నారు.

## (2)

ప్రూఫురీడరు సుబ్బారావు జ్యోతిష్కుడు. ఆయన ఈ యుద్ధం చాలా కాలం ఉంటుందనీ, ప్రపంచం మారిపోతుందనీ, ఇదంతా యూరేనస్ పని అనిన్నీ అంటూ ఉండేవాడు.

దేని పని అయితేనేమి, హిందూదేశం అల్లకల్లోలంగా ఉంది. కోనంగి మాత్రం ఏమీ కల్లోలంకాని హృదయంతో ప్రభుత్వాన్ని కొంచెం ఘాటుగానే విమర్శిస్తూ సంపాదకీయాలు సాగించాడు.

డాక్టరు రెడ్డిగారికి చౌధురాణీపై ప్రణయం అవిలంబనీయ మయిపోయింది. ఆయన మాట్లాడలేదు. తాను తనకూ స్త్రీలకూ ఇదివరకున్న సంబంధము చౌధుతో చెప్పాలా, వద్దా? అని కోనంగితో ఆలోచించాడు. కోనంగి నువ్వు రెండు కారణాలవల్ల చెప్పాలి అని అన్నాడు. ఒకటి ప్రాపంచికంగా ఆలోచిస్తే వచ్చేది. ముందు ముందు ఏలాగో ఈతని ఒకనాటి జీవితం చౌధురాణీకి తెలిస్తే ఆమె మనస్సు విరిగిపోవచ్చును అని, రెండవది ధర్మ దృష్ట్యా ఆలోచించవలసినది. చేసుకొనబోయే భార్యకూ భర్తకూ మధ్య ఏ రహస్యాలూ ఉండకూడదు. ముఖ్యంగా స్త్రీ పురుషులకు సంబంధించినది కనుక అని.

డాక్టరుకు మొదటి కారణం నచ్చినా, రెండవ కారణం నచ్చలేదు. ఏ రాయి అయితేనేమి పళ్ళూడగొట్టుకొనడానికి? నువ్వే జాగ్రత్తగా ఆమెకు చెప్పవయ్యా అని కోనంగిని కోరినాడు డాక్టర్.

దీనివల్ల తనకూ చౌధురాణీకి అసలే సంబంధం కలక్కపోవచ్చును అని డాక్టర్ రెడ్డి అనుకున్నాడు. స్త్రీల మనస్సులు విపరీతమయినవి. ప్రేమించి లేదంటారు. ప్రేమించకుండా ప్రేమించినట్లు నటిస్తారు. ఒకనాడు ప్రేమించి, మరునాడు నీకూ నాకూ

ప్రేమ ఏమిటి అంటారు. కాని స్త్రీ ఇంతకన్న ఏమి చేస్తుంది. ఈ అసంగతపు చరిత్రవల్లనే స్త్రీ తన్ను తాను రక్షించుకుంటూ ఉంటుంది. పురుషుడు స్త్రీ అంటే పడి ప్రాణం విడిచినంతటి గడబిడ చేసుకోవడమే స్త్రీకి పెట్టనికోట.

ధర్మభావమయితేనేమి, ముందు విషయం ఆలోచించుకోవడం లేక పోవడంవల్ల నయితేనేమి, తాను చిత్రంగానే బ్రతికాడు. చేసిన పనికి తాను విచారించడంలేదు కాని ఆ పని తనకూ చౌధురాణీకి సైంధవునిలా అడ్డంపడితే ఎట్లాగు?

చౌధురాణీ చదువుకున్నబాల. సంస్కృతి కలది. ధీశాలిని. అలాంటి అమ్మాయి తన జీవితం అంతా ఆలోచించుకొని అర్థం చేసుకోలేదా! అని అనుకున్నాడు డాక్టర్. మొత్తంమీద ఏది ఏమవుతుందో అని కొంచెం భయంపట్టుకుంది డాక్టర్‌కు.

ఆగష్టు ఇరవై రెండవ తారీఖున సాయంకాలము కోనంగి చౌధురాణీ, మధుసూదను, సరోజిని బీచికి వెళ్ళినప్పుడు, చౌధురాణీ కోనంగీ ఒకచోట కూర్చొని ఉన్నారు. తక్కిన వారిని దూరంగా పొండి అని, కోనంగి ఇదివరకే డాక్టర్‌గారి పెళ్ళిమాట విషయం చెప్ప కోరియుండడంచేత, వారు ఏవోమాటలు చెప్పుకుంటూ దూరంగా వెళ్ళిపోయినారు.

కోనంగి వెంటనే చౌధురాణీతో "చౌధురాణీ! డాక్టర్ రెడ్డి చాలామంచివాడు...." అని ప్రారంభించాడు.

"నేను కాదన్నానా బ్రదర్!"

"విను నా మాటలు పూర్తిగా –"

"నేను విననన్నానా?"

"సరే, డాక్టర్ చిన్నతనంలో కొన్నితప్పులు చేశాడు!"

"చేయమను. నాకెందుకు?"

"పురుషుడవడంచేతనూ, డాక్టరవడంచేతనూ–"

"ఇప్పుడు ఆ రెండూ కాడా ఏమిటి?"

"అతడు ఏదో రకంగా తృప్తి తీర్చుకొనేవాడు."

"ఏమిటయ్యా! ఏవేవో గొడవలు?"

"అతడు ప్రేమ అనే పదార్థం ఉంటుందని ఎప్పుడూ నమ్మేవాడుకాడు."

"పాపం! ఇప్పుడు బుద్ధి మారిందా ఏమిటి?"

"ఆ! అందుకు కారణం నువ్వే"

"నేనెప్పుడూ ఆయనతో ఏమీ మాట్లాడలేదే!"

"మాట్లాడకుండానే అంతపని చేశావు. మాట్లాడితే డాక్టరేమయ్యేవాడో!"

"కళ్ళు తేలేసేవాడు! యిప్పుడు మాట్లాడకుండానే సగం తేలవేస్తున్నాడు."

"ఆయన నిన్ను ప్రేమించాడు, తన జన్మ నీ పాదాల దగ్గర ఉందంటున్నాడు."

"ఆయన పైత్యము కొంత, నా శైత్యము కొంతలా ఉంది!"

"మధ్యను నా దౌత్యమూ!"

"ఇంతకూ నువ్వు చెప్పేది ఏమిటి?"

"డాక్టర్ రెడ్డిగారు నిన్ను వివాహమాడ–"

"కాదయ్యా! నువ్వు చెప్పేది చెప్పమన్నాను!"

"తప్పక నువ్వు వివాహం చేసుకోమనే నా అభిప్రాయం!"

ఇంతలో అనంతలక్ష్మి గబగబ వీరిద్దరికడకూ వచ్చింది.

అనంతలక్ష్మిని చూడగానే కోనంగి సంతోషంతో లేచి "అనంతం, సమయానికే వచ్చావు-" అన్నాడు.

అనంతలక్ష్మి మొగం ముడుచుకొని "మీతో పని ఉండి రాలేదు. సరోజిని వదినకోసం వచ్చాను చాలా ముఖ్యమయిన పని ఉంది. మీ కారు చూచి, అందరూ యిక్కడే ఉంటారు కదా అనుకున్నాను. మీ మాటలకు అడ్డం వచ్చానేమో క్షమించండి" అని గబగబ కోనంగి మాటలు వినిపించు కోకుండా, కోనంగి అడ్డం వెడితే పక్క నుంచి తప్పుకొని విసవిసా వెళ్ళి పోయింది.

కోనంగి తెల్లబోయాడు. ఈ మధ్య అనంతం నాల్గయిదుసారులు ఈ రకంగా సంచరించింది. కోనంగికి అర్థం కాలేదు. కాని చౌధురాణీకి వెంటనే అర్థంఅయి నవ్వు వచ్చింది. కోనంగి చౌధురాణీని చూచి "ఎందుకమ్మా చౌధు! నవ్వుతున్నావు?" అని అడిగాడు.

"బ్రదర్ నీకర్థంకాలేదా అనంతం హృదయం?"

"నాకు ఏదో అనుమానం తట్టుతూ ఉన్నది."

"ఏమిటి?"

"నువ్వు అనుకున్నది చెప్పు!"

"నువ్వు భార్యను మరచి నీ మనస్సు నా పైన లగ్నం చేశావని ఆమెకు అనుమానం కలిగిందని నా ఉద్దేశం!"

"అది నాకు ఇప్పుడే కలిగింది అనుమానం. ఇదివరదాకా, ఆమె రెండు మూడుసారులు ఈలా సంచరిస్తే అర్థంకాలేదు నాకు."

"మీ భార్యాభర్తలమధ్య నేను వచ్చి పడ్డానేమిటి?"

"నువ్వు వచ్చి పడడం ఏమిటి? నేను నా జన్మలో ప్రేమించిన బాలిక ఒక్కతే! ఆ ఒక్కతే నా భార్య అయింది!"

"అనంతం హృదయం నవనీతం!"

"నవనీతహృదయమే! కాని ఈ విచిత్రమార్గం తొక్కిందేమిటి? నా హృదయంలో నాకు తెలిసినంతవరకు అణుమాత్రం చలనంలేదే! అదివరకు ప్రేమలేకుండానే వివాహం చేసుకుందా మనుకున్నాను. కాని నా అదృష్టం కొద్దీ నాకు అనంతం దొరికింది చౌధూ! నా ఆనందం ఈనాటికీ వర్ణనాతీతమై ప్రవహిస్తూ ఉన్నది. ఇంతకూ దౌర్భాగ్యుణ్ణి నేను. నాకు సంతోషాదృష్టం ఎంతకాలం ఉంటుందీ?"

"అలా అనుకుంటా వేమిటి బ్రదర్?"

"అనుకున్నా, అనుకోకపోయినా అదృష్టం మారుతుందా చౌధూ?"

"అదృష్టం అంటే నీకు నమ్మకమేనా?"

"ఆ, సందేహం లేకుండా."

"అయితే నన్ను ఆలోచించుకోనీ! నా విషయం డాక్టరుగారితో ఏమీ చర్చించకు. నా అదృష్టాన్ని నేనే పరీక్ష చేసుకోవద్దూ! నేను రాజకీయంగా భావాలు లేనిదాన్ని. డాక్టరుగారు సామ్యవాది-"

"రాజకీయాలకూ, వివాహాలకూ సంబంధం ఉందా వెర్రిదానా? అలా ఉందనుకొని రియాసత్‌ను బాధాకూపంలోకి తోసింది మెహరున్నీసా!"

"అదేమిటి?"

"ఏమి ఉంది. ప్రేమంత వెర్రిభావం, దురదృష్టమూ ఇంకోటి లేదు. డాక్టరన్నట్లు ప్రేమించి పేలాలవడమే తప్ప ఇంకేముంది?"

"అలాంటి డాక్టరుకు ఈనాడు ప్రేమ ఏమిటి?"

## 3

అనంతలక్ష్మి తన విషయంలో నిష్కారణంగా అనుమానంపడి ఆమే బాధపడుతోంది, తన్నూ బాధపెడుతోంది అని కోనంగి కుంగిపోయినాడు.

కోనంగి భార్యను బ్రతిమాలదలచుకోలేదు. కోనంగి అనవసర సంభాషణ చేయదలచుకోలేదు. ఈ విషయం ఎవ్వరితోను చెప్పకు సిసీ!(చెల్లి) అని కోనంగి చౌధురాణీని కోరి వాగ్దత్తం చేయించుకొన్నాడు. చౌధురాణీ ఏమీ ఎరుగని దానివలెనే సంచరింపసాగింది.

అనంతలక్ష్మి తన గది వదలి రావడం మానివేసింది. భోజనం సరిగా చేయడంలేదు. కారు వేసుకొని పార్వతి ఇంటికి, అలమేలు ఇంటికి, మెహర్ దగ్గరకూ వెళ్ళుతూ ఉంటుంది.

ఇంత ఉపాహారం తింటే డోక్కుంటుంది. చిక్కిపోతూ ఉంది అనంతం ఏదో బెంగ, కూర్చున్నచోట నిలుచోలేదు. నిల్చున్నచోట కూచోలేదు. ఒక స్నేహితురాలి ఇంటనూ చాలాసేపు ఉండలేదు. వాళ్ళు ఏమి చిరుతిండి పెట్టినా సయించదంటుంది. కోనంగి భార్య చర్య యావత్తూ చూస్తూ ఉన్నాడు. ఆమె బాధకు తానూ బాధపడుతూ ఉన్నాడు. ఏమిటి ఈ అవస్థకు ఔషధం? ఆతడు నాల్గయిదుసారులు భార్యతో మాట్లాడాలని ప్రయత్నించాడు కాని అనంతలక్ష్మి వినిపించుకోకుండా వెళ్ళిపోయింది.

ఎక్కడన్నా ఇటువంటి స్థితి వస్తుందా? ఉత్తమప్రేమలో భార్యాభర్తలమధ్య ఒకరునొకరు అనుమానపడడం ఉంటుందా? ఇది ప్రేమకు పెద్ద కళంకం కాదా? అలాంటి అనుమానం వచ్చింది గనుక అనంతం ప్రేమ శుద్ధత్వానికి కొంచెం తగ్గిందనుకోవాలా?

ఏమి గొప్పవాడు తను? తినతిండీ. కట్టగుడ్డా లేకుండా తాను వచ్చి తన క్రింద ఆదరణచేసే భార్య వస్తే ఆమెకు వంకలు పెట్టడానికి ఎవరయ్యా తాను?

అనంతలక్ష్మితో సహవాసం లేకపోతే డాక్టర్ రెడ్డికీ తనకూ సంబంధమే ఉండకపోవును. అప్పుడు సినీమా ఏదీ పత్రికా సంపాదకత్వంఏదీ? ఇంక ఇప్పుడు తన కర్తవ్య మేమిటి?

అలాగే మాట్టాడకుండా అనంతంకోసం తన ధోరణి మార్చుకొని ఆమె మనస్సుకు ఆనందం కలగజేయాలి.

కోనంగి అనంతలక్ష్మి వెన్నంటి ఒక్కనిమిషమూ వదలకుండా ఏవో పిచ్చిమాటలు అంటూ నవ్వించటం సాగించాడు. అనంతాన్ని నవ్వించడమే తన పవిత్రధర్మం అన్నట్టు సంచరించడం ప్రారంభించాడు.

అనంతానికి తాను తప్పు చేసినట్లు ఆనాడే అర్థమయింది. తన హృదయనాథుడు నిర్మల చరిత్రుడు. ఈ రెండేండ్లలో వేలుచూపి ఆయన ఎక్కడ తప్పు చేశారని తాను చెప్పగలదు? చిన్నతనాన్నుంచీ ఎరిగి ఉన్నవారు, చౌధురాణీ పదినిమిషాలు మాటామంతీ మాటలాడుకోవడము తప్పా? తాను ఇష్టంవచ్చిన వారితో మాట్లాడితే, అవన్నీ ఆయన తప్పుపట్టుకున్నారా?

ఎంత చదువు చదివినా స్త్రీ స్త్రీయే! భర్తను ఊదరకొట్టి తాను ఏమిచేయాలని తన ఉద్దేశం? భర్తకూ చౌధురాణీకి ఏమి పాపసంబంధం ఉండగలదు? ఏవో లేనిపోని అనుమానాలు కల్పించుకొని తాను బాధ పడుతోంది. కాని, ఆయన నిర్మల హృదయంతోనే తిరుగుతున్నారు. ఆయన్ను చూస్తే జాలివేస్తుంది.

ఒక వారంరోజులు నెమ్మదిగా జరిగాయి. కోనంగి ప్రయత్నంవల్ల ఏమీ ఎరుగని వానివలె నటిస్తూ సంచరించడంవల్ల అనంతలక్ష్మి భర్తతో మామూలుగా మాట్లాడేస్థితికి వచ్చింది.

ఇంతట్లో ఒకరోజున పోలీసు డిప్యూటీ కమీషనరొకాయన, మన చెట్టిగారూ, ఇంకా కొందరు పెద్దలూ, ఇరవైమంది పోలీసువారూ కార్ల నుండీ, పోలీస్‌వాన్ నుండీ దిగి నవజ్యోతి కార్యాలయం అంతా సోదా చూచారు. ఏ కాగితాలూ దొరకలేదు. ఊళ్ళలో జరిగే గడబిడలను గురించి వచ్చిన ఉత్తరాలూ, పత్రికా పుస్తకాలయంలోని సామ్యవాద. జాతీయవాదాది పుస్తకాలూ పట్టుకువెళ్ళారు.

చెట్టిగారి కసి తీరలేదు. ఎన్ని విధాల చిక్కులు పెట్టాలో అన్నీ పెట్టడానికి సిద్ధమే.

పత్రికా కార్యాలయంమీద దాడి జరిగిన కొద్దిరోజులకు ప్రభుత్వంవారు నవజ్యోతి పత్రికను తమకు ఆరువేలు ధరావతు కట్టాలని కోరినారు. అందుపైన కోనంగి హైకోర్టులో ప్రభుత్వంవారి ఆజ్ఞకు పునాదియైన ఆర్డినెన్స్ చట్టవిరుద్ధమనీ, ఒకవేళ ఆర్డినెన్సు చట్టవిరుద్ధం కాకపోయినా, ధరావతు కోర తగిన కారణం లేనందున ధరావతు వసూలుచేయకుండా ప్రభుత్వంపై ఆంక్ష పొందాడు.

ఈ ధరావతు విషయంలోనూ చెట్టిగారి మహాత్మ్యం ఉందని డాక్టరు రెడ్డిగారికి రహస్య వర్తమానం తెలిసింది.

**డాక్టర్:** ఈ మహానుభావుడికి ఎంతకాలం నీమీద ఈ కక్ష ఉంటుందంటావు?

**కోనంగి:** వాడికి బుద్ధి మళ్ళేవరకు.

**డాక్టర్:** ఎల్లాగ బుద్ధి మళ్ళడం?

**కోనంగి:** వాడు చేసే దుర్మార్గాలు కలశం నిండిపోవాలి, అప్పుడు వాణ్ని అవే అణుస్తాయి.

**డాక్టర్:** మళ్ళీ వట్టి వేదాంతాలు మాట్లాడకు!

**కోనంగి:** వట్టి వేందాంతాలు కావయ్యా బాబూ! సంపూర్ణమయిన శాస్త్రవాదనతో మాట్లాడుతున్నాను. పెండ్యులం నీతి ఎరగవూ?

**డాక్టర్:** నాకు మండిపోతుంది ఒళ్ళు, వీణ్ని సున్నంలోకి ఎముకయినా మిగలకుండా తన్నించాలి.

**కోనంగి:** ఆ పని మాత్రం చేయకు నాయనా!

**డాక్టర్:** నేనే ఎప్పుడో స్వయంగా వెళ్ళి–

**కోనంగి:** నీ సంగతీ, నా సంగతీ అల్లా ఉంచు. ఈ మధ్య ఆ అరవ పత్రికలో మన చెట్టియారును గురించి వ్రాసే వ్రాతలన్నీ చూస్తూ ఉన్నావా?

**డాక్టర్:** వాడెంత అసాధ్యుడోయి ఆ సంపాదకుడు! ఆ వ్రాతలలో ఉన్న గమ్మత్తు ఏమిటంటే అవి అన్నీ నిజమే! అందుచేత చెట్టిగారికి మరీ మతి పోతోందట!

**కోనంగి:** ఆ పత్రిక అబ్బాయికి చెట్టియారు సంగతులన్నీ ఎట్లా తెలుస్తాయ్?

**డాక్టర్:** అతనికి చాలామంది గూఢచారులున్నారయ్యా. ఒక్కొక్క వార్తకు ఇంతని ఇస్తాడట. అది మరీ మంచివార్త అయితే ఏభైరూపాయలు గిట్టాయన్న మాటేనట.

**కోనంగి:** ఎక్కడిదీ డబ్బు బాబూ?
**డాక్టర్:** ఆ పత్రిక అమ్మకం ముప్ఫైవేలుందోయి ఇప్పుడూ!

## ④

**మొ**త్తంమీద కోనంగి హైకోర్టులో దిట్టంగా వాదింపించాడు. అయినా లాభం లేకపోయింది. నవజ్యోతి పత్రిక ఆరువేల రూపాయలు సెప్టెంబరు మొదటి వారంలో ధరావతు కట్టితీరవలసి వచ్చింది.

ధరావతు కట్టినాముకదా అని కోనంగి ఘాటుగా వ్రాయటం మానలేదు. కాని 'లా' ప్రకారం పత్రికకు ఏమీ నష్టం లేకుండానే వ్రాస్తున్నాడు.

దేశంలో కొన్నిచోట్ల ఉధృతం తగ్గింది. కొన్నిచోట్ల ఏమీ తగ్గలేదు.

కాని కోనంగి మట్టుకు స్వరాజ్యము వచ్చినట్లుగానే పని చేయడం సాగించాడు. అతని ఉత్సాహమే మధుసూదనునీ, సరోజినినీ హుషారులో ముంచింది. ఆరు అయిదు కాలములు ప్రభుత్వంవారు ఒప్పుకున్న వార్తలనే పెద్ద అక్షరాలలో వేస్తూ ఉండడం మొదలయిన గడబిడచేస్తూ ఉండేవాడు. డాక్టర్ రెడ్డికి ఈలా చేయడం ఎక్కువ ఇష్టంలేదు.

'జాగ్రత్త కోనంగీ!' అని కోనంగిని కళ్ళెం లాగుతూ ఉండేవాడు. సెప్టెంబరు రెండవవారం ప్రారంభంలో బుధవారంనాడు కోనంగి సంపాదకీయం వ్రాసుకుంటూ ఉన్నప్పుడు చౌధురాణీ కోనంగి గదిలోనికి చక్కావచ్చింది. సరోజినీ, అనంతలక్ష్మి ఏదో మాట్లాడుకుంటున్నారు. మధుసూదనుడు మొదలయినవారు రాయిటరు టెలిప్రింటరులోంచి కాగితాలు లాగి పారవేస్తూ యుద్ధవార్తలు, దేశవార్తలు తర్జుమాచేయడం, చింపడం, అచ్చుకు పంపడంలో నిమగ్నులై ఉన్నారు.

చౌధురాణీ కోనంగి కడకు వచ్చి 'ఏమయ్యా బ్రదర్! ఇప్పటికి నిశ్చయానికి వచ్చాను."

"ఏమి నిశ్చయం?" ఆదుర్దాగా కోనంగి అడిగాడు.

"నేను రెడ్డిగారిని ప్రేమిస్తున్నానని!"

"అయితే నా హృదయపూర్వక అభినందనలు."

కోనంగి లేచి చౌధురాణీ చేయి ఆడిస్తుండగా అనంతలక్ష్మి "గురువుగారూ!"అంటూ అక్కడకు వచ్చింది.

చౌధురాణీ, కోనంగీ కరగ్రణం చేసి ఉండడం చూసింది. మాట్లాడకుండా వెలవెల పోయే మోముతో నిలుచుండి, మరుక్షణంలో ఒక కుర్చీలో కూలబడిపోయింది.

చౌధురాణీ, అనంతలక్ష్మి దగ్గరకు వెళితే "నువ్వు వద్దు. నాకేమీ బాగాలేదు, నువ్వు వెళ్ళి సరోజిని వదినను పిలు" అని నీరసంగా అంది.

వెంటనే చౌధురాణీ వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోవడం తరువాయి, అనంతలక్ష్మి కాళికా శక్తిలా లేచింది. భర్తను చూచి: "ఏమండీ, మీకు నామీద ప్రేమ నశిస్తే నశించింది గాక! మీ ప్రణయవిలాసాలు ఇంత వెల్లడిగా ప్రదర్శించకపోతే. కాస్త రహస్యంగా సంచరించలేక పోయారు? నామీద మీ కెప్పుడూ ప్రేమ లేదని ఈ మధ్యనే తెలుసుకున్నాను. నా డబ్బుకోసం ఆశించారు. నన్ను చేసుకున్నారు. అయినా నా ప్రేమ మాత్రం మీకు సంపూర్ణాంకితం చేస్తిని. నన్ను మీకు దేహమూ, మనస్సూ, ఆత్మా అర్పించుకుంటిని. నామీద ప్రేమలేకపోయినా, దయాంతఃకరణలు కూడా లేవా మీకు... (ఆమె పకపక

నవ్వి) ఏదో అంటున్నాను, నాకు తల తిరుగుతోంది... నాకు (ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ తలతిరిగి కూలిపోబోయింది) కోనంగి ఒక్క గంతువేసి అనంతాన్ని పట్టుకొని అనంతం! అనంతం! అని గుండెలదిరిపోయే కేకలు వేశాడు. ఇంతలో సరోజిని పరుగెత్తుకొని అక్కడకు వచ్చి 'ఏమిటి అన్నయ్యా!' అని అంటూ కోనంగి అనంతలక్ష్మిని చిన్నబిడ్డలా ఎత్తుకొని హృదయానికి అదుముకొని ఉండడం, అనంతలక్ష్మి నిశ్చేష్టయై ఉండి, వెనక్కు వేలవేసి ఉండడం చూచింది.

"అయ్యయ్యో! అన్నయ్యా!" అని మధుసూదనుని కేక వేసింది. కోనంగి అలా అనంతలక్ష్మిని ఎత్తుకొని మతిలేని వానిలా ముందు హాలులోనికి తీసుకువచ్చాడు. మధుసూదనుడు పరుగెత్తుకొని కోనంగి దగ్గరకు వచ్చాడు. కోనంగి మోము పిచ్చివాని మోములా అయిపోంది. అది చూచి, 'ఏమిటి కోనంగీ!" అని అరిచాడు.

సరోజిని ఆ ప్రక్కనే ఉన్న కూజాలో నీళ్ళు అనంతలక్ష్మి మొగంపై చల్లింది.

అనంతలక్ష్మికి అంతకుముందే మెలకువవచ్చింది. అయినా భర్త తన్ను ఎత్తుకొని ఉండడం గమనించి ఆ నీరసత్వంలోనే ఏదో హాయి అనుభవిస్తూ కదలకుండా కళ్ళు మూసుకునే ఉంది.

చల్లని నీళ్ళు తగలడంతోనే ఆమె పూర్తిగా కళ్ళు తెరచి 'అమ్మా' అని నిట్టూర్పు విడిచింది. భర్త తన్ను విడవలేదు. అతడు ఈ లోకంలో లేడు. ఆమెను ఎత్తుకొని విగ్రహంలా నిలుచుండే ఉన్నాడు. భర్త మోము చూచి, అనంతలక్ష్మి గజగజలాడింది. "నాకు బాగా ఉంది, వదలండి గురువుగారూ!" అని సగం ఏడ్పుగా అంది. ఆ మాట విననట్టుగా కోనంగి భార్యను ఇంకా గట్టిగా హృదయానికి అదుముకున్నాడు.

మధుసూదనం డాక్టర్ రెడ్డికి వెంటనే ఫోను చేసి ఉండెను. మధుసూదనుడు ఫోను కడ నుండి వచ్చి, కోనంగిని పొదివి పట్టుకుని "ఒరే! కోనంగీ!" అని గాఢ విషాదపూరిత కంఠంతో అరిచాడు.

కోనంగి ఇంతలో సగం మెలకువ వచ్చి "ఏమిటిది! ఏమిటిది! అంటూ భార్యను అక్కడే ఉన్న సోఫాపై పడుకోపెట్టాడు.

ఇంతలో డాక్టర్ రెడ్డి గబుక్కున వచ్చి, అనంతలక్ష్మిని పరీక్ష చేశాడు.

"అనంతలక్ష్మి! ఎల్లా ఉంది?" అని అడిగాడు.

"నాకు బాగానే ఉంది. వారిని చూడండి, అల్లా ఉన్నారు? వారిస్థితి చూడండి! నాకు భయం వేస్తోందండీ!" అని కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ అడిగింది.

డాక్టరు కోనంగి వైపు చూచాడు. కోనంగి చూపులు వెర్రిగానే ఉన్నాయి.

వెంటనే డాక్టర్ "సరోజినీదేవి అనంతలక్ష్మిని ఇంటికి తీసుకుపో కారుమీద. నేను కోనంగిని నా కారుమీద తీసుకువస్తాను" అన్నాడు.

"కాదండీ, నేనూ వారితోనే వస్తాను!" అని అంటూ లేచి భర్త దగ్గరకు రాబోయింది. సరోజినీ చౌధురాణీ వద్దని వారించారు.

ఈ లోగా డాక్టర్ కోనంగిని నెమ్మదిగా కుర్చీలో కూర్చుండబెట్టి నుదురుపై బలంగా చన్నీళ్ళతో కొట్టినాడు. కోనంగి గబుక్కున కళ్ళుమూసుకొని తలఊపి "ఏమిటి డాక్టర్! ఏమిటీ నీళ్ళు?" అని ప్రశ్నిస్తూ లేచి నుంచున్నాడు.

# 5

జైళ్ళు నిండిపోయారు! జైళ్ళు నిండిపోయారు కాం్రగెసు భోక్తలు, యుద్ధభోక్తలు.

గాంధీజీని గురించీ, క్రిప్సు ప్రతిపాదనలను గూర్చీ లూయీ ఫిషర్ అమెరికా నుంచి ఘాటుగా వ్రాయడం ప్రారంభించాడు.

ద్వేషం ప్రపంచం నిండిపోయింది. విషం మంచులా ఆవరించి పోయింది. కోనంగి భార్యకు బాగా నెమ్మదిగా ఉందని తెలుసుకున్నాడు. కాని ఎందుకోసం డాక్టర్ రెడ్డి అనంతలక్ష్మిని ఆస్పత్రికి ఆరోగ్య పరీక్షార్థమై పంపించాలన్నాడు? ఆ దినం భార్య తన్ను మాటలతో చీల్చివేసినప్పటినుంచీ కోనంగికి నిస్పృహ ఎక్కువైంది.

బిచ్చగానికి రాజ్యాధిపత్యమా! ఒక దివ్యబాలిక జీవిత చరిత్రలో భాగం పంచుకోవడానికి తనకేమి అధికారం ఉంది? స్వచ్ఛాంబుపూర్ణమై ప్రవహించే పవిత్రాపగలో దుర్వాసనాపూరిత మలినసీరాలు సంగమించడం ఎంత అధర్మ సంఘటనో!

తన మూలాన ఆ స్వచ్ఛజీవిక, అనంతం ఎన్నో బాధలుపడుతోంది. ఎదురుగుండా తాను కనబడుతున్నకొలదీ, ఆ బాలికకు బాధేగాని విశ్రాంతి ఉండదు. తనలో ఏదోలోటు లేకపోతే అంత నిర్మల హృదయంగల అనంతం తన్ను ఎందుకు అనుమానం పడుతుంది? అనంతం జీవితంలో తన బ్రతుకు సంగమించడానికి కారకుడు తానే! ఆమె జాతకంలో ఓ దురదృష్టముహూర్తం. తాను వాళ్ళ వీధి ద్వారం దగ్గర నుంచోడం తటస్థించింది.

జైలుకు వెళ్ళి తాను అనంతం జీవితంలోంచి తరలిపోతే, ఆమెకు దుఃఖం ఉపశమనమై కొంతకాలానికి ఆమె సంపూర్ణ శాంతి సంపాదించు కుంటుంది. ఆ తర్వాత ఆమెకు కావాలంటే తాను ఆమె తనకు విడాకులు ఇవ్వడానికి అనుమతించుతాడుగాక! సందులలో తిరగవలసిన తనకు సందులే దిక్కు అవుతాయిగాక!

మరునాడు కోనంగి ఖద్దరుపంచె, ఖద్దరుచొక్క తొడుక్కొని, ఇద్దరు టోపీ ధరించి, గాంధీమహాత్మునిమీద, "క్విట్ ఇండియా" నినాదపూరితమై వచ్చిన ఒక గీతాన్ని పాడుకుంటూ, త్యాగరాజనగరంలో ఏకసత్యాగ్రహయుతమయిన ఊరేగింపు జరిపినాడు.

*"మహాత్మగాంధీ! క్విట్టిండియాను*
*మహావాక్యనే*
*మంత్రం చేశావూ*
*బ్రిటీషుగుండెలూ పీచుపీచుమన*
*భేరీనాదం చేశావూ*
*ఇన్నేళ్ళూ నీమాటే మాకూ*
*ఎంతో ముందుకు నడిపేశక్తయి*
*స్వరాజ్యయుగముకు సాగించిందీ*
*అడ్డంలేనీ వేగంతోటీ*
*మహాత్మ..........*
*బ్రిటిష్ ప్రభుత్వపు మాయఎత్తులకు*
*విరుగుడు శక్తయి విజృంభించీ*
*హిందూముసల్మాన్*
*పార్శీశిక్కుల*

*సంయోగానికి*
*సాధనమైనావూ*
*మహాత్మాగాంధీ..........*
*అథోగతిలో పడి అల్లల్లాడే*
*హరిజనులందరి రక్షించావూ*
*వారికి హక్కు ప్రథమస్థానము*
*వారికె తిరిగి ఇప్పించావూ*
*మహాత్మాగాంధీ!*

ఆ పాట పాడుకుంటూ కాంగ్రెసుజండా గాలిలో ఎగురుతూ ఉండగా, "క్విట్ ఇండియా, కాంగ్రెస్ జిందాబాద్! మహాత్మాగాంధీజీకి జై!" అని నినాదంచేసి,

*"జయ! జయ గాంధీ!*
*జయ జయ లోకగురూ!*
*సత్యము ధర్మము చంపిన లోకము*
*నిత్య పదార్థము ఎరుగని లోకము*
*అమృతనినాదము నీ జయనాదము*
*ఆలకించుతూ ఆనందమాయె!*
*జయ జయ!"*

అని మరల పాడినాడు.

అనేకులు ప్రజలు దూరంగా అతని అనుసరించసాగారు. ఇంతలో ఒక పోలీసులారీ వచ్చి, కోనంగి కడ అగింది. పోలీసువాలాలు బండిలో నుండి దిగి కోనంగిని అరెస్టుచేసి బండిలో ఎక్కించి తీసుకుపోయారు.

కోనంగి ఎవ్వరితోనూ చెప్పలేదు. అతడు భోజనానికి రాలేదు.

ఉదయమే తిరువలిక్కేళిగోషా వైద్యాలయానికి వెళ్ళిన అనంతలక్ష్మీ, జయలక్ష్మీ, వారి పనిమనిషీ భోజనంవేళకు కారుమీద ఇంటికివచ్చారు. వారి మోములు సంతోషంతో కలకలలాడిపోతున్నాయి. అనంతలక్ష్మి మోము లజ్జారుణ కాంతివంతమై ఆనందపూర్ణమై ఉన్నది.

"నీ మొగుడితో నేనే చెప్తాను అమ్మిణీ!" అన్నది.

అనంతలక్ష్మి ఎప్పుడు భర్త ఆశుభవార్త తెలిసి తన కడకు పరుగిడి వచ్చి తన్ను కౌగలించుకుంటాడా అని ఉవ్విళ్ళూరుతూ, తాను హాలులో కూర్చొని ఉంది.

వీరిని దింపగానే జయలక్ష్మి తన కారును మధుసూదనుని ఇంటికి పంపింది. ఆ కారు డ్రైవరు వారినందరినీ ఒక శుభ వర్తమానం వినడానికి త్వరగా రమ్మనమని వార్త తీసుకొని వెళ్ళినాడు.

వారందరూ భోజనాలు ముగించి రోజూ వారి కోసం వచ్చే కోనంగి కారుకోసం ప్రతీక్షిస్తున్నారు. కారు రావలసినకాలం అరగంట దాటిపోయింది. కోనంగిగారి కారు బదులు అనంతలక్ష్మి కారు వచ్చింది.

ఏమిటా శుభ వర్తమానమని అందరూ వెంటనే వచ్చారు. కారు మ్రోత వినగానే జయలక్ష్మి వరండాలోకి వచ్చివారి నెదుర్కొని "రండి, మీ అందరికీ పళ్ళు పంచి పెడుతున్నాను" అన్నది.

**చౌధురాణి:** పిన్నీ! శుభ వర్తమానం ఏమిటి?
**జయలక్ష్మి:** లోపలికి రా చేప్తాను.

ఇంతలో డాక్టరు కారు వేసుకొని స్వయంగా నడుపుకుంటూ చెమటలు కారిపోతూ ఉండగా, ఏదో కంగారుపడే మోముతో, ఒక నర్సును వెంటబెట్టుకొని వచ్చి దిగాడు. నర్సూ చపరాసీ పెట్టెలు పట్టుకు దిగినారు.

దిగీదిగడంతోటే "అనంతం యేదీ?" అని జయలక్ష్మిని ప్రశ్నించాడు.

"లోపల ఉంది, నా కబురు మీకూ అందిందీ!" అని జయలక్ష్మి అన్నది.

**డాక్టర్:** ఏం కబురు?
**జయ:** మిమ్మల్ని వెంటనే ఒక శుభ వర్తమానం వినడానికి పిలుపు పంపినానుకదా!
**డాక్టర్:** నాకు ఆఫీసు నుండి ఒక ఉత్తరం వస్తే ఆఫీసుకు వెళ్ళి, అక్కడ వార్త తెలిసి ఇంటికి వెళ్ళి ఒక కేసు ఉంటే మా నర్సును, పనివాణ్ణి తీసుకొని ఇక్కడ కోనంగి ఉన్నాడేమోనని కనుక్కోడానికి వచ్చా! రండయ్యా అందరం లోపలకి వెడదాం.

జయలక్ష్మి నర్సు చేయి జాడిస్తూ "రండి లోపలికి" అని పిలిచింది అందరూ లోపలికి వెళ్ళి కూర్చున్నారు.

అప్పుడు జయలక్ష్మి ముసిముసి నవ్వులు నవ్వుతూ అనంతం ముస్తాబై రావడం చూచి "అందరికీ శుభ వర్తమానం ఏమిటంటే, నాకు ఒకమనమడు పుట్టబోతున్నాడు" అని చెప్పింది.

"ఏమిటీ!" అని అందరూ "ధన్యవాదాలు" అంటూ లేచారు. చౌధురాణీ, సరోజినీ, కమలనయనా అనంతం కడకు పరుగెత్తినారు. డాక్టర్ "నేననుకున్నది నిజమే ఐందా! ఎంత సంతోషం!" అంటూ కరస్పర్శ చేయడానికి లేచి అనంతం దగ్గరకు వెళ్ళినాడు.

## ⑥

**ఇం**తమంది తన్ను అభినందించుచున్నా అనంతలక్ష్మి మనస్సు ఇక్కడ పూర్తిగాలేదు. భర్త ఎక్కడ? తన గురువు ఏరి? ఈ వార్త చెవిని సోకగానే అయన ఆనందమందును. ఆయన తేజస్సు తన గర్భమందున్నది. ఆయన ఆత్మ వేరు రూపమున తన్నావేశించినది? ఆయన తన కర్పించిన ప్రణయజ్యోత్స్నా విలాసములు ఎంత మధుర మయినవి. వారు తన్నెంత ప్రేమించుచున్నారు!

తాను భర్తను కోపించిన పిచ్చితనం ఎంత జుగుప్స కలిగించినది. తన్నే ఆమె కోపగించుకున్నది. ఆ లేడీ డాక్టరునకు ఇవియన్నియు తాను నివేదించినప్పు డామె "వెర్రితల్లీ! ఇదంతా నీ మనోవైకల్యమే. ఆ మనో వైకల్యమంతా నువ్వు గర్భం ధరించడంవల్లనే సంభవించినది. ప్రథమ గర్భధారణ ఇట్టి విచిత్రాల నెన్నైనా చేస్తుంది. వెళ్ళి ఈ శుభ వర్తమానం నీ భర్తకు చెప్పి ఆయన హృదయం కైవసం చేసుకో!" అని సలహాయిచ్చింది.

ఎన్ని చిలిపిచేష్టలు చేస్తూ తన జీవితేశ్వరుడు తన్ను ఆనంద సముద్రంలో ఓలలాడించేవారు! ఎక్కడ ఉన్నారు?

భర్తను తాను వెదకదలచుకోలేదు అనంతం. ఈ శుభ వర్తమానం ఇతరులవల్ల విని వారు తన కడకు పరుగిడి రావాలి. గంట అయింది. రెండు గంటలు కావచ్చింది. ఎంతకూ కోనంగి కనబడదు!

అనంతలక్ష్మి స్నేహితురాండ్రందరూ వచ్చినారు.

“ఏమయినారు? ఎక్కడికి వెళ్ళినారు?

డాక్టర్ అందరితో మాటలు చెబుతూ “అనంతలక్ష్మీదేవీ, జయలక్ష్మిగారూ, మధుసూదనరావూ, సరోజినీదేవిగారూ, కమలనయనా, అమ్మా పార్వతీ అంబుజంగారూ, మీరంతా వినండా. “శ్రీ చౌధురాణీదేవి నన్ను... నన్ను... వివాహమాడ... అంగీకరించినారని మీకు విన్నవించడానికి ఎంతో ఆనందపడుతున్నాను” అన్నాడు.

ఈ మాటలు అంటాడని తనవైపు డాక్టరు పరపిన చూపులను చూచి అప్పుడే గ్రహించుకుంది చౌధురాణీ. కాని ‘కోనంగిరావు అప్పుడే డాక్టరుకు ఎప్పుడు చెప్పినాడు? అని అనుకుంటూ చిరునవ్వుతో కూర్చుంది. ఆమె కపోలాలు కెంపులెక్కినాయి.

అందరు బాలికలు చౌధురాణీని అభినందించారు. జయలక్ష్మి పకపక నవ్వుతూ ఆనందంతో చౌధురాణీ దగ్గరకు వచ్చి గట్టిగా కౌగలించుకుంది. అనంతలక్ష్మి తెల్లబోయింది.

ఆమె అనరాని మాటలు ఆడిపోసుకొని భర్త హృదయమును నొప్పించిన మరుక్షణంలోనే “ఎంత తెలివితక్కువ దాన్ని” అని విచారించింది. భర్త తెల్లబోయి పిచ్చివానిలా అయిపోయినస్థితి చూసింది. ఆమెకు గాఢమైన పశ్చాత్తాపం కలిగి, ఎంతటి మూర్ఖురాలను అని లోన దుఃఖించింది. ఎవ్వరూ తన్ను భర్త దగ్గరకు పోనీయలేదు ఆ క్షణంలో.

తాను ఎవ్వరో దుష్టురాలిలా, చెట్టిగారులా భర్తను అవమానించింది. రాత్రంతా నిద్రలేకుండా భర్త బాధపడడం చూచింది. తాను గర్భము ధరించితినేమో అన్న అనుమానం ఆమెకు అప్పుడే నెలరోజుల క్రిందటనే కలిగింది. అప్పటికి రెండుసారులు నెల తప్పినది. తనకు కలిగిన వికారము, బద్ధకము మొదలయినవన్నీ ఆ అనుమానాన్ని దృఢపరిచినాయి. తన అనుమానం తల్లితో చెప్పింది. “అవునమ్మా! నిజం కావచ్చు. అయితే మన్నారుగుడి స్వామికి భోగం చేయించనా! వెంకటేశ్వరులకు భోగం చేయించి ముత్యాలహారం అర్పించుకోనా!” అన్నది. ఆమే కొమరితను హృదయాని కదుముకొని ఆ రాత్రి దిగదుడుపు తీసి వీధి మధ్య పడవేయించింది.

జయలక్ష్మి కొమరిత స్థితి కనిపెట్టి అనుమానించింది. కొమరితకు తలంటి నిశ్చయం చేసుకుంది. కాని కొమరితతో మాత్రం నిజం చెప్పింది కాదు. శుక్రవారంనాడు పార్థసారథి కోవెలలో భోగం చేయించింది.

చదువుకున్న బాలిక గనుక ఏమనుకుంటుందో అని తన అభిప్రాయం కూతునకు చెప్పక దాచి, కూతునుంచే మాటలు వచ్చునని కని పెట్టుతూ ఉన్నది. అందుకనే డాక్టర్ “అనంతలక్ష్మిని పరీక్ష చేయించండి!” అని అన్నప్పుడే ఆయన ఈ రహస్యము గ్రహించినారని అర్థం చేసుకుంది.

అనంతలక్ష్మి ఆ రాత్రే భర్త దగ్గరకు పోయి క్షమాపణ వేడుకుందామనుకుంది. అతని కౌగిలిలో వాలిపోదామనుకుంది. అతని ముద్దులతో పరవశమయిపోదామని ఉవిళ్ళూరింది. కాని కోనంగి తన మాటలను అంతతీవ్రంగా విమర్శించుకుంటాడని ఆమె ఎల్లా గ్రహించుకోగలదు? ఎన్ని సారులో తాను పండుకొన్న మంచంమీద నుండి లేచి శయనమందిరానికి పయనమయింది.

కూతురు ఆమె భర్త దగ్గర కారాత్రి వెళ్ళకపోవడానికి కారణం ఆమె గర్భవతియై కొంచెం అలసత్వం పొంది ఉండడమే కారణమని జయలక్ష్మి అనుకొన్నది.

తెల్లవారగట్ల కోనంగి చప్పుడు కాని అడుగులిడుతూ అనంతలక్ష్మి దగ్గరకు రావడం జయలక్ష్మీ చూచి గాఢనిద్ర నభినయించింది. కోనంగి వంగి అనంతలక్ష్మి మూర్ధముపై మూడు ముద్దులిడి తిరిగి వెళ్ళిపోయినాడు.

ఏమిటిది? ఎంత మెత్తని హృదయం అల్లునిది. ఒక్కనిమిషమూ భార్యను వదలలేదు. ఒక్క పరుసపుమాట ఒక్కరిని అనడు. అందరు సేవకులు అతన్ని ప్రేమిస్తారు అనుకొన్నది.

ఈ రహస్యంకోసమా తన భర్త చౌధురాణీతో రహస్యాలూ గుసగుసలూనూ! ఈ విషయం తనతో చెప్పకూడదా? తానే చౌధురాణీతో మాట్లాడి ఉండునుగదా!

ఒకవేళ చౌధురాణీ భర్తను కోరి డాక్టర్‌గారితో మాట్లాడమన్నదేమో? తన్ను కోరకూడదా? తానే డాక్టర్‌గారితో మాట్లాడి ఉండునే! అది తన విషయంలో తప్పుకాదా? భర్త ఒక పరస్త్రీతో మాట్లాడడం తప్పని భార్య బాధపడితే, భార్య ఒక పరపురుషునితో మాట్లాడడం మంచిదని తాను ఎలా అనుకోగలదు?

తనలో ఏదో నీరసం బయలుదేరింది. అందుకనే ఉత్తమ పురుషుడయిన భర్తనే తాను అనుమానించగలిగింది. కోనంగేశ్వరరావు భర్తకాకపోతే ప్రాణంపోవడం తథ్యం అనుకున్న తాను, భర్త పరమసుందరమూర్తి అనుకున్న తాను, ఈనాడు వట్టి తెలివిహీనయై భర్తను పదిమందిలో అవమానించ సిద్ధమయింది. ఆయన మనస్సు తన మాటలకు ఎంత నొచ్చుకుందో!

అనంతలక్ష్మి వెంటనే లేచి చౌధురాణిని లోనికి తీసుకొనిపోయి, "అక్కా! నిన్ను అనుమానించి ఎంతో ద్రోహం చేశానమ్మా!" అన్నది.

"ఓసి వెర్రిఅక్కా! నువ్వు నన్ను అనుమానించలేదు. గర్భధారణము నరాల్ని తల్లక్రిందులు చేస్తుంది. సున్నితమైన నరాలస్థితిలో ఉన్న నీకు అన్నీ కంగారుగా కనబడతాయి. నీ ప్రేమ అంత ఉత్కృష్టమయినది ఈ జగత్తులోనే లేదని నేనూ, మనవదిన సరోజినీ అనుకున్నాము కూడా!"

"నువ్వు మీ బావగారితో తప్పంతా నాదేననీ, నేను వారిని నిష్కారణంగా అవమానించాననీ, నేను చేసిన తప్పిదానికి క్షమింపమని వారిని పాదాలుబట్టి వేడుకొంటున్నాననీ నా తరపున చెప్పు!"

"ఏమిటక్కా ఆ మాటలు? నీ భర్తను లోకాతీతంగా ప్రేమించే నువ్వు, నీకు ఏమీ సంబంధం లేకుండా, నన్ను పంపుతావా క్షమాపణకు?"

"ఏం చేయమన్నావు?"

"నువ్వే వెళ్ళి ఆయనతో నీ హృదయం విప్పి చెప్పితే చాలు!"

"ఏదీ! పొద్దున్నుంచీ ఎక్కడా కనబడలేదు. నౌకర్లు వారు ప్రొద్దున్నే నడిచి చక్కాపోయినారని చెప్పుతున్నారు."

"ఇంకో విషయం. డాక్టరుగారికి నా విషయమై శుభవార్త పంపించింది మీ ఆయనే!"

"ఏమిటి! వారేనా?"

"ఇంతకూ కోనంగిరావుగారు ఎక్కడికి వెళ్ళారు?"

అనంతలక్ష్మి, చౌధురాణీ ఇద్దరూ అనంతలక్ష్మి చదువుల గదిలో నుండి ఇవతలకు వచ్చారు. అక్కడ హాలులో కూర్చున్న అందరూ ఏదో ఆలోచిస్తున్నారు. వారందరూ హాలులో తీవ్రాలోచనాధీనులై ఉన్నారు.

"ఏమిటర్రా మీరంతా అంతతీవ్రంగా ఆలోచిస్తున్నారు?" అంది చౌధురాణి.

"మధుసూదనుడు ఆగస్టు ఎనిమిది పవిత్రమయిన దినం అంటాడు. నేను కాదంటాను" అన్నాడు డాక్టర్ రెడ్డి.

"మీరు కాదంటే కాకపోతుందా అన్నయ్యా, అవునంటే అవుతుందా!" అన్నది చౌధురాణి.

**అనంతలక్ష్మి:** ఆగస్టు ఎనిమిది మహోత్తమ దినమండీ డాక్టరుగారూ!

**డాక్టర్:** మీ ఆయన అభిప్రాయమే నీ దీనా అనంతలక్ష్మీ?

**సరోజిని:** భార్యాభర్తల భావాలు ఒకే నదిలా ప్రవహించాలి.

**చౌధు:** ఆ సూత్రానికి అర్థంలేదు. భార్యాభర్తలైనంత మాత్రాన అభిప్రాయభేదాలు రాకూడదా?

**అనంత:** చూడండీ మధు అన్నా! మీ చెల్లెలు తాను తన భర్త అభిప్రాయంతో ఏకీభవించడంలేదని ఏమి ప్రతిపాదిస్తున్నదో?

**కమలనయన:** పెళ్ళి కాకుండా భార్యాభర్తలెట్లా?

**అనంత:** కాబోయే దంపతులు, అప్పుడు లా ప్రకారం. ఇప్పుడు ఆత్మరీత్యా!

**చౌధు:** అనంతంతో ఎవరు వాదించగలరు బాబూ!

**అనంతం:** నిన్నే సమర్థిస్తున్నాను కాదా అక్కా?

**చౌధు:** అవతలవాడి వాదన నెగ్గే ప్లీడరు వాదనలాగా!

## 7

**డాక్టర్** ఇంక తన ధర్మం నెరవేర్చడం ప్రారంభించాలనీ, ఆ ధర్మం కూడా అతి మధురంగా, ఎవ్వరికీ నొప్పి కలగని విధంగా నెరవేర్చాలనీ, తన సంకల్పం విజయమందుటకు తాను గొప్ప నటకుడవ్వాలనీ అనుకున్నాడు.

**డాక్టర్:** అయితే చౌధురాణీగారూ!–

**అనంత:** ఓహెూ ఏమి అనుకూలత! కాని కాబోయే భార్యను 'ఏమండీ' అని గౌరవించాలి కాబోలు!

**చౌధు:** అండీ అనగానే గౌరవం పోలేదు. భార్యాభర్తలు సమానులయినప్పుడు భార్య మాత్రం భర్తను 'ఏమండి' అని పిలవాలా? భర్త భార్యను అండీ అని పిలవక్కరలేదూ?

**సరోజినీ:** మంచి ప్రశ్న వేశావు చౌధూ! ఇంక ఈ మగవారి బడాయిలు చూడు; 'ఓసే, ఇదిగో, అవునే, ఓ తువాలా, ఓ తలుపూ, నిన్నేనే' అనేవే కాదా వీళ్ళ బడాయిలు.

**డాక్టర్:** ఇంతకూ తన్ను మాట్లాడనీయరు కాబోలు మీరంతా కలిసి.

**సరోజిని:** మాట్లాడండి డాక్టర్‌జీ! మేం అనుమతిస్తున్నాం.

**డాక్టర్:** నాకు ఈ క్విట్ ఇండియా రిజల్యూషన్ అంటే అసహ్యం –

**సరోజిని:** నాకు చాలా సంతోషం –

**చౌధు:** నాకు ఎంతో ఆనందం –

**అనంత:** అదే నిజమైనదని, ఉత్తమ ధర్మమయినది అని నా వాదన.

**డాక్టర్:** నాకు అసహ్యమయినా, మా వాళ్ళందరూ ఆ రిజల్యూషన్ దేశానర్థదాయకమని వాదించినా నాకు మాత్రం ఈ ఉద్యమంలో తగుశక్తినీ, ప్రాణాన్నీ ధారపోస్తున్న వారిని చూస్తే ఎంతో జాలి కలుగుతుంది.

**అనంత:** జాలి ఎందుకండీ?

**చౌధు:** డాక్టరుగారూ, అవసరమైనప్పుడు మీరు కత్తి ఉపయోగిస్తారు కదా; అలాగే భారత జాతీయత అనే మహావైద్యుడు జాతీయ వీరుల రక్తపాతం అనే శస్త్రవైద్యం భారతమాత రోగ నివృత్తికై చేస్తున్నాడని అనుకోరాదూ?
**డాక్టర్:** మీ ఉపమ మంచిదేకాని వీళ్ళంతా అలా జైలుకు వెళ్ళడం, ప్రాణాలు పోగొట్టుకోవడం నాకేమీ నచ్చలేదు సుమండీ!
**అనంత:** అలా అంటే ఎల్లాగండీ! భారతదేశంకోసం ఎంతైనా ఆహుతి చేయవలసిందే!
**డాక్టర్:** అలా మీరంతా అంటారు. నువ్వు జైలుకు వెళ్ళడానికి సిద్ధమా?
**అనంత:** ఆc.
**డాక్టర్:** మీ ఆయన వెళ్ళడానికి సిద్ధమా?
**అనంత:** ఆc.
**డాక్టర్:** చౌధురాణీగారు వెళ్ళడానికి సిద్ధమా?
**చౌధు:** ఆc.
**డాక్టర్:** మీరండీ సరోజినిగారూ?
**సరోజిని:** ఆc.
**డాక్టర్:** సరోజినిగారూ! మీరు మీ భర్తను జైలుకు వెళ్ళడానికి అనుమతిస్తారా?
**సరోజిని:** అంతకన్న అదృష్టం నాకేమి కలుగుతుంది!
**డాక్టర్:** నేనే సరోజినిగార్నయితే మధుసూదనుగారికి నా అనుమతి ఇవ్వనే ఇవ్వను.
**అనంతం:** ఎందువల్ల యివ్వరు. ఒకవేళ మీరే సరోజినీ అక్క అయి, మీరు అనుమతి యివ్వకపోతే మధుసూదను బావగారితో, నువ్వు జైలుకు వెళ్ళవయ్యా అని సలహా ఇచ్చి ఉందును.
**డాక్టర్:** నువ్వు చెప్తావు. నీ భర్తకు అనుమతి ఇస్తావా?
**అనంత:** తప్పకుండా, క్రిందటిసారి వారు జయిలుకు వెడితే నేనేమన్నా గడబిడ చేశానా?
**డాక్టర్:** ఎవరన్నా ధర్మాలు వందల కొలది చెప్పవచ్చును; ఆచరణలోనికి ఆ ధర్మాలను తీసుకుని వచ్చేప్పటికి మన బడాయిలన్నీ బయలు పడతాయి.
**అనంత:** డాక్టర్‌గారూ, మీరు ఎన్ని అన్నా నాకు భయంలేదు కాని, మీ మగవాళ్ళు గాజులు తొడిగించుకొని ఇంటి దగ్గర కూర్చుంటున్నారు. మేమంతా ముందుకు దూకదలచుకొన్నాము.
**డాక్టర్:** ఏమో, నీకు అలాంటి దీక్ష ఉండవచ్చును కానీ, భర్త నిజంగా జయిలుకు వెడితే క్రిందటిసారి జరిగినంత గడబిడ జరుగుతుందేమో?
**అనంత:** జరగదండీ! (కొంచెం వైవర్ణ్యం పొందుతుంది మోము.)
**సరోజిని:** మగవాళ్ళందరూ ముందర వెళ్ళుతారా? వెళ్ళేటట్లే మాట్లాడుతున్నారు డాక్టరుగారూ!
**డాక్టర్:** నాకు నమ్మకంలేదు. నేను వెళ్ళను. కానీ మీమీ సంగతి వివరణ చేస్తున్నా.
**చౌధురాణీ:** ఆడవాళ్ళం మేం ముందర వెడతాము.

మధుసూదనుడు పత్రికా కార్యాలయానికి ఇంతకు అరగంటకు ముందే వెళ్ళిపోయాడు.
**చౌధురాణీ:** ఇంతకూ మా అన్నయ్య జయిలుకు వెడతానంటున్నారా?
**అనంత:** మా గురువుగారూనా?
**డాక్టర్:** ఇద్దరూ వెడితే పత్రిక మాట?

**సరోజిని:** మేం ఆడవాళ్ళం లేమా, మాచేత కాదా?

**డాక్టర్:** మీరంతా పేపరు నడపడానికి పూర్తిగా పూనుకుంటారా?

లేకపోతే మీ కాంగ్రెసు మగవాళ్ళ పిచ్చిపనులులా మీరు కూడా పిచ్చివాళ్ళయి పోతారా?

**సరోజిని:** డాక్టరుగారూ, ఆడవాళ్ళు పిచ్చివారు కారు, మగవాళ్ళూ కారు, ఇంతకూ మమ్మల్ని ముందు జయిలుకు పోనీయండి.

**డాక్టర్:** జయిలు ఓ సినిమాలాగ మాట్లాడుతున్నారే!

**చౌధురాణి:** మీ కమ్యూనిస్టులు కాంగ్రెసుపైకి నల్లేరుమీదకు బండిలా తయారవుతారే! భారతదేశ స్వాతంత్ర్యము మా జన్మాశయం. అందుకై భారత మహిళలు అర్పించిన సేవ వర్ణనాతీతం. మాభర్తలను జయిళ్ళకు పంపాము. వారిప్రాణాలు ఆహుతిస్తే అది అతిపవిత్రకార్యమని ఆనందంలో ఓలలాడినాము. మాబిడ్డల్ని, మాతండ్రులను జైళ్ళకు పంపాము. మేమే ఓలలాడినాము. మేమే జైళ్ళకు వెళ్ళాము. ఇంకా ఎంతో త్యాగం చేయాలని అందుకు మేం సిద్ధంగా ఉన్నాం.

**డాక్టర్:** అద్భుతమైన లెక్చరు. సరే మధుసూదనుగారూ, కోనంగిగారూ జైలుకు వెళ్ళవచ్చునన్నమాట.

**సరోజిని:** వందేమాతరం! తప్పక!

**డాక్టర్:** నీ ఉద్దేశం అదేనా అనంతలక్ష్మీ!

**అనంత:** ఆఁ!

## 8

**డా**క్టరుమాట వింటూనే అనంతలక్ష్మికి ఏదో భయం ఆవహించింది. ఏమిటి డాక్టరుగారు యిలా మాట్లాడుతున్నారు? ఏమిటి ఈయన ఉద్దేశం? నిజంగా తన ప్రియభర్తను ఆయన కారాగారానికి వెళ్ళమని సలహా ఇస్తాడా? వారు జైలుకు వెడితే తాను వారిని విడిచి బ్రతుకగలదా? ఆ వెనుక తాను యమలోకమే అనుభవించింది! మళ్ళీ అదేరకంగా వారికోసం బాధగా నిరీక్షిస్తూ ఉండడవలసిందేనా? వారి మాటలు వినక, వారి ప్రేమలో ఓలలాడక, వారి హృదయాన తలవాల్చి వారి లాలింపులు పొందక, నిమిషం ఒక యుగంగా గడుపుతూ, ఏకాకిలా ఉండగలుగునా తాను?

అనంతలక్ష్మి ఆలోచనలకు అడ్డు వచ్చి డాక్టర్ రెడ్డి అనంతలక్ష్మి వంక తిరిగి "అనంతలక్ష్మీదేవీ! నీ భర్త లోకంలోకల్లా మంచివాడు మంచిమాటలు చాటుననుకోవాలి. అతనికి ఈ సమయంలో జైలుకు వెళ్ళాలనిన్నీ, లేకపోతే తాను దేశానికి ద్రోహం చేసినవాడనవుతాననీ బుద్ధిపుట్టింది. నేను వాదించా కాని లాభం లేకపోయింది. నీ ఉద్దేశం కనుక్కోవాలని నిన్ను అడిగాను. నువ్వుకూడా ఒప్పుకోడం నీ గాఢదేశక్తిని తెలియజేస్తోంది. నిజంగా నువ్వు వీరపత్నివి. ఉత్కృష్ట నారీ ధర్మం నిర్వహించే దివ్యజీవనం గలదానివి" అని అన్నాడు.

చూస్తూ చూస్తూ వుండగా అనంతలక్ష్మికి కన్నీళ్ళు తిరిగినాయి. మహోత్తమ పురుషుడు తన భర్త. తాను వట్టి మూర్ఖురాలయిపోయి, భర్తను అనుమానించి అవమానించింది. ఒక నిమిషం భర్తను వదలి మనలేని తాను ఆయన్ను ఎన్నో అవమానపాలు చేసి ఆయన్ను జైలుకు పంపివేస్తోంది. ఆయన జైలుకు వెళ్ళడానికి

సంకల్పించుకొన్నది తన తెలివితక్కువ మాటలవల్లనే! నిజంగా ఆలోచించుకొంటే తన అంతరాంతరాల్లో తాను భర్తను ఎంత ప్రేమిస్తో ఉన్నా ఆయన తన విషయంలో తనకన్న తక్కువవారనీ. తనవల్లనే వీధిలోని ఒక బిచ్చగానిలా ఉన్న భర్త భాగ్యవంతుని ఆనందం సంపాదించుకొనగలిగారనీ అనుకున్నది గదా!

తనలో ప్రేమ తగ్గి ఉండాలి. తనలోని హీనత్వం పైకి ఉబికి వచ్చి ఉండాలి. అందుకనే వారు చల్లగా జైలుకు వెళ్ళాలని సంకల్పించుకొని ఉండాలి.

అనంతలక్ష్మి లేచి గబగబ గదిలోనికిపోయి పడక కుర్చీలో కూలిపోయి భరింపలేని దీనస్థితిలో పడిపోయి కళ్ళనీళ్ళు కారిపోతూ ఉండగా అరనిముసంలో మోము మూసుకొని తలవంచి శోకదేవత అయిపోయింది.

అనంతలక్ష్మి తలెత్తి చిరునవ్వు తెప్పించుకొని "డాక్టరుగారూ, ఆయన జైలుకు వెళతామన్నారా మీతో?" అని ప్రశ్నించింది. "నామీద ప్రేమ పారమా అపారమా?"

**డాక్టరు:** ఆఁ! ఆ! పారము, జయిలుకు వెడతానన్నాడు.

**అనంత:** నాతో చెప్పకుండానే!

**డాక్టరు:** చెప్పాలని చూచాడు. కాని నువ్వు గర్భవతివి-

**అనంత:** మీ మాటలకు అర్థం ఏమిటి? సత్యాగ్రహం చేశారా?

**డాక్టరు:** చేస్తే?

**అనంత:** చేశారా చెప్పండి!

**సరోజిని:** చేసి ఉంటే ఆయన పాదాలకు నా నమస్కారాలు.

**జయలక్ష్మి:** ఏమిటా మాటలు అమ్మా! మీ ఆయన అంత తెలివితక్కువ పని చేస్తారా?

**సరోజిని:** అది తెలివితక్కువపనా అత్తగారూ?

**డాక్టరు:** అంత ఉత్తమకార్యం ఇంకొకటిలేదు.

**అనంత:** ఇంతకూ మీరనేది ఏమిటి?(ఆమె చాలకోపంతో లేచింది) నన్ను వదలి జైలుకు వెళ్ళమనండి. నాకు భయమా? వందసార్లు వెళ్ళమనండి. జైల్లోనే కాపురం పెట్టుకోమనండి.

**జయలక్ష్మి:** అమ్మిణీ, ఊ కంగారుపడకు!

**డాక్టరు:** కోపపడకు అనంతలక్ష్మి! గర్భంలోని శిశువును తలచుకో!

**అనంత:** (నవ్వుతూ) ఏమి చేయమంటారు నన్ను?

**సరోజిని:** నువ్వు ఉత్తమసాధ్వివి. నీ భర్త ఉత్తమ పురుషుడు. మీ దాంపత్యం ఆదర్శ స్వరూపం. వదినా, నీ ప్రేమకు మా కృతజ్ఞత ఎంతయినా సరిపోదు. నీ భర్త నిన్ను మెచ్చుకోని నిమిషం ఉండదు. నీ పేరు సర్వకాలస్మరణ ఆయనకు.

**చౌధు:** అనంతలక్ష్మి అక్కా, నీ ప్రేమ ఒక దివ్యకాంతిపుంజం.

**డాక్టరు:** అందుకని నీ భర్త అరెస్టు అయినా నువ్వు ఆనందరూపిణిగా ఉండాలి. అతడు...

## 9

డాక్టరు "అతడు" అని అనగానే అనంతలక్ష్మి వెలవెలబోయి, కూలిపోయి, కళ్ళు తిరిగిపోయి వెనక్కు వాలిపోయింది.

ఆ వెంటనే డాక్టరు తన చేతికి నర్సు అందించిన ఇంజక్షను తీసుకొని, అనంతలక్ష్మి భుజంపై పొడిచినాడు.

మూర్ఛపోయినంత పని అయిన అనంతలక్ష్మికి నరాలు బలం పొందాయి. ఆమె కన్నీరుమున్నీరై పోయినది.

ఈ పదినిమిషాలూ అందరూ మాన్పడి ఉన్నారు. అప్పుడు చౌధురాణీ ధైర్యంచేసి "డాక్టరుగారూ! ఏమయింది కోనంగిరావుగారికి?" అని ప్రశ్నించింది.

డాక్టరు సంతోషం వెలిబుచ్చుతూ "ఏమవడమేమిటి? మన కోనంగిని లోకం ఎంతో మెచ్చుకుంటూ ఉండగా వెళ్ళి సత్యాగ్రహం చేశాడు. పోలీసువారు అరెస్టుచేసి తీసుకుపోయారు. అదీ విషయం. ఎంతటి వీరుడు అతడు!" అని అన్నాడు.

జయలక్ష్మి కోపంతో "డాక్టర్! ఓహో ఏమి దేశభక్తి! యివతల భార్య గర్భవతికదా! ఇంట్లో భార్యను గురించి ఇంతయినా ఆలోచించకుండా, తనకోసం అని ఏర్పాటు చేసిన పత్రిక సంగతి ఆలోచించకుండా వెళ్ళుతాడా? ఔను, ప్రజలు మెచ్చుకోరు మరి! వాళ్ళదేమి పోయింది? తాము కాకపోతే ఇతరులను ప్రజలు ఎప్పుడూ మెచ్చుకొనడానికి సిద్ధమే" అని పొలికేకలు పెడ్తూ జాడించింది.

అనంతలక్ష్మి చివ్వునలేచి "అమ్మా, వారినేమీ అనకు. నాదే అంతా లోటు. పదిమంది ఎదుటా చెప్పుకుంటే చేసిన పాపం కొద్దిగా అన్నాపోతుంది. వారిని అనుమానించాను. నానామాటలు ఆడి అవమానించాను. వారు ఉత్తమ పురుషులు. వారి హృదయం చిందర వందర చేశాను. ఆనాటి వారి నవ్వులో ఎంతదుఃఖమో గర్భితమై ఉండాలి. నా జీవితంలోంచి వెళ్ళి నాకు శాంతిని ఇవ్వాలని సత్యాగ్రహం చేసి ఖైదుకు వెడుతున్నారు!" అని సోఫామీద వాలి మోము వంచేసుకుంది. ఆమె కన్నుల నుండి జడివానలు కురిశాయి.

జయలక్ష్మి తెల్లబోయి ఒక్కనిమిషం కూతుర్ని చూచి "ఔనమ్మా! భార్యభర్తను వెనక వేసుకురాకపోతే ఇంకెవ్వరు వేసుకువస్తారు. ఈ రెండు మూడు రోజుల నుంచీ నువ్వు పడేబాధ అంతా చూస్తూనే ఉన్నాను. నేను పోరుపెడితే నువ్వు విన్నావూ?" అని అన్నది.

**అనంత:** ఏమి పోరుపెట్టావు? నేను ఏమి వినలేదు?

**జయ:** ఎందుకులే!

**అనంత:** ఎందుకులే ఏమిటి? నీ ఉద్దేశం నాకర్థమయింది. నాకు వారు భగవంతులు. నా సర్వస్వము వారి పాదాల దగ్గర. నీ మనస్సులో ఏ సంకోచం ఉన్నా, నన్ను వారి అడుగునీడజాడల వెళ్ళిపోనీ. ఆయనతోపాటు నేను పాటుబడి ఇంత కలో గంజో త్రాగి బ్రతుకుతాము.

జయలక్ష్మి ఆశ్చర్యమంది "అమ్మిణీ! ఇవేమి మాటలు. యిదంతా నాకా? నీకోసం ఈ జంజాటమంతా పెట్టుకొన్నాను. లేకపోతే నాకు ప్రాణమయినా పోయి ఉండును. సన్యాసిని అయిపోయి ఉందును. నేను మాట్లాడినా, పని చేసినా, బ్రతికి ఉన్నా నీకోసమే" అని అన్నది. ఆమె కన్నులవెంట నీరు జలజలా ప్రవహించింది.

అనంతలక్ష్మి వెళ్ళి తల్లి ఒడిలో వ్రాలిపోయింది. అక్కడ ఉన్న అందరి కళ్ళలో నీళ్ళు తిరిగినవి.

ఆ మరునాడు కోనంగిరావు కేసు విచారణకు వచ్చింది.

కోనంగిరావు తనకు వకీలు అక్కరలేదన్నాడు. పోలీసువారూ, యింకా కొందరు పెద్దలూ సాక్ష్యం ఇచ్చారు ప్రభుత్వం తరపున. కోనంగి అన్నీ ఒప్పుకున్నాడు. తాను చెప్పేది యేమీ లేదన్నాడు. అతనికి మేజస్ట్రేటు ఎనిమిది నెలలు శిక్ష విధించాడు. "ఏ" తరగతి అనుగ్రహించాడు.

అతణ్ణి కోర్టు అవరణలో అనంతలక్ష్మి, జయలక్ష్మీ, మధుసూదనుడు. రియాసత్ ఆలీ, సరోజినీ, చౌధురాణీ, డాక్టరు రెడ్డీ కలుసుకున్నారు.

అనంతలక్ష్మి గర్భవతి అని తెలియజేశారు.

కోనంగి ఆశ్చర్యానికీ, ఆనందానికీ మేరలేదు.

ఆ కోర్టు భవనంలో భార్యాభర్తలిరువురూ విడిగా కలుసుకునే ఏర్పాటు జరిగింది.

కోనంగి వెంటనే అతిప్రేమతో భార్యను కౌగలించుకొని, ఆమెకు దివ్యహృదయ స్పందన స్వరూపాలయిన ముద్దులర్పించాడు.

"నన్ను క్షమింపరూ మాష్టరుగారూ?"

"అనంతా! నా జీవితానివి, నా సర్వస్వానివి. నేను నిన్ను క్షమించడమా?"

అనంతలక్ష్మి భర్త రెండు భుజాలు పట్టి, తలపైకి ఎత్తి అతని మోము తనివోవ తిలకిస్తూ "మీరు ఎప్పుడు వస్తారో! ధైర్యంగా ఉండండి! మీకోసం ఎదురు చూస్తూ ఉంటాను" అని అంటూ అంటూ అతని తల వంచి పెదవులపై ముద్దుపెట్టింది.

"నీ ముద్దులో పాపాయి ముద్దును కూడా రుచి చూస్తున్నాను ఆత్మేశ్వరీ!"

"నా యీ రెండు పెదవులలో ఏది పాపాయి పెదవి?"

"పై పెదవే పాపాయి పెదవి అనంతా! జాగ్రత్త, నీ మనస్సు నిర్మలంగా ఉంచుకో. నీ ధనం నీదేశంకోసం సర్వకాలమూ మానవసేవ మనస్సులో తలచుకో! సంతోషంగా ఉండు. లోని పాపాయి ఆరోగ్యం మరువకు. డాక్టరు సహాయం పొందుతూ ఉండు.

"గురువుగారూ! నేను రావాలనే అనుకున్నాను."

"జైలులోనే పురుడుపోయవలసి వచ్చేది."

"అయితే ఎంతో ఆనందంగా ఉండును."

"ఆనందమానందమో! కాని పండులాంటి తొనల పాపాయిని ఎత్తుకొని ఉండగా తిరిగి వస్తానులే!"

"ఎవరిపోలిక?"

"నీ పోలికే!"

"మగపిల్లవానికి, ఆడవారి పోలిక ఏమి బాగుంటుంది? మీ పోలిక అద్భుతం"

"పోలిక అనగానే ఆడపిల్లవాడు పుట్టాడనా?"

"ఏమో బాబూ! నా పోలిక వస్తే అడపిల్లవాడే ఔతాడేమో!" ఆమె పకపక నవ్వింది. అతడూ నవ్వాడు.

"ఆడపిల్లకు తండ్రిపోలిక రావాలట!"

"ఐతే నాకు ఆడపిల్లే కావాలండీ!"

"అమ్మాయి వస్తే నాతో మాట్లాడవు కాబోలు!"

"మీరు మరీని!"

"నువ్వు మరీ-మరీని!"

ఇద్దరూ కౌగలించుకున్నారు.

ఆ రాత్రే కోనంగిరావును వేలూరు జయిలుకు తీసుకుపోయారు.

**త్రయోదశ పథం**

# స్వప్న ప్రపంచం

**కో**నంగి జైలులో ఏదో స్వప్నప్రపంచంలో జీవించసాగాడు. మహామహులైన ఆంధ్రనాయకులు, తమిళ, మళయాళ, కర్ణాటక నాయకులు జైలు నిండా ఉన్నారు.

దూరాన ఉన్నప్పుడు వారు దేవతలులా తోచారు కోనంగికి. దగ్గరకు వస్తే చెమటలు పట్టే మానవులు.

వారి కోపాలు, వారి ఆశలు, వారి నిస్పృహలు, వారి అపేక్షలు దుర్భిణీయంత్రంలో కనబడినట్లయింది కోనంగికి. అతనికి భయమూ కలిగింది, అనుకంపమూ కలిగింది.

చిన్న చిన్న జాతీయవాదులు మొదటి నుంచి కోనంగికి సంపూర్ణంగా అర్థమయిన వారే! అలాగే నేడూ ప్రత్యక్షమయినారు.

కొందరికి ప్రపంచం పయిన కోపం, కొందరికి తమ పైననే కోపం. అందరికీ దేనిపైనో కోపం! కోపం లేనివారు ప్రేమించడం ఎలా సాధ్యం. కాబట్టే దేశాన్ని అకుంఠితంగా అందరూ ప్రేమిస్తారు. ఆ ప్రేమలో ఇమిడే వారి సంపూర్ణత్వాలు శ్రుతిలో కనబడ్డాయి కోనంగికి.

కాంగ్రెసు ప్రచారకులకూ, సేవకులకూ, నాయకులకూ అతడు క్రొత్తవాడు. అందరూ అతన్ని ఎరుగరు. అతని పత్రికను అందరూ ఎరుగుదురు. అందరూ అతన్ని ఎవరికివారు ఇష్టం వచ్చినట్లు భావించుకున్నారు. కొందరికి అతడు సన్నగా పొట్టిగా ఉంటాడని తోచింది కొందరు సన్నగా పొడుగ్గా ఉంటాడని మనస్సులో అనుకున్నారు. కొందరి ఊహలో అతడు బంగారు ఛాయ. మరి కొందరి హృదయ దర్పణంలో అతడు నల్లగా కన్పించాడు. అతడు ఏ రంగో, ఎలా ఉంటాడో కొందరు ఊహించనేలేదు.

అందరూ అతన్ని చూడడం ఆనందంగా ఉంది అన్నారు. కొందరికి ఉడుకుబోతుతనం. కొందరు మెచ్చుకున్నారు. కొందరు బాగానే ఉంది కోనంగి పని అనుకున్నారు.

కోనంగి ఇతరులను అర్థం చేసుకుందాము అని ప్రయత్నించాడు. "కొందరిని పూర్తిగా గ్రహించగలను" అనుకున్నాడు.

"ఎందుకు వీరు స్వాతంత్ర్యంకోసం ఈలాటి బాధలు పడడం?" అని ప్రశ్నించు కున్నాడు. తన స్నేహితుడు డాక్టర్ రెడ్డి కమ్యూనిస్టు. సామ్యవాదంకోసమే పాటుపడుతున్నాను అనుకొంటాడు. ఎందుకాతనికి ఆ గొడవ?

యుద్ధాలకు వెడతారు ప్రాణాలకు వెరవకుండా! దేనికీ వెరవకుండా ప్రాణాలు బలి తీసుకుంటారు.

ఆలోచించినకొలదీ కోనంగికి ఆవేశోత్సాహం కలిగింది. అతడు సర్వవిశ్వమూ తిరిగి వస్తాడు. ఆ విశ్వాన్ని ఎన్ని రకాలుగా దర్శింపవచ్చును? ఆ దర్శించడము భయకారణమూ, ఆనందయుతమూ, హాస్యపూర్ణమూ ఔతుంది.

"ఉత్సాహమూ, కల్లూ ఒకటేనా?" అని కోనంగి ఆలోచించేవాడు. ఉత్సాహం మనుష్యుణ్ణి వీర భూమిలో తాండవం ఆడిస్తుంది. ఉత్సాహంలో దేశాలు నాశనం చేయగలడు. ప్రాణాలు వేలకొలదీ అర్పించగలడున్నూ.

కోనంగి జయిలులో తన తోటి వారందరినీ హాస్య వస్తువులుగా చూద్దామను కుంటాడు. అలాంటి సమయంలో అతని కళ్ళకు కొందరి పెద్ద ముక్కులు రాంబందు ముక్కులులా కనబడతాయి. కొందరాతనికి కంఠం లేనివారుగా ప్రత్యక్షమవుతారు. కొందరి చేతులు మాత్రమే కోనంగికి కనబడేవి.

ఎవరికయినా ప్రేమ మహోత్తమ సంస్థ అనుకుంటాడు కోనంగి. అనంతలక్ష్మితో ఈ మానవ ప్రపంచం దర్శించడం ఆనంద శిఖరితమే అనుకున్నాడు. జైలులో ఉన్న రెండువేల ఖయిదీలు కోనంగికి కనపడ్డారు. జయిలు పైన ప్రపంచ జనసంఖ్య ఏమీ అతనికి కనబడేదికాదు. అతనికి కావాలన్నప్పుడే హృదయంలో ఏదో కవాటం తెరచి చూచేవాడు. ఇప్పుడు జనం మధ్యనే సర్వకాల సర్వావస్థలూ ఉన్నట్లు తోచింది కోనంగిరావుకు.

రాత్రిళ్ళు తనతో తెచ్చుకున్న నరసారావుపేట మంచంమీద పడుకుని ఆ జైలుగదిలో ఆకాశమూ, తారకలూ, సర్వవిశ్వమూ దర్శించేవాడు.

ఒకరి పోలికలొకరికి లేక ఆంధ్ర ప్రజలందరూ వేరువేరుగా ప్రత్యక్షమై కనపడ్డారాతనికి. కాని ఈ భిన్నత్వంలో ఏకత్వమూ కనబడింది.

ఈఏకత్వమే భూమి అని అతడు అనుకున్నాడు. ఈ భూమిలో మానవజాతికి విత్తనాలు ఉండేవా? అవి తక్కిన గ్రహాలలో, గ్రహరాట్ సూర్యునిలో ఉండేవా? అన్ని లక్షల డిగ్రీల వేడిలోనూ ఉండేవా?

అప్పుడు కావ్యాలు, చిత్రలేఖనాలు ఆ మహోష్ణస్థితిలో ఉండేవా?

ప్రపంచంలోని సర్వభావాలూ ఆ సూర్యమండలంలో ఉండేవా?

ప్రేమ! ఏ విధంగా ప్రేమికులు?

## (2)

"ఏమండీ కోనంగిరావుగారూ, మీరు ఈ యుద్ధం జరిగినన్నాళ్ళు బ్రిటిషు ప్రభుత్వంపైన కత్తికట్టకుండా మీ పత్రిక నడుపుతామనీ, యుద్ధం బాగా సాగేందుకు మీకు శక్తి ఉన్నంతమట్టుకు పనిచేస్తామనీ మాటఇస్తే ప్రభుత్వంవారు మిమ్ము వదలివేస్తారు. మీకు ప్రభుత్వం ఎన్నో సహాయాలు చేస్తుంది" తని వేలూరు జయిలులో సూపరింటెండెంటు గదికి పక్కనున్న గదిలో కోనంగిరావును కలుసుకొని ఒక గూఢచారోద్యోగి తెలిపినాడు.

కోనంగిరావు ఆశ్చర్యం పొందాడు. ఇది ప్రభుత్వంవారు పంపిన రాయబారమా? లేక తన హృదయాన్ని పరీక్షించడానికి వచ్చాడా? అని కోనంగి అనుకున్నాడు. వెంటనే కోనంగి "అయ్యా, మీరు ఆ ప్రశ్న అడగకూడదు, నేను జవాబు చెప్పకూడదు" అని ప్రత్యుత్తర మిచ్చాడు.

"యుద్ధం ఉన్నంతకాలమేగా, మేము మీ బోటివాళ్ళ సహకారం వాంఛిస్తున్నది?"

"ఆ తర్వాత!"

"ఆ తర్వాత కాంగ్రెసు తన ఇష్టం వచ్చినట్లు చేసుకొనవచ్చును."

"ఇనస్పెక్టరుగారూ, మీరు నాతో ఈలాంటి విషయాలు మాటాడకూడదు, నేను వినకూడదు."

ఆ గూఢచారి ఉద్యోగి "ఆలోచించండి, తొందరపడకండి" అని కోనంగికి సలహానిచ్చి వెళ్ళిపోయాడు.

కోనంగి నవ్వుకొన్నాడు. ప్రపంచం అంతా హాస్యంతో నిండివుంది. హిట్లరు, స్టాలిన్‌వంటి ప్రపంచనాయకులు ప్రపంచ స్వరూపాన్నే మార్చడానికి ప్రయత్నిస్తారు. ప్రపంచశక్తి ఒక తిమింగలం ఐతే, దాని ముక్కుకు ఒక సన్నదారం కట్టి ఈ నాయకులు ఆ తిమింగలాన్ని నడపడానికి ప్రయత్నం చేస్తారు. తిమింగలము తన దారిని తానే వెడుతూ ఉంటే, తామే నడుపుతున్నామనుకుంటారు. ఒక్కొక్కప్పుడు ఆ దారపు లాగుళ్ళే హృదయానికి నూత్న స్పందనాలు కలగడానికి కారణాలవుతున్నాయి. ఇంతకన్న హాస్యరసం ప్రపంచంలో ఎక్కడుంది? తను నాయకుడనని తనకే తెలియని పిచ్చివాని మాటలు లోకానికి ఒక్కొక్కప్పుడు పరమాద్భుతమయిన దారి చూపిస్తాయి.

కోనంగికి ఏదో కుంగిపోయినట్లయింది. లోకంలో నవ్వుకు తావు ఉందా? లోకం అంతా బాధాపూర్ణ జీవితాలతో నిండి వున్నప్పుడు నవ్వడం ప్రపంచాన్ని అవమానించినట్లా?

ఈ లోకం అంతా ఒక్కసారి ఆనందపడుతుందా? మహాత్మాజీ జన్మదిన మహోత్సవం ఇరవైకోట్ల భారతీయులకు ఆనందం ఇస్తే, తక్కినవారికి? హిందూదేశంలోనే అనేకులు పళ్ళు కొరుక్కోవచ్చును. లోకం అంతా ఒక్కసారిగా ఎండకాసి, ఉక్కబోసి, ప్రాణుల్ని మలమల మాడ్చి, ఆ వెంట ఒక మంచి రోజున చల్లనిగాలీ, జల్లున వానా, కురిస్తే కూడా అందరూ ఆనందించరు. కాని ప్రపంచ తత్త్వమే వెలుగునీడలతోనూ, నవ్వు ఏడుపులతోనూ నిండి ఉండే పథకంలో ఉన్నప్పుడు, నవ్వే ఉండాలని మనుష్యుడు వాంఛించి అది లేదని బాధను పొందడం వెర్రితనమే ఔతుంది.

మనుష్యుడు ఒక్కడూ ఉండడానికి భయిపడతాడు. అందుకని కారాగారవాసము మనుష్యునికి బాధ ఐంది. కాని పురుషులలో పురుషశక్తి స్త్రీశక్తి ఇవ్వగలిగిన ఉపశమనం కోరుతుంది. ఒకే శ్రుతిలో నడిచే స్త్రీ పురుషులు ఒకరి కొకరు నవ్వూ, వెలుగూ ఔతారు. అపశ్రుతికల కుటుంబం యమలోకం.

తాను యమలోకంలో ఉన్నా అనంతలక్ష్మి ప్రక్కనే వుంటే యమధర్మరాజుపై అభిశంసన తీర్మానం పెట్టగలశక్తి సంపాదించే ఉండును.

అనంతలక్ష్మి అనుమానం పటాపంచలైంది. ఆ ఆలోచన రాగానే కోనంగికి తన్మయత్వము, ఆనందావేశము కలిగినవి. అతడు తండ్రి కాబోతున్నాడు. ఇది కాదా సృష్టి? మనుష్యునికి జీవితంలో దొరకని శ్రుతి స్వప్నలోకంలో దర్శనం అవుతుంది అనుకున్నాడు.

అతడు డాక్టరును ఆపేక్షతో తలపోసుకున్నాడు. డాక్టరుకూ చౌధురాణికీ వివాహం అవడం ఎంతచక్కని శ్రుతి! స్టాలిన్‌కు నాడియా వంటి భార్య ఆమె! లోకంమీదున్న అతనికోపం చౌధురాణి హస్తపల్లవ కమ్రస్పర్శ వల్ల నశించి ముడుతలు పడిపోయిన అతనిఫాలము స్నిగ్ధమై కాంతివంతమై పోతుంది.

ఏ అనుభవమైనా సన్నిహితమైనవరకూ ఆ అనుభవం అసంభవమని మనుష్యుడనుకుంటాడు. అ అనుభవము గ్రంథాలలో మాత్రం ఉంది అనుకుంటాడు. గ్రంథాలలో లిఖించినవాళ్ళూ, ఆ అనుభవము వాంఛించో, అనుభవించో వ్రాస్తారుగదా!

కోనంగి ఉప్పొంగిపోయాడు. అతడు తన గదిలో గోడను గట్టిగా హృదయానికి అదుముకొని శ్రుతా, అపశ్రుతా విశ్వంలో ఎక్కువ బలవత్తరమైనది? విశ్వశ్రుతిలో అపశ్రుతి ఇమిడి ఉండాలి. అపశ్రుతిలోని శ్రుతి శక్తివ్యక్తమైన ఈశ్వరునివంటిది.

కోనంగి కటకటాలవద్దకు వచ్చి, ఆ రాత్రిలో ఆ దూరపు నక్షత్ర లోకంలో భారతీయా వేదన దర్శించుకొన్నాడు. సంస్కారంలో ఎంతో తేడా ఉన్న మనుష్యులు, వందలకొలది భాషలు, వందలకొలది మతాలు, ఎన్నో భేదాలున్న ఆశయాలు, రాజకీయభావాలు. ఈ జనం అంతా బానిసత్వంతో ఎక్కడికి పోతున్నారు?

తన దేశము, తన మన్ను, తన నదులు, తన గాలి, తన పొలాలు, తన ప్రజలు తనలోనే ప్రతిఫలిస్తున్నారు. రాజ్యాలు, విదేశీయులు, యుద్ధాలు, నాశనాలు, కరువులు, రోగాలు, వివిధమతాలు ఉద్భవించడం, మతయుద్ధాలు, బానిసత్వము, బానిసత్వాన్ని నాశనం చేసి స్వేచ్ఛ పొందాలన్న కాంక్ష, అందుకు ప్రయత్నాలు, కుట్ర, రహస్యమార్గాలు, ప్రథమ స్వాతంత్ర్యయుద్ధము, ఝూన్సీ లక్ష్మీబాయి, తాంతియాతోపే, కాంగ్రెసు సంస్థ ఉద్భవము, మాధ్యమికవాదులు, కుర్చీవాదులు, అతివాదులు, రాజకీయ హత్యలు, జాతీయ మహాభావోద్భవము, జాతీయ భావ అఖండతాండవము, హింస, అహింసభావోద్భవము, గాంధీ మహాత్ముడు, సత్యాగ్రహం, ఖైదు, పాకిస్తాన్ భావప్రాదుర్భావము - ఓహెూ! తనదేశం ఎన్నాళ్ళవరకు ఈ పంజరంలో ఉండడం?

అతడు క్రుంగిపోయాడు, వణికినాడు, ముడుచుకుపోయినాడు.

నక్షత్రాల వంటి బిందువులు నక్షత్ర కాంతిని ప్రతిబింబిస్తూ అతని కళ్ళల్లో సుడి తిరిగినవి.

తాను కటకటాల వెనుక, తనదేశం కటకటాల వెనుక, అఖిలాశియా కటకటాల వెనుక - ముందు పహరా ఇచ్చే తెల్లవాడు:

* * * *

చూస్తూ చూస్తూ, కటకటాలదగ్గరే, కుంగి జారిపోయే నక్షత్రాలను చూస్తూ కోనంగి.

తన భావాలనూ, జీవితమార్గాన్నీ రియాసత్ మార్చుకోలేదు. తన పట్టుదలను మెహరున్నిసా తగ్గించుకోలేదు. రియాసత్ మెహరున్నిసాను ప్రేమించిన ప్రేమ అతిసనాతనమూ, అతిపవిత్రమూ ఆయినది. మెహర్ తన్ను ప్రేమించినది. అ ప్రేమను ఆమె మరచిపోలేదని అతనికి తెలుసును. మెహర్ అందం అతిలోకమయినది. ఆమె అందాన్నిచూచి బాలికలే ముగ్ధులయ్యేవారు.

బాలికల అందం బాలురకోసం. బాలురకు అందం ఉన్నా, లేకపోయినా అందమే. అరేబియన్ కథలలో కమరజ్జమాన్ అందము బాలికల అందమేమో!

అందమునకు, ప్రేమకు, జీవితమునకు, మానవుని ఆశయాలకు, సంకల్పించుకొన్న కర్మలకు ఏమి సంబంధం ఉందో? లోకమంతా బాలికల అందాలను గురించి కావ్యావళి వ్రాస్తుంది. బాలికల అందం లోక వ్యవహారాలలో అర్థం లేనిదా? లోకాద్భుత సౌందర్యమయిన నూర్జహాను మొగలుసామ్రాజ్యం అంతా అవిచ్ఛిన్నంగా ఏలింది.

లోకంలో ప్రేమలే లేవా? ఈ ప్రేమ లోకానికి అడ్డం తగిలితే నశించిపోవాలా?

సాధారణంగా ముస్లింబాలికలు ప్రేమించుట ఎరుగరు. వారు పరపురుషుల కంట పడనే పడరు. పరపురుషుల చూడవలెనన్న ఆలోచన వారికి కలుగదు.

* * * *

తానూ, తన బావా చిన్నతనాన్నుంచీ ఒకచోట ఆడుకొని, ఒకేచోటే చదువుకోవడం చేత ప్రేమ ఉద్భవించడానికి కారణమయింది. ఒక రాజకీయ మార్గం అల్లాకు ప్రీతికరమయి, ఇంకో రాజకీయమార్గం కాబోదా? ఐతే సున్నీలు అల్లాకు ఎక్కువ ప్రియులా? షియ్యాలా? మైహర్ ఆలోచనాధీన అయినది ఒకనాడు.

సున్నీలకు, షియాలకు, అహమదియాలకు, భోరాలకు, ఇస్మామీలకు, సుఫీలకు అల్లా ప్రేమలో తేడాలుండగలవా? రాజకీయమార్గాలలో ముస్లింలీగువారు ఎక్కువ ప్రియులై జైమతులు. అహరులు దూరం అవుతారా? ఖాక్సారుల మాట? ఎవరయినా ముస్లిములైతే అల్లాకు దగ్గిరై, కాఫరులు మొదలయినవారు దూరమా?

ఈ పెళ్ళిమాటలు లోనలోన దాగి ఉండి పైకి రానంతకాలమూ తనకు బావను గురించిన అపోహాదికాలు రావలసిన అవసరమే లేకపోయింది. పెళ్ళినిగూర్చిన మాటలు వ్యక్తమైనప్పటినుంచీ, తన బావను తాను మైక్రాస్కోపులో పెట్టి చూచుకొన ప్రారంభించింది.

ప్రేమ విషయంలో నవీనధర్మం ప్రకారం స్త్రీకోసం పురుషుడూ, పురుషునికోసం స్త్రీయున్నూ తన సర్వస్వమూ ఆహుతించడానికి సిద్ధంగా ఉండాలి. తన బావ తన రాజకీయపక్షం నుండి విడివడినాడు. ఇంక తనకు మాత్రం ఇజ్జత్ (గౌరవము) లేదా? అభిమానం లేదా?

అభిమానమే గొప్పా? ప్రేమ గొప్పా? మెహరున్నీసాకు కంటనీళ్ళు తిరిగాయి. రియాసత్ మాట్లాడదు. దూరాన్నుంచి తన్ను ప్రేమమయదృష్టుల తిలకిస్తాడు. వెళ్ళిపోతాడు.

తన తండ్రి ముస్లింలీగ్ నాయకులలో ఒకరు. తన బావ జాతీయ నాయకులలో ఒకడు. పాకిస్తాన్ విషయమయి ముస్లింలీగు నాయకవర్గం అనుమానరహితంగా మాట్లాడుతోంది.

పాకిస్తానం సృష్టించడం ముస్లింజాతిని రక్షించడం. ముస్లింజాతిని రక్షించకపోతే ముస్లింజాతి నశించిపోతుంది. ఆ జాతి నశిస్తే ఇస్లాం మతమే నశిస్తుంది. అలాంటి పాకిస్తానును కోరకూడదనే ముస్లిం మతద్రోహి కాడా? ఏమో ఎవరికి తెలుసు?

ఆమె లోగొంతుకతో ఈ పాట పాడుకొనసాగింది.

*"ఏక్ ఖాబ్ సాదే ఖాతా*
*మాలుం నహీ క్యా?*
*ఆబ్ తక్ అసరే ఖాబ్ హై*
*మాలుం నహీ క్యుం?*
*బేకైవ్ మైనాబ్ హై*
*మాలుం నహీ క్యుం?*
*ఫీకీ షబే మెహతాబ్ హై*
*మాలుం నహీ క్యుం?*
*(ఒకనాడొక కలను కంటి*
*ఆ కలనే మరచిపోతి*
*కాని నన్ను ఆ స్వప్నము*
*శాంతి పారద్రోలిపోయె*

*కారణమే తెలియదాయె*
*నాడు నిండు వెన్నెలలో*
*ఏదో పరిమళ ముండెను*
*ఈ దినమున ఈ వెన్నెల*
*కర్కశమై పొడి రాలెను*
*కారణమే తెలియరాదు*
*కారణమే తెలియరాలేదు.)*

మెహరున్నీసా నిట్టూర్పుపుచ్చి ముందున్న బల్లపైన మోము వాల్చింది. ఇంతలో ఆమె తండ్రి అక్కడకు వచ్చాడు. "బేటీ! ఏమిటి అల్లాగు పడుకొన్నావు?" అని ఆయన కొమరితను ప్రశ్నించాడు.

"అబ్బాజాన్, ఏమీలేదు."

"ఏమీలేదు అనకమ్మా. అంతా నాకు అర్థం అయినది. నేను లీగు మనిషినే, అయితే ఏమి నీ మోస్తరుగా నాకు వెర్రిపట్టుదల తక్కువేమో?"

"అబ్బాజాన్! మీకు లీగు అంటేనే పట్టుదల తక్కువేమో?"

"బేటీ! నీ మాటలకేమన్నా అర్థంఉందా?"

"మీ మాటలకేమన్నా అర్థం ఉందా?"

"మన భావాలూ, మన నడకలూ ఒకదానికొకటి శ్రుతి కలిగి ఉండాలి. కొన్ని మతదృష్ట్యా, కొన్ని రాజకీయదృష్ట్యా చూచి, ఈ రెంటిని సమన్వయం కుదుర్చుకోకుండా ఉంటే జీవితం అంతా కష్టాలతో నిండిపోతుంది."

"సమన్వయం కుదిరినవాళ్ళకు కష్టాలు రావా అబ్బాజాన్?"

"వస్తాయి బేటీ! కాని, ఆ కష్టాలు మనుష్యులు సంతోషంతో భరిస్తారు. లేకపోతే ముక్కలయిపోతారు."

"ఇంతకూ మీరనేది?"

"నేననేది ఏముంది? రియాసత్ ఉత్తముడు. అతన్ని నీతో సమానంగా ప్రేమించి పెంచాను. మీ ఇద్దరి వివాహము చిన్నతనాన్నుంచీ కాంక్షించాను. దానికి తగినట్లు మీ రిద్దరూ ఒకరినొకరు ప్రేమించుకొంటూ పెరిగారు. నా హృదయానికి పట్టలేని ఆనందం వచ్చేది మీ ఇద్దరి ప్రేమా సందర్శిస్తూంటే. అలాంటిది నీకు ఎక్కడ నుండి వచ్చిందో ఈ పట్టుదల?"

"అబ్బాజాన్! మేము వివిధపక్షాలకు చెందినవాళ్ళము. మా సంసారం ఆనందంగా ఎలా నడుస్తుంది?"

"ఓసి వెర్రితల్లీ! మన బాలురు ఇంగ్లండు వెళ్ళి ఇంగ్లీషు భార్యలను కట్టుకు వస్తున్నారు. వాళ్ళ ఆచారాలు, భావాలు వేరు. మనవి వేరు. అయినా ఆ భార్యాభర్తలు ఎంత ఆనందంగా జీవితం గడపటంలేదు?"

మెహర్ లేచి చిరునవ్వునవ్వుతూ తండ్రికి సలాముచేసి "అబ్బాజాన్! మీ హృదయం నవనీతం!" అని వెళ్ళిపోయింది.

# 3

యుగయుగాలనుండీ మానవులలో తేడాలు. ఆ తేడాలు తీసివేయాలని పెద్దల ప్రయత్నాలు. నీచస్థితిలోఉన్న మనుష్యులలోనే పైకి పోవాలన్న వాంఛ పరవళ్ళుతొక్కుతూ ఉంటుంది. పంజరంలోని పక్షి రెక్కలు టపటప కొట్టుకున్నా పైకి పోలేనట్లు ఆ నీచమానవులు వృధాగా ఇనుపగోడలు బద్ధలుకొట్టుకుందామని చూస్తారు.

ప్రపంచంలో ఏదోమూల అధమస్థితిలో ఉన్న మనుష్య జాతులు ఉండేవారు. ఈనాడు నీగ్రోలు, ఆస్ట్రేలియా, న్యూగినియా, న్యూజిలాండులలో అధమమానవుడు ప్రయత్నించి ఎక్కువగా నాగరికతగల జాతుల విశాలకరాళాలలో బోల్తాలై పడిపోయారు. ఎప్పుడూ ఒకజాతి విజృంభణ వేరొకజాతి నాశనానికే! అన్ని జాతులూ మహాసామరస్యంలో ఎప్పుడయినా పైకి రాలేవా?

ఈ ప్రశ్నవేసుకుంటూ ఆ నవంబరు రాత్రి వాన జోరుగా కురుస్తూండగా రియాసత్ ఆలీ తన ఇంటిముందు ఒక కారు ఆగడం గమనించాడు.

అతడేదో స్వప్నంలో పడిపోయినాడు. కారులు! అందరికీ కారులేవి? అందరికీ కారు లెప్పుడన్నా రాగలవా? జట్కాలే అందరికీ లేవు. ఒక మనుష్యుడు ఇంకొక మనుష్యుని బండి డబ్బుకోసం లాక్కుపోయే రోజులే ఎప్పుడూ ఉంటాయి. ఆ రిక్షాలలో అందరూ ఎక్కరు. ఆ రిక్షాలు అందరూ లాగలేరు. లోకంలో ఎప్పుడూ మనుష్యులను నడుపుకోవాలి. ఒక్క డ్రయివరు కొన్ని వందలమందిని రైలులో నడుపుకొని పోతున్నాడు. ఎడ్లబండయినా మనుష్యుడు తోలవలసిందే!

ఈలా రయిలు మొదలయిన బళ్ళను నడిపే మనుష్యుడు ఏదో మహా స్వప్నాన్ని అల్లుకుంటాడు. ఆ స్వప్నంలో ప్రగతి ఉందని స్వప్న ప్రారంభం జీవితంలోంచి, స్వప్న ప్రాంతం జీవితంలోకి నడక. ఈ స్వప్న రూపమయిన కారును నడిపే డ్రైవరెవడు? ఎవరికి వారే స్వప్న చోదకులయితే మనకు కావలసిన మధుర స్వప్నాలే మనం అల్లుకుంటూ ఉందుము.

వీధిలో కారు భోం భోం అంది. జోరున వానా, భోం భోం భోం అని ఆ కారుహోరను అంది.

ఎవరికోసమో ఆ కారు ఎప్పుడూ ఎవరికోసమో బండి వస్తూనే ఉంటుంది. ఎవరూ లేకుండా కారు వెళ్ళిపోయినట్లు జీవితం మనుష్యులు లేకుండా వెళ్ళిపోగలదా? రియాసత్ ఆలీ లేచి నుంచున్నాడు.

ఎదుట రియాసత్‌గారి భయ్యా నుంచొని, "సర్కార్! మీకోసం ఎవరో పెద్దలు వచ్చి మీ డ్రాయింగురూములో కూర్చున్నారు" అని విన్నవించుకొన్నాడు.

రియాసత్ విసుక్కుంటూ "కూర్చోపెట్టు, వస్తున్నాను" అని ఆజ్ఞ ఇచ్చి మళ్ళీ భంగమయిన స్వప్నాన్ని ఆహ్వానించుకొన్నాడు.

ఏ స్వప్నానికైనా ఆదిదేవత ఉండాలికదా అనుకున్నాడు. తనదేవి తనకు సాక్షాత్కరించిన కోనంగికి స్వప్న మధ్యస్థ ఎవరు ఇంక? అతనికి కలలుంటాయా? తన స్వప్నాధిదేవి ఇక తనకు కాదు. ఎప్పుడూ స్వప్నంలోనే ఉంటుంది. లైలా మజ్నూల గాథే తనగాథానూ, మజ్నూలానిరాశ పొందిన ప్రతి యువక ప్రేమికుడు ఎడారుల వెంట పోవాలి! ఈనాటి ఎడారులే మానవ ప్రయత్నాలా? అని అనుకున్నాడు రియాసత్.

ఎవరు ఈ వచ్చింది అని రియాసత్ లేచి, గబగబ అతిథిమందిరం లోనికిపోయి గుమ్మం దగ్గర నిలువబడి గదిలోనికి చూచాడు. అతడు తెల్లబోయినాడు. గొంతుకు డగ్గుత్తిక పడింది. అతని చేతులు వణికి పోయాయి.

మెహరున్నీసా ఒక కుర్చీలో కన్నులు మూసికొని తల వెనుకకు వాల్చి కూర్చొని ఉంది.

"మెహర్!"

మెహర్ కన్నులు తెరచి చిరునవ్వు నవ్వింది. వెన్నెలలు స్వప్నాలు రంగరింపయి పోయి సుడిగుండాలయినవి.

"మెహర్! నువ్వా?"

"ఔను నేనే! అనుమానమా? నేనో కాదో ఈలా వచ్చి ఈ చేతులు స్పృశించి చూచుకోరాదూ?"

"నువ్వు వట్టి కలవేమో?"

"కలలోని బాలిక మాత్రం స్వప్న సమాగమానికి రాకూడదా?"

"మెహర్! నన్ను క్షమించే వచ్చావా?"

"ఏమి ఇంచానో, రావడం మాత్రం వచ్చాను."

"కోనంగిరావులా మాట్లాడుతున్నావు."

"ఆయన మళ్ళీ జైలుకు వెళ్ళినాడుగా, అనంతలక్ష్మి చెప్పింది. అక్కడ నుంచే ఇక్కడకు వచ్చాను. అబ్బాజాన్ కారులో ఉన్నారు."

"మామూజాన్ వచ్చారా?"

"ముందర నాతో మాట్లాడకూడదా?"

"నేను నీతో యుగాలు మాట్లాడినా నాకు తృప్తి తీరుతుందా? మెహర్! ఎలా కలిగింది నీకీ పరమదయ?"

"నేను ప్రేమ మరచిపోగలనా డార్లింగ్!"

"డార్లింగ్! మెహర్ నన్ను క్షమించావు, కాని...."

"కానీలేదూ అర్ధణాలేదు. నీ భావాలు నీవి. నా భావాలు నావి. నేను ముస్లింలీగు దానినే. నీ రాజకీయాలు నీవి. కాని మన ప్రేమ కవి అంతరాయాలు కల్పించగలవా? అని నీవు నన్నడిగిన ప్రశ్న సమంజసమే! నీ ఆదేశమే నాకు పరమవాక్కు."

రియాసత్ సంతోషంతో వణికిపోయాడు. అతని కన్నుల నీరు తిరిగింది. ఆతడు చిరునవ్వుతో వచ్చి మెహర్ పాదాల దగ్గర మోకరించి సైగల్ గొంతుకవంటి గొంతుతో,

*"ఏకీ దునియా బసాలే, మేరే మన్ దునియా బసాలే*
*దూరకహీం జహాం కోయి ఆ నసకేగా*
*దరద్‌భరే గీతా కోయి గా నసకేగా*
*చుప్‌కేసే నైనన్‌మే సీత్ బులావే*
*మేరే మన్ దునియా బసాలే*
*ఛోటీసీ దునియా వో ఛోటీసీ బాతేం*
*ఛోటీసీ దిన్‌హెూం అవుర్ ఛోటిఛోటీ రాతేం*
*రాతోంకో సవనోసె ఖబ్ సజాలే*
*మేరే మన్ దునియా బసాలే*

*ఘర్ ఘర్ హోఁజాదూకే ఖేల్ నిరాలే*
*సాఫ్ చెలీ ఆయ్ జహాఁలూట్నేవాలే*
*ఓతుఝ్‌కో మనాలే తు అగర్ ముఝ్‌కో మనాలే*
*మేరే మన్ దునియా బసాలే"*

అని పాడుతూ ఆమెను కౌగలించుకొన్నాడు.

## 4

అనంతలక్ష్మికి లోన శిశువు నృత్యము చేయుచున్నాడు. పగడముల వలెనుండు ఆమె పెదవులు ముత్యముల రంగులను పులుముకొనుచున్నవి. దేహము కొంచెము నీరు పట్టినట్లున్నది. ఆయాసము, కదలక పండుకొనవలెనని కోరిక. కాని డాక్టరు రెడ్డి "ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూ ఉండు అనంతలక్ష్మీ!" అని ఆదేశమివ్వడంవల్ల నడక, చెట్లకు నీళ్ళు పోయడం మొదలగు పనులు చేస్తూ ఉండేది.

తన గురువు తన జీవితంలోకి ఎంత విచిత్రంగా వచ్చినారు! పూర్వజన్మలో తన తపస్సు ఎంత గొప్పది అయి ఉండాలి. లేకపోతే చీకటిలో వెన్నెలకిరణం ప్రవేశించినట్లు వారు తన జీవితంలో ఎందుకు ప్రవేశిస్తారు? ఆ వెన్నెలే తన జీవితంలో లేకపోతే, చెట్టియారనే చీకటి దయ్యం నోటిలో పడిపోయి ఉండును తాను.

తాను నేర్చుకొన్న సంగీతము, తనలోని మహత్తర గంధర్వకళ వారికి వినిపిస్తోంటే అలా ఒయ్యారంగా సోఫాలో పండుకొని తన్ను తన చూపులతో తన సంగీతము తన చెవులతో ఆస్వాదిస్తూ, దూరాన నుండి చూపులతో తన పెదవులను చుంబిస్తూ, ఊర్పులతో పైకి ఉబుకుతూ దిగుతూ ఉండు తన వక్షోజాలను చుంబిస్తూ, ఫిడేలు తీగలపై లతలపై ఊగులాడు పూవులవలె నున్నవని ఎన్నిసారులో పోల్చిన వేళ్ళను చుంబిస్తూ ఎదుట ప్రత్యక్షమై ఉండిన ఆ దివ్యపురుషుని తాను వినరాని మాట లంది.

ఎన్నిసారులో తనమీద తామే రచించిన గీతికలు చదువుతూ, తన్ను ఫిడేలుతో ప్రక్కవాద్యం వాయించమనేవారు. తమ పాటలకు నన్ను రాగమూ, తాళమూ, పాడే విధానం సంతరించు అనంతం అనేవారు. ఏమి అద్భుత కవిత్వం వారిది. వేళాకోళంగా ఉన్నట్లు యితరులకు ఉండేదేమో కాని, ఆ గీతాలు ఎంత మధురమయినవి! ఒకనాడు వారు

*"ప్రణయేశ్వరీ!*
*భర్తకు భార్యకు ప్రళయ మేమిటని*
*ధూర్తులు కొందరు అంటే అననీ;*
*తనదే అయినా తన హృదయముపై*
*తనకే ప్రేమా ఉండకపోదాఁ*

*ప్రేమనిధానము ఇల్లాలయితే*
*ప్రేమగౌరవము అడుగంటేనా?*
*ప్రేమించితినని ప్రియసుందరి నా*
*ప్రేమకు అవధే లేదు, ఆవరించినది.*

*సర్వలోకములు సర్వవిశ్వములు*
*ప్రేమదేవి నా మోక్షము సర్వము*
*ప్రేమదేవి నా చిట్టిభార్యయే!"*

అని పాడినారు. తానే వారి స్వప్నమట! తన్ను స్వప్నప్రియ అనిపిలుస్తూ తన చుబుకముపట్టి కళ్ళల్లోకి తేరిపార చూస్తూ "దేవీ! నీ నీలిపాపలలో ఎన్నో కలలు, కుసుమ వాటికలు నిర్మించుకొని వాసం చేస్తున్నాయి. ఆ స్వప్న కుసుమాలు ఒక మనోహరమాల నిర్మించి నా మెళ్ళోవేయవా?" అన్నారు.

వారి మధుర మందహాసాలో స్వప్నాలు యెలా స్వానందంచేస్తూ ఉంటాయి. ఆ స్వప్నాలు "నాకు వరమివ్వండీ!" అని తానొకనాడు అడిగితే "సరే, వరమిచ్చినాను. ఇవిగో" అంటూ తన పెదవులపై కొన్ని వందల ముద్దులు కురిపించినారు. ఎంత అల్లరివారు వారు.

లోకం అంతా ఒకటైన స్వప్నం. లోకంలో జాతి మత విభేదంలేని స్వప్నం. లోకంలో ఆస్తిపాస్తులు సమమయిన స్వప్నం. లోకంలో ద్వేషంలేని స్వప్నం. లోకంలో యుద్ధంలేని స్వప్నం తేడాలు ప్రకృతి సిద్ధమయినవేకాని, మానసిక సిద్ధమయినవి కాని స్వప్నం. ఈ స్వప్నాలు నిజమయే పవిత్రదినం త్వరగా వచ్చే స్వప్నం. అవి వారి స్వప్నాలట. ఆ స్వప్నాలు ముద్దులతో తనకు అర్పించినారట. అవి వారి పూజట. అవే కుసుమాలట. అక్షతలట. ఆరతి అట.

తాను వారూ కలసి, తమ చిన్నబిడ్డ ముందు నడవ ఈ జగత్తు అంతా తమ ఆశయమై ఆ మహోత్తమ స్థితికి ముందుకు సాగిపోవాలి. తనకూ వారికి ఉద్భవించిన బాలబాలికలు "జయ భారతమాతా, జయ లోకమాతా" అని ముందుకు సాగిపోవాలి. ఆ పోలీసువారి గదిలో తానూవారూ ఒంటరిగా ఉన్నప్పుడు వారు వేలూరు వెళ్ళక ముందు, వారు తన్ను హృదయానికి అదుముకొని, "నా హృదయేశ్వరీ! ఈ నీగర్భములో మన ఇరువురి చిన్నారి శిశువు ఉన్నది. నువ్వు ఎంత అదృష్టవంతురాలవు. నువ్వే ఆ శిశువును గర్భంలో నిన్నే ఆహారం అర్పించుకొంటూ పెంచుతావు. ఈవలకు వచ్చిన వెనుక నాకు ప్రియతమమయిన ఆ మేలిమి బంగారు కలశాలలోని స్వచ్ఛాంబువులు యిచ్చి పెంచుతావు. నేనేమి ఆ శిశువుకు ఈయగలను? ఆ శిశువుకు బలం నా ముద్దుల ద్వారా నీకు అర్పించుకోగలను" అని అంటూ పయ్యెద సవరించి, బాడీని తొలగించి, "బంగారు బంతులగు ఈ నీలిపిందెలు ఆ అమృతము ఆ శిశువునకు అర్పించడానికేనట!" అని అంటూ వాటిని కళ్ళతో తాగి చుంబించినారు. చీకటి రాత్రి జవరాలట, పతిని పొందిన యోష వెన్నెల రేయియట. గర్భవతి ప్రత్యూషమట. శిశువును ఒడిని తాల్చిన తల్లి హృదయమట.

తన గురువు అంశ తనలో ప్రత్యక్షమయింది. ఎంత విచిత్రసంఘటన. ప్రేయసి అంశ ప్రియునిలో ప్రత్యక్షమయ్యే దివ్యభాగ్యము పురుషులకు లేదట. పురుషులు దౌర్భాగ్యులట! అని అన్నారు.

తనలో లోకాలలోని తీపులన్నీ మూర్తించి ఇమిడిపోయినాయి. ఆ మధురాలు ధరించిన పాలసముద్రం తానట. అది మథించే సురాసురులూ తామేనట. అమృతము తల్లులూ బిడ్డలూనట. ఆయన అంతటితో వెళ్ళిపోయినారు. వెళ్ళలేక వెళ్ళినారు. ఆయన ఉత్తరాలా, కావ్యాలే అవి.

"ప్రపంచమందో మహాబాధ మన
విపంచి తీగెల మ్రోగుచున్నదే!
ప్రతి బాలికకూ బంగరు చీరలు
ప్రతి బాలునకూ బంగరు బాలిక
బాలబాలికల రాజ్యపాలనము
బాలబాలికల ప్రగతి ఖేలనము
వచ్చుచున్నదను విజయగీతమును
హెచ్చుస్థాయిలో ఎత్తే గొంతుక
ఎక్కడ ఎక్కడ అన్న కాంక్షలో
ప్రపంచమందో మహాబాధ మన
విపంచి తీగెల మ్రోగుచున్నదే!
ప్రతి వనితకు ఒక బంగరు కంచం
కంచం నిండా మధురాన్నములు
అన్నమునందే అమ్మల హృదయము
అన్నము పండే భూముల సేద్యము
సేద్యముచేసే వీరపురుషులట
పురుషులు స్త్రీలూ సమమై నడకలు
వచ్చుచున్నవను విజయగీతమును
హెచ్చుస్థాయిలో ఎత్తే గొంతుక
ఎక్కడ ఎక్కడ అన్న కాంక్షలో
ప్రపంచమందో మహాబాధ మన
విపంచి తీగెల మ్రోగుచున్నదే!
హెచ్చుతగ్గులకు మెచ్చని హృదయము
స్వచ్ఛమార్గముల గడిచేయానము
పురుషులు స్త్రీలకు ఒకటే ఒకటని
బీదల బాధలు బిచ్చమెత్తుటలు
నాదిది నీదిది యన్న వివాదలు
లేని యుగమ్మది అదిగో తూర్పున
వచ్చుచున్నదను విజయగీతమును
హెచ్చుస్థాయిలో ఎత్తే గొంతుక
ఎక్కడ ఎక్కడ అన్న కాంక్షలో
ప్రపంచమందో మహాబాధ మన
విపంచి తీగెల మ్రోగుచున్నదే!"

అని పాట చదువుతోంటే వారి కంఠమాధుర్యమే తన్ను చుట్టిపోగా "గురువుగారూ! మీరు ఉన్నది స్వప్నమా, మీరు వెళ్ళినది స్వప్నమా, ఈ నాగర్భస్థ శిశువు స్వప్నమా" అని ఆమె హృదయమున పల్లవి ఒకటి మారుమ్రోగింది.

## 5

డాక్టరు రెడ్డి కోనంగి వచ్చేటంతవరకూ వివాహం చేసుకోదలచుకోలేదు. కోనంగి తన వివాహానికి పెద్ద కాకపోతే తాను వివాహమే చేసుకోనంది చౌధురాణీ.

మధుసూదనుడు, సరోజిని, చౌధురాణీ, రియాసత్ ఆలీ అందరూ రాక్షసులవలె పనిచేస్తున్నారు. నవజ్యోతి అవిచ్ఛిన్నంగా మహావార్తయై దేశం అంతా ప్రసరించిపోతోంది. రియాసత్ ఏ పని తలపెట్టినా కాలమువలెనే పనిచేసుకుపోతాడు. మధురమయిన తెలుగు వ్రాస్తాడు. చాణక్యునిలా చూస్తాడు. చంద్రగుప్తునిలా విజృంభిస్తాడు. అక్బరులా ఆదరిస్తాడు. రియాసత్, మెహరున్నీసాల వివాహం నిశ్చయమయినందుకు నవజ్యోతి ఉప్పొంగి పోయింది. అందరూ అతన్ని ముబారక్ అన్నారు.

అనంతలక్ష్మి మెహరున్నీసా యింటికిపోయి, "ఓసి నూర్జహాన్, నీవు నీ బావను పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకున్నావు. నువ్వు అంతప్రేమతో నిండి ఎల్లా చేసుకొనను అనగలిగావు అసలు? విను నేను నా గురువుగారిని వివాహం కాకుండా ఏడాది ఉండేటప్పటికి నా తలప్రాణం తోకకు వచ్చింది. అమ్మో! ప్రేమించిన నాయకుని కౌగలింతలో కరిగిపోని స్త్రీ ఎంత దురదృష్టవంతురాలు?"

"ఓహో ఏమి లెక్చరు? అయితే ఎందుకే మీ ఆయన్ను అలా ఏడిపించావు! పెళ్ళయిన తర్వాత పేకబెత్తం ఒకటి తెప్పించి, మొగుణ్ణి రోజూ వీపు చితకకొడుతూ ఉండాలే!"

"ఛీ! ఛీ! నేను శుద్ధ తెలివితక్కువదాన్ని. ఒక వారంరోజులు బాధపడ్డా! ఇంక ఆయన్ను వదలి ఉండలిగేదాన్నా?"

"ఏం చేద్దువు?"

"వెళ్ళి ఆయన పాదాల వాలి–"

"ప్రాణేశ్వరా క్షమింపుము. నేను వట్టి డండర్‌హెడ్డును అందువుకాబోలు!"

"ఆ డండర్‌హెడ్డును, బ్లాక్‌హెడ్డును, వట్టి తలకాయను, బూడిద మెదడు గలదాన్ని అందును."

"అప్పుడు మీ ఆయన ఏమంటాడు–"

"ఈలారా–"

"ప్రాణేశ్వరీ, నా చిన్నారి చిలుకా–"

"ఊరుకుందూ మెహర్. నిన్ను కాబోయే మీ ఆయన నా బుల్ బుల్, నా రోజా, నా దిల్‌కుష్–"

ఇద్దరూ పకపక నవ్వుకున్నారు. మెహరున్నీసా "మీ ఆయన తిరిగి వచ్చిందాకా మేము వివాహం చేసుకోం. డాక్టరు రెడ్డీ, చౌధురాణీ అలాగే నిశ్చయించుకొన్నారటగా!" అంది.

"అవును!"

అనంతలక్ష్మి ఇంటికి వచ్చేసింది. ఆ సాయంకాలమే చౌధురాణీ అనంతం దగ్గరకు వచ్చి "చెల్లీ! నేను డాక్టర్ను చూడగానే నా స్వేచ్ఛను ఆవలుంచే మూర్తి ఇతడేనని అనుకున్నాను. ఆయన ఇదివరకు ఎవర్నీ ప్రేమించలేదట. కాని ఆయన తన దేహాన్ని పవిత్రంగా నా కోసం ఉంచాడని నేననను, ఆయనే కంటినీటితో నా కళ్ళ దగ్గర మోకరించి చెప్పాడు" అన్నది.

"అవును అక్కా!"

వీరిద్దరూ మొదటి వరసనే ఇప్పుడు పిలుచుకోడం మొదలు పెట్టినారు.

అనంతలక్ష్మి దగ్గర చౌధురాణి కూర్చుండి "చెల్లీ! నాకు చాల గర్వం ఉండేది. నా స్వప్న ప్రపంచంలో విహరిస్తూ నా నాయకుని నేను ఊహించుకొని ఎంతో ఆనందం పొందేదానిని. అనగనగా ఒక రాజకుమార్తె. ఆమె తన రాజకుమారునికయి ఎదురు చూసేది, అన్నట్లుగా నేనూ నా రాజకుమారునికై ఎదురు చూసేదాన్ని. ఆరోజులలో కోనంగి బావ నాకు రాజకొమరుడు. కాని అది ప్రేమచేత కాదు. నేను ప్రేమనే ప్రేమించాను. చెల్లెళ్ళు లేక, అమ్మ ప్రేమ ఎరుగక గాలికి బ్రతికిన కోనంగిబావ అంటే ఏదో కరుణ మా అందరి హృదయాలలో ఉండేది. మా మధు అన్న కోనంగిని బావా అని హృదయానికి అద్దుకునేవాడు. కోనంగిబావ నవ్వించని మనుష్యుడు ప్రపంచంలో లేడు. అంత గడుసరి ఇంకొకరు లేరు చెల్లీ! ఆయనకు తగిన రాకొమరితవు నువ్వు. నీకు తగిన రాకొమరుడు" అని అన్నది.

"అక్కా, నీ రాకొమరుడు ఈనాటికి దొరికాడే! డాక్టరుగారు ధర్మశీలి, మాట ఇస్తే ఆ మాట శిలాశాసనమే ఆయనకు!"

"అయితే ఏమి, ఆయన కమ్యూనిస్టు!"

"కమ్యూనిస్టు అయితే నీకు భయమా? ఇప్పుడే మెహర్ దగ్గర నుంచి వస్తున్నా! మెహర్‌కు కాంగ్రెసు ముస్లిం అంటే పట్టరాని కోపం. వాళ్ళను క్విసిలింగులంటుంది. ఫిఫ్తుకాలం వాళ్ళంటుంది. కాని అలాంటి కాంగ్రెసు ముస్లింనే ప్రేమించింది. ఆ ప్రేమకు తానే వ్యతిరేకించింది. దానితో పోరాడినది. చివరకు తెలివయినది గనుక ఆ ప్రేమకు లొంగిపోయింది."

"కమ్యూనిస్టు అంటే నాకున్న భయం కొంత విపులంగా చెపుతా! కమ్యూనిస్టులకు దేవుడు లేడు."

"అందరికీ ఉండడనా, రెడ్డిగారికి లేడనా?"

"అందరికీ లేడనే!"

"ఓసి వెర్రిఅక్కా! స్టాలిన్ తల్లి బ్రతికి ఉన్నంతకాలం భగవంతుని ప్రార్థించేది. మన ప్రాపంచిక జీవితంలో భగవంతుణ్ణి ప్రవేశపెట్టి, మనుష్యుని పురోభివృద్ధికి అడ్డం పెట్టుకోవడం పనికిరాదన్నారు. భగవంతుని భావం "చర్చియానిటీ" కారా దన్నారు. చర్చీ. ఫ్యూడలిజం వాని వాని కాలములలో మంచివే. కాని ఈ కాలంలో అవి నిరోధక శక్తులన్నారు. నీ భగవంతుడు నీ పురోభివృద్ధికి ఎందుకు అడ్డం రావాలి?"

"రష్యాలో వివాహాలే లేవటకదా?"

"అదేమి భావమే! ఎవరన్నారు ఈ పిచ్చిమాటలు? అన్ని దేశాలవలెనే అక్కడా వివాహం ఉంది. అన్ని దేశాల వలెనే అక్కడా విడాకులున్నాయి. కాని వివాహమంటే ఎంతో జాగ్రత్తగా ఆలోచింపవలసిన సంస్థగా చేశారు. వివాహం లేకుండా స్త్రీ పురుషులు కామసంబంధం కలగించు కోకుండా చాలా కష్టపడతారు. స్టాలిన్ ప్రథమభార్యను ఎంతో ప్రేమించాడు. ఆయన సైబీరియాలో నిర్బంధితుడై ఉండగా ఆవిడ చచ్చిపోయింది. తర్వాత మళ్ళీ పెళ్ళిచేసుకొన్నాడు. నాడియా ఆయనకు ఆశయభూమి అయినది, కుటుంబం, సంసారం, భార్యా బిడ్డలూ అంటే రష్యనుల కెంతప్రేమ అనుకున్నావు?"

"ఇదంతా ఎక్కడ నేర్చుకున్నావు అనంతం?"

"నేనూ మా గురువుగారూ కలిసి ఎన్నో పుస్తకాలు చదివినాము."

"వారి విడాకులు?"

"అమెరికాలోవలె అతిసులభమనుకున్నావా రష్యాలో? విడాకులు పుచ్చుకుని ఇంకో భార్యనో, భార్యభర్తనో చేసుకోవడంకన్న ఉన్నవారితో జీవించడమే మహోత్తమం అన్నంత చేశారు. కాబట్టే విడాకులు ఉండటమే లేదు రష్యాలో! అంతగా విడాకులు కావాలన్నవారికి ఎన్ని అడ్డంకులు వచ్చినా భయంలేదు."

చౌధురాణీ ఆలోచనాధీనయై అయిదు నిమిషాలు అలాగే కూచుంది. "అయితే మనదేశంలో కమ్యూనిస్టులంటే అంత చెడుపేరు వచ్చిందేమిటి?" అని ఆమె ప్రశ్నించింది.

## (6)

రెడ్డీ చౌధురాణీ కలిసి సినీమాలకు, వాహ్యాళులకు వెళ్ళుతున్నారు. అలా ఇద్దరే వెళ్ళడం సాగించిన మొదటి దినాలలో ఏవేవో విషయాలు మాట్లాడడమేగాని ఒక ప్రేమ సంభాషణ వచ్చేదిగాదు. "డాక్టరుగారూ!" అని చౌధురాణి పిలిస్తే "చౌధురాణిగారూ!" అని డాక్టరు రెడ్డి పిలిచేవాడు. రష్యా సంగతులు, యుద్ధం, వ్యాపారాలు, భారతదేశంలో కాంగ్రెసు, ముస్లింలీగు, కమ్యూనిస్టులపక్షాల విషయం, వాని భవిష్యత్తులు, ఇవన్నీ కలసి పనిచేసే సావకాశాలు మొదలయినవి మాట్టాడేవారు.

కాంగ్రెసు ఉపనాయకులు, అరుణ అసఫాలీ, పట్వర్థన్ మొదలయిన వారి దాగుడుమూతలు, బోసు, అజాద్, హిందూసేన మొదలయిన విషయాలన్నీ చర్చకు వచ్చేవి.

ఒకరోజు సాయంకాలం వారిద్దరూ మోటారులమీద చెంగల్పట్టు, కంచి వెళ్ళడం సంకల్పించుకొన్నారు. బయలుదేరినారు. కంచిలో శిల్పం చూడాలని చౌధురాణి సంకల్పింది. ఏవేవో మాటామంతి ఔతున్నాది. చౌధురాణి శిల్పకళను గూర్చీ, చిత్రకళను గూర్చి బాగా చదువుకుంది. బందరు జాతీయ కళాశాల వాతావరణంలోకి పోయి చిత్రలేఖనం నేర్చుకుంది. కళను గూర్చి తన అభిప్రాయాలు రెడ్డితో చెప్పడం సాగించింది.

ఇద్దరూ ఒకరిదగ్గరకు ఒకరు చేరుదామనుకుంటున్నారు. కాని జరగలేదు. ప్రేమవాక్యాలతో చౌధురాణీని ముంచెత్తుదామని రెడ్డి ఉవ్విళ్ళూరుతాడు. ఏమి మాట్లాడాలో తెలియదు. కోనంగే అయితే ఈపాటికి మూడు ప్రణయకావ్యాలు వ్రాసి ఉండును. ఇంటి దగ్గర రోజూ ఎలా ప్రారంభించాలో అవన్నీ ఊహించుకుంటాడు రెడ్డి. అమ్మాయి దగ్గరకు వచ్చేసరికి అబ్బాయి పని నత్తిరావడంవరకు వస్తుంది.

చౌధురాణీ డాక్టరు ఎప్పుడు ప్రణయ సంభాషణ ప్రారంభిస్తాడా అని ఎదురు చూస్తూంది. ఒక్కసారయినా తన్ను గాఢంగా హృదయానికి అదుముకుంటాడా? నిజంగా ఆయన తన్ను ప్రేమిస్తున్నాడా, లేక ప్రేమిస్తున్నానని అనుకున్నాడా అని ప్రశ్నించుకొంది.

ఆ వనితను ప్రేమిస్తూ, ఆమెతో ప్రేమ సంభాషణ ప్రారంభించవలసింది పురుషుడుగాని, పురుషునితో స్త్రీ ఎల్లా సంభాషణ ప్రారంభిస్తుంది. ఇవి అనుకుంటూ ఏమీ మాట్లాడకపోతే ఎట్లా అని ఇద్దరూ ఏవేవో పిచ్చి సంభాషణలు ప్రారంభిస్తారు. ఆ సంభాషణలోంచి తప్పుకోలేరు.

రెడ్డిగారి కిష్టమయిన విషయమని వైద్యాన్నిగూర్చి చౌధురాణి సంభాషణ ప్రారంభిస్తే, చౌధురాణి కిష్టమైన విషయమని రెడ్డి చిత్రలేఖనాన్ని ప్రారంభిస్తాడు. చౌధురాణి కమ్యూనిజాన్ని గురించి మాట్లాడడం ప్రారంభించేది.

ఆ సంభాషణ అంతంత మాత్రంగనే సాగేది. హృదయంలో సంభాషించదలచుకొన్న విషయం వేరు, పైకి వచ్చే సంభాషణ వేరు. హిమాలయాలలో ధాన్యం పండదు. కుంకుమపువ్వు ఆంధ్రదేశంలో పండదు.

కంచి చేరారు. వరదరాజ స్వామిదేవాలయం చూచినారు. ఏకాంబరేశ్వరుని దేవాలయం చూశారు. కంచికామాక్షీ ఆలయం దర్శించినారు.

సాయంకాలం వారు ఒక బంగాళాలో మకాం పెట్టినారు. బంగళా బంట్రోతుచేత పడకకుర్చీలు పైన వేయించినాడు డాక్టరు ఎన్నో పువ్వులు కొన్నాడు. రెడ్డి వంటవాడు శాకాహారమైన అందాల వంటకా లెన్నో చేసినాడు. వెన్నెల కాస్తూ ఉంది.

భోజనాలు చేసి పడక కుర్చీలలో కూర్చొని ఏ విషయం చేతికందితే ఆ విషయాన్ని గూర్చి మాట్లాడుకొంటూ నిశ్శబ్దం వహించారు. ఇద్దరూ స్వప్నాలపాలయ్యారు. ఒకరి స్వప్నానికి రెండోవారు స్వప్నమధ్యస్థులయ్యారు.

డాక్టరు రెడ్డి తరపున కోనంగి చౌధురాణిని ఆడగడం, ఆమె రెడ్డిగార్ని వివాహ మాడడానికి ఒప్పుకోడం, ఆ విషయం ఉత్తరం ద్వారా రెడ్డికి తెలియజేసి కోనంగిరావు తాను అరెస్టు అవడం, ఇవీ డాక్టరు రెడ్డికి చౌధురాణికీ జరిగిన ప్రణయ కార్యకలాపం.

ఆ తర్వాత ఇద్దరూ ప్రణయ వాక్యాలు తప్ప ఏవైనా మాట్లాడుకొనే వారు. ఆ మాటలు ఏ ధ్వని సూత్రాల ప్రకారం చూచినా ప్రణయాన్ని స్ఫురింపజేయలేవు.

చౌధురాణి తన రాజకుమారుడయిన రెడ్డి మదరాసులో ఉంటాడని అనుకోలేదు. రెడ్డిని చూడగానే మొదట చౌధురాణికి చాలా కోపంగా ఉండేది. ఆ కోపానికి కారణం రెడ్డిగారు వచ్చి ఆమె హృదయంలో తిష్టవేసి కూచోడమే.

ఒకరోజు ఆమె ఉదయం తలుపులు తీసిలోనికి వెళ్ళేసరికి అక్కడ నవ్వుతూ భక్తునిలా రెడ్డిగారు కూర్చుని ఉన్నాడు. ఆమె తెల్లబోయింది. ఆమెకు కోపం వచ్చింది. ఎవరైనా సరే పెద్దమనిషి అయినా ఇంటియజమాని నడగక వచ్చి కూర్చుంటారూ? పోనీ ఆ కూర్చోడం ఏ ముందర హాలులోనో అధివసిస్తే అంతకోపం రాదు. మనకు అత్యంత ఇష్టమైన మనకోసమే కేటాయింపయిన గదిలోకి వెళ్ళడమే!

"అదోయి నువ్వు చేసినపని, చౌధురాణి మొదటే నిన్ను ప్రేమించింది. ఆమె ప్రేమంటే ఆమెగారే సిగ్గుపడింది, కొంచెము నువ్వు ప్రేమికుడవు. అంత సిగ్గుపడడానికి చిన్న కుర్రవాడవా నువ్వు?" ఈలా వ్రాశాడు కోనంగి జైలు నుంచి. చౌధురాణి ఆ పేరులో ఉంది మాధుర్యం. స్టాలిన్ భార్యనాడియా, తన భార్య "చౌధు." ప్రపంచంలో అందమైన వాళ్ళందరూ రష్యాలోనే ఉంటారు అని అనుకునేవాడు రెడ్డి కాని భారతదేశంలో సోవియటు దేశ నారీమణులకు పాఠాలు నేర్పే అందకత్తియలున్నారు. అందులో ఆంధ్రయువతులు పురుషుల హృదయాలను మాలలు మాలలుగా గుచ్చుకొనడానికైనా లెక్కచేయని అందకత్తెలు. వారందరిలో రాణీ చౌధురాణీ!

అయితే ఇండియా కమ్యూనిస్టుదేశం అయితే ఈ రాణీలు? అందాల రాణులు అప్పుడు అందాల కామ్రేడులవుతారు.

డాక్టరు రెడ్డి ఎంత చక్కని హృదయం కలవాడు. కమ్యూనిస్టులు ఖసఖసలాడే విషప్పుచ్చెలనుకొనేది. కాని గాంధీమహాత్ముని తమ్ములని తనకేం తెలుసును? ఒకసారయినా కోపం వస్తే చూద్దాం అనుకొంది. కాని ఆయన ఒక్క విషయంలో నయినా ఖారంగా మాటాడందే!

ఈతడు తన రాజకుమారుడు. తానాతనికి రాజకొమారి. తానూ డాక్టరు విద్య చదవడంకన్న డాక్టర్ని హృదయాన ధరించుకుంటూ, ఆయన మెట్టు ఎక్కుతూ తన్ను చేయిపట్టుకొని నడిపించుకుని పోతూవుంటే తాను ఆయనకు స్నేహితురాలై అనుప్రియురాలై ఆయనకు బాసటయై నడుస్తుందిగాక!

చటుక్కున చౌధురాణీ రెడ్డి వైపునకు తిరిగి "నాకు నర్సింగు నేర్పుతారా?"

రెడ్డి ఉలిక్కిపడి లేచి వెన్నెలలో చంద్రబింబములా వెలిగిపోయే ఆమె మోము చూచి ఆశ్చర్యంతో, ఆనందంతో లేచి ఆమె కుర్చీకడకు వచ్చి ఆమె కుర్చీమీదకు వాలి, "రాణీ! నీకు నేనేమి నేర్పగలను? నువ్వే నాకు ఎన్నో నేర్పాలి!" అన్నాడు.

"నేనేం నేర్పగలను? ఈలా రండి. (ఆ పడకకుర్చీ చేయిచూపించి) ఇక్కడ కూర్చొని జవాబు చెప్పండి."

రెడ్డి గుండె కలకత్తా మెయిలుబండిలా పరుగెత్తుతూ ఉంటే, ఆ పేము కుర్చీలోనే ఆమెను జరిపి ఆమె పక్కనే జేరుతూ "నువ్వు నేర్పలేని దేమున్నది?" అని అంటూ ఆమె నడుంచుట్టూ చేయిపోనిచ్చాడు. ఆమె కరిగిపోయి, అతని ఒడిలో ఒదిగింది. అతడు ఆమె కళ్ళల్లోకి తేరపార చూస్తూ, ఆ బాలికను రివ్వున ఎత్తి తన ఒళ్లో కూర్చోబెట్టుకున్నాడు.

చౌధురాణీ రెడ్డి మెడచుట్టూ చేతులు చుట్టి "డాక్టరుగారూ!" అన్నది.

"చౌధు!" అంటూ రెడ్డి ఆమె పెదవుల్ని చుంబించాడు.

వారిద్దరి మధ్యా సిగ్గుతెరలు జలజలారాలి క్రిందకు కూలిపోయినాయి. రెడ్డి చౌధురాణీని కోయంబత్తూరు కృష్ణయ్యరు హల్వాను ఆస్వాదించినట్టు ఆస్వాదించాడు.

## 7

**1**943 మార్చి నెలాఖరున కోనంగిరావుకు అనంతలక్ష్మి గర్భశుక్తి ముక్తాఫలమై పురుషశిశువు జన్మించాడు. పురుడు వచ్చేరోజులని కోనంగికి ఉత్తరం వచ్చినప్పుడు అతడు పడిన ఆవేదన ఇంతింతనికాదు.

ఆరోజునుండి వరుసగా నాలుగురోజులు రాత్రుళ్ళు నిద్దర పట్టక తన జైలుకొట్టులో మతిలేనివానిలా తిరిగేవాడు. పగలు ఏమీ తోచేదికాదు. "పరమాత్మ! నా అనంతాన్ని రక్షించు! కాబోయే శిశువును రక్షించు తండ్రీ" అని నిరంతరము ప్రార్థన చేసేవాడు. ఇంతలో "పుత్రుడు పుట్టినాడు, తల్లి, పిల్లవాడు క్షేమంగా ఉన్నారు. ఏమీ ఆదుర్దా పడవద్దు-రెడ్డి" అన్న తంతివార్త వచ్చిన తరువాత కోనంగికి ఆనందంచేత కళ్ళలో నీరు తిరిగినవి.

ఆ దినమున జైలు అధికారి ఉత్తరువుకొని, జైలులో అందరికి మిఠాయిలు పంచిపెట్టినాడు కోనంగి.

ఆ మర్నాడు ఉత్తరం వచ్చింది సరోజిని నుంచి "అన్నయ్యా! నీ కొడుకు బంగారుముద్ద! ఎంత ఒత్తుగా నల్లగా వుంది జుట్టు! ఆచ్చంగా నీ పోలికే. కళ్ళుమాత్రం తల్లివిసుమా, ఎంతో ఆకలివేసిన వానిలా తల్లి పాలుపుణుక్కుంటున్నాడు. కెవ్వు కెవ్వున ఇల్లంతా ఎగరగొద్తాడు ఆకలివేస్తే. నువ్వు వచ్చిందాకా నామకరణం, బారసాల ఆపుతాము.

అనంతం వదిన ఆరోగ్యంగా వుంది. మరేమీ కంగారులు రాలేదు. మొదటి పురుడయినా ఎంత సులభంగా నీళ్ళాడింది! మొదటిరోజునే లేచి కూర్చుంది. బిడ్డను అందించాము. తన బిడ్డను తాను ఎత్తుకొనడానికి సిగ్గు పడింది. పక్కలో పడుకోబెట్టాము. అలా ఇద్దరూ పడుకొంటే ఎంత అందంగా ఉంది ఆ దృశ్యం!

"అన్నా! మామూలు దక్షిణాది వారివిగాని, మనవిగాని పిచ్చి ఆచారాలు ఏమీలేకుండా డాక్టరు రెడ్డిగారు పురుడుపోశారు. రెడ్డి అన్నగారే మొదటి నుంచి ఎంత జాగ్రత్తగా ఉన్నారనుకున్నావు!

"ఇంక చౌధు తానే నర్సయింది. నర్సింగు పనిని కాబోయే భర్త దగ్గరే నేర్చుకుంటున్నది.

"ఇంక చౌధురాణీగారి విషయం! రెడ్డీ, రాణీ ఇద్దరూ మామూలుగా వుండేవారు. ప్రేమికులులా కనబడేవారుకాదు. కాని ఇద్దరూ అతి దగ్గరగా వచ్చేవారు. నువ్వు వచ్చిందాకా పెళ్ళిచేసుకోమని అన్నారని అనంతం వదిన తన ఉత్తరాలలో ఇదివరకే వ్రాసి ఉంటుంది.

"నీ కొడుకు రౌడీ అవుతాడులే! అంత పెద్దకళ్ళయినా బుగ్గలు మింగేస్తున్నాయి. ఆ కళ్ళను నా వైపు త్రిప్పి గుప్పిళ్ళు ముడుచుకొని చూస్తూ ఉంటే "మానాన్న ఏడీ?" అని ప్రశ్నించుచున్నట్లుగా కనబడతాడు. కాళ్ళు, చేతులు తెగఎగరవేస్తాడు. సంగీతం కూడా పాడతాడయ్యా!

"చౌధురాణీ వాడిమీద జోలపాటలు వ్రాయాలంటుంది. కమల నయన "ఓయి కుర్రవాడా నువ్వు త్వరగా వెళ్ళి మీ నాన్నను జైలు నుంచి కొట్టుకు రారా!" అంటుంది. నిద్దల్లో అలా నవ్వుతాడే! ఈ రెండోరోజునే అందరూ క్షేమం. అనంతం నిన్ను మరీమరీ అడగమంది. ఓపిక రాగానే తానే ఉత్తరం వ్రాస్తుందట.

"ఇంక మీ అత్తగారి ఆనందం చెప్పడానికి వీలులేదు. కళ్ళు తన భర్తకళ్ళేనట. తన భర్త పేరుతోనే పిలుస్తున్నది. 'రంగా' అంటుంది. ఆ పేరు వింది చౌధు. ఈ రాత్రే తానో పాట పాడింది.

*'రంగరంగా కావేటి రంగరంగా*
*కస్తూరి రంగరంగా*
*ఏలోకమున నుంటివీ నా తండ్రి*
*ఈ లోక మెట్లున్నదీ ఓ తండ్రి*
*నీ లీలలను చూపరా-చిన్నయ్య*
*మాలోన ఒకటవ్వరా!'*

అన్నది. అందరికీ ఎంత ఆనందమయినదనుకున్నావు?"-నీ చెల్లి సరోజ.

ఈ ఉత్తరం చూచుకొన్నాడు, తన బాలుని రూపం ఊహించుకొన్నాడు. తన భార్య అనంతం బాలుణ్ణి అందిస్తూ ఉంటే తాను చూడడం కలలు కన్నాడు. తాను కుమారుని ఎత్తుకొని ఆడించడం ఊహించుకొన్నాడు.

ఆ చిట్టితండ్రి తన్ను 'నానా!' అని పిలుస్తాడా, 'బాబా!' అని అంటాడా, 'అప్పా!' అని సంబోధిస్తాడా? 'డాడీ' అంటాడా? ఏమని పిలుస్తే బాగుంటుంది?

ఎప్పుడు తనకీ జైలు నుండి విముక్తి?

వేలూరు జైలు తనకి దుర్భరమే ఔతున్నది. ఆంధ్రులు పదిమంది ఒకచోటకూడి ఉండలేరు. ఒకరిని చూస్తే ఒకరికి పడదు. నాయకులంటే చిన్నవారికి గౌరవం ఉండదు, అందరూ నాయకులే! బ్రాహ్మణులను బ్రాహ్మణేతరులు ద్వేషించడం, ఎవరో కొద్దిమంది తప్ప తక్కినవారు ఎప్పుడూ పెద్దలంటే రుసరుస లాడుతూ ఉండడం.

"ఈ చిన్న చిన్న కుట్రలు చూస్తే దోమల బాధ జ్ఞాపకం వస్తుంది నాకు!" అని కోనంగి ఒకనాడు గుంటూరుజిల్లా నాయకుడయిన డాక్టరు చలపతిరావుగారితో అన్నాడు.

డాక్టరు చలపతిరావుగారు; దోమలు మలేరియా తెస్తాయి. మన వాళ్ళు దేశం అంతా అల్లరి చేస్తారు.

**కోనంగి:** దేశం అంతాటయేరియా తెస్తారండీ!

ఇంకో గుంటూరుజిల్లా నాయకుడు రామకోటేశ్వరరావుగారు 'అది కాదండీ, వీళ్ళ గడబిడవల్ల డయేరియా వస్తుంది దేశమాతకే!' అన్నారు.

కోనంగి జైలులో నాయకులందరితో చనువుగా వుంటాడు. 'స్వరాజ్య సంపాదన మహాయజ్ఞానికి ఒకడే యజమాని, తక్కినవారు అనుయాయులు. ఈ మహాయజ్ఞం ఇంతకాలం పడుతుంది అని కాలం పంచాంగములో వ్రాయబడి ఉంది. గాంధీజీ మహాధార్మికులు. అలాంటి సమయంలో ముసలి నాయకత్వం మాకు పనికిరాదనడం ఏం మంచిదండీ?' అని చలపతిరావుగారితో అన్నాడు.

"మీరు అన్నమాట నిజం కోనంగిరావుగారు! కాని యువకులు ముందుకు వస్తున్నారు, ప్రతి సంవత్సరం ఒక కొత్త జట్టు వస్తూందన్న మాటేగా! వారు మన జాతీయత్వంతోపాటు, ప్రపంచ రాజకీయవాతావరణాలు చూస్తున్నారు. వారు మాకుమల్లే గాంధీజీ నాయకత్వంలో పెరగలేదు? వాళ్ళు జాతీయోద్యమంలో ప్రవేశించిన ప్రథమంలో ఉన్నతస్థితిని నిరసిస్తారు. ఆ తర్వాత కొంచెంకొంచెంగా గాంధీజీ వాదన అర్థమౌతుంది. అప్పుడు జాతీయ మహాశ్రుతికి వారి గొంతుక సమన్వయం చేస్తారు" అన్నారు చలపతిరావుగారు.

కోనంగి వేళాకోళాలవల్ల ఎన్నిసారులో ఎందరి తగాదాలో పరిష్కారం అయ్యేవి.

"అదేమటండీ చాల ఘాటుగా వాదించుకొంటున్నారు?" అని కోనంగి ఒక జిల్లా తగాదా గొడవ దగ్గరకు వెడుతూనే అన్నాడు.

**ఒకరు:** (గుంటూరువారు) ఏమండీ కోనంగిరావుగారు! మీరు మద్రాసువాళ్ళు కనక మధ్యవర్తిత్వం చేయవచ్చును. బందరు బడాయి, గుంటూరు లడాయి అన్నమాట నిజమా, కాదా?

**కోనంగి:** బందరు అంటే కోతి.

**రెండవవారు:** (కృష్ణాజిల్లావారు కోపంతో) కోనంగి అన్నా కోతి అని అర్థం ఉంది.

**కోనంగి:** ఔనండీ, ఉండదూ మరి, నేనూ బందరువాణ్ణే.

**రెండో:** అయితే మీ మధ్యవర్తిత్వం ఎలా పనికి వస్తుంది?

**కోనంగి:** మీది దిట్టమయిన "లా పాయింటే" అయినా నేను కృష్ణాజిల్లావాణ్ణి అయికూడా అలా చెప్తున్నానంటే, ఎంత పెద్దమనిషినో ఆలోచించండి.

**మొదటి:** తర్వాతనండీ కోనంగిరావుగారూ?

**కోనంగి:** గుంటూరు అంటే, వట్టి గోతులున్న ఊరు అని. వట్టి గోతుల ఊరు అని ఎందుకన్నారంటే నీరుంటే నూయి, లేకపోతే గోయి అన్న మాటేగా! గుంటూరు గుంటల ఊరు; లడాయివల్లనే గుంటలు ఏర్పడినాయి. బడాయిల వేడివల్ల నీరు ఎండిపోయింది.
**మొదటి:** యేమి తీర్పయ్యా నీది! మమ్మల్ని యెద్దేవా చేస్తున్నావా? మెచ్చుకుంటున్నావా?

## (8)

1943 జూన్ నెలలో కోనంగిరావుగారు విడుదలై చక్కా వచ్చారు. కమ్యూనిస్టు డాక్టరు రెడ్డి, బోసుపక్షీయుడు మధుసూదన్, జాతీయ ముస్లింరియాసత్ ఆలీ, ముస్లింలీగు "అన్సా" మెహరున్నీసాయు, ఆమె తండ్రియు. కాంగ్రెసుపక్షం అనంతలక్ష్మి, కోనంగి కుమారుడు శ్రీ రంగారావు (ఈ పేరు కోనంగి పెట్టవలసిఉంది కానీ అందరూ ఆ బంగారు పాపాయిని ఆ పేరుతోనే పిలుస్తున్నారు) భక్తిపక్షం జయలక్ష్మి, జస్టిసుపక్షం అంబుజం, ప్రజాపక్షం వినాయగంపిళ్ళే, ఆతని స్నేహితుడూ, ఆనందం నాయుడు, సినీమాతారలు ఎంతమందో స్టేషను దగ్గర కోనంగికి స్వాగతం ఇచ్చారు.

మెహర్ పరదా తీసివేసింది. అనంతం ప్రక్కనే నిలుచుంది. ఆమె తండ్రి కోనంగిరావును కౌగలించుకొన్నాడు. "కోనంగిరావుగారూ, మీరూ మేమూ రెండు పక్షాల వాళ్ళం అయినా మన ప్రేమలకు ఏమీ అడ్డం ఉండదు. పాకిస్తాన్ గొడవ మీకు వద్దు. అఖండ హిందూస్తాన్ గొడవ నాకు వద్దు. మనం స్నేహితులం, చుట్టాలం" అన్నాడు.

కోనంగి వంగి ఆయన పాదాలకు నమస్కరించాడు. అతడు మెహరున్నీసా కడకు వెళ్ళి "చెల్లీ! మాబావ నీ మనస్సును ఇంత కష్టపెట్టినాడు. ఆతని ముక్కులాగేస్తాను" అన్నాడు.

**రియాసత్:** "నా ముక్కు నువ్వు లాగే అవసరం యెప్పుడూ కలుగదుగాని, నాకు నీ చెవులు పట్టి జాడించవలసిన అవసరము వచ్చింది."
**మధుసూదన్:** ఎందుకురియా?
**రియా:** ఎందుకా? తర్వాత చెప్తాను.

కోనంగి కొడుకును ఎత్తుకున్నాడు. "మూడునెలల పసికూన అయినా తండ్రిని ఆనవాలు పట్టాడండో!" అంది చౌధురాణీ.

**సరోజ:** వాడెవరురా, నీ కొడుకుకాడూ! నీ తెలివి తేటలే!
**కమలనయన:** మా తెలివి తేటలూ, మేనత్తల అందమూ వదినా!

అనంతం భర్త పిల్లవాణ్ణి పడవేస్తాడేమోనని హడలిపోతూ ఉంది. ఆ బాబిగాడు వెన్న బంగారాల తొనలు తిరిగిన చిట్టితండ్రిని కోనంగి భార్యచేతికి అందించాడు. అనంతలక్ష్మి ముక్కుపుటముననున్న రవలబేసరులతో, చెవుల తమ్మెలనున్న రవలకమ్మలలోని వెలుగులకన్న ఎక్కువ కాంతితో కన్నులు మెరిసిపోయినవి.

అతని చేయి ఆమె దేహానికీ, ఆమె చేయి అతని దేహానికీ, ఇరువురి శరీరాలకు ఆ చిట్టిబాబు దేహము తగిలి అత్యంత పవిత్ర మధురాలు వారి ముప్పురిలో ప్రసరించి పోయినవి. ఈ విషయంలోని పరమార్థం గ్రహించిన వానిలా ఆ చిట్టిబాబు బోసినవ్వుల చిరునవ్వులు నవ్వినాడు.

కోనంగి "అరే నవ్వుతున్నాడే!" అన్నాడు. అనంతలక్ష్మి "బాబాయి నిద్దట్లో నవ్వుతాడండీ!" అన్నది. జయలక్ష్మి కోనంగి తనకు వంగి నమస్కారం చేయగా తనచేయి

ఆతని తలపై వేసి "నాయనా, ఈ తొమ్మిది నెలలు నీకోసం బెంగలు పెట్టుకున్నాం. నిన్నా మొన్నా అమ్మిణికి నిద్రలేదు" అన్నది.

కోనంగి పకపక నవ్వి "రండి వెడదాము" అన్నాడు. కోనంగీ, అనంతం, చిట్టిబాబూ ఒక కారులో కూర్చున్నారు. అనంతం కళ్ళనీరు తిరుగగా "గురువుగారూ, నన్ను క్షమించారా?" అని దీనవదనంతో అడిగింది.

"ఓసి నా ఆత్మమధ్యనా! నువ్వే నేను, నేనే నువ్వు. నీపై నాకు ప్రపంచం అంతా అణువుల క్రింద మారినా నీమీద కోపం వస్తుందా అనూ! నా అనూ! నా దివ్యబాలికా!"

"ఎంత అందంగా ఉన్నావు. రయిలు దగ్గర నిన్ను ఎత్తివేసి హృదయానికి గాఢంగా అదుముకుని, నీ ఆ తీయతీయని పెదవులు పీల్చివేద్దామనుకున్నాను అనంతం! ఇంటికి పద. నాన్నతోపాటు (నాన్న అని కొడుకు ననడం సులభంగా వచ్చేసింది కోనంగికి) నిన్ను నలిపివేస్తాను. ప్రేమ ఆకలి అంత ఎక్కువగా ఉంది!"

"అన్న ఆనందం బండి నడుపుతున్న సంగతి మరువకండి!"

"వింటే విననీ!"

అతడు కారులోనే భార్యను కొడుకు ఒళ్ళో ఉండగా కూడా, తన ఒళ్ళోకి తీసుకుని, ఆమె మోము తనవైపు త్రిప్పి "నా అనంతం! నా అనంత! నా ప్రేమ దేవీ! నా అదృష్టమూర్తీ! నిన్ను విడిచి తొమ్మిది మహాయుగాలు వేలూరు జయిలులో ఎల్లా గడిపానో!" అని అంటూ ఆమె పెదవుల ముద్దు పెట్టుకున్నాడు. "నాన్నా, ఔనా కాదా? నా కన్నగా!" అని వాడి చిట్టినోరుపై ముద్దు పెట్టాడు.

ఇంటికి రాగానే జయలక్ష్మి అతనికి దిష్టితీసింది. మనుమనికీ కొమరితకూ కూడా దిష్టితీసింది.

ఆరోజు అందరూ జయలక్ష్మిగారి యింటిలో భోజనాలుచేసి ఆనందంగా కబుర్లు చెప్పుకుంటూ ముందు వరండాలో కూర్చున్నారు. ఆడవారంతా లోపల హాలులో కూర్చున్నారు.

మన చెట్టిగారి కారు వీధిలో ఇటూ అటూ తచ్చాడింది. ఒకసారిలజ్జు వరకూ పోయి తిరిగి వస్తూ ఉంటే చెట్టిగారిపై పత్రికా బ్లిట్జు జరిపే ఆ అరవపెద్ద మనిషి జయలక్ష్మి ఇంటి దగ్గరనే నడిచిపోతూ కనబడ్డాడు చెట్టిగారికి. అసలే కోనంగి రావడం, ఆతడు భార్యతో, కొమరునితో ఆనందంగా యింటికి పోవటం; వారంతా సంతోషంగా కబుర్లు చెప్పుకోవడం చూచి చెట్టిగారు మండిపోతున్నాడు.

ఎగ్మూరు రయిలుస్టేషను దగ్గరకు ఈ దృశ్యం చూదామనే చేరాడు. ఆ దృశ్యం చూడగానే చెట్టిగారు కుంగిపోయాడు, కుళ్ళిపోయాడు, పిచ్చివాడయాడు. అనంతలక్ష్మి తనకు ఒక చక్కని బిడ్డను కనవలసిన అందాలపడుచు. ఇప్పుడు ఆ మొద్దువెధవకు కనిపెట్టింది అనుకున్నాడు.

ఇంక ఇంటికి పోదామనుకున్నాడు. అనవసరంగా జయలక్ష్మిని, అనంతలక్ష్మిని వంచన చేద్దామనుకున్నాడు. వాళ్ళని ఆ విధంగా లోబరచు కొందామనుకొన్నాడు. చెట్టిగారు "నీతో ఉంది చెట్టియారూ!" అంటే ఉబ్బితబ్బిబ్బయి ఎంతపనయినా చేసిపెడ్తాడు! తనకు అడ్డం వస్తే నలిపిపారవేస్తాడు. భక్తిపరుడు. కాని ఏ దుర్మార్గ కార్యమయినా భగవంతుని ప్రార్థిస్తే జరుగుతుందని నమ్మకం కలవాడు. దేవునికిగాని, అతని పరివార దేవతలకు గాని ఇంత లంచం పారవేస్తే పని జరుగుతుందనే ధీమాతో పనులు తలపెట్టుతాడు.

చిదంబరంలో ఒక అమ్మాయి ఆతనికి లోబడక చాలా చిక్కులు పెట్టింది. ఎంత డబ్బయినా యిస్తానన్నాడు. ఆస్తి కొని ఇస్తానన్నాడు. ఆ అమ్మాయి ససేమి అన్నది. ఇంక చెట్టిగారికి మరీ ఆదుర్దా, దుఃఖమూ ఎక్కువయింది. కొందరి ముఖ్య స్నేహితులకడ ఏడ్చాడు కూడా. చివరకు మధుర మీనాక్షికి వెయ్యినూటపదహార్లు ఇవ్వడం, నూరు కొబ్బరికాయలు కొట్టించడం, సంపూర్ణభోగం చేయించడం మ్రొక్కుకున్నాడు. మధురపోయి పెళపెళ లెంపలు కొట్టుకొని, నడుముకు కండువా కట్టుకొని, సమాలింగిత భూతలుడై అమ్మవారిని ప్రార్థించాడు. తన మ్రొక్కులు అడ్వాన్సుగా నూరు రూపాయలర్పించుకున్నాడు.

చిదంబరం అమ్మాయి తన స్వాధీనం అయింది. అతని ఆనందానికి అంతులేదు. అంతా దేవికరుణే అనుకున్నాడు. తన మ్రొక్కుకు యింకో వెయ్యి కలిపాడు.

అలాంటి చెట్టియారుకి ఈ మధ్య పాపం అయిదారు ఘాటైన విధిచెంపపెట్టులు తగిలాయి. మలయాలో చాలా డబ్బు నష్టమైంది. ప్రభుత్వంవారు తెచ్చిన "వ్యవసాయదారుల అప్పుల తగ్గింపు చట్టం" క్రింద మూడు లక్షలు హతం అయిపోయినాయి. తాను నాలుగు లక్షన్నర పెట్టి తీసిన ఒక చలనచిత్రంవలన లక్షన్నర రూపాయలు నష్టం వచ్చినది. అదీకాక ఆ ప్రసిద్ధతార మాయా మంత్రంచేసి తన దగ్గిర జీతాదులు కాకుండా ఏభై అయిదువేలు లాగి పారవేసింది. అనంతలక్ష్మీమీద వ్యాజ్యంవలన అతనికి ముప్పయివేలు నష్టం వచ్చింది.

ఇవన్నీ ఆలోచించుకుంటూ కారు ఇంటికి పట్టమని అన్నాడు చెట్టి. కాని ఆ వెంటనే ఆ తుక్కు పత్రికా సంపాదకుడు కనిపించాడు. ఆ కోపంతో కారు ఆపు చేయించి కారు దిగి ఆ సంపాదకుణ్ణి వినరాని బూతులుతిట్టి నాలుగు లెంపకాయలు వాయించాడు. చెట్టియారు డ్రయివరు పేరు పొందిన గుండా. వాడు తన అరువల్ తీసి, ఆ సంపాదకుణ్ణి ఒక్కపోటు పొడిచాడు. అతని భుజం చీరుకుపోయింది.

ఈ తగాదా చూస్తున్న వినాయగం మహావేగంతోపోయి, డ్రయివరు చేతిలో కత్తిలాగి పళ్ళూడేటట్లు రెండు లెంపకాయలు కొట్టి పట్టుకొన్నాడు. ఎప్పుడు ఏ సినీమా మహావీరుడు తనకు ఈలాంటి శిక్ష విధిస్తాడో అని, రొంటిని రహస్యంగా దాచుకొన్న బాకు పట్టి ఆ సంపాదకుడు చెట్టియారుపై ఉరికి గుండెలో పొడవబోయాడు. ఆ సమయంలో వినాయగం స్నేహితుడు అనంతలక్ష్మి ఇంటిలో నుండి పరుగెత్తి వచ్చినాడు. ఆ సంపాదకుని కాలుపై తన్నాడు. వాడు కూలబడ్డాడు. కాని, అతని బాకు చెట్టియారు మొగాన్ని ఒక పెద్ద రక్తపుగంటు పెట్టింది.

ఈ కేకలు విని కోనంగీ, డాక్టరు రెడ్డీ, మధుసూదన్, రియాసత్, అతని మేనమామా అందరూ అక్కడకు పరుగున లోపలి నుంచి వచ్చారు. వినాయగం, ఆతని స్నేహితుడు, ఇద్దరూ చెట్టియారునీ, చెట్టియారు డ్రయివర్నీ, ఆ అసాధ్యపు సంపాదకుణ్ణీ అనంతలక్ష్మి ఇంటిలోనికి తీసుకు వచ్చారు. రెడ్డి చెట్టియారుకూ, సంపాదకునికీ వైద్య సహాయంచేసి కట్లు కట్టినాడు.

చెట్టియారు అందరికీ నమస్కారం చేసినాడు. కోనంగిరావు చెట్టిగారి డ్రయవర్ని చూచి "ఈ మహానుభావుడే, నన్ను ఆ రోజు చంప ప్రయత్నం చేసింది" అని తెలియచెప్పాడు.

**వినాయగంపిళ్ళై:** అవును స్వామీ, వీడుదా నిన్ను చంప ప్రయత్నించింది అని నాకు ఆ దినాలలోనే తెలిసింది. నేనూ మా వాడు వీడి దగ్గరకూ, వీడి స్నేహితుల దగ్గరకూ పోయి వాళ్ళెవరయినా సరే జయలక్ష్మిగారి కుటుంబంవైపు, కోనంగిగారివైపు, ఆయన స్నేహితులవైపు తలెత్తి చూసినా, మరి ఏమి చేసినా, అందర్నీ ముక్క ముక్కలక్రింద నరికి, నిజంగా గద్దలకు వేస్తామన్నాము. ఆనాటి నుంచీ వీళ్ళు ఈ వైపుకు ఊరికేనన్నారాలేదు.

**చెట్టియారు:** "క్ష-క్ష-మిం-చం-డి, ఏ, ఏదో ఐంది. కోనంగిరావుగారూ, అన్నివిధాలా పాడయిపోయాను." అని కళ్ళనీళ్ళు రాల గోలపెట్టినాడు.

**డాక్టరు రెడ్డి:** ఓరి రాక్షసుడా! మీరు తేళ్ళురా, మీకు బుద్ధి రావడమే! (పళ్ళు కొరికినాడు)

**కోనంగి:** (నవ్వుతూ) పోనీయండి. ఇంక కొంచం జాగ్రత్తగా ఉండవయ్యా! ఏమండీ స్వామీ, మీ పత్రికలో ఇవన్నీ రాయకండి. పోలీసుకు రిపోర్టు చేయకండి. మా వినాయగం మాట అంటే హరి హరి బ్రహ్మాదులు అడ్డు రాలేరు.

**సంపాదకుడు:** కోనంగిరావుగారూ! మీమాట నాకు శాసనం అండీ.

**వినాయగం:** నడురా ఎదవా, నడు. నీ ప్రాణం దక్కింది. నా బిడ్డలజోలికి రాకు. చెట్టీ! నీ లక్షలు మా ఇద్దరికి గడ్డిపోచలు, మాకు కోపం వస్తే తెల్లవాడయినా నిన్ను రక్షించలేడు. పో!

చెట్టియారూ, అతని డ్రయివరూ తలవంచుకుపోయారు. కోనంగి అనంతలక్ష్ముల జీవితంలోంచే అతడు తలవంచుకు వెళ్ళిపోయాడు.

## 9

**కో**నంగి వచ్చాడు. శుభముహూర్తాలు పెట్టినారు. రియాసత్ మెహరున్నీసాల వివాహం ముందయింది. మనవాళ్ళందరూ సాక్షి సంతకాలు చేశారు. ఆ వివాహానికి ఎందరో ముస్లింస్నేహితురాండ్రు, హిందూ స్నేహితురాండ్రు స్నేహితులు అందరు వచ్చినారు. మెహర్ స్నేహితురాండ్రు వెండిసామానుల బహుమతులతో ఆమె గది అంతా నింపారు. కోనంగి, మధుసూదన్, రెడ్డి, రియాసత్ ఇల్లంతా బహుమతులతో నింపారు.

రియాసత్ ఆనంద పరవశుడయ్యాడు. అంత సన్నిహితురాలయిన మెహర్ వధువుగా శయనమందిరములో త్రపామూర్తియై ఆసనమలంకరించి ఉన్నది. రియాసత్ వధువు మేలిముసుగు తొలగించి, "ఓ నా ప్రాణమహారాణీ! నీ వింతలజ్జావతి వైనావు. నీకు లజ్జయూ అందమేసుమా! నా సుల్తానా! నువ్వూ నేను భావిభారతదేశానికి అభ్యుదయ చిహ్నాలం. నువ్వు ఈ దీనుణ్ణి చేపట్టడం ఒకనాటి మహోత్తమ భవిష్యదశ సూచింపబడు తూన్నది. నీ అందం నా ఊహలకు దాటింది. నా పూజ ఆ సౌందర్యానికి తగినది మాత్రం కాదు."

"ఏమిటయ్యా డార్లింగ్ ఏమిటీ కవిత్వపు మాటలు. నేను నిన్ను విడచి బ్రతికి ఉండేదాన్నా? నువ్వు నా భర్తవు. నా సుల్తానువు! నా హృదయానివే. నా అంత అదృష్టవంతురాలెవ్వరింక?"

వారి పడకగది ఓ స్వప్నంలా అలంకరించారు. ఓ దివ్యస్వప్నంవారి పడకగదిలో ఉన్న వారిరువురనూ కమ్మివేసింది.

*"ఖుర్ హు అల్లాహెూ ఆహద్*
*అల్లాహుసమన్ లం ఎలిద్*
*వలం యూలద్ వలం*
*ఎఖుల్లుహు ఖుర్ ఒన్ ఆహద్"*

(భగవంతుడు ఒక్కడు – గుణాతీతుడు – జన్మ లేనివాడు – ఇతరుల కననివాడు– అతడే ఏకైక మహాభావము)

* * * *

ఆ తర్వాత మూడు దినాలకు డాక్టరు రెడ్డీ, చౌధురాణీల వివాహం జరిగింది.

ఇంతమందీ ఆ వివాహానికి వచ్చారు. రెడ్డి ముఖ్యబంధువులందరూ వచ్చారు.

ప్రథమంలో రిజిష్టరు వివాహం జరిగింది. తర్వాత కోనంగి దర్శకత్వంలో అద్భుతమయిన వివాహమహెూత్సవం జరిగింది. సామ్యవాది అయిన డాక్టరు రెడ్డి "ఈ ఖర్చంతా ఎందు" కన్నాడు.

"నువ్వు 'సామ్యవాదివే. నీ భార్య జాతీయవాది. ఖర్చు నాది. నీకెందు కాగొడవ?"

"నా పెళ్ళికి నిన్ను ఖర్చు పెట్టనిస్తానా?"

"అయితే మనం ఇద్దరివంతులుగా ఖర్చు పెడదాం బూర్జువాల ధనం ఖర్చుపెట్టడమే మనవంతు.

1. బీదవాడి పూలతోటలు ఎక్కడున్నాయో ఆ పూలు కొనడం.
2. చిన్నకూరల దుకాణాలు వగయిరాల దగ్గిర సరుకులు కొనడం.
3. బీదవంటవారిని తీసుకొచ్చి వంట చేయించడం.
4. తోలుబొమ్మలాట, వీధినాటకం, జంగాలవారి కథ అందంగా చెప్పించడం; సంగీతం కచ్చేరి, భరతనాట్యం ఏర్పాటుచేయడం.
5. బీదవారికి సంతర్పణ, వస్త్రదానం, కార్మికులకు భోజనాలు.

"ఇదయ్యా నా కార్యక్రమం. ఇందులో సగం ఖర్చు నీది. సగం ఖర్చు మాది. అంటే మేం ఆడపెళ్ళివారం కాబట్టి ఆడపెళ్ళివారిది అన్నమాట."

"ఎంత పెద్దమనిషివి. ఈ కరువు రోజులలో, యుద్ధం భయంకరంగా సాగే రోజులలో?"

"నీ డబ్బు దాచుకొని దేశానికి సహాయం చేస్తావా?"

"నీ యిష్టం వచ్చినట్లు చేయి నాయనా!"

"అలాగేనయ్యా! రెడ్డి మహారాజా!"

"నన్ను మహారాజును చేయకు!"

"నన్ను నాయన్ను చేయకు!"

వివాహ మహెూత్సవములు అద్భుతంగా జరిగినాయి. కోనంగి స్నేహితులందరూ వచ్చినారు. అనంతలక్ష్మి స్నేహితురాండ్రందరూ వచ్చినారు,

చిన్నరంగారావును ఒక్కరూ వదలరు. వాడు ఒక్కటే కిలకిల. ఓ ఉయ్యాలలో పండుకొని ఒక్కటే అల్లరి. కాళ్ళు కదుపుతాడు, చేతులు ఆడిస్తాడు.

అనంతలక్ష్మితో స్నేహితురాండ్రందరూ "వీడు గొప్ప నాట్యవేత్త ఔతాడే అనంతం" అని ఒకబాల, వాడి ఊc ఊcలు విని "వీడు గొప్పసంగీత పాటకుడౌతాడు" అని ఒక సుందరి, ఆ శిశువు పకపక నవ్వటం విని విని, "వీడు తండ్రిలా అల్లరి పిల్లవాడమ్మా!" అని ఒక యోష రంగారావుకు ముద్దులు ముద్దులు బహుమానాలిచ్చినారు.

ఆ మాటలన్నీ వింటూ కోనంగి ఆ బాలికతో "ఇప్పుడే వీడు ఈ నగరంలోని బాలలందర ముద్దులూ కొట్టేస్తున్నాడు. పెద్దవాడయితే అచ్చంగా గోపికా కృష్ణుడై ఊరుకుంటాడు" అని అన్నాడు. అందరూ గొల్లుమన్నారు. ఒక బాలిక అందరికీ వినీవినబడనట్లు "వట్టి కొంటె కోనంగమ్మా వీడు" అన్నది. ఇంక బయలుదేరాయి చప్పట్లు! మధుసూదనుడు "ఒరే బావా, నీ కొడుకూ కోనంగేనటరా" అన్నాడు. మరీ చప్పట్లు.

పెళ్ళి జయలక్ష్మి ఇంట్లో. చౌధురాణీ చుట్టాలందరూ వచ్చారు. చివరకు చెట్టిగారు కూడా వచ్చి రెడ్డికీ, అనంతలక్ష్మీ కొడుక్కీ బహుమతులు ఇచ్చినారు.

ఆ రాత్రి విందులు అయినవి. స్నేహితులు వెళ్ళిపోయినారు.

శయనమందిరం జయలక్ష్మి స్వయంగా అలంకరించింది.

ఆ మందిరంలోనికి డాక్టరు రెడ్డిని ముందుగా తీసుకువచ్చి కోనంగి ప్రవేశపెట్టాడు. "రెడ్డీ! చౌధురాణి నా కన్నచెల్లెలు వంటిది. ఆమెను నీ స్వంత హృదయగోళంలా, నీ స్వంత మెదడు గోళంలా కాపాడుకో! తెలుసునా?" అన్నాడు.

"లేకపోతే ఏం చేస్తావు?"

"నీ సందేహం అంతా శస్త్రచికిత్స చేస్తాను."

"నీకేం తెలుసునోయి శస్త్రచికిత్స?"

"నీ సావాసంబట్టి నేర్చుకున్నానులే!"

"అయితే ఆ చికిత్సలో నాదేగా పైచెయ్యి!"

"ముందు వచ్చిన చెవులకన్న వెనుక వచ్చిన కొమ్ములు వాడివి!"

ఇద్దరు స్నేహితులు గాఢంగా కౌగలించుకొని విడిపోయారు. కోనంగి నిష్క్రమించాడు.

రెండు నిమిషాలయిన వెనుక అనంతలక్ష్మీ, జయలక్ష్మీ, సరోజినీ, కమలనయనా చౌధురాణీని తీసుకువచ్చారు.

కమలనయన, "రెడ్డి బావగారూ! ఇదిగోనండీ బావకు పన్నీరు!" అంటూ అతనిపై పన్నీరువాన కురిపించింది.

"ఇంక 'తన్నేరు' ఎవరు కమలా?" అని కోనంగి గుమ్మం దగ్గర నుంచి కేక వేశాడు.

కమలనయన "ఎవరు? మా అక్కే" అంటూ పైకి పారిపోయింది. అందరూ వెళ్ళి తలుపులు వేసేశారు.

డాక్టరు రెడ్డి గబగబా వచ్చి చౌధురాణి కడ మోకరించి "రాణీ! నూత్న పురుషుణ్ణయి చిన్న బిడ్డలా నీ పాదాల కడ ఉన్నా"ననినాడు.

"డాక్టరుగారూ?" అని ఆ బాలిక ఆతని చేతులుపట్టి లేవనెత్తినది. అత డామెను బిగ్గియగా కౌగలించుకొని పెదవులు ముద్దుపెట్టుకొన్నాడు.

స్వప్న పన్నీ రా  దంపతుల ముంచెత్తినది.

## 10. మంగళ హారతి

నవజ్యోతి దినపత్రిక అఖండంగా జరుగుతున్నది. కోనంగి అనంతలక్ష్మిని చూచి ఆనందిస్తాడు "ఓసి గండుతుమ్మెదల రెక్కలవంటి జుట్టు కలదానా! ఓసి అమృతకలశ హృదయా! నేనేమి చేసితిని, నిన్ను నా అర్ధాంగిగా వరం పొందడానికి" అని ఒకనాడు అడిగినాడు.

"ఏం తపస్సా? గాలి మాత్రం మింగుతూ చేయి వాల్చకుండా పైకెత్తి ఆరు నెలలు హిమాలయంలో తపస్సుచేసి ఉండాలి."

"అయితే నా చెయ్యి బిగుసుకుపోయి ఉండలేదే."

"క్రిందటి జన్మలోనండీ గురువుగారూ! మీ చెయ్యి కూడా ఆ తపస్సుచేసి ఉండడంచేత, బంగారు మామిడిపండుతో పోల్చదగిన నా మనోహరచుబుకాన్ని గడియ గడియకు పుణికేభాగ్యం సంపాదించుకుంది!"

"అయితే దేవతలు వాళ్ళ స్వర్గలోకంలో దేవేంద్రబ్యాంకిలో, ఉక్కుకొట్టులో దాచుకున్న అమృతంలో మధ్య ఉన్న అసలయిన చుక్కలులాంటి నీ పెదవుల మధువును ఆస్వాదించే నా పెదవులు ఏ తపస్సు చేసుకున్నాయి చెపుమా! ఓసి తేనెపెరలవంటి పెదవులు కలదానా?"

"ఓహెూ! సర్వకాలాల అల్లరి మాటలతో హడలకొట్టే దేశికుడవయిన ఓ ప్రాణేశా! సావధానులై వినుండు! కృతయుగంబున రెండు శకుంతాలు కలవు. అవి పాలసముద్రపు ఒడ్డున కాపురంబు చేయుచుండ, జగన్మోహిని అమృతం పంచడానికి ఆ దారిని నడుమున అమృతపు కలశం పుచ్చుకుంది. అప్పుడు ఆమె చెవిని ఉన్న అవతంసకుసుమం క్రిందకు జారింది. వెంటనే ఆ పిట్టలు రెండూ ఆ పూవును ఎత్తి పొరపాటున ఆమె పెదవుల మధ్య పెట్టినాయి. జగన్మోహినీదేవి నవ్వుతూ, ఓయి పిట్టలారా కలియుగంబున నా అంశాన ఒక బాలిక ఉద్భవించును. నా భక్తుడాక్తు డామెను భర్తగా వరించును. మీరిరువురూ వాని పెదవులుగా ఉద్భవింతురు అని వరంబిచ్చినదాయెను. మీ పెదవులే రెండు పిట్టలున్నూ!"

కోనంగి పకపక నవ్వుతూ, అనంతాన్ని హృదయానికి గాఢంగా అదుముకొని ఆమె పెదవులు చుంచించినాడు.

ఆమె అతని కౌగిలిలో ఆనందమున ఒక్క నిమిషం సర్వమూ మరచి, నిర్వచింపలేని ఏదియో మహదానంద మనుభవించింది. 'మా' అని రంగారావు కెవ్వన ఏడ్చినాడు. అనంతం భర్త కౌగిలి వదలి, వారి పడకగదిలో వారి పెద్ద పందిరిమంచం దగ్గరే ఉన్న బాలకుని ఉయ్యాల దగ్గరకు పరుగెత్తి బాలకుని సువ్వున ఎత్తుకొని, అక్కడే వున్న కుర్చీపై కూర్చొని ఆ శిశువును అడ్డాల వేసుకొని, పయ్యెదలాగి, బాడిసుఘ, బాడియు సడలించి పిల్లవానిని పాలు పుణకనిచ్చెను.

నిన్నటివరకు అనంతము కాలేజీ బాలిక. బిడ్డ నెత్తుకొనుటయైనచేత కాదు. ఆ బాలిక ఒకనాడు తాను మాత కావచ్చును అన్న భావమే లేక అందమయిన అల్లరిచేస్తూ, మహా మధుర ప్రణయాన తన్ను లోకాలోకాలకు తేల్చుకొనిపోతూ వుండేది.

ఆమె అల్లరి అంతా, మాధుర్యమంతా ఆమె బిడ్డలలో ప్రతిఫలించ ప్రారంభిస్తుంది. ఎంత ధీమాగా బాలకుణ్ణి ఎత్తుకుంది! ఆ ఎత్తుకోవడంలో అందమూ ఉంది, కౌశల్యమూ

ఉంది. నలుగురు బిడ్డల తల్లిలా ఆమె వాణ్ణి అద్దాల వేసుకొని పాలిస్తున్నది. ఇంకను ముగ్ధ, యోష, ఐనా తల్లి. ఆయోషా వేషంలో మాత్రం కాలేజీ బాలికలానే ఉంటుంది. పిల్లవాని యేడుపు వినబడేసరికీ నిత్యషోడవర్షయైన జగన్మాత, సుబ్రహ్మణ్య జననియైనట్లు అయిపోతుంది. ఈ ఆలోచనలు క్రమ్ముకొని రాగా కోనంగి తన భార్య పిల్లవానికి పాలిచ్చు పరమదృశ్యం చూస్తూ ఆనంద పరవశుడయ్యాడు.

ఆ బాలుడు కుడివైపు పాలు త్రాగుతూ, ఎడమవయిపు తల్లి ఉరోజంతో ఆడుతున్నాడు. ఆనందంగా పాలు తాగుతున్నాడు, పెదవులలోంచి పాలు దిజ్మాత్రంగా ప్రసరిస్తున్నాయి.

ఆ తల్లి కుడిచేయి వాడికి తలగడగా, ఉయ్యాలగా ఎడంచేత్తో వాడి పండులాంటి పిఱ్ఱలు, పాదాలు, తొనలు తిరిగిన తొడలు ఆనందంతో స్పృశిస్తున్నది. పాలుత్రాగే పిల్లవాని ఆనందంకన్న ఆరమూత కన్నులు పడిన అనంతలక్ష్మి చూపులలో ఎక్కువ ఆనందం కనిపిస్తున్నది. ఆ మాతృమత్తతార్ధ నిమీలిత దృష్టులను మధ్య మధ్య అనంతం తనపై ప్రసరింపచేస్తున్నది. అందంగా తన హృదయం గతులు తప్పేటట్టు రెండు పెదవులు విడిపోగా చిరునవ్వులు ఉదయకాంతులమధ్య ఎగిరే రాయంచపిండులా తేలియాడుతున్నది.

నవోఢ అయిన తన ముద్దరాలి వక్షోజద్వయము ఏదో మహత్తరరూపం దాల్చినది. ఆనాడు కమలకుట్మలాంచల సన్నిభారుణాలయిన చుబుకాలు, ఈ దిగువ నానాగాఢవర్ణాలు సేకరించి పూర్ణత నొంది తన పూజను చూరగొంటున్నవి.

తొలుత వధువై వచ్చిననాడు అనంతలక్ష్మి చూపులు వసంతసాయంకాల నిర్మలాకాశపు లోతులు, స్వచ్ఛనీలకాసారనీలాలు, వేయి గులాబి పూవుల నుండి జాలువారిన మధురాలు! నేడు ఆమె ప్రథమ మాతృత్వేషణాల ఈనాడు తనపై ఆమె ప్రసరించే చూపులు నిశ్చలయామినీగాఢవినీల గంభీరాలు, మహాసముద్ర నీలాతినీలాలు, సర్వకుసుమోత్కృష్ట పరిమళాలు.

కోనంగి తన్ను ప్రణయపూర్ణ ప్రకాశితాలైన చూపులతో చూడడం చూచి, అనంతానికి సిగ్గు కలిగి పయ్యెదను సవరించుకొని, తన హృదయాన్ని, పాలుత్రాగే బాలకుణ్ణి కప్పివేసుకుంది.

కోనంగి విరగబడి నవ్వినాడు. ఆ బాలిక దగ్గరకు పరమ ప్రేమార్ద్ర హృదయంతో పోయి ఆమె కూర్చున్న కుర్చీకడ ఆమె పాదాలకడ రత్నకంబళిపయిన కూర్చుండి, అందమై ఒకదానిపై ఒకటి వేసుకొని ఉన్న ఆమె కాళ్ళపై చేతులు ప్రసరించి, అందమయిన ఆమె పాదాలు తన రెండు అరచేతుల పట్టి వంగి రెంటిని ముద్దుకొన్నాడు.

"అనంతం, నన్ను చూసి సిగ్గుపడినావా?"

అనంతం సిగ్గుతో నవ్వుకొని ఎడంవయిపునకు బాలకుణ్ణి తిప్పి ఆ వైపున పాలిస్తూ, కుడిచేతితో కోనంగి తల తడుముతూ "మీరు కొంటెపిల్లవాళ్ళు! నన్ను అంత ప్రేమతో చూస్తూంటే, అప్పుడు నా భర్తలు మాత్రం. నేనిప్పుడు తల్లిని. అందుకని సిగ్గువేసింది గురువుగారూ!" అని వంగి కోనంగి పెదవులు గాఢంగా చుంబించి ఆ వెంటనే తన పుత్రుని బుగ్గలు ముద్దుపెట్టుకుంది.

తాను వంగి భర్త మోము దగ్గరగా తీసుకొని, అతని చెంపలకు తన పెదవు లానించి "నా సర్వస్వమయిన గురూ! వీడు నా కడుపులో పడిన కొద్ది రోజులకు కాబోలు మీరు నా ప్రక్క పడుకొని అంత దివ్యమూర్తులై నిద్రపోయే సమయంలో, నాకు మెలకువ

వచ్చేది. ఆ నిదురలో మీరు చిరునవ్వు నవ్వుతూ ఉండేవారు. ఆ నవ్వు కారణము ఏమో! నాకు చిన్న బిడ్డలా కనిపించేవారు. నా చుట్టూ చూచుకొని బ్లవుజు విడదీసి, అతిగా సిగ్గుతో కరగిపోతూ, గుండెలు కొట్టుకుంటూ ఉండగా, మీ పెదవులకు నేను తల్లిలా... ఆనించేదానను. గు-రు-వు-గారూ, నాకా సమయంలో కలిగిన ఆనందం లోకంలో యెవరికీ గ్రాహ్యంకాలేదు."

"అవును ప్రాణకాంతా! అలాంటి కలలే నాకు రెండు మూడుసారులు వచ్చినట్లు అయింది."

కోనంగి భార్యను పాలుత్రాగే తన ఆత్మజునితోసహా ఎత్తుకుపోయి పందిరి మంచంమీద పడుకోబెట్టినాడు.

అనంతలక్ష్మి, బాలకుడూ భర్త కౌగిలిలో సమానంగా ఒదిగిపోయారు. ఇద్దరి బుగ్గలపై ముద్దులు కురిసినవి. కోనంగి "వీడు మన తపఃఫలముసుమా అనంతలక్ష్మి!" అన్నాడు.

"గురువుగారూ! నా తపస్సుకు భగవంతుడు నాకు ప్రసాదించిన ఫలం మీరు; మీరు నాకు ప్రసాదించిన ఫలం ఈ చిట్టిబాబున్నూ! వినండీ, నిన్ననే వ్రాసుకొన్నాను ఈ పాట!

*యామినీయోష పూజాఫలము*
*ఆమె హృదయేశుడు సుధాకరుడు నాథ!*
*యామినీ యామినీ కాంతుల తపఃఫలము*
*భూమి శాంతిని నింపు వెన్నెలలూ వెలుగూ*
*గురుదేవ నువ్వు నా కోటిపూజలఫలము*
*అరుదేరె మన తపఃఫలమయిన ఈ చిట్టిబాబూ!"*

"ఓసి నా ఆత్మమూర్తీ! ఎంత మధురాతి మధురంగా వ్రాశావు. ఏమి బహుమానం ఇవ్వగలను! నువ్వే నా ఆత్మమూర్తివి. నువ్వే నా బ్రతుకువు. నువ్వేనేను."

"నువ్వే నేను. నేనే నువ్వు" అని మధురకంఠాన పాడుతూ కోనంగి భార్యను. బిడ్డను కలిపి హృదయాన కదుముకున్నాడు.

*ఓం అసతోమా సద్గమయ*
*తమసోమా జ్యోతిర్గమయ*
*మృత్యోర్మా అమృతం గమయ.*

## సమాప్తము

Blank Page

KONANGI (Novel) - by Adivi Bapiraju

# సాహితీ హిమాలయోత్తుంగ శృంగం

హిమాచల శిఖరాలవలె, గంగా యమునా నదులవలె శాశ్వతత్వం పొందిన ఉత్తమ సాహిత్య స్రష్టల్లో అడివి బాపిరాజు గారు అగ్రశ్రేణిలోని వారు.

బాపిరాజుగారిది విశిష్టమైన వ్యక్తిత్వం. త్రివేణి సంగమంవలె, సంగీత, సాహిత్య, చిత్రలేఖనాలు బాపిరాజులో కలగలిసిపోయాయి.

కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు బాపిరాజుగారిని గురించి చెప్పిన పంక్తులు కొన్ని చదివితే చాలు బాపిరాజుగారి వ్యక్తిత్వం అర్థమవుతుంది.

"అతడు గీసిన గీత బొమ్మై
అతడు పలికిన పలుకు పాటై
అతని హృదయములోని మెత్తన
అర్థవత్కృతియై
అతడు చూపిన చూపు మెఱుపై
అతడు తలచిన తలపు వెలుగై
అతని జీవికలోని తియ్యన
అమృత రసధునియై"

ఈ పంక్తులు బాపిరాజుగారి హృదయ స్వరూపాన్ని మన కన్నుల ముందు నిలబెడతాయి.

"హృదయములోని మెత్తన" "జీవికలోని తియ్యన"

ఈ రెండు మహాగుణాలు బాపిరాజుగారిని మహా మానవునిగా తీర్చిదిద్దాయి.

ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఏ నవలైనా తీసుకుని చదివితే ఆయనకు ఎన్నెన్ని విషయాలు తెలుసో అర్థమవుతుంది. తలస్పర్శిగా తెలిసిన వ్యక్తి ఆయన.

"హిమాలయోత్తుంగ శృంగం
నీ బ్రతుకు
ఉమాపతి నాట్యరంగం"

అని గాంధీజీని గురించి గానం చేస్తుంటే తన్మయులమై వినేవాళ్ళం. శరత్ పూర్ణిమా చంద్రికా ధవళమైన బాపిరాజుగారి హృదయం నభూతో నభవిష్యతి.

దాశరథి కృష్ణమాచార్యులు


## విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

విజ్ఞాన భవన్, 4-1-435,
బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ - 500 001.